తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

స్వామివారి దివ్యలీలలు

(ఏప్రిల్ 2000 - ఆగస్టు 2004)

మొదటి సంపుటము

- గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)

Pictures of Submitting 7 Crores of Japa From 2002 to 2022 to Lord Sri Venkateshwara at Tirupati

1 1st Time 14-06-2003

2 2nd Time 07-09-2004

3 3rd Time 27-08-2005

4 4th Time 16-08-2006

5 5th Time 04-09-2007

6 6th Time 24-08-2008

7 7th Time 02-11-2009

8 8th Time 01-09-2010

9 9th Time 27-07-2011

10 10th Time 10-08-2012

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

స్వామివారి దివ్య లీలలు

(ఏప్రిల్ 2000 – ఆగస్టు 2004)

మొదటి సంపుటము

గోవిందదాసు

(పుల్లగూర్ల సాయిరెడ్డి)

పబ్లిషర్:

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,

హైదరాబాద్-500 007. ఫోన్: 040-27175050. సెల్: 93482 12354

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

స్వామివారి 700 దివ్య లీలలు

(ఏప్రిల్ 2000 – ఆగస్టు 2004)

మొదటి సంపుటము

ప్రథమ ముద్రణ: **ఏప్రిల్ 2024**

ధర: **250/-**

ప్రింటర్స్: **సాయితిరుమల ప్రింటర్స్, హైదరాబాద్.**

డి.టి.పి: **కె. సాయినాథ్**
డిజైనింగ్: **రమేశ్ వేముల**

ఈ పుస్తకము తెలుగు మరియు
ఇంగ్లిష్ భాషలో లభించును.

కాపీల కొరకు సంప్రదించండి:

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం,
ఇ.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్–500 007. ఫోన్: 040–27175050
Cell: 93482 12354

పోస్టు / కొరియర్ ద్వారా పొందు విధానము:

పుస్తకము ధర రూ. 250/–తో పాటు రిజిస్టర్డ్ పోస్టు / కొరియర్ ఖర్చుల నిమిత్తము మరో రూ. 100/– కలిపి మొత్తం రూ. 350/– ఫోన్ పే / గూగుల్ పే / పేటీఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపించండి. మీ పోస్టల్ అడ్రస్‌ను మెసేజ్ / వాట్సాప్ ద్వారా ఇదే నంబర్‌కు పంపితే పుస్తకము మీకు పంపించగలము.

తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశానిర్దేశము

తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలల ధారావాహికం.

మొత్తం నాలుగైదు సంపుటాలలో మొదటి సంపుటము

(ఏప్రిల్ 2000 – ఆగస్టు 2004)

- గోవిందదాసు

(పుల్లగూర్ల సాయిరెడ్డి)

శ్రీమన్నారాయణుడు పూర్వము ఋషి భద్రుణ్ణి, ఋషి యాదగిరిని ఎన్నుకొని భద్రాచలము, యాదగిరి గుట్ట క్షేత్రాలను ఏర్పాటు చేశాడు. అదేవిధంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రస్తుతం నన్ను ఎన్నుకొని, సిద్ధిపేట దగ్గర గల చిన్నగుండవెల్లి గ్రామములో 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలిచాడు. దీనిని సాధించుటకు ఒకప్రక్క స్వామివారు ఆశించిన యోగ్యతను సాధిస్తూ మరోప్రక్క సమస్త భక్తజనాన్ని ఈ సంకల్పములో భాగస్వామిని చేయవలసి ఉంది. అందుకని స్వామివారు 2000 సంవత్సరం నుండి ప్రసాదిస్తున్న అనుభూతులను, స్వామివారి ఆజ్ఞచే ప్రచురిస్తున్నాము. శ్రీవేంకటేశ్వరుని అద్భుతమైన ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగభేదం లేకుండా, శ్రీవేంకటేశ్వరుణ్ణి 3 సార్లు స్మరించి నన్ను ఆశీర్వదించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మరియు ప్రస్తుతపు కలియుగంలో కూడా ఆయన భక్తవత్సలతను తెలుసుకుంటూ, స్వామివారి కోరిక ప్రకారం మరో తిరుపతిని ఏర్పాటు చేయుటకు, ప్రతి భక్తుడూ ఈ సంకల్పం నెరవేరాలనే ప్రార్థనతో పాటు, ఆశీర్వాదరూపకంగానైనా భాగస్వాములు కాగలరని, స్వామి కృపను పొందగలరని ఆశిస్తున్నాను.

నమో వేంకటేశాయ

విషయ సూచిక

మంగళాశాసనములు

- శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ వ్రతధర్ జీయరు స్వామి ix
- శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి x
- డా. కె.వి.రమణ IAS xi
- నివేదన – గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి) xiii

దిశానిర్దేశం 1వ భాగము

- స్వామివారి దిశానిర్దేశం 15
- స్వామివారి లక్ష్యం 16
- నా పరిచయం 18
- స్వామివారి శిక్షణ 18
- స్వామివారు విధించిన ప్రవర్తనా నియమావళి 21
- స్వామివారి అనుభూతులు 22
- స్వామి సేవలు 22
- సేవను ఆటలాగ చిత్రీకరించుట 24
- సేవలను ప్రసాదించుట 24
- శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం 25
- శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం 25
- స్వామివారితో పందెం కాయుట 26
- తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కోట్ల జప సమర్పణలోని సంకల్పము 27
- నమో వేంకటేశాయ రథం 28
- శ్రీ వేంకటేశం మాస పత్రిక 30
- భజ గోవిందం 30
- సాధన చేయుమని సూచించుట 30
- మా తల్లి ఋణం తీర్చుకొనుట 31
- శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం 31
- హరినామ క్షేత్రం భావన మరియు మా తండ్రి ఆదేశం 32
- స్వామివారికి బొట్టు పెట్టుట 32
- శ్రీనివాస కళ్యాణాల ఏర్పాటు 33
- అనుభూతులను చదవమని కోరుట 33
- పందెంలో ఓడిపోవుట 34
- శ్రీ భరతుణ్ణి అనుసరించమని సూచించుట 35
- భాగవతుల ఆశీర్వాదముచే విజయము సాధించుట 35
- శ్రీనివాస కళ్యాణాలను మరో అవకాశంగా ప్రసాదించుట 35

- పట్టుదల పెరుగుట 36
- కళ్యాణాల కార్యక్రమం ప్రారంభం 36
- ఫలితాన్ని భాగవతులకు పంచుట 37
- స్వామివారి దీవనెలను పొందుట 37
- హరినామ క్షేత్ర స్థలమును తెలుపుట 38
- తిరుమల ఆలయ ప్రతిరూపమును సూచించుట 38
- స్వామివారి చతురత 39
- స్వామివారి దిశా నిర్దేశం 40
- భాగవతుల ఆశీర్వాదమును పొందుమని సూచించుట 40
- శ్రీవేంకటేశ్వరు శిక్షణ: మచ్చుకు రెండు నెలలు 40
- స్వామివారు ప్రసాదించిన అనుగ్రహం: మచ్చుకు ఒకటి 42
- భాగవతుల ఆశీర్వాదము 43

దిశానిర్దేశం 2వ భాగము

- లక్ష్యం 44
- అనుభూతుల వివరాలు 45
- యోగ్యత సాధించుటకు సేవలను ప్రసాదించుట 45
- బాల్యం నుండి స్వామివారి దిశానిర్దేశం 46
- స్వామివారి ప్రభావవంతమైన లీలలు 46
- ఈయనొక్కడే సర్వేశ్వరుడు 47
- స్వామివారితో పందెం కాయుట 49
- నమో వేంకటేశాయ రథం 50
- జప సమర్పణలోని స్వామివారి లీలలు 52
- స్వామివారి ఆలింగనము 54
- శ్రీ వేంకటేశం మాస పత్రిక 55
- స్వామివారి స్పర్శ సుఖము 57
- హరినామ క్షేత్ర భావన 57
- భజగోవిందం 57
- పద్మపీఠం 58
- జన్మజన్మల సేవను ప్రసాదించుట 60
- మా తండ్రి ఆజ్ఞాపించుట 61
- శ్రీ శ్రీనివాస కళ్యాణాలు 63
- అనుభూతులను చదువమని కోరుట 64
- పందెంలో ఓడిపోవుట 65
- జప సమర్పణ ఫలితమును భాగవతులకు పంచుట 66
- సంకల్ప సిద్ధే లక్ష్యంగా ఎదుగుట 67
- సురేఖను అనుగ్రహించుట 68

- జాగ్రత్తగా సేవ చేయుమనుట 68
- విజయం సాధించుట 69
- స్వామి సేవ అందరిది 70
- తపనను పెంచుట 71
- విజయం సాధించుటకు చిహ్నాలు 72
- భరతుణ్ణి అనుసరించుమనుటలో ఆంతర్యం 72
- భాగవతుల ఆశీర్వాదం 72
- స్వామివారి లీలలు : ఒక పజిల్ 73

దిశానిర్దేశం 3వ భాగము

- నా పరిచయం 74
- విద్యాభ్యాసం 76
- స్వామివారి లీల 76
- వివాహం 77
- స్వామి లీలలు ప్రారంభం 78
- శ్రీ ఆంజనేయుని దర్శించుట 78
- తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుట 79
- స్వామి శిక్షణ 81
- సంపూర్ణ శరణాగతి 82
- స్వామి నుండి భావాలు చేరుట 83
- స్వామివారి లీలలలోని రహస్యం 85

దిశానిర్దేశం 4వ భాగము

- చూడని ఆలయాలను దర్శించుట 86
- స్వామి సేవ ఒక ఆట లాగ చిత్రీకరించుట 88
- శ్రీవేంకటేశ్వరుడే శివుడని సూచించుట 90
- స్వామివారు సమాశ్రయణం చేయుట 91
- శ్రీ పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుట 92
- కి.శే. వాడ్రేవు గవర్రాజు గారితో పరిచయం 92
- స్వామి పట్ల విరహ వేదనను అనుభవించుట 94
- శ్రీ వేంకటేశ్వరుని చూడకుండా ఉండలేని స్థితి 96
- స్వామి పాదాలపై తలపెట్టి ప్రార్థించుట 97

దిశానిర్దేశం 5వ భాగము

- శ్రీ ఆంజనేయుని లాంటి సేవను ప్రసాదించుట 99
- శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుట 102
- తిరుమల స్వామివారిని దర్శించుట 103
- నా మొదటి పుట్టినరోజు పండుగ – స్వామి వారి బహుమానం 104

- సాయిరెడ్డి నావాడని పిలుచుట – స్థూప నిర్మాణానికి అవకాశం 106
- ప్రతి సం॥ ఒక పండుగ చేయమని ఆదేశించుట 109

దిశానిర్దేశం 6వ భాగము

- పూర్వాంగనం 114
- నాకు వచ్చిన కల 114
- సురేఖను కట్టడి చేయుట 115
- సుడిగుండం పుట్టుట, జీవితానికి విధివిధానాలు విధించుట 117
- శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం 120
- శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప ప్రారంభోత్సవం 121
- గోసంరక్షణ ట్రస్టు ప్రారంభం 122
- జన్మాంతం వరకు స్థూపమును నీవే మెంటేన్ చేయమని ఆజ్ఞ 124
- స్వామివారు స్థూపాన్ని స్వీకరించుట, దివ్య దర్శనాన్ని ప్రసాదించుట 124

దిశానిర్దేశం 7వ భాగము

- శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం స్థాపన : జప శ్రీకారం 128
- జప పుస్తక వితరణ 130
- సంకల్పమిచ్చిన స్వామివారు 133
- జపంను కొనసాగించమని సూచించిన స్వామివారు 134
- స్వామి వారితో పందెం కాయుట 135
- పవిత్ర స్నానం చేయించుట 136
- ఆకాశగంగ స్నానం చేయించుట 136
- కొండపైన పవిత్రున్ని చేయుట 137
- సందేహాల నివృత్తి, శ్రీశ్రీ మాడాంబకం స్వామి సలహా 138
- శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం లోగో 139
- తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము 140

దిశానిర్దేశం 8వ భాగము

- నమో వేంకటేశాయ రథ సంకల్పం 142
- శ్రీ వేంకటేశ్వర సేవాసమితిని ఏర్పరచుట 143
- స్వామివారిపై నమ్మకము లేనందుకు దండించుట 144
- భక్తులకు సేవాభాగ్యం కల్పించుట 146
- పాద సేవకునిగ స్వీకరించుట 146
- భగవంతుని రూపంగా మా తండ్రిని దర్శించుట 149
- జపసమర్పణ తేదిని తెలిపిన స్వామివారు 150
- స్వామివారిని పొందుటకు సంకల్పం తీసుకొనుట 151
- ప్రథమ 7 కోట్ల జప సమర్పణ, గోవింద దాసుగ దాస్యనామం లభించుట 152

దిశానిర్దేశం 9వ భాగము

- రెండవ పుట్టిన రోజు పండుగ 155
- ప్రథమ 7 కోట్ల జపము స్వీకరించుటకు పాదాలను చూపుట 156
- నమో వేంకటేశాయ రథం 158
- స్వామివారి శిక్షణ 159
- ఆస్తి తగాదాలు 160
- భవిష్యత్ కలహాలను సూచించుట 161
- ముందూ వెనుక ఉన్నానని సూచించుట 163

దిశానిర్దేశం 10వ భాగము

- సదా స్వామివారిని స్మరిస్తూ జీవించమని చెప్పుట 167
- స్వామివారి కృపను పొందుటకు ఆలయం అవసరం లేదు 169
- శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం 169
- స్వామి కంటే ఆస్తికే విలువ ఇస్తున్నావని చెప్పుట 172
- కొండలను లోయలుగ, లోయలను కొండలుగ చేయుట 173
- నాలుగు ధృవమూర్తులను దర్శించుట 174
- సురేఖను నాగుపాము రూపంలో అనుగ్రహించుట 176
- నమో వేంకటేశాయ రథము తయారీ ప్రారంభము 178
- డొనేషన్స్ స్వీకరించమని సూచించుట 178

దిశానిర్దేశం 11వ భాగము

- సమర్పణ క్రతువు 181
- ముత్యాలతో అలంకరించిన శంకును చూపుట 182
- ట్రాలీని చూపుట 183
- అమ్మాయి నాట్యం చూపించి సంతోషపరచుట 185
- స్వామివారి ఆత్రుత 189
- కానుకలను స్వీకరించుట 191

దిశానిర్దేశం 12వ భాగము

- ఇంటి స్థలమును చూపుట 192
- డబ్బులు వృథా చేయుట 193
- భూ సమస్య పెద్దదగునని చూపుట, రథయాత్రకు విధి విధానాలను సూచించుట 196
- కాకతీయ నగర్‌లో మా ఇల్లు ఉండునని సూచించుట 198
- ఉన్నత వ్యక్తులు పరిచయమగుదురని సూచించుట 198
- తిరుపతిలో నమో వేంకటేశాయ రథము ప్రారంభోత్సవము 201

శ్రీమతే రామానుజాయ నమః

మంగళా శాసనములు

శ్రీమతే నారాయణాయ నమః

శ్రీమాన్ పుల్లగూర్ల సురేఖ సాయిరెడ్డి (గోవింద దాసు) దంపతులు కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ శ్రీనివాసుల పరమభక్తులు. అనుదినం అనుక్షణం దైవసంబంధంతో జీవితం సాగిస్తూ, తాము తరించడమే కాక సుమారు 2 దశాబ్దములుగా అనేకమంది తరించేవిధంగా దీక్షా కంకణులై ఆనందంగా భక్తిగా ఎంత శ్రమైనా ఓర్చి తిరుపతి చేరి ఏడు కోట్ల జపనామ సమర్పణం చేయడం నేను స్వయంగా చూశాను. వారి ఆహ్వానం మేరకు వారి భవనానికి వెళ్ళి శ్రీవారి రథమును, అక్కడి భక్తజనాన్ని, వారు భక్తిగా సాగిస్తున్న సభావేదికలు చూసి ప్రసంగించాను. శ్రీనివాసుడు తన కైంకర్యమునకై ఎంచుకున్న భక్తశిఖామణుల సంఖ్యలో వీరొకరు. వీరికి ఇంత ప్రేరణ కలగటానికి వెనుకనున్న బలం తెలియజేస్తూ తిరుమల 'శ్రీవేంకటేశ్వరుని దిశానిర్దేశం'' అనే స్వామివారి లీలల ధారావాహికంలో భగవంతునికి జీవితో ఉన్న అనుబంధం తెలియచేస్తుంది. ఈ భాగ్యం అందరికీ దొరికేది కాదు. దొరికినా చివరిదాకా దానిని నిలుపుకోవడం కొందరికే సాధ్యం. కలియుగ ప్రభావం వల్ల మనిషిలో అహంకారం, స్వార్థం పెరగడమో, అనారోగ్యంతో శరీరం కృశించడమో, ప్రకృతి ప్రభావం వలననో సాధించలేరు. కాని శ్రీమాన్ సాయిరెడ్డి దంపతులు తదేక నిష్ఠతో ''శ్రీవేంకటేశం'' ఆధ్యాత్మిక మాసపత్రిక, ''శ్రీవేంకటేశ జపనామ సమర్పణ'', ఇటీవల స్వామివారి కళ్యాణోత్సవములు అనేకచోట్ల జరిపిస్తూ, చాలా చక్కగా ఆదర్శ జీవనం సాగిస్తూ ఆధ్యాత్మిక పరుల దుఃఖార్తిని తొలగిస్తూ, అందరిని దైవకృపకు పాత్రులు చేస్తున్నారు. వీరి సంతానం కూడా వీరికి అనుగుణంగా ఉండటం విశేషం. వీరి కృషి నిరంతరం ఇలాగే సాగాలని, ఇంకా శక్తి సామర్థ్యాలు పెంపొంది అందరినీ తరింపచేసే సంకల్పం దృఢంగా ఉండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని, పరస్పర సహాయ సహకారములతో మానవులంతా ఐక్యంగా ఉంటూ భగవత్కృపా పాత్రులుగా సాగాలని, లోక కళ్యాణమే వీరి ధ్యేయంగా ఇలా జీవించాలని ఆశిస్తూ అనేక మంగళా శాసనములు.

-జగన్నాథ మఠ నిర్వాహకులు

శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ వ్రతధర్ జీయరు స్వామి

హైదరాబాద్.

తేది :

గోవింద దాసుడు (సాయిరెడ్డి)కి

అనేక మంగళశాసనములు

నువ్వు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి చరిత్ర లోకానికి తెలియ చేస్తునందుకు మాకు సంతోషం కలిగింది. ఈ విషయం పుస్తక రూపంలో తెలియ చేస్తునందుకు మీకు అనేక మంగళాశాసనములు. అలాగే మీరు ప్రచురిస్తున్న పుస్తకాలు అభివృద్ధి చెందాలని వర్ధతం అభివర్ధతం.

అనేక మంగళా శాసనములు.

-శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి

డా. కె.వి.రమణ IAS (R), హైదరాబాద్
రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
తిరుమల తిరుపతి దేవస్థానములు

సకల లోకైక విభునికో విన్నపం

స్వామీ!

మీ కృప అపారం.

ఎప్పుడు ఎవరిపై, ఎంతవరకు మీ కృపా కటాక్షం ప్రసాదిస్తారో అప్పుడు అంతవరకు వారంతా బ్రహ్మానంద భరితులవుతారు.

మీ లీలా విశేషం దేవ, దానవ, గంధర్వ, కిన్నెర, కింపురుషాదులకే అంతుపట్టని, అంతుచిక్కని మహార్ణవమయినప్పుడు – మానవ మాత్రులకేమి అవగతమవుతుందని? అయినను, తామున్న స్థితికి, తమ ఉన్నతస్థితికి తాము సాధించిన ఘన కార్యాలే కారణమని తలపోసే తలలెన్నో?!

మీ అనుగ్రహానికి పాత్రులయినవారు ఈ భువిపై కోట్లాదిమంది ఉండవచ్చు గాక; కానీ సామాన్య జీవితం గడిపేవాడు, ఏ అత్యాశలూ లేనివాడు, మీ ధ్యానంలో నిమగ్నమయినవాడు, మిమ్ము నమ్ముకొన్నవాడు, ఎప్పుడైనా బాగుపడతాడీ సమాజంలో అన్నది నా ప్రగాఢ విశ్వాసం. అటువంటి వారిలో శ్రీ పుల్లగూర్ల సాయిరెడ్డి ఒకడు. నాకు ఆత్మీయ మిత్రుడు. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ లో ఎం.టెక్ మాస్టర్ డిగ్రీ పట్టా పొంది, కన్స్ట్రక్షన్ రంగంలో బిల్డర్ గా వ్యాపారం చేసుకుంటున్న తరుణంలో – తరుణ వయస్కుడిగా ఉన్నప్పుడే 'గోవింద దాసుగా' ఎలా పరిణతి చెందినాడు?

- తిరుపతిలో ''శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము''ను ఏల నిర్మించినాడు?
- ''శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠా''న్ని స్థాపించి ఏడుకోట్ల జపసమర్పణ నేల చేయగల్గినాడు?
- ''నమో వేంకటేశాయ'' రథయాత్ర నెందుకు నిర్వహించినాడు?
- ''శ్రీవేంకటేశం'' అను తెలుగు మాసపత్రికను ప్రారంభించడానికి కారణమేమి?
- 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల నిర్వహించాలన్న సంకల్పమేల పూనవలె?
- ''హరినామక్షేత్ర' నిర్మాణ సంకల్ప సిద్ధికై ఏల ప్రయత్నించవలె? వీటన్నింటికీ మూలం –

నిత్యం భగవన్నామ స్మరణతో తరించడానికి శ్రీ సాయిరెడ్డి దంపతులు పూనుకొన్నవేళ – ఆ తిరుమలేశుడు, కరుణాంతరంగుడు శ్రీవేంకటేశ్వరస్వామి వారి దిశా నిర్దేశమే కాక మరేమీ కాదు.

ఇదంతా స్వామివారి లీల; దయ!!

తనకున్నంతలో మిమ్మల్ని అనునిత్యం స్మరిస్తూ, స్తుతిస్తూ ఆరాధించేవాడుగా, సతీసమేతంగా – మీరందించే అనుభూతులను, అనుభవాలను నెమరు వేసుకుంటూ, ఆధ్యాత్మిక ప్రవృత్తియే జీవన మార్గంగా జీవిస్తున్నవాడుగా... మీ శరణు జొచ్చిన భక్తవరేణ్యుడు – శ్రీ సాయిరెడ్డి. మీ దిశా నిర్దేశంలో... ఆత్మీయతా దృష్టితో మీరు కురిపించే అనురాగ వృష్టిలో శ్రీ సాయిరెడ్డి కుటుంబం తరిస్తోందని ఆశిస్తూ;

మీ ఆశీర్వాదాన్ని, అనుగ్రహాన్ని నిరంతరం ఆశించే మీ భక్తునికి సదాలోచనను, సదాశయాల్ని, సన్మార్గాన్ని, సత్కర్మలు చేసే శక్తిని ప్రసాదిస్తావని ఆకాంక్షిస్తూ –

మిత్రుడు శ్రీ సాయిరెడ్డి కుటుంబానికి సకల శ్రేయస్సును కాంక్షిస్తూ సకల లోకైక విభునికి సమర్పించుకుంటున్న విన్నపం ఇది!! వినతిపత్రమిది!!

తన అనుభూతుల్నీ, అనుభవాల్నీ అక్షర రూపంలో శ్రీ సాయిరెడ్డి వెలువరిస్తూన్న ఈ కృతి చదువరులకందరికీ సుకృతి నందిస్తుందని ఆశిస్తూ –

'గోవిందదాసు' సాయిరెడ్డి దంపతలకు ఆత్మీయ శుభాకాంక్షలతో...

- కె.వి.రమణ



నివేదన

భగవంతుడైన శ్రీమన్నారాయణుడు భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా సర్వదా రకరకాల లీలలను ప్రదర్శిస్తుంటాడు. ఆయన ప్రస్తుతం కలియుగంలో తిరుమల కొండపై శ్రీవేంకటేశ్వరునిగా కొలువై ఉన్నాడు (కలౌ వేంకటనాయకః). భగవంతుడు భూమిపైనున్న సర్వప్రాణులను అనుగ్రహించుటకు కొంతమందిని ఎన్నుకొని, వారిద్వారా వివిధ ప్రాంతములలో వెలసి సమస్త ప్రజలను అనుగ్రహిస్తున్నాడు. ప్రస్తుతం నన్ను తన పనిముట్టులాగా ఎన్నుకొని సిద్ధిపేటకు 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా గ్రామములోని మా తోటబావి వద్ద తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేసి అందులో స్వామివారి అఖండ హరినామ కీర్తనను వివిధ భక్తబృందాలచే నిర్వహింపచేయుటకు స్వామివారు చూపులీలలే ''తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం''.

దీనిలో భక్తుల పట్ల భగవంతుని తపన తెలుస్తుంది. మరియు ఒక సాధారణ వ్యక్తిగా జీవిస్తున్న నన్ను వారి అద్భుత లీలల ద్వారా ఏవిధంగా గోవింద దాసుగా మార్చి వారి సంకల్పాన్ని నెరవేర్చుకుంటున్నారో తెలుస్తుంది. ఈ కలియుగములో కూడా ఒక సాధారణ మానవుడు లౌకిక విషయాలను త్యజించి పట్టుదలతో నిరంతరం సాధన చేస్తే, స్వామివారి దివ్యదర్శన భాగ్యమునకు అర్హుడే, అని బహుశా స్వామివారు నిరూపించదలచారు. అయితే ఆ మనిషి ఏ విధంగా సాధన చేయాలనే విషయం స్వామివారు ప్రసాదించిన లీలల ద్వారా తెలుస్తుంది. మరియు ఈ క్షేత్రం భక్తుల సాధనకు, భక్తులు వారి వారి కోరికలను నెరవేర్చుకొనుటకు అనువైనదిగా ఉండగలదని భావిస్తున్నాను. ఈ హరినామ క్షేత్రాన్ని స్వామివారు ప్రత్యేకంగా కోరుకుంటున్నారు కాబట్టి ఇది ఒక దివ్యదేశమంతటి శక్తివంతమైనదిగా ఉండగలదని భావిస్తున్నాను.

నేను, నా భార్య మొత్తం స్వామివారి కొన్నివేల అనుభూతులను అనుభవించాము. వరుసగా 10 రోజులు ఆయన లీలలను చూడకుండా ఉండలేని స్థితిని కల్పించారు. 2000 సంవత్సరం నుండి ఈ పుస్తకము ప్రచురణ వరకు, అంటే మార్చి 2024 వరకు స్వామివారి లీలలను అనుభవిస్తూనే ఉన్నాము. ఈ లీలల ప్రభావముతో 1. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప నిర్మాణము 2. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపించి, ప్రతి సంవత్సరం ఏడు కోట్ల జప సమర్పణ 3. నమో వేంకటేశాయ రథ నిర్మాణము మరియు దాని నిర్వహణ 4. శ్రీవేంకటేశం మాసపత్రిక 5. భజగోవిందమును నిర్వహించుట 6. శ్రీ శ్రీనివాస కళ్యాణాలు అనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ఏడవ సేవగా 'హరినామ క్షేత్రము'ను సాధించవలసి ఉన్నదని స్వామివారు 'దిశా నిర్దేశం' చేశారు. స్వామివారు ఆశించిన యోగ్యత సాధించుటకు, మా సాధన శక్తితో పాటు భాగవతుల ఆశీర్వాద శక్తి తోడైతే ఇది సాధ్యమవుతుందని భావించాము. భాగవతుల ఆశీర్వాదము పొందుటకే, శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే వారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి 'శ్రీవేంకటేశం' మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. ఏప్రిల్ 2023 నుండి మార్చి 2024 వరకు ప్రచురించిన 12 ధారావాహికముల సమూహమే ఈ పుస్తకపు మొదటి సంపుటి. ఇలా మొత్తం నాలుగైదు సంపుటములు రావచ్చును.

స్వామివారి లీలల ఆధారంగా, ఆయన సూచించిన మార్గములో నడుచుకొనుటే మా కర్తవ్యము. మా ప్రతి కార్యానికి కర్త, కర్మ, క్రియ తిరుమల శ్రీవేంకటేశ్వరుడే! రేపు హరినామ క్షేత్ర ఏర్పాటు, అక్కడి ప్రజల ఉద్ధరణ సర్వము శ్రీవేంకటేశ్వరుడే! భక్తులు భక్తిభావముతో ఈ పుస్తకమును చదివినచో స్వామివారి లీలల మాధుర్యమును అనుభవించగలరు. 2002 సంవత్సరం నుండి మా సేవలో పాల్గొన్న ప్రతి భక్తుణ్ణి స్వామివారు ఎంతో అనుగ్రహించారు. అదేవిధంగా ఈ పుస్తకం చదివిన ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించగలరని విశ్వసిస్తున్నాను. మరియు మీరు కూడా హరినామ క్షేత్రం సాధనలో ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములు కాగలరని ఆశిస్తున్నాను. ఈ పుస్తకము చదివిన ప్రతి భక్తుణ్ణి ప్రత్యేకంగా అనుగ్రహించమని గోవిందదాసుగా నా పక్షాన నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నాను.

ఏప్రిల్-2024 నుండి ప్రతి సం॥ ఒక సంపుటమును ప్రచురించగలము. నమో వేంకటేశాయ.

– గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

1వ భాగము



తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నా ప్రభువు. నేను ఆయన సేవకుడను. నేను చేసే ప్రతి పనికి కర్త, కర్మ, క్రియ తిరుమల శ్రీవేంకటేశ్వరుడే. నా భాగ్య వశాత్తు నన్ను తన పనిముట్టు లాగ ఎంచుకొని, కొన్ని వేల అనుభూతులను, లీలలను ప్రసాదించి ధన్యుణ్ణి చేశాడు. శ్రీవేంకటేశ్వరుని లీలలను అర్థం చేసుకొనుట చాల కష్టం. శ్రీవేంకటేశ్వరుని పైన ప్రమాణము చేసి చెప్పుతున్నాను, నేను అర్థం చేసుకున్నంత వరకు, ఎలాంటి కల్పితములు లేకుండ వ్రాస్తున్నాను. దీనిలో భగవంతుడి గురించి భక్తుడు చెందే తపన తెలుస్తుంది.

ప్రతి లీల శ్రీవేంకటేశ్వరుని గురించి తపనే లక్ష్యంగా సాగింది. 2000 సంవత్సరము నుండి నేటి వరకు వరుసగా 10 రోజులు ఆయన లీలలను చూడక ఉండలేని స్థితిని కలిగించారు. నేను తెలుపు ప్రతి విషయము సత్యం. నేను అనుభవించింది మాత్రమే, నా వద్ద స్వామివారు కల్పించిన 500 లకు పైగా అనుభూతులు వ్రాసి ఉన్నవి. ఎవ్వరైన ఎప్పుడైన వచ్చి చూడవచ్చును. నిజానికి మేము వేలాది అనుభూతులను చూచినప్పటికీ 700 అనుభూతులను మాత్రమే వ్రాశాము. ఈ భాగములో స్వామివారి సంకల్పమును, ప్రసాదించిన సేవలను, సం॥ 2000 నుంచి 2023 వరకు 23 సంవత్సరముల సారాంశములను సంగ్రహంగా తెలుపుతున్నాను.

స్వామివారి లక్ష్యం!

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. వైకుంఠం విడిచి, తిరుమల కొండపై, కలియుగ మానవుల ఉద్ధరణకై వెలసి ఉన్నాడు. ఆయన భక్తప్రియుడు, భక్తవత్సలుడు. భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా చేసుకొని తన లీలలను ప్రసరించును. లోకంలోని సర్వ కార్యములు ఈయననే నిర్వహిస్తున్నప్పటికీ, వాటిని తాను కాకుండా తన భక్తులచే నిర్వహింప చేస్తూ, ఆ కీర్తి ప్రతిష్ఠలను భక్తులకు అంటకట్టి, వారు ఆనందించుటను చూచి ఈయన ఆనందిస్తాడు.

శ్రీమన్నారాయణుడు తన భక్తుల ఉద్ధరణ కోసమని ఈ భూమండలములో, ముఖ్యంగా మన భారతదేశంలో రకరకాల ప్రాంతాలలో వెలసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఇలా రకరకాల ప్రాంతాలలో రకరకాల రూపాలలో తాను తన సొంత ఇచ్ఛతో, స్వయంభూ రూపకంగా, స్థాపిత రూపకంగా వెలుస్తున్నప్పటికీ, ఆ కీర్తిని కొందరి భక్తులకు ఆపాదించుటకై వారి మనస్సులో స్వామివారిని పొందవలెనన్న బలమైన కోరికను ఏర్పరస్తాడు. తపస్సు మొదలగు సాధనాల ద్వారా ఆ భక్తుడు యోగ్యతను సాధించుకొన్న తరువాత, ఆతని ఇష్టదైవంగా ప్రత్యక్షమై, ఆ భక్తుని ప్రార్థన మేర ఆ క్షేత్రములో స్థిర నివాసమేర్పరచుకొన్నారు. ఉదాహరణకు, భద్రాచలంలో భద్రుడనే ఋషి యొక్క తపస్సుకు మెచ్చి, అతని ఆరాధ్యుడైన శ్రీరామునిగ దర్శనమిచ్చి, తన అంశను అక్కడ స్థిరీకరించాడు. మరియు యాదగిరి అనే మరో భక్తుడు తపస్సు చేసి, యోగ్యత పొంది, తన ఇష్టదైవమైన శ్రీ లక్ష్మీనరసింహుని పొంది, యాదగిరి క్షేత్రాన్ని ఏర్పరచుటకు కారకుడైనాడు. నిజానికి ఈ ఇద్దరికీ వారి వారి ఇష్టదైవాలను పొందవలెనన్న కోరికను కలుగజేసి, వారిని మధ్యవర్తిగా ఎన్నుకొని తన పనిని సాధించుకొన్నాడు. అదేవిధంగా ఈరోజు శ్రీమన్నారాయణుడైన శ్రీవేంకటేశ్వరుడు ఈ ప్రాంత ప్రజల ఉద్ధరణకై మా సొంత గ్రామమైన చిన్నగుండవెల్లి గ్రామము (సిద్ధిపేట జిల్లా) లో తిరుమల శ్రీవేంకటేశ్వరుని రూపంగా వెలవ దలచి, నన్ను ఒక పనిముట్టు లాగా ఎంచుకొని, నాకు ఆయనను పొందాలనే కోరికను కలుగజేశాడు. తగిన యోగ్యతను సాధించుటకు అవసరమైన భగవత్ సేవలనే తపస్సులను, సాధనను కల్పించి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించుచు, తప్పులను సరి చేయుచు, నన్ను సన్మార్గంలో పయనించేటట్లు చేయుచు, చివరికి తన లక్ష్యాన్ని నెరవేర్చుకొనుటకు చేసే ప్రయత్నంలో భాగమే నాకు కల్పించిన ఈ వేల అనుభూతుల సారము.

కలియుగ మానవులు తరించాలంటే హరినామ స్మరణ ఒక్కటే ఏకైక మార్గము. అందునా ఈ కలియుగపు అధినాయకుడైన తిరుమల శ్రీవేంకటేశ్వరుని నామస్మరణతో మరింత తొందరగా పునీతుడు కాగలడు. కావున చిన్నగుండవెల్లి గ్రామములోని మా తోటబావి వద్ద తన ''హరినామ క్షేత్రము''ను స్థాపించమని, తిరుమల ఆలయము యొక్క ప్రతిరూపమును అవసరమైన కొన్ని మార్పులతో వెండివాకిలి వరకు నిర్మించమని ఆదేశించారు. తాను స్వయంగా తిరుమల నుండి ఒక అంశగా విచ్చేసి ఇక్కడ స్థిర నివాసమేర్పరచుకొందునని కూడా సూచించారు. భక్తులకు ఇది ఒక సాధనాలయము లాగ ఉండునని కూడా తెలిపారు. భక్తులను ఆకర్షించి, వారిని తగిన విధంగా అనుగ్రహించగలడనే విశ్వాసాన్ని కలుగ జేశారు.

చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద కనీసం 7 ఎకరముల స్థలములో తిరుమల ప్రతిరూప ఆలయాన్ని నిర్మించుటతో పాటు భక్తులకు వసతి, భోజన సదుపాయములను ఏర్పరచుచు, స్వామివారి అఖండ హరినామ స్మరణను ఏర్పాటు చేయుట నా కర్తవ్యం.

ఇది చూచుటకు మామూలు విషయము లాగా కనిపించవచ్చు. ఎందుకంటే ఎంతోమంది భక్తులు

శ్రీవేంకటేశ్వరుని ఆలయాలను నిర్మించారు. కేవలం అక్కడ అఖండ హరినామ స్మరణను ఏర్పాటు చేస్తే సరిపోతుంది. కాని ఈ విషయంలో స్వామివారి సంకల్పము భిన్నంగా ఉంది. ఈ క్షేత్రం అత్యంత మహిమాన్వితంగా, ఒక దివ్యక్షేత్రం లాగా, మరో తిరుపతి లాగా ఉండాలనుకుంటున్నాడు. భక్తులను కూడా తిరుపతిలో అనుగ్రహించినట్లే అనుగ్రహించుదు అనుకుంటున్నాడు. పైగా తాను తిరుమల నుండి ఇక్కడికి వస్తున్నారు కావున అక్కడి పరిస్థితులను యథావిధంగా కల్పించాలి. అంటే ఆలయ నమూనా, ఆరాధనా విధానం మొత్తం తిరుమలలో మాదిరిగా ఉండాలని కోరాడు. ఇది ఆయన సంకల్పం. దీనిని సాధించుటే లక్ష్యంగా నన్ను ఒక పనిముట్టు లాగ ఎన్నుకొన్నాడు. లక్ష్యాన్ని సాధించే విధంగా కావలసిన శిక్షణను 2000 సంవత్సరము నుండి ఇవ్వడం మొదలు పెట్టాడు.

పూర్వం ఋషి భద్రుడు మరియు ఋషి యాదగిరి ఏకాంతంగా తపస్సు చేసి యోగ్యతలను సాధించి భగవంతుణ్ణి పొందారు. మరి ఈ కలియుగములో, జనాల మధ్యన నివసిస్తూ వారితో సహవాసము చేయుచు భగవంతుణ్ణి పొందే యోగ్యతను సాధించటం నాలాంటి ఒక అత్యంత సాధారణ మానవునికి సాధ్యమా? అసలు ఈ కలియుగములో శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రత్యక్షంగా పొందగలమా? అనే ప్రశ్నకు ఒక్కటే సమాధానం. శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందాలనే సంకల్పం నాదైతే అది సాధ్యం కాదు. కాని ఈ సంకల్పం సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరునిదే అయితే అందులో ఎలాంటి సందేహము లేదు. పూర్వం హాథీరాం బావాజీ, తరిగొండ వేంగమాంబ గారలు శ్రీవేంకటేశ్వరుని ప్రత్యక్షంగా పొందారని, ఋజువులు కూడా ఉన్నాయి. వీరే కాక మరెందరో పొందారు. కాని నిజమైన భక్తులు బయటికి రారు. శ్రీవేంకటేశ్వరుడు తలచుకుంటేనే ఆ భక్తుడు బయటి ప్రపంచానికి పరిచయమవుతాడు. ఇది సత్యం.

శ్రీవేంకటేశ్వరుడు తన ప్రత్యక్ష లీలలను 2000 సంవత్సరము నుండి చూపుట ప్రారంభించినప్పటికీ, పరోక్షంగా నా పుట్టుక నుండే ఈ జీవితంలో నన్ను ఉపయోగించి సాధించబడే లక్ష్యంను దృష్టిలో ఉంచుకొని దానికి తగినట్లుగ నాకు జన్మ, రూపురేఖలు, వ్యవహారము, అభిరుచులు అన్నీ ఆయన నిర్ణయించినట్లుగా లభించాయి. ఇందులోని ప్రతి ఒక్క అంశము ఈ లక్ష్యానికి ఎంతో అవసరమని నేను గ్రహించాను. ఈ లక్ష్య సాధన కోసమనే, స్వామి వారిని ఆ ప్రాంతానికి తెచ్చుటకై నాకు చిన్నగుండవెల్లిలో జన్మినిచ్చి, హైదరాబాదులో పోషించుచు, నాచే హరిసేవను నిర్వహింప చేస్తున్నాడు. దీని పుణ్యముతో తిరిగి ఊరికి వెళ్ళి శ్రీవేంకటేశ్వరుని కృపను ఆ ప్రాంతపు ప్రజలకు పంచుట నా కర్తవ్యంగ నాకు దిశా నిర్దేశం చేశాడు. మొదట అత్యంత దయనీయ స్థితిలో ఉన్న మా కుటుంబాన్ని మాత్రమే, ఇంజనీరింగ్ చదివి, వ్యాపారం చేసి, డబ్బు సంపాదించి ఉన్నత స్థితికి చేర్చాలని నిర్ణయించి హైదరాబాద్ వచ్చాను. కాని మనిషి జీవించుటకు డబ్బే ప్రధానము కాదని, భగవంతుని కృప ప్రధానమని, మరియు ఈ కృపను మీ కుటుంబంతో పాటు ఆ ప్రాంత సర్వులకూ పంచిపెట్టమని, దిశా నిర్దేశం చేశాడు. నేను స్వామివారి లీలలను 2000 సంవత్సరము నుండి అనుభవిస్తున్నప్పటికీ, ఆయన సంకల్పమును మాత్రం సంవత్సరం 2022 ఏప్రిల్ లో మాత్రమే తెలియజేశాడు.

పూర్వం భగీరథుడు గంగను దివి నుండి భువికి తెచ్చుటలో ప్రధాన పాత్ర పోషించాడు. కాని ఆయన ఒక్కడితోనే ఆ పని సంపూర్ణంగా సాధ్యం కాలేదు. అందులో వారి పూర్వీకుల తపః ఫలం తోడై మాత్రమే ఈయన విజయం సాధించినట్లు, తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి, తిరుమల నుండి చిన్నగుండవెల్లి లోని హరినామ క్షేత్రమునకు తెచ్చుటలో నేను ప్రధాన పాత్రను పోషిస్తున్నప్పటికీ, ఇందులో మా తల్లితండ్రులు, భార్యాబిడ్డలు, వంశస్థులు, గ్రామస్థులు, ఆ ప్రాంత ప్రజలు, శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్త జనము వారి వారి పాత్రను సమయానుసారము నిర్వహిస్తారని స్వామివారు సూచించారు.



కే.శే పుల్లగూర్ల వెంకటరెడ్డి

కే.శే పుల్లగూర్ల రుక్మమ్మ

నా పరిచయం :

నా పేరు పుల్లగూర్ల సాయిరెడ్డి. తేది 05-07-1960 తొలి ఏకాదశి రోజున జన్మించాను. నా తల్లితండ్రులు కీ.శే పుల్లగూర్ల వెంకటరెడ్డి, రుక్మమ్మ దంపతులు. నాకు ఒక చెల్లెలు లలిత. ఇద్దరమే సంతానం. మాది సిద్ధిపేటకు 7 కిలోమీటర్ల దూరమున గల చిన్నగుండవెల్లి గ్రామము. పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబము. 1981వ సంవత్సరములో కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా విశ్వవిద్యాలయములో సివిల్ ఇంజనీరింగ్ విద్యనభ్యసించుటకని హైదరాబాద్ వచ్చాను. 1985 వ సంవత్సరములో సివిల్ ఇంజనీరింగ్ లో పట్టా పొంది, 1987 నుండి అదే కళాశాలలో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ లో పార్ట్ టైం చదివి యం.టెక్ మాస్టర్ డిగ్రీ పట్టా పొందాను. 1990 లో హైదరాబాద్ వాస్తవ్యులైన చెఱుకుపల్లి నారాయణరెడ్డి, శకుంతలాదేవి కుమార్తె, యం.ఎస్సీ కెమిస్ట్రీ చదివిన, సురేఖారెడ్డితో వివాహం జరిగింది. ఇద్దరు పుత్రులు, వేదాంత్ మరియు అరవింద్ రెడ్డి. మా తండ్రి 1990 సంవత్సరములో మరియు మా తల్లి 2008 సంవత్సరములో స్వర్గస్థులైనారు.

విద్యాభ్యాసము తరువాత ఉద్యోగము చేయుట ఏమాత్రం ఇష్టం లేని నేను కన్స్ట్రక్షన్ రంగంలో బిల్డరుగ 1990 నుండి వ్యాపారము చేయుచు హైదరాబాదులో జీవిస్తున్నాను. 1999 సంవత్సరము నుండి శ్రీవేంకటేశ్వరుని లీలల వలన, వ్యాపారమును సగానికి తగ్గించాను. 2002 నుండి 2014 వరకు కేవలం నా కుటుంబ పోషణార్థమే వ్యాపారము చేయుటకు అనుమతించారు. 2014 సంవత్సరము నుండి స్వామివారి ఆజ్ఞచే నా వ్యాపారాన్ని పూర్తిగా మానివేశాను. ప్రతినెల వచ్చు కొన్ని చాలీ చాలని కిరాయిలతో జీవనము కొనసాగుచున్నది. నా పూర్తి ఆర్థిక భారాన్ని స్వామివారే చూచుకుంటానన్నారు. అవసరమున్నంతనే ప్రసాదిస్తారు. కాకతీయగనగర్, హబ్సీగూడ, హైదరాబాదులో స్వామివారు ప్రసాదించిన ఇంటిలో 2005 సంవత్సరము నుండి నివసిస్తున్నాము. మా ఇంటి నుండి అర కిలోమీటరు దూరములో హబ్సీగూడలోని వీధి నెం.1 లో ఆఫీసు కలదు. మా పెద్ద కుమారుడు చి॥ వేదాంత్, అతని భార్య చి॥ సౌ॥ పూజ మరియు చిన్నకుమారుడు చి॥ అరవింద్ రెడ్డి అతని భార్య చి॥ సౌ॥ ప్రణీత అమెరికాలో నివసిస్తున్నారు. ఇది మా కుటుంబం.

స్వామివారి శిక్షణ :

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన సేవకుడిగ స్వీకరించి సైనికుడిగ శిక్షణనిచ్చాడు. ''వన్ మాన్ ఆర్మీ'' లాగా తయారు చేసి లక్ష్యాన్ని ఛేదించమన్నాడు. ఏ విధంగానైతే యుద్ధంలో కాలం గడిచిన కొద్దీ క్రొత్త క్రొత్త టెక్నాలజీలతో ప్రతి 4-5 సంవత్సరములకు ఒక్కసారి నూతన ఆయుధాలు పుట్టుకొచ్చినప్పుడు వాటికి తగిన శిక్షణను సైనికునికి

ఇచ్చి నిష్ణాతుని చేయునట్లు, నాకు కూడ 2000 సంవత్సరం నుండి 2023 వరకు 6 సేవలను ప్రసాదించి ప్రతి సేవ ఏ విధంగా సమర్థవంతంగా నిర్వహించాలనే శిక్షణను ఇచ్చారు. ఏడవ సేవగా యోగ్యత సాధించి తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి పొంది చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రం ఏర్పాటు చేయుటకు కావలసిన శిక్షణను ఇస్తున్నారు. గత 6 సేవలలో శ్రీవారి కృపతో సమర్థవంతంగా విజయం సాధించాను. ఈ ఏడవ సేవలో కూడా స్వామి కృపతో విజయుణ్ణి కాగలనని ఆశించుచున్నాను. ఆ ప్రయత్నంలో భాగమే నా ఈ అనుభూతుల ప్రచురణ. నిజం చెప్పాలంటే స్వామివారు నన్ను ఎన్నుకొనుటలో నా పూర్వజన్మ సుకృతము లాంటి గొప్పతనము ఉంటే ఉండవచ్చు, కాని ఈ శ్రీవారి సేవలయందు విజయమును సాధించుటలో నా శక్తి ఎంత మాత్రము లేదు. నేను ఒక సాధారణ మానవుణ్ణి. నేను స్వామివారి సేవను 2002 సంవత్సరంలో ప్రారంభించినప్పుడు ఎంత ఉత్సాహంతో ఉన్నానో, 2023 సంవత్సరంలో కూడా అంతే ఉత్సాహంగా ఉన్నానంటే శ్రీవేంకటేశ్వరుని శక్తే కారణం.

ప్రతిరోజు స్వామివారిని, ఆయన లీలలను చూడాలని తహతహ లాడేవాడిని. వరుసగ 10 రోజులు స్వామి లీలలను చూడకుండ ఉండలేని స్థితి కలిగించారు. నా దురదృష్టమో, అదృష్టమో తెలియదు కాని స్వామి లీలలను పొందిన తరువాత, దాని ప్రభావము ఒక వారం, పది రోజులు మాత్రమే ఉండి తరువాత మరచేవాడిని. మళ్ళీ క్రొత్త లీల కావాలని కోరేవాడిని. ఈ స్థితి గత 23 సంవత్సరముల నుండి నేటివరకు కొనసాగుతున్నది.

స్వామివారు తన ప్రత్యక్ష లీలలను 2000 సంవత్సరము నుండి చూపుట ప్రారంభించారు. నాకు వ్యాపారము పైన, నా భార్యకు కుటుంబం పైన ఎక్కువ ఇష్టాలు ఉండేవి. వీటిని ఉపయోగించి మాకు ఇష్టమున్న వాటిలో వచ్చిన చిక్కులను, కష్టాలను తీర్చుచు మాకు అత్యంత ప్రీతిపాత్రుడైనాడు. ముఖ్యంగా నేనైతే స్వామి నామము పలికితే శరీరములోని రోమాలు నిక్కబొడుచుకుని, ఆనంద బాష్పాలు రాల్చేవాడిని. నేను జీవించుటకు శ్వాస ఎంత అవసరమో స్వామి నామం కూడా అంతే అవసరమన్న స్థితికి వచ్చాను. నేను ఎవరిని చూచినా మూడు నామాలు పెట్టుకున్నట్టుగనే కనబడేవారు. ఈయన సర్వశక్తిమంతుడు. సమస్త దేవీ దేవతల శక్తులను, రూపాలను తనలో ఇముడ్చుకొని ఉన్నాడని, ఈయన ఒక్కరిని స్మరిస్తే సమస్త దేవీ దేవతలను స్మరించిన పుణ్యం వస్తుందన్న జ్ఞానాన్ని కలుగజేశాడు. నేను సర్వదా మానసింగా తిరుమల ఆలయంలో ఉన్న మూల మూర్తిని మాత్రమే దర్శిస్తూ స్మరించేవాడిని. ఆ రూపమే నాకు కావలసిన శక్తిని, జ్ఞానాన్ని ప్రసాదించింది. ఒక వ్యక్తి తాను స్వయంగా చెబితే తప్ప, భగవంతుడు అతని హృదయములోని భావాలను తెలుసుకోలేడు అనే స్థితి నుండి నాకు శిక్షణ ఇచ్చుటను ప్రారంభించాడు.

నాకు ఇంతవరకు శ్రీవేంకటేశ్వరుడు తప్ప ఇతర గురువు లేడు. ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాక, నేనెవ్వరి వద్ద సమాశ్రయణము తీసుకోలేదు. కాని తిరుపతిలో సం॥ 2003లో త్రిదండి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వారు 'గోవింద దాసు'గ, మరియు హైదరాబాద్‌లో 2004 సంవత్సరములో శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజ జీయర్ స్వామివారు 'గోవింద రామానుజ దాసు'గ దాస్య నామాలు ఇచ్చిన గురువులు.

తిరుమలలోని ఆలయంలో శ్రీవేంకటేశ్వరునితో పాటు ఇతర దేవతలు ఉన్నప్పటికీ, శ్రీవేంకటేశ్వరుని రూపాలే సమస్త దేవతలని, వీరిని పూజిస్తే మిగిలిన అందరినీ పూజించినట్లే అని భావిస్తూ ఇతరములైన ఏ రూపానికీ ప్రత్యేక పూజలు చేయరు, ఒక్క శ్రీవేంకటేశ్వరునికి తప్ప. ఇదే జ్ఞానాన్ని నాకు కలగజేశాడు. నేను సర్వదా ఆయన పాదాలను చూస్తూ, ఆయన నామాన్నే స్మరించేవాడిని. అదే నా మహామంత్రము, శక్తి, ఆధారం, ప్రేరణ. ఒకవిధంగా నేను భగవద్గీత చరమ శ్లోకమును మాత్రమే ఆచరించేవాణ్ణి. శ్రీవేంకటేశ్వరుడే మూలం అని నమ్మేవాడిని. 2005 సంవత్సరంలో మాత్రం తాను స్వయంగా శ్రీమన్నారాయణుడననే విషయాన్ని తెలిపారు. అయినా నా దృక్పథంలో

మార్పు కలగలేదు. శ్రీవేంకటేశ్వరుణ్ణి నేను నా స్వామిగా, ఈ సృష్టికి మూలంగా, సర్వశక్తిమంతుడుగ భావించాను. కావున స్వామివారికి చిన్న చిన్న సేవలను చేసినచో తృప్తి చెందేవాణ్ణి కాదు. ఆయనకు నేను ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా అలసిపోయేటట్లు అత్యంత పెద్ద మొత్తంలో సేవలను చేయాలనిపించేది. పూర్వం బాణాసురుని యుద్ధ కాంక్ష లాగా నాలో శ్రీవారి సేవాకాంక్ష నా రోమ రోమాల్లో పొగలు కక్కుతూ ఉంటుంది. ప్రతి సేవకు స్వామివారే మూలం కావున నేను కేవలం స్వామివారి ప్రతినిధిగ, సేవకుడిగ చేస్తున్నాను కావున ఎలాంటి సన్మానాలను ఆశించలేదు. వీలుకాని సమయంలో స్వామి వారి శేష వస్త్రంను మాత్రమే స్వీకరించేది. ఏనాడు మోక్షాన్ని కాంక్షించలేదు. మరి నాలుగైదు జన్మలు మానవ జన్మను ప్రసాదించి ప్రతి జన్మలో, ఈ జన్మలో లభించిన సేవా భాగ్యాన్ని ప్రసాదించుమని మరి మరి వేడుకునే వాడిని.

2000 సంవత్సరంలో మొదలైన స్వామి స్మరణ వల్ల కలిగే ఆనంద స్థితి నాకు రెండు రకాల దృష్టి కోణాలను ఏర్పాటు చేసింది. బయటి లోకమును చూస్తూ, బయటి ప్రపంచంలోని వ్యక్తులతో మాట్లాడుచున్నప్పటికీ, సదా అంతర్ దృష్టితో స్వామివారిని వీక్షించుచు, ఆయన నామ స్మరణను కొనసాగించేవాడిని. 2001 సంవత్సరంలో ఒకానొక రోజు నా ఆస్తి విషయములో తలెత్తిన సమస్యను తీర్చుమని ప్రార్థించే క్రమములో, ఒకానొక భావోద్వేగ స్థితిని పొంది, వారికి సంపూర్ణ శరణాగతి చేశాను. నాది నేను సమర్పించుకొనుటతో పాటు, నా సంపూర్ణ ఆస్తిని, నా మొత్తం కుటుంబాన్ని ఆయనకు సమర్పించాను. నేను నా వ్యక్తిత్వాన్ని కోల్పోయాను. నేను నీవాడినని, నాకున్నదంతా తమదేనని చెప్పుచు, నన్ను ఈ లోకమునకు ఉపయోగపడే ఏదేని మంచి పనికి ఉపయోగించుకొమ్మని దీనాతి దీనంగా ప్రాధేయపడ్డాను. అప్పటి నుండి నాది నేను శ్రీవేంకటేశ్వరుడి పాదసేవకుడిగ భావిస్తూ జీవించసాగాను. మరియు ఆయన కృపావిశేషం చేత మా మధ్యన ఒక బంధం ఏర్పడ్డది. ఆ బంధం ప్రకారం నా మనస్సులో పుట్టిన ప్రతి ఆలోచన స్వామిదై ఉండాలి. నేను ఆ ఆలోచన ప్రకారమే నడచుకోవాలి. అది మంచిదా చెడ్డదా అనే విచక్షణ నాకు అవసరం లేదు. నేను ఆయన సేవకుడను. ఆయన ఆజ్ఞానుసారం నడచుకొనుట నా కర్తవ్యం. ఇదే ఆలోచన నా మొత్తం జీవితాన్ని మార్చేసింది. స్వామి రకరకాల సేవలను ఏర్పాటు చేయుటకు నాందిగా ఏర్పడ్డది.

ఆ తరువాత తిరుమల శ్రీవేంకటేశ్వరుడు కూడ నాకు ఒక కర్తవ్యాన్ని ఏర్పరచాడు. అదేమిటంటే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించిన ప్రతి అనుగ్రహాన్ని నేను అనుభవించి, తిరిగి దానిని తన భక్తులు అనుభవించేటట్లు చేయుట నా కర్తవ్యం. నేను పొందిన స్వామి కృపను ఎంత సమర్థవంతంగా, ఆయన భక్తులు తిరిగి అనుభవించేటట్లు చేయుదునో అంతగా స్వామివారు సంతోషించేవారు, అదే నా కర్తవ్యంగా నా సేవక సామర్థ్యానికి నిదర్శనంగా ఎంచుకున్నాను. మొదట్లో అంటే 2000 సంవత్సరం నుండి 2002 వరకు స్వామివారితో నా బంధం ఒక ఆత్మీయ బంధం లాగా ఏర్పడ్డది. నా ప్రతి ప్రశ్నకు జవాబిచ్చేవాడు. 2002 సంవత్సరం నుండి 2005 వరకు నన్ను ఒక ప్రత్యేకమైన పని నిమిత్తం తీసుకెళ్ళుచున్నారని గ్రహించాను. 2008 వరకు నా సర్వదాస్తిని హరించి వేసి తాను చెప్పినట్లు మాత్రమే నడుచుకోమన్నాడు. 2009 నుండి యోగ్యతను సాధించుకోమన్నాడు. సాధన పెంచమన్నాడు. ఆధ్యాత్మికంగా ఎదగమని చెప్పాడు. ఇదే స్థితి నేటివరకు కొనసాగుతున్నది. ఏదేని చెడు ఆలోచన, స్వామికి ఇష్టం లేని ఆలోచన, ఈ సంకల్పానికి విరుద్ధమైన ఆలోచన నా మనస్సుకు వచ్చినప్పుడు వెంటనే దానిని వదులుమని సూచించేవాడు. శ్రీవేంకటేశ్వరుడు నన్ను, తను ఆశించిన స్థితికి తీసుకురావటానికి ఆయా సమయాలలోని నా మానసిక స్థితికి అనుగుణంగా, సామ దాన బేధ దండోపాయాలను ఉపయోగించాడు. మరణం అంచుల వరకు తీసుకెళ్ళిన సందర్భాలు ఉన్నవి. కత్తిని మెడపై పెట్టి చేస్తావా? చస్తావా? అని అడిగిన సందర్భాలు ఉన్నాయి.

మా జీవితంలో స్వామివారి ప్రత్యక్ష లీలలు 2000 సంవత్సరం నుండి ప్రారంభమైనాయి. ఆయనకు సేవ చేయు

భాగ్యము మాత్రము 2002 సంవత్సరము నుండి ప్రారంభమైంది. మొదట నన్ను శ్రీ ఆంజనేయుణ్ణి ఆదర్శంగా తీసుకొని సేవ చేయమన్నాడు. అంటే శ్రీ ఆంజనేయుడు శ్రీరాముణ్ణి ఏవిధంగా తన స్వామిగా భావించి ఎంత పెద్ద కష్టతరమైన సేవకైనా భయపడక అత్యంత ఉత్సాహముతో చేసేవాడో, అదేవిధంగా నేను కూడా శ్రీవేంకటేశ్వరుని నా స్వామిగా భావించి ఎల్లప్పుడు ఆయననే స్మరిస్తూ, ఆయన సేవలను అత్యంత ఉత్సాహంగా ఏమాత్రం వెరవక చేయమన్నాడు. నా నరనరాల్లో స్వామి నిక్షిప్తమైన తరువాత 2020 సంవత్సరం నుండి శ్రీ భరతుణ్ణి అనుసరించమన్నాడు. భరతునంతటి త్యాగ గుణంతో, శ్రీరాముణ్ణి అయోధ్యకు తిరిగి తెచ్చుటకు ఏవిధంగా ప్రతిరోజును లెక్కపెడుతూ, తపిస్తూ, జీవించాడో ఆ విధంగా నేను కూడా ''నా'' అన్నది నశింప చేసుకొని, ప్రతిరోజు శ్రీవేంకటేశ్వరుణ్ణి హరినామ క్షేత్రమునకు తెచ్చుటకు తపిస్తూ, జీవిస్తూ వేచి ఉండమని దిశా నిర్దేశం చేశాడు.

స్వామివారు విధించిన ప్రవర్తనా నియమావళి

మా జీవితానికి ఈ క్రింది విధంగా ప్రవర్తనా నియమావళిని విధించారు. మేము అత్యంత సాధారణ జీవితం గడపాలి. గొప్పవారమనే భావం కలిగే విధంగా ప్రవర్తించకూడదు. మా ఆచారాలు, అలవాట్లు, అత్యంత సాధారణంగా ఉండాలి. డైమండ్స్ మొదలైన వస్తువులను నేను కాని నా భార్య కాని ధరించకూడదు. వ్యర్థ ప్రసంగాలతో మిత్రులతో కాలక్షేపం చేయరాదు. సౌకర్యవంతమైన వస్తువుల పట్ల వ్యామోహం చెందరాదు. 'నా' అన్నది నశింపచేసుకోవాలి. ఉన్నంతలోనే తృప్తి చెంది సదా శ్రీవేంకటేశ్వరుని స్మరణలో కాలం గడపాలి. మేము నలుగురిలో ఉన్నప్పటికీ మానసికంగా భగవంతుణ్ణే చూస్తూ జీవించుమన్నాడు. లోకంలోని విషయ వాసనలను త్రుంచి వేయమన్నాడు.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఒక సాధనము లాగా వాడుకుంటున్నాడు. నేను హరినామ క్షేత్రము ఏర్పాటు చేయుటకు, భగవంతుని పొందుటకు, కావలసిన స్థితికి చేరుటే ఆయన ఉద్దేశం లాగ కనబడ్డది. దీనిని నాకు అత్యంత అరుదైన అనుగ్రహాలతో పాటు అదే స్థాయిలో కష్టాలను కూడ కలుగజేశారు. ప్రతి లీలలో, కష్టము కాని సుఖము కాని కొంత కొంత మార్పును కలుగజేసేవారు. ఒక ఇనుప ముక్కను అనుకున్న ఆకారానికి మార్చాలంటే, ఎన్నోసార్లు కొలిమిలో వేడిచేసి సమ్మెటపోట్లు వేస్తే తప్ప అది ఆ ఆకారం లోనికి మారనట్లు, నా జీవితంలో కూడా ఎన్నో అత్యంత కష్టమైన పరిస్థితులను కలుగజేశారు. ఈ విపత్కాల పరిస్థితులలో కూడా నేనున్నాను భయపడకుమని చెప్పేవారు. కాని పరిస్థితులు బలీయంగా ఉండటంచే స్వామివారి మాటపైన విశ్వాసము లేనట్లుగ తోచేది. విలవిల కొట్టుకున్నా వదిలేవాడు కాదు. తాను అనుకున్న మార్పు నా మూలం నుండి జరిగిందని భావించిన తరువాతనే సడలించేవారు. మొత్తం స్వామివారిపై నమ్మకం కలిగి, ఈ జీవితంలోని మరే విషయంపై మమకారమును సంపూర్ణంగా వదిలివేయుటకే నాలో పరివర్తన కోసమే ఇలాంటి పరిస్థితులను కల్పించి నాటకాలాడించేవారు. ఈ విధమైన మార్పుకోసం నాకత్యంత ఇష్టమైన వ్యాపారం, ఆస్తులు, ఆరోగ్యమును ఎంచుకొని అందులో ఇబ్బందులను కలుగజేసి నాలో లౌకిక విషయాల పట్ల వ్యామోహాన్ని తీసివేయునట్లు చేశాడు.

ఇప్పటివరకు నేను మరియు నా భార్య కలిసి కొన్నివేల అనుభూతులను పొందాము. మేము పొందిన మొత్తం అనుభూతులలో 90% అనుభూతులను నేను అనుభవించాను. నా భార్య 10% అనుభూతులను మాత్రమే అనుభవించింది. శ్రీవేంకటేశ్వరుడు నా భార్యను నన్ను అనుసరించునట్లు కట్టడి చేశాడు. నేను ఎంచుకున్న ప్రతి సేవలో అనుసరించుటే ఆమె కర్తవ్యం. కాని అప్పుడప్పుడు ఆమెలో ఉత్సాహాన్ని పెంచుటకు కొన్ని అనుభూతులను చూపేవాడు.

స్వామివారి అనుభూతులు :



స్వామివారి అనుభూతులు ముఖ్యంగా 4 రకాలుగా ఉండును. మొదటిది కలల రూపంలో : ఇవి అంత స్పష్టంగా ఉండవు. వాటి గురించి, వాటి అర్థం కోసం తర్కించుకోవాలి. విచక్షణా జ్ఞానాన్ని ఉపయోగించి సరైన అర్థమును రాబట్టాలి. ఇది ఒక పరీక్ష లాంటిది.

రెండవది హృదయాంతరంగం నుండి భావాలు : కొన్నిసార్లు స్వామివారు నా హృదయాంతరంగం నుండి ఆ విషయానికి సంబంధించిన భావాలను వ్యక్తపరిచేవారు. ఇది అత్యంత స్పష్టంగా ఉండును. విచక్షణా జ్ఞానం అవసరం లేదు.

మూడవది: అశరీరవాణి వాక్కులు : ఇవి కొన్నిసార్లు స్వప్నాలను చూస్తున్నప్పుడు, ఆ స్వప్నాలలోనే ఈ అశరీరవాణి వాక్కులు వినబడేవి. మరికొన్ని ఉదయం నేను ప్రాణాయామం మొదలగునవి చేయు సమయాన వినబడేవి.

నాల్గవది: ఈ అనుభూతి చాలా భిన్నం. స్పృహలోనే ఉండేవారిమి కాని మా మనస్సు ఒక చిత్రాన్ని చూస్తుండును. మేము ప్రత్యక్షంగా ఆ చిత్రాన్ని చూస్తున్నట్లు అనుభూతి పొందేవాళ్లం. ఇది మాకు మాత్రమే కనబడేది. మా ప్రక్కనున్న వారికి కనిపించేది కాదు.

స్వామివారు ఒక్క విషయాన్ని ఒక్కసారి మాత్రమే చెప్పేవారు. దానిని గుర్తుపెట్టుకొని ఆచరించుట మా కర్తవ్యం. ఇంతవరకు మేము పొందిన దాదాపు అన్ని అనుభూతులు ఉదయం 4.30 నుండి 5.30 మధ్యన మాత్రమే వచ్చాయి.

స్వామి సేవలు :

నా భాగ్యవశాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నన్ను తన పాదసేవకుడుగ స్వీకరించి ఈ జీవితములో నేను తృప్తి చెందే వరకు తనయొక్క మరియు తన భక్తుల యొక్క సేవాభాగ్యాన్ని ప్రసాదించాడు.

మేము కూడా స్వామి సేవను అత్యంత సమర్థవంతంగా ఏ లోటు లేకుండా, స్వామివారు మెచ్చేవిధంగా చేయాలనుకున్నాను. స్వామివారిని సంతోష పరచుటే మా కర్తవ్యంగా ఎంచుకున్నాము. మరియు ఈ క్రింది రెండు నియమాలను ఏర్పరచుకున్నాము.

(1) నా మనసులో కలిగే భావానుసారమే నేను నడుచుకోవాలి తప్ప ఇతరులను అడిగి పక్కదారి పట్టరాదు. ఇతరుల అభిప్రాయం ప్రకారం నేను చేస్తున్నది సరిగా లేదని భావించి బాధపడరాదు.

(2) ఏనాడు ఇతరుల డబ్బును డొనేషన్స్ రూపంలో ఆశపడరాదని, హృదయపూర్వకంగా ఇస్తే స్వీకరించాలి తప్ప ఎవ్వరినీ అడుగరాదని నియమము ఏర్పరచుకున్నాము. స్వామివారు మాకు ప్రసాదించిన డబ్బుతోనే

పూర్తి సేవను చేయాలనుకున్నాము. ఈ రెండు నియమాలను మా మనస్సులో దృఢంగా నిలుపుకొని సేవను ప్రారంభించాము. స్వామివారిని ప్రతి క్షణము అడుగుచు, ఆయన సంతోషించినట్లు అనిపించితే అదే సరైన విధానమని భావించేవాళ్లము. దీనికి స్వామివారు కూడా ఇదే సరైన మార్గం అని చెప్పుచు చక్కటి మార్గనిర్దేశము ఎప్పటికప్పుడు చేయుచు మమ్ము సన్మార్గములో, తాను ఆశించే మార్గములో తీసుకెళ్ళేవారు.

ఎప్పుడైనా మా మనస్సు చలించి పై నియమాల నుండి ప్రక్కకు తప్పినప్పుడు, కొన్ని లీలలను చూపి, మమ్ము మళ్ళీ ఈ మార్గం లోనికి తెచ్చేవారు. ఈవిధంగా 2002 సంవత్సరం నుండి ఇప్పటి వరకు అంటే 2023 వరకు జరిగింది.

ఇప్పటివరకు శ్రీవేంకటేశ్వరుడు 6 రకాల సేవలను ఈ క్రింద పేర్కొన్న వాటిని ప్రసాదించాడు.

1. 2002 సంవత్సరంలో తిరుపతిలోని టిటిడి డైరీఫాంలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపమును నిర్మించి స్వామి వారి పాదపద్మములకు సమర్పించాము.
2. 2002 సంవత్సరంలో ''శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠము''ను స్థాపించి ప్రతి సంవత్సరం 70 వేల మంది భక్తులు వ్రాసిన 7 కోట్ల జప సమర్పణ.
3. 2004 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము యొక్క బ్రాస్ రిప్లికాను 'నమోవేంకటేశాయ' అనే పేరుతో రథమును తయారు చేసి హైదరాబాద్ నుండి తిరుపతి వరకు ప్రతి సంవత్సరం 25 రోజులు రథయాత్ర చేయుట.
4. 2007 సంవత్సరంలో 'శ్రీవేంకటేశం' అనే తెలుగు మాసపత్రికను ప్రారంభించుట.
5. 2009 సంవత్సరం నుండి సంవత్సరానికి రెండుసార్లు 'భజగోవిందం' కార్యక్రమమును నిర్వహించుట.
6. 2021 సంవత్సరం నుండి మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాల సంకల్పం.

పైన పేర్కొన్న ప్రతి సేవ నేటికీ కొనసాగుతుంది. 'నమో వేంకటేశాయ' రథమును మాత్రము 2021 సంవత్సరము నుండి శ్రీనివాస కళ్యాణాలలో వాడుతున్నాము.

శ్రీవేంకటేశ్వరుడు సర్వశక్తిమంతుడు. నేను ఆయన సేవకుడిని అయినప్పటికీ ఏనాడు నన్ను బలవంతము చేయలేదు. ప్రతి సేవ మొదలు నేను చేస్తాను స్వామివారిని ప్రసాదించమని అత్యంత ఆర్తితో ప్రార్థించిన తరువాతనే ఆ సేవను ప్రసాదించేవారు. కాని దాని మూలము స్వామివారి నుండి లభించేది. ముందు ఆ సేవ ఒక మెఱుపులాగ నా హృదయములో ప్రత్యక్షమయ్యేది. తరువాత రోజుల్లో దీని గురించి మరిన్ని ఆలోచనలు కలిగి, చివరికి నేను దీనిని చేసి తీరాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరేది, స్వామివారిని ఈ సేవను ప్రసాదించమని రక రకాలుగా ప్రార్థించేవాడిని. మీరు నేను తృప్తి చెందేవరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించారు. ఇంతవరకు తృప్తి చెందలేదు. ఈ సేవను నాకు ప్రసాదించమని దీనాతి దీనంగా ప్రార్థించిన తరువాతనే ఆ సేవను ప్రసాదించేవాడు. ఈ సేవను నీవు కోరితేనే ప్రసాదించాను. కావున దీనిని సమర్థవంతంగా నిర్వహించే బాధ్యత నీదే అనేవాడు. కాని నాకు నిర్వహణలో ఇబ్బంది కలిగినప్పుడు పరిష్కారమార్గం చూపేవాడు. ఇలా నా మొదటి సేవ తేది 05-07-2002, తొలి ఏకాదశి రోజు, శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము నిర్మించాలనే కోరికతో ప్రారంభమైంది. తేది 15-10-2002 విజయదశమి రోజున శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్థాపించుటతో స్వామివారికి మరియు ఆయన భక్తులకు కలిపి సేవ చేయు భాగ్యము ఏర్పడింది.

సేవను ఆటలాగ చిత్రీకరించుట :

మా జీవితంలో శ్రీవేంకటేశ్వరుని సేవ ఒక ఆటలాగా సాగింది. అత్యంత క్లుప్తంగా చెప్పాలంటే ఈ ఆట ఈ విధంగా ఉంది.

ఒక తండ్రి తన చిన్నబాబుకి తనంటే అమితమైన ప్రేమను రంగరించి పోశాడు. తండ్రిని వదలలేని స్థితికి తీసుకువచ్చాడు. ఒకరోజు ఆ బాబు తన తోటి బాలురతో, ఇష్టమైన ఆట వస్తువులతో ఉల్లాసంగా ఆడుకుంటున్న సమయాన, తండ్రి ఒక చాకొలెట్ వంటి మధుర పదార్థాన్ని చేతిలో పట్టుకొని, ఆ పిల్లవాడితో ఒక పందెం కాశాడు. తాను 16 మెట్ల పైన ఉన్నానని, తననే చూస్తూ, ఎలాంటి తొణుకు బెణుకు లేకుండా ప్రతిమెట్టు జాగ్రత్తగా, క్రింద పడకుండా వచ్చి ఆ చాకొలెట్ ను తీసుకొని తనను చేరమని చెప్పాడు. నిబంధన ప్రకారం కేవలం ఒకే ఒక తప్పుకు అనుమతి, రెండవ తప్పు చేసినట్లయితే పిల్లవాడు ఓడిపోయినట్లు లెక్క. ఇది పందెం. దీనిని పిల్లవాడు సాధించాలి. ఈ తండ్రి చాల సమర్థుడు. 16 మెట్ల క్రింద ఉన్న ఆ బాబుకి నడకను, మెట్లు ఎక్కే విధానాన్ని కూడ పైన ఉండే నేర్పాడు. ఈ చిన్నపిల్లవాడు మాత్రం అత్యంత ఆనందంగా తన తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. తన తండ్రి మాత్రం పిల్లవాణ్ణి ఈ ఆటలను వదిలి, ఏమాత్రం తొట్రుపాటు లేకుండా, ఎప్పటికప్పుడు తాను చెప్పే ఆజ్ఞలను పాటించుచు, తన మిత్రుల, ఆటవస్తువుల సహవాసమును వదలి, తననే చూస్తూ మెట్లు ఎక్కి వచ్చి తనను చేరుకొమ్మన్నాడు. అయితే మొదటి మెట్టు ఎక్కే ప్రయత్నం లోనే ఈ పిల్లవాడు తొణికాడు. తరువాత ఆ తండ్రి సలహాల ఆధారంగా 15 మెట్లు ఎక్కగలిగాడు. కాని అప్పుడప్పుడు తన మిత్రులు ఆటవస్తువులతో చేయు చప్పుడుకు, మిత్రులపై నున్న ప్రేమకు తలొగ్గి, ఆ తండ్రికి తెలియకుండా ఓరకంట వారిని చూస్తూ పైకెక్కాడు. ఈ తప్పును గమనించిన తండ్రి 16వ మెట్టు పైన కొంత చమురును పోశాడు. ఈ పిల్లవాడు 16వ మెట్టుపైన కాలు పెట్టగానే, ఆ చమురు ప్రభావముతో జారిపడ్డాడు. ఓడిపోయానని బోరున ఏడ్చాడు. దయామయుడైన ఆ తండ్రి తన పిల్లవాణ్ణి క్రింద పడకుండా పట్టుకొని నీవు గెలిచావు, ఏడవకుమన్నాడు. చాకొలెట్ ను తీసుకోమన్నాడు. కాని అభిమానం కల ఆ బాబు చాకొలెట్ తీసుకోకుండా తాను ఓడిపోవుటకు తండ్రే కారణం అని, తాను పట్టుకోకుండా ఉండి ఉంటే ఎలాగో నిలదొక్కుకుని పూర్తిగా ఎక్కేవాడినని మొరాయించాడు. కావాలంటే తనకు మరో అవకాశం ఇచ్చి చూడమన్నాడు. దయామయుడైన ఆ తండ్రి, ఎలాగూ తన పిల్లవాని గెలుపే ధ్యేయంగా ఉన్నాడు కాబట్టి, పిల్లవాని మాట ప్రకారం రెండవ అవకాశమును ఇచ్చాడు. ఈసారి తాను ఇంతకుముందు చేసిన ఎలాంటి పొరపాట్లు చేయకూడదని, ఓరచూపులు, మిత్రుల ఆకర్షణకు లొంగుట వంటివి చేయకూడదని, తననే తదేక దృష్టితో చూస్తూ, విజయమే ధ్యేయంగా పెట్టుకొని పైకి ఎక్కి తనను చేరుకొమ్మని దిశానిర్దేశం చేశాడు. ఈ పిల్లవాడు కూడ ఇంతకుముందు చేసిన తప్పులు చేయకుండ సరిదిద్దుకుని, తండ్రిమాట ప్రకారం తండ్రినే చూస్తూ, ఇప్పటివరకు 5 మెట్లను ఎక్కి ప్రయాణిస్తున్నాడు. త్వరలో 16 మెట్లు ఎక్కి తన తండ్రిని చేరుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఈసారి తన మిత్రులకు, ఎలాంటి అల్లరి చేయక, తనను ఆకర్షించు ప్రయత్నం చేయక ఉండి ఉంటే తాను పొందబోవు చాకొలెట్ ను మొత్తం వారికే ఇస్తానని చెప్పి వారి సహకారం కూడ తీసుకొనుటకు ప్రయత్నిస్తూ పైకెక్కుతున్నాడు. ఇక్కడ తండ్రి – తిరుమల శ్రీవేంకటేశ్వరుడు, పిల్లవాడు – నేను. ఇక తోటిమిత్రులు – లోకవాసులు. ఆటవస్తువులు – విషయ వాసనలు అని గ్రహించినట్లైతే ఈ ఆట సరిగ్గా సరిపోతుంది.

సేవలను ప్రసాదించుట :

2002 సంవత్సర మధ్యకాలంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని చూడాలని, ఆయన సేవ చేయాలని

తపించిపోయాను. రకరకాలుగ వేడుకున్నాను. ఏవిధంగానైతే రామాయణమును కల్పించి అందులో శ్రీ ఆంజనేయుడు మొదలగు వారికి మీ సేవాభాగ్యమును ప్రసాదించారో అదేవిధంగా నాకోసం ఒక నూతన పనిని కల్పించి మీ సేవాభాగ్యాన్నిప్రసాదించుమని ఒళ్ళుగగుర్పాటు చెందగ,కళ్ళనుండి నీళ్ళుధారలైప్రవహించుచుండగ దీనంగా వేడుకొన్నాను. అన్నట్లే స్వామివారు కరుణించి, ఏవిధంగా శ్రీఆంజనేయుడు శ్రీరాముణ్ణి తన స్వామిలాగ భావించి, సర్వదా ఆయన నామస్మరణతో జీవిస్తూ, ఎలాంటి సేవ చేశాడో, నీవు కూడ తిరుమల శ్రీవేంకటేశ్వరుని నీ స్వామిగ భావించి, ఆయనను సదా స్మరిస్తూ సేవ చేసుకోమన్నాడు. సేవలను ప్రసాదిస్తున్నానన్నాడు. దీనితో నా జీవితము మారిపోయింది. అదే సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఒక అద్భుతమైన మరో లీలను ప్రసాదించాడు. దీనితో చాలా పరివర్తన చెందాను. రాజ మహారాజులు కూడ యోగ్యులు కానటువంటి అనుగ్రహాన్ని, అత్యంత అల్పుడినైన నాకు కలిగించినందులకు, అంతటి అనుగ్రహానికి పాత్రుణ్ణినందులకు పరవశించిపోయాను. పర్యవసానంగా ఈ జీవితాంతం, సేవచేసి ఆ ఋణాన్ని తీర్చుకోవాలనుకున్నాను.

శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం :

అనుకున్నట్లుగనే తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపావిశేషం చేత తేది 21-09-2002 న తిరుపతిలో టిటిడి వారి శ్రీవేంకటేశ్వర డైరీఫామ్ లో ''శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము''ను నిర్మించి, స్వామివారి పాదపద్మములకు సమర్పించుట జరిగింది.

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం :

శ్రీవేంకటేశ్వరుని స్మరణ ఎంతో ఆనందాన్నిచ్చేది. పరవశించిపోయేవాడిని. మరియు నాకున్న జటిలమైన సమస్యలు కూడా స్వామివారి నామస్మరణ ప్రభావముచే తొలగిపోయాయి. ఇంతటి స్వామి కృపను నేనొక్కడినే అనుభవించక, స్వామివారి భక్తులు కూడా అనుభవించేటట్లు ఉపాయాన్ని చూపమని ప్రార్థించసాగాను. స్వామివారి సేవను జీవితాంతం చేసి ఆయన ఋణం తీర్చుకోవాలనుకున్నాను. చివరికి నేను ఒక అజ్ఞాత భక్తునిగ ఉంటూ, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరము వారి భక్తులచే కనీసం 7 కోట్ల నామస్మరణ చేయించాలని తలంచాను. అందుకు శ్రీవేంకటేశ్వరునికి వారి భక్తులచే వ్రాయించిన జప సమర్పణ కార్యక్రమము సరైనదని

ఎంచుకొని తేది 15-10-2002 విజయదశమి రోజు నిర్ణయించి, ''శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం''ను స్థాపించాము. ఈ పీఠం పేరుపైన కార్యక్రమములు నిర్వహించుచు, నేను ఒక అజ్ఞాత వ్యక్తిగ ఉండాలన్నదే ధ్యేయం.

స్వామివారితో పందెం కాయుట :

అయితే కాలము గడిచిన కొద్దీ నాలో ఉత్సాహం తగ్గకుండా ఉండుటకు, ఈ జప సమర్పణలో ఏమరుపాటు జరగకుండా ఉండుటకు ఒక సంకల్పం ఉంటే బాగుండునని ఆలోచించాను. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు తనకు బొట్టు పెట్టే సంకల్పమును తీసుకొమ్మని సూచించాడు. ఇంజనీరింగ్ జ్ఞానముతో పరిశీలించి, తన బొట్టులో మూడు ఒకట్లు ఉన్నవని భావించి, మొత్తం 111 కోట్ల జపమును ప్రతి సంవత్సరం కనీసం 70 వేల మంది భక్తులు భాగస్వాములుగ కనీసం 7 కోట్ల చొప్పున 16 సంవత్సరముల వరకు సమర్పించాలని తలంచాను. వెంటనే నా మనస్సులో ఒక ఆశ చిగురించింది. వెనువెంటనే ఇలా అనుకున్నాను. ప్రభూ నేను మీకు బొట్టుపెట్టి వదలను. మిమ్ములను మా ఇంటికి ఆహ్వానిస్తానన్నాను. మన హైందవ సాంప్రదాయం ప్రకారం ఒక వ్యక్తికి బొట్టు పెట్టి మన ఇంటికి ఆహ్వానించినట్లు నేను కూడ సేవచేసి, ఆ సేవను పూరించి, దాని ఫలముచే మీరు కోరినట్లుగ మీకు బొట్టుపెట్టి, మీ కృపను పొంది, మిమ్ములను మా ఇంటికి ఆహ్వానిస్తా రమ్మన్నాను. ఆ విధంగా మా ఇంటికి వచ్చిన తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి తనివితీర దర్శించి, ఆయనతో రెండు మాటలు మాట్లాడి, పాదపూజ చేసి తిరిగి తిరుమలకు పంపాలని భావించాను. స్వామివారు కూడ సరేనన్నారు. కాని ఈ సేవలో ఒక్క తప్పుకూడ ఉండకూడదనే నిబంధన విధించారు. కేవలం ఒకే ఒక తప్పుకు అనుమతించారు. అంటే ఈ నా మొత్తం సేవలో రెండు తప్పులు చేస్తే నేను ఓడిపోతాను. పర్యవసానంగా శ్రీవేంకటేశ్వరుని పొందే భాగ్యమును కోల్పోదుననన్నమాట. ఈ విధంగా పందెం ఖరారైంది.

నిజానికి నేను స్వామివారికి నా తనివితీర సేవ చేయాలనే కోరికతో, ఆ సేవ మధ్యలో పలచబడకూడదనే విధంగా సంకల్పాన్ని కోరుకున్నానే తప్ప, శ్రీవేంకటేశ్వరుని పొందాలనే కోరిక నాకు లేదు. నేను కేవలం ఆయన ఋణాన్ని తీర్చుకొనుటకే సేవ చేస్తున్నాను కాని మరొకటి ఆశించి కాదు. కాబట్టి శ్రీవేంకటేశ్వరుని పొందాలనే ఈ రెండవ కోరిక నా మనస్సులో అస్సలు లేదు. పైగా నేను అత్యంత అల్పుణ్ణి, యోగ్యత లేనివాణ్ణి. ఇలాంటి ఆలోచన నా మనస్సుకు రాకూడదని, దీనిని ఎవ్వరైనా వింటే నవ్వుకుంటారని, నన్ను హేళన చేస్తారని సిగ్గు పడ్డాను. ఈ పందెం నాకు స్వామివారి కఠినమైన సేవను చేయుటకు ఉపయోగ పడుతుందని భావించాను. పైగా స్వామివారి ఈ మాటపై అంత విశ్వాసం కూడా పెట్టలేదు. కేవలం స్వామి శ్రీవారికి నా శక్తిమేర సేవ చేయుటే నా ధర్మంగా భావించాను. ఒకవేళ స్వామివారు నా సేవకు సంతోషించి మా ఇంటికి వచ్చి ఆనందింప చేసినచో అది బోనస్ లాగ భావించుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు తృప్తి చెందితే మా ఇంటికి వస్తానన్నాడన్న విషయాన్ని 2021 సంవత్సరం వరకు నా భార్యకు కూడా చెప్పలేదు. నాకు, శ్రీవేంకటేశ్వరునికి మధ్యనే ఉన్నది.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మొత్తం 111 కోట్ల జపమును సమర్పించి, దాని ఫలితంగా స్వామివారికి బొట్టు పెట్టుటనే శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం యొక్క లోగో గ నిర్ణయించాను. దీనర్థం ఆనంద నిలయంలో ఉన్న శ్రీవేంకటేశ్వరునికి 111 కోట్ల జపం సమర్పించి, దాని ఫలితముతో స్వామికి బొట్టు పెట్టుట. ఇంతవరకు దీనర్థం నాకు, శ్రీవేంకటేశ్వరుడికి, మరి నలుగురైదుగురికి తప్ప ఇతరులకు తెలియదు. నేనే సిగ్గుతో తెలియనీయలేదు. అలాగని సంకల్పాన్ని వదలలేదు. తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సమర్పించే కోట్ల సంకల్పమును ఒక సింబల్ గా మార్చి అసలు విషయము తెలియకుండా, లోగోను మాత్రమే భక్తులకు చూపెట్టేవారిమి.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము

ఈ సంకల్పాన్ని క్రింది విధముగా వ్రాసుకుని సేవను ప్రారంభించాము.

సంకల్పము

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణ లోని సంకల్పము

1. శ్రీవేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట, వారందరినీ శ్రీవారి కరుణా కటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.

2. భక్తులు తమ కోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామము స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.

3. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తిని పెంపొందించి, ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.

4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేల మంది భక్తుల కోరికలను తీర్చమని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.

5. 2002 నుండి 2018 వరకు, 16 సంవత్సరములు ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును శ్రీవేంకటేశ్వర స్వామికి సమర్పించుచు ''శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము''ను శ్రీవారి నామముతో నింపి శ్రీవేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.

6. శ్రీవేంకటేశ్వరుని \|/ నామము విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను \|/ కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో \|/ బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలక ధారణలోని ఆనందమును అనుభవించుట.

7. ఈ కార్యక్రమములో అందరు భక్తులు పాలుపంచుకొనేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశం కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవ చేయుచూ చిట్టచివరకు ఆ శ్రీవేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా, 2003 సంవత్సరములో 1వ పర్యాయము ప్రారంభమైన 7 కోట్లజప సమర్పణ, 2018వ సంవత్సరములో 16వ పర్యాయముగా 7 కోట్ల జప సమర్పణ వరకు ఇదే విధంగా జరిగింది.

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠము ఆధ్వర్యములో స్వామివారి జప పుస్తకమును, ప్రతి పుస్తకములో 1250 స్వామివారి నామాలు పట్టేవిధంగా ప్రింట్ చేసి ఉచితముగా భక్తులకు పంచుటను తేది 15-11-2002 కార్తీక ఏకాదశి నుండి ప్రారంభించాము. మొత్తం 70,300 జప పుస్తకములను పంచి, ఇంగ్లీష్ క్యాలెండర్ ప్రకారం, సరిగ్గా 7 నెలల్లో ఏడుకొండల వాడికి ప్రథమ 7 కోట్ల జప సమర్పణ తేది 14-06-2003 రోజున త్రిదండి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అప్పటి ఈఓ శ్రీమాన్ అజయ్ కల్లామ్ గారి చేతుల మీదుగా జపహోమాదులు నిర్వహించి జపము వ్రాసిన వారి కోరికలను తీర్చమని స్వామివారిని ప్రార్థించి, స్వామివారికి తిరుపతిలో సమర్పించాము. ఈ సందర్భంలోనే శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామివారు నాకు ''గోవింద దాసు''గ నామకరణం చేశారు. మరియు టిటిడి అధికారుల సూచన మేర ప్రతి గోకులాష్టమికి 7 కోట్ల జప సమర్పణ సమర్పించ కట్టడి చేయబడ్డది.

ఆ తరువాత నాకు తెలియకుండానే శ్రీవేంకటేశ్వరుడు మా సేవను విస్తరించుట ప్రారంభించాడు.

నమో వేంకటేశాయ రథం :

మొదటి జప సమర్పణలో మొత్తం 70,300 జప పుస్తకములను భక్తులకు పంచినప్పటికీ ఒకరు ఒకటి కంటె ఎక్కువ పుస్తకములు వ్రాయుట వలన, సమర్పించిన 7 కోట్ల జపములో 70,000 మంది భాగస్వాములు ఉండవలెననే నిబంధనలో లోపం ఏర్పడింది. నేను ఓడిపోయానని ఏడుస్తూ దీనంగా ప్రార్థించాను. వెంటనే ''శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము'' యొక్క నమూనాను ''నమో వేంకటేశాయ'' పేరుతో రథమును తయారు చేయమని సూచించాడు. మరియు దీనిని జప సమర్పణ కంటే 25 రోజుల ముందు, హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర చేయమని సూచించాడు. అనుకున్నట్లుగనే 2004 సంవత్సరంలో మా రెండవ జప సమర్పణ సమయములో, 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేశాం. ప్రతి జప సమర్పణ కంటే 25 రోజుల ముందు, హైదరాబాద్ లోని మా నివాసం నుండి ప్రారంభమై వీధి వీధి తిరుగుచు, కోరిన భక్తుల ఇంటి వద్దకు వెళ్ళుచు, స్వామివారిని స్మరింప చేయుచు ప్రత్యేకంగా

తయారుచేసిన సమర్పణ క్రతువుపై స్వామి మహామంత్రమును వ్రాయించి, దానిని శరణాగత పూర్వకంగా రథంలో వేయించుచు, తిరుపతి చేరుదుము. ఈ రథం స్వామివారి మహామంత్రమును పలుకుచు, తిరుమల శ్రీవారే మనవద్దకు వచ్చారన్న విధంగా ఉంటుంది. ఈ రథం ఒక లారీపై బిగింపబడి ఉంటుంది. ఇది పూర్తిగా బ్రాస్ తో తయారు చేయబడి అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. రోడ్డుపై చూచిన వారు సైతం నమస్కరించాలనే కోరికను కలిగించేంత ఆకర్షణీయంగా ఉంటుంది. శ్రీవేంకటేశ్వరుడు వారి ఇంటికి వచ్చాడన్న తృప్తిని కలిగించుట, మరియు జప సమర్పణలో అధిక సంఖ్యలో భక్తులను భాగస్వాములను చేయుట దీని ముఖ్యోద్దేశం. 70 వేల మంది కంటే ఎక్కువ భక్తులు కనీసం ఒక్కసారైనా స్వామివారిని స్మరించి, ఆ సంవత్సరం సమర్పించబోవు 7 కోట్ల జపములో భాగస్వాములు అగుటను ఈ నమో వేంకటేశాయ రథం నూటికి నూరు పాళ్ళు పూరించింది. మా ఉద్దేశం, మా కారణంగా స్వామివారిని, 70 వేల మంది భక్తులచే కనీసం 7 కోట్ల సార్లు స్మరింపచేయుటయే తప్ప, జపం వ్రాయించుట కాదు. కాబట్టి ఈ రథం రోడ్డుపై తిరుగునప్పుడు కొన్నివేల మంది భక్తులు ఈ రథాన్ని అందులోని శ్రీవేంకటేశ్వరుణ్ణి చూచి నమస్కరించేవారు. మనస్సులో స్మరించేవారు. దీనితో మా సంకల్పం పూర్తైంది.

హైదరాబాద్‌లో నమోవేంకటేశాయ రథమును ప్రారంబించుచున్న శ్రీశ్రీశ్రీ వ్రధథర్ నారాయణ రామానుజా జీయరు స్వామి వారు

సం2004 లో తిరుపతి లో అప్పటి ఇవో శ్రీఅజయ్ కల్లామ్ గారు నమోవేంకటేశాయ రథమును ప్రారంబించుట

70 వేల జప పుస్తకములలో వ్రాయించిన జపముతో పాటు నమో వేంకటేశాయ రథం ద్వారా సేకరించిన క్రతువులను ప్రతి సంవత్సరం గోకులాష్టమి కంటె ఒకరోజు ముందు తిరుపతిలోని పాదాల మండపములో స్వామివారి పాదాలకు సమర్పించుదుము. గోకులాష్టమి రోజు టిటిడి డైరీఫారంలో ఉన్న శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం వద్ద జనహోమాదులు నిర్వహించి, జపము వ్రాసినవారి కోరికలను తీర్చమని, వారికి శ్రీవారి కృపను ప్రసాదించమని ప్రార్థించి టిటిడి ఈవో గారి స్వహస్తాలతో స్థూపంలో సమర్పించుట జరుగుచున్నది.

మొదట్లో మొత్తం 16 సంవత్సరాలు అంటే 2002 సంవత్సరం నుండి 2018 సంవత్సరం వరకు మాత్రమే సంకల్పించిన ఈ జప సమర్పణ కార్యక్రమమును ఆ తరువాత జీవితాంతం పొడిగించాం. సం॥ 2023 ఏప్రిల్ వరకు 21వ పర్యాయంగా 7 కోట్ల జపమును వ్రాయిస్తున్నాము. స్వామివారి కృపా విశేషం చేత ఈ కార్యక్రమానికి ప్రతి సంవత్సరం టిటిడి వారు అనుమతితో పాటు, కావలసిన ఏర్పాట్లను కూడా చేయుట ఆచారమైంది.

శ్రీవేంకటేశం మాసపత్రిక :

మాలో తపనను పెంచే విధంగా ఎప్పటికీ స్వామి సేవలో జీవితాన్ని గడిపే విధంగా, స్వామివారి యొక్క ఒక మాసపత్రికను ప్రారంభించమని ఆదేశించారు. నాకు తెలుగు రాదు. మాసపత్రికను ప్రారంభించలేను, నేను అర్హుణ్ణి కాను, నాకు తెలియదని ఎంత చెప్పినా వినలేదు. ఇది స్వామివారి ఆజ్ఞగా భావించి చేయుమని కఠిన పదాలతో ఆజ్ఞాపించడం వలన ఏప్రిల్ 2007 సంచికతో 'నమో వేంకటేశాయ' అనే తెలుగు మాసపత్రికను ప్రారంభించి జనవరి 2008 నుండి దీనిని 'శ్రీవేంకటేశం' అనే పేరుతో మార్పు చేసి ప్రచురిస్తున్నాము. ఈ పత్రిక ద్వారా శ్రీవేంకటేశ్వరుని యొక్క తత్త్వమును, ఆధ్యాత్మిక రచనలను, భక్తుల అనుభూతులను తెలుపుచున్నాము. ఏప్రిల్ 2007 నుండి 2023 వరకు 17 సంవత్సరములు పూర్తి చేసుకుని 18వ సంవత్సరం లోనికి అడుగిడింది.

భజగోవిందం

దీనిని కూడ శ్రీవేంకటేశ్వరుని ప్రేరణతో ప్రారంభించాము. భక్తులు తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి పర్వదినాలలో హరినామ స్మరణ చేసి తరించాలన్నదే దీని ముఖ్యోద్దేశం. ఈ భజగోవిందం అనే కార్యక్రమం 2009 సంవత్సరం నుండి ప్రారంభించబడ్డది. ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి మరియు వైకుంఠ ఏకాదశి రోజున మాత్రమే దీనిని నిర్వహించెదము. హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాలలో దీనిని నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమంలో భజగోవిందం, హరినామ స్మరణ కీర్తనలు, ప్రవచనములు, అనుగ్రహ భాషణ మొదలగునవి ఉండును. భక్తులను భగవత్ కృపకు పాత్రులను చేయుటే దీని లక్ష్యం.

సాధన చేయుమని సూచించుట

శ్రీవేంకటేశం మాసపత్రికను ప్రారంభించిన తరువాత 2007 సంవత్సరం నుండి ఎక్కువ సాధన చేయుమనే విధంగా ఆదేశించుట మొదలుపెట్టాడు. నన్ను ఇంజనీరింగ్ కళాశాలలో మాస్టర్ డిగ్రీలో చేర్పించి, ఆధ్యాత్మిక ఉన్నతిని సాధించమని చెప్పాడు.

2004 సంవత్సరం నుండి 2008 సంవత్సరం వరకు మాలో చాలా మార్పు కలిగించాడు. ఈ సేవను చేయుచు స్వామి వారి గురించి సాధన చేయుమనే విధంగా సూచించాడు. సంఘంలో అందరి మధ్యన జీవిస్తున్నప్పటికీ ఎలాంటి విషయ వాసనలకు లోను కావద్దని చెప్పాడు. అన్య మతస్థుల మధ్య నివసించు హరిదాసు లాంటి జీవితమును గడపమన్నాడు. ఒకసారి ''నీవు ''నా'' అన్నది వదిలించుకుంటే మంచి బహుమానం ఇస్తానన్నాడు. స్వామివారి బహుమానానికి ఆశపడి ఒక రెండు మూడు నెలలు 'నా' అన్నది వదులుటకు ప్రయత్నించి 'బహుమానం' అని అడిగాను. కాని ఇంకా నీకు యోగ్యత సిద్ధించలేదన్నాడు. ఇలా రెండు పర్యాయములు

అయిన పిదప మూడవ పర్యాయంగా నేను 'నా' అన్నది వదిలించుకోలేదని తెలుపుటకు తిరుపతి నుండి ''శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామి'' వారిని గురువుగా పంపి నాది నేను నా అంతరంగం తెలుసుకొనునట్లు చేశాడు. అంటే ఇంకా నేను 'నా' అన్నది వదలలేదని స్పష్టం చేశాడు. దీనిని సాధించుటకు సాధన చేయమన్నాడు. అప్పుడే అది సాధ్యమౌతుందని, బహుమానాన్ని పొందే యోగ్యుణ్ణి అవుతానని స్పష్టంగా చెప్పాడు.

మా తల్లి ఋణం తీర్చుకొనుట

14-10-2008 తేది రోజున మా అమ్మ స్పృహ తప్పి హాస్పిటల్ లో చేరింది. ఇదే ఆమెకు ఆఖరి రోజని తెలిసి చాలా విలపించాను. మనిషికి ఎన్నో జన్మలు లభించవచ్చు. కాని ప్రస్తుతము నాకు లభించిన ఈ జన్మ అత్యంత ఉత్తమమైంది. ఒకవేళ భగవంతుడు ప్రత్యక్షమై నీకు, భారతదేశ ప్రధాని, భారత రాష్ట్రపతి, భారతదేశ కుబేరుడు, ప్రపంచ కుబేరుడు లేక ప్రస్తుతమున్న పుల్లగూర్ల సాయిరెడ్డి జీవితాలలో ఏది కావాలని అడిగితే పుల్లగూర్ల సాయిరెడ్డి జీవితాన్నే కోరుకుంటాను. అంతటి ప్రధానమైంది నా ఈ జన్మ. ఎందుకంటే బహుశా నాకు తెలిసిన ఏ భక్తులూ స్వామివారి ఇంతటి అనుగ్రహానికి పాత్రులు కాలేదు. నా అదృష్టాన్ని ఒకసారి అర్జునునితో, ఒకసారి ద్రౌపదితో, కుంతితో, మరోసారి బలిచక్రవర్తితో పోల్చుకున్నానంటే స్వామి కల్పించిన అనుగ్రహము ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంతటి అనుగ్రహాన్ని పొందుటకు నాకు లభించిన ఈ జన్మయే కారణం. ఒకానొక సందర్భంలో శ్రీవేంకటేశ్వరుడు నా శరీరాన్ని స్పృశించాడు. పైగా ఇది కల కాదు నిజమే అంటూ నిదర్శనాలు కూడా చూపించాడు. నేను ఎంతటి అనుగ్రహానికి పరవశించి ఈ జీవితం మొత్తం ఆయనకు ఋణపడి ఉన్నానని భావించి, ఆ ఋణం తీర్చుకొనుటకు జీవితాంతం సేవ చేయ సంకల్పించుకున్నానో, అంతటి అనుగ్రహాలను నేను 14 పొందినట్లు శ్రీవేంకటేశ్వరుడు ఒకానొక సందర్భంలో చెప్పాడు. అంటే నేను కనీసం 14 జన్మలెత్తి, ఈ జన్మములో చేసినంత సేవ చేస్తే ఆయన ఋణాన్ని తీర్చుకోగలనన్న మాట. ఇంతటి అమూల్యమైన జన్మను ప్రసాదించిన నా తల్లి తండ్రులకు ఋణం తీర్చుకోవాలనే బలమైన కోరిక నాలో కలిగింది. కాని నేను స్వామివారి భక్తుణ్ణి కాకపూర్వమే, 1990 సంవత్సరం లోనే మా తండ్రి చనిపోయాడు. కావున ఆయనకు ఋణం తీర్చుకునే అవకాశం రాలేదని బాధపడ్డాను. ఇప్పుడు 2008 సంవత్సరంలో నేను స్వామివారి భక్తుడనైన తరువాత, మా అమ్మ చనిపోవుచున్నది కావున ఈమెకు ఆమె జీవితానికి ఉపయోగపడే బహుమానాన్ని ఇవ్వాలనిపించింది. కాని అప్పటికే ఆమె స్పృహ కోల్పోయింది. ఏ బహుమానం ఇవ్వాలని ఆలోచించి, చివరికి ''ఈరోజు వరకు నేను సంపాదించిన మొత్తం పుణ్యములో 1/3 వంతు ఆమెకు ధారపోసి, శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించి, ఈ పుణ్యముతో మా అమ్మకు వైకుంఠ ప్రాప్తిని ప్రసాదించమని దీనంగా వేడుకున్నాను. 15-10-2008న మా అమ్మ చనిపోయింది. తరువాత రోజులలో నా కోరిక ప్రకారం మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించానని తెలిపి ఎంతో సంతోషపరచాడు. ఇలా మా అమ్మ ఋణం తీర్చుకున్నాను. కాని మా తండ్రి ఋణం ఇంకా తీర్చవలసి ఉంది.

'శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం'

2009 సంవత్సరం నుండి నేను ప్రయాణించు దిశలో మార్పును కలుగజేశాడు. ఏప్రిల్ 2009 సంవత్సరం నుండి మేము ప్రచురించు ''శ్రీవేంకటేశం'' మాసపత్రికలో 'శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం' అనే

శీర్షికతో మాసపత్రిక ప్రారంభించుటకు స్వామివారు చూపిన అనుభూతులను ధారావాహికంగా ప్రచురించాం. చివరికి ''అనుభూతుల ప్రచురణ ఇప్పుడే వద్దు'' అనే స్వామివారి ఆజ్ఞచే మార్చి 2010 నుండి నిలిపివేశాం.

'హరినామ క్షేత్రం' భావన మరియు మా తండ్రి ఆదేశం

జులై 2009లో ప్రపంచంలో అందరికంటే పెద్దవాడు శ్రీవేంకటేశ్వరుడే. త్రివిక్రముడుగా అతనికి సమానమైనవారు మరొక్కరు లేరు అనే జ్ఞానమును కలుగజేశాడు. ఆయన పాదాలను అత్యంత భక్తి శ్రద్ధలతో, సంగీతం మేళవించిన పాటలతో సేవించినచో జీవితం ధన్యం కాగలదని దిశా నిర్దేశం చేశాడు. 2009 సంవత్సరంలో కార్తీకమాసంలో తిరుమల ఆలయ ప్రతిరూపమును అవసరమైన కొన్ని మార్పులతో వెండివాకిలి వరకు నిర్మించి స్వామివారి అఖండ హరినామ క్షేత్రమును స్థాపించాలనే కోరికను మొదటిసారి కలుగజేశాడు. కొంత కాలము దీనికై ఆలోచించిన తరువాత నా సామర్థ్యము సరిపోదని భావించి విరమించుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మరువలేదు. 2014 సంవత్సరంలో మళ్ళీ దీని గురించి తీవ్రంగా ఆలోచించే విధంగా చేశాడు. నేను పరీక్షలో పాస్ కావాలంటే 'హరినామ క్షేత్రము'ను నిర్మించి తీరాలని సూచించాడు. పైగా స్వర్గస్థులైన మా తండ్రి గారిని నా వద్దకు పంపి ''నీవు అనుకుంటున్నది చేయమని, దాని వలన నా స్వామివారు మరియు నేను తన కొడుకైనందున, తాను సంతోషించుదున'ని కూడా చెప్పారు. కాని ఏ ప్రాంతములో దీనిని ఏర్పాటు చేయవలెనో చెప్పలేదు. తరువాత రోజులలో మా తండ్రి గారిని ఎన్నోసార్లు నా వద్దకు పంపి, నాకు యోగ్యత సిద్ధించుటకు మరియు నాలో 'నా' అన్నది లేకుండా చేయుటకు సహకరించునట్లు చేశాడు. ఈవిధంగా నేను మా తండ్రి ఋణం తీర్చుకోవాలంటే హరినామ క్షేత్రమును ఏర్పాటు చేసి తీరాలనే దిశా నిర్దేశం చేశాడు.

నిజానికి నేను కూడా ఈ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయాలని చాలా రోజులనుండి ప్రయత్నిస్తున్నాను. కాని నావల్ల కాలేదు. ఎంత ప్రయత్నించినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఇంతకు ముందు ప్రసాదించిన 6 సేవలను సులభంగా, స్వామివారి సహకారంతో చేయగలిగాను. కాని దీనికి మాత్రం స్వామివారిని ఎంత ప్రార్థించినప్పటికీ లాభం లేకపోయింది. స్థలాన్ని కూడా సూచించలేదు. కాబట్టి దాదాపు విరమించుకున్నాను.

స్వామివారికి బొట్టు పెట్టుట

స్వామివారికి 16 సంవత్సరములలో మొత్తం 111 కోట్ల జప సమర్పణలో కాని, మరో సేవను కాని నేను కేవలం ఆయన ఋణం తీర్చుకొనుటకు చేశానే తప్ప మరోటి ఆశించి కాదు. శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందాలనే ఆశ నాలో ఏ మూలన లేకుండెను. కాని 2016 సంవత్సరం నుండి స్వామివారిని పొందాలనే ఆశ చిగురించింది. 2018లో 16వ 7 కోట్ల జప సమర్పణ తరువాత ఈ కోరిక నెరవేరబోతోందని భావించాను. స్వామివారు మా ఇంటికి వస్తే, మా ఇంటిలో ఎక్కడ కూర్చోబెట్టాలని, ఇంటిని ఏ విధంగా అలంకరించాలని కూడా ఆలోచించాను. అన్నట్లుగనే 2018వ సంవత్సరంలో 16వ జప సమర్పణ కావించిన పిదప, ఈ మొత్తం 111 కోట్ల జపసమర్పణ పుణ్యంతో స్వామివారికి బొట్టుపెట్టి ఇంటికి ఆహ్వానించాను. కాని ఆ రోజు రాత్రి ''నీవు పరీక్ష పాస్ కాలేద''ని సూచించాడు. ఎందుకో నాకు అర్థం కాలేదు. తెలిసి నేను ఎలాంటి పొరపాటు చేయలేదు. స్వామివారు చాలా పెద్దవారు. ఆయనకు ఎన్నో పనులుంటాయి, వీలు చూచుకొని వస్తాడనుకొన్నాను. అయినా నా సంకల్పం, సేవ చేయుటయే కావున, 2018 సంవత్సరంలో ఈ జప సమర్పణ కార్యక్రమమును ఆపివేయకుండా, జీవితాంతం కొనసాగించ నిర్ణయించుకున్నాము. ఇక రథయాత్రను మాత్రం 2020 వరకు అంటే నా వయస్సు 60 సంవత్సరములు నిండేవరకు చేయ నిర్ణయించుకొని కొనసాగించాము. కాని శ్రీవేంకటేశ్వరుడు ఎప్పుడో ఒకప్పుడు తప్పక మా

ఇంటికి వచ్చుదురనే నమ్మకం నాలో బలంగా ఉండేది. ఇక 2020 వ సంవత్సరంలో 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ సమయాన కోవిడ్-19 కారణంగా నమోవేంకటేశాయ రథయాత్ర చేయకనే 7 కోట్ల జప సమర్పణ చేశాము. జపమును తిరుపతికి పంపి టిటిడి అధికారులచే జపసమర్పణ కావింపచేశాము. మేము మాత్రం తిరుపతి వెళ్ళక మా ఇంటిలో రథం షెడ్డు ముందు యజ్ఞం చేసి స్వామివారిని ప్రార్థించాము.

శ్రీనివాస కళ్యాణాల ఏర్పాటు

ప్రతి తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి రోజులలో హైదరాబాద్ లో భజగోవిందం ఏర్పాటు చేసేవారిమి. కాని కోవిడ్-19 పరిస్థితుల వలన తేది 01-07-20, తొలి ఏకాదశి, నా 60వ పుట్టినరోజు 'భజ గోవిందం'ను నిర్వహించలేక దిగులు చెందాను. చివరికి 8 మంది సమక్షంలో మా ఇంటిలో శ్రీనివాస కళ్యాణాన్ని నిర్వహించాము. అంత పెద్ద స్వామి కళ్యాణాన్ని ఏకాంతంగా నిర్వహించుటను చాలా చిన్నతనంగా భావించి బాధ పడ్డాను. నా స్వామికి అవమానంగా భావించాను. ప్రతీకారేచ్ఛతో రగిలిపోయాను. చివరికి కొన్నివేల మంది సమక్షంలో, వందల కళ్యాణాలను, వివిధ ప్రాంతాలలో, భక్తులు భాగస్వాములుగా ఉంటూ నిర్వహించాలని, ఈ సేవను ప్రసాదించమని దీనాతి దీనంగా వేడుకున్నాను. తేది 19-07-2020న శ్రీనివాస కళ్యాణాల విధి విధానాలను కూడా నిర్ణయించుకున్నాను. దాని ప్రకారం మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాలను శాస్త్రోక్తంగా, వివిధ ప్రాంతాలలో, కనీసం సంవత్సరానికి 7 కళ్యాణాలకు తగ్గకుండా నిర్వహించాలి. ఈ కళ్యాణాలు జప సమర్పణ మాదిరి కాకుండా, ఒక సంవత్సరంలో ఎన్నిచేస్తే అవన్నీ లెక్కలోనికి వచ్చునని ముందే నిర్ణయించుకున్నాము. ఇది సంకల్పం. స్వామివారు ఈ సంకల్పాన్ని అనుగ్రహించారు. పైగా నాకు సంబంధించిన, నాతో కాని, నా సేవతో సంబంధమున్న అందరికీ స్వామి అనుగ్రహము లభించేటట్లు చేయమన్నారు. నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామము అప్పనపల్లిలో, మా సొంత గ్రామము చిన్నగుండవెల్లిలో తప్పక నిర్వహించమని సెలవిచ్చారు. పైగా ఈ కళ్యాణాల కార్యక్రమమునకు 'శ్రీ ఆండాళ్' రూపంలో 'పద్మావతి' అమ్మవారి అనుమతి కూడా లభించింది. ఈ కార్యక్రమానికి నాకంటే ఎక్కువ ఆత్రుత స్వామివారికి ఉన్నట్లు తెలియజేశాడు. కాని కోవిడ్-19 నిబంధనల వలన, ప్రభుత్వం వారు ఆధ్యాత్మిక సమావేశాలను అనుమతించనందున కొంత విరామం దొరికింది. సంది కాలం, లక్ష్యానికి శిక్షణ ఇచ్చుట ప్రారంభించాడు.

అనుభూతులను చదవమని కోరుట

అసలు కథ ఇప్పుడే మొదలైంది. గత 20 సంవత్సరాల నుండి స్వామివారి దివ్యమైన అనుభూతులను ఎన్నో పొందాను. అన్నింటిని ఒక 6 పుస్తకములలో వ్రాసి భద్రపరిచాను. వాటిని మొత్తం ఒకేసారి ఎప్పుడూ చదవలేదు. మాసపత్రికకు సంబంధించిన అనుభూతులను ప్రచురించినప్పుడు దానికి సంబంధించిన, అప్పటివరకు పొందినవి మాత్రమే చదివాను. తేది 25-11-2020 ప్రాంతమున శ్రీవేంకటేశ్వరుడు, నా మొత్తం అనుభూతులను వెంటనే చదువమని ఆజ్ఞాపించాడు. అప్పుడు నా అనుభూతులు వ్రాసిన పుస్తకములను వెతకగా మొత్తం 6 పుస్తకములలో, బుక్ నెం.1,2 జిరాక్స్ కాపీలు, బుక్ నెం. 5,6 ఒరిజినల్స్ మాత్రమే దొరికాయి. బుక్ నెం. 3 లో కొంత భాగము, మరియు బుక్ నెం. 4 పోయాయి. 18-08-2009 తేది నుండి 24-02-2011 తేది వరకు పొందిన అనుభూతులు లభించలేదు. లభించిన వాటిని చదివి అర్థం చేసుకొనుటకు నాకు రెండున్నర నెలలు పట్టింది. స్వామివారి లీలలలోని రహస్యం కొంతవరకు అర్థం అయినది. నిజానికి శ్రీవేంకటేశ్వరుడు నన్ను ఒక పనిముట్టులాగ ఎంచుకొని, తన హరినామ క్షేత్రం ఏర్పాటు చేయుటకు ప్రయత్నిస్తున్నాడని అర్థం చేసుకున్నాను. మరియు ఎంతవరకైతే నేను హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయనో, అంతవరకు పరీక్షలో పాస్ కాను అని కూడ తెలుసుకున్నాను.

శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వస్తానన్న విషయం వట్టిమాట కాదని, నిజానికి స్వామివారు మా ఇంటికి రావటానికి, నన్ను యోగ్యుణ్ణి చేయుట కొరకు ఇంత కష్టపడుచున్నారని, నేను మాత్రం దీనిని సరిగా పట్టించుకోక, సరైన విధంగా అర్థం చేసుకోక చాలా పెద్ద తప్పు చేశానని కుమిలిపోయాను. స్వామివారి లీలల యందు సంపూర్ణ విశ్వాసమును కలిగి ఆ దిశగా పయనించనందుకు చాలా చింతించాను. అత్యంత సాధారణ, అధమ స్థాయి వ్యక్తినైన నన్ను ఎన్నుకొని, నాపై నమ్మకంతో, ఒక పనిని అప్పగించితే దానిని సరిగ నిర్వహించలేక ఆయన ముందు తల దించుకుని ఏడుస్తూ క్షమించమని నిలబడ్డాను. నేను ఒక అయోగ్యుడనైన సేవకుడనంటూ, మీలాంటి పెద్దలకు నాలాంటి సేవకుడు ఉండుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు దెబ్బతింటాయని భావించి విలపించసాగాను. ఒక దశలో వారి సుదర్శన చక్రాన్ని ప్రార్థించి నేను మీ స్వామికి అపకారము చేశాను, నన్ను సంహరించమని వేడుకున్నాను.

పందెంలో ఓడిపోవుట

ఒక్క మాటలో చెప్పాలంటే తేది 16-12-2020న నేను పందెంలో ఓడిపోయానని తెలుసుకున్నాను. గత 18 సంవత్సరాల నుండి అంటే 2002 సంవత్సరం నుండి 2020 వరకు ఒక్కరోజు విరామము లేకుండా, రాత్రింబవళ్ళు స్వామివారి సేవపైననే దృష్టినిలిపి, ఒక్క తప్పు చేయకూడదని భావించి ఎంతో కఠోరంగా స్వామి సేవ చేసినప్పటికీ పందెంలో ఓడిపోయాను. ఫలితంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందే భాగ్యాన్ని పోగొట్టుకున్నాను. కఠోర సాధన చేశాను. 2007 సంవత్సరం లోనే నన్ను దగ్గరనుండి గమనించిన శ్రీమాన్ డా॥ రమణాచారి గారు నా సేవా ఆర్తుతను, తపనను చూచి నేను శ్రీవేంకటేశ్వరుని దివ్య దర్శనమును పొందాననే అనుమానమును వెలిబుచ్చాడు. ఈ కలియుగములో కేవలం మీ నామస్మరణ చేయుచు, మీ పాదాలను దర్శించే అత్యంత సాధారణ మానవునికి కూడ తమ దివ్య దర్శన భాగ్యము కలుగుతుందనే దానికి నిదర్శనముగా నన్ను ఎన్నుకోవాలనే కోరికకు అనుగుణంగా సాధన చేశాను. సేవ చేసి స్వామివారి మెప్పు పొంది, బోనస్ కు యోగ్యుణ్ణి అవుతాననే నమ్మకము నాలో ఎంతో ఉండెను. 2002 సంవత్సరం నుండి, సంఘం నుండి వెలివేయబడ్డ వ్యక్తి లాగ, ఎవరితో కలవక ఏకాంతంగా స్వామిని స్మరిస్తూ జీవితం గడిపాను. అయినప్పటికీ శ్రీవేంకటేశ్వరుడు ఆశించిన స్థాయికి చేరుకోలేకపోయాను. నిజానికి నాకు స్వామివారిని పొందలేకపోయాననే బాధ కంటే నేను ఒక అయోగ్యుడనైన సేవకుడననే బాధ నన్ను కలచివేసింది. నా వలన నా స్వామికి అపకీర్తి తెచ్చుటను సహించలేకపోయాను. ఈ అసమర్థ సేవకుడిని సంహరించమని లేక తరుణోపాయం సూచించమని దీనాతి దీనంగా వేడుకున్నాను. అపరాధ భావము నా ఒళ్ళంతా నిండుకున్నది. ప్రతి క్షణము క్రుంగిపోయాను. నిజానికి నేను ఏ తప్పూ చేయలేదు. విధి వక్రీకరించి ఓడిపోయానే తప్ప, తప్పు చేసి ఓడిపోలేదు. అది ఈవిధంగా జరిగింది.

మా తల్లి 2008 సంవత్సరములో చనిపోవునప్పుడు, ఆమెకు వైకుంఠ ప్రాప్తి నిమిత్తమని అప్పటివరకు, అంటే అక్టోబర్-2008 వరకు నేను ఆర్జించిన పుణ్యంలో మూడవ వంతు ఆమెకు సమర్పించాను. 2008 సంవత్సరం వరకు 6 పర్యాయాలు జపసమర్పణ జరిగింది. అందులో నుండి మూడవ వంతు, అంటే 2 సంవత్సరముల ఫలమును మా అమ్మకు సమర్పించాను. కావున నేను స్వామివారికి సంకల్పించిన 111 కోట్ల జపము, 16 సంవత్సరాలు కావాలంటే 2018 సంవత్సరానికి బదులు 2020 సంవత్సరానికి మార్చబడిందన్నమాట. 2020 సంవత్సరంలోని 7 కోట్ల జప సమర్పణ నా సంకల్పాన్ని పూరించుతుంది. కాని ఆ సంవత్సరం కోవిడ్-19 కారణంగా రథయాత్ర చేయకనే 7 కోట్ల జప సమర్పణ జరిగింది. అంటే, 70 వేల మంది భక్తులు భాగస్వాములుగ లేకుండగనే 7 కోట్లు సమర్పించాము. ఫలితంగా రెండవ తప్పు జరిగి ఓడిపోయాను. ఈ విధంగా విధి వక్రీకరించుటచే, నేను తప్పు చేసిన వాడిలా ఓడిపోయాను.

'శ్రీ భరతుణ్ణి' అనుసరించమని సూచించుట

అసలు ఈ తప్పు ఎలా జరిగింది? విధి ఏ విధంగా వక్రీకరించింది? విధి శ్రీవేంకటేశ్వరుని చేతిలో ఒక పనిముట్టు మాత్రమే. అలాంటిది శ్రీవారి ఆజ్ఞ లేకుండా ఇది జరగదనిపించింది. శ్రీవేంకటేశ్వరుడే కావాలని చేశాడనిపించింది. ఈ ఆలోచన నాలో రాగానే ''నీవు భరతుణ్ణి అనుసరించ''మంటూ పదే పదే భావాలు రాసాగాయి. మరియు నా దుఃఖాన్ని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఈ రాత్రి అంటే తేది 22-12-2020 న కలలో మా కుటుంబము నిర్వహించిన శ్రీవారి కళ్యాణము లాంటి ఉత్సవానికి వచ్చిన భక్తులందరూ తిరుపతి లడ్డూలను బహుమానంగా ఇచ్చారు. దీని అర్థాన్ని కేవలం శుభసూచకంగా భావించి, అర్థం చేసుకునే అర్హత సాధించనందున, సరిగా అర్థం చేసుకోక అలాగే దుఃఖించసాగాను. స్వామివారికి నాపై కోపమున్నదని భావించి, ప్రత్యేక పూజలు చేయుట ప్రారంభించాను. మరియు మీరు నన్ను ఎం.టెక్ మాత్రమే చదువమన్నారు. నేను పిహెచ్.డి కూడా చేయుటకు సిద్ధం ప్రభూ! అంటూ తెలియచేస్తూ తీవ్రమైన సాధన చేయసాగాను. అప్పటికే మానసికంగా చాలా మార్పు చెందిన నేను, స్వామివారి మరో లీల ద్వారా పుత్రులపైన, కుటుంబం పైనున్న వ్యామోహాన్ని సమూలంగా త్రుంచివేశాడు. నాకు ఆప్తుడు శ్రీవేంకటేశ్వరుడు మాత్రమే అని బలంగా భావించి, ఆయన సేవలకు మరింత డబ్బును అత్యంత ఆనందంగా ఖర్చు చేయాలనే భావం బలపడ్డది.

భాగవతుల ఆశీర్వాదముచే విజయము సాధించుట

చివరికి నా దుఃఖాన్ని సహించలేక తేది 13-02-2021 రోజున తిరుపతి లడ్డూలను బహుమానంగా పొందుట లోని సరైన అర్థమును ఈ విధంగా చెప్పారు. ''నీవు భాగవతుల ఆశీర్వాద ఫలముచే విజయము సాధించావు'' దుఃఖించకుమని సెలవిచ్చారు. అంటే నా సేవ ద్వారా 2002 సంవత్సరం నుండి 2023 వరకు ఎందరికో నా వలన భగవంతుని కృప లభించింది. ఆ భాగవతుల ఆశీర్వాద ఫలితముగా నీవు గెలిచావు అని నన్ను ఊరడించాడు. అంటే భాగవతుల ఆశీర్వాదమనే గ్రేస్ మార్కులతో పాస్ అయ్యావని సూచించాడు. వెంటనే ఈ విజయమును భాగవతులకు అంకితము చేశాను. ఎందుకో నేను ఈ విజయాన్ని జీర్ణించుకోలేకపోయాను. నాకు కేటాయించిన స్వామివారి సేవలో ఇతరుల జోక్యాన్ని జీర్ణించుకోలేదు. భాగవతులంటే నాకెంతో ఇష్టం, గౌరవం. కాని ఈ విషయంలో మాత్రం జీర్ణించుకోలేకపోయాను. వెంటనే స్వామివారిని ఇలా ప్రార్థించాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! నేను ఈ విజయమును కోరుకోవడం లేదు. దయచేసి ఈ విజయమును భాగవతులకు పంచిపెట్టి నాకు మరో అవకాశమును ప్రసాదించమని వేడుకున్నాను.

శ్రీనివాస కళ్యాణాలను మరో అవకాశంగా ప్రసాదించుట

స్వామివారు దీనికి ఒప్పుకొని మరో అవకాశంగా 'శ్రీనివాస కళ్యాణాలను' ప్రసాదించారు. నేను మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలను అత్యంత సమర్థవంతంగా, ఒక్క తప్పు లేకుండా నిర్వహించి, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి బొట్టు పెట్టి మా ఇంటికి ఆహ్వానించాలి. ఈ రెండవ పర్యాయపు సేవలో శ్రీ 'భరతుణ్ణి' అనుసరించమన్నారు. నిజానికి రామాయణంలో శ్రీ భరతుడిది విశిష్టమైన పాత్ర. తప్పు చేయకున్నా శిక్ష అనుభవించాడు. నేను ఏ తప్పూ చేయలేదని శ్రీరాముణ్ణి వేడుకున్నప్పటికీ విధి అనుసారం శిక్షను అనుభవించమన్నాడు. చివరికి భరతులవారు శ్రీరాముని ఆజ్ఞానుసారం శిక్ష అనుభవించాడు. ఫలితంగా రామాయణం ఏర్పడింది. శ్రీరాముని కృప, ఆదర్శం తరతరాల లోకవాసులకు కలిగింది. భరతుడు అత్యంత త్యాగ గుణంతో రాజ్యపాలన చేయుచు, శ్రీరాముని రాకకై తపించిపోయాడు. శ్రీరాముడు అయోధ్యకు రావటానికి ఒక్కరోజు ఆలస్యమైనా భరించలేని తపనను పొందాడు.

నన్ను ఇదేవిధంగా ఈ కళ్యాణాల సంకల్పమును నెరవేర్చుచు, శ్రీవేంకటేశ్వరుని కొరకు వేచి చూడమన్నారని భావించాను. చివరికి ఈ విధంగా నేను రెండవ సంకల్పాన్ని స్వీకరించాను. మరియు ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మొదటి ప్రయత్నం ట్రయల్ రన్ లాంటిదని, ఇప్పుడే నిజమైన పందెం అని భావించుకున్నాను.

పట్టుదల పెరుగుట

గతంలో శ్రీవేంకటేశ్వరుడు నేను కోరకముందే రకరకాలుగా అనుగ్రహించి, 6 సేవలను ఏర్పాటు చేయుటకు కారకుడైనాడు. కాని ఈ 7వ సేవగా హరినామ క్షేత్రం ఏర్పాటుకు అవసరమైన శ్రీవారి దివ్యదర్శనమును పొందే విషయములో మాత్రం, నన్ను యోగ్యతను పెంచుకోమని మరీ మరీ సూచించాడు. గతంలో అడ్డురాని యోగ్యత స్వామిని పొందుటలో అడ్డు వస్తున్నది. బహుశా ఇది ఆయన ఏర్పాటు చేసిన విధి విధానం. దీనిని ఎవ్వరూ అతిక్రమించుటకు వీలులేదు. మనకు నేరుగా ఉడికిన అన్నాన్ని ప్రసాదించక, పైరు వేసి, కోసి, బియ్యం తీసి, ఉడికించిన తరువాతనే అన్నం ఏర్పడినట్లు, స్వామిని పొందాలంటే తగిన సాధన చేసి యోగ్యతను మానవుడు సాధించాలనే విధి నిర్ణయం ప్రకారం స్వామివారు ఈ పద్ధతిని అనుసస్తున్నారనిపించింది. నాకు ప్రసాదించిన 6 సేవల ఫలితమును స్వామికి సమర్పించి, దానితో పాటు కావలసిన సాధన చేసి, యోగ్యతను సాధించి, స్వామి మెప్పు పొంది మాత్రమే దీనిని సాధించగలము అని భావించాము.

ఈసారి నాలో పట్టుదల ఎంతో పెరిగింది. ఎలాగైనా యోగ్యతను సాధించాలని భావించి గతంలో చేసిన తప్పులను చేయకుండా చూచుకున్నాను. ఇంతకుముందు వ్యాపారం మానేసినప్పటికీ, అప్పుడప్పుడు సేద తీర్చుకొనుటకు ప్లాట్లు కొని అమ్మేవాడిని. మరియు నలుగురితో కలిసి సరదా మాటలు మాట్లాడేవాణ్ణి. ఇలా ఎప్పటికీ స్వామిని స్మరించక సేద తీర్చుకొనుటకు అప్పుడప్పుడు గ్యాప్ ఇచ్చేవాణ్ణి. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూచుకున్నాను. మరియు సంకల్పాన్ని సాధించుటకు విశ్వప్రయత్నం చేయుటను ప్రారంభించాను. స్వామివారే స్వయంగా నా ప్రయత్నాలను మెచ్చుకుంటూ ప్రోత్సహించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి. నేను సాధించగలననే విశ్వాసాన్ని నాలో కలుగజేశాడు. ఒకసారి ''నేను చెప్పినట్లు 'నా' అన్నది నశింపచేసుకుని ఉండి ఉంటే ఎప్పుడో సాధించేవాడివి, కాని దూరపు మార్గాన్ని ఎన్నుకొని కష్టపడుచున్నావు'' అయినప్పటికీ సాధించగలవని అన్నారు.

ఇప్పుడు నేను హరినామ క్షేత్రమును ఎక్కడ ఏర్పాటు చేయాలని ఆలోచించాను. తెలిసిన వారినందరినీ తగిన ప్రాంతము సూచించమని వేడుకొన్నాను. మా ఇంటికి దగ్గరి ప్రాంతములు చూచాను. ఒకసారి మా వూరు చిన్నగుండవెల్లి లోని మా ఇల్లును హరినామ క్షేత్రంగా మార్చి అక్కడ పెట్టాలనుకున్నాను. డా॥ రమణాచారి గారు కొండపాకలో ఉన్నవారి ఆశ్రమములో పెట్టుకొమ్మని సూచించారు. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం తాను సూచించిన ప్రాంతంలోనే నెలకొల్పమని స్పష్టంగా చెప్పారు. చివరికి ఈ క్షేత్రం ఎక్కడ ప్రారంభించాలనే విషయం మీరే చెప్పమని, మీ సహాయం లేకుండా నాకు సాధ్యం కాదని చెప్పాను. ఈ హరినామ స్మరణ చేయు భక్తులను ఆకర్షించుట, వారి కోరికలను నెరవేర్చుట, తృప్తి పరచుట మొదలగునవి మీరు చేస్తేనే ఇది సాధ్యం. ఈ సహాయం చేయమని వేడుకున్నాను. మరియు మా తండ్రి సహాయాన్ని కూడా సమకూర్చమని వేడుకున్నాను. స్వామి వారు సరే అన్నట్లు సంకేతం పొందాను.

కళ్యాణాల కార్యక్రమం ప్రారంభం

చివరికి 20-07-2021 తేదీ తొలి ఏకాదశి రోజున శ్రీశ్రీశ్రీ పుష్పగిరి స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణ, మరియు మంగళాశాసనములతో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సంకల్పించిన మొత్తం 111 కళ్యాణాలలో మొదటి కళ్యాణం

శ్రీశ్రీశ్రీ పుష్పగిరి స్వామివారిచే ప్రారంభమైన 111 కళ్యాణాల కార్యక్రమం

హిమాయత్ నగర్ టిటిడి హాలులో జరిగింది. ఆ తరువాత కళ్యాణాలు జరుగుచున్నవి. ప్రతి కళ్యాణం స్వామిని చేరుటకు ఒక మెట్టుగా భావించి, అత్యంత ఆర్తుతతో, ఏ తప్పు జరగకుండా చేస్తున్నాము. ప్రతి శ్రీనివాస కళ్యాణం, ఒక మాస్ కళ్యాణం లాగా, వీలైనంత ఎక్కువమంది భక్తులు చూచేవిధంగా ఏర్పాట్లు చేయుచు, నిర్వహిస్తున్నాము.

ఫలితాన్ని భాగవతులకు పంచుట

స్వామివారు భాగవతుల ఆశీర్వాద ఫలితంగా గెలిచావని చెప్పినప్పుడు వారే దీనికి అర్హులు అని భావించి, ఆ ఫలితాన్ని వారికి పంచమన్నాను. కాని నా మనసులో ఈ మొత్తాన్ని ముద్రించుకోలేదు. స్వామివారిపై ఆశ చావలేదు. కాబట్టి మళ్ళీ ఒకసారి బయటికి వచ్చి నన్ను బాధించాయి. మళ్ళీ కుమిలిపోయాను. నా ముఖమును చూపుటకు కాని, గుడిలోనికి వెళ్ళి స్వామిని దర్శించుకొనుటకు కాని యోగ్యత లేనివానిగ భావించి దుఃఖించాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు 'నీవు విజయం సాధించావు' అని తెలిసినప్పటినుండి అన్ని అనుభూతులను వెంటనే చదువమని మళ్ళీ ఆజ్ఞాపించాడు. వాటిని తిరిగి చదివిన తరువాత పశ్చాత్తాపముతో స్వామిని క్షమించమని వేడుకున్నాను. మళ్ళీ అడగనని, పలితాన్ని భాగవతులకు పంచమని దీనంగా వేడుకున్నాను. అన్నట్లుగనే 25-08-2021 తేదీ నాడు 2002 సంవత్సరం నుండి 2023 వరకు జపము వ్రాసిన భక్తులందరికీ ప్రత్యేక ప్రసాద రూపకంగా ఈ విజయమును పంచిపెట్టాడు. నేను సేవకుణ్ణి తప్ప మరేదీ ఆశించకూడదని, సేవే నాకు భాగ్యమని భావించి కళ్యాణాల యందు దృష్టి నిలిపి సేవ చేస్తున్నాను.

స్వామి వారి దీవెనలను పొందుట

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం దసరా – 2002 నుండి ప్రారంభించబడ్డది. నేనెప్పటికీ స్వామివారికి ఋణపడి ఉండాలని తలంచి, 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ తరువాత అంటే దసరా 2020 తరువాత, వెనువెంటనే ''శ్రీనివాస కళ్యాణాల'' కార్యక్రమమును చేస్తానని తలంచాను. అంటే శ్రీనివాస కళ్యాణాల కార్యక్రమము 2020 దసరా నుండి ప్రారంభమైంది. కాని కోవిడ్-19 కారణంగా, ఇది 20-07-2021న మొదటి కళ్యాణంతో ఈ కార్యక్రమము ప్రారంభించబడినప్పటికీ, శ్రీనివాస కళ్యాణాలలోని నిబంధన ప్రకారం 15-10-2021 దసరా వరకు, కనీసం 7 కళ్యాణాలను నిర్వహించాలి, అందుకు నాకు కేవలం రెండున్నర నెలల కాలమే మిగిలింది. చివరికి స్వామివారిని తీవ్రంగా స్మరించి, ఆయన కృపతో దసరా 2021 వరకు 8 కళ్యాణాలను చేయగలిగాము. ఇలా గెలిపించినందులకు స్వామికి కృతజ్ఞత తెలుపు సమయాన, చిన్న పిల్లలను గెలిపించి, పెద్దలు సంతోషించునట్లు చిరునవ్వు నవ్వి సంతోషాన్ని తెలిపారు. మరియు కొంత సమయము తరువాత మీ ఇంటికి

రాగలనని, ఆ లోపల ఇంటి నిర్మాణానికి కావలసిన పనులు చూచుకొమ్మని కూడా చెప్పారు. శ్రీవేంకటేశ్వర కృపా కటాక్షాలు సిద్ధిరస్తు అంటూ దీవించాడు కూడా.

హరినామ క్షేత్ర స్థలమును తెలుపుట

స్వామి వారి హరినామ క్షేత్రం ఎక్కడ నిర్మించాలో తెలుపమని తీవ్రంగా ప్రయత్నించాను. లౌకికమైన విషయ వాసనలను పూర్తిగా త్యజించి, స్వామి చెప్పినట్లు నడుచుకుంటూ, సంకల్పసిద్ధే ధ్యేయంగా జీవించాను. ఒకానొక సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు ''నీవు పూజ గదినే పడకగది''గా చేసుకొని జీవిస్తున్నావంటూ చమత్కరిస్తూ ప్రోత్సహించాడు. కోరిక సిద్ధించు సమయమాసన్నమైనదని మార్చి 2022న చెప్పాడు. కోవిడ్ 3వ వేవ్ సందర్భంగా కళ్యాణాలకు గ్యాప్ ఇచ్చి 05-04-2022 తేదీ నాడు రెండున్నర నెలల కొరకు మా పిల్లల వద్దకు అమెరికా వెళ్ళాము. అక్కడ కూడా హరినామ క్షేత్రము గురించి తీవ్రంగా ప్రార్థించసాగాను. చివరికి 16-04-2022 తేదీన నీవు విజయం సాధించావని చెప్పుచు, ఈ హరినామ క్షేత్రమును మా గ్రామములోని మా తోటబావి వద్ద ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. వెంటనే నేను కనీసం 7 ఎకరాల స్థలములో దీనిని నా భాగ్యంగా నిర్మించుదునని చెప్పాను. విజయుణ్ణి చేసినందులకు స్వామివారికి కోటి కోటి ధన్యవాదములు తెలుపుకున్నాను.

హరినామ క్షేత్ర స్థలమును సూచించుటతో, 2000 సంవత్సరం నుండి 2023 వరకు పొందుచున్న అన్ని అనుభూతుల యొక్క అర్థం మారిపోయినట్లనిపించింది. గతంలో మా తోటబావిని ఉపయోగించి ఎన్నో అనుభూతులను చూపెట్టాడు. నా మొదటి అనుభూతి 'శ్రీ ఆంజనేయుడు జైశ్రీరాం' అంటూ అక్కడే పైకెగిరాడు. ఒకసారి ఆ ప్రాంతం మొత్తం విలువగలదిగ మారుతుందని, దుకాణాలు, హోటళ్ళతో జనాలు రద్దీగా ఉండగలరని సూచించాడు. ఒకసారి మా తోటబావి దగ్గరికి చేరుటే లక్ష్యంగా సూచించుచు, లక్ష్యాన్ని చేరేవరకు శ్రీవేంకటేశ్వరుని భక్తులతో కలిసి, అత్యంత భక్తిభావంతో సేవించాలని, అవసరమైతే 3వ సంకల్పాన్ని తీసుకునైనా నీవు లక్ష్యాన్ని మాత్రం చేరవలసి ఉంటుందని కూడ సూచించాడు. కాని ఆ రోజులలో దీనిని గ్రహించలేకపోయాను. ఆ ప్రాంతం ఆధ్యాత్మికంగా చక్కగా ఎదుగగలదని సూచించాడు. సిద్ధిపేట మాస్టర్ ప్లాన్‌లో భాగంగా పెద్ద రోడ్డు కూడ వస్తున్నది.

తిరుమల ఆలయ ప్రతిరూపమును సూచించుట

ఆ తరువాత ఈ ఆలయం ఏ రూపంలో ఉండాలనే ఆలోచన కలిగింది. ఒక నెల రోజులు తర్జన భర్జన పడ్డాను. ఒకసారి స్వామివారి తిరునామం ఆకారంలో నిర్మించాలని భావించాను. నాకు తెలిసిన రక రకాల ఆలయ మోడళ్ళను ఎంచుకున్నాను. కాని తేది 21-05-2022 శ్రవణా నక్షత్రం రోజు తనకు తిరుమల ఆలయ ప్రకారమే, దాని ప్రతిరూపమే కావాలని సూచించాడు. నీకు శక్తి లేకపోతే మొదటి రెండు ప్రాకారాల వరకు అంటే వెండివాకిలి(కొన్ని మార్పులు చేర్పులతో) వరకు నిర్మించమన్నాడు. మరే ఇతర ఆలయ ఆకారాలు వద్దన్నాడు. ఆద మరవక ఈ సంకల్పాన్ని పూరించమని కూడ చెప్పాడు. అమెరికాలో మా స్టేను మరొక్క రోజు పొడిగించక, హైదరాబాద్ వచ్చి, నీ కళ్యాణాల సంకల్పమును అత్యంత త్వరగా పూరించమని మరీ మరీ ఆదేశించాడు.

స్వామివారి కృపతో కళ్యాణాల కార్యక్రమము చక్కగా జరుగుచున్నది. కళ్యాణాలను మెచ్చి ఒకానొక సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు మాకు మిఠాయి తినిపించాడు. ప్రతి కళ్యాణం వైఖానసాగమోక్తంగా, అన్నమాచార్య కీర్తనల మధ్యన ''నమో వేంకటేశాయ'' రథయాత్ర యుక్తంగా, చూచేవారికి తిరుపతి వారే కళ్యాణం చేస్తున్నట్లు ఆనందపడుతున్నారు. కళ్యాణాలలో పాల్గొన్న ప్రతి భక్తుణ్ణి స్వామివారు ఎంతో చక్కగా అనుగ్రహిస్తున్నారు. తేది 30-07-2022రోజున 21వకళ్యాణంగా స్వామివారు సూచించినట్లు మా సొంతవూరు

చిన్నగుండవెల్లిలో కళ్యాణం నిర్వహిస్తున్నప్పుడు మా తండ్రిని నాకు తోడుగా పంపాడు. కళ్యాణ సమయంలో నేను కూడా ఊరందరిచే తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి మా ఊరిలో శాశ్వత నివాసం ఏర్పరచుకొమ్మని ప్రార్థింపచేశాను. స్వామివారు సంతోషించారు. స్వామివారు సూచించినట్లు మా అమ్మమ్మ గారి గ్రామము, అప్పనపల్లిలో తేది 18-03-2023న 40వ కళ్యాణమును నిర్వహించాము. మార్చి 2023 వరకు 41 కళ్యాణాలను చేశాము. శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత ఈసారి నా సాధన చక్కగా జరుగుచున్నదని, ఎలాగైనా ఈసారి పరీక్షలో తప్పక పాస్ కావాలనే దృఢచిత్తముతో ఉన్నావని శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా తెలిపారు. పూర్వపు సేవలైన ప్రతి సంవత్సరము 7 కోట్ల జప సమర్పణ, శ్రీవేంకటేశం మాసపత్రిక యథావిధిగా జరుగుచున్నవి. మరియు వచ్చే కాలములో శ్రీవారి కృపతో మొత్తం 111 శ్రీనివాస కళ్యాణములను నిర్వహించి, వీటన్నిటి పుణ్యఫలముతో బాటు, భాగవతుల శక్తులను, వారి ఆశీర్వాదములను పొందుచు, తిరుమల ప్రతిరూప ఆలయమును కనీసం మొదటి ప్రాకారం (వెండివాకిలి) వరకైనా నిర్మించి, స్వామివారిని తిరుమల నుండి హరినామ క్షేత్రమునకు ఆహ్వానించుచు, సిద్ధిపేట వద్ద నున్న చిన్నగుండవెల్లి గ్రామములో స్వామివారు సూచించిన విధంగా హరినామ క్షేత్రము ఏర్పాటు చేయుట లక్ష్యంగా పయనిస్తున్నాము.

స్వామివారి చతురత

శ్రీవేంకటేశ్వరుడు మహాచతురుడు. 2002 సంవత్సరంలో స్వామివారిని నా జీవితాంతం, నేను తృప్తి చెందే వరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించుమని వేడుకున్నాను. నేను మీ సేవకుడనని, మీ ఋణం తీర్చుకొనుటే నా భాగ్యంగా భావించి, ఈ జీవితాంతం మీ సేవ చేస్తానని చెప్పాను. దాని ప్రకారం స్వామివారు సేవను ప్రసాదించి, నీ కోరిక ప్రకారం సేవను ప్రసాదించాను, దానిని అత్యంత జాగ్రత్తగా ఏ తప్పూ లేకుండా చేసే బాధ్యత నాపై పెట్టారు. ఆ తరువాత 2020 సంవత్సరంలో మొత్తం 16 సంవత్సరముల సేవా ఫలమును నా చేతనే భాగవతులకు పంచి పెట్టమని దీనాతి దీనంగా ప్రార్థింపచేసి చివరికి భాగవతులకు ఈ ఫలమును నీ ప్రార్థన ప్రకారమే పంచిపెట్టానన్నాడు. పైగా నాకు మరో సంకల్పమిచ్చి నా సేవను నేను కోరినట్లే మరికొన్ని సంవత్సరాల వరకు పొడిగించాడు. ఇది శ్రీవారి చతురతకు నిదర్శనము.

నేను పందెంలో ఓడిపోయి దుఃఖించు మరుసటిరోజు, భాగవతుల ఆశీర్వాద ఫలితముగా గెలిచావని చెప్పినప్పటికీ, ఆ రోజు ఆ లీలను నేను అర్థం చేసుకొనక, మరి రెండు నెలలు ఓడిపోయాననే దుఃఖముతో స్వామి కృపను పొందుటకు క్షణం విడువక రకరకాలుగా ప్రయత్నించాను. చివరికి స్వామివారు ఆశించిన పట్టుదల, తిరిగి లక్ష్యాన్ని సాధించాలనే బలమైన కోరిక నా మూలంలో కలిగిన తరువాత ఈ లీల యొక్క సరైన అర్థమును చెప్పారు. ''నేను ముందే చెప్పాను కాని నీవు అర్థం చేసుకోలేదు, అది నీ తప్పు'' అంటూ ఒకప్రక్క నాపై ప్రేమను ఒలకపోస్తూ మరోప్రక్క తాను ఆశించిన మార్పు నాలో కలిగించారు. ఇది ఆయన చతురతకు మరో నిదర్శనం.

ఒక భావన: నిజానికి మొదట శ్రీవేంకటేశ్వరునికి ఈ జన్మలో ఆయన ఋణం తీర్చుకొనుటకే ఈ సేవను ప్రారంభించాను. భవిష్యత్తులో ఈ సేవ నుండి ప్రక్కదారి పట్టకూడదని మాత్రమే ఒక సంకల్పము కోసం వెతికాను. అప్పుడు తనకు బొట్టుపెట్టే సంకల్పం తీసుకొమ్మని శ్రీవేంకటేశ్వరుడు సూచించాడు. వెంటనే బొట్టుపెట్టి నేనెందుకు వదులుతాను? మిమ్మల్ని మా ఇంటికి ఆహ్వానించుదునని అన్నవాణ్ణి, రేపు స్వామివారు నిజంగా మా ఇంటికి వచ్చిన తరువాత ఆయనను దర్శించి, పాదపూజ చేసిన తరువాత తిరిగి తిరుమలకు వెళ్ళమని చెప్పగలనా? నాకు నోరు వచ్చునా? స్వామివారిని ఇక్కడే ఉండమంటే... స్వామివారు ఎక్కడ ఉండాలి? ఆయన తిరుమలలో ఎలాంటి ఇంటిలో, ఎలాంటి సౌకర్యములను అనుభవిస్తున్నారో నాకు వీలైనంతవరకు అలాంటి ఇల్లును, సౌకర్యములను

ఏర్పాటు చేయుట నా బాధ్యతగా భావించాను. అందుకే తిరుమల ఆలయ ప్రతిరూపమును ఎంచుకొని, అక్కడి సాంప్రదాయములనే కొనసాగించాలని భావించాము.

స్వామివారి దిశా నిర్దేశం

శ్రీవేంకటేశ్వరుడు ఈ హరినామ క్షేత్రాన్ని ఎంతో పట్టుదలతో సాధించాలనుకుంటున్నాడు. ఆయన ఆదేశానుసారం నడుచుకొనుచు, అత్యంత కఠినంగా జీవించుచు ఎలాగైనా సాధించమన్నారు. 2017 సంవత్సరం నుండి నాలో ఏ లోపము లేనప్పటికీ శారీరకంగా చాలా చిక్కిపోయాను. శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నాతో 1985లో ఇంజనీరింగ్ చదివిన మిత్రులను చూపుచు, ''చూడు వారు నాడు ఏవిధంగా ఉన్నారు, నేడు ఏవిధంగా ఎదిగి బొజ్జలు పెంచి ఉన్నారు అంటూ వారిది 1985 లోని రూపంతో నేటి రూపమును పోల్చేవారు. నన్ను కూడా అప్పటి రూపంతో నేటి రూపమును పోల్చుచు, వారు వారి రంగములో ఎదిగారు, నీవు నీ ఆధ్యాత్మిక రంగంలో ఎదగవలసి ఉన్నది అంటూ నా భౌతిక రూపమును ఆధ్యాత్మిక ఎదుగుదలతో పోల్చుచు దిశా నిర్దేశం చేసేవారు.

భాగవతుల ఆశీర్వాదమును పొందుమని సూచించుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన అనుభూతులను ప్రచురించమని సెప్టెంబర్ 2022 చివర సూచించాడు. తేది 05-10-2022 దసరా నుండి, మరొక్కసారి స్వామివారి అనుభూతులను చదువుటను ప్రారంభించినప్పుడు ఒక అధమశ్రేణి వ్యక్తినైన నన్ను ఎన్నుకొని మీ అమూల్యమైన అనుభూతులను ప్రసాదించి మీ లక్ష్యాన్ని సాధించుకొను దిశకు తీసుకువెళ్ళుచున్నందులకు ధన్యవాదాలు తెలిపి, ప్రభూ! లక్ష్యసాధనలో నా ఒక్కని శక్తి సరిపోదు. భాగవతుల ఆశీర్వాదముతో పాటు వారి వారి శక్తులను కూడగట్టుకొనుటకు మీ అనుభూతుల ప్రచురణను వాడుకుంటాను. ఆజ్ఞ ఇవ్వమని వేడుకున్నాను. దానికి శ్రీవేంకటేశ్వరుడు ఎంతో సంతోషించాడు. శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని, వారి శిష్య బృందముతో పంపి దివ్య ప్రబంధ పారాయణము చేయించి మంగళా శాసనములు చేయించాడు. తరువాత నాకు ఏ విధంగా అయితే మరణశయ్యపై ఉన్న వ్యక్తి నిజం మాత్రమే చెప్పునో అదే విధంగా చెప్పమన్నారు.

శ్రీవేంకటేశ్వరుని శిక్షణ: మచ్చుకు రెండు నెలలు

శ్రీవేంకటేశ్వరుని శిక్షణ మానసికంగా అత్యంత గంభీరంగా, కఠినంగా ఉంటుంది. ఏమి చెప్పదలచుకున్నాడో ఆ పరిస్థితిని కల్పించి దానిని అనుభవింప చేయుచు హితోపదేశం చేస్తాడు. ఇక్కడ కూడ నాకు మరణశయ్యపై నున్న పరిస్థితి కల్పించి చెప్పాడు. ఆయన శిక్షణలో కొన్ని లీలలను చెప్పదలచుకున్నాను. 09-10-2022 తేది నుండి 10-12-2022 వరకు, రెండు నెలల కాలము స్వామి ప్రసాదించిన శిక్షణను తెలుపుతున్నాను. తేది 09-10-2022 రోజున రెగ్యులర్ చెకప్‌లో భాగంగా మా డాక్టర్ పరిశీలించి నా హృదయములో మల్టిపుల్ బ్లాకేజీలు ఉన్నవని, యాంజి యోగ్రామ్ చేసుకోవాలని, అప్పుడు అవసరాన్ని బట్టి స్టంట్స్ కాని, బైపాస్ కాని చేయవలెనన్నాడు. ఈ విషయం తెలిసిన వెంటనే నేను నా భార్య చాలా బాధపడ్డాము. విరక్తికి లోనైనాము. జీవితం పైన ఆశ తగ్గింది. ఆస్తులు అంతస్తులు ఎందుకు? ఈ భూమి డబ్బు ఏమి చేసుకొనుటకు అనిపించింది. చివరికి నా ప్రభువు శ్రీవేంకటేశ్వరుణ్ణి తీవ్రంగా రకరకాలుగా ప్రార్థించాను. నాకున్న సర్వదాస్తిని మరోమారు ఆయనకు ధారపోశాను. కనీసం స్వామివారి సంకల్పం నెరవేరే వరకు జీవితాన్ని పొడిగించమని దీనంగా వేడుకున్నాను. ఈ పొడిగించిన జీవితం కేవలం మీ సంకల్పాన్ని నెరవేర్చుటకే వినియోగిస్తామని మాట ఇచ్చాను. కాని ఈ నాటి

కలలో నన్ను మా ఇంటిలో ఏదో ఒక పవిత్ర కార్యం మొదలు పెట్టుటకని పవిత్రస్నానం చేయించాడు. తెల్లవారి ఈ పొంతన లేని లీల వల్ల హృదయ బ్లాకులు స్వామి వారి లీల మాత్రమే అని అర్థమైంది. శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ లేనిది ఏదీ జరుగదని భావించి, వెంటనే హాస్పిటల్ కు వెళ్దామని చెప్పుచున్న నా భార్యను ఏమీ కాదని ఊరడించాను. కొన్ని ఆయుర్వేద ఉపచారాల తరువాత 20–25 రోజుల తరువాత వెళదామన్నాను. తెల్లవారి నేను అనుకోకుండా నా భార్యతో ఇలా చెప్పాను – గతంలో 2009 సంవత్సరంలో అనుభూతులు ప్రచురించిన్నప్పుడు వ్యక్తిగతమైనవి, కుటుంబ విషయాలు, చెప్పరానివి, చెప్పగలిగేవి అంటూ భేదం లేకుండా చెప్పానని బాధపడ్డావు. ఈసారి ఆ విధంగా చేయరాదని ''మరణ శయ్యపై నున్న వ్యక్తి చెప్పేవి అన్నీ నిజాలే'' అనే చందంగా చెప్పాలని, అందుకు తనకు ఏమి అభ్యంతరము లేదని స్వామిని ప్రార్థించితే సరిపోతుందని అప్రయత్నంగా అన్నాను. ఆమె అలాగేనని స్వామి వారిని ప్రార్థించింది. ఈలోగా నాకు మరికొంత శిక్షణను ఇచ్చాడు. తేది 16–10–2022 నాడు పరీక్షలో పాస్ అగుటకు సర్వవిధాల ప్రయత్నిస్తున్నట్లు చెప్పుచు, ఇదే స్థితిని కొనసాగించమన్నాడు.

తేది 22–10–2022 ఈ రోజు మరో లీలను ప్రసాదించాడు. దీనిలో ప్రతి లీలలో కొంత కొంత చొప్పున అంచెలంచెలుగా యోగ్యతను ప్రసాదిస్తున్నానన్నాడు. చివరికి తాను ఆశించిన స్థాయి వరకు ఈ లీలలు కొనసాగగలవని చెప్పాడు. ఈ మధ్యన తీవ్రమైన సమస్యల వలయంలో చిక్కుకున్నాను. ఆఫీసులో స్టాఫ్ కొరత, కొత్తగా వచ్చిన భూ సమస్య, భూ సమస్యతో పోలీసు కేసు కావడం, ఆరోగ్య సమస్య, మా కుటుంబ సమస్య ఇలా దమ్ము తీసుకోలేని విధంగా సమస్యల వలయంలో ఇరుక్కున్నాను. స్వామివారిని తీవ్రంగా ప్రార్థించాను. శరణు వేడాను. మీ సంకల్పం తీర్చుటే నా ధ్యేయం అని నా సమస్యలను తీర్చమని పదే పదే దీనాతి దీనంగా వేడుకున్నాను. రక్షించమని ప్రాధేయపడ్డాను. చివరికి 27–10–2022 ఉదయం ఈ విధంగా స్వామివారు అన్నారు. ''రోజంతా భక్తుడు మాధుర్యాన్ని అనుభవించుతాడు'' అంటే నేను స్వామిని ఈ విపత్కాల పరిస్థితులలో స్మరించి స్మరించి మాధుర్యాన్ని అనుభవించాలని మరియు నాలో కొంత ఆధ్యాత్మిక వృద్ధి, స్వామిపట్ల మరింత అంకిత భావం, ప్రేమ ఏర్పడుటకు ఈ సంఘటన జరుగుచున్నదనిపించింది.

తేది 29–10–2022 నన్ను మా ప్రాంతపు భక్తుల బృందానికి ప్రెసిడెంట్‌గా ఎన్నుకొని వారికి శ్రీవేంకటేశ్వరుని కృపా కటాక్షాలను అందించవలసిన బాధ్యత నాదనే విధంగా సూచించాడు. ఎలాగైతే ఒక ఊరికి సర్పంచిగా ఎన్నికైన వ్యక్తి ఆ ఊరి అభివృద్ధి కోసం పాటుపడతాడో, నీవు ఆ విధంగా భక్తులకు శ్రీవేంకటేశ్వరుని కృపను అందించుటకు పాటుపడమన్నాడు.

తేది 01–11–2022 నాడు దీనాతి దీనంగా వేడుకొన్నాము. ఎన్నో సమస్యల్లో చిక్కి ఉక్కిరి బిక్కిరి అయినాము. శ్వాస తీసుకొనుట కూడా కష్టంగా మారింది. హృద్రోగ సమస్యతో రేపటి ఉదయాన్ని చూడగలనా? అనే అనుమానం కలిగింది. దీనిని గమనించి స్వామివారికి రకరకాల శరణాగతి చేశాను. తప్పులు క్షమించమన్నాను. ఆయన చెప్పినట్లు వింటానన్నాను. నేను వ్రాయబోయే స్వామి లీలలను ఉన్నది ఉన్నట్లుగా మార్పులు చేర్పులు లేకుండా తెలుపుదునని మాట ఇచ్చాను. చివరికి ఒక వరము అడిగాను. స్వామివారు నాకు అప్పచెప్పిన సంకల్పమును నెరవేర్చిన తరువాత తీసుకెళ్ళమని మరియు ఈ జన్మలో మిమ్ములను పొంది, మీతో మాట్లాడి, మీ పాదపూజ చేసిన తరువాతనే తీసుకెళ్ళమని వేడుకున్నాను. అనుకున్నట్లుగనే ఈ రాత్రి కలలో మా ఇంటికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వామివారు వారి వ్యక్తిగత సహాయకునితో కలిసి వచ్చి దీనంగా కూర్చున్నారు. వారి సహాయకుడు నా వద్దకు వచ్చి నా యొక్క ఫేస్ బుక్ లాంటి అకౌంట్ కావాలని అడిగాడు. అందుకు నేను బాధతోనే నిరాకరించాను. నేను నా స్వామివారి అనుభూతులను ప్రచురించబోతున్నానని, ఆ

అకౌంటు నాకు అవసరమని, స్వామి సంకల్పం నెరవేర్చిన తరువాత ఇవ్వగలనన్నాను. అకౌంట్ కావాలని వారు, ఇవ్వనని నేను కొన్ని గంటల తరబడి వాదం జరిగింది. చివరికి వారు వెళ్ళిపోయారు. జీయరు స్వామివారు కాలుని రూపములో నన్ను పై లోకమునకు తీసుకెళ్ళుటకు వచ్చారు. కాని నేను దీనిని సరిగా అర్థం చేసుకోలేదు. తేది 03-11-2022న మరో కల కన్నాను. ఇందులో కూడ నా జీవితము పొడిగించబడ్డది. నేను ఒక రైలులో ప్రయాణిస్తున్నాను. మనము దిగే స్టేషన్ రాగానే ఒక శక్తి బయటకు నెట్టివేస్తున్నది. ఒక స్టేషన్‌లో నన్ను బైటికి నెట్టివేసింది. కాని రైలు ద్వారము వద్దకు రాగానే ఆ పరిసరాలు చూచి, ఇది నేను దిగే స్టేషన్ కాదని దిగక, కిటికీ రాడ్ పట్టుకుని వ్రేలాడుచు ప్రయాణించాను. ఇంతలో ఎదురుగా ఒక నల్లని మరో ఇంజన్‌లో ఈ రైలు యజమాని వచ్చి నన్ను లోనికి తీసుకెళ్ళి కూర్చోబెట్టాడు. అంటే నా జీవితానికి పొడిగింపు లభించింది.

చివరికి ఎంతో బాధతో జీవిస్తు న్న నేను 07-11-2022 నాడు స్వామివారితో ఇలా ప్రార్థించాను. ప్రభూ! మీరు నా అన్ని సమస్యలను తీర్చుదురని మాట ఇచ్చారు. కాని నేను వీటికి భయపడుచున్నాను. మీ నిజమైన భక్తుడు భయపడడు. నాకు యోగ్యత లేదు. మీరు ఆశించిన స్థాయికి రాలేకపోయాను. నేను అయోగ్యుణ్ణి. మిమ్ములను పొందే స్తోమత, అర్హత నాకు లేదు. కాబట్టి మిమ్ములను పొందాలనే కోరికను నేను సంపూర్ణంగా విరమించుకుంటున్నాను. నన్ను క్షమించమని వేడుకున్నాను కాని మీరు ఇచ్చిన సంకల్పమును మాత్రము నెరవేరుస్తానని ప్రమాణం చేశాను. నిజానికి నేను స్వామివారి సేవనే కోరుకున్నాను కాని స్వామివారిని కాదు. స్వామివారిని పొందుట బోనస్ లాగా అనుకున్నాను. స్వామిని పొందాలనే కోరికతో ఏ పని, సేవ చేయకుండా నా కర్తవ్యంగా సేవ చేయాలని భావించాను.

చివరికి తేది 12-11-2022 రోజున స్వామి ప్రేరణతో హాస్పిటల్ కు వెళ్ళాము. నాకు రెండు స్టంట్స్ వేయడంతో నా జీవితానికి పొడిగింపు లభించింది. అత్యంత క్లిష్ట పరిస్థితులలో ఈ స్టంట్స్ ను వేశామని డాక్టర్ చెప్పినప్పుడు స్వామివారి లీలలు మరోమారు గుర్తుకు వచ్చాయి. చివరికి ఈ పొడిగింపు జీవితాన్ని స్వామి సంకల్ప సాధనకు మాత్రమే వినియోగించుదునని మరోమారు ప్రమాణం చేశాను. ఈ విధంగా స్వామివారు అత్యంత కఠినమైన శిక్షణను ఇస్తున్నారు. మరో విషయం, ఈమధ్యన, నవంబర్ 2022 నుండి మరింత సన్నబడ్డాను. చూచిన ప్రతివ్యక్తి ఎందుకు సన్నబడ్డావని అడిగినప్పుడల్లా ''నీవు ఎదగాలని'' శ్రీవేంకటేశ్వరుని మాట నా హృదయములో మారుమ్రోగుచు వినబడుతున్నది. ఈ విధమైన కఠిన శిక్షణను శ్రీవేంకటేశ్వరుడు తన హరినామ క్షేత్ర ఏర్పాటు నిమిత్తమై ఇస్తున్నారు. ఈ మధ్యన టిటిడి వారు వైకుంఠ ఏకాదశికి 10 రోజుల పాటు ఉత్తర ద్వార దర్శనమును కల్పించారు. హరినామ క్షేత్రము నిర్మాణము కోసమని, స్వామివారి వైకుంఠ ద్వారము లోపలి భాగాలను ఒక ఇంజనీరింగ్ మైండ్ తో చూచే నిమిత్తమని మరియు స్వామివారిని వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని, అన్నిటికంటె ముఖ్యంగా అనుభూతులను ''తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశ-నా దశ'' అనే శీర్షికతో ప్రచురణ గురించి స్వామివారి ఆశీర్వాదం పొందుటకని తిరుపతికి తేది 09-01-2023న, నేను, నా భార్య వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాము. ఆ రోజు ఉదయం ''నీవు ఆశీర్వాదమును పొందుటకు వస్తున్నావు సంతోషం'' అనే విధంగా హృదయాంతరంగం నుండి అనుభూతిని పొందాను. మరియు నా భార్యకు తేది 10.01.2023 ఉదయం ''నేను మీ ఇంటికి వస్తున్నా''నని కలలో తెలియజేశాడు. ఈవిధంగా మా ఇద్దరికీ ఎంతో ఆనందకరమైన విషయము తెలిపి సంతోషపరిచాడు.

స్వామివారు ప్రసాదించిన అనుగ్రహము: మచ్చుకు ఒకటి

స్వామివారు ప్రసాదించిన ఒక అనుగ్రహాన్ని కూడా మచ్చుకు తెలుపుచున్నాను. నాకు తన పాద సేవాభాగ్యాన్ని ప్రసాదించాడని చెప్పాను. అది ఎలా జరిగిందంటే స్వామివారు ఆకాశం నుండి దిగి, నేరుగ మా ఇంటికి వచ్చి,

నా ముందు ఆసీనులై, తన రెండు కాళ్ళను నా ముందు పెట్టి, పంచెను మోకాళ్ళ వరకు పెకెత్తి, ఈ పాదాలు నీవి సేవించుకో అన్నాడనుకుంటే ఈ భాగ్యం ఎవరికి లభిస్తుంది? ఎంత అదృష్టం ఉంటే లభిస్తుంది? ఇలాంటి అనుగ్రహాలను ఎన్నో పొందాను.

భాగవతుల ఆశీర్వాదము

ఈ భాగంలోని మొదటి రెండు వాక్యాలు సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు సూచించగా నేను మొదలుపెట్టాను. ఈ అనుభూతులను కేవలము మీ ఆశీర్వాదము పొందుటకే, శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే మాత్రమే వ్రాస్తున్నాను. ఇంకా ఈ భాగంలో ఎన్నో విషయాలు చెప్పాల్సి ఉన్నప్పటికి తేది 4–3–2023 నాడు 'గో...వింద' అని సూచిస్తూ ఇక చాలు అన్నారు. ఇలా స్వామి వారు నా వెనుక ఉంటు ప్రేరణ కలిగించుచున్నప్పటికి నేను తగిన సాధన చేయవలసి ఉంటుంది.

కళ్యాణాల కార్యక్రమమును ప్రసాదించినప్పుడు శ్రీవేంకటేశ్వరుడు నన్ను శ్రీ భరతుణ్ణి అనుసరించమన్నాడు. భరతుడు మహాభక్తుడు. శ్రీరాముని కొరకు తపించిపోయాడు. శ్రీరాముని పాలనను అయోధ్య వాసులకు అందించుటకు, ఒక్క రోజు ఆలస్యమును సైతం సహించనంతగా తపించిపోయాడు. అంతటి తపన, భక్తి నన్ను పెంచుకోమన్నారని అర్థం. శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందుటకు అత్యంత తపనను కలిగి ఆయనపై అమితమైన వ్యామోహాన్ని పెంచుకోవాలి. తగిన యోగ్యతను సాధించాలి. అప్పుడే ఈ హరినామ క్షేత్రం సాధ్యమౌతుంది. దీనిని సాధించుటకు నా ఒక్కరి శక్తి సరిపోదు. కాబట్టి శ్రీవేంకటేశ్వరుని భక్తుల యొక్క శక్తిని, ఆశీర్వాదమును కాంక్షిస్తున్నాను. హరినామ క్షేత్రము ఏర్పాటులో, నిర్వహణలో, స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటలో మీ సహకారాన్ని కోరుచున్నాను.

ఈ శ్రీవేంకటేశ్వరుని అనుభూతులను చదివిన ప్రతిభక్తుడు, వయస్సు, లింగభేదం లేకుండా శ్రీవేంకటేశ్వరుణ్ణి 3 సార్లు స్మరించి నన్ను ఆశీర్వదించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మరియు ప్రతినెల మేము ప్రచురించు స్వామివారి అద్భుతమైన లీలలను చదువుచు, ప్రస్తుతపు కలియుగములో కూడా ఆయన భక్తవత్సలతను తెలుసుకుంటూ, స్వామివారి కోరిక ప్రకారం, మరో తిరుపతిని ఏర్పాటు చేయుటకు, ప్రతి భక్తుడు ఈ సంకల్పం నెరవేరాలనే ప్రార్థనతో పాటు, ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములు కాగలరని, స్వామి కృపను పొందగలరని ఆశిస్తున్నాము. వచ్చే భాగములో ప్రభావవంతమైన స్వామివారి లీలలను క్లుప్తంగా తెలిపెదను. ఆ తరువాత ఒక్కొక్కటి వివరించెదను.

నమో వేంకటేశాయ

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

2వ భాగము

లక్ష్యం

తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు తన భక్తుల ఉద్ధరణనే లక్ష్యంగా చేసుకొని గతంలో ఎన్నో ప్రాంతాలలో వెలసి ఆయా ప్రాంతపు భక్తులను అనుగ్రహిస్తున్నారు. రాబోవు కాలంలో సిద్ధిపేటకు 7 కి.మీల దూరంలో ఉన్న మా సొంత గ్రామమైన చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్ద వెలసి ఆ ప్రాంతపు భక్తులను అనుగ్రహించదలచాడు. అక్కడ మరో తిరుపతిని ఏర్పాటు చేయాలనుకున్నారు. దాదాపు తిరుమలతో సమానమైన ఆకర్షణ కలిగి అదే విధంగా భక్తులను ఆకర్షిస్తూ అనుగ్రహించదలచారు.

ముఖ్యంగా భక్తులు ఈ క్షేత్రంలో స్వామివారిని అత్యంత సులభంగా పొందగలరు అనే విశ్వాసాన్ని భక్తులలో కల్పించదలచారు. మరియు తిరుమల లాంటి ఒక పవిత్రమైన స్వామి క్షేత్రాన్ని సాధించుటలో ఆసక్తి గల భక్తులకు వారి సేవలను, తపస్సులను వినియోగించుకునే ఒక అపూర్వ అవకాశాన్ని నేడు భూమిపై జీవిస్తున్న భక్తులకు ఇవ్వదలచి ఈ క్షేత్రాన్ని ఎన్నుకున్నారని భావించాను. ఈ క్షేత్రం తిరుమల ఆలయ ప్రతిరూపంగా అవసరమైన కొన్ని మార్పులతో, వెండివాకిలి వరకు నిర్మించాలని తిరుమలలోని సాంప్రదాయమైన వైఖానసమునే ఏర్పరచాలని మరియు ఇక్కడ వివిధ భక్త బృందాలచే వంతుల వారిగ అఖండ హరినామ స్మరణ జరగాలనే కోరికను వెలిబుచ్చారు. ఇక్కడ స్వామివారిని దర్శించుకునే భక్తులకు తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకున్న అనుభూతి కలగాలన్నది స్వామివారి అభిమతం.

అంటే తిరుమల స్వామివారే ఇక్కడ స్వయంగా ఉంటారన్నమాట. దీనిని సాధించుటకు ఒక పనిముట్టులాగా నన్ను ఎన్నుకొని కావలసిన శిక్షణను ఇచ్చుటలో స్వామివారు చూపిన లీలలే ఈ అనుభూతులు. శ్రీ వేంకటేశ్వరుడు భక్తవత్సలుడు, భక్తప్రియుడు. ఆర్తితో పిలిస్తే మన ఇంటికి రాగలడనే నిజమును లోకానికి మరోమారు తెలుపదలచుకున్నారు.

పూర్వం భద్రాచలం ఏర్పాటుకు కారణమైన భద్రునిలాగా, యాదగిరిగుట్ట ఏర్పాటుకు కారణమైన ఋషి యాదగిరిలాగ సాధన చేసి యోగ్యతను పెంచుకొని శ్రీ వేంకటేశ్వరున్ని పొంది చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమన్నారు. యోగ్యతను సాధించుటకు కావలసిన శిక్షణ సం॥ 2000 నుండి మొదలై 2023 వరకు కొనసాగుతున్నది.

అనుభూతుల వివరాలు :

ఈ భాగంలో స్వామివారి అత్యంత ప్రభావవంతమైన లీలలను క్లుప్తంగా తెలుపుతున్నాను. ఒక చెరువు నీటిని బావి వరకే పరిమితం చేయటం ఎంత కష్టమో స్వామి ప్రసాదించిన వందల అనుభూతులను ఒక భాగంలో తెలుపుట అంతే కష్టం. మేము కొన్నివేల అనుభూతులను చూచినప్పటికీ 700కు పైగా అనుభూతులను ఒక ఆరు పుస్తకములలో వ్రాశాము.

తేది 18-08-2009 నుండి 24-02-2011 వరకు తప్ప మిగిలినవి కొన్ని జిరాక్స్ రూపంలో, కొన్ని ఒరిజినల్స్ గా ఈ క్రింది విధంగా ఉన్నవి.

సంవత్సరం 2002 నుండి 31-03-2023 వరకు నేను, నా భార్య పొందిన అనుభూతుల వివరాలు

బుక్ నెం.	కాలము	లభ్యత	సురేఖ	సాయిరెడ్డి	మొత్తం అనుభూతులు
1.	ఏప్రిల్ 2000 నుండి 05-01-2005 వరకు	జిరాక్స్	5	95	100
2.	06-01-2005 నుండి 11-11-2008 వరకు	జిరాక్స్	19	105	124
3.	12-11-2008 నుండి 17-08-2009 వరకు (కొంత భాగము మాత్రమే)	ఒరిజినల్	2	13	15
4	18-08-2009 నుండి 24-02-2011 వరకు	లభించలేదు (గుర్తున్నవి)	-	7	7
5.	25-02-2011 నుండి 28-03-2016 వరకు	ఒరిజినల్స్	14	91	105
6.	04-01-2017 నుండి 30-03-2023 వరకు	ఒరిజినల్స్	18	185	203
	మొత్తం		58	496	554

యోగ్యత సాధించుటకు సేవలను ప్రసాదించుట :

స్వామివారిని పొందుటలకు కావలసిన యోగ్యత సాధించుటకు తన సేవా వృక్షాన్నే ప్రసాదించారు. స్వామివారు ప్రసాదించిన సేవలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తూ, కావలసిన యోగ్యతను సాధించుట నా కర్తవ్యంగా దిశానిర్దేశం చేసారు. స్వామి వారి కొన్ని లీలలు ద్రాక్షా పాకం లాగ కాకుండా నారికేళ పాకంలాగ ఉండేవి. కొన్ని స్వామివారి లీలలు అర్థం పర్థం లేనివాటిగ, అసలు ఎందుకు కల్పిస్తున్నారో తెలిసేది కాదు. కాని సమయం గడిచిన తరువాత వాటి అంతరార్థం బహు చక్కగా తెలిసేది. మేము స్వామివారి లీలలను సం॥ 2000 నుండి పొందుతున్నప్పటికీ, మాలో కొంత యోగ్యత సిద్ధించిన తరువాత సం॥ 2022 ఏప్రిల్ లో మాత్రమే తన అసలు లక్ష్యమును తెలిపారు.

నాకు ప్రసాదించిన సేవలను ఉపయోగించుకొని తగిన యోగ్యతను సాధించమన్నారు. ఉదా :- ఒక ఐ.ఎ.ఎస్ పట్టా పొందాలంటే ముందు ఒక డిగ్రీ చదవాలి. ప్రిలిమినరీ, మెయిన్ లో పాస్ అయిన తరువాత ఇంటర్వ్యూలో నెగ్గితేనే ఒక వ్యక్తి ఐ.ఎ.ఎస్ సాధించగలడు. ఇక్కడ డిగ్రీని, ప్రిలిమినరీ, మెయిన్ లకు మాత్రమే చదవాలి. ఇంటర్వ్యూకు మాత్రం, వ్యక్తి యోగ్యతతో పాస్ కావలసి ఉంటుంది. ఈ యోగ్యతకు మనం చదివిన విషయ

పరిజ్ఞానమే కాకుండ, లోకంలోని ఇతర విషయాలను కూడ తెలుసుకోవాలి. ఇదే విధంగ స్వామి ప్రసాదించిన సేవలను చదవదగిన విద్యలనుకుంటే అన్య విషయ సేకరణ మాత్రం నా వ్యక్తిగత సాధన ద్వారా సాధ్యమవుతుంది. స్వామివారు సూచించిన నియమాలను, అంటే వ్యాపారం, మిత్రులతో కాలక్షేపం వంటి వాటికి దూరంగా ఉంటూ, ప్రతిక్షణం స్వామినే స్మరిస్తూ, విషయ వాసనలను మరియు 'నా' అన్నదానిని సంపూర్ణంగ వదలి, స్వామి పట్ల అత్యంత వ్యామోహమును ఏర్పరచుకోవాలి. అప్పుడే స్వామివారు ఆశించిన యోగ్యత సాధ్యమవుతుంది. దీనిని సాధించుట నా కర్తవ్యంగ దిశా నిర్దేశం చేశాడు. దీనిని సాధించుటకే వేలకు పైగా అనుభూతుల రూపంలో దిశా నిర్దేశం చేశాడు. ఎలాగైన లక్ష్యాన్ని ఛేదించమన్నారు. జీవితానికి పొడిగింపును ప్రసాదించి, కనీసం ఈ పొడిగించిన జీవితంలోనైన దీనిని సాధించమన్నారు. కఠిన శిక్షణ ఇస్తున్నారు.

బాల్యం నుండి స్వామి వారి దిశా నిర్దేశం :

చిన్నప్పటి నుండి నాకు శ్రీవేంకటేశ్వరుడంటే అమితమైన ఇష్టం. నేను 2వ తరగతి చదువుచున్నప్పటి నుండి ప్రతి పూజలో ''నాచే లోకానికి ఉపయోగపడే ఏదేని మంచి పనిని చేయించమని'' ప్రార్థించేవాడిని. ఊరిలో మాకు తగినంత భూమి ఉన్నప్పటికీ, నీరు లేక పంటలు పండక అత్యంత దీనావస్థలో బాల్యం గడిచింది. సిద్ధిపేటలో 1979 లో ఇంటర్ పూర్తైన తరువాత ప్రయత్నించినప్పటికీ ఇంజనీరింగ్ లో సీటు లభించలేదు. మా ఊరిలోనే వ్యవసాయము చేస్తూ, సిద్ధిపేటలో బి.ఎస్సీ రెండవ సంవత్సరము వరకు చదివాను. ఆ తరువాత 1981 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ లో సీటు లభించింది. ఈ రెండు సంవత్సరాలు ఊరిలో వ్యవసాయము చేయుట వలన అక్కడి ఆర్థిక పరిస్థితి చాలా బాగ అర్థం చేసుకున్నాను. ఇంజనీరింగ్ చేసినప్పటికి, ఉద్యోగము చేయక వ్యాపారము చేసి డబ్బు సంపాదించి మా కుటుంబమును ఉన్నత స్థితికి తీసుకురావాలనే బీజం అప్పుడే పడ్డది.

ఊరిలోని ఇల్లు మా తల్లితండ్రుల స్వార్జితము. చాలా చక్కగా, సౌకర్యవంతంగా ఉంటుంది. కాని మమ్మల్ని ఆర్థికంగా చాల ఇబ్బంది కలిగించిందనే కసి చేత 1999 సంవత్సరంలో దీనిని అమ్మి క్రొత్త ఇల్లును నిర్మించుకున్నాము. ఆ తరువాత సంవత్సరం 2000 నుండి స్వామి లీలలు ప్రారంభమైనాయి. ముఖ్యంగా ఈ ఇల్లును ఉపయోగించుకుని ఒక 50 కి పైగ అనుభూతులను చూపాడు. ప్రతిసారి మా ఇల్లు అంటే ఇదే ఇల్లని అర్థం.

నాకు వ్యాపారంలో, నా భార్యకు కుటుంబము పైన ఎక్కువ ఇష్టాలు ఉండేవి. వీటిలో వచ్చిన చిక్కులను తీర్చే క్రమంలో శ్రీవేంకటేశ్వరుడు మాకు అత్యంత సన్నిహితుడైనాడు. ఆ తరువాత ఆయా సమయాలలోని మా మానసిక స్థితికి అనుగుణంగ సామ దాన భేద దండోపాయాలను ఉపయోగించి తన దారికి తెచ్చుకున్నాడు.

స్వామివారి ప్రభావవంతమైన లీలలు :

ఏప్రిల్ 2000 – ఏప్రిల్ 2002 :- నా విద్యాభ్యాసం తరువాత మా కుటుంబంతో పాటు హైదరాబాద్‌లో నివసిస్తూ కన్‌స్ట్రక్షన్ రంగములో బిల్డరుగా వ్యాపారము చేశాను. అనుకోకుండా ఒకనాటి కలలో శ్రీ ఆంజనేయస్వామివారు మా చిన్నగుండవెల్లి ఊరిలోని మా తోట బావి వద్ద జై శ్రీరాం అంటూ పైకెగురుటతో స్వామి లీలలకు శ్రీకారం చుట్టాడు. ఆ తరువాత లీలలో స్వామివారు నా హృదయంలో 'భక్తి' బీజం నాటారు. భవిష్యత్‌లో నా జీవితంలో ఎన్నో కష్టాలు రాగలవని భయపడకుమని, తాను రక్షించుదునని అభయం కూడా ఇచ్చారు.

మొట్టమొదటి నా స్వామి అనుభూతి మరువలేనిది. ఒక రాత్రి నేను హైదరాబాద్‌లోని మా ఇంటిలో

పడుకున్నప్పుడు ఒక శక్తి ఆవహించి బలవంతాన నన్ను ఆకాశమార్గాన తమిళనాడువైపు తీసుకెళ్ళింది. ఆ తరువాత తిరుమల ఆనంద నిలయంలోని శ్రీ వేంకటేశ్వరుని ముందు నిలిపింది. అప్పుడు శ్రీ వేంకటేశ్వరుడు తన అణువణువును చూపెట్టాడు తన చేతిలోని రేఖలను కూడా స్పష్టంగా చూడగలిగాను. భవిష్యత్తులో నీకు ఆపదలు రాగలవని, తాను అదుకుందునని అభయం కూడ ఇచ్చాడు. ఆ తరువాత నేను చేయు వ్యాపారంలో చాలా పెద్ద సమస్యను ఎదుర్కొన్నాను. ఆ సమస్యకు భయపడి స్వామివారిని స్మరించిన వెంటనే పరిగెత్తుకొచ్చి నా హృదయంలో నిలిచేవాడు. వెనువెంటనే రోమాంచితుడనై నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు జల జల కారేవి. నన్ను నేను మైమరచేవాడిని. ఇలా రోజుకు ఐదు నుండి పదిసార్లు చొప్పున మొత్తం ఒకటిన్నర సంవత్సరం సాగింది. ఈ కాలంలో నా నరనరాలలో స్వామివారు నిక్షిప్తమైనారు. మా మధ్య బలమైన బంధం ఏర్పడ్డది. ఒక మారుమూల గ్రామం నుండి విద్యాభ్యాస నిమిత్తం హైదరాబాద్ వచ్చి 10 x 10 సైజు గల చిన్న గదిలో స్వయంపాకం చేసుకుంటు, ఒక సంవత్సరం కాలం గడిపిన ఇద్దరు మిత్రులు ఎంత స్నేహంగా, ఎలాంటి దాపరికము లేకుండా ఒకరి మనసులోని విషయాలు మరొకరికి తెలుపుదురో, అంతటి స్నేహం మా మధ్యన ఏర్పడ్డది. శ్రీవేంకటేశ్వరుడు నావాడు, నేను ఆయన వాడిననే బంధం ఏర్పడ్డది. స్వామివారిని స్మరించుట వలన కలిగే ఆనందస్థితిని వదలలేక అంతర్ దృష్టి బాహ్య దృష్టి అనే రెండు దృష్టి కోణాలను ఏర్పరచుకొన్నాను. బాహ్య దృష్టి ద్వారా ఈ లోక విషయాలను గమనిస్తున్నప్పటికీ, అంతర్ దృష్టితో సదా శ్రీవేంకటేశ్వరుని స్మరించేవాడిని. కొన్ని రోజుల తరువాత ఈ స్థితి నాకు, నా చుట్టూ ఉన్న జనాల పేర్లను మరిచే స్థితిని కల్పించింది.

నేను ఏనాడు చూడని ఆలయాలు కనబడ్డవి. అందులో కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారు మొదటిది. ఆలయంలో ప్రధాన గోపురంలో నిలబడి ఒక ప్రత్యేకమైన కోణంలో చూస్తున్నప్పుడు, ఎంతో దూరంలో ఉన్న అమ్మవారు, ఎన్నో ఆర్చుల గుండ నా దృష్టి వెళ్ళి అమ్మవారు కనబడ్డారు. మరోసారి ఈ అమ్మవారు నేను గర్భగుడిలోపల ఉన్నప్పుడు ఎంత స్పష్టంగా చూడగలనో ఆ విధంగా కనబడ్డారు.

ఒకసారి నా కళ్ళముందు శివలింగమును దర్శింప చేసి, నేనే శివుడను నీవు పూజించు అంటు సెలవిచ్చారు. అప్పటి నుండి శివుడిని నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని యొక్క రెండవ రూపముగ భావిస్తూ 'శ్రీవేంకటేశ్వర' అంటూ సంబోధిస్తూ పూజించేవాణ్ణి.

అమ్మవారు, శివుడు, సమస్త దేవతలు శ్రీవేంకటేశ్వరునిలో అంతర్ భాగమని నమ్ముచు ఆయా దేవతలలోని శ్రీవేంకటేశ్వరుని అంశకే నమస్కరించేవాడిని. ఎలాగైతే ధనార్జనే లక్ష్యంగా గల ఒక వ్యక్తికి, ఒకరోజు ఒకే పనికి ఒకరు 100 రు॥లు, మరొకరు 1000 రు॥లు ఇస్తున్నప్పుడు ఆ వ్యక్తి 1000 రు॥లు ఇచ్చేవారిని ఎన్నుకున్నట్లు నేను శ్రీవేంకటేశ్వరుణ్ణి ఎన్నుకున్నాను.

ఈయనొక్కడే సర్వేశ్వరుడు :

ఆ తరువాత రోజులలో స్వామిపై భక్తి తారాస్థాయికి చేరింది. లోకంలోని ప్రతి వస్తువులో స్వామివారినే చూచేవాడిని. ఈ సృష్టికి మూలం శ్రీ వేంకటేశ్వరుడు. ప్రతి దేవి, దేవత ఆయన అంశనే అనే జ్ఞానం కలిగింది. తిరుమలలో స్వామివారిని ఈయనొక్కడే సర్వేశ్వరుడనే భావంతో అర్పించు విధానం నా ఒంట పట్టింది. నా భాగ్యవశాత్తు ఒకానొక రోజు స్వామి వారి రెండు పాదాలు నాపైన పెట్టినట్లనిపించింది. ఒక రకంగా నాకు సమాశ్రయణం కావించారు. ఆ తరువాత నేను పరవశంతో నాది నేను, నాకున్న సమస్త సంపద, కుటుంబంతో సహా స్వామివారికి సమర్పించుకున్నాను. ఎంతగ శరణాగతుణ్ణైనానంటే సంపూర్ణ వ్యక్తిత్వమును కోల్పోయాను. నన్ను

లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక మంచి పనికి ఉపయోగించుకొమ్మని ప్రార్థించాను, మరియు నా మనస్సులో జనించు భావాలు స్వామివారివని, నేను ఆ భావాల ప్రకారమే నడుచుకోవాలనే బంధం ఏర్పరచుకున్నాను. ఆ తరువాత నేను వేసే ప్రతి అడుగు, తెలిసి వేసినా తెలియక వేసినా స్వామివైపే వెళ్ళేది. స్వామివారు కల్పించు ప్రతి అనుభూతి యాదృచ్ఛికమని భావించక ఏదో ఒక సందేశం కోసమని భావించాలని తలచాము. మరియు యాదృచ్ఛికమనే పదమును మా నిఘంటువు నుండి తీసివేసాము. ఆ తరువాత ఈ జీవితములో అలసిపోయేంతవరకు శ్రీ వేంకటేశ్వరునికి సేవ చేయాలనిపించింది.

ఒకరోజు అత్యంత భక్తి పారవశ్యముతో శ్రీ ఆంజనేయుల వారి లాంటి సేవను ప్రసాదించమన్నాను. ఎలాగైతే రామాయణాన్ని రచించి శ్రీ ఆంజనేయుడు మొదలగువారికి మీ సేవా భాగ్యమును ప్రసాదించారో అలాంటి మరో క్రొత్త రచనను రచించి నాకు మీ సేవా భాగ్యమును ప్రసాదించమని అత్యంత ఆర్తితో నా కళ్ళనుండి కారే అశ్రువులచే నా ఛాతీపైనున్న చొక్కా నానిపోగా దీనాతి దీనంగా వేడుకున్నాను.

స్వామి సేవ ప్రారంభములో నన్ను తిరుమల తీసుకెళ్ళి తన ఉత్తర మాడ వీధిలో నిలబెట్టి, తన మాయచే ఆకాశ గంగను తెప్పించి స్నానం చేయించాడు. మరోమారు మానససరోవరం లాంటి దానిలో స్నానం చేయించాడు.

జూన్ సం॥ 2002 ప్రాంతములో మేము ప్రయాణిస్తున్న మార్గములో ఒక తుఫాన్ వచ్చింది. శ్రీ వేంకటేశ్వరుని కృపచే ఎలాగో దాని ధాటికి తట్టుకోగలిగాము. ఇంతలో ఈ తుఫాన్ నుండి ఒక సుడిగుండం పుట్టుకొచ్చి మమ్ములను పైకెత్తుకెళ్ళింది. ఆకాశంలో ఉన్న మమ్మల్ని ఎక్కడ ఈ తుఫాన్ పడేస్తుందోనని భయపడి గజ గజ వణికాము. చివరికి శ్రీ వేంకటేశ్వరున్ని శరణు జొచ్చాము. రక్షించమని దీనంగ వేడుకున్నాము. దయామయుడైన శ్రీ వేంకటేశ్వరుడు ఆ సుడిగాలికి ఆదేశాలిచ్చి ఒక నూతన మార్గంలో జాగ్రత్తగా మమ్ములను క్రిందికి దింపి అదే మార్గములో పయనించమన్నారు. తిరిగి వెనుకకు రావద్దన్నారు. ఒకవేళ వెనక్కు వస్తే మళ్ళీ తుఫాన్‌లు వస్తాయని హెచ్చరించారు. చివరికి స్వామివారు సూచించిన మార్గంలోనే పయనించాము. ఆ మార్గమే శ్రీ వేంకటేశ్వరుని సేవా మార్గం. ఈ విధంగా మాకు శ్రీవారి సేవను శ్రీ వేంకటేశ్వరుడు స్వయంగా కల్పించారు. ఈ జీవితంలో తనివి తీరేవరకు సేవను ప్రసాదించారు.

స్వామివారి లీలలు అద్భుతంగా ఉంటాయి. ఆకలి గొన్నప్పుడే రుచెక్కువన్నట్లు తపనను పెంచి లీలలను ప్రసాదిస్తాడు. నా మొదటి పుట్టినరోజు పండుగ సందర్భంగా ప్రపంచంలో ఉన్న మన్నికైన వజ్రవైఢూర్యాలు పొదిగిన నగను బహుమతిగ ఇచ్చి, నన్ను తన్మయుణ్ణి చేసారు. కొంత తడవు సృహ కోల్పోయేలా చేసారు.

ఒకానొక సందర్భంలో శ్రీవేంకటేశ్వరుడు ఇలా అన్నారు. ''సాయిరెడ్డి నా వాడు, నాకోసం ఏమైనా చేస్తాడు'' ఈ మాట విన్న వెంటనే పరవశించిపోయాను. ఈ జన్మాంతం శ్రీవేంకటేశ్వరునికి ఋణపడి ఉండాలనుకున్నాను.

ఏ మాత్రం తిరుపతితో సంబంధం లేని నాతో తిరుపతిలోని టి.టి.డి. డైరీఫామ్‌లో తేది 21-09-2002 నాడు శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపమును నిర్మింపచేసి, తిరిగి దానిని స్వీకరించి పరమానంద భరితుణ్ణి చేసారు. ఈ స్థూపాన్ని నీ జన్మాంతము వరకు నీవే నిర్వహించగలవని కూడా చెప్పారు. అత్యంత అధమస్థాయి వ్యక్తినైన నాకు స్వామివారి దివ్యమైన అనుగ్రహము లభించుటతో పరవశించి, ఈ జన్మ మొత్తం ఆయన ఋణం తీర్చుకొనుటకు సేవ చేయాలనుకున్నాను. తగిన సేవను సూచించమని వేడుకొన్నాను.

స్వామి నామం స్మరిస్తూ ఉంటే ఒక ప్రక్క ఎంతో ఆనందమును పొందుటతో పాటు నాకున్న జటిలమైన సమస్యలు తీరేవి. ఈ భాగ్యాన్ని నాతోపాటు స్వామివారి భక్తులకు అందించాలని, దానికి తగిన ఉపాయమును ప్రసాదించమని వేడుకున్నాను. ఋణం తీర్చుకొనుటకు ఒక అజ్ఞాత భక్తునిగా సేవ చేయాలని భావించాను. స్వామివారి సేవకుడుగ ఆయనతో ఒక బంధం ఏర్పరచుకున్నాను. స్వామివారు నాకు ప్రసాదించిన ప్రతిదానిని తిరిగి వారి భక్తులు అనుభవించేటట్లు చేయుట నా కర్తవ్యంగా నిర్ణయించుకున్నాను. ఎంత ఎక్కువ మంది భక్తులకు దీనిని చేరవేస్తానో అది నా సామర్థ్యానికి నిదర్శనంగా ఎంచుకున్నాను. చివరికి శ్రీవారి కృపా విశేషం చేత తేది 15-10-2002 దసరా రోజు, శ్రీవేంకటేశ్వర మహా మంత్ర పీఠమును ఏర్పాటు చేసి దాని ద్వారా జప సమర్పణ కార్యక్రమమును చేపట్టాము.

స్వామివారి కృపతో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర లిఖిత జపము అనే జప పుస్తకమును సంకలనము చేసి ముద్రించి తేది 15-11-2002 కార్తీక ఏకాదశి నుండి ఉచిత పుస్తక పంపిణి మొదలు పెట్టాను. ప్రతి జప పుస్తకములో 1250 నామాలు పట్టునట్లు మొత్తం 70300 జప పుస్తకములను సిద్ధం చేశాను. ఇంతలో నాకు ఆప్తుడుగా వున్న గురుతుల్యుడైన వ్యక్తి నీకు మహా మంత్రపీఠంను స్థాపించే అర్హత లేదని, మహా మంత్రమును వ్రాయించే అర్హత కూడా లేదని దీనిని వదులుమని సూచించడంతో చివరికి శ్రీవేంకటేశ్వర సేవా సమితి అనే ఒక ట్రస్టును నేను, నా భార్య సురేఖ మరియు మా అమ్మ కీ.శే. పుల్లగూర్ల రుక్మమ్మలు మెంబర్లుగా ఏర్పాటు చేసి దీని ద్వారా సేవ చేయాలనుకున్నాను. ఆ తరువాత శ్రీ వేంకటేశ్వరుడు తన మరో లీలలో, నీవు శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం మరియు జపసమర్పణను కొనసాగించమని ఆజ్ఞాపించుటచే శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును, జప సమర్పణను అలాగే కొనసాగించాను.

స్వామివారితో పందెం కాయుట :

శ్రీ వేంకటేశ్వరుని లీలల ప్రభావముచే నాలో ఆయనకు సేవ చేయాలనే తపన తారాస్థాయికి చేరింది. స్వామివారిని చూడాలని తపించి పోయేవాడిని. విరహ వేదనను అనుభవించాను. కొన్ని సందర్భములలో స్వామి కొరకు క్రిందపడి పొర్లుచు ఏడ్చేవాడిని. స్వామివారికి చిన్న చిన్న సేవలు చిన్నతనంగా భావించే వాడిని కాబట్టి చాలా సం॥ల వరకు నిలిచి ఉండే సేవను ఎన్నుకోవాలనిపించింది. భాగ్యవశాత్తు నాకు జప సమర్పణ సేవ లభించింది. ఈ సేవను చాలా సం॥ల పాటు, మధ్యలో ఏ మాత్రం పలచబడకుండ ఉండుటకు ఒక సంకల్పము చేసుకోవాలనిపించింది. ఇదే సందర్భములో శ్రీ వేంకటేశ్వరుడు తనకు బొట్టు పెట్టే సంకల్పమును తీసుకోమన్నారు. ఆయన తిరునామములో మూడు ఒకట్లు ఉంటాయని, నా ఇంజనీరింగ్ మైండ్‌తో ఆలోచించిన నేను మొత్తం 111 కోట్ల జపంను ప్రతి సం॥ కనీసం 7 కోట్ల చొప్పున, కనీసం 70 వేలమంది భాగస్వాములుగ 16 సం॥ల వరకు సమర్పించి, ఆ సేవ ఫలితంగా ఆయనకు బొట్టు పెట్టాలనుకున్నాను. వెంటనే ఇంత కష్టపడి మీకు బొట్టు పెట్టి వదలను ప్రభూ! మిమ్మలను మా ఇంటికి ఆహ్వానిస్తాను రమ్మన్నాను. మన హైందవ ధర్మములో బొట్టు పెట్టి పిలిచినట్లు, దానికి శ్రీ వేంకటేశ్వరుడు ఒప్పుకొని, నేను ఏ తప్పు లేకుండ, అత్యంత ఆర్తితో సేవ చేస్తే మా ఇంటికి

తప్పక వస్తానన్నారు. మొత్తం సేవలో ఒకే ఒక తప్పుకు అనుమతించారు. ఈ విధంగ మా మధ్యన పందెం ఏర్పడ్డది. దీనిని సాధించుట లక్ష్యంగా పెట్టుకున్నాను. ఆ తరువాత స్వామివారిని పొందుటకు నేను యోగ్యుణ్ణి కానని భావించి, అలాంటి కోరికను త్యజించినప్పటికీ దీనిని బోనస్‌గా భావించాను. మరియు నేను కఠినంగ స్వామి సేవ చేయుటకు ఇది ఉపయోగపడుతుందని భావించాను. మరోప్రక్క కొన్ని నెలల ముందు జరిగిన ఒక సంఘటనలో దెబ్బతిన్న కారణంగా ''నా మనసులో జనించు ప్రతి భావన స్వామిదే. నేను ఆ భావాల ప్రకారమే నడుచుకోవాలి'' అనే దానిని కొంచెం సడలించాను. అందుకే అంత విశ్వసించలేదు. ఎవరైనా వింటే నవ్వుకుంటారనుకున్నాను. అయినప్పటికీ సంకల్పాన్ని వదలలేదు. మొత్తం మీద తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సం॥2002 నుండి 2018 వరకు, 16 సం॥లు సేవ చేసి 111 కోట్ల జప సమర్పణ కావించి, దాని ఫలితముచే స్వామివారికి బొట్టుపెట్టి మా ఇంటికి ఆహ్వానించాలి. ఆ తరువాత మా ఇంటికి వచ్చిన శ్రీ వేంకటేశ్వరున్ని తనివితీర దర్శించి, ఆయనతో రెండు మాటలు మాట్లాడి, పాద పూజ చేసి తిరిగి తిరుమలకు పంపాలి, ఇది సంకల్పం. దీనిని సాధించుటే లక్ష్యంగా చేసుకొని సేవను ప్రారంభించాను. నిజానికి జప సమర్పణ నా లక్ష్యం కాదు. స్వామివారిని మొత్తం 111 కోట్ల సార్లు, ప్రతి సం॥ము 7 కోట్ల కంటే తక్కువ కాకుండ, కనీసం 70 వేల మంది భక్తులచే మా కారణంగా స్మరింపచేయాలన్నది ప్రధాన సంకల్పం. దీనిని నెరవేర్చుటకు జపం వ్రాయించుటను ఆయుధంగ చేసుకున్నాము.

స్వామివారికి బొట్టు పెట్టడమనే విషయం నలుగురైదుగురికి తెలిసినప్పటికి వారిని మా ఇంటికి ఆహ్వానించుటనే విషయం, నాకు శ్రీవేంకటేశ్వరునికి తప్ప మరెవ్వరికీ తెలియదు. ఈ మొత్తాన్ని ఒక 'సింబల్ గ... లోగోగ' చేసి, ఈ లోగోను సాధించుటే శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం యొక్క లక్ష్యంగ చూపుచు సేవ చేశాము. శ్రీవేంకటేశ్వరుడు మా ఇంటికి వస్తాడన్న విషయం కాని, మా మధ్యన ఏర్పడిన పందెం గురించి కాని చివరికి నా భార్యకు కూడ తెలియదు. ఆమెకు 2021 జనవరిలో చెప్పాను. ఈవిధంగ స్వామివారి సేవను తేది 15-11-2002 నాడు ప్రారంభించి, 7 నెలల్లో ఏడు కొండల వాడికి 7 కోట్ల జపాన్ని తేది 14-06-2003న సమర్పించాము.

మొదటి 7 కోట్ల జప సమర్పణలో మేము 70300 జప పుస్తకములను పంచినప్పటికి, ఒకరు ఒకటికంటే ఎక్కువ పుస్తకములను వ్రాయుట వలన 70 వేల మందిని భాగస్వాములుగా చేర్చుటలో విఫలుణ్ణినాను. కాని ఇది మొదటి తప్పు అగుట వలన స్వామివారు స్వీకరించారు.

'నమో వేంకటేశాయ రథం' :

ఆ తరువాత ఈ 7 కోట్ల జపములో కనీసం 70 వేలమంది భక్తులను భాగస్వాములుగ చేర్చుటకు, ప్రతి సం॥ హైదరాబాద్ నుండి తిరుపతి వరకు 25 రోజుల రథయాత్ర చేయుచు స్వామివారిని ఇల్లిల్లు తీసుకు వెళ్ళుటకని ఒక మహత్తర లీలను చూపు 'నమోవేంకటేశాయ' రథమును ఏర్పాటు చేయించారు. తిరుపతిలో కట్టిన 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము' యొక్క బ్రాస్ నమూనా మరియు దీనిని నిర్వహించుటకు నియమాలు కూడా ఏర్పాటు చేసాడు. ఈ రథయాత్ర ద్వారా మాకు స్వామి వారి అమితమైన, అనిర్వచనీయమైన సేవాభాగ్యం లభించింది.

ఈ రథయాత్ర ఏర్పాటు చేయుటకు ఎన్నో లీలలను ప్రసాదించాడు. స్వామివారు మా ఇంటికి వచ్చారనే అనుభూతిని భక్తులు పొందే విధంగా చేయుటకై ఒక దివ్యమైన అనుభూతి చూపారు.

"కృతేతు నారసింహోభూత్ త్రేతాయాం రఘునందనః। ద్వాపరే వాసుదేవశ్చ, కలౌ వేంకటనాయకః" అనే విధంగా, కృతయుగంలో నారసింహునిగ, త్రేతాయుగంలో శ్రీరామునిగ, ద్వాపరయుగంలో శ్రీకృష్ణునిగ అవతరించిన భగవంతుడు ఈ కలియుగములో శ్రీ వేంకటేశ్వరునిగ అవతరించి భక్తులను కాపాడుచున్నారనే

విధంగా రథమును తయారు చేయించాడు. రథయాత్ర మొత్తం శ్రీ వేంకటేశ్వరుని మహా మంత్రమును పలుకుచు ఉండాలని దిశా నిర్దేశం చేసాడు. స్వామిని సేవించుటకై రథం వద్దకు వచ్చిన భక్తులతో స్వామి మహా మంత్రమును వ్రాయుటకు వీలుగ 'సమర్పణ క్రతువు' అనే పేరుతో ఒక కాగితపు ముక్కను ఏర్పాటు చేయమన్నారు, మరియు దానిని రథంలో సమర్పించుటకు, ముత్యాలతో అలంకరించిన ప్రత్యేకమైన శంఖులను ఏర్పాటు చేయవలసిందిగా సూచించాడు. ప్రతి ప్రక్క శ్రీ వేంకటేశ్వరుడు మరియు శంఖులతో నాలుగు ప్రక్కలు ఒకే విధంగా, అత్యంత సుందరంగా, చూచిన ప్రతి వ్యక్తి నమస్కరించే విధంగా తయారు చేసి ఒక లారీ వెనకాల చ్ఛేసిన్‌పై బిగించి, దీని ముందు భజన మండపాన్ని శాశ్వతంగా, స్వామి కృపతో ఏర్పాటు చేసాము.

స్వామివారు దీనిని ఆదిశేషునిగా భావించమని చెప్పారు. మేము ఈ రథమును తయారు చేయు సమయాన పెద్ద పామును తయారు చేయునట్లు నేను నా భార్య ఎన్నోసార్లు కల కన్నాము.

తేది 11-08-2004 రోజున అప్పటి టి.టి.డి. ఈవో శ్రీమాన్ అజయ్ కళ్యాంగారు, దీనిని తిరుపతి లోని పాదాల మండపం వద్ద ప్రారంభించి, స్వామి సేవలో ఒక నూతన అధ్యాయమని అన్నారు.

ఈ రథమును 2వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ సమయము నుండి వాడుతున్నాము. జపసమర్పణ కంటే 25 రోజుల ముందు మా ఇంటినుండి బయలుదేరిన రథయాత్ర హైదరాబాద్ లో 16 రోజులు, హైదరాబాద్ నుండి తిరుపతి వరకు ఆరేడు రోజులు తిరుగునట్లు ఏర్పాట్లు చేయుదుము. ఆహ్వానితుల ఇంటి లేదా వీధిలోనికి ఈ రథమును తీసుకెళ్ళేవారము. రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తునికి, ''సమర్పణ క్రతువు''ను ఇచ్చి, వారి కోరికలను తీర్చుమని స్వామివారిని ప్రార్థించిన తరువాత, ఈ క్రతువుపై స్వామివారి మహామంత్రమును వ్రాసి, సమర్పణ భావంతో, శరణాగతి భావంతో, రథంలో ఉన్న శంఖులలో సమర్పించమని చెప్పేవారిమి. ఈ విధంగా సేకరించిన క్రతువులు 7 కోట్ల జపంలో భాగంగా ఉండేవి.

ప్రతి సం॥ము ఈ రథం ఏ ప్రాంతాలలో తిరుగాలనే విషయం కూడా శ్రీ వేంకటేశ్వరుడే సూచించేవారు. రథయాత్ర ప్రారంభంలో నా మనసుకు వచ్చిన మొదటి ఆలోచన ప్రకారం మాత్రమే నేను యాత్రను నిర్వహించాలని దిశా నిర్దేశం చేసారు. నా భార్యను ఈ రథయాత్రకు సహకరించమని చెప్పుచు, దివ్యమైన అనుభూతులను కల్పించి ఆనందపరిచేవారు. కఠిన నియమాలను ఏర్పాటు చేశాడు. ప్రతి రథయాత్రలో మా పడక అక్కడి ''ఫుట్ పాత్'' మాత్రమే అని నిర్ణయించుకుని రథయాత్ర చేయాలి. సం॥ 2005 లో కడప వెళ్ళమనే సందేశాన్ని పొందాను. కాని అక్కడ తెలిసినవారు లేరని, వసతి దొరకదని వెనకడుగు వేశాము. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు ''నా రూంలో

చోటిస్తాను రా'' అని వ్యంగ్యంగా మాట్లాడి చివరికి తన గుడిలో చోటిచ్చారు.

నా భార్యకు స్వామివారు నాగుపాము రూపముతో బంధం ఏర్పరచారు. రథయాత్ర ప్రారంభపు రోజులు వస్తున్నాయనగా చుట్టుకున్న పాములో కదలికలు మొదలై రథయాత్ర జరుగుచున్నన్ని రోజులు తిరుగుతు ఉండేది. ఆ తరువాత మా ఇంటికి వచ్చి తిరిగి చుట్టుకొని పడుకున్నట్లు ఆమెకు కనబడేది.

ఈ రథముతోపాటు 7 గురము స్వామి సేవకులము ఉండేవారిమి. ఒక డ్రైవర్, ఒక బ్రాహ్మణుడు, నేను, మరో నలుగురం మొత్తం 7 మందిమి. రథయాత్ర సమయాన స్వామి సేవకులను మాతో సమానంగా చూడమని చెప్పేవారు. రథయాత్ర హైదరాబాద్‌లో 16 రోజులు, ఉదయం మరియు సాయంత్రం వేరు వేరు ప్రాంతాలలో తిప్పేవాళ్ళం. ఆ తరువాత హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వివిధ ప్రాంతాలలో కనీసం 5 రాత్రులు తిరగాలనే నిర్ణయం కావున మేము హైదరాబాద్ నుండి తిరుపతి ప్రయాణం 5–7 రాత్రులు ఉండునట్లు చూచుకునేవారిమి. ఒకే ప్రాంతములో ఎక్కువ రోజులు ఉండుచు, 5 రాత్రుల కంటే తక్కువైనప్పుడు వెంటనే సూచించే వారు. మేము అక్కడ మరో రోజు గడపలేని స్థితి కలిగేది.

ఈ విధంగా ఈ 'నమోవేంకటేశాయ రథయాత్ర' ను సం॥ 2004 లో ప్రారంభించి సం॥ 2019 వరకు ప్రతి సం॥ము హైదరాబాదు నుండి తిరుపతి వరకు, గోకులాష్టమికి తిరుపతిలో ఉండే విధంగా త్రిప్పాము. హైదరాబాద్‌లో 16 రోజులు త్రిప్పి ఆ తరువాత హైదరాబాద్ నుండి తిరుపతికి ప్రతి సం॥ము ఒక నూతన మార్గంలో వెళ్ళేవారిమి.

శ్రీ వేంకటేశ్వరుని సేవలలో అత్యంత తృప్తిని ప్రసాదించింది ఈ రథయాత్రనే. హైదరాబాద్‌లో కంటే బయటి ప్రాంతాలు తిరుగుతున్నప్పుడు ఎక్కువ ఆనందమును అనుభవించేవారము. రథయాత్ర తిరుపతికి చేరే సమయము వరకు ఎంతగ సమర్పించబడేవారమంటే మా సంపూర్ణ ఆస్తిపాస్తులు ఇతరులు లాక్కెళ్ళుతున్నారని తెలిసినా చలించేవాళ్ళం కాదు. వరుసగ 25 రోజులు రథయాత్ర చేసినప్పటికి మాలో ఎలాంటి నీరసము కలిగేది కాదు, కాని తిరిగి ఇంటికి వచ్చిన తరువాత, కోలుకొనుటకు 20 రోజులు పైగా పట్టేది.

జప సమర్పణలో స్వామివారి లీలలు :

ప్రతి జప సమర్పణలో శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యేకమైన లీలను ప్రదర్శించేవారు. మేము ప్రతి సంవత్సరం 7 కోట్ల జపమును హైదరాబాద్ నుండి తిరుపతికి తీసుకెళ్ళే సమయాన ఇంటిలోని 'నమో వేంకటేశాయ' షెడ్డులో ప్రత్యేక పూజలు చేసేవారిమి. మరియు ప్రతి గోకులాష్టమి కంటే ఒకరోజు ముందు, ఈ మొత్తం జపమును తిరుపతిలో అలిపిరి వద్దనున్న శ్రీవారి పాదాల మండపముపై పెట్టి పూజించేవారిమి. అప్పుడు స్వయంగ శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తి వచ్చి ఆ పాదాల మండపములో నిలిచి మా పూజను స్వీకరించేది. ఆయనను తనివితీర చూస్తూ, ఆయన పాదాలకు పూజ చేసేది. మరియు గోకులాష్టమి నాడు, జప సమర్పణ సమయాన తిరుపతిలో ఎస్వీ డైరీఫాంలో ఉన్న శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం ముందు ఈ మొత్తం జపమును 5' X 6' సైజు గల ఒక కుప్పగ పేర్చి పూలతో అలంకరించి జపం వ్రాసినవారి కోరికలు తీర్చండని ప్రార్థిస్తూ, జప హోమాదులు చేసేవారిమి. ఇదే కాలములో స్వామివారు అద్భుతమైన చమత్కారమైన లీలను చూపేవారు. ఈ మొత్తం 5' X 6' సైజు గల జపం కుప్పపైన తన రెండు పాదములను, మొత్తం జప పుస్తకాలు తన పాదాల క్రింద ఉండునట్లు, జపం పైన విరాట్ రూపునిగా నిలబడేవారు. నాకు ఆయన పాదాలు మరియు ఆ పాదాలపై స్వామివారు ధరించిన ధోవతి యొక్క అంచు మాత్రమే కనబడేది. స్వామి వారు ఆకాశమున నిలబడినట్లు భ్రమ కలిగేది. కాని ఆయన

నల్లని పాదాలను స్పష్టంగ చూచేవాడిని. ఆ పాదాలకే పూజ చేస్తూ, తన్మయత్వము చెందేవాణ్ణి. ఇలా ప్రతి జప సమర్పణలో జరుగుతున్నది. ఈ దృశ్యం నాకు మాత్రమే కనిపించేది. ఈ విధముగ ప్రతి జప పుస్తకము వ్రాసిన భక్తుణ్ణి అనుగ్రహించేది. ఇలా ప్రతి జప సమర్పణలో రెండుసార్లు ఆయన పాదాలను, ఒకసారి మూల మూర్తిని చూస్తూ పూజ చేయుట స్వామివారు నాకిచ్చిన మహాభాగ్యం.

తన పాద సేవక వృత్తిని ప్రసాదించి, త్రిదండి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామిగారిచే 'గోవింద దాసు'గ దాస్య నామకరణం చేయించాడు. సెప్టెంబర్ 2003 నుండి నా దిశను మార్చే ప్రయత్నాలు చేయుట మొదలు పెట్టాడు. భవిష్యత్‌లో తీవ్రమైన కష్టాలు రాగలవని, ప్రతి క్షణం స్వామి నామాన్ని స్మరిస్తూ జీవించమని దిశా నిర్దేశం చేసాడు. మరియు ప్రతిసారి ఆలయాల దర్శనం అవసరం లేదని ఇంటిలోనే సాధన చేసుకొమ్మని సూచించాడు. విశ్వము తన ఆధీనములో ఉన్నదని, క్షణంలో కొండలను లోయలుగ, లోయలను కొండలుగ మార్చగలనని కూడా తెలిపారు. ఒక రకంగా భవిష్యత్‌లోనీ ఆర్థిక పరిస్థితిని హరించి వేయుదుననే సూచననిచ్చాడు. నీకు ముందు వెనుకాల నేనున్నాను, భయపడకుమని సూచించారు. ఇదే కాలంలో 'శ్రీవేంకటేశం' అనే ఒక తెలుగు మాస పత్రికను స్థాపించమని దాని ద్వారా భవిష్యత్‌లో మీరు గోవిందుని పొందగలరని సూచించాడు.

స్వామి సేవా మార్గములో, రాళ్ళు రప్పలు లాంటి ఎన్ని ఆటంకాలు వచ్చినా లెక్క చేయకూడదని, స్వామిని చేరుటే లక్ష్యంగా చేసుకొని ఈ పత్రికను నడపమన్నారు. ఇది మాకు యోగ్యతను పెంచే సాధనముగ ఉండగలదని సూచించారు. చివరికి నన్ను ఆధ్యాత్మకి పై తరగతిలో అంటే యం.టెక్ లో చేర్పించారు. చక్కగా చదివి ఉత్తీర్ణుడవు కమ్మన్నారు.

హైదరాబాద్‌లో మాకు ఒక ఇల్లును ప్రసాదించమని చేసిన ప్రార్థన కనుగుణంగా ఒక సం॥ ముందే ఆ ఇంటి ప్రదేశమును చూపించారు. ఆ తరువాత అక్టోబర్ 2004 లో హబ్సిగూడలోని రోడ్ నెం.2, కాకతీయనగర్‌లో ప్రసాదించాడు. స్వామి ప్రసాదించారు కాబట్టి ఆనందముతో విశాలంగా కట్టుకుని 'శ్రీవేంకటేశ్వర ప్రసాదం' అని పేరు పెట్టుకున్నాము.

స్వామివారు ప్రసాదించిన ఇంటి గృహప్రవేశ సమయమున శ్రీవేంకటేశ్వరుని మా ఇంటికి భోజనానికి ఆహ్వానించాను. అప్పుడు ''నీ ఊరిలోని ఇంటిలోనికి వచ్చి భుజించెదను'' అని అన్నారు. దీనర్థం అప్పుడు నాకు తెలియలేదు. హరినామ క్షేత్రం ఏర్పాటు చేసిన తరువాత తప్పక వచ్చెదనని దీనర్థం. ఇప్పుడు మాత్రం నా బదులు శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని పంపుచున్నానని చెప్పి, వారిని పంపారు.

జనవరి 2005 న, తాను సాక్షాత్ శ్రీమన్నారాయణుడనని, బ్రహ్మ మొదలగు సమస్త దేవతలకు మూలం తానేననే జ్ఞానమును ప్రసాదించారు. ప్రస్తుతము శ్రీవేంకటేశ్వరుడనే తొడుగును ధరించి ఉన్నానని చెప్పారు. అయినప్పటికి ఈ సృష్టికి మూలం శ్రీవేంకటేశ్వరుడే అనే భావంలో నేను ఎలాంటి మార్పు చేసుకోలేదు.

ఒక సందర్భములో నేను పరమశివుడిని ప్రార్థించి వెనుతిరుగునప్పుడు, ''ఈ రాత్రి నీకు దర్శనమిచ్చెద''ననే సందేశమును పరమశివుడి నుండి పొందాను. వెంటనే ప్రభూ! మీరు నా ఆనందం కోసం మీ దర్శనాన్ని ప్రసాదిస్తున్నారని, అందుకు ధన్యవాదములు తెలిపి, ఒకవేళ మీరు నా స్వామి తిరునామం ధరించి దర్శనమిచ్చినచో మరింత ఆనందించుదుననన్నాను. ఆ రాత్రి కలలో ''చూడు చూడు అంటూ తన తిరునామాన్ని ప్రత్యేకంగ చూపుచు, తిరుపతి కపిల తీర్థం ఆలయంలోని శేషశయనుడైన శ్రీలక్ష్మీనారాయణుడు దర్శనమిచ్చారు.

గత కొన్ని సం॥ల నుండి,శ్రీ వేంకటేశ్వరుడు నా వాడని, నేను చెప్పింది చేయుననే భావం నాలో క్రమంగా

సడలిపోయింది. స్వామివారు ఏదో ఆశించి నన్ను ప్రత్యేక మార్గంలో పయనించునట్లు చేస్తున్నారని ఆయన అనుకున్నట్లుగ నేను నడుచుకొనుటే నా ధర్మమనే భావం కలిగింది. స్వామివారిపై విశ్వాసము పెంచే ఎన్నో లీలలను కల్పించాడు. సంఘంలో అత్యంత సాధారణ వ్యక్తిగా, ఎలాంటి ఆర్భాటాలు లేకుండా జీవించమన్నాడు.

శ్రీవేంకటేశ్వరుడు ఎలాగైనా నన్ను తన దారిలోనికి తెచ్చుకొనుటకు విశ్వప్రయత్నాలు చేసారు. అవసరమైతే ద్వంద్వ అర్థాలను ఉపయోగించి ఒక ప్రక్క నన్ను సంతోషపరుస్తూ, మరోప్రక్క తన దారిలోనికి తెచ్చుకునేవారు.

నేను శ్రీ వేంకటేశ్వరుడు చెప్పినట్లు నడుచుకుంటేనే, నా సేవను స్వామివారు స్వీకరించేది, అలాకాక ఎప్పుడైన నా సొంత అభిప్రాయాల ప్రకారం చేసినచో, ''నీ సేవ స్వీకరించను. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో'' అని అనేవారు. వెంటనే నా అభిప్రాయాన్ని మార్చుకునేవాడిని.

అత్యంత కఠిన సాధన చేయించారు. ''అతడు నీతో సరిగా మాట్లాడుటలేదు నీవెందుకు మాట్లాడుచున్నావనేవాడు''. అవసరము లేనిచోట మాట్లాడకుమనేది, స్వామివారిని స్మరిస్తూ గడపమనేది. లేనట్లైతే మన దారిలో ఆటంకాలు కలుగునని దీని ఉద్దేశ్యం.

ఏప్రిల్ 2005 న నా భాగ్యం పండింది. 'నమో వేంకటేశాయ' రథమును స్వీకరించుటకు, నా షరతులను ఒప్పుకొనుచు నన్ను పరమానందభరితుణ్ణి చేసాడు. అర్జునుని తరువాత అంతటి అదృష్టవంతుణ్ణి నేనే అనే భావం నాలో కలిగేలా అనుగ్రహించాడు. స్వామివారు తన వివిధ రూపాలను చూపాడు. మరోసారి పూర్వం ద్రౌపదిని అనుగ్రహించినట్లు అనుగ్రహించాడు.

ఒకసారి స్వామి లీలలు కలలు కదా! ఇవి నిజమెలా అవుతాయి, అనే అనుమానం వచ్చింది. వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు ఇవి కలలు కాదని, నిజం అని చెప్పుచు, కలలో నన్ను స్పృశించాడు. వచ్చే 3 రోజుల వరకు ఆ స్పృశించిన భాగం ప్రత్యేకంగా ఉందునని చెప్పాడు. అది అట్లే జరిగింది. అప్పటి నుండి శ్రీ వేంకటేశ్వరుడు కల్పించు ప్రతి కల నిజమని నమ్మి అనుమానించకూడదనిపించింది.

ఎప్పుడైన నా మనస్సులో స్వామి సంకల్పానికి విరుద్ధమైన భావాలు కాని, మరో చెడ్డ భావాలు కాని ప్రవేశించినపుడు వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు కలుగ జేసుకొని, ఇది మంచిది కాదు, వదులుమనేవాడు. మరియు మా సేవలో ఏదేని లోపం జరిగినప్పుడు సరిదిద్దేవాడు.

ప్రతిసారి స్వామివారు చెప్పదల్చుకున్న విషయాన్ని, ఆర్తితో ప్రార్థిస్తేనే చెప్పేవారు. ఆ విషయాన్ని ఆర్తితో ప్రార్థించుటకు కావలసిన పరిస్థితులను నా చుట్టూ కల్పించేవారు. ఒకసారి బలవంతులైన దుండగులు నా ఆస్తిని కబళించుకున్నారు. నేను బలహీనున్ని, ఒంటరిని, వెనక ముందు ఎవరూ లేని వాడిని, రక్షించమని వేడుకున్నప్పుడు, ''వెనుకా ముందూ'' నేనున్నానన్నారు.

స్వామివారి ఆలింగనము :

జీవితంలో ఒకసారి చాలా దెబ్బ తిన్నాను. చాలా కష్టాలను, అవమానాలను ఎదుర్కొన్నాను. ఎంతో విలువైన ఆస్తులను కోల్పోయాను. ఇదంతా కూడా శ్రీ వేంకటేశ్వరుని ఆజ్ఞతోనే జరిగిందని భావించి ఆయనపై కోపము ఏర్పడ్డది. మీరు నా కోరికనే నెరవేర్చనప్పుడు, నేను మీ 'నమో వేంకటేశాయ రథము'ను తీసుకొని, ఇల్లిల్లు తిరుగుచూ, మీరు స్వామివారిని స్మరించండి, మీ కోరికలను స్వామివారు తీర్చునని ఏ విధంగా భక్తులను అడగాలని అన్నాను. నన్ను మోసగించారనే భావం కూడా మనస్సులో ఏర్పడ్డది. నేనంటే స్వామివారికి ఇష్టం లేదనే

భావం ఏర్పడ్డది. మొత్తం మీద ఆయనపై అలిగి ఉన్నాను.

దీనిని గమనించిన శ్రీ వేంకటేశ్వరుడు తేది 10-01-2006 వైకుంఠ ఏకాదశిరోజు తన యోగమాయను హైదరాబాద్‌లో ఉన్న నా వద్దకు పంపి, నన్ను బంధించి తిరుమలలో తన ముందు నిలబెట్టి, నేనంటే తనకెంతో ఇష్టం అని చెప్పుచు ఆలింగనము చేసుకున్నాడు. క్షణంలో నేను పొందిన కోపము, ఆస్తి పోయిందనే దుఃఖము మాయమైపోయింది. నా ఆస్థి ఒక ప్రక్క, స్వామి ఆలింగనాన్ని మరో ప్రక్క త్రాసులో వేసి చూచుకున్నాను. స్వామి ఆలింగనము ఎంతో బరువైందని తేలిపోయింది. ఏదో సాధించుటకు కొన్ని కఠిన నియమాలతో శిక్షణ ఇస్తున్నాడనిపించింది. స్వామివారు చెప్పినట్లే నడచుకోవాలనిపించింది. ఆస్తిని హరించుట ఇందులో భాగమేననిపించింది. ప్రతి క్షణము స్వామివారిని స్మరించుటకు ఈ పరిస్థితి అవసరమనిపించింది.

ఆర్థికంగా ఎంతో అధమ స్థాయిలో ఉన్నాము. కొన్నిసార్లు నా భార్య బంగారం కుదువ బెట్టి వచ్చిన డబ్బుతో సేవ చేశాము. మా పిల్లల చదువులు, సంసారము, పొడిగించుకుంటూపోయే స్వామి సేవ ఏ విధంగా చేసేదని నా భార్య భోరున విలపించిన సందర్భాలు ఎన్నో ఉన్నవి.

మాకు తెలిసిన అందరు కూడా స్వామివారు ప్రసాదించిన రాజభవనము లాంటి మా ఇల్లును చూచి, స్వామివారి సేవలో ఆనందంగా చేయు లక్షల రూపాయల ఖర్చులను చూచి, వీరు అత్యంత ధనవంతులనే అభిప్రాయాన్ని కల్గి వున్నారు.

ఒక లీలలో నన్ను బద్రినాథ్ తీసుకెళ్ళారు. స్వామివారి దర్శనార్థియై గుడిలోనికి ప్రవేశించగనే, ఎడమ ప్రక్కన ఉన్న శ్రీఆంజనేయుణ్ణి చూచుచు అలాగే నిలబడ్డాను. దీనిని సహించలేని అక్కడి పూజారి ''నీ గోవిందుడు ప్రక్కన ఉన్నాడు అక్కడికి వెళ్ళమని'' కఠినంగా చెప్పాడు.

శ్రీవేంకటేశం మాసపత్రిక :

సం॥ 2007 ఏప్రిల్ నుండి 'శ్రీవేంకటేశం' మాసపత్రికను, స్వామి వారి ఆజ్ఞచే ప్రారంభించాము. ఈ సేవను ప్రారంభించుటకు స్వామివారు చాలా కష్టపడ్డారు. నేను ఈ పత్రికను స్థాపించలేనని, నావల్ల కాదని, మీరు తప్పుడు వ్యక్తిని ఎన్నుకున్నారని, నాకు తెలుగు రాదని, పైగా ఇతర పనులు ఉన్నాయని చెప్పుచు ఒక 4 సం॥లు లాక్కొచ్చాను. చివరికి నేను చెప్పిన ప్రతి ఆటంకాన్ని త్రుంచివేసి, స్వామివారు చూపిన దారిని ఎన్నుకునేలా చేసాడు. ఇలా ప్రారంభమైన ఈ మాసపత్రికను కొన్ని సం॥లు నడిపి మానేద్దామని అనుకున్నప్పుడల్లా, స్వామివారు కొనసాగించమని ఆజ్ఞాపించేవారు. ఒకసారి కత్తి మెడపై పెట్టి చేస్తావా, ఛస్తావా, అన్న సందర్భం కూడా ఉన్నది. ఈమధ్య నొకసారి ఆపుదామనుకున్నప్పుడు దగ్గరి కొచ్చేసరికి దమ్మొచ్చిందా?'' అంటు వ్యంగ్యంగా మాట్లాడాడు. చివరికి స్వామివారి లీలలకు ప్రతిఫలంగా దీనిని వారు స్వయంగా చాలు అనే వరకు కొనసాగించాలని నిర్ణయించుకున్నాము.

తేది: 17-02-2008 భీష్మ ఏకాదశి రోజు నన్ను ఇంజనీరింగు కళాశాలలో మాస్టర్ డిగ్రీలో చేర్పించి,

ఆధ్యాత్మిక విద్యను చదివి ఉత్తీర్ణుడవు కమ్మని దిశా నిర్దేశం చేశాడు. నా యోగ్యతను పెంచుకొమ్మన్నాడు. 'నా' అన్నది వదిలించుకోమన్నాడు. నేను 'నా' అన్నది వదిలినప్పుడు ఒక బహుమానం ఇస్తానన్నాడు. ఒక రెండు పర్యాయాలు, మూడు నెలల చొప్పున సాధన చేసి బహుమానాన్ని అడిగాను. బహుమానానికి ఇంకా యోగ్యునివి కాలేదన్నాడు. చివరికి ఇంతకంటే 'నా' అన్నది ఎవ్వరు వదలలేరని, మాకు బహుమానం ఇచ్చే ఉద్దేశ్యం లేక ఈ విధంగా అంటున్నారనే భావం నా మనస్సులో ఏర్పడ్డది. అప్పుడు స్వామివారు నా స్థితిని తెలుపుటకని తిరుపతి నుండి శ్రీశ్రీశ్రీ హయగ్రీవస్వామివారిని గురువుగా మా ఇంటికి పంపి నా అంతరంగ స్థితిని తెలుసుకునే విధంగా చేసారు. అప్పుడు 'నా' అన్నది నేను వదలలేదని స్పష్టంగా తెలిసిపోయింది. ఆ రోజు నుండి నేటి వరకు నేను ఇంతవరకు మళ్ళీ బహుమానమును అడుగలేదు. మరియు మీ కృప ఉంటేనె 'నా' అన్నది వదులుట సాధ్యమని, లేని పక్షంలో నా వల్ల కాదని ఎన్నోసార్లు చెప్పాను.

సాధన ఏ విధంగా చేయాలని నేనడిగిన ప్రశ్నకు, వందమందిలో ఉన్న ఒక సాధువు వెల్లకిలా పడుకొని, తన ముఖముపై బట్ట కప్పుకుని, మట్టిని కొప్పెరలా ముఖముపై పేర్చుకొని, శ్వాస మరియు ఆహారం కోసం ప్రత్యేకమైన పైపులు ఏర్పాటు చేసుకొని ఏ విధంగా సాధన చేస్తూ జీవించునో ఆ విధమైన జీవితమును గడపమన్నాడు. అంటే జనాల మధ్యన ఉన్నప్పటికీ, వారి మాటలకు ప్రభావితుడ్ని కాక, సదా శ్రీ వేంకటేశ్వరున్ని స్మరిస్తూ గడపమన్నారు. వీలైనంత వరకు ఏకాంత జీవనము గడపమన్నారు.

హరిసేవ చేయుట అత్యంత కఠినము, వెతికితే మూడు కాళ్ళ కుందేలును సహితము సాధించవచ్చునేమో గాని, హరి సేవను చేయుట అంతకంటే కష్టమని స్వయంగా అన్నమాచార్యులు అన్న మాటలివి. ఇలాంటి హరిసేవను మేము ఎంతటి కష్టమును ఎదుర్కొంటు చేస్తున్నామనే దానిని ఒక లీల ద్వారా చూపి మేము చెందే తపనను చూపెట్టాడు.

ఎంతటి స్వామివారి అనుగ్రహానికి పరవశించి, స్వామి ఋణం తీర్చుకొను నిమిత్తమై జీవితం మొత్తం అంకితం చేసి సేవ చేస్తున్నానో, ఇలాంటి అనుగ్రహాలు 14 అనుగ్రహించినట్లు చెప్పారు. ఈ మాట జూన్ 2008 న చెప్పారు.

2008 లో నా భార్య సురేఖ తన బంగారాన్ని కొంత వెచ్చించి 'నమో వేంకటేశాయ' రథంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరుని నాలుగు మూర్తులకు బంగారు తాపడం చేయించింది. దీనికి పరవశించిన స్వామివారు ఈ సంవత్సరపు రథయాత్రలో ఆమెను ప్రత్యేకంగా అనుగ్రహించాడు. సురేఖ ఎంతో ఆనందించింది.

అక్టోబర్ 2008 లో మా అమ్మ చనిపోవుటకు ఒకరోజు ముందు మా అమ్మ చనిపోవుతున్నదని గ్రహించి, ఆమె ప్రసాదించిన ఈ జీవితమునకు కృతజ్ఞతలు తెలిపే నిమిత్తమని ఆ రోజు వరకు నేను ఆర్జించిన మొత్తం పుణ్యంలో 3 వ వంతు ఆమె అకౌంటుకు ధారపోసి, మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించమని శ్రీ వేంకటేశ్వరుణ్ణి వేడుకున్నాను. స్వామివారు కూడా అనాదిగా వస్తున్న మా ఇంటి శైవ సాంప్రదాయ ప్రకారం కాకుండా, వైష్ణవ సాంప్రదాయ ప్రకారం, ఆమెకు అపర కర్మలు నిర్వహించుమని చెప్పుచు, నా ప్రార్థనను స్వీకరించినట్లు సూచాయగా తెలిపారు.

మా తల్లి చనిపోయిన బాధలో స్వామివారి సేవకు కొంత అవరోధము కలిగింది. దీనిని గమనించిన స్వామివారు ఆయన స్వయంగా మా ఇంటికి వచ్చి నా భార్యతో ''నన్ను మరిచారా'' అని అంటూ తిరిగి తన సేవలో నియమించుకున్నారు.

స్వామివారు ఈ విశ్వంలో ప్రతి దేశములో ఉన్నాడు. అమెరికాలో కూడా ఇండియాలాగ నదులు, దేవాలయాలు, భక్తులు ఉండి పూజలు చేసుకుందురు, కాకుంటే విధి, విధానాలలో కొంత వ్యత్యాసముండునని సూచించాడు.

స్వామివారి స్పర్శ సుఖము :

13-01-2009 : ఒక భక్తుడు, భగవంతుణ్ణి ఎన్ని రకాలుగా వాడుకోవాలో నేను అన్ని రకాలుగా వాడుకున్నాను. ఒక రకంగా ఆయనతో ఎన్నో ప్రయోగాలు (ఎక్స్పరిమెంట్స్) చేసాను. ఒకానొక సందర్భములో స్వామివారి స్పర్శ సుఖమును అనుభవించాలనిపించింది. బలి చక్రవర్తి తలపై త్రివిక్రముడు కాలుపెట్టినప్పుడు, ఆ స్పర్శ సుఖమును ఆయన ఏ విధంగా అనుభవించాడో అలాంటి స్పర్శ సుఖమును నాకు కల్పించుమని ప్రాధేయపడ్డప్పుడు స్వామివారు అదే విధంగా అనుగ్రహించారు. నేను ఎంతగా పరవశుణ్ణి అయినానంటే ఈ లోకంలో నా కంటే అదృష్టవంతుడు మరొక్కడు లేరనుకున్నాను. స్వామివారికి శతకోటి కృతజ్ఞతలను తెలుపుకున్నాను. అప్పుడు ఈ విశ్వంలో ఎక్కడ చూచినా స్వామివారే కనబడ్డారు.

19-06-2009 : మా మొదటి అమెరికా ప్రయాణానికి స్వామివారిని అనుమతి అడిగాను. అప్పుడు సౌకర్యవంతమైన జీవితమునకు, వస్తువులకు అలవాటు పడకుమని మరీ మరీ చెప్పారు. అమెరికాలో నాకు ఎన్నో ముఖ్య విషయములు బోధించారు. ఒకసారి తన పాదాలను ప్రత్యేకంగా తయారు చేసి, వాటి వద్ద మేళతాళాలతో, శ్రావ్యమైన సంగీతముతో భజనలు, పూజలు చేసేవారిని అత్యంత ఇష్టులుగ అనుగ్రహించుదుననన్నారు. నన్ను దీనిని ఏర్పాటు చేయవలసిందిగా దిశా నిర్దేశం చేశాడు. ప్రపంచములో తానే అధికుడునని, పెద్దవాడినని, బ్రహ్మకడిగిన పాదమును చూపుచు హితబోధ చేసాడు.

మేము సం॥ 2009 నుండి సం॥ 2022 వరకు 15 సార్లు అమెరికా వెళ్ళి ఉంటాము. అమెరికాలో ఉన్నప్పుడు స్వామి సేవకు దూరమైన కారణంగ, స్వామిపై ఆర్తత ఎక్కువుంటుంది. బహుశా ఇదే కారణంగ ముఖ్యమైన విషయములను నేను అమెరికాలో ఉన్నప్పుడే చెప్పారు. మరియు ప్రతిసారి నీవు సౌకర్యవంతమైన, సుఖవంతమైన జీవితానికి అలవాటు పడకూడదని పదే పదే సూచించేవారు.

హరినామ క్షేత్ర భావన :

సంవత్సరం 2009 లో హైదరాబాద్ నుండి తిరుపతి రథయాత్ర సమయాన, గుంటూరు లోని ''శ్రీరామనామ క్షేత్రం'' వారు మాకు ఒక రాత్రి బస ఏర్పాటు చేశారు. ఆ క్షేత్రంలో అడుగు పెట్టగానే అందులో జరుగు అఖండ రామనామ కీర్తనలను విని పరవశించిపోయాను. వెంటనే ఆ సంస్థను ఏర్పాటు చేసిన వ్యక్తికి సాష్టాంగ దండప్రణామం చేశాను. వెనువెంటనే నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మరో సాష్టాంగ ప్రణామం చేసి ఈ సేవను నాకు ప్రసాదించమని, తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించి, మీ యొక్క అఖండ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుట నాకు ఇష్టమని, దీనిని ప్రసాదించమని నా ఒళ్ళు గగుర్పాటు చెందగ, కళ్ళ నుండి నీరు కారుచుండగ వేడుకున్నాను. ఈ విధంగా మొదటిసారి నా మనస్సులో ఈ భావన కలిగింది.

2009 వరకు ఆర్థికంగా ఎదుగుటకు నేను ప్రయత్నించాను. కాని శ్రీ వేంకటేశ్వరుడు నన్ను పై నుండి క్రిందికి లాగాడు. సం॥ 2011 నుండి మాత్రం నాలో మార్పు వచ్చి, కొంతవరకు మెరుగైన దశలో నిలకడగ ఉన్నాను. ఇప్పుడు నాలో శ్రీ భరత మహారాజు యొక్క భక్తి బీజమును నాటాడు. ఇది భవిష్యత్‌లో ఒకప్పుడు చిగురిస్తుంది.

భజగోవిందం :

నా భాగ్యవశాత్తు సం॥ 2000 నుండి ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి రోజులలో తప్పక స్వామివారి అనుగ్రహమును పొందేవాడిని. ఈవిధంగా ప్రతిసారి జరుగుటచే దీని వెనుక ఏదో మర్మమున్నదని

భజగోవిందం కార్యక్రమం

భావించాను. అన్నట్లుగనే సం॥ 2007–2009 లో శ్రీమాన్ కె.వి.రమణాచారిగారు టిటిడి ఈఓగా ఉన్నప్పుడు 'భజగోవిందం' అనే ఒక భజన కార్యక్రమమును తిరుపతిలో ఏర్పాటు చేసారు. మరియు దీనిని ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి పర్వదినాలలో హైదరాబాదులో ఏర్పాటు చేయవలసిందిగ సం॥ 2009 లో నాతో చెప్పారు. ఇది స్వామివారి ఆజ్ఞగా భావించి సం॥ 2009 నుండి ప్రతి వైకుంఠ ఏకాదశి మరియు తొలి ఏకాదశి రోజులలో హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటను ప్రారంభించాము.

ఇంజనీరింగు పరీక్షలు దగ్గరికి వస్తున్నవి. నేను మాత్రం ఏమీ చదువలేదు. దిగులుతో ఉన్నాను. నాతో చదివిన ఇంజనీరింగు మిత్రులను చూపి, వారు బొజ్జలు పెంచి ఉన్నారు. నీవు సన్నగ ఉన్నావు. చూడు వారి వారి రంగములో వారు ఎదిగారు. నీవు నీ ఆధ్యాత్మిక రంగములో ఎదగవలసి ఉందని దిశా నిర్దేశం చేసారు. భౌతిక రూపులను ఆధ్యాత్మిక ఎదుగుదలతో పోల్చుచు దిశా – నిర్దేశం చేసారు.

అక్టోబర్ 2011న తిరుపతిలో స్థూపం నిండినదని, నీ ఒక సంకల్పం పూర్తయినదని సూచించారు. చక్కగ సేవ చేస్తున్నట్లు సూచించారు. మరో లీలలో నా స్వామిని ఎంతో ఉన్నతుడుగ ఊహించుకున్నాను. స్వామివారిని త్రివిక్రముడుగ, బ్రహ్మ కడిగిన పాదమును నిర్మించాలనే కోరిక కలిగింది. కాని నాకు తగిన స్తోమత లేదని ఊరుకున్నాను.

డిసెంబర్ 2011 : నా భార్య సురేఖ, మా పిల్లలు తన మాట వినని కారణంగా విసుగెత్తిపోయి, స్వామివారిని సంతోషాన్ని ప్రసాదించమని వేడుకున్నది. అన్నట్లుగనే మా పెండ్లైనప్పటి నుండి జరిగిన ఆనందకర సంఘటనలను చూపి పరవశింపచేసాడు.

అన్నీ కోల్పోయిన వేళలో కూడా అఖండమైన భక్తి శ్రద్ధలతో స్వామి సేవ చేయమన్నాడు. అన్యమతస్తుల మధ్యన నివసించు హరిదాసు జీవితము గడుపమన్నాడు. తోటి మనుషుల ఆదరణతో సంబంధం లేకుండ, ఎంతో ఆనందంగ, ప్రతిక్షణం శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ గడపమన్నారు. నీ పని నీవు చేసుకుపొమ్మన్నారు.

పద్మపీఠం :

మార్చి – 2012 : హైదరాబాద్‌లో ఉన్న పెద్ద పెద్ద బిల్డర్స్ సరసన నేను ఉండేవాడిని. కాని నా స్వామి ఆజ్ఞచే ఎదగలేకపోయాననే చింత కలిగింది. వెంటనే నీవు 'పద్మపీఠం' అనే బిల్డింగ్‌ను నిర్మిస్తున్నావని, ఆ పీఠం రాబోవు రోజులలో శ్రీ వేంకటేశ్వరునికి నిలయం కాగలదని సూచించాడు. స్వామివారు చూపిన ఎన్నో లీలల సారాన్ని మొదట్లో గ్రహించలేదు. సం॥ 2020 తరువాత, నేను కొంత యోగ్యతను సాధించిన తరువాతనే చాలా లీలలను అర్థం చేసుకున్నాను. తరువాత అర్థం చేసుకున్న వాటిలో ఇది ఒకటి.

ఏప్రిల్ – 2012 : నన్ను ఆర్థికంగా దిగజార్చి తన వద్దకు చేర్చుకొన్నందులకు స్వామివారు ఎగిరి గంతేసినంత సంతోషించారు. మరియు నన్ను ఎలాంటి వ్యామోహానికి గురి కాకూడదని పదే పదే సూచించారు.

సం॥ 2012 నుండి శ్రీ వేంకటేశ్వరుడు మరో అడుగు ముందుకు వేశారు. సం॥ 2002లో, నా కుటుంబ పోషణార్థమే వ్యాపారము చేయుటకు అనుమతించారు. ఇప్పుడు దానిని కూడా మానమని, పూర్తి సమయము స్వామి సేవలో గడపమని, మిగిలిన మొత్తం విషయాలు తానే చూచుకొనునట్లు సందేశం ఇచ్చారు. జామచెట్టుకు బొప్పాయి కాయల సైజు కలిగిన జామ కాయలను కాయిస్తానన్నారు. నన్ను ఇంటినుండి బయటకు వెళ్ళకుండా సాధన చేయమన్నారు.

ఒకసారి మా రథయాత్రకు ఏర్పాట్లు జరుగు సమయమున తలతిక్క గలిగిన ఒక క్రిస్టియన్ ఫోన్ చేసి నీవు రథయాత్ర లాంటి చాలా సేవలు చేస్తున్నావు. ఇంతకు స్వర్గం ఉన్నదా? అంటూ మాట్లాడాడు. ఒక రకంగా నన్ను ఆ సమాజంలోకి ఆహ్వానించాడు. ఆ సమయాన ఏదో ఒకటి మాట్లాడి ఫోన్ పెట్టేశాను. సరైన జవాబు ఇవ్వలేదని బాధపడ్డాను. దీనిని గమనించిన శ్రీ వేంకటేశ్వరుడు ఇలా అన్నాడు. ''నీవు గోవిందుని చూపించగలిగితే నీవన్నట్లు చేస్తాననకపోయావా?'' అని అన్నారు.

స్వామివారు ఆశించినంత కాకపోయినా, నా ఆధ్యాత్మిక స్థితి కొంత మెరుగైందని స్వామివారు కల్పించిన ఈ క్రింది లీలలద్వారా తెలిసింది.

ఒకరోజు మాటల సందర్భముగా, నేను సంపూర్ణంగా శ్రీవేంకటేశ్వరునికి అంకితమైపోయానని, నా మిత్రులతో అన్నాను. దీనికి పరవశించిన స్వామివారు ఆ రాత్రి తన దివ్య దర్శన భాగ్యాన్ని కలుగచేసి ఆనందింపచేసారు.

గుంటూరు ప్రాంతమున గల ఒక భక్తురాలు, తనకు భాగవతులకు భోజనము పెట్టాలనే కోరిక ఉన్నదని, భాగవతులను వారి ఇంటికి పంపి తన కోరికను తీర్చమని స్వామివారిని వేడుకొంది. అప్పుడు ఆమె కలలో కొంతమందిని చూపి వీరికి భోజనము పెట్టమన్నాడు. కొంతకాలం తర్వాత మా రథయాత్ర ఆ ప్రాంతములో తిరుగుటను చూచి ఆత్రుతతో వారు మమ్మల్ని రాత్రి భోజనానికి రమ్మని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. భోజనానంతరము శ్రీ వేంకటేశ్వరుడు చూపింది నన్నేనని, నా రూపు, వేషధారణ తనకు ఇంకా గుర్తుందని, తన కళ్ళలో ఆనందబాష్పాలు తిరుగుతుండగా చెప్పి ఆనందించింది.

ఒకసారి మా రథయాత్రను కర్నూలులో పోలీసువారు అడ్డగించారు. తిరగనివ్వలేదు. ఈ విషయాన్ని స్వామివారికి అత్యంత తొందరగ తెలపాలని భావిస్తూ పడుకున్నాను. ఆ రాత్రి కలలో కొన్ని వేల మంది భక్తులు, తమ విన్నపాలను స్వామివారికి విన్నవించ వేచి చూస్తున్నప్పటికీ, ఎవ్వరూ అడ్డగించని, అంతరంగికులు వెళ్ళే మార్గంలో స్వామివారి వద్దకు వెళ్ళాను. అంటే నేను స్వామివారి అంతరంగికుణ్ణని అర్థం.

అయినప్పటికి, నాకు ఇప్పటివరకు స్వామిపట్ల సమర్పణ స్థితి సగము మాత్రమే పెరిగిందని సూచించాడు. ఇంకా చాలా ఎదగవలసిందని దీని భావం. ఇదే సమయంలో నీవు వ్యాపారం చేసినచో దాని ఫలితమును నీకు దక్కనివ్వనని, పూర్తిగా మానివేయమని, సాధన చేయమని ఆదేశించారు.

15-12-2012 : సం॥ 2000 ప్రాంతములో శ్రీమహాలక్ష్మీ అనుగ్రహము లభించింది. కాని ఆ తరువాత రోజులలో ఆమె అనుగ్రహము శ్రీ గోదాదేవి రూపంలో మాత్రమే లభించేది. ఒక సందర్భములో నేను 'భజగోవిందం' మరియు ఇతర కార్యక్రమాలను చేయుటలోని ముఖ్య ఉద్దేశ్యమును ఒక తమిళ పాశురమును పాడి తెలిపింది. దాని అర్థం నేను 'గోవిందుని పొందుట'కని గోదాదేవి అన్నది.

మా తల్లి గారితో మా కుటుంబం..

జన్మ జన్మల సేవను ప్రసాదించుట :

17-01-2013 : ఈ రోజు స్వామివారు ఒక మహత్తరమైన వరమును ప్రసాదించారు. నేను ఏ రోజు స్వామివారిని మోక్షం కోరలేదు. ఎన్నో జన్మలు మానవునిగా జన్మనిచ్చి, మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించమని పదే పదే వేడుకున్నాను. అన్నట్లుగనే ఆ వరం ఈ రోజు ప్రసాదించారు. పూర్వం అల్పాయుష్కుడైన మార్కండేయుణ్ణి ఏ విధంగా పూర్ణాయుష్కునిగ చేసాడో నిన్ను కూడా ఆ విధంగా అనుగ్రహించుదునన్నారు. అంటే ఎన్నో జన్మలు మానవునిగ జన్మనిచ్చి, తన సేవాభాగ్యమును ప్రసాదించునన్నమాట. ఇలాంటి చాలా అనుభూతులు గతంలో అర్థం కాలేదు. కాని ఈ మధ్యన వాని అర్థములు తెలుస్తున్నవి. దీనిని మా తోటబావిని ఉపయోగించి బోధించారు కావున నేను స్వామి సూచించినట్లు హరినామ క్షేత్రమును ఏర్పాటు చేస్తేనే ఈ వరం లభించునని స్వయముగా నేను భావించుకున్నాను.

స్వామివారు నన్ను తన వద్దకు చేర్చుకొనుటకు ఆరోగ్య సమస్యలను కల్పించేవారు. దీనిని గమనించక, నేను చాలా రోజుల నుండి డయాబెటిక్ కావడం వల్ల దాని ద్వారా 'నీరోపతి', మోకాళ్లనొప్పులు లాంటివి వచ్చాయని భావించాను. చాలా బాధపడ్డాను. రకరకాల మందులను వాడాను. చివరికి మీరు చెప్పినట్లు వింటాను తగ్గించమని వేడుకున్న తరువాత స్వామి కరుణించారు. జబ్బులు చాలా తగ్గినవి.

31-08-2013 : 11వ జప సమర్పణను స్వీకరించారని చెప్పుటకు మా తండ్రిని చూపమన్నాను. ఆ రాత్రి, చనిపోవుటకు 20 ఏళ్ళ ముందట ఉన్న రూపంగా మా తండ్రిని నాకు చూపాడు. మరియు 'నా' అన్నది వదలమని, ఉన్నంతలోనే తృప్తి చెందమని మా తండ్రి నాకు హితబోధ చేసాడు. మరో లీలలో మా ఊరిలోని తోటబావి వద్ద కల భూములు విలువ కలవిగ మారునని, అక్కడ బహిర్భూమికి వెళ్ళుటకు స్థలం దొరకక ఇబ్బందిగ ఉండునని అన్నాడు. ఒక సందర్భంలో గంగ, తన యొక్క ఒక పాయను ఈ స్థలానికి దగ్గరగ తెచ్చునని అన్నారు. తిరుమలలో వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు ఎవరినైతే పూజించుదురో వారు నీ సొంతం కాబోతున్నారని సూచనలిచ్చారు.

05-12-2013 : మా అమ్మకు వైకుంఠం ప్రాప్తించిందని తెలుపుటకు, నేను ఒక షరతును విధించాను. దాని ప్రకారం, మా అమ్మ వైకుంఠంలో శ్రీమహాలక్ష్మి అమ్మతోపాటు ఉంటుంది కాబట్టి, ఆ ఇద్దరిని నా వద్దకు

పంపి, నా ఒకే చూపులో ఇద్దరిని దర్శించేటట్లు అనుగ్రహించమన్నాను. స్వామివారు అదేవిధంగా చేసి నన్ను పరమానందభరితుణ్ణి చేసారు.

గతంలో 'శ్రీ వేంకటేశం' మాసపత్రికను అత్యంత కష్టసమయంలోనైనా విడువక కొనసాగించమన్నాడు. ఎన్నో క్రొత్త విషయాలు సేకరించి ప్రచురణార్థం పెట్టుకుని, ఇవి బాగున్నవా ప్రభూ! అంటూ అడిగాను. దానికి ఎంతో సంతోషించి, రాబోవు నా పుట్టిన రోజుకు స్వామి ప్రసాదమును పంపమని తన అనుచరులకు ఆజ్ఞ ఇచ్చాడు. అనుకున్నట్లుగానే తేది 08-07-2014 తొలి ఏకాదశి రోజు, నేను తిరుపతికి పోయి స్వామి ప్రసాదం తినడం జరిగింది.

నా భార్య సురేఖకు ఒక అనుమానం వచ్చింది. మా వయస్సు మళ్ళిన తరువాత స్వామివారి సేవను ఎవరు కొనసాగించుదురు అనే ప్రశ్నకు 'ఇది కొనసాగుతుంది' మీ స్థానంలో ఇతరులు రాగలరని సూచించాడు.

23-11-2014 : రాబోవు హరినామ క్షేత్రములో తాను భక్తులను ఉద్ధరించుదునని, భక్తులు వారి వారి పనులను వదలి తన వద్దకు వచ్చే విధంగా, సమ్మోహితులను చేయుదునని చూపాడు. నాపై ఆ సమ్మోహన శక్తిని ప్రయోగించాడు. దీనితో నేను మరింత మారిపోయాను. లౌకిక విషయాల పట్ల ఆసక్తి మరింత తగ్గింది. వ్యాపారాన్ని పూర్తిగ మానివేసాను.

మా తండ్రి ఆజ్ఞాపించుట :

15-12-2014 : ఈ అనుభూతి అత్యంత ముఖ్యమైనది. హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయాలని అనుకుంటున్న సమయాన వచ్చింది. సం॥ 1990 లో స్వర్గస్తులైన మా తండ్రిని నా వద్దకు పంపి, నేను హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయవలసిందిగ నాకు చెప్పించాడు. అప్పుడే నీ ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు సంతోషించునని, మరియు నేను ఆయనకు కొడుకునైనందున తాను తృప్తి చెందునని కూడ మా తండ్రి నాతో అన్నాడు. వెంటనే పూర్వం ''దశరథుని మాటను శ్రీరాముడు ఏ విధంగా పాటించాడో నీవు ఆ విధంగా మీ తండ్రి మాటను పాటించు'' అనే భావనను నా హృదయంలో శ్రీ వేంకటేశ్వరుడు కలలోనే కల్పించాడు.

జనవరి 2016 : ఈ జన్మలో నేను స్వామివారి ఎన్నో అనుగ్రహాలకు పాత్రుడినయ్యాను. దీనికి కారణం ఈ జన్మను ప్రసాదించిన మా అమ్మ అని భావించాను. కాని ఇప్పుడు ఆమె లేదు, చనిపోయింది. ఆమె బ్రతికి ఉన్నప్పుడు కృతజ్ఞతలను తెలుపలేకపోయాను. కావున ఒకసారి మా అమ్మను నా వద్దకు పంపి నా కోరికను తీర్చుమని ప్రార్థించాను. అనుకున్నట్లుగానే మా అమ్మను ఆమె చనిపోవుటకు 30 సం॥ల ముందట ఉన్న రూపంతో నా ముందు నిలిపాడు. అత్యంత పరవశంతో ఆమె కాళ్ళను, చేతులను పట్టుకొని ముద్దాడి నాకు ఇంతటి జన్మను ప్రసాదించినందులకు కృతజ్ఞతలను తెలుపుకున్నాను.

తేది 05-02-2016 నాడు తిరుమలలో శ్రీ స్వామివారి (వస్త్రాలంకరణ సేవను) అభిషేకమును చేసాము. కాని స్వామివారిని నా తనివితీర దగ్గరనుండి చూడలేదని బాధపడ్డాను. అందుకని తేది 07-02-2016 హైదరాబాద్‌లో నా ముఖములో ముఖము పెట్టి అత్యంత దగ్గరగ చూడు చూడు అంటూ చూపెట్టాడు ఆ స్వామి.

07-04-2017:ఒక స్వామీజీచే ఒక జపమాల బహూకరించి, ''శ్రీనివాస గోవింద శ్రీ వేంకటేశ గోవింద'' అనే మహా మంత్రమును అఖండ హరినామ స్మరణ చేయుమని సూచించాడు.

28-07-2017 : సం॥ 2018 తరువాత 'శ్రీవేంకటేశం' మాసపత్రికను మానేద్దాం అనుకున్నాను. కాని శ్రీ వేంకటేశ్వరుడు మాత్రం ఇంకా కొనసాగించమని తీవ్రంగా హెచ్చరించాడు.

26-04-2018 : నన్ను నేను ఆత్మ విమర్శ చేసుకున్నాను. ఈ లోకంలో అంతా మిథ్య అని, శ్రీవేంకటేశ్వరుడు ఒక్కరే నా వాడని, ఆ విధంగానే జీవించాలని అనుకున్నాము. రథయాత్ర సం॥ 2020 వరకు మరియు జప సమర్పణ జీవితాంతము కొనసాగించాలని నిర్ణయించుకున్నాము.

06-09-2018 : ఈ రోజు స్వామివారికి 16 వ 7 కోట్ల జపసమర్పణ కావించాము. మొత్తం 16 సం॥ల జప సమర్పణ, నమో వేంకటేశాయ రథయాత్ర, 'శ్రీవేంకటేశం' మాసపత్రిక మొత్తం ఫలితం మీకు చెందాలని స్వామి వారికి ధారపోశాను. మరియు ఆ ఫలితంచే బొట్టు పెట్టి, ఇంటికి ఆహ్వానించాను. కాని ఈనాటి కలలో నీవు ఇంకా పరీక్షలో పాస్ కాలేదని చెప్పాడు.

06-07-2019 : ఇది సురేఖకు వచ్చిన కల. ఒక పెద్ద పాము, దానికి ఇరుప్రక్కల వేల సంఖ్యలో పాము పిల్లలు కలవు. అంటే బహుశా, స్వామి కృప మా కారణంగా విస్తరించిందని భావం కావచ్చు.

03-04-2019 : స్వామి సూచించినట్లు తిరుపతి నుండి శ్రీ హయగ్రీవ స్వామివారి విగ్రహమును తెచ్చి, గురువుగ భావిస్తూ, ఇంటిలో పూజ చేయడం ప్రారంభించాము. ఈ రోజు ఒక చెరువులో ఒక గట్టు నుండి మరో గట్టుకు ఈదుటను చూపెట్టాడు. అంటే గురుదేవుల కృపతో ఈ జీవితంలో సాధించవలసిన లక్ష్యమును సాధించగలనని అర్థం.

29-12-2019: సురేఖను ఉన్నట్లుండి రాత్రి ధరించిన నైటీలోనే తిరుపతికి తీసుకెళ్లి తన దర్శనము చేయించి తిరిగి పంపాడు. దీనర్థం 'భవిష్యత్‌లో ఉన్నఫలంగా స్వామివద్దకు రక్షించుమని పరిగెత్తే కష్టము వచ్చునని అర్థం'.

07-03-2020 - ఒక భావన: 0 1-07-20 తొలి ఏకాదశి వరకు నా వయస్సు 60 అవుతుంది. రథయాత్రను నిలుపుదునని, స్వామి లీల ఏమైన ఉంటే తప్ప ఇది జరగదని అనుకున్నాము. అప్పుడు స్వామివారి నుండి ఈ విధమైన సందేశం వచ్చింది. నీ ఇద్దరి పుత్రులను చదివించి యోగ్యులను చేసి స్వామివారు సూచించిన అమ్మాయిలతో పెండ్లిళ్ళు కూడా జరిపించావు. బాధ్యతలను తీర్చావు కాబట్టి ఇప్పటి నుండి మీ మనస్సును ఎప్పుడూ భగవంతుడు మెచ్చే విధంగా ఉంచమనే సందేశమును పొందాను.

శ్రీ శ్రీనివాస కళ్యాణాలు :

01-07-2020 : తొలి ఏకాదశి 2020 నాటికి నా వయస్సు 60. అప్పటి కోవిడ్-19 కారణంగా, భజగోవిందంను ఏర్పాటు చేయక, ఏకాంతంగ మా ఇంటిలో కేవలం 8 మంది సమక్షంలో శ్రీనివాస కళ్యాణమును జరిపించాము. ఇంత పెద్ద స్వామికి ఏకాంతంగా సేవ చేయుట సహించలేక, చిన్నతనంగ భావించి బాధపడ్డాను. ప్రతీకారేచ్ఛతో, వెంటనే స్వామివారికి భక్తులు భాగస్వాములుగా ఎన్నో కళ్యాణాలను, వేలమంది సమక్షములో జరిపించాలనే కోరిక కలిగింది. ఈ సేవను ప్రసాదించమని దీనంగా వేడుకున్నాను. స్వామివారు ప్రసాదించారు.

19-07-2020 : కళ్యాణాల విధి విధానాలను వ్రాసుకున్నాము. మొత్తం 111 ఉచిత శ్రీనివాస కళ్యాణాలను ఆసక్తి గల భక్తుల వద్ద నిర్వహించాలి. ఈ కార్యక్రమము ద్వారా ఆసక్తి గల అందరికీ స్వామి కృప లభించే విధంగా, వీలైనంత ఎక్కువ మందికి లభించే విధంగా చేయమన్నారు. మరియు నేను జన్మించిన మా అమ్మమ్మ గ్రామము అప్పనపల్లిలో, మా సొంత గ్రామము చిన్న గుండవెల్లిలో తప్పక నిర్వహించమన్నారు. కేవలం మొదటి కళ్యాణం మాత్రమే నేను సంపూర్ణ ఆర్థిక భారాన్ని భరించి చేయాలి, మిగతా కళ్యాణాలు మాత్రం, నేను భాగస్వామిగ ఉంటూ భక్తులచే చేయించాలి. అంటే కళ్యాణపు ఖర్చు నేను మరియు నిర్వాహకులు కలిపి భరించాలి. కళ్యాణం శాస్త్రోక్తంగా ఎలాంటి తప్పులు లేకుండ, లాజహోమంతో పాటు జరగాలి. నిర్వాహకులను ప్రోత్సహిస్తూ, వారి వెనుక ఉండి ఎలాంటి తప్పులు లేకుండ జరిపించే బాధ్యత నాది. ఇది ప్రధాన నియమం. ఒక సం॥లో 7 కళ్యాణాలు కంటే తక్కువ కాకుండా నిర్వహించాలి. సం॥లో జరిపినన్ని కళ్యాణాలు 111 సంఖ్యలో లెక్కించబడును. ఈ నియమాలను ఏర్పరచుకొని కళ్యాణాలను మొదలు పెట్టాను. శ్రీ వేంకటేశ్వరుడు కూడా ఈ నియమాలను ఆమోదిస్తూ, నన్ను ప్రోత్సహించాడు. నేను ఒక్కరోజు కూడ స్వామి ఋణ విముక్తుడనై ఉండకూడదని భావించి, దసరా-2020 నుండి ఈ కళ్యాణాల కార్యక్రమమును ప్రారంభిస్తున్నట్లు స్వామి వారితో విన్నవించాను. అప్పుడు కోవిడ్ -19 లాక్‌డౌన్ వలన ఏ పని జరుగక మొదటి సం॥లోనే నేను ఓడిపోతాననుకున్నాను. అంటే దసరా - 2021 వరకు 7 కళ్యాణాలు చేయలేనని భయపడ్డాను. కాని శ్రీ వేంకటేశ్వరుడు మాత్రం, ''నీవు ఈ కళ్యాణాల కొరకు ఏర్పాటు చేయుచున్న విగ్రహాలను, సింహాసనాలను సేకరించు'' ఆ తరువాత ఆరంభించుటకు పరిస్థితిని కల్పించుదునని మాట ఇచ్చాడు. నా కంటే వారికే తొందరెక్కువ ఉన్నదని సూచించాడు. మరో సందర్భములో నా కోరిక మేర 'శ్రీ ఆండాళ్' మాత దర్శనమిచ్చి తాను కళ్యాణాలకు సిద్ధం అని, నిర్వహించు బాధ్యత నీదేనని అన్నది.

ఒక సందర్భములో మీరు ఈ కళ్యాణాలను స్వయంగా కోరుకున్నట్లైతే, ఒక భక్తుని కలలో ఈ శ్రీవారి ఉచిత కళ్యాణ ఉత్సవ కలను చూపి, అందులో నన్ను చూపించి, వారు నాతో ఇలా కల కన్నామని, నన్ను చూచామని చెప్పాలని, అప్పుడు ఇది స్వామివారే స్వయంగా చేయించుకున్నటుల నేను భావించి సంతోషించుదునని అన్నాను.

కళ్యాణ కార్యక్రమము

అది అట్లే జరిగింది. శ్రీవేంకటేశ్వరుడు ఈ కళ్యాణాలను తిరుమల సాంప్రదాయమైన వైఖానసాగమోక్తంగ జరిపించమన్నారు.

తేది 06-09-2020 గోకులాష్టమి రోజు కోవిడ్-19 వలన రథయాత్ర నిర్వహించకనే 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ జరిగింది.

మరోప్రక్క నాలో 'శ్రీవేంకటేశం' మాసపత్రికపై మరోసారి నిరాశ ఎక్కువైంది. అసలు ఈ పత్రిక నా ద్వారా ఎందుకు నడిపిస్తున్నారు? దీని ద్వారా ఏమిటి లాభం? అని కూడా ఆలోచించాను. ఈ మధ్యన దీనిని చదువు వారు చాలా తగ్గారు. కాబట్టి పత్రిక నడుపుటలో ఆసక్తి తగ్గింది.

ఒక సందర్భంలో 'నా' అన్నది నశింపచేసుకుని జీవిస్తున్న, 95 సంవత్సరాల వయస్సు కలిగిన 'యాదమాత' అనే స్వామివారి భక్తురాలితో సంభాషించు సమయాన స్వామివారు నన్ను 'నా' అన్నది వదిలించుకోమన్నారు, కాని సాధ్యం కావట్లేదని అన్నాను. అసలు ఇది ఎందుకన్నారో నాకు ఇంతవరకు తెలియదన్నాను. అప్పుడామె ''ఏ విధంగానైతే పశువును త్రాడుతో గుంజకు కట్టేస్తారో ఆవిధంగా మనస్సును కట్టేయమన్నది. మరియు దీనిద్వారా భగవంతునికి మరింత దగ్గరవుతాము''. అంతే అని నిరుత్సాహంగానే అన్నది. వెంటనే శ్రీవేంకటేశ్వరుడు ఈ రోజు రాత్రి లీలలో నీవు 'నా' అన్నది వదిలితే త్వరగా లక్ష్యాన్ని చేరేవాడివని 'నా' అన్నది వదలనందున ఎక్కువ కష్టపడుతున్నావని చెప్పుచు, నీవు లక్ష్యాన్ని చేరుకోగలవనే విశ్వాసాన్ని వ్యక్తపరిచాడు. ఆ లీల ఈ విధంగా ఉంది.

లీల : లక్ష్యం కాశీ చేరుట : త్వరగా చేరుటకు స్వామివారు ఒక హెలికాప్టరును ఏర్పాటు చేశారు. కాని నేను ఆ హెలికాప్టరు తోకను రెండు చేతులతో పట్టుకుని గాలిలో వ్రేలాడుతు ప్రయాణించవలసి ఉంది. రెండు చేతులతో తోకను పట్టుకున్నాను. ఇంతలో కాశీ వెళ్ళుటకు రెండు గంటల సమయం పడుతుంది. ఈ మధ్యన చేతులు నొప్పి పెట్టి, వదిలేస్తే ఎలా? అనే అనుమానం వచ్చింది. చివరికి ఏమైన సరేనని చేతులు పట్టు విప్పి మరోసారి గట్టిగా పట్టుకోబోయాను. ఇంతలో హెలికాప్టరు లేచిపోయింది. దీనికి చాల చింతించిన నేను క్షణం ఆలస్యం చేయకుండ కాశీ వైపు ప్రయాణం సాగించాను. నదిని దాటుటకు తిరుక్కుంటూ వెళితే ఆలస్యమవుతుందని, ఈదుచు ఆవలి వైపు వెళ్ళాను. కాశీకి వెళ్ళు బస్సు ఆలస్యమును తట్టుకోలేక ఆ దారిన కొంత దూరమైన వెళ్ళు వాహనాలను ఎక్కి వెళ్ళాను. క్షణం విరామం తీసుకొనుటను సహించక ప్రయాణించాను. తెలిసినవారు ''ఇది మధ్యరాత్రి. తెల్లారేవరకు విశ్రమించి వెళ్ళుమని'' చెప్పినా వినలేదు. వాహనములు లేనిచోట పరుగిడాను. చివరికి దగ్గరగా ఉండు అడ్డదారిలో వ్యవసాయ భూముల గుండా, గుట్టల గుండా ప్రయాణించి కాశీ చేరుకున్నాను. ఈవిధంగా నేను 'నా' అన్నది వదలనప్పటికీ స్వామి కృపతో తపన, పట్టుదల ఉన్నవి కావున కష్టపడి లక్ష్యాన్ని చేరుకోగలవని సూచించాడు. మరో సందర్భంలో నీవు లక్ష్యాన్ని చేరే వరకు ఏదో ఒక సేవ రూపములో స్వామిని స్మరిస్తూ, భక్తులచే స్మరింపచేయుచు జీవించాల్సిందే అంటూ దిశా నిర్దేశం చేసాడు. అంటే ఒక సంకల్పములో ఓడిపోతే మరో సంకల్పము, దానిలో విజయం సాధించకుంటే మూడవ సంకల్పము తీసుకొనవలసని ఉంటుందన్నాడు. ఎలాగైనా లక్ష్యాన్ని చేరవలసిందని చెప్పాడు.

అనుభూతులను చదువమని కోరుట :

గత రెండు రోజుల నుండి నీ గత అనుభూతులను చదువమని చెప్పుచున్నప్పటికి, మనస్సు నిలకడగ లేక రేపుమాపు అంటు పొడిగించాను. కాని తేది 27-11-2020న మాత్రం అత్యంత తీవ్రస్థాయిలో హెచ్చరించాడు. నీకు చెప్పితే వినబడుట లేదా అంటూ ఘాటుగా మాట్లాడాడు. భయపడిపోయాను. మరో ప్రక్క ముసి ముసిగ

నవ్వుకున్నాను. మీరు నా ప్రభు, నేను మీ సేవకుడిని, నాపై మీకు అధికారముంది, కాబట్టి కోప్పడ్డారని, భర్త భార్యను కోపించినప్పుడు, ఆమె ఎలాగ లోలోన నవ్వుకుంటదో అలా నవ్వుకున్నాను. తరువాత నా గత అనుభూతులు వ్రాసిన 6 పుస్తకములను వెతికాను. అవి దొరకలేదు. ఆ పుస్తకాలు నా ఆస్తి అని అవి నాకు ఎంతో విలువైనవని, తిరిగి ప్రసాదించమని, ప్రతిగా మీరు చెప్పినట్లు జీవితాంతం సేవ చేస్తానని, 'శ్రీవేంకటేశం' మాసపత్రికను మీరు చాలు అనేవరకు నిర్వహించుదునని రకరకాలుగా వేడుకున్నాను. చివరికి తేది 18-08-2009 నుండి 25-02-2011 మధ్య పొందిన అనుభూతులు తప్ప కొన్ని జిరాక్స్ రూపములో మరికొన్ని ఒరిజినల్స్ గ లభించినవి. అనుభూతులను చదువుట ప్రారంభించాను.

తేది: 11-12-2020 రోజున మొత్తం 18 సం॥ల సేవాఫలమును ధారపోసి స్వామివారికి మళ్ళీ బొట్టు పెట్టాను. కాని ఎలాంటి లాభం లేకపోయింది. చివరికి గత అనుభూతులను చదివే క్రమములో, మొత్తం జప సమర్పణ కాలములో 2 సార్లు తప్పు జరిగినట్లు గమనించాను. స్వామివారితో ఒప్పందం ప్రకారం కేవలం ఒక తప్పుకే పరిమితి, రెండవ తప్పు, నేను తప్పు చేయనప్పటికి విధి వక్రీకరించి జరిగింది కాబట్టి ఓడిపోయాను.

నిజానికి జప సమర్పణ సం॥ 2002 నుండి 2018 వరకే, సం॥ 2003లో మొదటి జప సమర్పణలో 70 వేల మంది భక్తులు భాగస్వాములు కాకుండనే సమర్పించాము. కాని మొదటి తప్పు కాబట్టి, స్వామివారు క్షమించి స్వీకరించారు. మరియు ఇలాంటి తప్పులను అధిగమించుటకు, 'నమో వేంకటేశాయ' రథమును తయారుచేసి త్రిప్పమన్నారు. దీనితో ప్రతి సం॥ము 70 వేల కంటే ఎక్కువ మందిని భాగస్వాములుగ చేర్చగలిగాము. నిజానికి ప్రతి సంవత్సరము సమర్పించే 7 కోట్ల జపములో 70 వేల మందిని భాగస్వాములుగ చేర్చుటనే ముఖ్య విషయము కాదు. దీనితో పాటు, స్వామివారికి కాని వారి భక్తులకు కాని మా వల్ల ఎలాంటి పొరపాటు జరగకుండా చూచుకునేవారిమి. స్వామిసేవలో అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యేవి. వీటిని సమర్థవంతముగా చేయాలనే తపనచే స్వామివారిని దీనాతి దీనంగా వేడుకునేది.

పందెంలో ఓడిపోవుట :

గతంలో మా అమ్మకు నా 3 వ వంతు పుణ్యం ధారపోయుటలో 2 సం॥ల జప ఫలితము కోల్పోయాను. ఫలితంగా 16 సం॥లు నిండుటకు సం॥ 2020 వరకు జప సమర్పణ కావించాలి. కాని సం॥ 2020లో కోవిడ్-19 కారణంగా రథయాత్ర చేయకనే 70 వేలమంది భక్తులు భాగస్వాములు కాకుండగనే 7 కోట్ల జపసమర్పణ చేసాము. ఫలితముగా రెండవ తప్పు జరిగి ఓడిపోయాను. అనుభూతులను చదివే క్రమములో తేది: 16-12-2020 రోజున నేను ఈ సంకల్పములో ఓడిపోయానని గ్రహించాను. నా కోసం స్వామివారి కష్టమును చూచి చలించిపోయాను. నేను ఒక అయోగ్యుడైన సేవకునిగ కుమిలిపోయాను. శ్రీవేంకటేశ్వరుని కీర్తికి కళంకం తెచ్చేవాడిగ భావించుకున్నాను. దుఃఖించాను. జీవితంపై విరక్తి కలిగింది. అపరాధభావంతో తల దించుకున్నాను. నేను సరిగ పని చేయనందులకు స్వామివారికి నాపై కోపం వచ్చిందని, దానిని శాంతింప చేసి తిరిగి ప్రసన్నుణ్ణి చేసుకొనుటకు, రకరకాలుగ ప్రయత్నిస్తూ దుఃఖించాను. ఒకరోజు మీకు నాపై ఇష్టం ఉంటే సం॥ 2000-2003 వరకు నాకు ప్రసాదించిన ఆనంద స్థితిని తిరిగి ప్రసాదించమని కోరాను. అప్పుడు స్వామిని స్మరించినంతనే, నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలేవి. మైమరచిపోయేవాడిని. ఈ స్థితిని తిరిగి ప్రసాదించమన్నాను. వెంటనే స్వామివారు, 24 గంటలలోపే ఇలా ప్రసాదించారు :- ''శ్రీవేంకటేశం'' మాసపత్రికలో ప్రచురణార్థం శ్రీమాన్ రాళ్ళబండి శ్రీనివాసన్ గారు పంపిన 'రామాయణం రత్నాకరం' అనే ఆర్టికల్ ను చదువుచున్నాను. అది భరతుడు అడవిలో ఉన్న శ్రీరాముణ్ణి చేరే ఘట్టమును చదువుచున్నాను. నా మనస్సులో స్వామిపట్ల ప్రేమభావం ఉప్పొంగింది.

భరతుడు శ్రీరాముణ్ణి చూచి 'అన్నా' అని సంబోధించాడు. కాని నేను మాత్రం '' ప్రభూ!'' అంటూ స్వామివారిని గట్టిగా సంబోధిస్తూ రోమాంచితుడనై ఏడ్చాను. ఇది ఒకసారి కాదు, ఈనాడు ఈ ఘట్టం చదివే సమయాన మొత్తం నాలుగయిదు సార్లు నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలినవి. ఇలా నేను కోరినట్లు ప్రసాదించుట వలన మనస్సు తేలికైంది. తెల్లవారినుండి మళ్ళీ నేనొక అసమర్థ సేవకుడనని, మీకు అపకీర్తి తెచ్చానని భావిస్తూ దుఃఖించుట మొదలుపెట్టాను. దుఃఖాన్ని ఆపుకోలేకపోవుచున్నాను. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు చివరికి నీవు భాగవతుల ఆశీర్వాద ఫలముచే గెలిచావన్నారు, దుఃఖించకుమన్నారు. అంటే భాగవతుల ఆశీర్వాదమనే గ్రేసు మార్కులచే గెలిచావని అర్థం.

జప సమర్పణ ఫలితమును భాగవతులకు పంచుట :

ఇలా నాకు కేటాయించిన సేవలో ఇతరుల జోక్యాన్ని జీర్ణించుకోలేదు. పైగ నా గెలుపుకు భాగవతులే కారణమని భావించి సంపూర్ణ విజయమును వారికే చెందునట్లు అనుగ్రహించమని కోరాను. నాకు, నా వయస్సును దృష్టిలో పెట్టుకొని మరో అవకాశమును ప్రసాదించమని దీనంగ వేడుకున్నాను. అన్నట్లుగానే ఈ జప సమర్పణ ఫలితమును భాగవతులకు పంచి పెట్టారు. నాకు శ్రీ శ్రీనివాస కళ్యాణములను రెండవ సేవగ ప్రసాదించారు.

నేను గత 18 సంవత్సరాలు ఎంతో శ్రమించి, అటు భగవంతునికి ఇటు భక్తులకు ఎలాంటి లోటు రానీయకుండ సేవ చేసినప్పటికి ఎలా ఓడిపోయాను? విధి ఎలా వక్రీకరించింది? అసలు ఇది శ్రీవేంకటేశ్వరుని లీలనే అనే నిజమును తెలుసుకున్న వెంటనే నీవు 'భరతుణ్ణి' అనుసరించమంటూ పదే పదే సూచించాడు. అంటే ఎలాగైతే శ్రీ భరతుడు, శ్రీరాముని రాక కోసం 14 సం॥లు వేచి చూచాడో అదేవిధంగా నేను కూడ వీలైనంత వరకు 'నా' అన్నది నశింప చేసుకొని, శ్రీవేంకటేశ్వరుని కోసం రోజులు లెక్కిస్తూ వేచి ఉండమన్నారని భావించుకున్నాను. మరియు శ్రీనివాస కళ్యాణాలను రెండవ సేవగ ఆనందంగా స్వీకరించాను. అలా ప్రతి 7 కళ్యాణాలను ఒక మెట్టుగా భావించినచో మొత్తం 111 కళ్యాణాలు 16 మెట్లు కాగలవు. ఈ 16 మెట్లు ఎక్కి స్వామివారిని చేరుకోవలసి ఉంది. మరియు ఈ కళ్యాణాలు 3వ వంతు పూరించిన తరువాత 'తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ – నా దశ'' అనే శీర్షికతో మీ అనుభూతులను 'శ్రీ వేంకటేశం' మాసపత్రికలో, ఆన్‌లైన్‌లో ప్రచురించే భాగ్యమును ఇవ్వమని వేడుకున్నాను. (మార్చి –23 వరకు 41 కళ్యాణాలు పూరించాము. 3వ వంతు పూర్తయినాయి. కావున, ఏప్రిల్–23 నుండి అనుభూతుల ప్రచురణకు అనుమతించారు)

గతంలో చేసిన తప్పులను చేయకుండ, అత్యంత జాగ్రత్తగా, స్వామి ఆదేశానుసారం నడుచుకుంటు, సంకల్పం పూరించాలనుకున్నాను. దీనికి తగినట్లుగానే మాలో స్వామిపై తప్ప మరే ఇతర విషయాల పట్ల శ్రద్ధ లేకుండునట్లు తన లీలల ద్వారా చేశాడు.

సంకల్ప సిద్ధే లక్ష్యంగ ఎదుగుట :

ఎన్నోసార్లు రథయాత్ర ప్రారంభ సందర్భముగా మా ఇంటికి వచ్చిన త్రిదండి శ్రీశ్రీశ్రీ వ్రతధర్ నారాయణ రామానుజ జీయరు స్వామివారు ఎప్పటికి ఒక మాట చెప్పేరు.

కౌన్ కహెతేహై భగవాన్ ఆతే నహీ, ద్రౌపదీకి తరహా బులాతే నహి

కౌన్ కహెతేహై భగవాన్ ఖాతే నహీ, శబరీకి తరహ ఖిలాతే నహి!

అంటే మనము ఆర్తితో పిలిస్తే భగవంతుడు తప్పక మన ఇంటికి వస్తాడని దీనర్థం. ఈ మాట నా మనస్సులో మరీ మరీ గుర్తుకొచ్చింది.

ఒక సందర్భంలో నా కొడుకు ప్రవర్తన నన్ను తీవ్రంగా బాధించింది. ఎంతో కష్టపడి, పైసా పైసా కూడబెట్టి యోగ్యుణ్ణి చేసిన తరువాత నన్ను తిరస్కరించుటచే కుమిలి కుమిలి పోయాను. జీవితంలో శ్రీ వేంకటేశ్వరుడు తప్ప మరొకరు నావారు కారనుకున్నాను. వెంటనే శ్రీ వేంకటేశ్వరుడు కలగజేసుకొని 'లోకం నడిచే క్రమంలో నీవు ఇద్దరు పుత్రులకు జన్మనిచ్చినంత మాత్రాన వారు నీ వారు కారు, నీ మాట వినరు, లోబడి ఉండర'ని అన్నారు. 'తామరాకుపై నీటి బొట్టులాగ, అంటీ అంటనట్లు జీవితాన్ని గడుపుచు' నీ లక్ష్యం వైపు పయనించమన్నారు. పైగా దీనిని నా జీవితాంతం గుర్తుపెట్టుకొమ్మని పదే పదే చెప్పారు. దీని ద్వారా శ్రీ వేంకటేశ్వరునిపైన మరింత ప్రేమ ఏర్పడ్డది. నా మనస్సు చాల వరకు మారిపోయింది. స్వామి సేవలో డబ్బును మరింత ఆనందంగ ఖర్చు చేయాలనిపించింది. ఎలాగైన స్వామివారి సంకల్పసిద్ధే లక్ష్యంగా పని చేయాలనే ధృఢ సంకల్పం కలిగింది. తీవ్రంగా సాధన చేయసాగాను.

నేను స్వామి సేవలో ఓడిపోయి, తరువాత స్వామి సంకల్పసిద్ధే లక్ష్యంగా పెట్టుకొని, ఇతరములైన ఏ విషయాలపై మమకారమును త్యజించిన తరువాతనే, స్వామి కల్పించిన లీలల యొక్క అర్థమును సరైన విధంగా అర్థం చేసుకునే జ్ఞానం కలిగింది. స్వామివారు కూడా ఈ స్థితిని పొందిన తరువాతనే తన ఉద్దేశ్యమును, సంకల్పమును తెలిపారు.

ఎలాగైన స్వామి సంకల్పాన్ని నెరవేర్చాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరింది. తీవ్రంగా సాధన చేయసాగాను. నా సాధనను చూసి శ్రీవేంకటేశ్వరుడు ఎన్నోసార్లు మెచ్చుకున్నారు. ఒక సందర్భములో ''నీవు పూజ గదినే పడక గదిగా చేసుకొని జీవిస్తున్నావు'' అంటూ చమత్కరించారు.

స్వామి సంకల్పం నెరవేర్చాలనే నా ఆర్తుతకు స్వామి కరుణించి, మెచ్చి ఒక లీలలో పాడైన సంగీత వాయిద్యాన్ని బాగు చేయుట, మరో లీలలో మా గ్రామంలో భజన నేర్చుకొనువారు 'వినా వేంకటేశం ననాథో ననాథ' అంటూ నేర్చుకొనుటను చూపుచు నీవు హరినామ క్షేత్రమును సాధించగలవనే విశ్వాసాన్ని కలుగజేసాడు. చివరికి నేను సంతోషంతో మీ 'హరినామ క్షేత్రం' ఎక్కడ ఏర్పాటు చేయమంటారో సూచించమని తీవ్రంగా వేడుకున్నాను. మీరు తిరుమలలో మాదిరిగా భక్తులను ఆకర్షించాలని, వారిని తగిన విధంగా అనుగ్రహించాలని అప్పుడే ఇది సాధ్యం అని కూడా విన్నవించాను.'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకు మీకు ఇష్టమైన ప్రాంతమును తెలపమని పదే పదే వేడుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు కూడ అడుగడుగున నన్ను ప్రోత్సహిస్తూ సరైన దారిలో తీసుకెళ్ళాడు.

చివరికి తొలి ఏకాదశి తేది 20-07-2021 రోజున కళ్యాణాల కార్యక్రమము ప్రారంభమైంది. ఇప్పుడు రెండవ సేవగ శ్రీనివాస కళ్యాణాలు చేయుచు, హరినామ క్షేత్రం సాధన కొరకు ప్రయత్నించసాగాను.

సురేఖను అనుగ్రహించుట :

కళ్యాణాలు, హరినామ క్షేత్రము. ఈ మొత్తం విషయమును శ్రీ వేంకటేశ్వరుడు నా భార్య సురేఖకు ఒక కల ద్వారా ఒక ఆటగ చూపాడు.

కల: ఉండుటకు మాకు ఒక మంచి ఇల్లు ఉండగనే ఒక క్రొత్త ఇల్లు నిర్మించి, ముహూర్తం పెట్టి దాని లోనికి మారుదామని సురేఖను బలవంతపెట్టానట. బలవంతాన ఆమె ఒప్పుకొని అన్ని సిద్ధం చేసింది. రేపే గృహప్రవేశం, ఇంతలో నేను ఇది వద్దని, మరో ఇల్లు నిర్మించుటకు ముహూర్తం కూడా పెట్టానట. దీనితో సురేఖకు ఏమీ తోచలేదట. పైగా ఇదే ఆఖరుది ఒప్పుకొమ్మని బలవంత పెట్టానట. నా మాట ప్రకారం ఆమె సరే అని ఒప్పుకున్నదట. ఇది ఆట. అంటే మాకు ముందే స్వామి జప సమర్పణ సేవ ఉన్నది. ఇప్పుడు శ్రీనివాస కళ్యాణాలు అనే సేవలోనికి మారుచున్నాము. వెనువెంటనే హరినామక్షేత్రం అనే మరో సేవను ప్రారంభిస్తున్నానని దీని అర్థం.

శ్రీ వేంకటేశ్వరుడు నన్ను ప్రధానంగ ఎన్నుకొని, నా భార్యను నేను చెప్పినట్టు వినే విధంగా కట్టడి చేసినప్పటికి, ఆమెకు కూడా ఎన్నో అనుభూతులను కల్పించి సంతోషపరిచాడు. మా ఆస్తి హరించిపోవు సందర్భములో తనకు ఎన్నోసార్లు కనబడి నేనున్నాననే విశ్వాసమును కల్పించాడు. తన మానసిక స్థితి ననుసరించి ప్రోత్సహించేవాడు. మా ఇద్దరు పిల్లలు అమెరికా చదువుల నిమిత్తం వెళ్ళుచున్నప్పుడు ''నీవు చింతించకు, వారి బాధ్యత నాది'' అని చెప్పి సంతోషాన్ని కలిగించాడు. రథయాత్రలో నేను బయటి ప్రాంతాలకు వెళ్ళినప్పుడు ''ఒంటరివని భయపడకు, మీ ఇంటి గుమ్మం ముందు కావలి''గ ఉన్నానని చూపాడు. రథయాత్ర తరువాత స్వామివారి బట్టలు ఉతికి తిరిగి మడత చేసి పెట్టుట సురేఖ వంతు. ఇలా చేయుట ఆలస్యమైనప్పుడు, స్వామి బట్టల వద్ద పాము పడగ విప్పి కనబడుచు ఆమెకు గుర్తు చేసేవాడు. కళ్యాణాల కార్యక్రమమును ప్రారంభించినప్పుడు తనకు స్టేజిపై అన్ని వస్తువులను సదిరే బాధ్యతను అప్పగించాడు. చివరికి నా మానసిక స్థితికి అనుగుణంగ ఉండే విధంగా చేసాడు.

జాగ్రత్తగ సేవ చేయుమనుట :

తేది: 05-10-2021 ఒక మహత్తరమైన అనుభూతిని కలిగించాడు. ధ్వజస్థంభం కలిగి, అసంపూర్తిగ ఉన్న ఒక ఊరిలోని మా ఇంటిలో నేను నివసిస్తున్నాను. దానికి ముందు వెనకాల రెండు డోర్లు ఉన్నవి. మా ఇంటి నుండి వెళ్ళిన తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు, మలయప్ప స్వామి, తన దేవేరులతో కలిసి, ఆ ఊరిలోనికి ఊరేగింపు నిమిత్తమై వెళ్లి, తిరిగి మా ఇంటికి వెనక రోడ్డు నుండి, మేళతాళాలతో వస్తున్నారు. ఊరేగింపు చివరి దశ కాబట్టి ఆకాశాన్నంటే శబ్దంతో వాయిస్తున్నారు. ఈ ఊరేగింపు మా 'శ్రీవేంకటేశం' మాసపత్రిక గౌరవ సంపాదకురాలైన డా॥ పులిగడ్డ విజయలక్ష్మి గారి నాయకత్వంలో జరుగుచున్నది. కాబట్టి తప్పక మా ఇంటికి తిరిగి రాగలరని అభిప్రాయమేర్పడ్డది.

అయినా భగవంతుడు స్వతంత్రుడు. మా ఇంటికి రావచ్చు, రాకపోవచ్చు అనే భావన కలిగింది. ఇంతలో నేను వెనక డోర్ నుండి ముందు డోర్ వద్దకు, స్వామిని ఆహ్వానించుటకు వచ్చేలోపల, స్వామివారు మా ఇంటి చుట్టు తిరిగి వెళ్ళిపోయారు. శ్రీశ్రీశ్రీ జీయర్ స్వామివారి ఆశ్రమములో కొంత పని ఉంది. దాని తరువాత వచ్చెదననే విషయాన్ని తన భక్తుల ద్వారా చేరవిడిచి వెళ్ళారు. ఇది కల. దీని అర్థం ఏంటంటే కొంత కాలము తరువాత నేను హరినామక్షేత్రమును పూర్తి చేసిన తరువాత వస్తానన్నారు. మరియు నేను ఏమాత్రం ఆదమరిచి ప్రవర్తించినచో రాకపోవచ్చు కూడ అని అర్థం. కాబట్టి అత్యంత శ్రద్ధతో కష్టించి దీనిని సాధించాలి.

మార్చి 2022న మా 'శ్రీవేంకటేశం' మాసపత్రిక యొక్క మొత్తం 16 సం॥ల ఫలమును స్వామి వారికి ధారపోసినప్పుడు, కొన్ని వందల టన్నుల పువ్వులతో, టన్నుల కొలది ప్రసాదాలతో చేసిన పూజలాగ స్వీకరించి ఆనంద పరచాడు.

అత్యంత కఠిన నియమాలతో సంకల్పసిద్ధే ధ్యేయంగా శ్రీ వేంకటేశ్వరుని మెప్పు పొందుటే లక్ష్యంగా జీవిస్తున్నాను. ఎలాగైన హరినామక్షేత్ర స్థలమును చూపమని పదే పదే ప్రార్థిస్తూ కళ్యాణాల సేవ జరుగుతున్నది. చివరికి మార్చి 22న మీరు ఎన్నో సం॥ల నుండి చేయు పూజల ఫలితమును పొందబోవు రోజు ఆసన్నమౌతున్నదని తెలిపారు.

విజయం సాధించుట :

కోవిడ్-19 మూడవ వేవ్ కారణంగా కళ్యాణాల కార్యక్రమమునకు విరామం ఇచ్చి తేది 05-04-2022 నాడు రెండున్నర నెలల కోసం, శ్రీవేంకటేశ్వరుని అనుమతితో, మా పిల్లల వద్దకు అమెరికా వెళ్ళాము. ఇలా నేను అమెరికాలో ఉన్నప్పుడు తేది 16-04-2022 ఉదయం నేను విజయం సాధించానని చెప్పాడు. హరినామక్షేత్రమును చిన్నగుండవెల్లి లోని మా తోటబావి వద్ద ఏర్పాటు చేయమనే విధంగా సూచించారు. ఆ కల ఈ విధంగా ఉంది.

ఆ రాత్రి, మా ఊరిలోని మా తోట బావి వద్ద హరినామక్షేత్రం ఏర్పాటుకు అవకాశం ఇవ్వమని, అత్యంత ఆర్తితో నా కళ్ళనుండి నీళ్లు జాలువారగ వేడుకున్నాను. ఇన్ని రోజులు ఈ ఆలోచన రానందుకు సిగ్గుపడ్డాను కూడ.

కల! ఎన్నో పర్యాయాలు ఓడుతూ వస్తున్న ఒక ఎన్నికలో ఎంఎల్ఏ/ఎంపిగా గెలిచాను. అప్పటి ముఖ్యమంత్రి కెసీఆర్ పిలువగ వెళ్లి ప్రమాణస్వీకారం గురించి మాట్లాడాము. రేపు సిద్ధిపేట కార్యకర్తలు వస్తున్నారని, వారి సమక్షములో పెట్టుకుందామన్నారు. విజయం సాధించినందులకు అభినందించారు. ఇది కల. వెంటనే నేను కనీసము 7 ఎకరముల స్థలములో మీ హరినామ క్షేత్రమును ఏర్పాటు చేస్తానని, ఈ అవకాశం ప్రసాదించినందుకు స్వామివారికి ధన్యవాదములు తెలిపాను. మరియు ఈ హరినామ క్షేత్రం ఏవిధంగ, ఏ ఆకారంగ ఉండాలని ఆలోచించసాగాను.

ఒకరోజు, ఈ విషయంపై ఏ మాత్రం చచ్చి పడి ఉండక, అశ్రద్ధ చేయక నా అమెరికా స్టేను పొడిగించక వచ్చి కళ్యాణాల కార్యక్రమమును చూచుకొమ్మన్నారు.

కోవిడ్-19 కారణంగా గత రెండు సం॥ల నుండి మేము హైదరాబాదులో, మా పిల్లలు అమెరికాలో వేరు వేరుగ ఉన్నాము. చాలా రోజుల తర్వాత ఇప్పుడు అందరము కలిసి ఉన్న కారణంగ నా భార్య సురేఖ చాల ఆనందంగ మరిన్ని రోజులు అమెరికాలో ఉండాలనే కోరికతో ఉన్నది. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం 'నీవు కొడుకులు, కోడళ్ళ అందరిమధ్య ఉన్నానని మురువవద్దని, నీవు ఏకాకివని, నీకు తోడు శ్రీ వేంకటేశ్వరుడు మాత్రమే' అని తెలిపి

అమెరికా స్టేను పొడిగించక హైదరాబాద్ రమ్మన్నారు. మరియు నీవు హైదరాబాద్ రాక పిల్లలపై మోజుతో మరింత ఆలస్యం చేసినచో వారికి నీపై కనిపించని విరక్తి కలుగునని సురేఖతో మరో లీలలో స్పష్టంగా చెప్పాడు. ఆ లీల ఈ విధంగా ఉంది.

మా హైదరాబాద్‌లోని పనిమనిషి, అమెరికాలోని కిచెన్‌లో మంచి కూరగాయలపై, ఎవ్వరూ చూడటం లేదని, ఉప్పునీరు పోసి, వాటిని వక్కిపోయే విధంగా చేసి బయట పడేస్తుందట. కాని దీనిని ప్రక్కనున్న సురేఖ జాగ్రత్తగా గమనించింది. దీనర్థం నీ వారికి మీపై విరక్తి కలుగుతుందని, వెంటనే హైదరాబాద్ రావాలని స్వామివారి ఆజ్ఞ.

21-05-2022 : శ్రవణా నక్షత్రం రోజు తనకు తిరుమల ఆలయం ప్రతి రూపమునే నిర్మించమని, వీలు కాని పక్షంలో వెండివాకాలి మొదటి ప్రాకారం వరకు నిర్మించి, హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించారు.

27-07-2022 : నేను యం.టెక్‌లో పాస్ అగుటకు స్వామివారు మెచ్చే విధంగా ప్రయత్నిస్తున్నట్లు, దృఢ నిశ్చయముతో ఉన్నట్లు చూపాడు.

లీల : ఒకరోజు నేను కాలేజికి వెళ్ళేసరికి సమయం దాటిన కారణంగ, తరగతి ముందు, లోనికి పోకుండ గేటు వేశారు. దీనిని సహించలేని నేను, కాలేజి బిల్డింగ్ ఎక్కి త్రాడు సహాయముచే క్రిందికి దిగి, బయటినుండి వ్రేలాడుచు తరగతి గది కిటికి వద్దకు వచ్చి పాఠాలు విన్నాను. నేను లేనప్పటి పాఠమును మిత్రుల ద్వార తెలుసుకున్నాను. ఇంతటి తపన కలిగి ఉన్నానని సూచించారు. ఇంకో లీలలో, గత కొన్ని రోజుల నుండి నా మార్గమునకు అడ్డుగ ఉన్న ఒక దుష్ట శక్తిని స్వామివారి కృపచే ప్రక్కకు పడేసినట్లు చూపాడు. మరో లీలలో నేను సౌకర్యవంతమైన జీవితాన్ని అసహ్యించుకునే స్థితికి వచ్చావని చూపాడు.

స్వామి సేవ అందరిది :

తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి, తిరుమల నుండి చిన్నగుండవెల్లిలోని హరినామ క్షేత్రమునకు తెచ్చుటలో నేను ప్రధాన పాత్రను పోషిస్తున్నప్పటికీ, ఇందులో మా తల్లితండ్రులు, భార్యాబిడ్డలు, వంశస్థులు, గ్రామస్థులు, ఆ ప్రాంత ప్రజలు మరియు శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్తజనము వారి వారి పాత్రను సమయానుసారము నిర్వహిస్తారని స్వామివారు సూచించారు. ఈ సేవ నాకు మా తల్లితండ్రుల నుండి సంక్రమించిందని చెప్పడానికి ఈ క్రింది లీలల ద్వారా తెలుసుకున్నాను.

1. హరినామక్షేత్రం ఏర్పాటు చేయు భూమి మా తండ్రి స్వార్జితం. నేను ఏకైక పుత్రుణ్ణినప్పటికి, మా తండ్రి చనిపోవుటకు 15 సం॥ల ముందే 1976లో ఈ భూమిని నా పేరుపై అత్యంత ఉత్సాహంగ మార్పిడి చేశాడు.

2. ఊరిలోని మా ఇల్లు కూడ మా తల్లితండ్రుల స్వార్జితం. చిన్నప్పుడు చాల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాము. దరిద్రము మా ఇంట్లో నాట్యమాడేది. నేను ఎదిగిన తరువాత కసితో దీనిని అమ్మి మరో ఇల్లును 1999లో నిర్మించుకున్నాము. కాని స్వామి లీలలో ప్రతిసారి ఇదే ఇల్లు కనబడ్డది.

3. మా తండ్రి సహకారము అడుగడుగున కనబడ్డది. నా తప్పులను ఎత్తి చూపుటకు, ముఖ్యంగ నాకు యోగ్యత సిద్ధించుటకు, చివరికి స్వామివారి హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయుమని స్వయంగ మా తండ్రి ఆజ్ఞాపించాడు. అప్పుడే ఒక తండ్రిగ తాను సంతోషించుదునన్నాడు.

4. భాగవతుల ఆశీర్వాద ఫలంచే విజయుణ్ణిన లీల కూడ, నేను 10 వ తరగతి లేక ఇంటర్ చదివే రోజులలో మా

ఊరిలో తల్లితండ్రులతో కలిసి చేసిన శ్రీవారి కళ్యాణం లాంటి ఉత్సవానికి వచ్చిన భక్తులు తిరుపతి లడ్డూలను ప్రసాదంగా ఇచ్చారు.

5. స్వామివారి హరినామ క్షేత్రం ఏ స్థలములో ఏర్పాటు చేయాలనే ప్రశ్నకు జవాబు చెప్పే క్రమములో ''విజయము సాధించు సమయము ఆసన్నమైన''దని తెలిపే లీల కూడ మా ఊరిలో మా అమ్మ ఆధ్వర్యములో ఎన్నో సం॥ల నుండి జరుగు పూజల ఫలమును పొందబోవు సమయము ఆసన్నమైనదని సూచించాడు. ఆ పూజలకు వచ్చిన ప్రతి వ్యక్తి మా అమ్మ ఆహ్వానము మేరకే వచ్చారట. మొత్తం మా పాలివారు, ఊరివారే కలరు. అందులో నా భార్య ఉన్నప్పటికి, మా అమ్మదే ప్రధాన పాత్ర.

ఇలా ఎన్నో లీలలు మా ఊరును, మా పూర్వీకుల ఇల్లును, భూమిని లక్ష్యంగ చేసుకొని కొనసాగినవి. చివరికి శ్రీవేంకటేశ్వరుని అఖండ భక్తజనము భాగస్వాములు కావలెనన్న ఉద్దేశ్యముచే ఈ అనుభూతులను ప్రచురించమని శ్రీవేంకటేశ్వరుడు ఆజ్ఞాపించారు.

తపనను పెంచుట :

చాల రోజుల నుండి స్వామి అనుభూతులను అనుభవించని నేను చివరికి సమస్యలను సృష్టించి యైన మీ లీలలను ప్రసాదించమని వేడుకున్నాను. అన్నట్లుగానే ఒక భూ సమస్య సృష్టించబడ్డది. దానితో పోలీసు కేసు రిజిష్టర్ అయింది. మరోప్రక్క నా ఆరోగ్య సమస్య మొదలైంది. వాటితో, స్వామిని ప్రార్థించే తపనను పెంచాడు. వీటికి భయపడి స్వామివారిని రకరకాలుగా ప్రార్థించుట మొదలు పెట్టాను. చివరికి సమస్యలు ఉన్నప్పుడు ఏ విధంగా స్వామివారిని స్మరిస్తానో అదే విధంగా మామూలు రోజులలో కూడా స్మరించుదుననే మాట ఇచ్చాను. నా జీవితాన్ని పొడిగించమని, పొడిగించిన జీవితం మీ సంకల్ప సాధనకే వాడుకుంటానని మాట ఇచ్చాను.

నా సాధన ద్వారా మిమ్ములను పొందే యోగ్యతను నేను పొందలేక పోయినప్పటికీ, మీ భక్తుల ఉద్ధరణ కోసమని హరినామ క్షేత్రమును ఏర్పాటు చేసే భాగ్యమును ఎలాగైన ప్రసాదించమని వేడుకున్నాను.

30-09-2022 : నా అనుభూతులను మాసపత్రికలో ధారావాహికగా ప్రచురించమనే సందేశంను పొందాను. వెంటనే ఈ అనుభూతుల ప్రచురణల ద్వార, భాగవతుల శక్తులను కూడకట్టుచు, వారి ఆశీర్వాదమును పొందుటకు అవకాశం ఇవ్వమని ప్రార్థించాను. నా శక్తికి భాగవతుల శక్తిని జత కలిపినచో తప్పక విజయం సాధించుదునని విశ్వసించాను. స్వామివారు ఆనందించి త్రిదండి శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారిని, వారి శిష్య సమేతంగా పంపి దివ్య ప్రబంధ పారాయణం పఠించి, మంగళాశాసనం చేయించారు. మరియు మరణశయ్యపై నున్న వ్యక్తి నిజం మాత్రమే చెప్పినట్లు నన్ను కూడ నిజం చెప్పమన్నారు.

నన్ను మా ప్రాంతపు భక్తుల బృందానికి ప్రెసిడెంట్‌గా ఎన్నుకొని వారికి శ్రీ వేంకటేశ్వరుని కృపను అందించే భాద్యత నీదే అంటూ ఆజ్ఞాపించాడు. మొదటి నుండి నేటి వరకు ప్రసాదించిన ప్రతి లీల కూడా నీలో కొంత కొంత మార్పును కలిగించుటకే అని కూడా చెప్పాడు.

నాకు హృద్రోగ సమస్యలను కల్పించి, జీవితంలో సంపాధించిన ఆస్తులు, అంతస్తులు నీ కుటుంబీకులు ఏవీ నీతో రావని, శ్రీ వేంకటేశ్వరుని సంకల్పం నెరవేర్చుటయే నీ జీవిత ధ్యేయంగా జీవించమని చెప్పాడు. నాకు రెండు స్టంట్స్ వేసి, జీవితాన్ని పొడిగించి, ఈ పొడిగించిన జీవితం స్వామి సంకల్పం సిద్ధింప చేయుటకే అని దిశా నిర్దేశం చేసాడు.

నన్ను భౌతికంగా మరింత సన్నగ చేసి, చూసిన ప్రతివారు ఎందుకు సన్నగైనావని అన్నప్పుడల్లా, నీవు ''ఎదగాలి'' అనే శ్రీ వేంకటేశ్వరుని మాటనే గుర్తుకు వచ్చే విధంగా చేసాడు. అంటే కావలసిన యోగ్యతను సాధించుటకు మరింత సాధన చేయమని అర్థం.

విజయము సాధించుటకు చిహ్నాలు :

చివరికి జనవరి 2023 వైకుంఠ దర్శనానికని తిరుమల వెళ్ళినప్పుడు, మా అనుభూతుల ప్రచురణకు ఆశీర్వదించారు. మరియు త్వరలో మా ఇంటికి వస్తానని కూడ తెలిపారు.

రెండు నెలల క్రింద కల్పించిన లీలలో స్వామివారు నాకు మంచి సౌకర్యవంతమైన బూట్లు కొనిచ్చారు. బహుశా దీని ప్రభావముచే తేది 25-02-2023 నుండి 01-03-2023 వరకు శ్రీరంగం, తంజావూరు, కుంభకోణం, చిదంబరం, కంచి, చెన్నై నగరములు తిరిగి అక్కడున్న ఆలయాలను, దివ్యదేశములను దర్శించి, శ్రీవేంకటేశ్వరుని సంకల్పాన్ని సాధించే విధంగా ఆశీర్వదించమని ప్రార్థించాను. అనుకున్నట్లే తేది 01-03-23 సాయంత్రం చివరిదైన చెన్నైలోని శ్రీ పార్థసారథి ఆలయాన్ని దర్శించి వెనుతిరుగునప్పుడు ''నీ కోరిక ప్రకారం ఆశీర్వాదం లభించినద''నే భావన కలిగింది.

రెండవ సంకల్పంగా శ్రీనివాస కళ్యాణాలను ప్రసాదించినప్పుడు భరతుణ్ణి అనుసరించమన్నారు. అంటే ప్రతి కళ్యాణము శ్రీ వేంకటేశ్వరుని వద్దకు చేరుటకు ఒక మెట్టుగ భావించి, స్వామిని ఎప్పుడు చేరుతామా అని, ప్రతిరోజు వేచి చూస్తూ జీవించమన్నారు. ఏప్రిల్ 23 వరకు 43 కళ్యాణాలను పూరించాము. త్వరలో మిగిలిన వాటిని స్వామి కృపచే పూరించగలము. కాని శ్రీ భరతుని లాగ 'నా'' అన్నది నశింపజేసుకొని త్యాగబుద్ధి కలిగి అంతటి తపనను సాధించుట ఎంతో అవసరము.

భరతుణ్ణి అనుసరించుమనుటలో ఆంతర్యం :

తేది 18-03-23, ఏకాదశి, శ్రవణా నక్షత్రం రోజు పొందిన మరో లీలలో ''శ్రీరాముని రాకకు ఒక్కరోజు ఆలస్యమును తట్టుకోలేని శ్రీ భరతుడు, శ్రీరాముడు అయోధ్యకు వచ్చిన తరువాత తిరిగి వెళ్ళిపోతానంటే, తట్టుకొనునా? ప్రాణ త్యాగానికి సిద్ధపడడా? ఇదే దిశా నిర్దేశం నాకు చేశాడని నేను భావించాను. శ్రీవేంకటేశ్వరుడు కరుణించి, నా వద్దకు వచ్చిన తరువాత తిరిగి తిరుమలకు పోతానంటే ప్రాణత్యాగం చేయుటకు సిద్ధం అనేటంత వ్యామోహాన్ని పెంచుకోవలసి ఉందని సూచించాడు. ఇదే శ్రీ భరతుణ్ణి అనుసరించమనటంలోని అసలైన అర్థం అనిపించింది. ఇలా స్వామిని ఈ క్షేత్రంలో స్థిర నివాసమేర్పరచుకొనుటకు వివశుణ్ణి చేయాలి.

భాగవతుల ఆశీర్వాదం

స్వామి ఈ క్షేత్రములో శాశ్వత నివాసం ఏర్పరచుకొనుటకు తిరుమల నుండి ఇక్కడికి రావాలంటే నా ఒక్కరి శక్తి సామర్థ్యములు సరిపోవు కావున భాగవతుల శక్తిని, ఆశీర్వాదములను పొందమని శ్రీ వేంకటేశ్వరుని ఆజ్ఞ. కాబట్టి ఈ తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలలను చదివిన ప్రతి భక్తుడు, స్వామి యొక్క భక్త వత్సలతను తెలుసుకొంటు, శ్రీ వేంకటేశ్వరుని ఆశయ సాధనలో పాలు పంచుకొనుటకు కనీసం శ్రీ వేంకటేశ్వరుని మూడుసార్లు స్మరించి, సంకల్పం నెరవేరేటట్లు వయస్సు, లింగభేదం లేకుండ ఆశీర్వదించగలరని ప్రార్థన. శ్రీ వేంకటేశ్వరుడు ఇక్కడ స్థిర నివాసమేర్పరచుకొని మరో తిరుపతిని ఏర్పరచి భక్తులను అనుగ్రహించుటలో ప్రార్థనాపూర్వకంగానైన భాగస్వాములు కాగలరని మనవి.

కొడుకులు – కోడళ్లతో సాయిరెడ్డి, సురేఖ దంపతులు

స్వామివారి లీలలు : ఒక పజిల్

శ్రీ వేంకటేశ్వరుని లీలలు చాలా విచిత్రంగా ఉంటాయి. స్వామివారి లీలలను అర్థం చేసుకొనుట మన ఆధ్యాత్మిక ఉన్నతికి నిదర్శనము. వచ్చే భాగములలో స్వామి వారి లీలలను ఒక్కొక్కటి ఉన్నదున్నట్లుగా వ్రాయుదును. భక్తులు చదివి వాటి భావాలను ఒక పజిల్‌లాగా విశ్లేషించుకోవాలి. మచ్చుకు, ఈ భాగం వ్రాయునప్పుడు తేది 18-02-2023 నాడు పొందిన ఒక లీలను ఉన్నదున్నట్లుగ వ్రాస్తున్నాను. భక్తులు ఈ లీల మాత్రమే చదివి అర్థం తెలుసుకొనుటకు ప్రయత్నించండి. (భావం తరువాత చదవండి)

కల: ఈ రోజు ఉదయం నేను మంచంపై నుండి లేస్తున్నప్పుడు నా ప్రక్కన మా డ్రైవర్ కలీం కాలుమీద కాలువేసుకొని నా బెడ్‌పైన పడుకొని నా చేతిని తన చేతిలోనికి తీసుకుని ఆప్యాయంగా ఒత్తుచున్నాడు. ఇది కల. దీని అర్థమును మన విజ్ఞతనుపయోగించి విశ్లేషించాలి. ఇది శ్రీవేంకటేశ్వరుని పజిల్. దీని పూర్వాపరాలు తెలిసివుంటేనే ఈ లీలకు అర్థమును తెలుసుకోగలం. లేకుంటే చాలా కష్టం.

భావం : గత 20 సం॥ల నుండి కలీం మా వద్ద డ్రైవర్. ''నమో వేంకటేశాయ'' రథమును అతనే నడిపేవాడు. రథయాత్ర సమయాన ప్రతి స్వామి సేవకుడిని మాతో సమానంగా చూడమన్నారు. ఇది స్వామి ఆజ్ఞ. ఈ విషయమును రెండవ భాగపు అనుభూతుల ప్రచురణలో వ్రాయుట మరచిపోయాను. ఈ లీల ద్వారా స్వామి ఈ విషయాన్ని గుర్తు చేసాడు. ఇది అసలైన అర్థం.

ఇందులో నేను చాలా లీలలను వ్రాసాను. కాని అంతకు ముందటి పరిస్థితులను, వాటిని పొందుటకు ప్రేరేపించిన సందర్భాలను తెలుసుకున్నప్పుడే స్వామి లీలల ఆనందము కలుగుతుంది. కాబట్టి రాబోవు భాగాలలో చాలా వివరంగా ఒక్కొక్క లీల యొక్క పూర్వాపరాలను, అప్పటి పరిస్థితులను, నా మానసిక స్థితిని వ్రాయగలను. చదివి తమరు విశ్లేషిస్తూ ఆనందించగలరని ఆశిస్తున్నాను.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

3వ భాగము

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాకు ప్రసాదించిన సేవల ద్వారా తగిన యోగ్యతను సాధించి హరినామ క్షేత్రమును ఏర్పాటు చేయవలసిందిగా దిశా నిర్దేశం చేశారు. నా జీవితములో స్వామివారి ప్రత్యక్ష లీలలు సం॥ 2000 లో ప్రారంభమైనప్పటికీ పరోక్షంగా నా పుట్టుక, రూపురేఖలు, బాల్యం, విద్యాభ్యాసం, గుణాలు అన్నీ ఈ సంకల్పానికి అనుగుణంగా ప్రసాదించాడు.

ఈ భాగం నుండి నా పరిచయంతో పాటు స్వామివారు ప్రసాదించిన అనుభూతులను మొదటి నుండి ఒక్కొక్కటి వరుస క్రమంలో వివరిస్తున్నాను.

నా పరిచయం

నా పేరు పుల్లగూర్ల సాయిరెడ్డి. మాది సిద్ధిపేట నుండి 7 కి.మీ దూరంలో ఉన్న చిన్నగుండవెల్లి అనే గ్రామము. మా తల్లితండ్రులు కీ.శే పుల్లగూర్ల వెంకటిరెడ్డి, రుక్కమ్మ దంపతులు. మాకు 'గడీల' అనే మరో ఇంటిపేరు కూడ ఉన్నది. మాది పూర్తిగా వ్యవసాయ ఆధారిత కుటుంబం. మా తల్లితండ్రులకు చాలా రోజుల వరకు సంతానం కలగలేదు. సంతానం కోసం దేవుళ్ళను ప్రార్థించారు. నా కంటె ముందు ఇద్దరు పిల్లలు పుట్టి చనిపోయారట. చివరికి వారి గురువులు చెప్పినట్లు పిల్లల కోసమని ప్రత్యేక పూజలు చేశారట. దాని పుణ్యఫలముతోనే నేను తేది

చిన్నగుండవెల్లిలోని మా పాత ఇల్లు

చిన్నగుండవెల్లి గ్రామం

తోట బావి గుట్టము

05-07-1960 తొలి ఏకాదశి రోజున మా ఊరికి మరో 7 కి.మీ దూరమున గల మా అమ్మమ్మ గారి గ్రామమైన అప్పనపల్లిలోని మా చిన్నమామ కి.శే. చిలుకోటి సిద్ధారెడ్డి గారి ఇంటిలో జన్మించానన్నారు. నా తరువాత ఒక చెల్లెలు 'లలిత' కలదు. నన్ను అత్యంత ప్రేమతో పెంచారు. నాకంటే ముందు ఇద్దరు చనిపోవుట వలన మా అమ్మ నాకు దిష్టి తగలకుండా ఉండుటకని మగపిల్లవాణ్ణినప్పటికీ ముక్కు, చెవులు కుట్టించుట, ఒక సంవత్సరము వరకు కొత్తబట్టలు కట్టకుండుట చేసిందట.

నాకు చిన్నప్పటినుండి శ్రీవేంకటేశ్వరుడంటే అమితమైన ఇష్టము. ఎవ్వరూ చెప్పనప్పటికీ 2వ తరగతి నుండి స్వామివారికి ప్రతి శనివారం ఉపవాస దీక్ష చేసేవాడిని. ప్రతి పూజలో ''నన్ను ఈ లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక మంచి పనికి ఉపయోగించుకొండ''ని ప్రార్థించేవాడిని. మాది మాంసాహార కుటుంబం ఐనప్పటికీ నేను చిన్నప్పటి నుండి శాకాహారిని. పదవ తరగతి నుండి మాంసాహారిగా మారాను.

ఊరిలో మాకు తగినంత భూమి ఉన్నప్పటికీ, నీరు లేక పంటలు పండక అత్యంత దయనీయ స్థితిలో బాల్యం గడిచింది. మొదట్లో మా వ్యవసాయం చక్కగా ఉండేది. ఒక నాలుగు బావులు, 70 నుండి 80 వరకు పశువులు, వాటికి రెండు దొడ్లు ఉండేవి. వంశపారంపర్యంగా వచ్చిన భూమితో పాటు మా తల్లితండ్రుల స్వార్జితంగా ఇల్లు, మరికొంత భూమిని కొన్నారు.

మా ఇల్లు చక్కగా సౌకర్యవంతంగా ఉంటుంది. రెండున్నర అడుగుల మందం గల మట్టిగోడలతో కట్టబడ్డది. కట్టె స్తంభాలతో, దృఢమైన ముఖద్వారం, వెనుక కట్టెభేడము, ఇంటి ముందు అరుగులు కలిగి ఉంటుంది. మాకున్న నాలుగు బావులలో తోటబావి ముఖ్యమైనది. తోట, పశువులు అక్కడే ఉండేవి. రోజులో చాలావరకు అక్కడే గడిపేవారిమి. మా తండ్రి తెలివైనవాడు, ధర్మాత్ముడు, నీతిమంతుడు. మా ఊరికి ఒక పర్యాయం సర్పంచ్ గా ఉన్నాడు. ఈయనకు భూమి అంటే ఎంతో ఇష్టం. ఎంత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్క ఎకరం భూమిని అమ్ముటకు ఇష్టపడేవారు కాదు. 1972 ల్యాండ్ సీలింగ్‌లో మాది కొంత భూమి పోయింది. అప్పుడు చాలామంది మా తండ్రి వద్దకు వచ్చి మీ కొడుకు 18 సంవత్సరాల వయస్సు అని చెప్పినట్లైతే సీలింగ్ లో భూమి పోదని చెప్పారు. కాని భూమికోసం నేను అబద్ధం ఆడలేనని, నా కొడుకు 9వ తరగతి చదువుతున్నాడని చెప్పి, స్కూల్ నుండి బర్త్ సర్టిఫికెట్‌ను కూడా సమర్పించాడు. ఫలితంగా భూమి పోయింది. అంతటి సత్యవంతుడు. సం॥ 1970 నుండి పంటలు పండక దినదినము మా పరిస్థితి దిగజారింది.

విద్యాభ్యాసం

నేను నా 5వ తరగతి వరకు చిన్నగుండవెల్లిలో, 6 నుండి 10 వరకు మా ప్రక్కనున్న పుల్లూరు గ్రామములో, ఇంటర్మీడియట్ ను గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ, సిద్ధిపేటలో చదివాను. 1979వ సంవత్సరం నా ఇంటర్ అయిన వెంటనే ఇంజనీరింగ్ లో సీటు లభించనందున, చిన్నగుండవెల్లిలో వ్యవసాయము చేయుచు, సిద్ధిపేటలో బి.ఎస్సీని రెండు సంవత్సరముల వరకు చదివాను. నా రెండవ ప్రయత్నములో కూడా ఇంజనీరింగ్ లో సీటు లభించనందున స్వామివారిపైన కోపముచే 1980లో ఉపవాస దీక్షను విరమించుకున్నాను. నేను ఊరిలో 2 సంవత్సరాలు వ్యవసాయము చేయుట వలన అక్కడి పరిస్థితులు స్వయంగా అర్థం చేసుకున్నాను. మా ఆర్థిక పరిస్థితిని చూచి చలించిపోయాను. ఎలాగైనా ఊరిని వదిలిపోవాలనిపించింది. నాకు ఇంజనీరింగులో సీటు లభించినచో ఉద్యోగము చేయక వ్యాపారము చేసి మా కుటుంబాన్ని ఉన్నత స్థితికి తీసుకు రావాలనే కోరిక అప్పుడే ఏర్పడింది. చివరికి 1981 లో కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ ఉస్మానియా విశ్వవిద్యాలయములో సివిల్ ఇంజనీరింగులో సీటు లభించింది. యూనివర్సిటీ హాస్టల్ లో ఉండి విద్యనభ్యసించాను. 1985లో విద్యాభ్యాసము తరువాత జీవనోపాధికి చాలా ఇబ్బంది పడ్డాను. మా ప్రొఫెసర్ కీ.శే డా॥ బద్రుద్దీన్ వద్ద జె.ఆర్.ఎఫ్ గ చేరాను. ఆ తరువాత అదే కళాశాలలో పార్ట్ టైంగా 1987లో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ మాస్టర్ డిగ్రీలో చేరాను.

స్వామివారి లీల

1987 లో నా జీవితంలో జరిగిన ఒక స్వామివారి లీలను చెప్పదలచుకున్నాను. ఒకరోజు కేరళలోని ''విక్రమ్ సారాభాయి'' వారు ఉద్యోగ ప్రకటన ఇచ్చారు. దీనిని చూచిన వెంటనే ఎలాగైనా ఇంటర్వ్యూకి వెళ్ళి, మార్గమధ్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవాలనిపించింది. ట్రివేండ్రమ్ కు ఇంటర్వ్యూకి వెళ్ళి ఆ తర్వాత అక్కడే ఉన్న శ్రీ అనంతపద్మనాభస్వామివారిని దర్శించుకున్నాను. పెద్ద ఆలయం, చక్కని దర్శనము ఎంతో ఆనందించాను. తిరిగి హైదరాబాద్ వచ్చు మార్గమున ఉదయం 9 గంటల ప్రాంతమున తిరుపతిలో బ్రేక్ జర్నీ చేసి, శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థమై తిరుమలకు వెళ్ళాను. అప్పుడు నేను స్వామిని చూచుటకు ట్రెయిన్ దిగునప్పుడు నాలో ఏదో తెలియని పులకరింత మొదలైంది. స్వామిని చూడాలనే ఆత్రుత పెరిగింది. దొరికిన వాహనాన్ని పట్టుకుని, కొండపై సామానును లాకర్ లో పెట్టి అత్యంత ఆత్రుతగా స్నానం చేసి ముందు వెనక చూడకుండా స్వామి దర్శనానికి వెళ్ళాను. స్వామివారిని చూడాలనే ఆత్రుత తారాస్థాయికి చేరింది. ఆ స్థితిని వర్ణించలేక పోతున్నాను. ఉదా: ఒక వ్యక్తి తన తల్లిదండ్రులను వదిలి 10 సంవత్సరములు జీవనోపాధికై పరదేశము వెళ్ళి, తిరిగి వచ్చిన వెంటనే, తాను ఇంటికి చేరకముందే తన అమ్మ చివరి దశలో ఉన్నదనే విషయము తెలిసినప్పుడు, తన తల్లిని అత్యంత తొందరగా చూడాలనే ఆత్రుత ఏవిధంగా ఉంటుందో నాకు స్వామిని చూడాలనే ఆత్రుత ఆ విధంగా ఉంది. లోనికి వెళ్ళినకొద్దీ ఆత్రుత పెరుగుతోంది. ప్రక్కనున్న భక్తుల మాటలు వినబడలేదు. కాళ్ళు చేతులు వణుకుచున్నవి. శరీరం కంపిస్తున్నది. ఈ స్థితిలో స్వామి వద్దకు వెళ్ళాను. నా శరీరం లోని నవనాడులు కంపించాయి. కళ్ళనుండి ఆనంద బాష్పాలు పట పట క్రింద రాలాయి. స్వామి శ్రీవేంకటేశ్వరా అంటూ దండం పెట్టుకుని బయటకు వచ్చాను. శరీరం చల్లబడ్డది. కాని స్వామి విరహాన్ని భరించలేక బయట ఏదో ఒకటి తిని మళ్ళీ దర్శనానికి వెళ్ళాను. అత్యంత తపనచే భావోద్రేకానికి గురై, దర్శన లైనులలో మధ్య మధ్యన దూరుచు ఆరోజు మొత్తం 7 దర్శనాలు చేసుకున్నాను. ఏడవ దర్శనము సందర్భముగా నా కాలి వ్రేళ్ళకు ఒక రాయి బలంగా తాకడం వలన చాలా నొప్పి లేచింది. వెంటనే ఇది

శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞగా ''ఇక చాలు వెళ్ళు, ఇతర భక్తులు దర్శించుకోవాలి'' అనే ఒక భావన నా హృదయములో కలిగింది. మరియు శ్రీవేంకటేశ్వరా ''నేను నీవాడిని, మీరు నావారు'' అనే తెలియని భావం ఏర్పడింది. చివరికి సాయంత్రం 6 గంటలకు హైదరాబాదుకు తిరుగు ప్రయాణమైనాను. ఆ తరువాత నుండి నా జీవితంలో వృద్ధి చెందుట ప్రారంభమైంది.

ఆర్థికంగా దిగజారిపోవుటచే మానసికంగా, శారీరకంగా మా తల్లిదండ్రులు క్రుంగిపోయారు. కుటుంబ బాధ్యత, మా చెల్లెలికి సంబంధం చూసి పెండ్లి చేసే బాధ్యత నేనే తీసుకున్నాను.

ఉద్యోగం చేయటం ఏమాత్రం ఇష్టం లేక ప్రైవేట్ కన్స్ట్రక్షన్స్ చేయుట ప్రారంభించాను. చివరికి పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ గ 1987 అక్టోబర్ లో చేరాను. కాని ఇది రుచించక 1990 లో నా పెండ్లి అయిన వెంటనే మానేసి తిరిగి కన్స్ట్రక్షన్స్ లో పూర్తిస్థాయిలో చేరాను.



వివాహం

హైదరాబాద్ వాస్తవ్యులైన చెఱుకుపల్లి నారాయణరెడ్డి, శకుంతలాదేవి ఏడవ సంతానం, ఎం.ఎస్సీ కెమిస్ట్రీ చదివిన చి॥ సురేఖారెడ్డితో తేది 04-03-1990లో నాకు వివాహం జరిగింది. ఈ పెండ్లి కూడా స్వామివారి లీలలో భాగంగానే జరిగింది. 1987 నుండి పెండ్లి నిమిత్తమై ఎంతో మంది అమ్మాయిలను చూచాను. అదే క్రమములో ఒకరోజు ఈ సురేఖను కూడ పెండ్లిచూపుల్లో వారింట్లో చూచాను. తొలి చూపులో ఆమె నాకు నచ్చలేదు. కాని గతంలో పరిచయమున్న వ్యక్తిలాగ భావన కలిగింది. నాలో తెలియని దగ్గరి భావాలు రాసాగాయి. అయినప్పటికి పెండ్లికి నిరాకరించాను. ఇలా మూడు నెలలు గడిచాయి. నేను నిరాకరించుటచే ఈమధ్యన ఆమెకు మరో సంబంధమును కూడ చూచారు. ఈ మూడు నెలల కాలము నాలో సురేఖతో వెనకటి పరిచయమున్న భావన ఎక్కువైంది. ఈ భావన నాకే కాకుండ సురేఖకు కూడా కలిగింది. చివరికి ఈ భావనకు లోనై పెండ్లికి ఒప్పుకున్నాను. తేది 28-02-1990 నాడు మా చెల్లెలు పెండ్లి ములుగు వాస్తవ్యులైన బడికోల్ బాల్‌రెడ్డితో జరిపించి, తేది 04-03-1990 నాడు నేను పెండ్లి చేసుకున్నాను. ఏప్రిల్ 1990 నుండి ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో కన్స్ట్రక్షన్ రంగములో బిల్డరుగా వ్యాపారము చేయుట మొదలు పెట్టాను. వ్యాపారములో చాలా ఆటుపోట్లు వచ్చాయి. ఈ నెల ఎలా గడుస్తుంది అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నాకు ఇద్దరు పుత్రులు. వేదాంత్ మరియు అరవింద్ రెడ్డి. మా తండ్రి తేది 22-12-1990 నాడు చనిపోయారు. నా భార్య ఎం.ఎస్సీ చదివినప్పటికీ పిల్లల పోషణార్థమై ఉద్యోగము చేయక ఇంటిపట్టునే ఉండేది. నాకు వ్యాపారము పైన, నా భార్యకు కుటుంబము పైన ఎక్కువ ఇష్టాలు ఉండేవి. నేను 1987లో పార్ట్ టైంగ ఇంజనీరింగ్ మాస్టర్ డిగ్రీలో చేరాను. ఇది రెండున్నర సంవత్సరాల కోర్స్. కాని నేను వ్యాపారము నందే మనస్సు నిలుపుట వలన క్లాసులకు సరిగా వెళ్ళేవాణ్ణి కాను. రేపు పరీక్ష అనగా గుర్తుకొచ్చేది కాబట్టి పరీక్షను వ్రాసేవాడిని కాదు. వ్యాపారములో డబ్బు వస్తుంది కావున చదువుయందు ఆసక్తి తగ్గింది. అది ఒక డిగ్రీ సాధించుటకు తప్ప నా జీవితానికి ఎందుకు పనికివస్తుందనే అభిప్రాయముతో ఉండేవాణ్ణి. చివరికి మే నెల 1992 లో మాస్టర్ డిగ్రీ నా

చేతికి వచ్చింది.

పైన చెప్పిన ప్రతి విషయాన్ని శ్రీవేంకటేశ్వరుడు తన లీలలలో ఉపయోగించుకున్నాడు. సం॥ 1995 నుండి హైదరాబాద్ లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ కాలనీలో నేనే నిర్మించిన ''వెంకటగిరి రెసిడెన్సీ'' అనే అపార్టుమెంటులో నివాసముండేవారిమి. సం॥ 1999లో నేను కొంత ఆర్థికముగ ఎదిగిన తరువాత, మమ్ములను కష్టాలకు గురి చేసిందనే కసి చేత ఊరిలోని మా ఇల్లును అమ్మి మరో ఇల్లును నిర్మించుకున్నాము. 1999 వరకు వ్యాపారమే ముఖ్యంగా జీవించాను. అక్టోబర్ 1999 నుండి స్వామి లీలలు ప్రారంభమైనాయి.

స్వామి లీలలు ప్రారంభం :

నా వయస్సు 39 ఉన్నప్పుడు, అక్టోబర్ 1999 లో డయాబెటిక్ వచ్చింది. ఈ విషయం తెలిసిన వెంటనే మాపై భారం పడ్డట్లనిపించింది. జీవితంపై నిరాశ కలిగింది. ఎలాగైనా దీనిని అధిగమించాలనే ఉద్దేశ్యముతో యోగా, ప్రాణయామ నేర్చుకున్నాను. ప్రతిరోజు ఒక గంట యోగా, ప్రాణాయామం, మరో గంట నడక అలవాటు చేసుకున్నాను. చక్కని జీవన విధానాన్ని అలవాటు చేసుకున్నాను. భక్తిమార్గము ఆకర్షించింది. మాంసాహారముపై విరక్తి కలిగింది. పనిభారము, సమస్యలు ఉండకూడదని భావించి వ్యాపారాన్ని సగానికి తగ్గించాము. అపార్టుమెంట్స్ బదులు కొన్ని ఇండిపెండెంట్ ఇళ్ళు కట్టడం ప్రారంభించాను. అల్వాల్ లోని రైతుబజార్ ఎదురుగా గల జి.వి.రెడ్డి కాలనీలో 600 గజాలలో నాలుగు ఇళ్ళను కట్టుట ప్రారంభించాను.

ఇలా వ్యాపారాన్ని తగ్గించి నా జీవితాన్ని క్రమబద్ధీకరించుకున్న తరువాత సం॥ 2000 ఏప్రిల్ నుండి స్వామివారి ప్రత్యక్ష లీలలు ప్రారంభమైనాయి.

నాకు స్వామివారి ప్రత్యక్ష లీలలు సం॥ 2000 నుండి ప్రారంభమైనప్పటికీ అశ్రద్ధచే వాటిని వ్రాయలేదు. ఒక నాలుగు పొందిన తరువాత నాకు మాత్రమే అర్థమయ్యే విధంగ, సారాంశమును ఒక డైరీలో వ్రాశాను. చివరికి స్వామివారు ఏదో సాధించుటకు వీటిని ప్రసాదిస్తున్నారని గ్రహించి తేది 20-07-2002 నుండి ప్రత్యేక పుస్తకములు పెట్టి వ్రాయుటను మొదలుపెట్టాను.

శ్రీ ఆంజనేయుని దర్శించుట :

ఏప్రిల్ 2000, మొదటి అనుభూతి : అప్పట్లో ప్రతి శనివారము టీవీలో జై హనుమాన్ సీరియల్ ప్రసారమయ్యేది. నేను దానిని అతి శ్రద్ధగ చూచేవాడిని. ప్రతి ఎపిసోడును తప్పకుండ చూచేవాడిని. దీనితో నాకు దైవభక్తి, శ్రద్ధ చాల పెరిగాయి.

కల : మా సొంత గ్రామము చిన్నగుండవెల్లి లోని మా తోటబావి వద్ద రెండు పశువుల కొట్టములు ఉన్నవి. దానికి కొంత దూరములో మా తండ్రి సమాధి కలదు. ఈ రెండింటికి మధ్యన, పశువుల కొట్టము ముందు నేను శ్రీ ఆంజనేయుణ్ణి చూచాను. ఆయన జై శ్రీరామ్ అంటూ తన గదను పైకి ఎత్తాడు. ఆ ఆంజనేయుడు నేను టీవీ సీరియల్ లో చూచే ఆంజనేయుడు

ఒకే విధంగా ఉన్నాడు. పైగా అదే గొంతు, జైశ్రీరామ్ అంటూ ఆయన పైకి ఎగిరాడు. తన కాళ్ళను క్రిందికి ఒత్తుచు జైశ్రీరామ్ అంటూ తన గదను పైకి ఎత్తుచు ఎగిరాడు. ఇంతే కల. ఇందులో ''జైశ్రీరామ్'' అనే పదము నా మనస్సులో పదే పదే మారుమ్రోగింది. నేను చాల సంతోషించాను. శ్రీ ఆంజనేయుడు దర్శనమిచ్చాడని మురిసిపోయాను.

నేను జైహనుమాన్ టివి సీరియల్ చూస్తున్నాను కాబట్టి అదే భావముతో ఉన్నా కాబట్టి ఈ కల యాదృచ్ఛికంగా వచ్చిందని భావించి ఎక్కువ విలువ నీయలేదు. ఇలా సమయము గడుస్తున్నది. వ్యాపారము చేసుకుంటున్నాను.

తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శించుట

జులై 2000 ప్రాంతములో మరో కల కన్నాను. నిజానికి ఈ కలను కూడ నేను యాదృచ్ఛికమనే భావించాను. కలను పొందిన 15 రోజుల వరకు నా భార్యకు కూడ చెప్పలేదు. కాని కలలోని అంశములు నిజమగుటను చూచి ఆమెతో చెప్పాను. దీనిని పొందిన రెండు సంవత్సరముల తరువాత వ్రాసినప్పటికీ ఆ కలలోని భావాలు నా మనస్సులో ముద్రించుకున్నందున ఉన్నది ఉన్నట్లుగా ఇలా వ్రాశాను.

''ఇది నా జన్మలో మరచిపోని సంఘటన. నా జన్మ పావనమైన సంఘటన. నేను పుట్టింది ఇందుకే అయి ఉండవచ్చును. నేను ఏ జన్మలో చేసిన పుణ్యమో నన్ను ఆ దేవాది దేవుడు ఈ జన్మలో కరుణించాడు. కొన్ని వేల జన్మలు తపస్సు చేసిన దొరకని భాగ్యాన్ని ఆ శ్రీవేంకటేశ్వరుడు నాకు ప్రసాదించాడు. నేను ఒక సామాన్య మానవుణ్ణి. ఒక మారుమూల ఊరిలో వ్యవసాయ వృత్తిగల కుటుంబంలో పుట్టినవాణ్ణి. పూజ చేయు విధానము కాని, వేదమంత్రములు కాని తెలియదు. ఏ ఒక్కరోజు ఆ శ్రీవేంకటేశ్వరునికి అభిషేకించి నైవేద్యము పెట్టలేదు. కాని నా కష్ట సమయములందు ఆయన్నే కొలిచేవాణ్ణి. ఏదో ఒక దేవుణ్ణి కోరుకో అంటే మాత్రం నేను శ్రీవేంకటేశ్వరుణ్ణే కోరుకుంటాను. నా తల్లి రుక్మమ్మ, తండ్రి వెంకటరెడ్డి గార్లు కూడ పెద్దగ చెప్పుకోతగిన భక్తులు కారు. మా ఇంటిలో శ్రీవేంకటేశ్వరుణ్ణి నేను మాత్రమే ఎక్కువ కొలిచేవాణ్ణి. నాకు నా తల్లితండ్రులు శ్రీవేంకటేశ్వరుణ్ణి కొలవమని చెప్పలేదు. నేను 2వ తరగతి చదువుతున్నప్పుడు మా అమ్మమ్మగారి ఊరు, అప్పనపల్లికి పోయాను. అక్కడ నా సమవయస్సు వారైన మేనమామ కొడుకు, పెద్దమ్మ కొడుకులు ప్రతి శనివారము శ్రీవేంకటేశ్వరునికి ఉపవాస దీక్ష ఉండుటను చూచి ప్రభావితుడనై, నేను కూడ ఈ దీక్షను ప్రారంభించాను. ప్రతి శనివారము పూజ చేసేవాడిని. రాత్రిపూట ఉపవాస దీక్ష చేసేవాడిని. మా తల్లితండ్రులు కూడ నా నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. ఉపవాస దీక్షకు తగిన ఏర్పాట్లు చేసేవారు. ఈ విధంగా ఇంటర్ వరకు ఉపవాస దీక్ష కొనసాగించాను. తరువాత ఇంజనీరింగ్ లో సీటు రావాలని ఆ దేవదేవుణ్ణి కోరుకున్నాను. కాని రాలేదు. మరొక సంవత్సరం కూడా రాలేదు. కోపముతో ఆ దేవునిపైన విశ్వాసము సన్నగిల్లింది. ఉపవాస దీక్ష మానివేశాను. కాని తరువాతి సంవత్సరం కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్, ఉస్మానియా యూనివర్సిటీలో సీటు లభించింది. కాని తిరిగి ఉపవాస దీక్షను కొనసాగించలేదు. కాని ఎక్కడో నా హృదయంలో ఆయనే ఉన్నాడన్న మాట మాత్రం నూటికి నూరు పాళ్ళు నిజం. ప్రతి కష్టంలో ఆయన్నే వేడుకునేవాడిని. నా నోటికి అనుకోకుండ ఆయన పేరు, రూపము గుర్తుకు వచ్చేవి. నాకు సర్వము ఆయనే అనే నమ్మకం ఉన్నది. నా సర్వ దుఃఖములను ఆయనే తీర్చునను విశ్వాసము దృఢముగా ఉన్నది.

ఇది అంతా ఆ శ్రీవేంకటేశ్వరుని లీల మాత్రమే అని దృఢముగ ఇప్పుడు చెప్పగలను. లేకుంటే నేను 2వ తరగతి నుండి 14 సంవత్సరములు క్రమం తప్పకుండ ఆ శ్రీవేంకటేశ్వరునికి ఉపవాస దీక్ష ఉండుట, అందులో మాలాంటి కుటుంబంలో అంటే ఆయన కటాక్షమే అని చెప్పగలను. నా యందు ఆ దయామయుడు తన పరిధులను మించి కటాక్షించాడు అంటే అందులో సందేహమే లేదు.

వివాహము తరువాత ప్రతిరోజు ఉదయము పూజ చేసి భోజనము చేయుట అలవాటు చేసుకున్నాను. ఇలా నా జీవితము జరుగుతున్నది. ఏదేని కష్టము కుటుంబములో కాని లేదా వ్యాపారములో కాని వచ్చినప్పుడు ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రమే వేడుకునే వాడిని. మా తండ్రి గారిని కూడ వేడుకుంటాను. మా తండ్రి పేరు వెంకటరెడ్డి, తల్లి రుక్కమ్మ. అందువల్ల నేను ఒక్కొక్కప్పుడు స్వయంగా ఆ శ్రీవేంకటేశ్వరునికి బిడ్డనన్న భావన కలుగుచుండేది.

నేను కన్స్ట్రక్షన్ వ్యాపారము చేయుచుంటిని. అందులో సాధక బాధకాలు చాల ఉండును. అప్పుడు ఆల్వాల్ లోని ఓమ్ సాయి కాలనీలో డ్యూప్లెక్స్ ఇల్లును కట్టుతున్నాను. ప్లాట్ కొని, పర్మిషన్ తీసుకుని ఇళ్ళు కట్టి అమ్ముట నా వ్యాపారము. అది 600 గజముల స్థలము. అందులో 4 ఇండ్లు కట్టుతున్నాను. రెండు శ్లాబులు పూర్తయినవి. బ్రిక్ వర్క్ మొదలైంది. దీని వెనుక శ్రీమాన్ బ్రిగేడియర్ జి.బి.రెడ్డి అని ఒక రిటైర్డు మిలిటరీ ఆఫీసర్ ఉంటున్నాడు. ఆయన ఈ కాలనీకి ప్రెసిడెంట్. నాకు మిత్రుడే. ఆయనకు, నేను ప్లాట్ కొన్న యజమానికి శత్రుత్వము. ఒకరోజు జి.బి.రెడ్డి గారు నా వద్దకు వచ్చి నీకు ఆయన కొంత ప్రభుత్వ భూమిని అమ్మాడని, ఆయనపై కేసు పెట్టమని అన్నారు. దానికి నేను నిరాకరించుటచే ఆ కోపము నాపై తీసుకొనుటకు సిద్ధంగా ఉన్నాడు.

ఇంతలో నాకు ఆ సమయము వచ్చింది. భవిష్యత్తులో ఏమి జరుగునో తెలిసింది. ఏ విధంగా ఉండగలనో ఊహించుకొంటిని. ఆ సంఘటన నాకు, నా జీవితానికి అత్యంత శుభకరమైంది. నేను ఒకవేళ గత జన్మములు ఎత్తినచో, నా అన్ని జన్మములలోను ఈ జన్మమే శ్రేష్ఠమైనది. నా జన్మ ధన్యమైంది.



కల : ఆ రోజు మామూలుగనే మా ఇంట్లో పడుకున్నాను. ఆ రాత్రి ఒక స్వప్నము వచ్చింది. అందులో నన్ను ఒక అదృశ్య శక్తి మా ఇంటి నుండి దక్షిణం వైపుకు తీసుకెళ్ళింది. తమిళనాడు వైపు తీసుకెళ్ళుతున్నదని కలలోనే అనుకున్నాను. చివరికి తిరుపతికి తీసుకెళ్ళింది. ఇంతలో చిత్రం జరిగింది. స్వయంగా శ్రీవేంకటేశ్వరుడు నాముందు నిలిచాడు లేదా ఆ శక్తి నన్ను తిరుమల శ్రీవేంకటేశ్వరుని ముందు దింపింది. నల్లని ముఖము, నల్లని చేతులు, నల్లని కాళ్ళు, చక్కని పీతాంబరమును ధరించినాడు. శంఖు చక్రములను ధరించినాడు. ఒక చెయ్యి అభయమును ప్రదర్శిస్తున్నది. మరొక్క చేయి కటి యందు ఉన్నది. అతనిపైన బంగారు మకర తోరణము ఉన్నది. నేను ఆయన ముందు నిలబడ్డాను. స్వామివారు తన అణువణువును చూపెట్టారు. ఆయన అభయ హస్తములోని గీతలను కూడ స్పష్టంగా చూచాను. నేను అలాగే చాలాసేపు నిలుచున్నాను. చివరికి నాలో ఒక పులకరింత వంటిది కలిగింది. నాకు రాబోవు రోజులలో చాల కష్టములు వచ్చునని అనిపించింది. నేను అలాగే స్వామివారిని చూచుచుంటిని. ఆ స్వామి నాతో ఒక్క మాట కూడ మాట్లాడలేదు. కాని నాకు రాబోవు రోజులలో చాలా కష్టములు వచ్చునని ఒక అనుభూతి కలిగింది. నా అరికాళ్ళనుండి వణుకుతో కూడిన భయము ప్రారంభమైంది. కొంచెము సమయము తరువాత స్వామివారిలో చలనము కనబడ్డది. స్వామి తన అభయ హస్తమును తీసి నాకు

షేక్ హ్యాండ్ (హల్లో) రూపముగ ఇవ్వబోయాడు. అప్పుడు నాలో ''నీవు భయపడకు నేనున్నాను. నీకు ఏమీ కాదు'' అన్నట్లు అనుభూతి కలిగింది. నేను ఆయన చేయిని హల్లో రూపంగా నా చేయితో అందుకోబోవు లోపల కల అదృశ్యమైంది. ఇది నా జీవితములో జరిగిన నిజమైన సంఘటన. తెల్లవారి మామూలుగ పూజమందిరములో పూజ సమయమున నాకు దర్శనమిచ్చినందులకు కోటి కోటి ప్రణామములును తెలుపుకున్నాను. పైన చెప్పిన స్వప్నములో స్వామివారు అత్యంత ప్రకాశవంతంగా కనబడ్డారు. అభిషేకము తరువాత నీటి పదనలో ఎలా మెరుస్తూ ఉంటారో ఆ విధంగా అత్యంత నల్లగా కనబడ్డారు. ఆ రూపము నా మనస్సులో బలంగా ముద్రించుకుంది. ఈరోజు కూడా నేను అదే రూపును ధ్యానించుదును. ఇది కల.

దీని అర్థము నాకు తరువాత తెలిసింది. నాకు నా జీవితములో ఎప్పుడు రాని కష్టములు వచ్చాయి. ఎప్పుడు ఏమి కీడు జరుగునో అని భయము ఒకటిన్నర సంవత్సరముల పాటు జరిగింది. భయముతో ఒళ్ళంతా వణుకుట, ప్రతిక్షణము ఆ దేవాది దేవుణ్ణి ధ్యానించుట జరిగింది. జి.బి.రెడ్డి గారికి నాపై చాల కోపము కలిగి నా యొక్క 4 ఇళ్ళను కూలగొట్టించాలని కంటోన్మెంట్ అధికారులకు, బ్రిగేడియర్ కు, పూణేలోని మరియు ఢిల్లీలోని వారి హెడ్ ఆఫీసుకు కంప్లైంట్ రాస్తూ నేను కొంత ప్రభుత్వ భూమిలో కన్స్ట్రక్షన్ చేశానని, అనుమతికి విరుద్ధంగా కట్టానని, ఇది కాలనీ వారికి ఇబ్బంది అని, త్వరగ దీనిని కూలగొట్టవలెనని ప్రతి 3 రోజులకొక కంప్లైంట్ రాస్తుండెను. ఆ అధికారులందరు ఆయనకు చాలా మిత్రులు. పైగా ఆయన క్రింద ఒకప్పుడు పని చేసినవారు కావటం ఆయనకు అనుకూలించింది. కంటోన్మెంట్ వారు ఒక నోటీసు ఇచ్చారు. ఎం.ఆర్.వో మరియు కంటోన్మెంట్ అధికారులు నాలుగు సార్లు సర్వే చేశారు. ఒక 15 సార్లు అందరు వచ్చి చూచారు. కాని చివరికి ఇది ప్రైవేటు భూమి అని, అది నాదేనని తేల్చి చెప్పారు. కాని కన్స్ట్రక్షన్ అనుమతి ప్రకారం లేనందున 256 నోటీసు ఇచ్చి 15 రోజులలో కూల్చెదమని చెప్పారు. నేను ఒక అడ్వకేటు వద్దకు వెళ్ళాను. ఆయన 13వ రోజు కోర్టులో వేశాడు. కాని ఆ కోర్టు ఆర్డర్ ఇవ్వలేదు. కంటోన్మెంట్ వారికి 7 రోజుల నోటీసు ఇచ్చింది. దీనితో వారు 16వ రోజు అంటే తేది 18-11-2000 నాడు కూల్చుటకు రంగం సిద్ధం చేసుకున్నారు. వారికి ఢిల్లీ నుండి, పూణే నుండి ప్రెజర్ ఎక్కువైంది. ఏవిధంగానైనా దీనిని కూల్చవలెనని నిర్ణయించుకున్నారు. 17వ తేదీన పోలీసు ప్రొటెక్షన్ కోసం ఉత్తరం కూడా వ్రాశారు. ఇంతలో హైకోర్టు నాకు వారం రోజుల వరకు స్టే ఇచ్చారు. నాకు ఈ 7 రోజులు నిద్ర పట్టలేదు. చివరికి 7 రోజుల తర్వాత సిటీ కోర్టులో నా స్టే డిస్మిస్ అయింది. మళ్ళీ పారలు, గునపములు, మనుష్యులను సిద్ధం చేసుకుని నా బంగ్లాలను పడగొట్టుటకు వెళ్ళారు. ఆ క్షణంలో వేరే కోర్టు 14 రోజుల వరకు స్టే ఇచ్చారు. దీనిని వారు వెకేట్ చేయించుటకై ముగ్గురు నలుగురు అడ్వకేట్స్ వారి పక్షమున వాదించారు. విపరీతమైన ఒత్తిడి, ఏ క్షణములో ఏమి జరుగునో అని భయము. ఆ ఇళ్ళను ఎవరు కొనవద్దని శ్రీమాన్ జి.బి.రెడ్డి గారు అందరికీ చెప్పడం జరుగుచుండెను. ఈ విధముగ నా పంచ ప్రాణములు నా చేతిలో లేవు. ప్రతిక్షణము శ్రీవేంకటేశ్వరుణ్ణే ధ్యానించడం జరిగింది. ఇది నాకు ఆ దేవుణ్ణి ధ్యానించుటకు ఆ దేవాది దేవుడు కల్పించిన మంచి సదవకాశము. దీనిని నా జన్మలో మరువలేను. ఇలా ఒకటిన్నర సంవత్సరముల వరకు అంటే దాదాపు మార్చి 2002 వరకు, ఎప్పుడు ఏమి జరుగునో అనే భయముతో ఉన్నాను. కాని చివరికి ఏమీ కాలేదు. ఇదంతా ఆ దేవుని కృపవల్లే జరిగిందన్నది నూటికి నూరుపాళ్ళు నిజం.

స్వామి శిక్షణ

పైన చెప్పిన ప్రతి విషయము పైకి కనబడేది మాత్రమే అంతరంగంగ ఈ సంఘటనలో ఎంతో శిక్షణ ఇచ్చాడు. నాకు వ్యాపారమంటే ఇష్టమైనప్పటికీ, నా వ్యామోహాన్ని వంద రెట్లు పెంచాడు. ఏ చిన్న సంఘటన జరిగిన భరించలేని స్థితి కలిగించాడు. భయముతో స్వామివారిని నిరంతరం స్మరించేవాడిని. అలా శ్రీవేంకటేశ్వరుణ్ణి

ప్రభూ అని పిలవగానే పరిగెత్తుకొచ్చి నా హృదయము లోనికి ప్రవేశించేవాడు. వెంటనే నేను తీవ్రమైన భావస్ఫూర్తికి గురయ్యేవాడిని. నా హృదయంలో దైవాన్ని దర్శించేవాడిని. శరీరం రోమాంచితం అయ్యేది. ఆనందపు భావాలలో మునిగి తేలేవాడిని. అన్ని సమస్యలపైనున్న మమకారము తగ్గి స్వామివారిపైననే సంపూర్ణ మనస్సు లగ్నమయ్యేడిది. పరమానంద భావానికి లోనయ్యేవాడిని. ఒకరకమైన దివ్యమైన రసామృతాన్ని గ్రోలేవాడిని. మనసు చెప్పలేని వర్ణించలేని పరమానందమును పొందుచు, ఆనంద బాష్పాలు కళ్ళనుండి జాలువారుచుండెడివి. ఎంతగా ఆనంద పడేవాడినంటే నా చొక్కా ఛాతీభాగము చాలావరకు ఆనంద బాష్పాలతో తడిసిపోయేది. నా కళ్ళలో అంతటి నీరు (ఆనంద బాష్పాలు) ఎక్కడినుండి వస్తున్నవో తెలియక ఆశ్చర్యపడేవాడిని. ప్రభూ! అని పిలివగనే స్వామివారు ఎక్కడున్నా క్షణంలో పరుగెత్తుకొచ్చేవాడు. నా హృదయంలో నిలిచేవాడు. ఇంకా చెప్పాలంటే ప్రభూ! అనే పదంలో 'ప్ర' అనే అక్షరాన్ని పలుకగనే స్వామివారు ఏతెంచి 'భూ' అనే అక్షరం పలికే లోపలే నా హృదయంలో నిండిపోయేవారు. అప్పటికే కళ్ళవెంట నీరు పటపట రాలుచుండేది. అమితమైన ఆనందాన్ని అనుభవించేవాడిని. రోజుకు కనీసం 5 నుండి 10 సార్ల వరకు ఇలా జరుగుచుండేది. నన్ను పరమానంద భరితుణ్ణి చేశాడు. ఈ లోకంలో ఆనంద సామ్రాజ్యానికి రాజుగ చేశాడు. లేదా ఆనంద సామ్రాజ్యములో ఒక గొప్ప కోటీశ్వరుణ్ణి చేశాడు. నేను అనుభవించిన ఆనందము బహుశా ఈ లోకంలో చాలా తక్కువ మంది అనుభవించి ఉంటారు. ఆనంద సామ్రాజ్యానికి రాజుగ నాది నేను తలచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దివ్యభావాల పరాకాష్ఠకు వెళ్ళేవాడిని. ఈ లోకపు వ్యవహారాలన్న మరిచేవాడిని. ఒక్కొక్కసారి ఆనందమును భరించలేక సొమ్మసిల్లిపోయే స్థితి కలిగేది. ఇంతకంటే ఆనందం లోకంలో వెతికినా దొరకదు. అంత ఆనందాన్నిచ్చాడు. మూగవాడిగ అనుభవించేవాడిని. ఇలా మొత్తం ఒకటిన్నర సంవత్సరాలు నా నరనరాలలో శ్రీవేంకటేశ్వరుడు నావాడుగ లీలయైపోయాడు.

పైన చెప్పిన స్వప్నములో శ్రీవేంకటేశ్వరుడు దర్శనమిచ్చి, అణువణువును చూపెట్టాడని మాత్రమే చెప్పాను. కాని ఈ సంఘటన ద్వారా నాలో ''భక్తి'' బీజమును నాటాడు. స్వప్నము తరువాత 15 రోజుల వరకు ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోలేదు. ఆ తరువాత బీజము మొలకెత్తి నా నరనరాల్లో వ్యాపించింది. స్వామివారి స్మరణలో కలిగే ఆనందమును వదలలేక అంతర్ దృష్టి బాహ్యదృష్టి అనే రెండు దృష్టికోణాలను ఏర్పరచుకొని, అంతర్ దృష్టితో సదా ఆయనను స్మరించుటను అలవాటు చేసుకొన్నాను. స్వామివారి గురించి మరింత తెలుసుకోవాలన్న తపన నాలో పెరిగింది.

సంపూర్ణ శరణాగతి

ఒక సమయంలో నా ఇళ్ళను కూల్చుటకు అధికారులు సిద్ధం అయ్యారు. ఆపుటకు నా శక్తి సరిపోలేదు. ప్రయత్నించి అలసిపోయి చివరికి సాయంత్రం 5 గంటల ప్రాంతమున మా ఆఫీసుకు వచ్చి స్వామివారిని ప్రార్థించుట మొదలుపెట్టాను. ఆ సమయాన శ్రీవేంకటేశ్వరుడు తప్ప నాకు దిక్కెవరు లేరనే భావన కలిగింది. వెంటనే స్వామివారిని అత్యంత ఆర్తుతతో కళ్ళనుండి నీరు జాలువారగ, రోమాంచితుడనై ప్రభూ! శ్రీవేంకటేశ్వరా అంటూ భయమును, ఆనందమును తట్టుకోలేక ఒక ఉన్మాదిలాగ కేకలు పెడుతూ అరిచాను. ప్రభూ! ప్రభూ! అంటూ ఆయననే స్మరిస్తూ బాహ్య ప్రపంచమును పూర్తిగా మరచిపోయాను. ఆ సమయమున నాకు శ్రీవేంకటేశ్వరుడు తప్ప మరేది కనబడలేదు. మొత్తం గంటన్నర కాలం ఈ ఘటన జరిగింది. చివరికి నేను మీవాడను ప్రభూ, నన్ను స్వీకరించండి అంటూ గట్టిగా ఏడ్చుచు మొర పెట్టుకుంటూ నాది నేను నా సమస్త సంపద, పరివారముతో పాటు మీవారమని, స్వీకరించమని పెద్దగా అరిచాను. చివరికి నాది నేను నా కుటుంబముతో సహా మానసికంగా ఒక వస్తువులాగా మారిపోయి మా ఆఫీసు నుండి ఎగిరి తిరుమల శ్రీవారి ఆలయంలోని హుండీలో

పడిపోయాను. ప్రభూ! మీ హుండీలో పడిన ప్రతి వస్తువు మీదే. ఇప్పుడు నేను మీ వాడిని. మీ ఆస్తిని. నాపై మీకు పూర్తి అధికారమున్నది. నేను, నా కుటుంబము, ఆస్తిపాస్తులు అన్నీ మీవే. నాకంటూ ఏమీ లేదు అంటూ గొల్లున అరుస్తూ అనంతమైన ఆనందముతో, శరీరం మొత్తం రోమాంచితం కాగా నేను స్వర్గలోకమున విహరించునట్లు ఆనందపడ్డాను. పరవశించిపోయాను. ఇప్పుడు నేను మీవాడనని, నన్ను మీ పాద సేవకుడిగా స్వీకరించమని, ఈ లోకానికి ఉపయోగపడే ఏదేని మంచిపనిని నాచే చేయించండని దీనంగా వేడుకున్నాను. మరియు ప్రభూ! నేను అజ్ఞానిని. ఏది మంచో, ఏది చెడ్డదో తెలియదు. బోధ చేసే గురువులు, పెద్దలు లేరు. జీవితంలో ఎలా ప్రవర్తించాలో ఎలా మాట్లాడాలో తెలియదు. అన్నీ మీరే అని అనుకుంటున్నాను కాబట్టి ఇప్పటినుండి నా మనస్సులో ఉద్భవించే ప్రతి ఆలోచన మీదే కావాలి. నేను ఆ ఆలోచన ప్రకారమే నడుచుకుంటాను. అది తప్పు ఆలోచన కాకూడదు. లోక కళ్యాణం కోసమై లేక మీ సంకల్పమై ఉండాలని వేడుకున్నాను. ఇంతటి ఆనందమును నేను ఏ రోజు అనుభవించలేదు. ఇది పరమానంద స్థితి. ఆనంద బాష్పాలు వచ్చేటువంటి ఆనందం కంటే పదిరెట్లు అధిక ఆనందమును ఇచ్చే స్థితి. భగవంతుడు తలచుకుంటే తప్ప మనము దీనిని పొందలేము. ఆయన అనుగ్రహముచే మాత్రమే సాధ్యము. నా జీవితములో 2023 వరకు ఏకధాటిగ ఒక గంటకు పైగ అనుభవించిన పరమానంద స్థితి కేవలం మూడుసార్లు మాత్రమే. అందులో ఇది మొదటి స్థానం ఇవ్వదగింది. ఈరోజు నేను గంటన్నర వరకు ఈ స్థితిని అనుభవించాను. ఆ తర్వాత నా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని కోల్పోయాను. నేను శ్రీవేంకటేశ్వరుని వ్యక్తిననే భావన నా మనస్సులో బలంగా నాటుకున్నది. ఒకరకంగా ఈరోజుతో సాయిరెడ్డిగ నా జీవితము పరిసమాప్తి చెంది శ్రీవేంకటేశ్వర పాదసేవకుడిగ నూతన జీవితము లోనికి అడుగిడాను.

ఇక్కడ మరొక్క విషయం చెప్పదలచుకున్నాను. నేను, నాది నేను నాకున్న సర్వస్వము, కుటుంబంతో సహా మీకు సమర్పించాను అని చెప్పాను. దీనర్థం ఆరోజు వరకు నాకు ఈ భూమిపైన ఉన్న సమస్త ఆస్తులపైన, ధన వాహనాల పైన, కుటుంబ సభ్యుల పైన, ఇతర వ్యక్తులపైన ఎంత అధికారముంటుందో ఆ మొత్తం అధికారాన్ని స్వామివారికి సమర్పించాను. ఈ భూమిపైన నాకంటూ, నావారంటూ ఎవ్వరూ లేరు అనే స్థితిని కల్పించుకున్నాను.

ఇది నేను స్వామివారి వైపు వేసిన మొదటి అడుగు. ఆ తరువాత నా ప్రతి అడుగు, తెలిసి వేసినా, తెలియక వేసినా శ్రీవేంకటేశ్వరుని వైపే వెళ్ళింది.

ఈ రోజు పొందిన పరమానందాన్ని మరువలేకపోయాను. మళ్ళీ పొందాలనిపించింది. తెల్లవారి తిరిగి అదే సమయానికి అదే ఆఫీసులో మళ్ళీ శరణాగతి చేశాను. స్వామివారిని అత్యంత ఆర్తితతో ప్రేమతో స్మరిస్తూ, ప్రార్థన చేయుట ప్రారంభించాను. కాని నిన్న పొందినంతటి ఆనందాన్ని పొందలేకపోయాను. చివరికి నా హృదయాన్ని స్వామివారికి సమర్పించు సమయమున, నా హృదయాన్ని చూచుకున్నాను. చిత్రం జరిగింది. నా హృదయ స్థానము ఖాళీగా కనపడ్డది. అప్పుడు అర్థం అయింది. దీనిని నిన్ననే స్వామివారికి ఇచ్చేశాను కాబట్టి ఖాళీగా ఉన్నదని అనుకున్నాను. అంతటితో ప్రార్థన ముగించాను. మళ్ళీ తిరిగి ఎప్పుడు ఇలా ప్రయత్నించలేదు.

స్వామినుండి భావాలు చేరుట

ఈ కల కన్న తరువాత ఒకానొక సమయాన ఇలా అనుకున్నాను. నేను ఏ రోజు శ్రీవేంకటేశ్వరుడంటే ఇష్టం అని ఆయనతో చెప్పలేదు. అలాంటప్పుడు నాకు శ్రీవేంకటేశ్వరుడంటే ఇష్టం అనే నా మనస్సులోని భావాలు ఆయనకెలా తెలిసింది? అనే అనుమానముతో ఉన్నాను. దీనికి జవాబుగ ఒక చక్కని మరో లీలను చూపాడు.

లీల : ఆ లీలలో ఎలాగైతే కాంతి కిరణాలు సూర్యుని నుండి ప్రారంభమై అద్దంపై పడి పరావర్తనం చెందినట్లు



మన మనస్సులో కలిగే భావాలు మొదట స్వామివారి నుండి ప్రారంభమై మనకు చేరి మననుండి పరావర్తనం చెంది తిరిగి స్వామికి చేరుటను చూపెట్టాడు. ఇలా ప్రతి భావము భగవంతుని నుండే మనకు చేరును. తరువాత మనము ఆ భావాన్ని ఏ విధంగా స్వీకరించుచున్నామనే విషయం కూడ వెంటనే స్వామివారికి తెలిసిపోతుంది. ఈ విధమైన లీలను చూపుచు ఈ స్థితి నుండి శిక్షణ ఇచ్చుటను ప్రారంభించాడు.

నా దశ : నిరంతరము శ్రీవేంకటేశ్వరుని చూస్తూ, ఆయనను స్మరించేవిధంగా చేశాడు. సంపూర్ణ శరణాగతి చేసి ఆయనవాణ్ణినే భావనతో జీవించుట ప్రారంభించాను. శ్రీవేంకటేశ్వర పాద సేవకుడిగ నాది నేను భావించుకున్నాను. మరియు నా మనస్సులోని భావాలు స్వామివారివని, ప్రతిభావం ఆయనకు తెలుసునని భావించి సన్మార్గములో పయనించుటకు తోడ్పడింది. ముఖ్యంగా ఈ లీలలో స్వామివారిపై, ఆయన మాటపై విశ్వాసము కలిగి ఉండునట్లు చేశాడు. స్వామివారితో అత్యంత దగ్గరి బంధము ఏర్పడింది. స్వామిని విడిచి ఉండలేని స్థితిని కల్పించాడు.

నాది నేను నా కుటుంబముతో పాటు సర్వదాస్తిని ఆయనకు ధార పోయుట వలన మాపైన స్వామివారికి సంపూర్ణ అధికారము లభించింది. మరియు ఇది స్వామివారు ప్రసాదించిన సేవా వృక్షానికి వేళ్ళలాగ పని చేసింది. నా మొదటి కలలో ఎక్కడైతే శ్రీ ఆంజనేయులవారు 'జైశ్రీరాం' అంటూ పైకి ఎగిరాడో అదే స్థలములో 'హరినామ క్షేత్రము'ను స్థాపించుమని శ్రీవేంకటేశ్వరుడు ఆజ్ఞాపించాడు. బహుశా స్వామివారు వచ్చుటకు ముందు తన సేవకుడు వచ్చి ఆ ప్రాంతాన్ని చూచినట్లుంది.

మా అమ్మగారితో మా కుటుంబం

మా చెల్లి, బావ

స్వామివారి లీలలలోని రహస్యం

స్వామివారి లీలలలోని రహస్యమును తెలుపుచున్నాను. స్వతహాగా నేను చాలా ధైర్యవంతుణ్ణి. ఛాలెంజింగ్ పనులంటే చాలా ఇష్టం. కష్టాలను ఎదుర్కొని పోరాడుటలోనే ఆనందమును అనుభవించేది. కాని శ్రీవేంకటేశ్వరుడు కల్పించు చిక్కుల్లో చిక్కినప్పుడు చాలా బాధపడేవాడిని. నా ధైర్యం ఏమాత్రం పనిచేసేదికాదు. విల విల కొట్టుకుందును. ఆ బాధలను భయమును తట్టుకోలేకపోయేవాడిని. నీటి నుండి బయటకు తీసిన చేపపిల్ల వలె కొట్టుకుందును. ఆ కొట్టుకొనుటలో రకరకాలుగా స్వామివారిని ప్రార్థించేవాడిని. ఆయనను ఏవిధంగా ప్రార్థించుతే తృప్తిచెందును? ఆయనకు మన నుండి ఏమి కావాలి? నా నడవడి ఏ విధంగా ఉండాలి? మొదలగు విషయాలు నా మనస్సుకు వచ్చేవి. రకరకాల వాగ్దానాలను చేసేవాడిని. నాకు తెలియకుండానే నూతనమైన వాగ్దానాలను, ప్రతిజ్ఞలను నాచే చేయించేవారు. ఈ విధంగా నాకు తెలియకుండనే ఒక నూతన బీజం నా మనస్సులో పడేది. ఆ విధంగా తాను ఏ మార్పు కోరుకొనునో, ఏది అవసరమో దానిని నా హృదయములో నాకు తెలియకుండానే బీజం నాటేవరకు ఈ లీల కొనసాగేది. ఆ తరువాత కొంత విశ్రాంతి ఇచ్చి మళ్ళీ అవసరమున్నప్పుడు ఈ నాటిన బీజం మొలకెత్తేటట్లు చేసేవారు. మరిన్ని లీలలను ఆ దిశగ నడిపి నా మదిలో తాను కోరుకున్న విధంగా మార్చేవారు. కొన్నిసార్లు దుఃఖకరమైన సంఘటనలు, మరికొన్నిసార్లు ఆనందకర సంఘటనలను సృష్టించి నన్ను తాను అనుకున్న దారిలో అనుకున్న విధంగా నడిపించేవారు. స్వామివారు అనుకున్నది సాధించేవరకు ఈ శిక్షణ కొనసాగేది.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

4వ భాగము

(జూన్ 2002 - మే 2002)

చూడని ఆలయాలను దర్శించుట

నేను చూడని ఆలయాలు కనబడ్డవి. అవి ఏ ఆలయాలు? అందులోని దైవం ఎవరు? అనే విషయం తెలియలేదు. కనుక్కో చూద్దాం నేనెవ్వరినో? అనే ప్రశ్న వేసినట్టనిపించింది. ఈ కల కన్న వెంటనే ఈ మూర్తి నన్ను బాగా ఆకర్షించింది. అత్యంత స్పష్టంగా దగ్గర నుండి చూచాను. కాని వారెవ్వరో కనుక్కోలేకపోయాను. దాదాపు 15 నెలలు వీరి గురించి ఎంతో మందిని అడిగాను. నేను దర్శించిన ఆలయ నమూనాలను వెతికాను. కాని లభించలేదు. చివరికి ఇది కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారి మందిరమని, నేను చూచింది ఈమెనే అని తేది 21-06-2002 నాడు ధృవీకరించుకున్నాను. ఆ లీల ఈ విధంగా ఉంది.



20-03-2001 : లీల : ఈ రాత్రి నేను మామూలుగానే పడుకున్నాను. నాకు ఒక కల వచ్చింది. అందులో నేను ఒక రోడ్డుపైన నడుచుకుంటూ వెళ్ళుచున్నాను. ఆ రోడ్డుకు ఇరు ప్రక్కల గుళ్ళు లాంటి ఆర్చెస్ కలవు. అవి ఈ క్రింద చూపిన ఆకారములో ఎత్తైన వరండాపై ఒకదాని ప్రక్కన మరొకటి ఉన్నవి. ఈ వరండాపై ఒక ముసలాయన కావలిగా పడుకుని ఉన్నాడు. గుళ్ళు పురాతనమైనవి. రంగులు పోతున్నవి. అన్ని ఆర్చెస్ కలవు. నేను ఆ రోడ్డుకు ఇరుప్రక్కల ఉన్న ఈ క్రొత్త రకమైన ఆలయాలను చూచుకుంటూ రోడ్డు చివరిదాకా వెళ్ళాను. చివరికి మళ్ళీ వెనుకకు వచ్చాను. మొదటి ఆర్చి వద్దకు వచ్చాను. ఇప్పుడిది ఒక క్రొత్త రకమైన ఆర్చిలాగా కనబడ్డది. రెండడుగుల ఎత్తైన చతురస్రాకారపు గట్టుపైన దాదాపు 12 అడుగుల ఎత్తైన చతురస్రాకారపు గోడలో ఈ ఆర్చి ద్వారములాగా అమర్చబడ్డది. దానిని పరిశీలించి చూడాలనిపించింది. చతురస్రాకారపు గట్టును ఎక్కి ఆ ఆర్చి ద్వారము గుండా లోనికి ఒక ప్రత్యేకమైన కోణంలో చూచాను. ఆ ఆర్చి నుండి లోపలకు చూచుచుంటే మళ్ళీ క్రొత్తరకమైన చిన్న చిన్న ఆర్చెస్ ఎన్నో కలవు. వాటి నుండి చక్కగ చూచాను. చాలా దూరములో ఒక నల్లని ఆకారములో శంఖు చక్రములతో

ఉన్నట్లు ఉన్న ఒక దేవుణ్ణి దర్శించాను. అంత దూరము ఉన్నా, ఆ దేవుణ్ణి నేను చాలా దగ్గర నుండి అంటే స్వయంగా గర్భగుడిలో ఉండి చూచినట్లు చూచాను. ఈ మూర్తి ఒక ప్రత్యేకమైన ఆకారంగా కనబడ్డది. ఈ మూర్తి వెనకాల చక్కని చక్కునము ఉన్నది. దాదాపు 4 అడుగుల వ్యాసము కలిగి పద్మరేకు ఆకారం ఔట్ లుక్ గల దానిలో ఈ చక్కునము అమర్చబడ్డది. మూర్తిపైన నాగుపాము పడగ చక్కునములోనే అమర్చబడి ఉన్నది. ఈ మూర్తి అత్యంత సుందరంగా కనిపించింది. శంఖు డాలుతో పాటు, మూడవ చేతిలో గద, 4వ చేతిలో ఒక పాత్రను పట్టుకున్నట్లు ఉంది. అత్యంత నల్లగా, అప్పుడే అభిషేకము జరిగినట్లనిపించింది. నేను ఇంతవరకు ఈ రకమైన గుడులను చూడలేదు. అది ఏ గుడి అగునో నేను ఎవ్వరిని చూచానో పోల్చుకోలేదు. ఈ కలలో నేను మొత్తం ఆర్చెస్ ను మరియు గర్భగుడిలో ఉన్న మూర్తిని మాత్రమే చూచాను. కాని గుడి బయటి ఆకారాన్ని కాని, ధ్వజస్తంభాన్ని కాని చూడలేదు. మొత్తం మీద ఈ గుడి తెలుగు సాంప్రదాయపుది కాదని తెలుసుకున్నాను. ఇది కల.

ఈ మూర్తి నన్ను మోహపరవశుణ్ణి చేసింది. చాలా ఆకర్షించింది. ఆ గుడి గురించి, మూర్తి ఎవరన్న దాని గురించి 15 నెలలు నాకు తెలిసిన ఆధ్యాత్మిక వ్యక్తులను అడిగాను. నా దృష్టికి వచ్చిన ఆ ఆకారపు గుడులను ప్రత్యేకించి చూచుట మొదలుపెట్టాను. కొందరు విశాఖపట్నం తీర ప్రాంతంలో అమ్మవారి గుడిని సూచించారు. మరికొందరు బెంగాల్ ప్రాంతములో ఈ రకమైన ఆర్చెస్ తో కూడిన గుడులు ఉన్నవని చెప్పారు. చివరికి తేది 21-06-2002 రోజున నేను కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయమును దర్శించాను. ఒక ప్రత్యేక భంగిమలో చూచినప్పుడు ఇది నేను కలలో చూచిన మాదిరిగ కనబడ్డది. తూర్పువైపున ఉన్న ముఖ్యద్వారము నుండి ఒక ప్రత్యేక కోణంలో చూచినచో అదే విధమైన ఆర్చెస్ మరియు వాటి మధ్యనుండి చూచినప్పుడు నల్లని ఆ అమ్మవారి విగ్రహము యథావిధిగా కనబడింది. అమ్మవారి వెనకాల చక్కునము కూడా అదేవిధంగా ఉంది. అప్పుడు నేను ఆ శ్రీమహాలక్ష్మి అమ్మవారే కనబడ్డారని మురిసిపోయాను.

31-03-2001 : ఈ రోజు ఒక నిజమైన సంఘటన జరిగింది. శ్రీవేంకటేశ్వరుడు కల్పించు లీలలపైన విశ్వాసమును పెంచే విధంగా ఉంది. నేను అల్వాల్ లోని జి.వి.రెడ్డి కాలనీలో ప్లాట్ నెం.50 లో కంటోన్మెంట్ బౌండరీకి ఆనుకొని ఉన్న ప్లాట్ లో రెండు ఇళ్ళ కోసమని కన్స్ట్రక్షన్ మొదలుపెట్టాను. ఫూటింగ్ వర్క్ అయిపోయింది. అప్పుడు కంటోన్మెంట్ అధికారులు ఎలాంటి నోటీస్ లేకుండా మా సైట్ వద్దకు వచ్చి క్రేన్ సహాయముతో నేను వేసిన ఫూటింగ్సును, బేస్మెంటును తీసి వేస్తున్నారు. ఈ విషయమును మా సూపర్వైజర్ ద్వారా తెలుసుకొని, అత్యంత ఆత్రుతతో నా కారులో ఇంటినుండి అల్వాల్ కు వెళ్ళుచున్నాను. స్వామివారిని ప్రార్థిస్తూ ఆత్రుతతో వెళ్ళుచున్నాను.

మా సైటు నుండి ఒక కిలోమీటరు ముందున్న నర్తకి టాకీస్ చౌరస్తా వరకు వెళ్ళాను. నా మనస్సులో ఆందోళన తారాస్థాయికి చేరింది. అప్పుడు ఆ చౌరస్తా వద్ద కట్టెతో చేసి అత్యంత సుందరమైన రంగులు వేసినటువంటి ఒక 15 అడుగులు ఎత్తు కలిగిన శ్రీవేంకటేశ్వరుని రథము నిలిచి ఉండుటను చూచాను. దానిలో కట్టెతో చేసి రంగులు వేసినటువంటి శ్రీవేంకటేశ్వరుడు దాదాపు నాలుగైదు అడుగుల ఎత్తుతో ఆ చౌరస్తా పైన నిలుచుని ఉన్నారు. అది ఏదో ఒక దేవస్థానము వారు స్వామిని ఊరేగిస్తున్నారు అన్న విధంగా ఉన్నది. ఆ నడి బజారులో రథం, అందులో స్వామివారు మాత్రమే ఉన్నారు. రథం త్రిప్పువారు ఒక్కరూ లేరు. స్వామివారు నాకు ఎదురుగా నా కోసమే ఉన్నట్లు కనబడ్డారు. దానిని చూచిన వెంటనే నా లోపల ఆత్రుత తగ్గింది. ''తొందర పడకు, వారు ఏమి చేసుకుంటారో అది వారిని చేయనివ్వు. నీకు మేలే జరుగుతుంది. దానిని వారు ఎంత కోపముతో నిన్ను పని చేయనీయకుండా చేయుచున్నారో అంతకు రెండింతల సహనముతో నిన్ను వారు అనుమతించుదురు. వారు అభ్యంతరము లేదని అందురు'' అని నాలో నాకు భావన కలిగింది. తరువాత నా తొందరను తగ్గించి నెమ్మదిగా వెళ్ళాను. ఇంతలో వారు పని ముగించుకుని వెళ్ళిపోయారు. ఒక అయిదారు నెలల తరువాత క్రొత్త అనుమతి నెం.111 కలిగిన దానితో మళ్ళీ పనులు మొదలు పెట్టాను. వెంటనే కంటోన్మెంట్ యొక్క పెద్ద పెద్ద ఆఫీసర్స్ వచ్చి చూచారు. మరియు 'నీ ఇష్టమున్నట్లు కట్టుకొమ్మ'ని చెప్పి వెళ్ళిపోయారు.

అయితే తరువాత ఆ రథము ఏ దేవాలయంది? ఎక్కడిదని వెతకనారంభించాను. ఉన్న అన్ని దేవాలయములలో వెళ్ళి కనుక్కున్నాను. కాని ఎవ్వరూ కూడా అలాంటి రథము వారివద్ద లేదని, వారు ఊరేగింపు చేయలేదని చెప్పారు. చివరికి ఇది శ్రీవేంకటేశ్వరుని లీల అని, నాకు మాత్రమే కనబడుచు ఇతరులకు కనిపించని ప్రత్యేకమైన లీల అని ఒక రెండు సంవత్సరముల తరువాత గ్రహించాను. మరియు శ్రీవేంకటేశ్వరుడు చూపు లీల యాదృచ్ఛికము కాదని, జరిగి తీరుతుందనే నమ్మకము నాలో బలపడింది.

స్వామిసేవ ఒక ఆట లాగ చిత్రీకరించుట

నేను హైదరాబాద్ లోని దుర్గాబాయి దేశ్ ముఖ్ కాలనీలో నివసిస్తున్నాను. కన్స్ట్రక్షన్ వర్కు మాత్రం అల్వాల్ లో జరుగుతున్నది. ప్రతిరోజు పని దగ్గరికి పోవడం, తిరిగి రావడం తిరుమలగిరి నుండే జరుగును. తిరుమలగిరి మెయిన్ రోడ్డుపైన శ్రీఆంజనేయస్వామి వారి గుడి ఒకటి ఉంది. నేను అప్పటికే ఈ సృష్టిలోని ప్రతి మూర్తి శ్రీవేంకటేశ్వరుని అంశ మాత్రమే అని దృఢంగా నమ్మేవాణ్ణి. మరియు ఆయా మూర్తులలోని శ్రీవేంకటేశ్వరుని అంశకే నమస్కరించే అలవాటు చేసుకున్నాను. సం॥ 2000 లో అల్వాల్ లోని కన్స్ట్రక్షన్ లో జరిగిన గొడవల నుండి గట్టెక్కించే ప్రయత్నంలో, అత్యంత అందుబాటులో ఉంది కావున ఇక్కడి శ్రీ ఆంజనేయస్వామి వారిని మరియు వెనుక ఉన్న శివుణ్ణి నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని రూపంగా భావించి ప్రతిరోజు ప్రార్థించేవాడిని. నా సమస్యలు తీర్చుమని దీనాతి దీనంగా ప్రార్థించేవాడిని. చాలా సందర్భాలలో నా హృదయం నుండి భక్తి భావం ఉప్పొంగి రోమాంచితుడనై కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలుచుండ ప్రార్థించేవాడిని.

19 ఏప్రిల్ 2001 : కల: ఈరోజు ఒక స్వప్నము కలిగింది. ఇది హైదరాబాదులోని తిరుమలగిరిలో రోడ్డు ప్రక్కన ఉన్న ఆంజనేయస్వామివారి గుడి. గుడి కాంపౌండు వాల్ పైన ఒక పెద్ద కోతి, రెండు చిన్న కోతులు ఖాకీరంగు నెక్కరు వేసుకుని తెల్లరంగు అంగీలు ధరించి ఆడుకొంటున్నాయి. కాంపౌండు గోడపై అటు ఇటు దుంకుచు చాలా ఆనందంగా ఆడుకుంటున్నాయి. నేను వాటి ముందు ఉన్న రోడ్డు పైనుండి అల్వాల్ వైపు పోవుటను చూచి, ''రా... ఆడుకుందాము రా...'' అని సైగ చేస్తున్నవి (అంటే పిలుస్తున్నవి). నేను మాత్రం వాటిని వాటి ఆనందమును చూస్తూ నిలుచున్నాను. అవి నన్ను రా.. రమ్మంటు పిలుస్తున్నవి. ఇంతే కల.

కాని ఆ రోజు ఈ కల అర్థం నాకు తెలియలేదు. ఈ కోతులు అత్యంత నేర్పరితనం కలిగినవి. చొక్కాలు ధరించినవి. సర్కస్ వారి కోతుల లాగా ఉన్నవని భావించాను. కాని నన్నెందుకు ఆడుకుందాం రా... అంటూ పిలుస్తున్నవో అర్థం కాలేదు.

నా జీవితములో స్వామివారి సేవ ఒక ఆటలాగా జరిగింది. బహుశా దీనికి చిహ్నంగా ఈ లీలను చూపారనుకుంటున్నాను.

శ్రీవేంకటేశ్వరుడు నాకు ఆసక్తిగల వ్యాపారము మొదలగు అంశాలలో తలెత్తిన సమస్యలను తీర్చు క్రమములోఎంతో ఆప్తుడైనాడు. క్షణము ఆయన నామస్మరణను వదిలి ఉండలేని స్థితి కలిగింది. శ్రీవేంకటేశ్వరుని పైన అమితమైన భక్తి పెరిగింది. స్వామివారికి ఎలాంటి అపకారము చేయుటను కాని లేదా చిన్నతనం చేసి మాట్లాడుటను కాని సహించలేని స్థితి కలిగింది. ఇలాంటి ఘటన ఒకటి జరిగింది.

మా ఊరిలో అందరు శైవ సాంప్రదాయాన్ని పాటించేవారే. ఒకే ఒక కుటుంబం రమణయ్య పంతులు అనేవారు మాత్రం చ్చాత్తాద శ్రీవైష్ణవులు ఉండేవారు. నేను హైదరాబాదులో నివసించుచున్నప్పటికీ పండుగలకు ఇతర సందర్భాలలో ఊరికి వెళ్ళేవాడిని. ఇలా ఒకరోజు ఊరికి వెళ్ళాను.

శ్రీవేంకటేశ్వరుడే శివుడని సూచించుట

ఇది నాకు అద్భుతమైన రోజు. మరువలేని రోజు. నాకు ఆ శ్రీవేంకటేశ్వరుని పైన అమితమైన ప్రేమ ఏర్పడింది. ఎవ్వరికీ ఏ ఆపద కలిగినను ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి పూజించినచో అన్నీ నెరవేరునని నా ప్రగాఢ విశ్వాసము. నేను ఒకరోజు మా స్వగ్రామమైన చిన్నగుండవెల్లికి పోయాను. అక్కడ ఆ రోజు రాత్రి దాదాపు 8.30 ప్రాంతమున నా మిత్రుడైన శ్రీ శేఖరం దుకాణంలో ఆయనతో మాటలాడుచు కూర్చున్నాను. ఇంతలో నలుగురైదురు మా ఊరివారు వచ్చి మాతో మాట్లాడుచున్నారు. అందులో ఒకరు తనకు గత రెండు సంవత్సరముల నుండి చాలా కష్టంగానున్నదని ఎంత ప్రయత్నించినా ఏ పనులు కావటం లేదని చెప్పారు. వెంటనే నేను ''నీవు ఆ శ్రీవేంకటేశ్వరుని వేడుకో. నీకు అన్ని పనులు చక్కగా అవుతాయి'' అని అప్రయత్నంగా చెప్పాను. ఇంతలో శేఖరం (శివభక్తుడు) ఇలా అన్నాడు. ''హా! వేంకటేశ్వరుణ్ణే పూజించాలా? శివుణ్ణి పూజించితే కాదా? నీవిలా చెప్పద్దు. ఎవరికి ఎవరు ఇష్టమైతే వారినే పూజిస్తారు'' అని ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి కించపరిచే విధంగా మాట్లాడాడు. ''నీకిష్టమైతే నీవు ఆయనకు పూజ చెయ్యి. కాని ఇతరులకు చెప్పకు''మని కఠినంగా, కించపరుచుటకు ఉపయోగించే స్వరముతో మాట్లాడాడు. దీనితో నా మనస్సు చాలా బాధపడింది. అసలు ఎవ్వరిని పూజించాలి అనే సందేహం కలిగింది. శివుడు గొప్పవాడా? లేదా శ్రీవేంకటేశ్వరుడు గొప్పవాడా? అనే సందేహం కలిగింది.

ఈ విధంగా స్వామివారిని కించపరిచి మాట్లాడేసరికి చాలా బాధపడ్డాను. నా గుండెలో గునపముతో గుచ్చినట్లు, గుచ్చిన గునపమును మళ్ళీ మళ్ళీ పెకిలించునట్లుగ బాధ కలిగింది. నా సందేహమును తీర్చుమని ఆ దేవుణ్ణి మరి మరి వేడుకున్నాను. మనస్సులో ధ్యానించాను. దాదాపు 15 రోజులు ఈ బాధ అనుభవించిన తరువాత ఈ కల వచ్చింది. దీనితో నా సందేహం తీరిపోయింది. గుండెలోని బాధ తగ్గింది.

22-11-2001 : కల : ఇందులో నేను ఒక నేచురల్ గ్రానైట్ స్టోన్ రంగులో మధ్యసైజులో ఉన్న శివలింగమును చూచాను. అది భూమిపై కాకుండా మధ్యన గాలిలో నిలిచి ఉన్నది. దాదాపు నా భుజాల ఎత్తులో, నా నుండి మూడు అడుగుల దూరంలో ఉన్నది. నేను అత్యంత స్పష్టంగా చూడగలిగే విధంగా ఉన్నది. ఇది నలుపు కాదు, తెలుపు కాదు. నేచురల్ గ్రానైట్ రంగులో చుక్క చుక్కలుగ ఉన్నది. అభిషేకం తరువాత ఏవిధంగా ఆ నీటి తడిలో మెరుస్తూ ఉంటుందో ఆ విధంగా మెరుస్తూ కనబడ్డది. కొంతసేపు స్పష్టంగా ఆ లింగమును చూచిన తరువాత కల చెదిరింది. కల జరుగుతున్న కాలము ''నేనే శివుడిని నీవు పూజించు'' అనే భావము నా మనస్సున ప్రవేశించింది. ఇలా ఈ కల వచ్చినప్పటి నుండి నాకు ఆ శ్రీవేంకటేశ్వరుడే శివుడు అనే జ్ఞానోదయం స్పష్టంగా కలిగింది. అప్పటినుంచి నేను ఏ శివాలయమునకు పోయినా ''ఓం నమో శివరూపాయ శ్రీవేంకటేశ్వరాయ నమో నమః'' అని కొలిచినచో నాకు అమితమైన ఆనందము కలుగుచుండేది. కనుల వెంట ఆనంద బాష్పములు రాలుచుండేవి. అప్పటినుండి శివుణ్ణి నా ప్రభువు శ్రీవేంకటేశ్వరుని ద్వితీయ రూపంగా భావించాను.

శ్రీవేంకటేశ్వరునితో మంచి బంధం ఏర్పడింది. నా మనస్సులోని ప్రతి భావమును ఆయనకు చెప్పేవాడిని. ఆయన కూడ తగిన విధంగా జవాబిచ్చేవాడు. స్వామివారితో ఒక ఆత్మీయబంధం ఏర్పడింది. ఉదా : ఒక మారుమూల ప్రాంతం నుండి హైదరాబాద్ లాంటి నగరమునకు విద్యాభ్యాస నిమిత్తమని వేరు వేరు ప్రాంతముల నుండి వచ్చిన ఇద్దరు విద్యార్థులు ఒక చిన్న 10 X 10 సైజుగల గదిలో స్వయంపాకం చేసుకుంటూ ఒక సంవత్సరం కాలం గడిపిన తరువాత వారి మధ్యన ఎటువంటి దాపరికం లేని స్నేహబంధం ఉంటుందో అంతటి బంధం మా మధ్యన ఉన్నదనిపించింది.



స్వామివారు సమాశ్రయణం చేయుట

నాకు ప్రతిరోజు ఆ స్వామిని చూడాలని కోరిక అమితంగా ఉండేది. ముఖ్యంగా ఆ స్వామివారి పాదాలను చూడాలనే కోరిక బలంగా ఉండేది. నా కోరిక తీర్చుమని స్వామివారిని రకరకాలుగా ప్రార్థించాను. అంతే! అద్భుతం జరిగింది. ఆ రోజు రాత్రి నిండా దుప్పటి కప్పుకొని నిద్రపోయాను. నా జీవితంలో మరపురానిది, జీవితం పావనమయ్యేది, నేను ఊహించని ఘటన జరిగింది.

02-12-2001 : అనుభూతి : ఇది కల కాదు నిజమైన అనుభూతి. నేను నిండా కప్పుకొని స్వామివారిని స్మరిస్తూ పడుకున్నాను. ఇంతలో ఒక అత్యంత నల్లని భూతం ఒకటి నా గదిలోనికి ప్రవేశించినట్లనిపించింది. మరో క్షణంలో స్వామివారి రెండు పాదములు నా హృదయం పైన ఉన్నటుల అనుభూతి పొందాను. కొంచెం బరువుగా కూడా అనిపించింది. ఆయన నల్లని రెండు పాదములు ఆ పాదముల పైన స్వామివారు కట్టుకున్న బంగారు పీతాంబరము యొక్క అంచు మెరుస్తూ కనపడింది. ఉలిక్కిపడ్డాను. వెంటనే స్వామివారు తన పాదములు కింద పెట్టారు. మళ్ళీ నా ప్రక్కన (మంచము ప్రక్కన) బంగారు పీతాంబరంతో ఆయన నల్లని కాళ్ళు ఉన్నట్లు అనుభూతి కలిగింది. ఎవ్వరో ఒక వ్యక్తి నా ప్రక్కన ఉన్నట్లు, ఆయన నల్లని పాదములు కలిగి ధగధగ మెరిసే పీతాంబరమును అనగా మంచి అంచు ఉన్న ధోవతిని ధరించి ఉన్నట్లు అనిపించింది. నేను ఆయన నల్లని పాదములను, దానిపైన స్వామివారి ధోవతి అంచును స్పష్టంగా చూచాను. ఒక్కమారు ఉలిక్కిపడి లేచి నా కుడి ప్రక్క చూచాను. కాని ఏమీ

లేదు. అది అంతా ఆ దేవుని లీలనే! ఈ భక్తుని కోరికను తీర్చాలని జగన్నాథుని దయ అని తలచాను. ఒకరకంగా శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా నాకు సమాశ్రయణం కావించారు. ఆ స్వామిని మనసారా ధ్యానించి కృతజ్ఞతలను తెలుపుకున్నాను.

ఈ సంఘటన తరువాత నాలో చాలా మార్పు వచ్చింది. ఈ సృష్టికి మూలం శ్రీవేంకటేశ్వరుడేనని, ఈ సృష్టిలోని సమస్త దేవీ దేవతలను, వారి వారి ఉనికిని కోల్పోయే విధంగా ఈయనలో ఇముడ్చుకున్నాడని, ఈయన ఒక్కరిని స్మరిస్తే సమస్త దేవగణమును స్మరించినట్లేనని అనిపించింది. ఈ సృష్టిలో జరుగు ప్రతి కార్యమునకు కర్త కర్మ క్రియ ఈయనే అనే భావము కలిగింది. ఆ సమయమున నేను ఎవ్వరిని చూచినా వారు శ్రీవేంకటేశ్వరుని అంశగానే భావించేవాణ్ణి. ప్రతి ఒక్కరు మూడు నామాలు పెట్టుకున్నట్లు కనబడేది. ఈ సృష్టి మొత్తంలో స్వామివారు రకరకాల రూపులతో నిండి ఉన్నాడని భావించాను. అలాంటి బలమైన భావం నాలో ఏర్పడింది.

శ్రీ పశుపతినాథ్ ఆలయాన్ని దర్శించుట

జనవరి 2002 : ఈ రోజు మరో కల గన్నాను. అందులో నేను నేపాల్ వెళ్ళినానట. అక్కడ ఒక పచ్చని అక్కడక్కడ చెట్లతో కూడిన మైదానమును చూచాను. దాని కుడి ప్రక్కన ఒక పురాతనమైన భవనము ఉన్నది. కొంతవరకు అర్ధచంద్రాకారంగా (సెమీ సర్కిల్) పెద్ద పెద్ద రౌండు స్తంభాలతో ఉన్నది. మొదటి అంతస్తులో చిన్న చూరు (Sunshade) ఉన్నది. గోడలకు మరియు స్తంభాలకు క్రిందినుండి మూడున్నర అడుగుల వరకు ఎరుపురంగు (జాజు), ఆ పైన తెలుపురంగు, కొంత పాలపిట్ట రంగు వేశారు. పై అంతస్తు కూడా కలదు. నేను ఈ భవనమును అత్యంత ఆసక్తిగా చూస్తున్నాను. ఇంతలో అశరీరవాణి మాటలు వినబడ్డవి. ''అదే నేపాల్ పశుపతినాథ్ మందిరమని'' ఎవ్వరో వెనకనుండి చెప్పారు. మేము దాదాపు 30-40 మందిమి అక్కడి పచ్చని మైదానము నుండి చూస్తున్నాము. మాకు ఎదురుగా చాలా దూరములో ఒక బంగళా ఉన్నదట. అదే నేపాల్ రాజు యొక్క నివాసమని వెనుక నుండి నాకు ఎవ్వరో చెప్పారు. ఆ కలలో నాకు శ్రీపశుపతినాథుని దర్శించుకోవాలని అనిపించింది. కల చెదిరింది.

ఈ విధంగా నేను ఏనాడూ చూడని మరో ఆలయం అది కూడా అత్యంత మహిమాన్వితమైన శ్రీ పశుపతినాథుని ఆలయం, దాని పరిసరాలు కనబడ్డవి. (మే 2002 లో మేము నేపాల్ దర్శించినప్పుడు ఈ ఆనవాళ్ళు కొన్ని యథావిధిగా ఉన్నాయి).

కే.శే. వాడ్రేవు గవర్రాజు గారితో పరిచయం

శ్రీవేంకటేశ్వరుని గురించి మరిన్ని విషయాలు తెలుసుకోవాలనే కోరిక కలిగింది. కాని స్వామి గురించిన విషయాలను తెలిపే వ్యక్తులు నాకు కనబడలేదు. నేను హైదరాబాదులోని శివం రోడ్డుకు తరచుగా వెళ్ళేవాణ్ణి. అలా వెళ్ళే క్రమంలో తిలక్ నగర్ చౌరస్తా వద్ద ''శ్రీవేంకటేశ్వర భక్తి ప్రచార పీఠం'' అనే బోర్డును చూచాను.

తెలుసుకుందామనే కుతూహలంతో ఆఫీసులోకి వెళ్ళాను. అక్కడ ఆఫీస్ మేనేజరుగా 'శ్రీ పాండు రంగారావు' అనే సిద్ధిపేట వ్యక్తి ఉండుట వలన పరిచయం సులభమయ్యింది. చివరికి ఆ సంస్థ యజమాని 70 సంవత్సరాలు వయస్సు కలిగిన కే.శే వాడ్రేవు గవర్రాజు స్వామివారితో పరిచయమేర్పడింది. నిజానికి వీరు రాజమండ్రి దగ్గరున్న కొవ్వూరు వాస్తవ్యులు. ఈ మధ్యనే హైదరాబాద్ వచ్చారు. గత 20 సంవత్సరాల నుండి శ్రీవేంకటేశ్వరుని భక్తిని ప్రచారము చేయుచు జీవనోపాధి సాగిస్తున్నారు. భక్తులకు వారి కష్టాలను తెలుసుకొని ''ఐశ్వర్య మహామంత్రం'' అనే ఒక మంత్రమును వ్రాయిస్తూ, కొన్ని పూజలు, ప్రసంగాలు చేయుచు, వారు ఇచ్చే సంభావనతో జీవిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరుడంటే అత్యంత ఆసక్తి ఉన్నవాణ్ణి కాబట్టి ఆయన చేసే పూజలు, ప్రసంగాలకు వెళ్ళేవాణ్ణి. చివరికి ఆయనతో మంచి బంధం ఏర్పడింది. వారు ప్రతి పూజలోను విష్ణుసహస్రనామం చదువుచు, ప్రతి చరణానికి మధ్యమధ్యన మూడుసార్లు ఐశ్వర్య మహామంత్రమును అనుసంధానిస్తూ, స్వామివారికి భక్తులందరి చేత తులసి, పత్రి మరియు పుష్పములు ఒకరి చేతుల నుండి మరొకరికి అందిస్తూ, చివరికి స్వామివారికి సమర్పించేవారు.

నేను గతంలో శ్రీవిష్ణు సహస్ర నామమును ఎప్పుడు మనసు పెట్టి వినలేదు. దీనిలో నా స్వామి శ్రీవేంకటేశ్వరుణ్ణి రకరకాల వర్ణనలతో కీర్తించుచు ఆరాధించుట నాకు ఎంతో నచ్చింది. పరవశించిపోయేవాడిని. కాని మధ్య మధ్యన ఐశ్వర్య మహామంత్రమును పఠించుట నచ్చేది కాదు. దీనికి బదులు స్వామివారి అష్టాక్షరీ మంత్రమును పఠించినచో బాగుండునని భావించేవాడిని.

వారు చెప్పే ఐశ్వర్య మహామంత్రం :

ఓం... శ్రీవత్స వక్షసం శ్రీశం, శ్రీలోలం శ్రీకర గ్రహమ్ ।
శ్రీమంతం శ్రీనిధిం శ్రీద్యం శ్రీనివాసం భజేనిశమ్ ॥

ఈ మంత్రములో 8 శ్రీలు ఉన్నందున, దీనిని పఠించిన వారికి అష్టైశ్వర్యములు సిద్ధించునని చెప్పేవారు. శ్రీమాన్ గవర్రాజు గారి భక్తిబోధన మొత్తం కూడా ఈ మంత్రం చుట్టే తిరిగేది. భక్తులు భగవంతుణ్ణి కష్టాలలో మాత్రమే ప్రార్థిస్తారని భావించి ఈ మంత్రమునే బోధించేవారు. జపాన్ని కూడా ఇదే మంత్రమును వ్రాయించేవారు. ఒక్కొక్కప్పుడు ''ఓం శ్రీం వేంకటేశాయ నమః'' అనే మంత్రమును కూడా వ్రాయించేవారు.

వీరు గత 20 సంవత్సరముల నుండి ఈ పీఠమును నడుపుతున్నారు. భక్తులను బృందాలుగా తిరుపతికి తీసుకెళ్ళి, కొన్నిసార్లు వృక్షాలను నాటించుట, కొన్నిసార్లు మెట్లపై శిలాఫలకాలు పెట్టించుట, మరికొన్నిసార్లు ఈ వ్రాయించిన జపాన్ని టిటిడి డైరీఫాంలో జపహోమాదులు చేసి నిక్షిప్తం కూడా చేశారట.

నాకు శ్రీ గవర్రాజు గారిలో అన్నీ నచ్చాయి. కాని ఐశ్వర్యాల కోసం మాత్రమే శ్రీవేంకటేశ్వరుని పూజించుట నచ్చలేదు. ప్రతిభక్తుడు స్వామిని పొందాలనే భావంతో పూజించాలనే భావం నాకుండేది. మొత్తం మీద వీరి బోధన ద్వారా కొంత, పుస్తకములు చదువుట ద్వారా మరికొంత, అన్నిటికంటె ముఖ్యంగా నిరంతరం స్వామిని ధ్యానించుట ద్వారా శ్రీవేంకటేశ్వరుని తత్త్వము కొంత కొంత బోధపడసాగింది.

నా అల్వాల్ సమస్య ఇంతవరకు సమసిపోలేదు. ఒకానొక సందర్భంలో నా సమస్యను కే.శే. గవర్రాజు గారికి చెప్పాను. ఆయన చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళి అర్చన చేయించమని చెప్పారు. ఆ విధంగా చేసినచో నాకున్న సమస్యలు తొలగిపోవునని కూడా చెప్పారు. వారి మాట ప్రకారం 17-02-2002 నాడు ఉదయం 6 గంటలకు అర్చన చేయించాను. స్వామివారిని మరీ మరీ వేడుకున్నాను. ''నాకు మీరు తప్ప మరెవ్వరూ

లేరని'' తలంచి మరీ మరీ ఏడ్చాను. నా కనుల వెంట నీళ్ళు పట పట రాలినవి. ఆరోజు రాత్రి ఒక కల వచ్చింది.

18-02-2002 : కల : అందులో నేను చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి గుడి ద్వారము ద్వారా లోనికి పోవుచున్నాను. గడప దాటి లోపలికి పోవుచున్నాను. అంటే ఒక కాలు గడప బయట మరో కాలు గడప లోన ఉండి నేను లోనికి పోవుచున్నాను. అప్పుడు గుడి లోపల అంటే నానుండి దాదాపు 20 అడుగుల దూరములో ఒకాయన నల్లగా సుమారు ఆరడుగుల ఎత్తుతో ఉండి తెల్లని లుంగీ అడ్డముగా మడుచుకుని కాకీరంగు చొక్కా తొడుకుకొని తెల్లని రుమాలుతో నాకు ఎదురుగా వస్తున్నాడు. ఆయన నన్ను చూచి ఈ విధముగా అన్నారు. ''ఆ ఇద్దరు మరియు ఈయన సామాన్యులు కాదు. వీరు శ్రీవేంకటేశ్వర స్వరూపులు'' అని అన్నారు. అంటే ఆయన మాటలను బట్టి నా వెనుక ఇంకా ఇద్దరు ఉన్నారట. (వస్తున్నారో లేక పోవుతున్నారో తెలియదు) కాని నేను ఆ గుడి ధ్వజస్తంభమును, గడపను, మెయిన్ డోర్ ను, గుడిలోని ప్రాంగణమును స్పష్టంగా కలలో చూచాను.

బహుశా దీనర్థం నేను శ్రీవేంకటేశ్వరుని అధీనము లోనికి పోవుతున్నానని కావచ్చు.

స్వామిపట్ల విరహ వేదనను అనుభవించుట

రోజు రోజు నేను ఏ విధంగా ఉంటున్నానో నాకే తెలియదు. ప్రతిరోజు నాకు ఆ స్వామివారిని చూడాలనే కోరిక మితి మీరుతున్నది. ఈ కోరికను ఎలా చెప్పాలో తెలియడం లేదు. యవ్వనంలో ఉన్న ప్రేమికులు ఏ విధంగా ఒకరినొకరు విడిచి ఉండలేరో లేదా ఒకవేళ వారు వేరు ప్రదేశములో ఉన్నప్పుడు వారికి అనుక్షణము ఒకరికొకరు ఏవిధంగా గుర్తుకు వస్తారో, ఒకరినొకరు చూచుకోవాలని తపించి పోవుదురో అదేవిధంగా నేను నా స్వామిని మరియు నా స్వామియే అయిన ఆ పరమశివుణ్ణి చూడాలని తపించి పోయాను. నిద్ర పట్టుట లేదు. రాత్రి మెలకువ వస్తున్నది. ప్రతి క్షణము అనుక్షణము వారే కనబడుతున్నారు. వారిని చూడకుండా ఉండలేనని ఏడుస్తున్నాను, పొర్లుతున్నాను. ఈవిధంగా చాలా రోజులు గడిచాయి. ఒకరోజు ఇదేవిధంగా జరిగిన పిదప కల గన్నాను.

16-03-2002 : కల : ఇందులో కూర్చుని ధ్యానములో నున్న పరమశివుణ్ణి, మరో సన్నివేశములో ఏదో ఒక గుడిలో అర్చావతారములో ఉన్న నా స్వామిని చూచాను. ఇంతే కల. అప్పుడు కాని నా మనస్సు శాంతించి నిద్రపోయాను. ఈ పరిస్థితి నాలో చాలా రోజులు ఉంది. ప్రతిరోజు స్వామివారికై తపించిపోయేవాడిని. పిచ్చివాడిగా మారిపోయాను. స్వామివారిపై విపరీతమైన ఆకర్షణ కలిగింది. ఆయన లేని జీవితము వృథా అనే స్థితికి చేరాను.

22-03-2002 : ఈరోజు రాత్రి ఒక విచిత్రమైన కల వచ్చింది. స్వామివారిని చూడాలనే తపన నాలో చాలా ముదిరింది. ప్రతిక్షణము ఆయన గురించిన ఆలోచనే కలుగుతున్నది. ఆయన రూపము నా మనస్సులో అనుక్షణము మెదులుతున్నది. ఈ రాత్రి నిద్రలో స్వామిని చూచిన అనుభూతి కలిగింది. ఒక గుడిలోని స్వామి ముందు నిలబడి వారిని చూచినట్లనిపించింది. దాని తరువాత మా అమ్మ అనగా నా తల్లి (శ్రీమతి రుక్మమ్మ) చివరి దశలో ఉన్నట్లు, ఆమెకు మాటలు రాక, స్పృహలేక తన జీవితపు చివరి దశలో ఉన్నట్లు కల వచ్చింది. నా కోసం నిరీక్షించుచున్నట్లు అనిపించింది. తెల్లవారగనే లేచి మా తల్లిని మనసారా తలచుకొని ఆ స్వామివారిని, నా తల్లిని సరిగా చూడమని వేడుకున్నాను. స్వామీ! నా తండ్రి చాలా రోజుల క్రింద చనిపోయాడు. మా అమ్మ మాత్రము ఉన్నది. ఆమె ఆరోగ్యము బాగాలేదు. ఆమెను నా నుండి దూరము చేయకండి స్వామీ అని మరి మరీ వేడుకున్నాను. అప్పుడు మా అమ్మ రామంతపూర్ లోని మా చెల్లెలు ఇంట్లో ఉంటున్నందున, సాయంత్రము 7 ప్రాంతమున పోయి చూడవలెనని తలంచి, మామూలుగనే నా ఇతర పనులలో నిమగ్నమైయుంటిని. చివరికి సాయంత్రం మా చెల్లెలు ఇంటికి వెళ్ళాను. అప్పుడు ఆ దృశ్యమును చూచి షాక్ తిన్నాను.

మా తండ్రి చనిపోయినప్పటినుండి, మా అమ్మకు తలలో మంట ఉంటుండెను. దానికామె దాదాపు గత 10 సంవత్సరాల నుండి మందులు వాడుతున్నది. ఈ మంట ఎక్కువగా ఉన్నప్పుడు, మత్తు వచ్చి నిద్రవచ్చే ఉద్దేశముతో డాక్టర్ గారు ఒక రకమైన టాబ్లెట్స్ వ్రాసి ఇచ్చి, నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు ఒక టాబ్లెట్ వేసుకొమ్మని చెప్పాను. అయితే ఈరోజు మా అమ్మ ఆ నొప్పి తొందరగా తగ్గుతుందనే ఉద్దేశ్యముతో ఎవ్వరూ చూడకుండా దాదాపు 12-13 టాబ్లెట్స్ ఒకేసారి వేసుకుంది. ఒక ఇరవై ముప్పై నిమిషాల తరువాత బాత్ రూమ్ కి వెళ్ళి అందులో పడిపోయింది. కాళ్ళు చేతులు చల్లబడ్డాయి. నోట మాట లేదు. చలనం లేదు. స్పృహలేని స్థితిలో పడిపోయింది. దీనిని గమనించిన మా చెల్లెలు కొందరి సహాయముతో బయటకు తెచ్చి పడుకోబెట్టింది. వారికి అమ్మ టాబ్లెట్స్ మింగిన సంగతి తెలియదు. చాలా కంగారు పడ్డారు. బిపి మొత్తం తగ్గింది. మాట లేదు. స్పృహ లేదు. చివరికి ఒకరి సలహా మేరకు జావ, గంజి నోటిలో బలవంతాన పోశారట. ఈ విధంగా చివరికి 4-5 గంటల మధ్యన కొంత స్పృహ వచ్చి ఆ టాబ్లెట్స్ వేసుకున్న విషయాన్ని మెల్లగా చెప్పింది.

నేను సాయంత్రం వెళ్ళేసరికి, సరిగా మాటలు లేక సరియైన స్పృహ లేక వంకర తిరిగిన నోటితో పడివుంది. కాళ్ళు చేతులు నిర్రతొక్కబడి ఉంది. సరిగ్గా శ్రీవేంకటేశ్వరుడు కలలో చూపిన భంగిమలో ఉంది. నా కోసం నిరీక్షిస్తున్నట్లు అనిపించింది. దానిని చూచి నా స్వామిని మనసారా వేడుకున్నాను. మా అమ్మ నా గురించి వేచి చూస్తున్నది. చివరి రోజు అని అనుకుంటున్నట్లున్నది. చివరికి విషయము తెలుసుకొని స్వామిని ధ్యానించి, అరటిపండు తినిపించి కొబ్బరినీరు త్రాగించి పడుకోబెట్టాను. తెల్లవారి వెళ్ళేసరికి కొంతవరకు తేరుకుంది. ఇంకొక్క రోజు గడిచేసరికి పూర్తిగా కోలుకుంది. ఈ సహాయానికి నా స్వామివారికి కోటి కోటి ధన్యవాదాలను తెలుపుకున్నాను. స్వామివారిపైన, ఆయన లీలలపైన నమ్మకం మరింత పెరిగింది.

ఈ సంఘటన తరువాత స్వామి లీలలను పునః పరిశీలించుకున్నాను. ఆయన కలలో చూపిన విధానాన్ని నిజజీవితములో జరిగే విధానాన్ని పరిశీలించుకున్నాను. మా అమ్మకు అస్వస్థత ఉన్నదన్న విషయం రాత్రి కలలో చెప్పారు. కాని పనివల్ల ప్రొద్దున పోలేక సాయంత్రం పోయాను. నేను మా చెల్లెలు ఇంటికి సాయంత్రం పోయినప్పుడు మా అమ్మ పరిస్థితి, స్వామివారు కలలో చూపిన విధంగానే ఉన్నది. మా అమ్మకు మధ్యాహ్నం 12 నుండి అస్వస్థత ప్రారంభమైంది. అదే నేను ఉదయం వచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు కదా! నేనెందుకు రాలేకపోయాను? మా అమ్మ కంటే పని ముఖ్యమా? ఎందుకు మరచాను? ఇలా ఎన్నో రకాలుగా నాది నేను చర్చించుకున్నాను. చివరికి స్వామివారు కలలో చూపిన ప్రతీదీ నిజంగా జరిగి తీరుతుందనే దృఢమైన అభిప్రాయానికి మరోమారు వచ్చాను.

శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను అత్యంత సాధారణ జీవితమును గడపమన్నారు. అత్యంత సాధరణంగా, సంఘంలో చిన్నవానిగా జీవించాలనే భావము ఏర్పడసాగింది. మొదటి నుండి కూడా నాకు ఏకాంత జీవితం ఇష్టమున్నప్పటికీ ఈ మధ్యన ఈ భావన మరింత పెరిగింది. స్వామివారి భక్తులతో మాట్లాడుటలో ఎంతో ఆనందం పొందేవాణ్ణి. లౌకిక విషయాల పట్ల ఆసక్తి బాగా తగ్గింది. స్వామివారిని తృప్తి పరచుటే లక్ష్యంగా జీవించాలనుకున్నాను.

ఈ మధ్యన నా భార్య సురేఖ ఇష్టపడి ఒక డైమండ్ రింగ్ చేయించుకుంది. మూడు నాలుగు రోజులు మాత్రమే పెట్టుకుంది.

26-04-2002 : కుటుంబ సమేతంగా సరదాగా డార్జిలింగ్ వెళ్ళాము. అక్కడి నుండి నేపాల్ వెళ్ళాలని భావించాము. డార్జిలింగ్ లో నాలుగు రోజులు ఉన్నాము. ఈ నాలుగు రోజులలో రెండు కలలు కన్నాను.

కల : ఈ రాత్రి కలలో, నాకు తెలిసిన హైదరాబాదులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పూజారి శ్రీమాన్ రామానుజాచారి పంతులు గారు, చిన్నగుండవెల్లిలోని మా ఇంటిలోని భవంతిలో కూర్చుని ఉన్నారు. ఆయన 3 రోజులు మా ఊరి ఆంజనేయస్వామివారి ఆలయంలో పూజ చేయుటకై నన్ను అడిగి మా ఇంటిలో ఒంటరిగా ఉంటున్నాడట. ఆయన ఇంటిలో కుర్చీలో తిరునామం ధరించి కూర్చుని ఉన్నారు. ఆయన ప్రక్కన నా ఊరి మిత్రుడు శేఖరం ఉన్నట్లు ఊహ. ఇంతలో వీరు షిరిడీ సాయిబాబా లాంటి తెల్లని పెద్ద జుట్టు ఉన్న విగ్రహమును శేఖరమునకు ఇచ్చి, దీనిని సాయిరెడ్డికి ఇవ్వమని చెప్పారు. ఇది కల.

దీని సరైన అర్థమును తెలుసుకోలేకపోయాను.

శ్రీవేంకటేశ్వరుని చూడకుండా ఉండలేని స్థితి

ఇది కూడా డార్జిలింగ్ లో ఉన్నప్పుడు వచ్చిందే.

28-04-2002 : కల : నేను మరియు నాతో పాటు మా ఊరివారు, మరికొందరు కలిసి ఒక శ్రీవేంకటేశ్వర ఆలయం లోనికి ఆయన దర్శనార్థం వెళ్ళాము. ఒక పెద్ద హాలు లోపల నుండి వెళ్ళాము. నేను దర్శనము క్యూలో వెళ్ళేసరికి దర్శన సమయం అయిపోయింది. తలుపులు వేశారు. ఆ తలుపుపై శ్రీకృష్ణుడు భగవద్గీ బోధన చిత్రపటముంది. (ఆ తలుపు దేవాలయపు తలుపు లాగా కాకుండా ఒక ఆఫీసు తలుపులాగా ఉంది) ఇంకా కొంత సమయం తరువాత తలుపులు తీస్తారట. నేను ఆ శ్రీవేంకటేశ్వరుని దర్శనము లేనిదే ఇక్కడి నుండి వెళ్ళలేనని తలంచి ఒక చోట కూర్చుండుకుంటు ''శ్రీవేంకటేశ్వరా'' అని గట్టిగా అరుస్తున్నాను. స్వామివారి దర్శనము లేనిదే వెళ్ళనని కరుణించమని స్వామివారిని ప్రార్థిస్తూ గట్టిగా అరుస్తున్నాను. నా ప్రక్కన మా ఊరివారు ఉన్నారు. ఇది

కల. అంటే స్వామివారితో బంధం గట్టిగా ఏర్పడిందని, స్వామిని విడిచి ఉండలేని స్థితి కలిగిందని అర్థం. పైగా స్వామిని నేను మాత్రమే కాకుండా నా తోటి వ్యక్తులకు కూడా ఆయన అనుగ్రహము లభించాలనే కాంక్ష నాలో ఏర్పడిందని సూచించాడు.

డార్జిలింగ్ చూచిన పిదప అక్కడినుండి నేపాల్ కు బస్సులో వెళ్ళాము. నేపాల్ లో ఉదయం చేరే విధంగా డార్జిలింగులో రాత్రి బస్సు ఎక్కి ప్రయాణించాము. బస్సులో రాత్రి బాగా నిద్రపోయాము. తెల తెలవారుతుందనగా మెలకువ వచ్చింది. ఇక్కడ స్వామివారు ఒక చిత్రాన్ని చూపారు. మేము నిద్ర నుండి లేచి చూచేసరికి ఒకప్రక్క పెద్ద పెద్ద కొండలు, మరోప్రక్క పెద్ద పెద్ద లోయలు అత్యంత భయంకరంగా కనపడ్డాయి. పైగా మేము వెళ్ళుదారి మలుపులతో కూడి అత్యంత ఇరుకుగా ఉంది. దారి భయంకరంగా ఉంది. ఎప్పుడు ఏమి జరుగునో చెప్పలేము. ఒకవేళ క్రింద పడ్డచో ఎముకలు కూడా మిగలవు. దీనిని చూచిన నా భార్య భయపడి పోయింది. గజగజ వణికింది. మా మొత్తం కుటుంబం ప్రయాణిస్తున్నాము కాబట్టి ఈ భయం మరింత ఎక్కువైంది. వెంటనే శ్రీవేంకటేశ్వరుణ్ణి అత్యంత ఆర్తితో స్మరించుట ప్రారంభించింది. మేము సుఖంగా బయట పడాలని, ఎలాంటి ఆపద కలగకూడదని, ప్రతిగా తాను ఇష్టపడి చేయించుకున్న డైమండ్ రింగును తనకు సమర్పిస్తానని వాగ్దానం చేసింది. కొంతసేపటికి భయం తగ్గింది. మేము నేపాల్ చేరాము. ఈ విధంగా తన డైమండ్ రింగును స్వామివారు లాగేసుకున్నారు.

నేపాల్ లో మూడు రోజులు ఉన్నాము. శ్రీపశుపతి నాథుడిని సుమారు 4 సార్లు దర్శించుకున్నాము. నేను చూచిన కలకు ఆ ఆలయమునకు కొంత సంబంధం ఉన్నది. అదేవిధమైన రౌండు పిల్లర్స్ మరియు ముఖద్వారము దగ్గర అదేవిధమైన అర్ధచంద్రాకార ఆకారంలో భవనం ఉన్నది. కాని పూర్తిగా మ్యాచ్ కానట్టు అనిపించింది. పచ్చని పచ్చిక బయలు మట్టుకు రోడ్డుకు మరోవైపు ఉన్నది. అది కూడా దేవస్థానము భూమే. దాదాపు నేను కలలో చూచిన విధంగానే ఉన్నది. ఇందులో పూజారులు నివాసముంటారట.

శ్రీ పశుపతినాథుని అత్యంత భక్తిపూర్వకంగా దర్శించుకున్నాము. పూజారి ''మోక్షము ప్రాప్తిరస్తు'' అంటూ దీవించాడు. నేను శ్రీ పశుపతి నాథుని దర్శించినప్పుడు కూడా నా మనస్సులో నా స్వామియే ఉన్నాడు. ''ఓం నమో శివరూపాయ, శ్రీవేంకటేశ్వరాయ నమో నమః'' అని మాత్రమే మ్రొక్కాను. నా శ్రీవేంకటేశ్వరుడే ఈ శివుడు అనే భావము నా మనస్సులో దృఢంగా ఉన్నది.

స్వామి పాదాలపై తల పెట్టి ప్రార్థించుట

గత కొన్ని రోజుల నుండి స్వామివారి పాదములపై నా తల పెట్టి దీనంగా ప్రార్థించాలనే కోరిక కలుగుతున్నది. ఈ మధ్యన ఈ కోరిక రోజు రోజుకు పెరిగింది. కాని ఇది ఎలా నెరవేరునో తెలియదు. ఈ కోరికను నెరవేర్చమని ప్రార్థిస్తున్నాను.

నేపాల్ లో శ్రీ పశుపతినాథుని దర్శించుకున్న తెల్లవారి శ్రీ బుద్ధ నీలకంఠ (స్లీపింగ్ విష్ణు) ను చూచుటకు ఖాట్మండ్ కు 30 కి.మీల దూరము వెళ్ళాము. అక్కడ స్వామివారు ఒక కొలనులోని నీటిలో శేషశయనుడై ఉన్నాడు. ఆ దృశ్యమును చూచి నేను చాలా తృప్తి చెందాను. ఆ స్వామివారి పాదములను నీటితో, గులాలుతో కడిగి ఆ పాదములపై తలపెట్టి తనివితీరా మ్రొక్కాను. అంతకుముందు నేను నా స్వామివారి పాదములు కడిగి ఆ పాదములపై నా తల పెట్టి మ్రొక్కే అదృష్టమును ప్రసాదించమని వేడుకున్నాను. ఆ స్వామివారు ఇప్పుడు నాకు దానిని ప్రసాదించారని అనిపించింది. ఆ సమయాన నా ఒళ్ళు జలదరించింది. స్వామివారిని మనసారా వేడుకున్నాను. స్వామివారు చూపు ప్రతి లీల జరిగి తీరుతుందని నమ్మాను.

నా దశ : స్వామి వారు చూపు ప్రతి లీల జరిగి తీరుతుందన్న విశ్వాసమేర్పడింది. స్వామివారిని విడిచి ఉండలేని స్థితి కలిగింది. సృష్టిలోని సర్వ రూపాలలో శ్రీవేంకటేశ్వరుడే కొలువై ఉన్నాడనే భావం ఏర్పడింది. ఈ లోకంలో గొప్పలు సాధించిన ప్రతి వ్యక్తి యొక్క శక్తి శ్రీవేంకటేశ్వరునిదే అనే విశ్వాసమేర్పడింది. సదా స్వామిని స్మరిస్తూ ఉంటే ఆయనెంతో ఆనందించుచున్నట్లు అనుభూతి చెందేవాణ్ణి.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

5వ భాగము

(జూన్ 2002 - ఆగస్టు 2002)

దిశానిర్దేశము: సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 5వ భాగపు లీలల ప్రచురణ. (జూన్ 2002 – ఆగష్టు 2002)

సంవత్సరం 2000 ఆగస్టు ప్రాంతమున ప్రారంభమైన నా అల్వాల్ సమస్య మార్చి 2002 వరకు కొనసాగింది. ఈ కాలములో నాలో చాలా మార్పు వచ్చింది. స్వామివారు నా నరనరాలలో జీర్ణించుకుపోయారు. ఆయనను ప్రతి క్షణం స్మరించుట అలవాటైంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్వామివారితో విడదీయరాని బంధం ఏర్పడింది. నేను స్వామి వాడిని. స్వామి నా వారు అనే అభిప్రాయం దృఢంగా కలిగింది. ఏప్రిల్ 2002 నుండి సమస్యలు లేక కొంత విరామము లభించింది. నా జీవితంలో ప్రతి విరామ సమయం, తరువాత వచ్చే లీలకు పూర్వాంగంగా ఉపయోగ పడింది. ఈ లీలలో నేను ఈ జీవితంలో తృప్తిచెందేవరకు తన సేవా భాగ్యమును ప్రసాదించారు. ఆ లీల ఈవిధంగా ఉంది.

శ్రీ ఆంజనేయుని లాంటి సేవను ప్రసాదించుట

నేను ప్రతిరోజు ఉదయం 10 గంటలకు ఇంటి నుండి ఆఫీసుకు వెళ్ళి, అక్కడినుండి పని దగ్గరికి వెళ్ళే క్రమములో ఉదయం 11.30 ప్రాంతమున, దారిలో ఉన్న తిరుమలగిరిలోని శ్రీఆంజనేయస్వామి వారి ఆలయమునకు వెళ్ళి ప్రార్థించేవాడిని. ఆ సమయానికి భక్తులు లేక ఆలయం ఖాళీగా ఉండేది. కావున నాకు మరింత ఆనందంగా ఏకాంతంగా స్వామివారిని ప్రార్థించు అవకాశం దొరికేది. గత కొన్ని రోజుల నుండి స్వామివారికి తనివి తీర సేవ చేయాలనే కోరిక కలుగుతుంది. ఈరోజు, శనివారం ఉదయం 11.30 ప్రాంతమున, తిరుమలగిరి శ్రీ ఆంజనేయస్వామివారి దేవాలయమునకు వెళ్ళాను. అత్యంత ఆర్తితో శ్రీ ఆంజనేయునకు 11 ప్రదక్షిణాలు చేశాను.



ఆ ప్రదక్షిణములు చేస్తున్న సమయంలో, శ్రీ ఆంజనేయస్వామి వారికి దేవదేవుడైన ఆ శ్రీరామచంద్రస్వామి సేవచేయు భాగ్యము లభించిందని, అందువల్ల శ్రీ ఆంజనేయుడు మహా పుణ్యాత్ముడని, భాగ్యవంతుడని, అదృష్టవంతుడని మరియు ఆయన జన్మ ధన్యమైందని నా హృదయంలో మనసారా భావించాను. ఆ విధంగా తలుస్తున్నప్పుడు నా కనుల నుండి ఆనంద బాష్పాలు పటపటా రాలాయి. మరియు నా దేహము కంపించింది. అంతేకాకుండా శ్రీరామచంద్రులవారు జీవించి ఉన్న సమయాన ఆంజనేయులవారు ఉన్నారని, అప్పుడే ఇది సాధ్యమైందని భావించాను. ప్రస్తుతం నాకు కూడా అలాంటి సేవ చేయాలనే బలమైన కోరికి ఉన్నప్పటికీ శ్రీరామచంద్రుడు లేడు, మరియు రామాయణం పూర్తైంది కాబట్టి అలాంటి సేవ లభించనందుకు దుఖించాను. నిజానికి శ్రీరామచంద్రుడు, సీతను వెదుకుటలో కాని, రావణునితో యుద్ధమునకు కాని ఆయనొక్కడే సమర్థుడైనప్పటికీ 'రామాయణం' అనే దానిని కల్పించి, శ్రీరామునికి అవసరాన్ని సృష్టించి, ఆంజనేయుడు, అంగదుడు మొదలగు వారికి స్వామివారి సేవాభాగ్యమును కల్పించారని భావించాను.

అదేవిధమైన ఏదైనా అవసరముతో నేను కూడా ఆ దేవదేవుని (శ్రీరాముని) సేవ చేయాలని, అంతటి అదృష్టము నాకు కలగాలని, అత్యంత ఆర్తితో, కళ్ళనుండి నీరు ధారలుగా రాలుచుండగా ప్రార్థించాను. ఈ ప్రార్థన చేయు సమయాన నా ఒళ్ళు కంపించింది, రోమాంచితుడనైనాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ క్షణం నేను పొందిన స్థితిని వర్ణించలేకపోవుచున్నాను. ఎలాగైనా ఈ జీవితంలో తృప్తి చెందేవరకు స్వామి సేవ చేసి తీరవలసిందే! మీరు దానిని ప్రసాదించి తీరవలసిందేనంటూ ప్రార్థించాను. ఒకవేళ మీరు ప్రసాదించకుంటే ఈ జీవితము వృధా కాగలదని దుఃఖించాను. అప్పుడు నా మనస్సులో ఈ రోజు నాకు ఏదో ఒక కల తప్పకుండా వచ్చునని, అందులో నా స్వామి సందేశము తప్పక ఉండునని నూటికి నూరుపాళ్ళ దృఢ విశ్వాసం కలిగింది.

రాత్రి నా కోరిక నెరవేర్చమని స్వామివారిని ప్రార్థిస్తూ పడుకున్నాను. అనుకున్నట్లే కల వచ్చింది.

10-06-2002 కల : ఈ కలలో తిరుమల కొండను దర్శించాను. పచ్చని చెట్లతో కూడిన కొండ, దానితో పాటు గాలి గోపురములను చూచాను. ఈ గాలి గోపురములను చూచు సమయాన ఎవ్వరో నాకు "అదే నీ భద్రాచలమని" చెప్పారు. ఈ మాటలు ఎక్కడో ఆకాశము నుండి వస్తున్నట్లు అనిపించింది. ఆ గాలి గోపురములు ముదురు గోధుమ రంగులో ఉన్నవి. వాటిపైన దేవతల విగ్రహములు చెక్కబడినవి. అవి తిరుమల ఆలయ గోపురాలలాగా టీవీలో

చూపించే మాదిరిగానే ఉన్నాయి. "ఇందులో నివసించువారే నీ ప్రభువు. నీవు వీరికే సేవ చేయవలసి ఉందనే" ఒక హృదయాంతరంగ భావం కూడా కలిగింది. ఈ కలలో ఇది మొదటి సన్నివేశం.

రెండవ సన్నివేశంలో ఒక గుడి లోనికి వెళ్ళాను. కొంచెం ఇరుకుగా చీకటిగా ఉంది. అందులో బుద్ధుని స్థూపమును చూచాను. ఇది నేపాల్ లోని బౌద్ధ స్థూపము మాదిరిగా ఉన్నది. తిరిగి ఆ గుడిలో వేరే స్థలమునకు వెళ్ళాను. అక్కడ చందనముతో ఉన్న శ్రీ ఆంజనేయుణ్ణి చూచాను. ఆంజనేయునికి అక్కడున్న పూజారితో పూజ చేయించాను. "ఓం ఆంజనేయాయ నమః, రామభక్తాయ నమః" అను మంత్రమును కలలోనే పఠించాను. తిరిగి బయటకు వచ్చేసరికి నా చెప్పులు ఎవ్వరో ఎత్తుకుపోయారు. అప్పుడు నా శని వదిలిందని కలలోనే అనుకున్నాను. ఇది కల, కాని ఆ సమయాన నాకు ఎలాంటి సేవ లేనందున, ఇది ఎందుకు కల్పించారో, దీని మర్మమేమిటో తెలియలేదు. స్వామిని, స్వామి లీలలను చూడాలనే నా ఆత్రుతను తగ్గించుటకే దీనిని చూపాడని భావించాను.

ఈ కలను నా విజ్ఞతను ఉపయోగించి విశ్లేషించుకున్నాను. శ్రీ ఆంజనేయుడు, శ్రీరాముణ్ణి ఏవిధంగా తన స్వామిగా భావించి ఎంతటి కష్టతరమైన సేవ అయినప్పటికీ, స్వామి స్మరణతో, స్వామి శక్తితో చేశాడో నేను కూడా తిరుమల శ్రీవేంటేశ్వరుని నా స్వామిగా భావించి, ఎంతటి కష్టతరమైన సేవ అయినప్పటికీ వెరవక స్వామిని ప్రార్థిస్తూ, ఆయన శక్తిచే సాధించమని ఆజ్ఞాపించాడని భావించాను. నేను జీవితంలో తృప్తి చెందేవరకు స్వామి సేవ లభించునని స్వామి ఇచ్చిన మాట నన్ను ఎంతో సంతోషపరిచింది.

స్వామివారిని విడిచి ఉండలేని స్థితి కలిగింది. ప్రతిక్షణం నా స్వామివారిని సంతోష పెట్టుటే నా లక్ష్యంగా భావించుకున్నాను. దీనికై రకరకాల ప్రయత్నాలు చేసేవాడిని. అందులో ముఖ్యమైనది అందరిలో అణిగిమణిగి ఉంటూ నేనే అధమ స్థాయి వ్యక్తిననే భావము అలవాటు చేసుకున్నాను. నా సంతోషాన్ని ప్రక్కనపెట్టి సదా స్వామివారిని ఆనందింప చేయుటే నా కర్తవ్యంగా పెట్టుకున్నాను. ఈ స్థితి ఎంతగా చేరిందంటే ఎప్పుడైన నేను సినిమా చూస్తున్నప్పుడు మానసికంగా నేను నాయికగా మారిపోయేవాడిని. నా ప్రభువును నాయకుడుగా భావించి ఆయనను తృప్తి పరచుటకు నాయికలాగా మానసికంగా నాట్యమాడేవాడిని. శ్రీవేంకటేశ్వరుడు తృప్తి చెందుచున్నాడని భావించి నేను సంతోషించేవాణ్ణి. ఈ స్థితి అప్పటి నుండి నేటివరకు కొనసాగుచున్నది. ఏ విధంగానైనా శ్రీవేంకటేశ్వరునికి సంతోషం కలిగించుటే నా కర్తవ్యంగా ఎంచుకున్నాను.

కే.శే. గవర్రాజు గారితో బంధం బలపడింది. ఆయనతో ఎన్నో విషయాలు చర్చించాను. గతంలో నేను మానసికంగా ఒక వస్తువుగా మారిపోయి స్వామివారి హుండీలో సమర్పించబడ్డానని, మరియు నాకు ఈ లోకంలో ప్రతి ఒక్కరు శ్రీవారి మూడు నామాలు పెట్టుకున్నట్లు కనిపించేదని, ఇవి దేనికి సంకేతమని అడిగాను. దీనికి సమాధానంగా వారు ఇవి చాలా అత్యంత ఉన్నత స్థాయి క్రియలన్నారు. శ్రీవైష్ణవంలో శరణాగతికి ప్రథమస్థానం ఇస్తారన్నారు. మరియు చూచినవారందరూ మూడు నామాలతో కనబడుట అన్నది ఉత్తమస్థాయి లక్షణమన్నారు. గవర్రాజు గారు గత అయిదారు సంవత్సరాల నుండి ఐశ్వర్య మహామంత్రమును భక్తులచే వ్రాయించారు. దీనిని తిరుపతిలో తగిన సమయములో నిక్షిప్తము చేయుదుమని చాలా సంవత్సరాల నుండి చెప్పుచు వ్రాయిస్తూ ఉన్నారు. ఐశ్వర్య మహామంత్రములో 8 శ్రీలు ఉన్నవి కాబట్టి వ్రాసినవారికి అష్టైశ్వర్యాలు సిద్ధించునని చెప్పినప్పటికీ, ధనమే ప్రధానంగా వారి భక్తి ప్రచారం జరిగేది. ఇది ఆయనకు అవసరం కాబట్టి అలా చేయుచున్నారని భావించి నేను మాత్రం ఆయన బోధనలను విన్నప్పటికీ భగవంతున్ని పొందడమే లక్ష్యంగా సాధన చేసేవాడిని. ఆయన ఐశ్వర్య మహామంత్రం చెపుతూ ఉంటే నేను మాత్రం దాని స్థానంలో స్వామివారి అష్టాక్షరీ మహా మంత్రమును స్మరించేవాడిని.



శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుట

20–06–2022 కీ.శే. గవర్రాజు గారితో కలిసి కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారిని చూచుటకు వెళ్ళాము. అమ్మవారిని ఒక పర్యాయము దర్శించాము. మరియు 21-06-2002 శుక్రవారము అభిషేకమును బుక్ చేసుకున్నాము. ఆ గుడిలో ఒక బ్రాహ్మణుడికి అమ్మవారికి నైవేద్యమునకు మరియు మా ఇరువురికి భోజనానికి డబ్బులు ఇచ్చాము. గవర్రాజు గారు వారితో ఏదో విషయము మాట్లాడు సమయాన నేను మరోసారి అమ్మవారిని దర్శించెదనని గుడి లోనికి వెళ్ళి అమ్మవారిని దర్శించుకొని బయటకు వచ్చి ఆ గుడిని అన్నివైపుల చూస్తున్నాను. ఈ ఆలయానికి 4 ద్వారములు కలవు. అందులో తూర్పు వైపున ఉన్న ముఖ్యద్వారము లోనికి వెళ్ళాను. ఆ ముఖ్యద్వారములో నిలబడి అనుకోకుండా అమ్మవైపు ఒక ప్రత్యేక కోణంలో చూచాను. అప్పుడు నమ్మలేని నిజం తెలిసింది. అక్కడినుండి అమ్మవారిని చూస్తున్నప్పుడు ఆ చూపు ఎన్నో ఆర్చెస్ గుండా పోయి దాదాపు ఒక ఫర్లాంగ్ దూరములో ఉన్న అమ్మ నల్లని ఆకారముతో స్పష్టంగా కనిపించింది. ఇది నాకు 20-03-2001 రోజున కలలో కనిపించిన విధంగానే ఉన్నది. అమ్మవారి చుట్టూ ఉన్న చక్కనము కూడా కలలో చూచినట్లే ఉన్నది. తరువాత

ముఖ్యద్వారము బయటకు వెళ్ళి ఆ ద్వారమును చూచాను. ఇది నాకు కలలో కనిపించినట్లు ఆర్చెస్ మాదిరిగా దానిపైన చతురస్రాకారములో డిజైన్ కలలో కనబడిన విధంగానే ఉంది. ఎంతో సంతోషంతో కూడిన ఆశ్చర్యతతో స్వామివారికి మరియు అమ్మవారికి పరి పరి విధాలుగ ధన్యవాదాలు తెలియచేసుకున్నాను.

హైదరాబాద్ తిరిగి వచ్చిన తరువాత లక్ష్మీదేవి అమ్మవారిని ధ్యానించుచు పడుకున్నాను. అంతలో ఒక కల కన్నాను.

23-06-2002 : కల : ఈ కలలో నాకు కొంచెం దూరంలో ఒక గుడిలో అమ్మవారి పూజను ఒక బ్రాహ్మణుడు చేయుటను చూచాను. నాకు కొల్హాపూరులో భోజనం పెట్టిన పూజారి లాగానే ఈ పూజారి ఉన్నాడు. ఆయన అమ్మవారికి పూజ చేస్తున్నాడు. ఆయనతో పాటు ఇంకా ఇద్దరు పూజారులు ఉన్నారు. ఈ పూజారి ఎరుపురంగు పంచ ధరించి పూజ చేయుటను చూచాను.

ఈ విధంగా నాకు శ్రీ కొల్హాపూర్ అమ్మవారి అనుగ్రహము లభించింది.

తిరుమల స్వామివారిని దర్శించుట

జూన్ 2002 : ఒక సందర్భంలో కీ.శే. గవర్రాజు గారి సలహా మేర తిరుమల శ్రీవేంకటేశ్వరుని "మేల్చాట్ వస్త్రము" అను సేవను నేను నా భార్య కలిసి చేశాము. ఈ సేవ అత్యంత తృప్తిని ప్రసాదించింది. స్వామివారి గర్భాలయము ముందు స్వామివారి అభిషేకమును చూస్తూ ఒక గంట పదిహేను నిమిషాలు కూర్చున్నాము. స్వామివారిని తనివితీర చూడవలెననే నా కోరిక తీరింది. చిత్రమేమిటంటే నేను స్వామివారిని కలలో దర్శించిన మాదిరిగానే శ్రీవెంకటేశ్వరుడు ఉన్నాడు. కలలో దర్శించినట్లే ఆయన అరచేతిలోని గీతలను కూడా చూచి పోల్చుకున్నాను. నేను కలలో స్వామివారిని అభిషేకము తరువాత ఎలాంటి వస్త్రములు, ఆభరణములు లేని విధంగా చూచాను. ఇప్పుడు కూడా అదేవిధంగా స్వామివారిని చూచాను. అదే రూపము. అదే ఆకర్షణ. అణువణువు పోల్చుకున్నాను. మరో విషయమేంటంటే మొత్తం ఈ సేవాకాలంలో ఒక గంట పదిహేను నిమిషాల వరకు, తన్మయత్వముతో కళ్ళనుండి నిరాటంకంగా ఆనంద భాష్పాలు రాలాయి. నేను కూర్చున్న స్థలము నా కన్నీటితో తడిసిపోయింది.

ఈ జీవితములో నేను పొందిన అత్యంత మధురమైన క్షణాలలో ఇది మూడవ స్థానము ఇవ్వదగింది. అంతటి పరమానందాన్ని అనుభవించాను. పూజారులు స్వామివారిని ఏ విధంగా అభిషేకిస్తారు అనే విషయాన్ని అత్యంత సూక్ష్మ దృష్టితో చూచాను. ఆ పూజారులు ఎంతో అదృష్టవంతులని నాది నేను భావించుకున్నాను. స్వామిని స్పర్శించిన వారి చేతిని ముద్దాడాలనిపించింది. కాని వీలుపడక ఊరుకున్నాను.

కీ.శే. గవర్రాజు గారు 1983 సంవత్సరము నుండి భక్తి ప్రచార పీఠమును స్థాపించి, భక్తులకు శ్రీవేంకటేశ్వరున్ని ఎలా పూజించాలి, ముడుపులెలా కట్టాలి, అసలు శ్రీవేంకటేశ్వరుడంటే ఎవరు? ఏడు కొండలు ఎలా ఉద్భవించాయి మొదలగునవి ప్రజలకు తెలియచేస్తుంటారు. మరియు అప్పుడప్పుడు భక్తుల నుండి ధనమును సేకరించి టిటిడి గోశాలకు విరాళంగా ఇచ్చారట. ప్రస్తుతము కూడా వారు గత 5-6 సంవత్సరముల నుండి వ్రాయించిన 3 కోట్ల ఐశ్వర్య మంత్రమును టిటిడి డైరీఫాంలో ఒక చిన్నపాటి స్థూపాన్ని ఏర్పాటు చేసి యజ్ఞము చేసి సమర్పించాలని భావించారు. దానిపేరు "జపనామ స్థూపం" అని పెట్టారు. ఈ ఆలోచన గత 5-6 సంవత్సరముల నుండి ఆయనకు ఉన్నప్పటికీ ఎంత ప్రయత్నించినప్పటికీ ముందుకు సాగలేకపోయారు. ఇదే కాకుండా టిటిడి డైరీఫాం డెవలప్మెంటు కోసం ఒక కోటి రూపాయలను విరాళంగా ఇచ్చుదునని చెప్పి భక్తుల నుండి చెక్కుల రూపంలో

ధనాన్ని కూడా సేకరిస్తున్నారు. దీనికోసం సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. నేను కూడా నాకు తెలిసిన చోట్ల ప్రయత్నించాను. సిద్ధిపేటలో కూడా గో సమర్పణ ధనాన్ని సేకరించుటకు ఒక సభను ఏర్పాటు చేశాను. ఈ విధంగా హైదరాబాదులో ధన సమీకరణ చేయుచు తిరుపతిలోని టిటిడి డైరీఫాంలో ఈ స్థూపం ఎక్కడ నిర్మించాలనే మంతనాలు జరుగుతున్నవి. అప్పుడు టిటిడి డైరీఫాం డైరెక్టరుగా శ్రీమాన్ డా॥ కొండారెడ్డి గారు ఉన్నారు. శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత వీరు ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించేవారు. ఇదే కాలములో టిటిడి వారు "గో సంరక్షణ ట్రస్ట్" అనే దానిని ఏర్పాటు చేయదలచారు. దీని బాధ్యతను డైరీఫాం డైరెక్టరుగా ఉన్న శ్రీమాన్ కొండారెడ్డి గారు తీసుకున్నారు. నాకు కీ.శే. గవర్రాజు గారితో చక్కని బంధం ఏర్పడింది. ముఖ్యంగా సభలు నిర్వహించుటలో, డబ్బు సమీకరించుటలో నేను ఆయనకు సహకరిస్తున్నాను. తేది 03-07-2002 ప్రాంతమున టిటిడి డైరీఫాం డైరెక్టర్ శ్రీమాన్ కొండారెడ్డి గారి ఆహ్వానం మేర "నామస్థూపం" నిర్మించే స్థల పరిశీలన నిమిత్తమని ఒక నాలుగైదు రోజుల కొరకు నాకు చెప్పి గవర్రాజు గారు తిరుపతి వెళ్ళారు.

నా మొదటి పుట్టినరోజు పండుగ – స్వామివారి బహుమానం :

3–7–2002 తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఒక ప్రత్యేక పద్ధతిలో సమయానుకూలంగా తన లీలలను ప్రసాదిస్తారు. ఆకలైనప్పుడే రుచెక్కువున్నట్లు మనలో ఆ దిశగా ఆర్తిని పెంచి ఆ లీలలో అత్యంత ఆనందమును అనుభవించేటట్లు చేస్తాడు. ఇలాంటి అద్భుతమైన లీల ఒకటి నా జీవితంలో జరిగింది. జీవితాంతం గుర్తుంచుకునే సంఘటన. నా మొదటి పుట్టినరోజు పండుగకు స్వామివారు ఈ ప్రపంచములోని మన్నికైన వజ్రవైఢూర్యాలు పొదిగిన నగను బహుమతిగా ఇచ్చారు. నేను కొంత తడవు సృహ కోల్పోయేలా చేశారు.

నా జీవితములో శ్రీవేంకటేశ్వరుడు కొన్ని ఆణిముత్యాలను ప్రసాదించాడు. జీవితాంతం గుర్తుంచుకోతగినవి ఇచ్చాడు. మరికొన్ని అంతకంటే విలువైనవి ప్రసాదించాడు. ఆయన ఒక్క అనుగ్రహానికి పరవశుణ్ణై ఈ జీవితం మొత్తం మీకు ఋణపడి ఉంటాను అని భావించిన అనుగ్రహాలలో ఇది ఒకటి.

భక్తుడు భగవంతున్ని నావాడు అనుకొని సాధన చేస్తుంటాడు. భగవంతుని దృష్టిలో పడాలని తాపత్రయపడుతుంటారు. కాని, భగవంతుడే స్వయంగ ఆ భక్తుని "నీవు నావాడివి" అని అంటే ఆ భక్తుని ఆనందం ఏ స్థాయిలో ఉంటుంది? ఈ జీవితంలో ఆ భక్తునికి మరేమి కావాలి? నేను ఇంతటి అదృష్టానికి నోచుకున్న ఘటన ఇది. ఆ లీల ఈ విధంగా ఉంది.

నేను ఒక మామూలు వ్యవసాయ కుటుంబంలో పల్లెటూరిలో పుట్టినవాణ్ణి. నా పుట్టినరోజు తెలియదు. మా అమ్మానాన్నలు జన్మతేదీని వ్రాసి పెట్టేలేదు. నా మేనమామ కీ.శే. చిలుకోటి రంగారెడ్డిగారు వ్రాశాడట కాని అలభ్యం. నా స్కూల్ రికార్డులో మాత్రం నా జన్మతేది 02-02-1959 అని ఉంది. కాని ఇది తప్పు. మా పెద్దనాన్న పెద్దకొడుకు ఆక్సిడెంటులో చనిపోయాడు. ఆయన జ్ఞాపకార్థం మా ఊరిలో పాఠశాల నిర్మించి దానిపై ఈయన మరణతేది 02-02-1959 అని వ్రాశారు. నిజానికి నేను ఈయన మరణం తరువాత ఒకటిన్నర సంవత్సరమునకు పుట్టానని మా అమ్మ చెప్పేది. కాబట్టి ఈయన మరణతేది నా పుట్టిన రోజు ఒకటి కాదని 2వ తరగతిలోనే గ్రహించిన నేను, నా స్కూల్ రికార్డు తప్పని తెలుసుకున్నాను. కాబట్టి ఇప్పటివరకు నేను ఒక్క పుట్టినరోజును జరుపుకోలేదు. కనీసం దేవునికి దండం కూడా పెట్టలేదు. నా పెండ్లి తరువాత నా భార్య కోరిక మేర మా అమ్మను నేను ఎప్పుడు పుట్టాను? దాని ముందు వెనుక ఏఏ పండుగలు ఉన్నవని అడుగగా ఆమె "తొలి ఏకాదశి మరియు మొహర్రం పండుగలు రెండు మూడు రోజుల వ్యవధిలో వచ్చాయని, నేను సాయంత్రం దాదాపు ఐదు నుండి ఐదున్నర మధ్యలో పుట్టానని

చెప్పింది. దీనిని బట్టి ఒక పంతులు గారు నేను తేది 05-07-1960 లేదా 07-07-1960 సాయంత్రం పుట్టానని చెప్పారు. నేను ఒకసారి నాడీ జ్యోతిష్కుని వద్దకు వెళ్ళినప్పుడు నా వేలిముద్ర తీసుకొని నేను తేది 05-07-1960 (తొలి ఏకాదశి) సాయంత్రం 05-15 నిముషాలకు పుట్టానని చెప్పారు. (ఒకానొక సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు నేను తొలి ఏకాదశి రోజు పుట్టానని చెప్పాడు).

ఇన్ని సంవత్సరముల నుండి నేను నా పుట్టిన రోజును ఒక్క సంవత్సరము కూడా జరుపుకోలేదు. అలాంటిది తేది 05-07-2002 నాడు మాత్రం నా పుట్టిన రోజును ఎవ్వరికీ తెలియకుండా జరుపుకోవాలని, ఆ రోజు నా స్వామికి ప్రత్యేక పూజలు చేయాలని కోరిక కలిగింది. శ్రీవేంకటేశ్వరా! నేను నా గత 41 పుట్టిన రోజులలో మిమ్ములను ధ్యానించలేదు. కనీసం దండం కూడా పెట్టలేదు. ఈ 42వ పుట్టిన రోజున మిమ్ములను మనసారా పూజించుకుంటాను ప్రభూ! అని వేడుకున్నాను. స్వామివారిని అభిషేకించి నాకు ఇష్టమైన గులాబీలతో, మల్లెపూలతో అర్చించాలనిపించింది.

నా అదృష్టము కొలది తేది 05-07-2002 నాడు శుక్రవారమయింది. ఈనాడు మా ఇంటిలో నా ఇష్టపూర్వకంగా స్వామివారికి నీరు, పాలు, తేనె, గంధముతో అభిషేకము చేశాను. ఈ జీవితంలో ఇదే నేను నా స్వామికి చేసిన మొదటి అభిషేకము. తిరుమలలో స్వామివారిని శుక్రవారము రోజు ఏ విధంగా అభిషేకిస్తారో అదేవిధంగా, తులసీదళాలు వేసిన నీరు, పాలు, గంధం, తేనె మొదలగు వాటితో అదే వరుసక్రమములో అభిషేకించాను. స్వయంగా స్వామివారిని స్పృశిస్తున్నాననే భావముతో చేశాను. మొత్తం అభిషేక క్రియ గం. 1.15 నిముషాలు పట్టింది. ఈ మొత్తం కాలం నేను పరవశించిపోయాను. రోమాంచితుడనైనాను. కనుల నుండి ఆనంద బాష్పాలు మొత్తం గం. 1.15 ని॥లు నిరాటంకంగా రాలాయి. నా జీవితంలో అత్యంత పరవశంతో, నిరాటంకంగా పరమానందాన్ని అనుభవించిన దానిలో ఇది రెండవ స్థానము ఇవ్వదగింది. పూజ జరుగు సమయాన 'ప్రభూ నా చేత లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక కార్యమును చేయించమని వేడుకున్నాను. ఈ కార్యక్రమములో నేను కూడా తృప్తిగా మీ సేవ చేయాలి, ఆనందపడాలని కూడా ప్రార్థించాను'. తరువాత మల్లెపూలు, గులాబీలతో పూజించాను. చివరికి అప్రయత్నంగా నా నోటి నుండి ఒక మాట వెలువడింది. "ప్రభూ! గత 41 సంవత్సరాలు నా అజ్ఞానం వల్ల నా పుట్టినరోజు నాడు పూజించలేదు. ఈరోజు తృప్తిగా మిమ్మల్ని పూజిస్తున్నాను. ఒకరకంగా ఇది నా మొదటి పుట్టినరోజు పండుగ. ఇష్టమైనవారు ఏదో ఒకటి ఈ మొదటి పుట్టినరోజు పండుగకు బహుమానం ఇస్తారు. మీరు అత్యంత ఆప్తులు. నాకు మీరు ఏమి బహుమానం ఇస్తున్నారు ప్రభూ!" అని అకస్మాత్తుగా నా నోటి నుండి వచ్చింది. మరియు నా రెండు అరచేతులు చాచి, దోసిలి పట్టి, స్వామి పాదాల చెంత పెట్టి స్వామివారిని "బహుమానం, బహూమానం" అని అప్రయత్నంగా అడిగాను. నా కళ్ళనుండి ఆనందబాష్పాలు జాలువారుచుండ అత్యంత ప్రేమతో అడిగాను. ఆ విధంగా నేను నా మనస్సు తృప్తి చెందే విధంగా ప్రార్థించాను. ఇంతటితో ఈ విషయం ముగిసిపోయింది. ఈ రోజు నుండి ప్రతి శుక్రవారం స్వామివారికి అభిషేకించుట ప్రారంభించాను.

స్వామివారు నా ప్రశ్నకు జనాబు ఇస్తారని, మంచి బహుమానం ఇస్తారని ఊహించలేదు. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నేను కోరినదానికంటే ఎక్కువ ఇచ్చాడు. నా మనస్సును గ్రహించాడు. నా సేవను వినియోగించుకోవాలనుకున్నాడు. ఈ రోజు ఆ స్వామి నోటినుండి "నా సాయిరెడ్డి", "సాయిరెడ్డి నావాడు" అనే పదమును పలికి నా మనస్సు నింపాడు. ఈ జీవితంలో నేనే అందరి కంటే ధన్యుడనని అనుకున్నాను. పొంగిపోయాను. నా స్వామి పాదాలకు శతకోటి ప్రణామాలను అర్పించాను. ఈ జీవితాంతం ఋణపడి ఉంటానని నిర్ణయించుకున్నాను. అసలు చెప్పాలంటే నోరు లేదు, మాటలు లేవు, మూగవాడినైనాను. కొంత తడవు స్పృహ

తప్పినట్లైంది. అది ఈ విధంగా జరిగింది.

సాయిరెడ్డి నావాడని పిలుచుట – స్థూప నిర్మాణానికి అవకాశం

09-07-2002: ఈ రోజు ఉదయం గం.8.30 ప్రాంతమున కే.శే. వాడ్రేవు గవర్రాజు గారు నాకు ఫోన్ చేశారు. ఆయన తిరుపతికి పోయి శ్రీవేంకటేశ్వర 'నామ జప స్థూపము' ఎక్కడ కట్టాలో అధికారులతో చర్చించానని 21-09-2002 నాడు జపనామ స్థుపం మరియు 22-09-2002 నాడు గోసంరక్షణ ట్రస్టు ప్రారంభోత్సవ రోజులుగ నిర్ణయించారన్నారు. అంతే కాకుండా తాను, టిటిడి అధికారులు కలిసి కంచి వెళ్ళి శ్రీశ్రీశ్రీ కంచి కామకోటి స్వామివారిని కలిసి ఆ రోజులలో వారిని తిరుపతికి రమ్మని ఆహ్వానించామన్నారు. వారు కూడా తేది 22-09-2002 నాడు తిరుపతికి వచ్చి "గో సంరక్షణ ట్రస్టు"ను ప్రారంభించెదరని చెప్పారు. నాతో ఆయన పది గంటలకు వారింటకి రమ్మన్నారు. హిమాయత్‌నగర్ లోని తిరునిలయంలో సాయంత్రం 6 గంటలకు వారి మిత్రుడి స్వామి గురించిన ఉపన్యాసమున్నది వెళ్ళాలని చెప్పారు. దానికి నేను సరేనన్నాను.

ఉదయం 10 గంటలకు నేను ఆయన ఇంటికి వెళ్ళాను. ఆప్యాయతతో స్వామివారి లడ్డూ ప్రసాదమును ఇచ్చారు. మరియు సెప్టెంబర్ 21, 22 తేదీలు నిర్ణయమైనవి. ఆ రోజు గోపూజ, కోటి రూపాయలు స్వామివారికి గో సమర్పణ క్రింద ఇవ్వడము జరుగునని చెప్పాడు. మరియు 'నామ జప స్థూపము' గురించి కూడా చెప్పాడు.

తరువాత నేను మా ఆఫీసుకు కారులో బయలుదేరి వస్తున్నాను. మార్గమధ్యమున నేనే ఆ స్తూపమును కట్టవలెననే ఆలోచన కలిగింది. ఆఫీసుకు వచ్చి యథాప్రకారం స్వామివారికి బొట్టుపెట్టి మ్రొక్కుచూ "స్వామీ! నాకు ఆ స్తూప నిర్మాణమును చేయు ఆజ్ఞ ఇవ్వమని, నా సేవను స్వీకరించుమని" నా కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగగా ఆ స్వామిని వేడుకుని స్వామి పాదాలు మ్రొక్కాను. అప్పుడు నా శరీరం కంపించింది. ఎలాగైనా ఈ స్థూప నిర్మాణం నేనే చేయాలనే దృఢ సంకల్పం ఏర్పడ్డది.

సాయంత్రం 5.45 నిముషములకు నేను కారులో శ్రీ గవర్రాజు గారి ఇంటికి హిమాయత్‌నగర్ లోని తిరునిలయమునకు తీసుకుపోవుటకని వెళ్ళాను. అక్కడ నుండి 6 గంటలకు బయలుదేరాము. ఆ స్వామివారి లీలలను చెప్పుకుంటూ వెళ్ళుతున్నాము. చివరికి నేను ఆ స్వామివారి జప స్థూపము నేనే కట్టుదునని దానిని ఇతరులకు చెప్పవద్దని గవర్రాజు గారితో అన్నాను. అప్పుడు మేము హిమాయత్‌నగర్ లోని తిరునిలయం యొక్క ముఖ్యద్వారము ఎదురుగా ఉన్నాము. దీనిని విని గవర్రాజు గారు ఒక్కసారి ఉలిక్కి పడ్డారు. కారును ప్రక్కకు త్రిప్పమన్నారు. అప్పుడు తిరునిలయం ప్రక్కన ఉన్న కళ్యాణ మండపం ఎదురుగా, శ్రీవేంకటేశ్వరస్వామి వారి విగ్రహానికి ఎదురుగా, రోడ్డుకు ఎడమ ప్రక్కన కారును ఆపాను. గవర్రాజు గారి ఒళ్ళు వణుకుతున్నది. ఆయన కళ్ళనుండి నీరు కారుతున్నది. అప్పుడు ఆయన అన్న మాటలు ఇవి. "నేను గత 22 సంవత్సరముల నుండి ఆ స్వామివారి సేవ చేయుతున్నాను. ఆ స్వామినే నమ్ముకున్నాను. మనసా, వాచా, కర్మణా నాకు ఆ స్వామి మాత్రమే. నేను ఆ స్వామివారి పాదముల సాక్షిగా చెప్పుతున్నాను. ఇది నిజము" అన్నారు. మరియు తేది 05-07-2002 శుక్రవారము రోజున నేను మరియు టిటిడి ఎస్వీ డైరీఫాం డైరెక్టర్ శ్రీ కొండారెడ్డి గారు వారి డైరీఫాంలో స్థూపమునకు స్థలము నిర్ణయించాము. తరువాత తెల్లవారు జామున మేము మద్రాసుకు కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారిని ఆహ్వానించుటకు వెళ్ళవలెనని నిర్ణయించాము. తరువాత నేను హోటల్ రూం లోనికి వెళ్ళి కూర్చుండి కాగితము తీసి ఆ స్థూపము ఏ విధంగా ఉండాలి, దీనిని ఎవ్వరు కట్టుదురు అని ఆలోచించుచుంటిని. ఇంతలో ఎదురుగా ఉన్న గోడపైన ఒక నల్లని రూపము ఏర్పడింది. అది స్వామివారి రూపము

వలెనే ఉన్నది. ఆడ మగ కాని గొంతుతో ఆ రూపము నాతో ఈవిధంగా అన్నది "స్థూప నిర్ణయం బాగుంది. దీని విషయము వదులుము. దీనిని నా సాయిరెడ్డి కట్టును, సాయిరెడ్డి నావాడు, నా కోసం ఏమైనా చేస్తాడు, అని పలికి ఆ రూపము మాయమైంది" అని నాతో చెప్పాడు. ఆ మాటలు ముఖ్యంగా "నా సాయిరెడ్డి" అనే మాట నా హృదయములో ఎంతగానో చొచ్చుకుపోయింది. స్వామివారే స్వయంగా తన నోటితో నన్ను "నా సాయిరెడ్డి" అని అన్నారని మురిసిపోయాను. ఒళ్ళు కంపించింది. ఈ మాట వినగానే గొల్లున ఏడిచాను. అంటే నేను తేది 05-07-2002 రోజున మీరు నాకు ఏమి ఇస్తారు స్వామీ అని ప్రొద్దున వేడుకుంటే సాయంత్రము శ్రీ గవర్రాజు గారితో "నా సాయిరెడ్డి" అని సంబోధించాడు. ఆ తరువాత నా మనస్సులో స్థూప నిర్ణయాన్ని కల్పించి ఆచరించే విధంగా చేశాడు. నాచే ఆయన పని చేయించుకుంటున్నాడు. నేను ఏదో ఒకటి చేయాలనే నా చిరకాల కోరికను స్వామివారు తీరుస్తున్నారని భావించాను. ఆ సమయంలో నేను ఈ లోకము విడిచి.... ఎక్కడికో పోయాను. ఆనందమునకు హద్దులు లేవు. కొంత తడవు స్పృహ కోల్పోయినట్లైంది. జీవితాంతం నా స్వామికి ఋణపడి ఉంటానని నిర్ణయించుకున్నాను. పిదప ఒక పది నిముషాల తరువాత కారు దిగి తిరు భవనము లోనికి వెళ్ళాము.

ఈ విధంగ తేది 05-07-2002 రోజు సాయంత్రం "సాయిరెడ్డి నావాడు. నాకోసం ఏమైనా చేస్తాడు" నీవు స్థూప విషయమును అతనికి వదులుమని శ్రీ గవర్రాజు గారిని ఆజ్ఞాపించాడు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు. స్వామివారు ఈ అనుగ్రహాన్ని నా మొదటి పుట్టిన రోజు కానుకగ ఇచ్చారని భావించుకున్నాను. ఒక భక్తునికి

ఇంతకంటే కావలసిందేముంటుంది. ఇది ప్రపంచంలో మన్నికైన వజ్రవైఢూర్యాలు పొదిగిన నగ కంటే విలువైనదిగా నాకు నేను భావించుకున్నాను.

ఈ విధంగా తిరుపతిలో శ్రీవేంకటేశ్వరుని స్థూపమును నిర్మించుటకు అవకాశం కల్పించాడు.

11-07-2002 : భారత దేశము నలుమూలలో శ్రీవేంకటేశ్వరుని మందిరములను నిర్మించాలని కోరిక కలిగింది. ఆది శంకరాచార్యులు ఏ విధంగా దేశం నలుదిక్కులా పీఠములను స్థాపించారో అదేవిధంగా శ్రీవేంకటేశ్వరుని మందిరములను దేశం నలుదిక్కులా కట్టాలని, కట్టించాలని కోరిక దృఢంగా కలిగింది. ఆయన కృపాకటాక్షాలు సర్వులకూ అందేవిధంగా చేయాలనిపించింది. ఈ విధమైన బలమైన హృదయాంతర భావం కలిగింది.

తేది 20-07-2000 : నేను ఏప్రిల్ 2000 సంవత్సరము నుండి స్వామివారి లీలలను పొందుచున్నప్పటికీ, వీటిని మామూలు కలలుగా భావించాను. నేను మాత్రమే అర్థము చేసుకునే విధంగా, ఆ కల యొక్క సారాంశమును మాత్రమే నా డైరీలో వ్రాసుకునేవాడిని. అది కూడా ఒక నాలుగు పొందిన తరువాత, నాకు సమయము చిక్కినప్పుడు వ్రాశాను. చివరికి స్వామివారు నాచే ఏదో సాధించుటకు ఒక క్రమ పద్ధతిలో లీలలను ప్రసాదిస్తున్నారని గ్రహించి తేది 20-07-2002 నుండి ఈ అనుభూతుల కోసమని ఒక ప్రత్యేక పుస్తకమును పెట్టి వ్రాయుట ప్రారంభించాను.

నాకు మీ సేవా భాగ్యమును ప్రసాదించుమని, తిరుపతిలో స్థూప నిర్మాణమును చేయు భాగ్యమును ఇవ్వమని, నాచే లోకమునకు ఉపయోగపడే ఒక మంచిపనిని చేయించమని శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రతిరోజు ప్రతిక్షణం వేడుకుంటున్నాను. మరియు గవర్రాజు గారు గోసమర్పణ నిధిని సమీకరించుటకు నిర్వహించు సభలకు వెళ్ళుతున్నాను.

మొదట్లో శ్రీగవర్రాజు గారు ఈ స్థూపము చిన్నమొత్తంలోనే అంటే మూడడుగులకు మించకుండా చేయమన్నాడు. కాని శ్రీవేంకటేశ్వరుని పైనున్న భక్తితో చిన్నగా చేస్తే అది నా స్వామివారికి అవమానమని భావించి డబ్బులకు వెరవక అత్యంత సుందరంగా ఉండాలని భావించాను. నా ఆర్కిటెక్ట్ శ్రీమాన్ శివలీలానంద్ గారికి దీని డిజైన్ బాధ్యతను అప్పగించాను. ఆయన కూడా దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని తన మిత్రుడు, తన వద్దనే పని చేస్తున్న శ్రీమాన్ బాలు గారికి ఈ బాధ్యతను అప్పగించాడు. శ్రీమాన్ బాలు గారు కూడా మంచి భక్తుడు. స్వామివారిని ప్రార్థిస్తూ ఒక చక్కని రూపమును డిజైన్ చేశాడు. నాకు చాలా నచ్చింది. ఈ రూపము డిజైన్ చేయునప్పుడు తాను ఎంతో పరమానందమును అనుభవించానని, మరియు ఈ రూపము తన ప్రమేయము లేకుండానే తనకు తానే సంతరించుకున్నట్లు అనుభూతి పొందానని చెప్పాడు. ఈ విధంగా స్థూపం ప్లాన్ సిద్ధం చేసుకున్నాము. చివరికి తిరుపతిలో తేది 13-08-2002 నాడు జపనామ స్థూప నిర్మాణ పనులు ప్రారంభించుటకని తేది 12-08-2002 నాడు నేను మరియు గవర్రాజు గారు హైదరాబాద్ నుండి ప్రయాణమై తేది 13-08-2002 ఉదయం తిరుపతి చేరాము. పిదప స్నానాదులు ముగించుకుని 10 గంటల వరకు టిటిడి గోశాలకు వెళ్ళి దాని డైరెక్టర్ డా॥ కొండారెడ్డి గారిని కలిశాము. ఆయన అంతకుముందే ఒక స్థపతిని ఈ స్థూపము కట్టుటకు మాట్లాడి పెట్టారు. స్థూప ప్లానును వారికి చూపించాను. తరువాత స్థపతితో పరిచయము చేసుకుని ఏ విధంగా ఈ స్థూప నిర్మాణము చేయాలో చెప్పాను. ముందు బావి లాగ ఒక గోయి తవ్వి చుట్టు బేస్‌మెంటు కట్టాలి. ఆ తరువాత భూమిపై కనబడే ఆకారం నిర్మించాలని చెప్పాను. మేము అందరం కలిసి గోశాల తిరిగి పూర్వము నిర్ణయించిన స్థలమునకు బదులుగా వేరొక స్థలమును గోవిందుని సన్నిధిలో నిర్ణయించాము. చివరికి మార్కింగ్ వేసి తేది 13-08-2002 మంగళవారం రోజున దాదాపు 12 గంటలకు (మధ్యాహ్నము) రోజు భూమిపూజ చేశాము. మేము నలుగురము

(డా॥ కొండారెడ్డి, గవర్రాజు, నేను మరియు స్థపతి) 4 టెంకాయలు కొట్టి ప్రారంభించాము. అప్పుడు మా వద్ద గడ్డపార, పార లేనందున త్రవ్వలేదు.

ఆ రోజు సాయంత్రం ఆ స్థపతితో స్థూపము కట్టుటకు మాట్లాడాము. బేరసారాల తర్వాత ఆయన కొంత మొత్తానికి ఒప్పుకున్నాడు. ఒక సందర్భములో ఆ స్థపతితో నేను ఇలా అన్నాను "అయ్యా మేము హైదరాబాదులో ఉంటాము. ప్రతిసారి ఇక్కడకు రాలేము. స్థూప నిర్మాణములో 'స్కఫోల్డింగ్' (అంటే కట్టెలు కట్టుట) అవసరముంటుంది వాటిని మీరే చూసుకోవాలని చెప్పి, మీకు స్కఫోల్డింగ్ అంటే తెలుసా? అని అన్నాను. ఈ మాటను ఆ స్థపతి చిన్నతనంగా భావించి కోపగించుకుని నేను ఈ పనిని చేయనని వెళ్ళిపోయాడు. నేను ఆ స్థపతితో 'సారీ' చెప్పినప్పటికీ ఆయన వినలేదు. అది నన్ను చాలా బాధపెట్టింది. చివరికి కొండారెడ్డి గారు ఆయనతోనే చేయిస్తానని అభయమిచ్చారు. మేము సరే అని ఆ రోజు రూముకు వెళ్ళిపోయాము. తిరిగి తేది 14-08-2002 నాడు మరల ప్రారంభించుటకని డైరీఫాంకు వచ్చాము. స్థపతి మాత్రం రాలేదు. దాదాపు ఉదయం 9.30 గంటలకు మరల పూజ చేశాము. గునపముతో తవ్వాము. పారతో మట్టిని తీశాము. ఫోటోలు తీసుకున్నాము. ఏనుగుచే ఆశీర్వాదము చేయించుకున్నాము. స్వామివారిని మనసారా వేడుకున్నాము. "ఈ స్థూపము నాచే కట్టించి నన్ను తృప్తి పరచి మీరు మనసారా స్వీకరించండి ప్రభూ!" అని వేడుకున్నాను. కొండవైపు తిరిగి ఈ రకమైన ప్రార్థన చేశాను.

రెండవరోజు తవ్వడం చాలావరకు చేశాము. కట్టుటకు కావలసిన మెటీరియల్ అంటే స్టీల్, మెటల్, ఇసుక, ఇటుకలు, రాళ్ళు, సిమెంటు మొదలైనవి అన్నీ చేర్చాము. మేస్త్రీ దొరకక ఇబ్బంది పడ్డాము. కాని కొండారెడ్డి గారు మాత్రం మీరు తిరిగి హైదరాబాదుకు వెళ్ళండి, నేను ఆ స్థపతితో ఈ పనిని చేయిస్తాను లేదా వేరే మేస్త్రీతో అయినా చేయిస్తానని అన్నారు. నేను ఆయనకు ఖర్చుల క్రింద కొంత ధనము ఇచ్చి వచ్చాను.

ఈ స్థూప సంకల్పము నుండి పూర్తి అగువరకు అడుగడుగునా స్వామివారి లీలలు కనబడ్డాయి. ఒక్కొక్క లీలను వర్ణిస్తున్నాను.

ప్రతి సం॥ ఒక పండుగ చేయమని ఆదేశించుట

తేది 13-08-2002 మరియు 14-08-2002 రోజులలో శ్రీవేంకటేశ్వరజపస్థూపశంకుస్థాపనోత్సవములు తిరుపతిలోని టిటిడి డైరీఫాంలో జరిగాయి. తేది 15-08-2002 రోజున ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించాలనే ఉద్దేశ్యంతో నేను మరియు శ్రీ గవర్రాజు గారు కలిసి తెల్లవారు ఝాము 4.15 గంటలకు తిరుపతి నుండి బయలుదేరి 5.10 గంటలకు కొండపై వైకుంఠమునకు చేరుకున్నాము. మా వద్ద ఉన్న ఎ.ఎ.డి. (అప్పట్లో స్పెషల్ దర్శనము) టిక్కెట్స్‌కు ఉదయం 5.30 గంటలకు మాత్రమే ప్రవేశము కలదు. ఇంకా సమయము ఉంది

కావున నేను శ్రీ వరాహస్వామి వారిని దర్శించ తలచాను. శ్రీ గవర్రాజు గారు మాత్రం తాను నడవలేనని "నీవు వెళ్ళు, నేను ఇక్కడే ఉంటాను" అన్నారు. నేను ఒంటరిగా శ్రీ వరాహస్వామిని దర్శించుటకు వెళ్ళుచు వైకుంఠములోని మెట్లు దిగుచు శ్రీ వరాహస్వామి ఆలయం వైపు నడుచుకుంటూ ఒంటరిగా వెళ్ళుచున్నాను. అనుకోకుండా అక్కడున్న ఒకాయన నా వద్ద ఒక రూపాయి తీసుకుని స్వామివారి తిరునామమును నా నుదుటిపై పెట్టాడు. నేనప్పుడు నా ప్రభు యొక్క నామము మొదటిసారి ధరించానన్న సంతోషం మరీ మరీ ముగ్ధుణ్ణి చేసింది. చాలా మురిసిపోయాను. ఇంతలో ప్రక్క గోడపైన స్వామివారు తన భక్తుడైన బావాజీతో పాచికలు ఆడు దృశ్యమును చూచాను. వెనువెంటనే హృదయము నందు ఒక దృఢమైన సంకల్పము కలిగింది. నా ఒళ్ళు జలదరించింది. నా కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలేవిధంగా శరీరం పులకరించింది. "నేను సర్వము స్వామివారికి సమర్పించుకున్నానని మరియు తప్పక ప్రతి సంవత్సరం స్వామివారి గురించి లేదా ఆయన కార్యక్రమముల గురించి మంచి మొత్తంలో కొంత సొమ్మును వెచ్చించాలని మరియు ప్రతి సం॥ము ఒక పండుగ చేయాలి" అనే బలమైన హృదాయాంతర భావం పుట్టింది. ఈ కోరిక నెరవేర్చు ప్రభూ అని ఆ స్వామిని మనసారా ధ్యానించుకున్నాను.

పిదప శ్రీ వరాహస్వామివారిని దర్శించి నాకు కలిగిన కోరిక నెరవేర్చు ప్రభూ అని వేడుకున్నాను. తిరిగి వెనుకకు వచ్చేటప్పుడు స్వామివారికి టెంకాయ కొట్టి, కర్పూర హారతి ఇచ్చాను. (సం॥ 2004 ప్రాంతమున టిటిడి వారు ఆలయ ముందరి ప్లాన్‌ను మార్చారు) వెంటనే అక్కడున్న (ఇన్‌స్టెంట్) ఫోటోగ్రాఫరు నేను నామాలతో ఉన్న ఫోటోను స్వామి ఆలయ గోపురము వచ్చేలాగా తీసి నాకిచ్చాడు. ఆ సమయంలో స్వామివారు ఆదేశించిన ప్రతి సంవత్సరం ఒక పండగ చేయాలనే ఆలోచనతో పరవశించిపోవుచున్నాను. నేను దిగిన ఆ ఫోటోను శ్రీ గవర్రాజు గారు చూచి నవ్వి చాలా బాగుంది అన్నారు. (2002 సంవత్సరం నుండి ప్రతి జప పుస్తకం వెనుక ఇదే ఫోటోను ముద్రిస్తున్నాము).

ఆరోజు స్వామి నా హృదయములో ప్రతి సంవత్సరము మంచి మొత్తంలో ధనాన్ని ఖర్చు చేసి తిరుపతిలో ఒక ఉత్సవము చేయవలెననే కోరిక కలిగించాడు. ఆ ఖర్చు చేయు ధనము నానుండి నేరుగా స్వామికి మాత్రమే చేరవలెననే భావము కూడా కలిగింది. అంటే మధ్యవర్తులెవరూ ఉండకూడదని దీని భావం. ఈ భావన వచ్చిన తరువాత చాలా ఆలోచించాను. ఈ సంవత్సరం స్వామి కృప వల్ల మహామంత్ర స్థూప నిర్మాణంను చేస్తున్నాను. కాని దీనిని ప్రతి సంవత్సరం చేయలేను కదా, టిటిడి వారు సంవత్సరానికొకటి కట్టమనరు కదా? మరి ప్రతి సంవత్సరం ఇంత మొత్తం ఖర్చు చేసి ఒక ఉత్సవంను ఏ విధంగా చేయాలని ఆలోచించాను. శ్రీ గవర్రాజు గారికి కూడా ఈ విషయం చెప్పాను. ఆయన దీనిని తేలికగా తీసుకున్నారు. నేను మాత్రం స్వామి సేవ ఎలా చేయాలని తపించాను, మార్గం చూపుమని వేడుకున్నాను.

తరువాత తేది 16-08-2002 ఉదయం హైదరాబాద్ చేరుకున్నాము. తరువాత స్వామి స్థూప నిర్మాణమును

ఏ విధంగానైనా అత్యంత తొందరగా నిర్మించాలని స్వామివారిని ప్రార్థించసాగాను. పది రోజుల తరువాత 26-08-2002 నాడు టిటిడి వారి నుండి స్థూపనిర్మాణానికి తిరుపతికి రమ్మని మళ్ళీ పిలుపు వచ్చింది. ఈ పది రోజులలో ఎన్నో అనుకోని సంఘటనలు జరిగాయి. స్వామివారి మరో అద్భుత లీల ఒకటి 26-08-2002 నాటికి పక్వస్థితికి వచ్చింది. దాని గురించి వచ్చే భాగంలో తెలుసుకుందాము.

ఒక విశ్లేషణ : తేది 13-08-2002 నాడు ఎంతో ఇష్టంగా స్వామివారి స్థూప నిర్మాణమును చేయుటకు వచ్చిన స్థపతి చిన్న విషయానికి ఎందుకు జారుకున్నాడు? నీకు "స్కఫోల్డింగ్" తెలుసా? అనే మాట తప్పుకాదు, పైగ సారీ చెప్పినా మన్నించనంతటి తప్పు కాదు. స్వామి సేవను త్యజించునంతటి తప్పు అసలే కాదు. ఇందులో తప్పక శ్రీవేంకటేశ్వరుని లీల దాగి ఉంది. మేము మాత్రం ప్రారంభోత్సవమునకు తేది 21-09-2002 న ముహూర్తము నిర్ణయించి ఈ లోగా స్థూప నిర్మాణం పూర్తి చేయాలని ఆరాటపడుతున్నాము. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం పని జరగకుండా అడ్డు తగిలాడు. దీనికి బలమైన కారణం ఉంది. అది స్వామివారిని తృప్తి పరిస్తే తప్ప మా చేత తన పనిని చేయించుకోడు.

తిరమల శ్రీవేంకటేశ్వరుని సేవ చేయుట, అందునా స్వామివారు మెచ్చేవిధంగా చేయుట అత్యంత కఠినమైన పని. మనలో ఎంతో ఆర్తి ఉంటే తప్ప స్వామివారు స్వీకరించరు. ఇది స్వామివారు స్వయంగా సంకల్పించిన సేవ అయినప్పటికీ మాలో కొంత "ఆర్తి మరియు సమర్పణాభావం" తక్కువ ఉండటం వలన ఈ ఆటంకం కల్పించాడని భావించను. యోగ్యత సిద్ధించలేదు. దానిని పూరించుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మరో లీలను ప్రసరిస్తున్నాడు. అది నేటికి అంటే 25-08-2002 వరకు ఫలదీకరణ స్థితికి వచ్చింది. ఇది కేవలం ఒక లీల కాదు. కొన్ని లీలల సమూహంచే స్వామివారు ఆశించిన విధంగా ఫలవంతం అయింది.

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను తన దారి లోనికి తెచ్చుకొనుటకు ఆయా సందర్భాలలోని మా మానసిక స్థితికి అనుగుణంగా సామ దాన భేద దండోయాలను ప్రయోగించువారు. అలాంటి సంఘటన ఒకటి ఇప్పుడు జరిగింది. ఒకసారి మేము ప్రయాణించు మార్గములో ఒక సుడిగుండం పుట్టి మమ్మల్ని పైకి ఎగరేసుకుపోయింది. గాలిలో ఉన్న మేము ఈ సుడిగుండం ఎక్కడ పడేస్తుందోనని భయపడ్డాము. పట్టుకోటానికి ఏ ఆధారము దొరకలేదు. గజ గజ వణికాము. ఇలా మరణ అంచుల వరకు వెళ్ళాము. చివరికి శ్రీవేంకటేశ్వరుని శరణు వేడాము. రక్షించమని ప్రాధేయపడ్డాము. నీవు చెప్పినట్లు వింటామన్నాము. ఒట్టు వేశాము, నమ్మమని బ్రతిమిలాడాము. చివరికి దయామయుడైన స్వామి కరుణించి రక్షించాడు. ఈ లీలతో మాలో చాలా మార్పు వచ్చింది. మేము ఈ జీవితంలో శ్రీవేంకటేశ్వరుని సేవ చేయుటకే జీవించాలనే దృఢ సంకల్పం ఏర్పడ్డది. మరియు ఈ లీలలో ఒక వ్యక్తికి జబ్బు తగ్గుటకు డాక్టర్ విధించు "పత్యము" లాగా స్వామి సంకల్పము నెరవేర్చుటకు శ్రీవేంకటేశ్వరుడు మా జీవితానికి కొన్ని విధి విధానాలను విధించాడు. ఈ నియమాలు శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా కోరుకున్నప్పటికీ వీటిని మా ఇష్టపూర్వకంగా అత్యంత ఆర్తితో ఆ విధంగా జీవించుదుమని మేమే మాట ఇచ్చేవిధంగా పరిస్థితులు కల్పించబడ్డాయి. ఒకరకంగా ఈ లీల స్వామివారు ప్రసాదించిన సేవ అనే వృక్షానికి కాండం లాగా పనిచేసింది. (దీనిని వచ్చేభాగంలో చూద్దాం!)

మరో విశ్లేషణ : నా జీవితంలో 1.15 గంటలకు పైగా నిరాటంకంగా పరమానంద స్థితిని పొందిన సందర్భాలు మూడు. ఆనందబాష్పాలు పొందే స్థితి కంటే ఈ స్థితిలో ఎన్నోరెట్లు ఎక్కువ ఆనందం కలుగుతుంది. స్వామివారి కృపతోనే భక్తుడికి ఈ స్థితి లభిస్తుంది. ఆనంద తీవ్రతను ఆధారంగా ఈ మూడు సందర్భాలు ఇలా ఉన్నవి.

1. 2001 సంవత్సరంలో నేను సంపూర్ణ శరణాగతి చేసినప్పుడు అత్యంత పరమానందస్థితిని అనుభవించాను.

ఆనందమును భరించలేక ఒక ఉన్మాదిగ కేకలు వేశాను. మొత్తం గంటన్నర కాలం జరిగింది. ఇది మొదటిస్థానం ఇవ్వదగింది. ఈరోజు సాయిరెడ్డిగా నా జీవితం ముగించి శ్రీవేంకటేశ్వర పాదసేవకుడిగా మారిపోయాను.

2. జులై 2002 లో నా మొదటి పుట్టినరోజు పండుగ సందర్భంగా చేసిన పూజలో దాదాపు గంట పదిహేను నిముషాలు పరమానంద స్థితిని అనుభవించాను. ఇది రెండవస్థానం ఇవ్వదగింది. ఈరోజు నాకు స్వామివారి సేవ బహుమానంగా లభించింది.

3. జూన్ 2002లో తిరుమల ఆలయంలో స్వామివారి అభిషేకము చూస్తున్నప్పుడు కూడా పరమానంద స్థితిని పొందాను. గంట పదిహేను నిముషముల వరకు ఈ స్థితిని అనుభవించాను. ఇది మూడవ స్థానం ఇవ్వదగింది. ఆనందనిలయంలో స్వామివారి ముందు ఉన్నప్పటికీ తక్కువ ఆనందాన్ని పొందాను.

దీనిని బట్టి స్వామివారిని పొందుట కంటే కూడా ఆయన సేవలో ఎక్కువ ఆనందమును అనుభవించే విధంగా నా మూల ప్రకృతిని స్వామివారు ప్రసాదించారని గ్రహించాను.

నా దశ : స్వామివారి సేవకై తపించిపోయాను. ఆంజనేయుని లాంటి సేవను ప్రసాదించారు. కష్టతరమైన సేవకైన వెరవక స్వామి స్మరణతో, ఆయన శక్తితో చేయాలనుకున్నాను. 'సాయిరెడ్డి నావాడు' అనే పిలుపుకు ప్రతిగ నా జీవితాన్ని అంకితం చేసాను. తిరుపతిలో స్థూప నిర్మాణ భాగ్యం లభించింది. ప్రతి సంవత్సరం మంచి మొత్తం ఖర్చు చేసి ఒక పండుగను చేయమన్నారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

6వ భాగము

(ఆగస్టు 2002 - అక్టోబర్ 2002)

సం॥ 2002 నుండి హైదరాబాద్ వి.ఎస్.టి రోడ్డు విద్యానగర్‌లో, రోడ్డుకు 10 అడుగుల క్రింద మా ఆఫీసు ఉండేది. సం॥ 2007 మరియు 2009లో మూసినది పొంగటము వలన మా ఆఫీసు ఉన్న 'నాగమయ్యకుంట' ప్రాంతం పూర్తిగ నీటిలో మునిగిపోయింది. ఫలితంగా నా అనుభూతుల పుస్తకములు నానిపోయాయి. కొన్ని అనుభూతులు చదువుటకు వీలు పడని విధంగ ఉన్నవి. నేను చెప్పబోయె స్వామివారి లీలలు కూడ నానిపోయి చదువుటకు వీలు పడని స్థితిలో ఉంది, కాబట్టి ఆ లీల యొక్క లక్ష్యాన్ని మాత్రము చెప్పుతున్నాను.

గత రెండున్నర సం॥ల నుండి స్వామివారి లీలలను నేను మాత్రమే అనుభవిస్తున్నాను. ఫలితంగ స్వామిప్రభావము నాలో అధికంగ ఉంది. నా భార్య సురేఖ నన్ను మొదటి నుండి పరిశీలిస్తున్నప్పటికి ఆమె స్వయంగ స్వామి లీలలను అనుభవించలేదు. నా అంత ఆత్రుత, తపన ఆమెలో లేదు. ఈ లీలలో స్వామివారు నా భార్యను మార్చారు. నా అంతటి తపన ఆత్రుత కలిగే విధంగ చేసారు. కాని ఆ లీలలు నానిపోయి చదువలేని కారణంగ వివరించలేక పోతున్నాను. సురేఖకు కూడ ముందు భయముతో ప్రారంభమైన ఈ లీల తరువాత స్వామిపట్ల సంపూర్ణ శరణాగతురాలు అయ్యేట్లు చేసింది. క్లుప్తంగ ఆలీల ఈవిధంగ ఉంది.

శ్రీవేంకటేశ్వరుడు మాకు ఇష్టమున్న రంగాలలో సమస్యలను సృష్టించి, చివరికి వాటి నివారణకు సహకరించి, అత్యంత ఆప్తుడైనాడు. ఈలీలలో ఆమెకు ఇష్టమున్న కుటుంబ వ్యవహారాల్లో సమస్యలు సృష్టించబడ్డాయి. దీనికి తోడు ఆమె నిద్రించునప్పుడల్ల భయంకర స్వప్నాలు రాసాగాయి. ఫలితంగ తను మానసిక సంతులన కోల్పోయింది. దీని ద్వార నాకు శ్రీవేంకటేశ్వరుని స్మరణలో, ఆయనకు ఇష్టంగ సేవచేయాలనే కోరికకు అంతరాయమేర్పడింది. నీవు శ్రీవేంకటేశ్వరున్ని వేడుకొమ్మనే నా మాటను మొదట్లో సురేఖ పెడచెవిన పెట్టింది. కలలు యాదృచ్ఛికము కావని, వాటిని నమ్ముమనే నా మాటను వినలేదు. ఫలితంగ రోజు రోజుకు మరింత మానసిక సంతులన కోల్పోయింది. ఈ స్వప్నాల ప్రభావము వలన నిద్రించుట మానేసింది. శరీరం బరువెక్కింది. జీవితం అందోళనకరంగ తయారైంది. దీనిని గ్రహించి సురేఖకు ఎన్నో చెప్పాను. శ్రీవేంకటేశ్వరున్ని శరణు వేడమన్నాను. ఒక్కసారి నామాట వినుమన్నాను. దీనికి తోడు శ్రీవేంకటేశ్వరుని కొన్ని లీలల ద్వార ఆయనపై అమితమైన ప్రేమ ఏర్పడ్డది. ఏదో సాధించుటకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడు మమ్ములను ఉపయోగించుకుంటున్నాడనే నా మాటపై సురేఖకు విశ్వాసం ఏర్పడింది. అలసి

పోయింది కాబట్టి నేను చెప్పినట్లు వింటానన్నది. తేది 25-08-2002 వరకు పూర్తిగ మారిపోయింది. స్వామివారిని తృప్తిపరచుటకు ఏమని ప్రార్థించాలి అనే విషయమై నన్నడిగింది. నా మనసులో వచ్చే ఆలోచన ప్రకారం నేను ప్రార్థిస్తాను. నీవు కూడ ప్రార్థన సమయములో నీ మనసులో వచ్చిన ఆలోచన ప్రకారం ప్రార్థించమన్నాను. మరియు నా భార్యకు ప్రార్థన సమయాన తగిన అభిప్రాయము కలిగించమని శ్రీవేంకటేశ్వరున్ని నా తరఫున వేడుకున్నాను. అలా ఎన్నో రోజుల నుండి మా జీవితంలో సాగుతున్న తుఫాను అనే ఈలీల పక్వస్థితికి వచ్చింది.

పూర్వాంగనం:

అప్పటికే మేము తిరుపతిలో స్థూప నిర్మాణమునకని భూమి పూజ చేసి వచ్చాము. తిరుపతిలో స్థపతి దొరకనందున పనులు నిదానంగ జరుగుచున్నవి. శ్రీవేంకటేశ్వరుడు బహుశా తాను ప్రసరించుచున్న లీల పక్వదశకు వచ్చిందని భావించాను. మరోప్రక్క మమ్ములను రక్షించుటకు సిద్ధపడ్డాడు. ఈ రోజు రెండు కలలను ప్రసాదించారు. ఈ కలల అంతరంగం ఎంతో అద్భుతంగ భవిష్యత్తును సూచించే విధంగ ఉంది. ఈ రెండు కలలు ఒకటి నాకు మరోటి కి.శే. శ్రీ గవర్రాజు గారికి వచ్చాయి. ఈ రెండు కలలు ఈ విధంగ ఉన్నాయి.

నాకు వచ్చిన కల :

26-08-2002 ఇందులో నేను శ్రీవెంకటేశ్వర డైరీఫాంలో స్థూపాన్ని నిర్మించాలని అక్కడికి వెళ్ళాను. ఒక స్థలములో మేస్త్రీ ముగ్గు పోసి ఉన్నాడు. నన్ను దానిని చూచి చెక్ చేయమన్నాడు. డైరీఫాం డైరెక్టర్ శ్రీమాన్ కొండారెడ్డి గారు నా పక్కన ఉన్నారు. నేను దానిని చూచి బాగుందన్నాను. కాని ఆ మేస్త్రీ నాకు వేరే ఒక ప్లాన్‌ను చూపి (క్రింద చూపిన విధంగ) ఇది బాగుంటుంది కదా! అని అన్నాడు. నేను మాత్రం డబ్బులు ఎక్కువైనా పరువాలేదు స్థూపము చాల బాగుండాలన్నాను. చివరికి వారందరు ఇక ఈ స్థూపము పనులు చకచక జరుగును చూడండి అని అన్నారు.

కలలో మేస్త్రీ చూపిన ప్లాన్ (స్టార్ ఆకారంలో ఉంది. ✡)

ఇది నాకు వచ్చిన కల. దీనర్థం ఇప్పటినుండి స్థూప పనులు ఏ ఆటంకం లేకుండ జరుగునని అర్థం.

ఇది ఈ విధంగ ఉండగా 26-08-2002 రోజున ఉదయం 10.00 గం॥ల ప్రాంతమున శ్రీ గవర్రాజు గారు నాకు ఫోన్ చేసి తనకు రాత్రి కల వచ్చిందన్నారు.



కల : ఈ గవర్రాజు గారి కలలో, తిరునామాలతో ఒక అయ్యవారు వచ్చారట, ఆయన నన్ను వెంటనే తిరుపతికి పోమ్మని చెప్పారట. ఆయన అక్కడ స్థూపము కట్టుటకు మనుషులను సిద్ధంగా ఉంచాడట. మరియు ఈ ఆలస్యమునకు కారణము వేరేది ఒకటి ఉన్నదని, సాయిరెడ్డిని మాత్రం తొందరగ తిరుపతికి ప్రయాణము కమ్మని ఇది నేను చెప్పినానని సాయిరెడ్డితో చెప్పు అని అన్నాడట శ్రీగవర్రాజు గారు తన కనుల పొంటి నీరు కారుచుండగ ఒళ్ళు కంపించుచు గద్గద స్వరముతో నాతో చెప్పారు. ఈ కలను బలపరుస్తున్నట్లు. ఈ రోజు ఉదయము తిరుపతి నుండి శ్రీ కొండారెడ్డి గారు ఫోన్

చేసి తిరుపతిలో పనులు సరిగ కావటములేదు. కొత్త స్థపతి సిద్ధంగ ఉన్నారు. సాయిరెడ్డిని రేపే పంపండి అని ఫోన్‌చేసి చెప్పారట. ఈ విషయమును నేను మరియు నా భార్య వినగానే నివ్వెరపోయాము, ఆశ్చర్యపోయాము. మా సురేఖ నన్ను వెంటనే తిరుపతికి వెళ్ళమని చెప్పింది. అవసరమైతే కొన్ని రోజులు ఉండి స్థూప నిర్మాణము పూర్తిచేయమన్నది.

శ్రీగవర్రాజు గారు ఉదయం 11.30 ప్రాంతమున స్వయంగ మా ఇంటికి వచ్చి అత్యంత ఆత్రుతతో గద్గద స్వరములో ఒళ్ళు కంపించుచుండగ మళ్ళీ ఇదే విషయమును మా ఇద్దరి ముందు చెప్పాడు. నా కారణంగ రెండుసార్లు స్వామివారిని దర్శించే భాగ్యం కలిగిందన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. ఆ వచ్చిన అయ్యవారు చాల ఆత్మీయంగ మాట్లాడాడు. ఈ కట్టబోవు స్తూపము పేరుపైన ఒక సంస్థ భవిష్యత్తులో ఏర్పాటు అగునట. మంచి పేరు సంపాదించునట అని చెప్పుచు ఈ విషయాలు ఇప్పుడు నీకు అవసరము లేదు అని కూడ అన్నారట. ఈ గవర్రాజు గారి కల మా సురేఖపైన చాల ప్రభావము చూపింది. ముఖ్యంగ నేను శ్రీవెంకటేశ్వరునికి ఎంతో ప్రియమైన వాడిననే నమ్మకము కలిగింది. నేను నిన్న రాత్రి చెప్పినట్లు మా చేత ఏదో సాధించుటకు ఈ పనులు స్వామివారు చేయిస్తున్నారని స్పష్టంగా అర్థం చేసుకుంది. అంతే కాకుండ నేను ఇంతవరకు చెప్పిందంత నిజమేనని, అదంతా ఏదో సాధించుటకు స్వామివారి లీల అని దృఢంగ నమ్మింది. నాపై పూర్తి విశ్వాసము కలిగింది. తేది 26-08-2002 మధ్యాహ్నము, సురేఖలో చక్కని మార్పు కనబడ్డది. దీనిని చూచి నేను నా స్వామిని మరిమరి వేడుకొనుచు మీరు నిజంగ ఆపద్బాంధవులు, ఈ జగమంతటా ప్రతిక్షణం చూస్తున్నారు ప్రభూ! నా గురించి ఇంత పని చేసారా? అని అనుకున్నాను. అసలు స్వామి వారికి ధన్యవాదములు ఏవిధంగ చెప్పాలో తెలియలేదు. ఈ రోజంతా సురేఖ పశ్చాత్తాపం చెందింది. స్వామివారికి అత్యంత ఇష్టుడైన నన్ను నొప్పించానని, స్వామివారి సేవలో ఆటంకం కలిగించానని బాధపడ్డది. మొత్తం మీద ఈలీలలో మా శేషజీవితం స్వామివారికి అంకితం అనే దృఢాభిప్రాయం మా ఇద్దరిలో ఏర్పడ్డది.

సురేఖను కట్టడి చేయుట

తేది 27-08-2002 రోజున వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకుని తిరుపతికి పోవుచున్నాను, తేది 28-08-2002 రోజున ఉదయం 8.00 గం॥లకు రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ఉన్నాను. 8 AM కు ట్రైన్ రేణిగుంట నుండి తిరుపతికి బయలుదేరింది. 8.05కు నాకు గాఢ నిద్రవచ్చింది కూర్చుండియే నిద్రలోనికి జారుకున్నాను.

కల : ఈ లీలలో ఒక అజ్ఞాత భక్తుడు స్వామివారిని దీనాతిదీనంగా ప్రార్థిస్తున్నట్లు వినబడ్డది "ఓం నమో వెంకటేశాయ!!... ఓం నమో వెంకటేశాయ" అను శబ్దము ఎక్కడి నుండో వస్తుంది. ఇది చూచుటకు ఒక భక్తుడు అత్యంత దీనావస్థలో స్వామివారిని క్షమించమని వేడుకున్నట్లుగ ఉంది. ఎంతటి దీనావస్థ అంటే నా హృదయం ద్రవించింది. వెంటనే అంటే ఆ లీలలోనే నా స్వామివారిని వేడుకున్నాను. ఆ భక్తున్ని కరుణించమని వేడుకున్నాను. గం॥8.25కు తిరుపతి వచ్చింది నిద్రపోయి మెళకువ వచ్చింది. కల చెదిరింది. నేను ఈ చిత్రమును చాచి ఆశ్చర్యపోయాను. అసలు ఈ భక్తునికి నాకు సంబంధం ఏమిటి అని ఆలోచించాను. చివరికి శ్రీవెంకటేశ్వరుని లీలను అర్థంచేసుకొను శక్తి లేదని ఊరుకున్నాను. చిత్రమేమిటంటే సరిగ్గా అదే సమయములో, ఉదయం 8.05 నుండి 8.25 వరకు నా భార్య మా ఇంటిలో పూజా మందిరమునకు వెళ్ళి నా వలన సాయిరెడ్డి మనస్సు బాధ కలిగింది. దీనితో మీ పనికి కొంత అంతరాయము ఏర్పడింది. దీనికి నన్ను క్షమించు అని కోరుకున్నదట. స్వామిని 'ఓం నమో వెంకటేశాయ' అంటూ పలుమార్లు వేడుకున్నదట. అంతే కాకుండ నేను సాయిరెడ్డి మాటలను విశ్వసించలేదు, అవమానించాను అందుకు క్షమించమని ప్రార్థించిందట. "ఇక నుండి ఈ జీవితాంతం వరకు



సాయిరెడ్డి ప్రతి మాటకు విలువనిచ్చి దాని ప్రకారం నడుచుకుంటాను. ఆయన మాటకు అడ్డురాను, ఇతరుల మాటలను పట్టించుకోను, పూర్తిగ సహకరిస్తాను. ముఖ్యంగ అది శ్రీవెంకటేశ్వరుని మాట అనిగాని, సేవ అనిగాని అయినప్పుడు మరీ జాగ్రత్తగ ఉంటాను, చెప్పినట్టు వింటాను ఎదురుతిరగను" అని స్వామివారి పైన ప్రమాణము చేసిందట. తేది 28-08-2002 రాత్రి 9.30కు ఫోన్ చేసి సురేఖతో నేను మాట్లాడుతున్నప్పుడు నాకు రెణిగుంటలో జరిగిన సంఘటన గురించి చెప్పాను. అప్పుడు ఆమె తను ఆ సమయాన స్వామిని దీనంగ వేడుకున్న విషయం, భవిష్యత్‌లో నా మార్గానికి అడ్డురానని, సహకరించుదునని, ప్రమాణం చేసిన మొత్తం విషయం నాతో చెప్పింది. స్వామివారిని దీనాతిదీనంగా ప్రార్థించిన భక్తురాలు నా భార్య సురేఖనేనని ఇద్దరము నిర్ణయించుకున్నాము. ఈ విధంగ తిరుమల శ్రీవెంకటేశ్వరుడు ఈ లీలతో నా భార్యను నేను చెప్పినట్లు వినుచు, ఎలాంటి అడ్డుచెప్పకుండ సహకరించునట్లు కట్టడిచేసాడు. ఈ విధంగ నేను, నా భార్య ఇద్దరము స్వామివారి సేవ చేయుటకు అత్యంత ఆర్తితో ఉన్నప్పుడే తిరుపతి పొలిమేరలోనికి ప్రవేశించాము. ప్రవేశించుటకు స్వామి అనుమతించారు. ముందు తేది 14-07-2002 నాడు నేను మాత్రమే స్వామి సేవకై ఆర్తితో ఉన్నాను నా భార్య లేదు కాబట్టి తగిన పనివారు దొరకలేదనే నెపముతో స్వామి సేవలో ఆటంకమేర్పరచారు. కాని తేది 26-08-2002 రోజున వచ్చిన లీలలో ఆటంకము తొలిగిపోయిందని, ఇక స్థూప పనులకు ఏలాంటి ఆటంకాలు లేకుండ చక్కగ జరుగునని కూడ తెలిపారు. ఇలా మేమిద్దరము తిరుమల శ్రీవెంకటేశ్వరుడు చూపు లీలల ప్రకారము నడుచుకుందుమని ప్రమాణం చేసిన తరువాత స్వామి సేవాభాగ్యం లభించింది.

శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞ ప్రకారం తేది 28-08-2002 నుండి 5 రోజులు, 01-09-2002 వరకు తిరుపతిలో దగ్గరుండి స్థూపనిర్మాణ పనులను చేయించాను. ముందు బావిలాగ ఒక గొయ్యి త్రవ్వి చుట్టూ బేస్‌మెంటు మరియు బ్రిక్కువర్క్ వరకు పూరించాము. మిగతా పనిని అక్కడి మేస్త్రీకి చెప్పి రోజు నేను ఫోన్‌లో మాట్లాడెదనని చెప్పి తిరిగి హైదరాబాద్ వచ్చాను. కాని తేది 06-09-2002 నాడు మళ్ళీ కొండారెడ్డిగారు తిరుపతి నుండి ఫోన్ చేసి పనులు సరిగా జరుగత లేవు. పనివారు సరిగా చేయుట లేదు నీవు రావలసిందని అన్నారు. నేను వెంటనే 07-09-2002 నాడు తిరుపతికి వెళ్ళాను. మనస్ఫూర్తిగ స్థూపనిర్మాణ పనులను చూచుకున్నాను. వినాయక చవితి రోజున అనగా 10-09-2002 నాడు నేను తిరుపతిలో ఉండి ఉదయం శ్రీకపిళేశ్వర ఆలయమునకు పోయి వినాయకునికి మరియు శివునికి చేయు అభిషేకమును చూచాను. తిరిగి ఆ రోజు శ్రీకొండారెడ్డిగారు ఇంటికి భోజనమునకు ఆహ్వానించినను వెళ్ళక తిరుమల కొండపైకి వెళ్ళి స్వామివారిని దాదాపు 20 ని॥లు దర్శించుకున్నాను. నన్ను ఎవ్వరు కూడ బయటకు వెళ్ళమని అనలేదు. బహుశా స్వామివారు నన్ను అదృశ్యరూపునిగ తన గర్భగుడిలో పెట్టుటచే అంతసేపు దర్శించుకున్నానని భావించాను. చివరికి నేనే వేరేవారికి స్వామిని దర్శించుటకు వీలు కల్పించాలని తలంచి బయటకు వచ్చాను. ఈ సారి స్వామివారిని చూచినప్పుడు తృప్తిచెందాను. స్వామివారు సకల ఆభరణాలతో ఉన్నారు. వారి అభయహస్తము నుండి కాంతి కిరణాలు చకచకమని నావైపు వచ్చుటను నేను బహు బాగా చూచాను. ఆ కాంతికిరణాలు నా మనస్సులో ఎప్పటికి చెదిరిపోని విధంగ ముద్రించుకున్నవి.

తెల్లవారి ఉ॥ 9.30 నుండి తిరిగి స్థూపపనులు చిత్తశుద్ధితో చేస్తాము. ప్రతిక్షణము ఆ శ్రీహరినే స్మరించాను. సాయంత్రము 7 P.Mకు పని విరమించగానే హోటల్‌కు పోయి స్నానము చేసేవాడిని తిరిగి సాయంత్రము 8 గం॥లకు అలిపిరి దగ్గరున్న స్వామివారి పాదాల మండపమునకు పోయేవాడిని స్వామి పాదాలపై పడి స్మరిస్తూ ఏడ్చేవాడిని అక్కడే గంటన్నర సమయము గడిపి 10.30కి హోటల్‌కు పోయి పడుకునేవాడిని. ఈ విధంగ స్థూపనిర్మాణ పనులు స్వామి కృపతో అత్యంత వేగంగ చక్కగ జరుగుచున్నవి. ఇలా ఒక వారము రోజులు తిరుపతిలో స్థూపనిర్మాణ పనులను చూచుకొన్నాను. చివరికి తేది 13-09-2002 సాయంత్రము బయలుదేరి తేది 14-09-2002 నాడు హైదరాబాద్ వచ్చాను. మా ఇంటిలో భార్యను, పిల్లలను చూచాను. అందరు సుఖంగానే ఉన్నారు. స్వామివారికి ధన్యవాదములు తెలుపుకున్నాను. సురేఖను మార్చిన లీల ఒక భయము ఒక సంతోషము కలిపి మా జీవితంలో మరచిపోలేని విధంగ చేసింది. దీని ద్వార స్వామివారు తనకు కావలసింది నెరవేర్చుకున్నారని అనుకున్నాను. ఇక భయము లేదని, మా సురేఖ మానసికంగ చక్కగ ఉన్నదని నమ్మి సంతోషంగ ఉన్నాము. కాని ఆ తుఫాను నుండి భయంకరమైన సుడిగుండం పుట్టుకొస్తుందని ఊహించలేక పోయాము.

సుడిగుండం పుట్టుట, జీవితానికి విధివిధానాలు విధించుట

అప్పుడు మేము దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనిలోని వెంకటగిరి రెసిడెన్సీ అనే అపార్టుమెంటులో 4వ అంతస్థులో ఉంటున్నాము. ఆ రోజు రాత్రి భోజనము చేసి దాదాపు 10.0 గ॥ల వరకు టి.వి ముందు మేమిద్దరము కూర్చిండి నవ్వుచు మాములుగానే ఉన్నాము. మా పిల్లలు పడుకున్నారు. నేను తిరుపతిలో ఒక వారం ఉన్నాను కాబట్టి అలసిపోయాను. నాకు నిద్రవస్తుంది. దాదాపు గ॥ 10.30 ని॥లకు బెడ్‌రూంలోనికి వెళ్ళి పడుకున్నాను. అలసిపోయాను కాబట్టి వెంటనే గాఢనిద్రలోనికి జారుకున్నాను. నాకు మధ్యలో లేచే అలవాటు కూడ లేదు. కాని నన్ను ఆ రాత్రి ఎవ్వరో దాదాపు 11.30 కు ల్లే... వుమంటు అత్యంత గట్టిగ పైన చెత్తు ఎగిరిపోయెటంత గట్టి శబ్దము చేస్తు లేపారు. ఈ శబ్దానికి ఉలిక్కిపడి లేచాను. ప్రక్కన చూచాను సురేఖ లేదు. బెడ్‌రూం తలుపు, బెడ్‌రూంకు ఉన్న బాల్‌కనీ తలుపు తీసి ఉంది వెంటనే అనుకోకుండ బాల్‌కనివైపు వెళ్ళాను. అక్కడి దృశ్యాన్ని చూచి భయముతో

వణికిపోయాను. చూచేసరికి సురేఖ ముఖము సింహములాగా ఉంది. ఆమె ఈ క్షణము తనకు ఆఖరు క్షణములాగ భావించింది. అప్పుడు ఆమె బెడ్‌రూం బాల్‌కనీ రేలింగు ఎక్కి ఆత్మహత్య చేసుకొనుటకు క్రిందికి దూకపోవుచున్నది. నేను వెళ్ళి ఆమె చేయి పట్టి లోనికి గుంజి ఆపాను. ఒక్క సెకను ఆలస్యమైనా ఆత్మహత్య చేసుకునేది. ఆమె ఎగపోస్తున్నది. మనిషిలాగ లేదు. ముఖము సింహంలాగ ఉంది. పూనకము వచ్చిన దానిలా భయంకరంగ ఉంది. తనకు, ఈ ప్రపంచమునకు ఎలాంటి సంబంధము లేనిదానిగా ఉంది. ఆమె ముఖమును చూడగానే భయం వేసింది. ఆమె ముందు హాలు బాల్‌కనీలో నుండి క్రిందికి దుంకుటకు ప్రయత్నించిందట. కాని క్రింద కొన్ని చెట్లు ఉండుట వలన అక్కడ దూకుతే ఆ చెట్లు తాకి ప్రాణంపోదని గ్రహించి ఈ బెడ్‌రూం బాల్‌కనీని ఎంచుకున్నదట. కాని స్వామివారు నన్ను ఆ క్షణములో లేపి ఏమికాకుండ చేసారు. నేను ఈ పరిణామమునకు భయముతో వణికిపోయాను. అసలు ఏమి జరుగుతుంది? ఎందుకు జరుగుతుందో తెలియదు. చాల సేపు భయముతో వణికిపోయాము. ఈలోగ సురేఖ కొంత తేరుకున్నది. ఎందుకిలా చేసావని అడిగాను. అందుకు ఆమె ఏమో నాకు తెలియదు నా మనస్సులో ఏదో అయ్యింది సడెన్‌గా నాకు ఏదో గుర్తుకొచ్చి ఇక ఈ జీవితము వద్దనిపించింది. అందుకే ఇలా చేసానన్నది. మరి నీవెలా లేచావన్నది. ఒకసారి నిద్రపోతే మధ్యలో లేవవు, నిన్ను ఎవ్వరు లేపలేదు కదా, ఏలా లేచావన్నది. ఎవ్వరో లేపారనే నా జవాబుకు ఆమెకూడ ఆశ్చర్యపోయింది. మరియు ఆమె మానసికంగా బాగానే ఉన్నది. అందులో సందేహంలేదు. కాని ఈ ఘటన ఏలా జరిగింది? ఎందుకు జరిగింది? తెలియదు, నా సేవలో ఏమైన లోపం జరిగిందా? అని పరిపరివిధాలుగ ఆలోచించాను. నాకు తెలిసి ఎక్కడా లోపం కనబడలేదు. అత్యంత భక్తిశ్రద్ధలతో చిన్నపాటి తప్పు జరుగకుండ తిరుపతిలో స్థూపనిర్మాణం చేస్తున్నాను. మరింత డబ్బు ఖర్చు పెట్టి అత్యంత సుందరంగ స్థూపనిర్మాణము జరగాలనే ఉద్దేశ్యముతోనే ఉన్నాను తప్ప డబ్బు విషయంలో కక్కుర్తి పడుటలేదు. ప్రతిక్షణం స్వామివారిని స్మరిస్తూ కాలం గడుపుతున్నాను. లోపం ఎక్కడో తెలియలేదు. చివరికి ఒక రెండు గంటలు మాట్లాడి అంతా సర్దుకున్న తరువాత తిరిగి పడుకున్నాము.

తెల్లవారి ఈ విషయమై తీవ్రంగ నాలో నేను చర్చించుకున్నాను. రోజు మొత్తం ఆలోచించాను. సురేఖకు హాని జరిగేవిధంగ చేసాడు కాని మళ్ళీ నాచే రక్షింపచేసాడు. ఈ రెండు పనులు స్వామివారే చేసారు. చివరికి ఇది నన్ను మార్చుటకేనేమో అనే ఒక ఆలోచన వచ్చింది. ఎందుకంటే నా భార్యకు ఏమైన జరుగుతే నష్టం నాకే కాబట్టి నన్ను మార్చుటకే ఈ విధంగ జరిగిందనిపించింది. కాని ఏం మారాలి? తెలియదు, ఆరోజు ఇంటికి పలుమార్లు ఫోన్ చేసి నా భార్య ఎలా ఉందో తెలుసుకున్నాను. నేను ఆఫీసులో కాని వర్కు దగ్గరకాని ఉన్నప్పుడు మనస్సు ఇంటిపైననే ఉండేది. ఈ సంఘటన మళ్ళీ జరుగకూడదని స్వామివారిని ప్రార్థించాను. నా నుండి స్వామివారు ఏమి ఆశిస్తున్నారని పరిపరివిధాలుగ ఆలోచించుకున్నాను. మార్గం సూచించమని, నేను దేనికైన సిద్ధం అని స్వామివారిని ప్రార్థించాను. ఆ రోజు మధ్యాహ్నం ఇంటిలో భోజనం చేసి కూర్చొన్నాము.

ఉన్నటుండి సురేఖ తన ప్రవర్తనను మార్చుకుంది. నావైపు సింహంలా చూస్తుంది. హూంకరిస్తుంది. పూర్తిగ మరో ప్రపంచములో ఉంది. తాను ఏమిచేస్తుందో తనకు తెలియుట లేదు. ఆమె ఆకారాన్ని, హూంకరించుటను చూచి భయపడ్డాను. రాత్రి కంటే రెట్టింపు కోపంతో రెట్టింపు వేగంగ ఉంది. మేము మధ్యాహ్నము పండ్లు కోయుటకు పెట్టిన ఒక కత్తి ఆమెకు దగ్గరలో ఉన్నది. సురేఖ నావైపు పిచ్చిపిచ్చిగ చూస్తూ, హూంకరిస్తుంది. ఆ కత్తిని తీసుకొని తన కడుపులో బలంగ పొడుచుకొనుటకు ప్రయత్నించింది. ఈ పరిణామానికి వణికిపోయాను. పరుగెత్తి ఆమె చేతిలోని కత్తిని లాక్కున్నాను. ఆమె కనుగుడ్లు పెద్దగ చేసి హూంకరించుచు, నా వైపు చూచింది. ఆమె తన తలను ప్రక్క గోడకు కొట్టుకొనుటకు సిద్ధంగ ఉన్నదని ఆమె చూపు ద్వార గ్రహించాను. ఏమి చేయాలో తెలియలేదు. వెంటనే శ్రీవేంకటేశ్వరున్ని శరణు వేడాను, క్షణం ఆలస్యం చేయకుండ రక్షించమని దీనాతిదీనంగ వేడుకున్నాను.

మీకు కావలసింది ఇచ్చుటకు సిద్ధంగ ఉన్నానన్నాను.

చివరికి నా మనస్సులో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. స్వామివారికి నానుండి ఏమి కావాలో కోరుకొమ్మంటు ఒక్కొక్కటి అడిగాను. నేను నా జీవితంలో ఏ తప్పుచేయకుండ ధర్మబద్ధంగ నడుచుకుంటానన్నాను. వెంటనే సురేఖలో కొంత మార్పు కనబడ్డది. హూ... అంటూ ఆగిపోయింది. రెండు సెకండ్లు ఆగి మళ్ళీ మొదటికొచ్చింది. ధర్మబద్ధజీవితంతోపాటు మరేదోకావాలని స్వామివారు కోరుకుంటున్నారని అర్థంచేసుకున్నాను. ఉగ్రరూపంలో ఉన్న నరసింహస్వామిని బ్రహ్మాదిదేవతలు రకరకాలుగ శాంతింపచేయుటకు ప్రయత్నించినట్లు నేను ప్రయత్నించాను. నాకు తెలిసిన అన్ని సదాచారాలను బట్టీపట్టినట్లు చదువుచు, ఏ సదాచారం చదివినప్పుడు సురేఖ ముఖములో మార్పు కనిపిస్తుందో దానిని గుర్తుపెట్టుకొనుచు, ముందుకెళ్ళాను. స్వామివారు ఒప్పుకున్న వాటిలో అత్యంత ప్రధానమైనవి మేము ధర్మబద్ధంగ జీవించుట. ఎలాంటి ఆర్భాటాలు లేకుండ అత్యంత అల్పునిగ జీవించుట, మొదలగునవి. జీవితాంతం సేవ చేస్తానన్నాను. కాని ఇంకా శాంతించలేదు. డబ్బులకు వెరవక మీ సేవలో ఎలాంటి లోపము రానీయనన్నాను. కాని శాంతించ లేదు. మరేదో తెలియంది కావాలనిపించింది. చివరికి మీరే చెప్పండి ప్రభూ! అని దీనంగ వేడుకున్నాను. వెంటనే 'వ్యాపారం వద్దు' నీవు 'చేయలేవు' అనే భావన మనసుకు వచ్చింది. ఆ సమయంలో ఉగ్రరూపములో ఉన్నారని గ్రహించి వెంటనే భయంతో సరే అని ఒప్పుకున్నాను. ఆ తరువాత సురేఖ శాంతించింది మామూలుగ మారిపోయింది. ఈ విధంగ ఎందుకు జరుగుచున్నది? అసలు స్వామివారికి ఏమి కావాలి? అనేది ఆశ్చర్యమేసింది. మిమ్మల్ని సదా స్మరిస్తూ, మీ సేవలో డబ్బుకు వెరవను అన్నా వినలేదు పైగ వ్యాపారము వద్దన్నాడు. ఈ విచిత్రమైన కోరిక నన్ను ఆశ్చర్యములో పడేసింది. మరోప్రక్క భయము ఆవహించింది. కాళ్ళు చేతులు వణుకుచున్నవి ఏమిచేయాలో తోచలేదు.

ఆ తరువాత నాది నేను ఇలా ఆలోచించాను. వ్యాపారం చేయకుంటే ఎలా జీవించాలి. నీవు వ్యాపారం "చేయలేవు" అని అన్నారు ఈమాట నాకు ఆశ్చర్యమేసింది. ఇప్పుడు తిరుపతిలో స్థూపం కడుతున్నానంటే ఆ డబ్బును నేను వ్యాపారంలో సంపాదించిందే అని నా మనసులో నేను అనుకున్నాను. కాని భయముచే వెంటనే ఈ విషయము స్వామివారికి తెలువకుంటే బాగుండుననుకున్నాను. భయపడ్డాను. వ్యాపారం చేయలేవు అనే దానికి అర్థం–నీవు వ్యాపారం చేసినట్లైతే నేను చేయనివ్వనని అర్థం. చివరికి ఆరోజు గడిచింది. ప్రశాంతంగ ఉన్నాము. తెల్లవారి మళ్ళీ నా మనస్సులో వ్యాపారం చేయాలని కోరిక పుట్టింది. దీనిని గ్రహించి మళ్ళీ సురేఖ హూంకరించుట మొదలు పెట్టింది. కనుగుడ్లను త్రిప్పుచు భయపెట్టింది. మళ్ళీ ఎదో అఘాయిత్యము చేసుకొనుటకు సిద్ధంగ ఉన్నట్లు అనిపించింది. ఇది నన్ను మార్చుటకు శ్రీవేంకటేశ్వరుని లీలనే అని దృఢ విశ్వాసము ఏర్పడ్డది. ఒకరకంగ స్వామివారు సురేఖను ఆవహించి ఈ పని చేస్తున్నారని గ్రహించాను వెంటనే శ్రీవేంకటేశ్వరుని శరణువేడాను. భోరున విలపించాను. క్షమించమని వేడుకున్నాను. గజగజ వణికిపోయాను.

చివరికి ప్రార్థనాపూర్వకంగ ఇలా అన్నాను "ప్రభూ! నేను మీభక్తున్ని, మీరు నన్ను భయపెట్టుచు చెప్పవలసిన పనిలేదు. మీరు ఆజ్ఞాపిస్తే దేనికైనా సిద్ధం." అని వేడుకున్నాను. నేను భయపడుతున్నాను, దయచేసి శాంతించమన్నాను. ఈ జీవితంలో మీరు చెప్పింది చేస్తానన్నాను. ప్రమాణం చేసాను. సదా మీ వాడిగ జీవించుదునని పదేపదే చెప్పాను. సాష్టాంగ నమస్కారము చేసి వేడుకున్నాను. చివరికి ఒక విన్నపము ప్రభూ అంటూ నా కోరికను చెప్పాను. "నేను అత్యంత దీనావస్థలో హైదరాబాద్ వచ్చాను. పిల్లలు చిన్నవాళ్ళు, వారికి విద్యాభ్యాసము చేయించవలసి ఉంది, మరియు నాకు వ్యాపారమంటే ఇష్టము కాబట్టి మా కుటుంబ పోషణార్థమై కొన్ని రోజులు వ్యాపారానికి అనుమతించండని వేడుకున్నాను. వెంటనే "కేవలం కొన్ని రోజులు మాత్రమే అది కూడ

మీ కుటుంబ పోషణార్థం వరకే ఉండాలనే" నియమంతో అనుమతించుచున్నట్లు హృదయాంతరంగ భావాన్ని కలిగించాడు.

ఈ విధంగ శ్రీవేంకటేశ్వరుడు మేము జీవించుటకు మా జీవితానికి విధివిధానాలు, మార్గదర్శకాలు విధించారు. ఈ ఘటన తరువాత చాలవరకు శాంతించారు. కాని ఎప్పుడైన నా మనస్సులో పాత భావాలు వచ్చినప్పుడు మళ్ళీ సురేఖ ఉగ్రరూపం దాల్చేది. వెంటనే నా మనస్సు నుండి ఆ భావాలను తీసివేసి స్వామిని ప్రార్థించేది. ఇలా దాదాపు నాలుగైదు నెలల వరకు జరిగింది. అంటే నేను స్వామి ఆదేశించినట్లు నడుచుకుంటానంటే బాగుండేది, లేదు నా ఇష్టం అనే భావం మనస్సున రాగానే సురేఖలో మార్పు కనబడేది. తరువాత భయంచే స్వామి చెప్పినట్లు అలవాటుపడిపోయాము.

ఇప్పుడు స్వామివారి పైన ప్రేమతో పాటు భయము కూడ ఏర్పడ్డది. మరోప్రక్క అసలు ఇది ఎందుకు చేస్తున్నారో అర్థం కాలేదు. స్థూపనిర్మాణానికి దీనికి సంబంధం అర్థం కాలేదు. అర్థం పర్థం లేని లీలగ భావించుకున్నాము. భయముచే స్వామి చెప్పినట్లు మసులుచున్నాము. చివరికి ఈ లీల స్వామి ప్రసాదించిన సేవ అనే వృక్షానికి కాండం లాగ పనిచేస్తుంది.

శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం

తేది 21-09-2002న స్థూపము మరియు 22-09-2002న "గోసంరక్షణ ట్రస్టు" ప్రారంభోత్సవాలు ఉన్నవి కాబట్టి డా॥ కొండారెడ్డిగారి అభ్యర్థన ప్రకారం 3 రోజుల ముందే అక్కడి పనులు చూచుకొనుటకు తిరుపతికి బయలుదేరాను. తెల్లవారి గోశాలకు వెళ్ళి స్థూపానికి సంబంధించిన పైపై పనులు చేయించాను. ఆరోజు స్థూపానికి సున్నం వేసి మరునాడు అంటే 20-09-2002 నాడు కలరు వేసి ఇది "శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము" అని నాలుగు ప్రక్కల వ్రాయించాను. ఈపేరు ఆరోజు మాత్రమే నా మనస్సుకు వచ్చింది. వెంటనే డా॥ కొండారెడ్డిగారి అనుమతితో ఈ పేరును స్థూపానికి నాలుగు ప్రక్కల వ్రాయించాను. అప్పుడు ఆ స్థూపాన్ని కనులార చూచి చాలచాల ఆనందించాను. 20-09-2002 సాయంత్రము దాదాపు 4.30 ని॥లకు నేను మరియు డా॥ కొండారెడ్డిగారు కలిసి స్థూపములోనికి దిగి బ్రాహ్మణులు మంత్రోచ్చారణ చేస్తుండగ ఐశ్వర్య మహామంత్రములతో లిఖించిన స్వామివారి రాగి ఫలకను ఎడమ గోడకు, తూర్పుముఖముగ బిగించాము. పిదప టెంకాయ కొట్టి పూలు సమర్పించి హారతి ఇచ్చి మనసార స్వామిని వేడుకున్నాము. ఈవిధంగ స్థూప పనులు చక్కగ జరిగి అనుకున్నట్లు ప్రారంభోత్సవమునకు సిద్ధంగ ఉంది. ఈ స్థూపాన్ని చూచిన ఎంతోమంది చక్కగ ఉన్నదన్నారు. ఇంత తొందరగ పూర్తి కావటం స్వామివారి కృపే కారణమన్నారు. నేను తిరుపతిలో స్థూపనిర్మాణ పనులను చేయు సమయమున ఒకటి గ్రహించాను. టి.టి.డి ఎక్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుని ప్రతినిధిగ భావించాలి. ఆయన మాటను స్వామివారి మాటగ భావించాలి. ఈ.ఓ గారు వచ్చిన ప్రతి సమావేశం సఫలమైందని అనుకోవాలి. ఈ

భావాలు నా మనస్సులో బలంగా నిలిచాయి.

శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప ప్రారంభోత్సవం:

21-09-2002 : ఈ రోజు నా జన్మలో ఒక మరపురాని రోజు. నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని మహామంత్రమును సమర్పించుటకు నిర్మించబడిన "శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము" ను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్మించి, ఆయన పాదపద్మములకు సమర్పించిన రోజు. మరియు "శ్రీవేంకటేశ్వర, శ్రీనివాస ఐశ్వర్య మహామంత్రము" లను నాచే కట్టించబడ్డ ఈ స్థూపములో స్వామివారికి నిక్షేపము చేసిన రోజు. భగవంతుడు ఈ జన్మను ప్రసాదించింది ఇందుకే అని భావించిన రోజు. ఈ కార్యక్రమము ఇలా జరిగింది.

తేది 21-09-2002 : తిరుపతిలోని భీమాలాడ్జి నుండి నేను, శ్రీగవర్రాజుగారు మరియు హైదరాబాద్ నుండి వచ్చిన భక్తులు ఉదయం 5.15 ని॥లకు బయలుదేరి శ్రీవేంకటేశ్వర డైరీఫాంకు 5.30కి చేరుకున్నాము. అంతకు ముందే అక్కడ హోమగుండము సిద్ధము చేసారు. స్థూపానికి పూలతో చక్కని అలంకరణ జరిగింది. హోమము ఉదయము 5.30 ని॥లకు స్థూపము ఎదురుగ మొదలైంది. నేను పట్టు వస్త్రములు ధరించి నా స్వామిని ధ్యానిస్తూ ఇతరులతో పాటు హోమములో కూర్చున్నాను. 3 కోట్ల జపమును స్థూపము సమీపములో పెట్టాము. నా భార్య సురేఖ, అదే రోజు ఉదయం తిరుపతికి వచ్చి, 9.0 గం॥ల ప్రాంతమున పూజ దగ్గరికి వచ్చింది. అక్కడ చేస్తున్న శ్రీశ్రీనివాస ఐశ్వర్య మహామంత్ర సేవలో ఇద్దరము పాల్గొన్నాము. దాదాపు 11 గం॥ల ప్రాంతమున అప్పటి టి.టి.డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీమాన్ పి. కృష్ణయ్యగారిని తోలుకొని డా॥ కొండారెడ్డిగారు వచ్చారు. వారికి మేళతాళాలతో వేదమంత్రాలతో స్వాగతము పలికినారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకృష్ణయ్యగారు స్థూపాన్ని ప్రారంభించుటకు, మరియు స్థూపములో జపమును సమర్పించుటకు వచ్చారు. వారు వచ్చిన పిదప స్థూపమును చూచారు. చాల సంతోషించారు, ఒక రకంగా పొంగిపోయారు. డా॥ కొండారెడ్డిగారు నన్ను ఈ.ఓ గారికి పరిచయము చేసారు. పిదప స్థూపము చుట్టు ఈ.ఓ గారు మరియు మేము అందరము ఒక ప్రదక్షిణ చేసాము. తరువాత ఈ.ఓ గారిని స్థూపాన్ని ప్రారంభించవలసిందిగ కోరాము. కాని ఆ క్షణము స్వామివారు ఒక అద్భుతమైన చమత్కారమును చూపారు. నా జన్మను ధన్యము చేసారు. ఆయన భక్తులను మరచి ఉండరని నిరూపించారు. మనము ఒక రూపాయి ఖర్చుచేస్తే ఆయన కోటి రూపాయల విలువగల మహాభాగ్యమును ప్రసాదించునను మాట నిజం చేసాడు. నాయందు ఆ దయామయునికి ఉన్న ప్రేమను నిరూపించారు. నాకు జన్మజన్మల భాగ్యమును ప్రసాదించారు. ఇది

నేను కలలో కూడ ఊహించలేదు. జరిగింది ఏమిటంటే! ఈ.ఓ గారిని స్థూపము ప్రారంభించమని కోరగా ఆయన నిరాకరించి దానిని నన్ను ప్రారంభించమని అన్నారు. అందుకు నేను సవినయంగా దానిని మీరే ప్రారంభించాలి అన్నాను. దానికి ఆయన ఒప్పుకోలేదు. నన్నే ప్రారంభించమని కోరారు. అందుకు నేను మరల నిరాకరించాను. అప్పుడు ఆయన కొంచెం కోపముతో నీవే ప్రారంభించు అని అనుచు నా భుజము పట్టి ముందుకు నెట్టాడు. అప్పుడు నేను చేసేదిలేక నా శ్రీవేంకటేశ్వర స్వామివారిని మనసార తలచుకొన్నాను. ఈ స్థూపాన్ని నాచే కట్టించి నాచేతనే ప్రారంభించుచున్నావా స్వామి అని తలచుకున్నాను. ఈ స్థూపాన్ని మీరు తప్పక స్వీకరించవలె ప్రభూ అని ఆయన్ను మనసార మరొక్కసారి తలచుకొన్నాను. ఆ సమయంలో అప్రయత్నంగ మా తల్లితండ్రులకు నమస్కరించాను. చివరికి శ్రీవేంకటేశ్వరున్ని స్మరిస్తూ స్థూపాన్ని ప్రారంభించాను. పిదప మేము అందరము అంటే నేను, ఈ.ఓ శ్రీమాన్ కృష్ణయ్యగారు, డా॥ కొండారెడ్డి గారు, గవర్రాజుగారు కలిసి స్తూపము ముందు ఫోటోదిగాము. హారతి ఇచ్చాము. ఆ స్థూపానికి మ్రొక్కాము. పిదప అందరము తలా కొంత జప పుస్తకములను తీసుకున్నాము. మొదట ఈ.ఓ గారు జప పుస్తకాలను స్థూపములో సమర్పించారు. తరువాత తలా కొన్ని పుస్తకములను మేమందరము సమర్పించాము. పిదప జరిగిన సభలో టి.టి.డి. ఈ.ఓ గారు నన్ను అభినందించినారు. వస్త్రములతో సన్మానించారు. నేను ఎంతో పొంగిపోయాను. ఆ స్వామివారే నన్ను సన్మానిస్తున్నారన్న అనుభూతి పొందాను. నా స్వామిని వేనోళ్ళ పొగడుకున్నాను. ఆయన రూపాన్ని కనులార చూచాను. పిదప ఈ.ఓ గారు నన్ను మరియు నా కుటుంబాన్ని స్వామివారు చల్లగ చూడాలని ఆశీర్వదించి వెళ్ళిపోయారు. పిదప నేను నా భార్య కలిసి ఆ స్థూపనిర్మాణమునకు కారకుడైన శ్రీమాన్ వాడ్రేవు గవర్రాజు స్వామివారిని పట్టు వస్త్రములతో సన్మానించాము. తరువాత అక్కడ ఉన్న భక్తులు జపమును తలా కొంత చొప్పున స్థూపములో సమర్పించారు. మరియు హోమమునకు పూర్ణాహుతి చేసారు. పిదప డైరీఫాంలోనే ఏర్పాటుచేసిన భోజనము అందరము స్వీకరించాము. ఇది నా అదృష్టమని నా భార్య అన్నది. నేను నా జన్మ ధన్యమైందని భావించాను. సభకు వచ్చిన చాలమంది పెద్దలు మమ్ములను చూచి మీ జన్మధన్యమైందని అన్నారు, దీవించారు. మరి కొందరు ఈ ఆలోచన మీకు ఎలా కలిగిందని అడిగారు. ప్రతి ఒక్కరు నన్ను మరియు నా భార్యను చూచి మీరు ఒక మంచిపని చేసారు, ఇక మీరు ఈ జన్మలో ఏమి చేయకున్నా సరే అని మెచ్చుకున్నారు. భోజనము తరువాత రూంకు పోయి సంతోషంగ గడిపాను.

ఈ విధంగ స్థూపనిర్మాణము మరియు దాని ప్రారంభోత్సవము నాచే చేయించబడ్డది. దీనిని భాగ్యంగ భావించాను. ఆ శ్రీవేంకటేశ్వరుని కృపవల్లే ఇది జరిగిందని ఆయన పాదాలకు శతకోటి ప్రణామములను అర్పించాను.

గోసంరక్షణ ట్రస్టు ప్రారంభం

22-09-2002 : ఈ రోజు టి.టి.డి వారు వారి "గోసంరక్షణ ట్రస్టు"ను శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి చేతుల మీదుగ ప్రారంభించారు. ఇది సా. 6.30 ని॥లకు జరిగింది. ఉదయం దాదాపు 11.0 గం॥ల ప్రాంతములో శ్రీశ్రీనివాస ఐశ్వర్యసేవ జరిగింది. పిదప కామధేను యజ్ఞం చేసి కపిల గోవులకు (నల్లని గోవులకు) పూజలు చేసాము. టి.టి.డి వారు కొండపై నుండి పంపిన నాలుగు రకాల ప్రసాదాలను మధ్యాహ్నము కడుపునిండా భోంచేసాము. మీ ప్రసాదాలను కడుపునిండా తినే భాగ్యమును ప్రసాదించావ స్వామి అని అనుకున్నాము.

సాయంత్రం సభ జరిగింది. మేము సేకరించిన పైకమును శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి చేతుల మీదుగ టి.టి.డి ఈ.ఓ శ్రీమాన్ పి. కృష్ణయ్య గారికి గవర్రాజుగారు అందించారు. మొత్తం రు.26.6 లక్షలు ఇచ్చారని

ఇ.ఓ గారు ప్రకటించారు. తరువాత నన్ను స్థూపం కట్టినవాడిగ స్వామివారికి పరిచయం చేసారు. తరువాత నాకు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి చేతుల మీదుగ ఒక మెమెంటోను ఇచ్చారు. ఆ మెమెంటోపైన ఒక ప్రత్యేక డిజైన్‌లో శ్రీవేంకటేశ్వరుడు ఆయన వెనకాల గోవు ఉన్నది. గోవులను కాపాడవలెనని, గోశాలలు ఇంకా అభివృద్ధి చేయవలెనని స్వామిజీ సందేశమిచ్చారు. తరువాత ఈ.ఓ గారు డైరీఫాం, డైరెక్టర్ శ్రీకొండారెడ్డి గారు మాట్లాడారు. ఆతరువాత గవర్రాజు గారికి మాట్లాడుటకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుడు మరో లీలను ప్రసరించారు.

కొంత తడువు శ్రీ గవర్రాజు గారు చక్కగ మాట్లాడారు. తరువాత ఆయన గురించి ఆయన సేవను గురించి చెప్పుకున్నారు. ఆ తరువాత వారికి శ్రీ పుట్టపర్తి సాయిబాబా గారి ఆశీర్వాదముచే, ఆయన దయచే మాత్రమే ఈ సేవ లభించిందని అన్నారు. అందుకు శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతిగారు నొచ్చుకున్నారు. దీనిని గమనించిన ఈ.ఓ గారు గవర్రాజుగారిని అలా మాట్లాడకుమని సూచించారు. ఒప్పుకున్నట్లు నటించిన శ్రీ గవర్రాజుగారు మళ్ళీ పుట్టపర్తి సాయిబాబాని భగవంతునితో సమానంగ పొగడుట ప్రారంభించారు. శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో సాయిబాబాను శ్రీవేంకటేశ్వరునితో సమానంగ, అంతకంటే ఎక్కువగ పొగడుట శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి గారికి నచ్చలేదు. వెంటనే సభనుండి లేచి వెళ్ళిపోయారు. ఈ.ఓ గారు, అధికారులు వారించిన వినలేదు. ఈ సంఘటన వలన శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారిని టి.టి.డి వారు అవమానించినట్లు భావించారు. టి.టి.డి వారు, ఈ.ఓతో సహా చాల బాధపడ్డారు. పైగ ఈ అవమానానికి కారణం శ్రీ గవర్రాజు అని తలంచి ఆయనపై అందరు కోపగించుకున్నారు. మరోసారి మీకు టి.టి.డిలో అవకాశం ఇవ్వము అనే స్థాయికి వెళ్ళారు. గవర్రాజుగారు కూడ చిన్నబుచ్చుకున్నారు. ఆ తరువాత అధికారులతో సరిగ మాట్లాడక గవర్రాజుగారు వెళ్ళిపోయారు. పిదప సభ ముగిసిన తరువాత శ్రీ కొండారెడ్డి గారు నన్ను తన గదిలోనికి పిలిచారు. మరిచాను మన్నించమంటు, నాకు స్వామివారి శాలువ కప్పి స్వామివారి ప్రసాదమును ఇచ్చారు. ఇది కూడ నాకు స్వామి దయలాగ అద్భుతంగ తోచింది, ఆనందించాను.

ఈ విధంగ తిరుమల తిరుపతి దేవస్థానము వారి గోసంరక్షణ ట్రస్టు ప్రారంభించబడ్డది, మరియు గవర్రాజుగారు టి.టి.డి కి దూరమైపోయారు, నేను దగ్గరైపోయాను.

23-09-2002 : నేను శ్రీకొండారెడ్డిగారి ద్వార 8 అర్చనానంతర దర్శన టికెట్స్‌ను తీసుకున్నాను. నేను నా భార్య, గవర్రాజుగారు మరికొందరు మొత్తం 8 మందికి నేను నా సొంత డబ్బులతో దర్శనాన్ని చేయించాలని తలంచాను. అదే విధంగ ఉదయం 4.15 తిరుపతి నుండి బయలుదేరి 5.30 లకు తిరుమల ఆలయంలోనికి

వెళ్ళాము. గం॥ 6.15 – 6.30 మధ్యన స్వామివారిని దర్శించుకున్నాము. అక్కడ శ్రీమాన్ శేషాద్రి గారని తెలిసిన పూజారి చనువుచే తనివితీర శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించాము. మాకు పూర్తి తృప్తి కలిగింది. తరువాత క్రిందికి వచ్చాము. శ్రీకొండారెడ్డిగారి అభ్యర్థనమేర మధ్యాహ్నం వారి ఇంటిలో భోజనము చేసాము. ఆరోజు సాయంత్రం బయలుదేరి 24-09-2002 ఉదయం హైదరాబాద్ వచ్చాము. తిరుపతి నుండి తిరుగు ప్రయాణమప్పుడు నేను స్వామివారిని మరిమరి వేడుకున్నాను. ప్రభూ! నేను పోవుచున్నాను. నన్ను మీరు మరువకూడదు. నా యందే మీరు ఉండాలి. నాకు మళ్ళీమళ్ళీ మిమ్ములను చూడాలని ఉంది అని మరిమరి వేడుకున్నాను. శరీరం కంపించగ కళ్ళ నుండి నీరు జలజల వ్రాలింది.

జన్మాంతం వరకు స్థూపమును నీవే మేంటేన్ చేయమని ఆజ్ఞ

శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూప ప్రారంభోత్సవము తరవాత హైదరాబాద్ వచ్చాక ప్రతిక్షణము నాకు శ్రీవేంకటేశ్వరుడే గుర్తుకొచ్చాడు. ఈ స్థూపము నిర్మించినప్పటినుండి నాకు నా జన్మ ఉన్నంతవరకు ఆ స్థూపాన్ని నేనే మేంటేన్ చేయాలనే భావన కలిగింది. దీనిని నేను టి.టి.డి అధికారులతో కూడ చెప్పాను. కాని నాకు మాత్రము మనస్సులో వీరు తరువాత కాలంలో తగిన పరిమిషన్ ఇస్తారో లేదో అనే అనుమానము ఉండేది. చివరికి నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరున్ని ఈ భాగ్యము ప్రసాదించమని దీనాతిదీనంగ వేడుకున్నాను.

03-10-2002 : ఈనాటి రాత్రి కల కాదు కాని నిద్రలో నాకు "ఈ స్థూపాన్ని నీవే నీ జన్మాంతము వరకు మేంటేన్ చేయగలవు" అని నాతో ఎవ్వరో చెప్పినట్లు అనిపించింది. హృదయాంతర భావం ఏర్పడ్డది. ఇది ఆ స్వామివారి కృపాకటాక్షాలుగ భావించాను. ఎంతో సంతోషించాను.

స్వామివారు స్థూపాన్ని స్వీకరించుట, దివ్య దర్శనాన్ని ప్రసాధించుట

04-10-2002: తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపము, శ్రీస్వామివారి కృపావిశేషం చేత నాచే నిర్మించబడింది. ఇది చూచుటకు ఎంతో బాగుందని ప్రతివారు, టి.టి.డి అధికారులతో సహా ప్రతి వ్యక్తి నన్ను మెచ్చుకున్నారు. నేను మాత్రం దీనిని స్వామివారి ఆజ్ఞ ప్రకారం కట్టానని అన్నాను. స్వామివారు నాచే ఈ పనిని చేయించుకున్నాడని శ్రీవాడ్రేవు గవర్రాజుగారు అన్నారు. నేను దీనిని నా మొదటి పుత్రునిలాగ చూచుకున్నానని, మీ పెద్ద పుత్రుడు బాగున్నారు నీవు ఏమి దిగులు చెందకుమని డైరీఫాంలోని, ఇతర డాక్టర్లు, శ్రీనాగరాజుగారు మరియు శ్రీనాగేశ్వరయ్యగారలు, ఇతర సిబ్బంది నాతో తమాషాగ అంటు ఉండేవారు.

"మేము అసలు ఈ స్థూపాన్ని ఇంత తక్కువ కాల వ్యవధిలో పూర్తిచేయగలరని అనుకోలేదు. తప్పకుండ నిరాశ పడవలసి వచ్చునని అనుకున్నాము కాని నీయొక్క పట్టుదల మరియు డెడికేషన్ వలన ఈ స్థూపము ఇంత తక్కువ వ్యవధిలో ఇంత మంచిగ నిర్మాణము జరిగింది" అని డైరీఫాంలోని ప్రతి ఉద్యోగి నాతో అన్నారు.

స్థూప ప్రారంభోత్సవము రోజు కూడ చూచిన ప్రతి భక్తుడు నన్ను మెచ్చుకున్నారు, నీ జన్మ ధన్యమైందని చెప్పారు. కాని..... నా మనస్సులో మాత్రము సంతోషములేదు. నేను నాలోనే ఇంకా కొంత మెరుగ్గా కట్టవలసి ఉండే! కొన్ని తప్పులు జరిగాయి. హే ప్రభూ! మీరు నాపై మోపిన బాధ్యతను నేను ఏవిధంగ నిర్వర్తించానో తెలియదు. నేను ఏమైన తప్పులు చేస్తే క్షమించగలరు అని స్వామివారిని మరిమరి వేడుకున్నాను. స్థూపనిర్మాణ సమయములో మధ్యమధ్యన నేను తిరుపతి నుండి హైదరాబాద్‌కు మూడు నాలుగు సార్లు వచ్చాను. అప్పుడు రైల్వేస్టేషన్‌లో మరియు గోశాలలోని శ్రీకృష్ణుని ముందు, నేను లేకున్నా కూడ స్థూపపు పనులు సవ్యంగా జరుగాలని

వేడుకునేవాడిని. రైల్వేస్టేషన్‌లో మాత్రం నేను మీ పనులను వదిలి వెళ్ళిపోవుచున్నానని స్వామివారిని తలచుకొనిన వెంటనే బాధతో కళ్ళనుండి నీరు రాలుచుండేది. స్వామి మీరు నన్ను త్వరగా మళ్ళీ తిరుపతికి వచ్చేవిధంగ చూడండీ అని వేడుకునేవాడిని. అది అట్లే జరిగేది. చివరికి స్థూపనిర్మాణము పూర్తైంది. ప్రారంభోత్సవము కూడ జరిగింది. అందరూ మెచ్చుకున్నారు కాని నేను మాత్రం తృప్తిచెందలేదు. ఒకరకంగ భక్తుల పొగడ్త నన్ను తృప్తి పరచలేదు. సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు, నా స్వామివారు బాగున్నదని అంటే సంతోషించుదునని నేను అనుకున్నాను.

తేది 04-10-2002 నాడు ఈ స్థూపాన్ని స్వామివారు స్వీకరించారా? లేదా? అనే ఒక అనుమానము వచ్చింది. మరోప్రక్క స్వామివారిని చూడవలెననే కోరిక కలిగింది. ఏమి చేయాలో తోచలేదు. ఆరోజు సాయంత్రము మా ఆఫీసులో అందరు వెళ్ళిపోయిన తరువాత తలుపువేసి నా రూంలోనికి వచ్చాను. పిదప నేను కూర్చుండే కుర్చి వెనుక ఉన్న స్వామి ఫోటోను చూచుకుంటు వజ్రాసనములో కూర్చుండి స్వామివారితో ఈ విధంగ దీనాతిదీనంగ ప్రార్థించాను.

"ప్రభూ! శ్రీవేంకటేశ్వర నేను నా యొక్క శక్తి ప్రకారము, నాకు తోచినట్లు, పూర్తి భక్తిభావంతో, నా మనస్సును పూర్తిగ మీకు అంకితము చేసి మీ యొక్క మహామంత్ర స్థూపాన్ని కట్టాను. అందరూ బాగుందన్నారు. కాని నేను మాత్రం తృప్తిచెందలేదు. ఇంకా కొంత మెరుగ్గా చేయవలసి ఉండే అనే అభిప్రాయముంది. హే ప్రభూ! నా స్వామి! దయామయా! నాకు మీరు ఈ స్థూపాన్ని స్వీకరించారో లేదో తెలియదు. ప్రభూ! మీరు ఈ స్థూపాన్ని స్వీకరించండి ప్రభూ! నా కోరికను నెరవేర్చండి ప్రభూ!" అంటూ రకరకాలుగ బ్రతిమిలాడాను. నా కళ్ళనుండి నీటిధారలు కారుచుండగ దీనంగ వేడుకున్నాను. ఇంకా ఈ విధంగ వేడుకున్నాను. "ప్రభూ! మీరు స్వీకరించారో లేదో నాకు తెలపండి" అని అనుచు మూడు షరతులను విధించాను. మొదటిది: ఒకవేళ మీరు ఈ స్థూపాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించినట్లైతే ఈరోజు రాత్రి కలలో నాకు ఏదో ఒక విధంగ చెప్పండి. మీ దర్శనాన్ని ప్రసాదించండి. అప్పుడు నేను మీరు దీనిని నూటికి నూరుపాళ్ళు స్వీకరించారని భావిస్తాను. రెండవది: ఈరాత్రి కాకుండ మూడురోజుల తరువాత చూపిస్తే 50% స్వీకరించినట్లు భావిస్తాను అన్నాను. మూడవది: 11 రోజుల లోపల చూపిస్తే ఎంతోకొంత స్వీకరించారని, 11 రోజుల వరకు ఏమి చూపెట్టకుంటే మీరు దీనిని స్వీకరించలేదని భావిస్తానని చెప్పాను. చివరికి ఈ స్థూపాన్ని స్వీకరించమని, ఈ దాసున్ని ఈ రాత్రి ఎదో ఒక విధంగ అనుగ్రహించమని ఏడ్చాను. చివరికి నామనస్సులోని మాటను స్వామివారికి చెప్పి, పాదాభివందనము చేసి ఆఫీసుకు తాళం వేసి గం॥ 7.45 ని॥లకు ఇంటికి పోయాను. అన్ని రోజులలాగానే తిని దాదాపు గం॥10.0లకు స్వామివారిని ధ్యానిస్తూ పడుకున్నాను. తరువాత ఒక అద్భుతము జరిగింది.

స్వామి తన భక్తుని ఆవేదనను మనసారా స్వీకరించారు. తన భక్తుని మనస్సును సంతోషపెట్టే విధంగ చేసాడు. ఆ స్వామివారిని కనులార చూచే భాగ్యాన్ని మళ్ళీ ఒకసారి ప్రసాదించారు. వారు నేను కట్టిన మహామంత్ర స్థూపాన్ని నూటికి నూరుపాళ్ళు స్వీకరించారని దానితో నేను విధించిన షరతులను స్వీకరిస్తున్నారని తెలిపేవిధంగ లీలను చూపాడు. ఇంత కంటే మహాభాగ్యం మరెవ్వరికి కలుగదు. నేను ధన్యున్నైనాను. ఒక రకంగ గర్వపడ్డాను. ఆరోజు కల ఈవిధంగ ఉంది.

5-10-2002 కల : అది ఒక పెద్ద మైదానము. అందులో మధ్యభాగమున దాదాపు 6 అడుగుల వెడల్పు 12 అడుగులు ఎత్తు గల ఒక ఇనుపరేకుతో మలచిన శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడు. అది ఇనుపరేకుతో మలచారు కాబట్టి సిలుముపట్టి ఉన్నట్లు నల్లగ ఉంది. ఆ శ్రీవేంకటేశ్వరుడు అచ్చంగ, స్థూపనిర్మాణాన్ని చేసినందులకు మెచ్చుకుంటు తేది 22-09-2002 నాడు శ్రీశ్రీశ్రీ కంచికామకోటి పీఠాధిపతులు బహూకరించిన మెమెంటోలో ఉన్నట్లుగానే

ఉన్నారు. ఆ మెమెంటోను శ్రీ గవర్రాజుగారే తెచ్చి స్వామివారి చేతుల మీదుగ ఇప్పించారు. ఆ మెమెంటోలో శ్రీవేంకటేశ్వరుడు ఒక ప్రత్యేక డిజైన్‌లో ఉన్నారు. ఆ మెమెంటోలో ముందు స్వామివారు ఉండగ ఆయన వెనుక గోవు ఉంది. ఆ మెమెంటోలో ఏవిధంగ ఏలాంటి పరిమాణముతో అంటే కాళ్ళ పరిమాణము, కిరీట పరిమాణము మొత్తం అదే ఆకారం, కాని ఎన్‌లార్జ్‌డ్ సైజులో వెడల్పు 6 అడుగులు ఎత్తు 12–15 అడుగులు పరిమాణముతో ఉన్నాడు. కాని ఆయన ఇనుపరేకుతో మలచబడి చిలుము పట్టినట్లు నల్లగ ఉన్నాడు. చాలమంది పెద్దలు, పిల్లలు ఆయన చుట్టుచేరి వింతగ చూస్తున్నారు. అప్పుడు నేను కూడ అక్కడికి పోయి చూచాను. ఇంతలోనే ఒక అద్భుతము జరిగింది. ఆ ఇనుపరేకుతో చిలుము పట్టి ఉన్న స్వామివారు నా చూపు పడిన వెంటనే ఒక్కసారిగ బంగారంగా

మారిపోయారు ఆయన నుండి ధగధగమంటూ బంగారు మెరుపుకాంతులు నావైపు వచ్చాయి. ఆ ప్రాంతం మొత్తం బంగారు కిరణాలతో నిండిపోయింది. ముఖ్యంగ ఆయన అభయ హస్తము నుండి మరియు దాని చుట్టు ఉన్న ప్రదేశము నుండి విపరీతమైన కాంతులు నా కళ్ళకు కొట్టుచున్నవి. బంగారు కాంతికిరణాలు ధగధగమంటు నావైపు వచ్చాయి, కాని నా కళ్ళు మాత్రము మూతపడలేదు. స్పష్టంగ శ్రీవేంకటేశ్వరున్ని చూచాను అప్పుడు నేను కలలోనే ఈవిధంగ అనుకున్నాను. "నేను వినాయక చవితి రోజు (తేది 10-09-2002) తిరుమలలోని స్వామిని దర్శించినప్పుడు ఆయన అభయహస్తము నుండి మరియు దాని చుట్టుప్రక్కల నుండి ఇదేవిధమైన కాంతులు వచ్చాయి. ఇవి కూడ ఆ విధంగానే ఉన్నవి" అని కలలోనే అనుకున్నాను. ఈవిధంగ స్వామివారిని కలలో కొంతసేపు చూచాను. తరువాత కల చెదిరింది.

ఈవిధంగ స్వామివారు నేను విసిరిన సవాలును స్వీకరించి తాను స్థూపాన్ని మనస్ఫూర్తిగ నూటికి నూరుపాళ్ళు స్వీకరించానని తెలుపుటకు నేను తలంచిన రోజు కలలో మెమెంటోలోని శ్రీవేంకటేశ్వరుని రూపములో దర్శనమిచ్చారు. ఆరోజు నుండి నాకు స్థూపాన్ని కట్టిన తృప్తి లభించింది. నా స్వామి కలిగించాడు. ఇంతటి భాగ్యాన్ని కల్పించిన స్వామి ఋణం ఏవిధంగ తీర్చుకోవాలని పరిపరి విధాలుగ ఆలోచించాను.

ఒక విశ్లేషణ: (1) శ్రీవేంకటేశ్వరుడు చూపే ప్రతిమాటను క్షుణ్ణంగ పరిశీలించాలి. స్వప్నాల రూపంలో ప్రసాదించే లీలలను కొంత తప్పుగ అర్థం చేసుకునే అవకాశం ఉంది. కాబట్టి ఆయన భావాలను స్పష్టంగ అర్థం చేసుకొనుటకు హృదయాంతరంగ భావాలను ప్రసాదించేవారు.

(2) తేది 26-08-2002 నాటి శ్రీ గవర్రాజు గారి కలను పరిశీలిద్దాం! తిరునామాలు ధరించిన ఒక అయ్యవారు స్థూపనిర్మాణ ఆలస్యమునకు కారణం వేరేదో ఒకటుందన్నారు. నన్ను తిరుపతికి వెళ్ళమన్నారు, స్థూపం పేరుపైన భవిష్యత్తులో ఒక సంస్థ ఏర్పాటు అగునని, మంచి పేరు సంపాదించునని కూడ చెప్పారు. ఈ విషయం ఇప్పుడు నీకు అవసరము లేదని కూడ చెప్పారు. ఈ మాట ఎందుకన్నాడో వచ్చే ఆధ్యాయాలలో స్పష్టంగ తెలుస్తుంది.

నా దిశ : నా భార్యను నాకు సహకరించునట్లు మార్చాడు. మా జీవితానికి కొన్ని విధివిధానాలను ఏర్పరచాడు. కుటుంబపోషణార్థమే వ్యాపారం చేయమన్నాడు. నా భాగ్యవశాత్తు తిరుపతిలో స్థూపనిర్మాణం పూర్తికాబడి, నాచేతనే ప్రారంభించబడ్డది. టి.టి.డి వారికి దగ్గరైనాను. నా జీవితాంతం నేనే ఈ స్థూపమును మేంటేన్ చేయగలవన్నారు. స్థూపాన్ని మనస్ఫూర్తిగ స్వీకరించి తన దివ్యదర్శన భాగ్యంను ప్రసాదించారు.

భాగవత ఆశీర్వాదము: తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురించుచున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

7వ భాగము

(సెప్టెంబర్ 2002 - ఫిబ్రవరి 2003)

దిశానిర్దేశము: సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 7వ భాగపు లీలల ప్రచురణ.

(సెప్టెంబర్ 2002 నుండి ఫిబ్రవరి 2003)

తిరుపతిలో 21.09.2002 నాడు శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూప నిర్మాణము చేసి హైదరాబాద్ వచ్చిన తరువాత స్వామి సేవ హడావిడి లేక నీరసించి పోయాను. ఎదోరకంగ స్వామి సేవను పొందాలని మనస్సు ఉరకలేస్తుంది. నాలో నేను ఇలా ఆత్మపరిశీలన చేసుకున్నాను.

శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం – స్థాపన; జపశ్రీకారం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని స్మరిస్తూ ఉంటే ఎంతో ఆనందం కలిగేది. పరవశించి పోయెవాడిని. శరీరం రోమాంచితమై కళ్ళనుండి ఆనందబాష్పాలు వచ్చేవి. పైగ నా జఠిలమైన సమస్యలు తీరినవి. ఇంతటి భాగ్యం నేనొక్కరినే అనుభవించాలా? అని నాలో నేను ఆలోచించుకున్నాను. దీనిని శ్రీవేంకటేశ్వరుని భక్తులందరికీ పంచాలనే ఆలోచన కలిగింది. మరో ప్రక్క గతంలో జరిగిన విషయాలు ఒక్కొక్కటి గుర్తుకువచ్చాయి. తేది 05-07-2002 రోజున ఉదయం నా మొదటి పుట్టిన రోజు పండగను అత్యంత ఉత్సాహంగ జరుపుకున్నాను. సాధారణంగ మొదటి పుట్టినరోజు పండుగకు అత్యంత ఆప్తులు బహుమానం ఇచ్చుట ఆనవాయితి అని నమ్మి, ఆరోజు స్వామివారిని ఒక మంచి బహుమానం ఇవ్వమని అత్యంత దీనంగ, ప్రేమపూర్వకంగ ప్రార్థించాను. అనుకున్నట్లే స్వామివారు ఆరోజు సాయంత్రం కీ.శే. గవర్రాజు గారితో ఇలా అన్నారు. "సాయిరెడ్డి నావాడు నాకోసం ఏమైన చేస్తాడు" ఈమాట విన్నంతనే పరవశించిపోయాను. రాజమహారాజులకు కూడ లభించని ఈ అనుగ్రహాన్ని నాకు ప్రసాదించినందులకు ఎంతో పొంగిపోయాను. స్వామివారి నోటితో అత్యంత అల్పున్నైన నన్ను "సాయిరెడ్డి

నావాడ" ని పిలుచుట వలన మురిసిపోయాను. దీనికి ప్రతిగా ఏమివ్వగలనని నాలోనేను తర్కించుకొని "నా పూర్తి జీవితాన్ని మీకు సమర్పిస్తున్నాను. జీవించినంత కాలం మీ ఋణం తీర్చుకొనుటకు మీసేవ చేసుకుంటానని" నా మనస్సులో దృఢ నిర్ణయం తీసుకున్నాను. ఆ తరువాత స్వామి కృపతో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపనిర్మాణము, దాని ప్రారంభోత్సవము కూడ నాచేతనే జరిగింది. నా ప్రార్థన ప్రకారం ఈ స్థూపాన్ని "నీవు జీవించినంత కాలం నీవే మేనేజ్ చేయగలవని" కూడ చెప్పారు. చివరికి ఆ స్థూపాన్ని నూటికినూరుపాళ్ళు స్వీకరించారని తెలుపుటకు తన దివ్యదర్శన భాగ్యంను కూడ ప్రసాదించారు. ఇంతటి అనుగ్రహానికి పాత్రున్నైన నేను స్వామివారికి ఏదోఒకటి చేయాలనే దృఢమైన భావం కలిగింది. ఒక వేళ ఏమి చేయకుండ ఉండుంటే నేనొక స్వార్థపరునిగ నాది నేను భావించుకున్నాను. ఇలా సేవ చేయాలని ఉంది కాని ఏమి చేయాలో ఎలా చేయాలో తెలియదు. దారి చూపమని శ్రీవేంకటేశ్వరుని ప్రార్థించాను. కర్తవ్య బోధ చేయమన్నారు. చివరికి చిన్నగ స్వామి జపమును వ్రాయించాలనే కోరిక కలిగింది. నాకు తెలిసిన ఇద్దరు ముగ్గురితో చర్చించి దసరా తేది 15-10-2002 నుండి ప్రారంభించాలని నిర్ణయించాను. అప్పుడు నేను నా డైరీలో ఈ క్రింది విధంగ వ్రాసుకున్నాను.

స్వామివారు నేను కట్టిన స్థూపమును స్వీకరించానని నాతో తెలిపినప్పటి నుండి నా మనస్సులో అమితమైన ఆనందమునిండింది. 15-08-2002రోజునకొండపైన,స్వామివారిగుడిముందునాఒళ్ళుజలధరరించేవిధంగ ఒక దివ్యమైన అనుభూతి పొందాను. "ప్రతి సం॥ము స్వామివారికి ఒక మంచి మొత్తమును ఖర్చు చేయాలని, ఈ పైకము సాక్షాత్తు ఆ స్వామివారికే డైరెక్టుగ చెందాలని" అనుభూతి చెందాను. కాని అది ఏవిధంగ చేయాలి? ఏమి చేయాలి అనే విషయము అప్పుడు తెలియలేదు.

ఈ దసరా (15-10-2002) కంటే 4-5 రోజుల ముందు నుండి స్వామివారిని దీనంగ వేడుకున్నాను. మీకు సేవ చేయాలని ఉన్నదని, కాని ఏమిచేయాలో, ఎలా చేయాలో తెలియదని దారి చూపమని వేడుకున్నాను. ఆజ్ఞాపించమన్నాను. దానిని నేను తు.చ తప్పకుండ చేస్తానని వేడుకున్నాను. నా నరనరాలలో స్వామిసేవ చేయాలని ఉవ్విళ్ళూరుతున్నాను. చివరికి నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఈ వచ్చే విజయదశమి నుండి ఏదైన ఒక మంచిపని, స్వామిని,ఆయన నామాన్ని అందరికి చేర్చే విధంగ,ఆయన కరుణాకటాక్షాలు అందరికిలభించేవిధంగ,స్వామివారి నామజపమును అందరిచే ఉచితంగ వ్రాయించాలనిపించింది. దానిని తిరుపతికి తీసుకెళ్ళి జపహోమాదులు నిర్వహించి, జపము వ్రాసినవారి కోర్కెలను తీర్చుమని నా ప్రభువుకు మ్రొక్కి, శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్థూపములో నిక్షిప్తము చేయాలని నిర్ణయించాను. వి.ఎస్.టి. వద్దనున్న అప్పటి మా ఆఫీసునే జపము వ్రాయించే ఆఫీసుగ నిర్ణయించాను. దీనిని అప్పుడు కీ.శే. గవర్రాజు వద్ద పనిచేస్తున్న శ్రీ పాండురంగారావు గారికి, తెలిసిన వ్యక్తులైన శ్రీగోపాల్ రావు మరియు శ్రీనివాసశర్మ గార్లకు చెప్పి వారి సలహా కోరాను. 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం' అనే ఒక సంస్థను స్థాపించి దాని పేరు పైన జపం వ్రాయించాలనుకున్నాను. నేను ఒక అజ్ఞాత భక్తునిగ ఉండాలని నాకు నేను నిర్ణయించుకున్నానన్నాను. వారు నన్ను ప్రోత్సహించారు. చివరికి దీనిని ఆలస్యము చేయక వెంటనే అంటే 13-10-2002 నాడు కీ.శే. గవర్రాజు గారికి కూడ చెప్పాను. దీనిని వచ్చే విజయదశమి రోజు, శ్రవణానక్షత్రం నాడు, తిరుపతిలో బ్రహ్మోత్సవాల చివరి రోజు అయిన 15-10-2002 నాడు ఉదయం 10.30 గం॥లకు ప్రారంభించ నిర్ణయించాము. ఈ విషయమును నేను గవర్రాజు గారికి వారి ఇంటికి పోయి చెప్పాను. ఆయనతోనే ఈ కార్యక్రమమును ప్రారంభించ తలచాను. ఆయన దానికి ఒప్పుకున్నారు. గవర్రాజుగారితో జపం వ్రాయించుదునని చెప్పాను, కాని ఒక పీఠంను స్థాపించుదునని చెప్పలేదు, ఆ మాట నా మనస్సుకు రాలేదు.

తేది 15-10-2002 దశరా నాడు శ్రీగవర్రాజుగారే పూజకు ముందుగా వచ్చారు. పూజ చాల బ్రహ్మాండంగ

జరిగింది. శ్రీ గవర్రాజుగారు చేసే పూజా విధానాన్నే అనుసరించాను. ఐశ్వర్య మహామంత్రాన్ని అనుసంధానిస్తూ శ్రీ విష్ణు సహస్రనామ పారాయణము చేసాము. తరువాత శ్రీ గవర్రాజుగారు పేపరుపైన ఎర్రరంగు సిరాతో "ఓం శ్రీం వేంకటేశాయ నమః" అని 18 సార్లు వ్రాసి నాకు ఇచ్చారు. అంటే ఈ మంత్రాన్ని వ్రాయించమని సూచించారు. నేను దానిని ఆనందంగ తీసుకొని స్వామిచెంత పెట్టాను. ప్రసాద వితరణ తరువాత పూజ ముగిసింది. గవర్రాజు గారు స్వామి నామాన్ని వ్రాస్తున్నప్పుడు ఎవ్వరో తన చేయి పట్టుకొని వ్రాయించిన అనుభూతి పొందానన్నారు. నేను కూడ అమితమైన ఆనందమును అనుభవించాను. తిరుమలలో ఆనందనిలయంలోని స్వామిని చూస్తున్నట్లు అనుభూతి చెందాను. ఆయన పాదాలపైన స్వయంగ పూలు పెట్టుచున్నట్లు అనుభూతి పొందాను. శ్రీ గవర్రాజుగారు సూచించిన "ఓం శ్రీం వేంకటేశాయ నమః" అనే మహామంత్రాన్నే వ్రాయించాలనుకున్నాను.

ఆరోజు మేము స్వామివారి జపమును భక్తులందరిచే ఉచితంగ వారి వారి సొంత పుస్తకములలో ఒక కోటి జపమును మాత్రమే వ్రాయించ నిర్ణయించాము. చివరికి పూజ అయిన కొంతసేపు తరువాత నా సేవలో కొంత వెలితి అనిపించింది. వెంటనే దీని నిమిత్తమై ఒక దివ్యమైన జప పుస్తకమును తయారు చేసి బీదవారికి, స్తోమతలేని వారికి ఉచితంగ ఇవ్వాలని నిర్ణయించాను. స్వామివారి కృపతో ఒక వారం లోపల జపపుస్తక నమూనాను తయారు చేసాము. మరింత స్వామివారి సేవను పొందాలనే కాంక్షతో ఈ సంఖ్యను ఒక కోటి నుండి 7 కోట్లు చేయాలని నిర్ణయించాను. జపము వ్రాయుటకు విధి విధానాలను, ప్రతి విషయాన్ని చక్కగ వ్రాసాము. స్వామివారిని స్మరింపచేయుటే మా ఉద్దేశ్యం కాబట్టి జపంను ఏరంగు సిరాతోనైనా వ్రాయవచ్చని చెప్పాను. ముఖ్యంగ స్వామివారిని స్మరిస్తూ వ్రాయమని సూచించాను. స్వామివారిని స్మరింపచేయుటకు జపంను ఆయుధంగ చేసుకున్నాను. చివరికి స్వామివారికి ఇది నా మొదటి పుస్తక కూర్పు అని నాకు నేను మురిసిపోయాను. కాని నా మనస్సులో మాత్రం భవిష్యత్తులో ఇలాంటి కూర్పులు ఎన్నో ఉండగలవనే హృదయాంతర భావం ఏర్పడ్డది. ఒక పుస్తకములో 1200 కు పైగ నామాలు వ్రాయునట్లు ఏర్పరచాము. ఈ పుస్తకములో ప్రతి భక్తునిచే కనీసం 1008 కంటే తక్కువ కాకుండ వ్రాయిస్తూ 7 కోట్ల జపమునకు సరిపడ మొత్తం 70,300 జపపుస్తకములను ప్రింటు చేయించాము. ప్రతి పుస్తకానికి నెంబరింగు వేయించాము. శుక్రవారం కార్తీక ఏకాదశి తేది 15-11-2002 నాడు జప పుస్తకములను విడుదల చేయ నిర్ణయించాము. ఇలా జపము వ్రాయించుదుమని నిర్ణయించిన ఒక నెల తరువాత జపపుస్తక వితరణ జరిగింది.

జప పుస్తక వితరణ :

15-11-2002 : కార్తీక ఏకాదశి శుక్రవారము. ఇది నా జీవితంలో మరపురానిరోజు. ఆ స్వామి సేవలో మొదటిరోజు. నా స్థాయికి మించి అనుగ్రహించిన నా ప్రభువుకు, నేను సేవ చేయదలచాను. స్వామి ఋణం తీర్చుకొనుటకు ప్రయత్నించాను. వీలైనంత మందికి నా స్వామి నామాన్ని స్మరింపచేయుచు వారికి నా స్వామి యొక్క కరుణాకటాక్షాలను, దివ్య ఆశీస్సులను అందించాలనే తపనకు ప్రారంభం జరిగింది. ఉచితంగ స్వామివారి దివ్యనామమును వ్రాయుటకు "శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జప పుస్తకము" లను భక్తులకు పంచుట ప్రారంభించాము. ప్రతి భక్తునిచే కనీసం 1008 సార్లకు తక్కువ కాకుండ వ్రాయించి, ఇట్టి 7 కోట్ల జపమును తిరుపతికి తీసుకుపోయి జపహోమాదులు నిర్వహించి 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపములో స్వామివారికి చెందునట్లు నిక్షేపించ నిర్ణయించాము. ఆ కార్యక్రమము ఇలా జరిగింది.

అనుకున్నట్లే తేది 15-11-2002 శుక్రవారం ఉ. 5 గం॥లకు లేచి స్నానాదులు ముగించుకున్నాను. శుక్రవారం కావున స్వామివారికి అభిషేకము చేసాను. తరువాత ఈ జపపుస్తకములను స్వామి చెంత పెట్టి మనసార

ప్రార్థించాను. ఈ జపము వ్రాసిన ప్రతి భక్తున్ని ఆశీర్వదించమని, వారి కోరికలను తీర్చమని ప్రార్థించాను. ఈ ఏడు కోట్ల జపం వ్రాయించడమనే పనిలో నన్ను కృతకృత్యుడను చేయమని, మీ ఆశీర్వాదము లేనిచో ఎంత డబ్బు ఖర్చు పెట్టినా అది సాధ్యము కాదని, మీ దయతోనే ఈ పనిని చేయగలనని ఆశీర్వదించమని మరిమరి వేడుకున్నాను. ఇది నేను స్వామి కొరకు, ఆయన భక్తుల కోర్కెలు తీర్చడము కొరకు చేసే మొదటి పని అని, మీ దివ్యమైన ఆశీర్వాదములు కావలెనని నా కనుల వెంట నీరు రాలుచుండగ స్వామివారిని వేడుకున్నాను. మరియు నేను అజ్ఞానినని, ఏమి తెలియనివానినని, ఎవరైన వచ్చి ఏమైన అడిగినచో ఏమి చెప్పలేనని, కేవలం మీ మీద పూర్తి విశ్వాసముతో ముందుకు వెళ్ళుచున్నాను ప్రభూ! అని పదేపదే వేడుకున్నాను. తగిన శక్తిని ప్రసాదించమని ప్రార్థించాను. రెండు పుస్తకములను స్వామి చెంత పెట్టాను. తరువాత ఉ. 6.30 లకు చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వర ఆలయంనకు వెళ్ళాను. స్వామి పాదముల వద్ద ఈ పుస్తకములను పెట్టి పూజించాను. జపము వ్రాసిన వారి కోర్కెలను తీర్చమని, ఈ పనిని నిర్విఘ్నముగ నాచే చేయించమని దీనంగ వేడుకున్నాను. శరీరము పులకరించి కనుల వెంట ఆనంద బాష్పాలు రాలుచుండగ అత్యంత దీనంగ ప్రార్థించాను. అమ్మవారిని కూడ ఇదే విధంగ ప్రార్థించాను. అక్కడి పూజారులు, భక్తులు ఈ పుస్తకములను ఆతృతతో గమనించారు.

చివరికి ఉ. 7.30 ని॥లకు కుటుంబంతో పాటు ఆఫీసుకు వచ్చాను. పూజారులు, భక్తులు వచ్చారు. ఉ. 7.40 కి ఆఫీసులో పూజ మొదలైంది. విష్ణుసహస్రనామ పారాయణము జరిగింది. ఈసారి ప్రతి చరణం మధ్యమధ్యన 'ఐశ్వర్య మహామంత్రం' కు బదులుగ "ఓం శ్రీం వేంకటేశాయ నమః" అనే మహామంత్రమును పఠించాము. ఎంతో తృప్తిగా నా కళ్ళనుండి ఆనందబాష్పాలు రాలుచుండగ పూజ జరిగింది. ఈ పూజకు వచ్చిన ప్రతి భక్తుడు దివ్యమైన అనుభూతి పొందాడు. పూజ జరిపించు పంతులుగారు తన కళ్ళనుండి నీరు కారుచుండగ పులకరించిపోయారు. స్వామివారు చిరునవ్వుతో కనబడ్డారని మురిసిపోయారు. ఆ తరువాత జప పుస్తకములను భక్తులకు పంచాము. ఈ విధంగ జపపుస్తక వితరణ కార్యక్రమము ఎంతో ఆనందంగ స్వామి కృపతో జరిగింది మేము చాల సంతోషించాము.

తేది 17-11-2002 ఆదివారం రోజున పేపరులో ఒక ఆడ్ ఇచ్చాను. అందులో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవేంకటేశ్వరునికి భక్తులందరిచే వ్రాయించిన 7 కోట్ల జపసమర్పణ చేయ నిర్ణయించామని, జపపుస్తకములను మా ఆఫీసునుండి ఉచితంగా భక్తులు పొందవచ్చునని ఇచ్చాము. ఈ అడ్వర్‌టైజ్‌మెంటును చూచిన వెంటనే ఎంతో మంది భక్తులు వచ్చి స్వామివారి ప్రసాదంగ జపపుస్తకములను తీసుకెళ్ళారు. ఇది ఒక ప్రభంజనంలాగ సాగింది. ఈ పేపరు అడ్వటైజ్‌మెంటును చూచిన కే.శే. గవర్రాజు గారు

ఎంతో నొచ్చుకున్నారు. నేను 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' అనే ఒక సంస్థను ఏర్పాటు చేయుట, మరియు ఉచితంగ జప పుస్తకములను భక్తులకు ఇచ్చుట ఆయనకు సహించలేదు. ఆయనకు పోటి అని భావించాడు. నాకు ఫోన్ చేసి కోప్పడ్డాడు. శ్రీవేంకటేశ్వరునికి జపము వ్రాయించే శక్తి నాకు లేదని, నేను యోగ్యున్ని కానని అన్నాడు. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం అనే పేరును తొలగించమని కచ్చితంగ చెప్పాడు. కేవలం ఉపాసకులే మహామంత్ర పీఠం అని పెట్టుకొనుటకు యోగ్యులన్నాడు. ఒక వేళ స్వామి సేవ చేయదలచుకుంటే ఇతర పేర్లు పెట్టుకొమ్మన్నాడు. గవర్రాజు రెండు విషయాలు చెప్పాడు (1) జపం వ్రాయించకూడదు. (2) 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం' అనే పేరును తొలగించాలి. నేను కూడ ఆయన పైనున్న గౌరవముతో ఈ 7 కోట్లు జపమును వ్రాయించి మానేద్దామనుకున్నాను. కాని స్వామిసేవ చేయవలెననే ఆత్రుత నన్ను ఊరుకోనివ్వడం లేదు. మా చార్టెడ్ అకౌంటెంట్‌ని సంప్రదించి 'శ్రీవేంకటేశ్వర సేవా సమితి' అనే ఒక ట్రస్టును ఏర్పాటు చేద్దామనుకున్నాను. భవిష్యత్తులో ఈ ట్రస్టు క్రింద ఎన్నో సేవలను ఏర్పాటు చేసుకోవచ్చునని మా సి.ఏ శ్రీమాన్ జనార్దన్ రావుగారు సూచించారు. ఈ ట్రస్టు ద్వార జపసమర్పణ కాకుండ ఇతర ఇంకేమైన సేవలను చేద్దామనుకున్నాను. ఇంతలో నాకు మరియు శ్రీ గవర్రాజు గారికి ఇద్దరికి పరిచయమున్న పాండురంగారావు, గోపాల్‌రావు, మరియు శ్రీనివాసరావు గారలు నన్ను మహామంత్ర పీఠమును మరియు జప సమర్పణను కొనసాగించమన్నారు. గవర్రాజుగారు స్వార్ధముతో మాట్లాడుచున్నారు, ఆయన మాటలను పట్టించుకోవద్దన్నారు. నేను మాత్రం సందిగ్ధంలో ఉన్నాను.

23-11-2002: ఈరోజు ఉదయం దాదాపు 2.30 ని॥లకు మెలుకువ వచ్చింది. ఆ శ్రీవేంకటేశ్వరుని గురించి, నేను చేపట్టిన 7 కోట్ల జపము గురించి ఆలోచించాను. ఈ ఒక్క సం॥ము జపసమర్పణ చేసి ఆ తరువాత స్వామి సేవలేకుండ ఊరికే ఉండుట ఇష్టం అనిపించలేదు, బాధేసింది. స్వామిని స్మరిస్తూ ఉన్నాను. ఇంతలో నాకు ఒక దివ్యమైన ఆలోచన వచ్చింది. స్వామివారికి మొత్తం 108 కోట్ల జప సమర్పణ కావించాలనిపించింది దీనితో స్వామివారికి ఎక్కువ కాలం సేవచేసే భాగ్యం లభిస్తుందనుకున్నాను. ఈ మొదటి జప సమర్పణ తిరుపతిలో చేసి అక్కడే ప్రతి సం॥ము 7 కోట్ల చొ॥న మొత్తం 108 కోట్లు సమర్పించుదుమని వెల్లడించాలని అనుకున్నాను. వెనువెంటనే 108 కోట్లు చేయాలా లేక 111 కోట్లు చేయాలా అనే ఆలోచన వచ్చింది. 111 నెంబరే నన్ను బాగ ఆకర్షించింది మరియు ప్రతి సం॥ము ఈ జపమును తిరుపతిలో అలిపిరి వద్దనున్న స్వామివారి పాదాల మండపముపై పెట్టి, ఆయన పాదాలకు సమర్పించి ప్రార్థించాలనిపించింది. ఆ తరువాత స్థూపం వద్ద జపహోమాదులు నిర్వహించి సమర్పించాలనిపించింది. ఇది నా జీవిత సంకల్పం అనిపించింది. ఈ విషయం ఇట్లుంటే మరోప్రక్క స్వామివారు కొన్ని దృష్టాంతరాలను కల్పించారు. అందులో ఒకటి: మా నుండి జప పుస్తకమును పొందిన ఒక భక్తుడు పుస్తకమును పూరించి ఆఫీసులో నా టేబుల్ పైన పెట్టిపోయాడు. ఆయన పుస్తకము సంఖ్య 111. దీనిని పుస్తకముపై రెడ్ ఇంక్‌తో 111 అని చక్కగా వ్రాసాడు. ఇది నన్ను మరీమరి ఆకర్షించింది. ఈ విధంగ 111 సంఖ్య వైపే మొగ్గు చూపాను. రెండవది స్వామివారికి జపం వ్రాయించవలెనని నిర్ణయించిన 2, 3 రోజులలోనే నా నుదుటిపై నామం పెట్టుకున్నట్లు తెల్లని మచ్చ ఏర్పడ్డది. శ్రీచూర్ణం పడక ఏర్పడిందనుకున్నాను, మందులు వాడాను, తగ్గలేదు. చివరికి ఇది ఏదో తెలియంది సూస్తున్నట్లు భావమేర్పడింది. మూడవది : తిరుపతిలో స్థూప ప్రారంభోత్సవానికి తెరను ప్రక్కకు జరిపినప్పుడు, నామఫలకంపైన అలంకరించిన తిరునామం చాల ఆకర్షించింది. ఇప్పటికి నా కళ్ళలో మెరుస్తుంది. నేను తిరునామాన్ని ప్రారంభించినట్లు అనిపించింది. మరో విషయం, నేను స్వామివారికి చాల సం॥లు సేవ చేయాలనుకుంటున్నాను, కాని ఈ రోజు ఉన్న ఉత్సాహం తరువాత ఉండకపోవచ్చు, కాబట్టి ఒక మంచి సంకల్పం ఉంటే బాగుండుననిపించింది. దీనికై స్వామివారిని దారి చూపమని ప్రార్థించసాగాను.

సంకల్పమిచ్చిన స్వామివారు:

24-11-2002 : ఈరోజు కూడ రాత్రి 2.30 ని॥లకు మేల్కున్నాను. స్వామి గురించి నా సేవ గురించి ఆలోచించాను. ఈ జప సమర్పణ సేవను ఎలా ముందుకు తీసుకెళ్ళాలని ఆలోచించాను. స్వామివారికి జీవితాంతం నా తనివితీర సేవ చేయాలనే కోరికను తీర్చమని వేడుకున్నాను. ఇన్ని సం॥ల నా సేవ మధ్యలో పలుచబడకుండ దారి చూపమన్నాను. వెంటనే నా మనస్సులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. నాకు ఇంతకు పూర్వము దర్శనము ఇచ్చిన తిరుమల శ్రీవేంకటేశ్వరుని రూపము, కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీ మరియు పరమశివుని రూపములు మళ్ళీ నా కళ్ళలో మెరిచినట్లైంది. నాది నేను ఈవిధంగ విశ్లేషించుకున్నాను. సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు కనిపించినప్పుడు శంఖ చక్రాదులతో, కిరీటముతో, అప్పుడే అభిషేకము అయిన తరువాత ఉండే నీటి తడితో కనబడ్డారు. అదేవిధంగ శ్రీమహాలక్ష్మీ అమ్మవారు, మరియు లింగ రూపములోని పరమశివుడు కూడ అప్పుడే అభిషకము తరువాత ఉండే నీటి తడితో కనబడ్డారు. అంటే దీనర్థం నన్ను బొట్టు పెట్టి అలంకరించుమంటున్నారని గ్రహించాను. తిరుమల శ్రీవేంకటేశ్వరున్ని కొందరు అమ్మవారని కొందరు పరమశివుడని మరికొందరు భగవంతుని అన్ని రూపములు మేళవించి ఉన్న మూల రూపమని భావిస్తారు. నేను మాత్రం శ్రీవేంకటేశ్వరుడు సర్వదేవతా రూపములను తనలో ఇముడ్చుకున్న మూల రూపంగ భావిస్తాను. ఒక్క శ్రీవేంకటేశ్వరున్ని సేవిస్తే సమస్త దేవతలను సేవించినట్లు భావిస్తాను. కాబట్టి ఒక్క శ్రీవేంకటేశ్వరునికి బొట్టు పెట్టాలని భావించాను. స్వామివారే బొట్టు పెట్టుటకు నన్ను ప్రేరేపించుచున్నారని భావించాను. అందుకే నాకు అభిషేకము తరువాత తడితో దర్శనమిచ్చారని భావించాను. నా స్వామి నామములో మూడు ఒకట్లు ఉన్నవని నా ఇంజనీరింగు మైండ్‌తో భావించాను. కాబట్టి నా స్వామికి మొత్తం 111 కోట్ల జపమును సమర్పించాలని భావించాను. ఆ జప పుణ్యముతో స్వామివారికి బొట్టుపెట్టాలని తలంచాను. వెంటనే ఈ నిర్ణయాన్ని స్వామివారు మెచ్చుకున్నట్లు అనుభూతి పొందాను. ఎంతో ఆనందించాను. ఇది నా ప్రియాతిప్రియమైన స్వామివారి సేవ. ఇది తేలికగ ఉండకూడదని అత్యంత కష్టంగ ఉండాలని, అప్పుడే నాకు తృప్తి అని భావించుకున్నాను. వెంటనే ఇలా నిర్ణయించుకున్నాను. సం॥ 2002 నుండి సం॥ 2018 వరకు, ప్రతి సం॥ కనీసం 70 వేల మంది భక్తులు పాల్గొన్నా, కనీసం 7 కోట్ల జపాన్ని, 16 సం॥ల వరకు సమర్పించాలనుకున్నాను. జపం వ్రాయించుట నా ఉద్దేశ్యము కాదు. సం॥ 2002 నుండి 2018 వరకు, ప్రతి సం॥ము కనీసం 70 వేల మంది భక్తులచే, కనీసం 7 కోట్ల సార్లు నా కారణంగ స్వామివారిని స్మరింపచేయాలి. ఇదే నా అసలైన సంకల్పం. దీనిని నెరవేర్చుటకు జపం వ్రాయించుటను ఆయుధంగ ఎన్నుకున్నాను. ఇది నా జీవితం యొక్క లక్ష్యంగ నిర్ణయించుకున్నాను. ఇక ముందు వ్రాయబోయె జపము "తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 111కోట్ల జపములో భాగంగ 2వ పర్యాయంగ 7 కోట్ల జపసమర్పణ" అని ఉంటుందని నిర్ణయించాను. ఈవిధంగ 3వ సారి, 4వ సారి, .. 15వ సారి వరకు పోవును. చివరిది 111వ కోట్ల జపమని, స్వామివారి నామమును ప్రచారము చేయవలెనని అనుకున్నాను.

ఇలా, నా కారణంగ స్వామివారి కృపాకటాక్షాలు అందరికి లభించాలని తపించిపోయాను. ఈ కలియుగంలో నిరంతరం స్వామిసేవ, నామస్మరణచేసే అత్యంత అల్పునికికూడ స్వామివారు లభించగలరని అందుకు నిదర్శనంగ నన్ను ఎన్నుకునే స్థితికి చేరాలనిపించింది. ఇంత మంచి సంకల్పాన్ని ఇచ్చినందుకు నా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి కోటి కోటి ప్రణామాలను తెలుపుకున్నాను. నా సేవను వినియోగించుకుంటున్నందులకు ధన్యవాదాలు తెలిపాను.

నేను ఈ జపంను ప్రారంభించిన తరువాత నుండి స్వామివారి లీలలను చూడలేదు. మరో ప్రక్క కీ.శే. గవర్రాజుగారు జపం వ్రాయించుటను ఆపమన్నారు. అయనపైన మంచి గౌరవముంది, తన మాటకు విలువ

ఇవ్వాలనుకున్నాను, చివరికి ఏమి చేయాలనే సందిగ్ధావస్థలో ఉన్నాను. నిజానికి నా మనస్సులో పుట్టిన సంకల్పము స్వామి ఆజ్ఞ లేనిదే పుట్టదని నాకు తెలుసు. కాని స్వామివారు స్వయంగ ఏదైన సంకేతం ఇస్తే నాకెంతో బలం. నేనెవ్వరిని లెక్కచేయక ఆ పనిని చేసుక పోవుదుననుకున్నాను. స్వామి వారు ఈ జపసమర్పణ పనిని ఒప్పుకున్నట్లు ఇంతవరకు చూచించలేదు, కావున మొదటి 7 కోట్ల జప సమర్పణ కావించి ఊరుకుందామనుకున్నాను. చివరికి ఈరోజు ఉదయం 2.30 ని॥ లకు ఒక కల కన్నాను. అది ఈవిధంగ ఉంది.

జపంను కొనసాగించమని సూచించిన స్వామివారు

25-11-2002: కల: ఇందులో దాదాపు 20 నుండి 30 మంది సాధువులు ఉన్నారు. అందరు కాషాయరంగు పంచె ధరించారు. కొందరు కాషాయరంగు సెల్లలను కప్పుకున్నారు. కొందరికి గడ్డం ఉంది, మరికొందరికి లేదు. కాని అందరు శ్రీవేంకటేశ్వరుని తిరునామం ధరించి ఉన్నారు. వీరందరు మా ఆఫీసు మెట్ల దగ్గర "శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం" అని ఉన్న బోర్డు ముందర స్టైక్ చేస్తున్నారు. ప్రతి సాధువు మహామంత్రం, మహామంత్రం అని గొంతెత్తి అరుస్తున్నాడు. కొందరు ఒక చేయి ఎత్తి 'మహామంత్రం' అని అరుస్తున్నారు. ఒకాయన కుడిచేయి పైకి ఎత్తుచు, ఎగురుచు 'మహామంత్రం! మహామంత్రం!' అని అరుస్తున్నాడు. ఇదంతా కూడ శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం బోర్డు ముందర జరుగుచున్నది. కల చెదిరింది.

ఒక కంపనీ లాకౌట్ చేస్తున్నప్పుడు దానిని తెరువుమని ఉద్యోగులు స్ట్రైక్ చేస్తున్నట్లు అనిపించింది. అంటే వీరికి మహామంత్రం కావలెనని అర్థం. దీనితో నాకు స్వామివారి పైన అలకపోయింది. గవర్రాజుగారి మాటను ప్రక్కన పెట్టాను. జపసమర్పణ కార్యక్రమమును కొనసాగించ నిర్ణయించుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం అనే పేరును కొనసాగించాలా వద్దా? అనే సందిగ్ధావస్థలో ఉన్నాను. తెలిసిన వారిని ఈ విషయమై సంప్రదిస్తున్నాను.

స్వామివారితో పందెం కాయుట

తేది 23-11-2002 నుండి 07-12-2002 వరకు వైరల్ జ్వరంతో బయటికి వెళ్ళకుండ ఇంట్లోనే ఉన్నాను. కాబట్టి స్వామివారిని మరింత ఎక్కువ స్మరించుట, నా సంకల్పం విషయమై పదేపదే ఆలోచించుట జరిగింది. స్వామివారి విరహ వేదనను భరించలేక పోయాను. స్వామివారు గుర్తురాగానే కళ్ళనుండి నీరు రాలుచున్నవి, తపించిపోవుచున్నాను. మళ్ళీ ఒకరోజు రాత్రి దాదాపు అదే 2.30 ని॥ల ప్రాంతమున మేల్కొన్నాను. స్వామివారి గురించి విరహవేదన తీవ్రమైంది. పడి పొర్లాలనిపించింది. ఎలాగైన స్వామివారిని చూడాలని, ఆయనను పొందాలనే కోరిక కలిగింది. వెంటనే అడగాలా? వద్దా? అని అనుమానపడుతు ఈవిధంగ అడిగాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వర, మీరు కోరినట్లు ప్రతి సం॥ మీ కోసం 70 వేల మంది భక్తులచే కనీసం 7 కోట్ల జపమును, 16 సం॥ల వరకు అంటే సం॥2002 నుండి 2018 వరకు సమర్పిస్తాను. దాని ఫలితముతో బొట్టు పెట్టి మిమ్ములను మా ఇంటికి ఆహ్వానిస్తాను. వస్తారా? ప్రభూ! అని అడిగాను. మన హైందవ సాంప్రదాయములో ఒక వ్యక్తిని బొట్టుపెట్టి అత్యంత గౌరవంగ ఇంటికి ఆహ్వానించినట్లు మీకు 111 కోట్ల జపమును సమర్పించి, దాని ఫలితముతో బొట్టుపెట్టి మా ఇంటికి ఆహ్వానిస్తాను, రమ్మన్నాను. మరియు ఒక్కరోజు విశ్రాంతి తీసుకోను. మిమ్ములను సంతృప్తిపరుస్తాను. మీరు మా ఇంటికి వచ్చి నన్ను తృప్తి పరుస్తారా? ప్రభూ! అని అత్యంత దీనంగ నా కళ్ళనుండి నీరు జాలువారగ అడిగాను. ఒకవేళ స్వామివారు మా ఇంటికి వచ్చినట్లైతే! ఆయనను మనస్ఫూర్తిగ దర్శించి, పాదపూజ చేసి, రెండుమాటలు మాట్లాడి, తిరిగి తిరుమలకు పంపాలని భావించాను తప్ప మరో కోరిక లేదు. వెంటనే నాకు నేను ఇలా పునరాలోచించుకున్నాను. నిజానికి నేను ఒక అదమ స్థాయి వ్యక్తిని, ఈమాట అడుగకూడదు, కాని అడిగాను, పొరపాటు జరిగిందని నన్ను నేను సముదాయించుకున్నాను. తప్పైందని క్షమాపణ కోరాను. స్వామివారు మా ఇంటికి వస్తే ఆయనకు చిన్నతనమగునని భావించాను. కాని వెంటనే శ్రీవేంకటేశ్వరుడు దీనికి ఒప్పుకున్నారు. "నేను సిద్ధం" అనే భావము నా హృదయంలో స్పష్టంగ ఏర్పడ్డది. కాని "నేను స్వామి సేవలో ఒక్కతప్పు చేయకూడదు" అనే షరతు విధించినట్లు మరో భావం ఏర్పడ్డది. మొత్తం 16 సం॥ల సేవలో ఒకే ఒక తప్పుకు అవకాశం ఇచ్చాడు. రెండు తప్పులు చేసినట్లైతే నేను నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరుని పొందే భాగ్యమును కోల్పోతాననే భావం ఏర్పడ్డది. ఈవిధంగ నాకు శ్రీవేంకటేశ్వరునికి మధ్యన ఒక పందెం ఏర్పడింది. దీనిని చూసి నాకు నేను పరవశించిపోయాను. కాని ఇంతలోనే మరో భావం నన్ను ఆవహించింది. నేను ఋణం తీర్చుకొనుటకు, ఎలాంటి ఫలాపేక్ష లేకుండ సేవచేయాలనుకున్నాను. పైగ స్వామివారిని పొందే సామర్థ్యము లేని వాడిని, ఈ విషయం ఎవ్వరైనా వింటే నవ్వుకుంటారని భావించాను. పైగ గతంలో ఒక విషయంలో నా మనస్సులో జనించిన భావాలకు అనుగుణంగ ప్రవర్తించి దెబ్బతిన్నాను. కాబట్టి నా మనస్సులో జనించే భావాల ప్రకారం వెళ్ళడం సబబేనా? అనే అనుమానం కలిగింది. చివరికి ఇలా అనుకున్నాను. నేను మాత్రం స్వామి ఋణం తీర్చుకొనుటకు ఒక్క తప్పులేకుండ సేవచేస్తాను. కాని స్వామివారు నా సేవకు మెచ్చి తన దివ్యదర్శన భాగ్యంను ప్రసాదిస్తే దానిని బోనస్‌లాగ భావించుకుంటాననుకున్నాను. మరియు ఈ విషయాన్ని నా భార్యతోపాటు ఎవ్వరికి చెప్పదలచుకోలేదు. నాకు శ్రీవేంకటేశ్వరునికి మధ్యనే ఉన్నది.

నేను శ్రీవేంకటేశ్వరునికి 111 కోట్ల జపము సమర్పించి, దాని ఫలితముతో స్వామివారికి బొట్టుపెట్టు విషయము కొందరికి తెలుసు, ముఖ్యంగ డా॥ కొండారెడ్డి గారికి, హైదరాబాద్‌లో నాతోటి సహచరులు, పాండురంగారావు, శ్రీనివాసరావు, గోపాల్‌రావు మరియు నా భార్య సురేఖకు. కాని స్వామివారు తాను తృప్తి చెందితే మా ఇంటికి వస్తారన్న విషయం ఎవ్వరికి తెలియదు. నాకు శ్రీవేంకటేశ్వరుని మధ్యనే ఉన్నది. ఈవిధంగ నాకు శ్రీవేంకటేశ్వరునికి మధ్య ఒక పందెం ఏర్పడింది.

పవిత్ర స్నానం చేయించుట

మొదట్లో స్వామివారు కల్పించు కలలు కొన్ని అర్థం కాకపోయేది. ఎందుకు కల్పించుచున్నారో తెలిసేది కాదు, కాని కాలము గడిచినకొద్ది వాటి ఆంతర్యము బహు చక్కగ తెలిసేది. ఈ క్రింద తెలిపిన కల కూడ ఆరోజు అర్థం కాలేదు. కాని ఇది నేను స్వామి నిర్దేశించిన సంకల్పం తీసుకొనుటకు ముందు పవిత్రున్ని చేసింది. నన్ను రెండుసార్లు పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. ఆ లీలలు ఈవిధంగ ఉన్నాయి.

ఆకాశగంగ స్నానం చేయించుట

27-11-2002 : కల: ఈ కలలో నా భార్య పిల్లలను ఇంట్లోపెట్టి నేనొక్కడినే స్వామివారి దర్శనార్థమై తిరుపతికి వెళ్ళాను. క్రింద తిరుపతిలో నాలుగైదు అంతస్తులున్న ఒక హోటల్‌లో బసచేసాను. తిరుమలకు స్వామివారి దర్శనార్థమై పోవుటకని వేకువనే లేచి స్నానానికి వెళ్ళాను. ఈ హోటలులో అటాచ్‌డ్ బాత్‌రూంలు లేవు. గదులు ఒక వైపు బాత్‌రూంలు మరోవైపు ఉన్నవి. హోటల్ నిండుకున్నా సరిపోయినన్ని చాల బాత్‌రూంలు ఉన్నవి. కాని ఆరోజు విపరీతమైన జనాలు ఉన్నారు. నేను వెళ్ళేసరికి ప్రతి బాత్‌రూంలో కూడ జనాలే ఉన్నారు. భక్తులందరు ఒకేసారి స్నానాదులు చేయుట వలన బాత్‌రూంలలో నీరు రావటం లేదు. స్వామి దర్శనార్థం సమయం మించి పోవుచున్నందున, సరిగా స్నానం చేయకనే కట్ డ్రాయర్‌పైననే స్వామివారి దర్శనార్థం పరుగులు తీస్తున్నారు. మరి కొందరు స్నానము చేయుటకు ఒకరిపై ఒకరు పడుచున్నారు. అక్కడ ఎన్ని బాత్‌రూంలు ఉన్నా కూడ వాటినిండా





జనాలే ఉన్నారు. నేను కూడ వారిలాగ స్నానము చేయుటకు వెళ్ళాను. నాకు కూడ నీరు దొరకలేదు బాధపడ్డాను. స్వామివారిని ఎలా దర్శనము చేసుకోవాలని చింతించాను. ఇంతలో నా మనస్సులో నీకు నీళ్ళు దొరకలేదా? అనే భావం కలిగింది. "నిన్ను చాల ఉత్తమమైన నీటితో స్నానం చేయించుదును" అనే భావం వెనువెంటనే కలిగింది. ఇంతలో ఒక శక్తి నన్ను అక్కడి నుండి మాయం చేసింది. ఆ శక్తి నన్ను ఆకాశమార్గాన తీసుకెళ్ళి ఒక చెఱువు నీటి అంచున దింపింది. అక్కడ ప్రశాంతమైన వాతావరణము, చల్లనిగాలి వీచుచున్నది. ఒక రకంగ మానస సరోవరం లాంటి పరిస్థితులు ఉన్నవి. అక్కడ నేను తప్ప మరెవ్వరు లేరు. నీరు చాలా స్వచ్ఛంగా స్పష్టంగ ఉన్నవి. ఈ చెఱువు పటంలో చూపినట్లు శంకు ఆకారములో ఉంది. ఇది ఆకాశగంగ అని నాకు కలలో అనిపించింది. నేను ఆ చెఱువు నీటిలో ఒక చివర ఉన్నాను. ఇంతలో ఒక అల నానుండి 20–25 అడుగుల దూరములో ఏర్పడింది. అది పడుకోబెట్టిన ఇంగ్లీషు అక్షరం > ఆకారంలో ఉంది. అది సరిగ్గా నావైపు వచ్చింది. ఆ శక్తి నన్ను ఆ అలపై పడుకోబెట్టింది. నేను దాని కొనభాగమును (మొన భాగము) రెండు చేతులతో గట్టిగ పట్టుకున్నాను. "నీవు మొత్తం ఈ చెఱువును చూడు" అనే భావం నాలో కలిగింది. ఆ అల నన్ను తీసుకొని చెఱువు చుట్టు త్రిప్పింది. నాకు మధ్యలో చాల హాయిగ అనిపించింది. "నీకు భయమైతుందా?" అనే భావం మనస్సులో కలిగింది. నాకెందుకు భయమైతది నాకు మహామంత్రం వచ్చును అని నాకు నేనే అనుకున్నాను. ఇంతలో ఆ అల నన్ను మొత్తం చెఱువును తిప్పి నేను ఎక్కడైతే అలపైకి ఎక్కానో అక్కడికి తెచ్చిన తరువాత మాయమైంది. నేను అలపై వచ్చినప్పుడు, ఆ అల మాయమైనప్పుడు నాలో ఉలుకు, పలుకు, వణుకు లాంటివి ఏమి లేవు చాల ఆశ్చర్యంగ అనిపించింది. ఇది నిజంగ జీవితంలో ఒక మరపురాని ఘటన. ఇంతే కల. ఎంతో ఆనందించాను. ఈవిధంగ నన్ను పవిత్ర జలాలలో స్నానం చేయించాడు.

కొండపైన పవిత్రున్ని చేయుట

కొన్ని కలలను నేను వ్రాయుట మరచాను. అందులో ఇప్పుడు చెప్పబోవునది ఒకటి. దీనిని నేను తేది వేయకుండ నా డైరిలో వ్రాసుకున్నాను. మరియు అత్యంత మధురమైన ఘటన. నన్ను పవిత్రున్ని చేసింది.

కల : ఒక సారి స్వామివారు నన్ను తన యోగమాయచేత తిరుమల కొండపైన, స్వామి ఆలయానికి వాయువ్య దిశలో ఉన్న మాడ వీధిలో దించారు. స్వామి మాయచే ప్రక్కనే ఒక పెద్ద కొండ ఉంది. ఆ కొండ పైనుండి ఒక 50 HP నుండి 75 HP మోటారు నీరు ఎంత దొడ్డుగ వస్తుందో అంత నీరు కొండ పైనుండి క్రింద నాపైన పడే విధంగ పడింది. నేను పూర్తిగ ఈ నీటితో స్నానం చేసాను. ఒక రకంగ పవిత్రున్ని అయినాను. ఇది కల.



ఈవిధంగ స్వామివారు రెండుసార్లు పవిత్రజలాలతో పునీతున్ని చేసాడు. ఈ రెండు కూడ నేను సంకల్పం తీసుకొనుటకు ముందు జరిగినవి.

సందేహాల నివృత్తి, శ్రీశ్రీ మాడాంబకం స్వామి సలహా

21-12-2002: కీ.శే. వాడ్రేవు గవర్రాజు గారు శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం అనే పేరును తొలగించమన్నారు. మరియు జపం వ్రాయించే యోగ్యత నాకు లేదన్నారు. కాని స్వామివారు తేది 25-11-2002 నాటి లీలలో నన్ను జపం వ్రాయించుటను కొనసాగించమన్నారు. కాబట్టి జపం వ్రాయించుటను కొనసాగించ నిర్ణయించుకున్నాను. కాని పీఠం పేరును మాత్రం 'శ్రీవేంకటేశ్వర సేవా సమితి' అని మార్చుదామని నిర్ణయించుకున్నాను. చివరికి హైదరాబాద్‌లో ఈ పీఠం పెట్టినప్పుడు నాకు సహాయకులుగ ఉన్న శ్రీ పాండురంగా రావు, శ్రీనివాస రావు, గోపాల్ రావు గార్లతో చర్చించాను. వారు దీనికి ఒప్పుకోలేదు. కీ.శే. గవర్రాజు గారు తన స్వార్థం కోసం ఇలా చేస్తున్నారని మనము వినకూడదని అన్నారు. దానిని నేను ఒప్పుకొని పేరును ఇంతవరకు మార్చలేదు. ఇంకా కొందరి అభిప్రాయము కొరకు వేచిచూస్తున్నాను. ఈ విషయాన్ని తిరుపతిలోని శ్రీకొండారెడ్డిగారితో చెప్పాను. మరియు తిరుపతిలో ఆయనకు తెలిసిన పెద్దలతో చర్చించి నేను పీఠంను పెట్టుకోవచ్చా? లేదా అనే విషయంను కనుక్కొమ్మన్నాను. మరియు నా సంకల్పమును కూడ అంటే స్వామివారికి మొత్తం 111 కోట్ల జపసమర్పణ విషయమును, స్వామివారికి బొట్టు పెట్టుటను పూర్తి విషయాలను తెలుపుచు ఈరోజు ఒక సుదీర్ఘమైన ఉత్తరమును వ్రాసాను. నేను సందిగ్ధములో ఉన్నానని, ఈ పనులు చేయవచ్చా లేదా అనే విషయమును తిరుపతిలోని పండితులను విచారించి తెలుపమని మరిమరి వేడుకున్నాను. మరియు అంతవరకు నేను శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠంను కొనసాగించుచు, జప పుస్తకముల పంపిణీని జరుపుచున్నాను.

వచ్చే వైకుంఠఏకాదశి రోజున తిరుమల కొండపైన స్వామివారి జపపుస్తకాల పంపిణీ చేయాలని చాల కోరిక కలిగింది. మరియు స్వామివారిని ఆ రోజు దర్శించాలనిపించింది. ఈవిషయాన్ని డా॥ కొండారెడ్డి గారితో చెప్పి సహాయము చేయమన్నాను. చివరికి ఆయన ఆహ్వానం మేర వైకుంఠ ఏకాదశికి తిరుపతి వెళ్ళాను. అనుకోకుండా నా సందేహాలకు నివృత్తి కూడ లభించింది. ఆలీల ఈవిధంగ ఉంది.

14-01-2003, ఈరోజు వైకుంఠ ఏకాదశి, తిరుమల కొండపైన స్వామివారి జపపుస్తకాలను పంపిణి చేయాలని, మరియు స్వామివారిని వైకుంఠ దర్శనము చేసుకోవాలనే ఉద్దేశ్యముతో తిరుమలకు వెళ్ళాను. డా॥ కొండారెడ్డి గారి సహకారముతో కొండపైన జపపుస్తకములను పంచాను. మరియు ఉదయము స్వామివారి దర్శనము కూడ చేసుకున్నాను.

ప్రతి వైకుంఠ ఏకాదశి రోజు ఉదయం స్వామి వారి బంగారు రథము తిరుమల ఆలయం చుట్టు తిరుగుట ఆనవాయితి. అప్పుడు తిరుమలలో కీ.శే. శ్రీశ్రీ మాడాంబకం స్వామి అనే ఒక వైఖానస పండితుడు ఉండేవారు. వీరు తిరుమల ఆస్థాన పండితులు. స్వామి కృపవల్ల డా॥ కొండారెడ్డిగారికి ఈ బంగారు రథం త్రిప్పే దానిలో డైరీఫాం తరపున డ్యూటీ పడింది. ఆ రథయాత్రకు శ్రీమాన్ మాడాంబకం స్వామివారు కూడ వచ్చారు. ఆనాడు ఈ రథయాత్ర మొత్తం దాదాపు 2 గం॥ల కాలం జరిగింది. ఈ రెండుగంటల కాలము డా॥ కొండారెడ్డిగారు మరియు మాడాంబకం స్వామివారు కలిసి రథయాత్ర ముందు నడుచుకుంటు ఉన్నారు. ఈ సందర్భంగ మొత్తం దాదాపు 2 గంటల కాలము డా॥ కొండారెడ్డి గారు నాగురించి మాడాంబకం స్వామివారికి అన్ని విషయాలు చెప్పారు. డైరీఫాంలోని స్థూపనిర్మాణము, స్వామివారి ప్రేరణ, నా తపన శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఏర్పాటు, మరియు 16 సం॥లు ప్రతి సం॥ము 7 కోట్ల జపసమర్పణ గురించి చెప్పారు. మరియు నేను శ్రీవేంకటేశ్వరునికి బొట్టుపెట్టుట గురించి కూడ అడిగారు.

అప్పుడు కీ.శే. మాడాంబకం స్వామివారు ఈ కార్యక్రమము చాల మంచిదని అన్నారు. కాని ప్రస్తుతము నేను వ్రాయించుచున్న "ఓం శ్రీం వేంకటేశాయ నమః" అనే మహామంత్రానికి బదులుగా "ఓం నమో వేంకటేశాయ" అనే మహామంత్రమును వాడమని చెప్పారు. "శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం" అనే పేరు పెట్టుటలో తప్పులేదని అన్నారట. ఇక బొట్టు విషయము వచ్చేసరికి, దీనికి ఒక పూజ అంటూ ఏదీలేదని ఇది భక్తులు వారివారి మనస్సులో జరుపుకొనే మానసిక పూజ అని తెలిపారు. మరియు నన్ను ఇదే విధంగ కొనసాగించమని చెప్పారు. మధ్యహ్నం 2.0 గం॥లకు శ్రీ కొండారెడ్డి గారు కొండపై రూంలో ఈ విషయాలు నాతో చెప్పారు. మరియు, మాడాంబకం స్వామివారు చాల కాలము స్వామివారి ప్రధాన అర్చకుడు, తిరుమల తిరుపతి ఆలయాలకు పెద్ద, ఆయనను మించిన వారు లేరు కాబట్టి ఆయన చెప్పిన దానిని పాటించమన్నాడు. సందేహాలను తీర్చుకొనుటకు మరెవ్వరిని అడుగకు మన్నారు. దీనికి నేను చాల సంతోషించాను. ఇది నా స్వామి అనుగ్రహము వలననే జరిగిందని భావించాను. పేరును మార్చను మరియు 'ఓం శ్రీం వేంకటేశాయ నమః" నుండి "ఓం నమో వేంకటేశాయ" అని మహామంత్రమును మార్చుదునని నిర్ణయించాను.

గతంలో తేది 26-08-2002 నాడు శ్రీగవర్రాజు గారు పొందిన కలను విశ్లేషించుకున్నాను. "ఈ స్థూపం పేరుపైన ఒక సంస్థ ఏర్పాటు అగునని, మంచి పేరు సంపాదించునని చెప్పుచు ఈ విషయం నీకు ఇప్పుడు అవసరంలేదు" అని చెప్పారు. అప్పుడే స్వామివారు దీనిని ఇన్‌డైరెక్టుగ తెలిపారని భావించాను. ఇప్పటి నుండి శ్రీ గవర్రాజు గారితో బంధం తెగిపోయింది, టి.టి.డితో బలపడింది.

సం॥ 2003 లో నా ఆర్థిక పరిస్థితి అంతంతనే ఉంది. భక్తి ప్రపంచములో అప్పుడప్పుడే ప్రవేశించాను. శాస్త్రజ్ఞానము అసలే లేదు. ఇలాంటి పరిస్థితులలో నేను సం॥ 2002 నుండి సం॥ 2018 వరకు, 16 సం॥లు ఇంత పెద్ద సేవ చేయ నిర్ణయించానంటే దానికి పూర్తి ప్రేరణ, శక్తి నా స్వామివారిదే! ఈ సంకల్పం తీసుకొన్నప్పుడు, దీనిని నేను 100% పూరించగలననే నమ్మకము నాలో దృఢంగ ఉంది. నేనేమాత్రం వెరవలేదు. ఎంతో డబ్బు ఖర్చు పెట్టాల్సిన పని అయినప్పటికి నాలో ఎలాంటి భయము కాని చేయలేననే అనుమానము కాని ఏ కోశాన లేదు. నా భార్యకు మాత్రం మనం ఈ పని చేయగలమా? మన ఆర్థిక పరిస్థితి సహకరించునా? అనే అనుమానం ఉండేది. పైగ మేము ఈపనికి మా సొంత డబ్బును ఉపయోగించదలచాము. ఇష్టపూర్వకంగ ఇస్తే తప్ప ఇతరులను నోరు తెరచి అడగకూడదని నియమం పెట్టుకున్నాం! జీవితాంతం, మా ఆఫీసుకు వచ్చిన ప్రతి భక్తునికి లేదనకుండ జప పుస్తకము ఇవ్వాలని నిర్ణయించుకున్నాము. ఈ జీవితంలో తనవితీర స్వామిసేవ చేయుటకు ఈ సంకల్పాన్ని తీసుకున్నాను తప్ప స్వామివారిని పొందాలనే ఉద్దేశ్యము నాలో ఏమాత్రం లేదు.

ఇక ఈ సేవ సరైనదేనా? శాస్త్ర ప్రకారంగ ఉన్నదా? అనే ప్రశ్నను ఎవ్వరైన వేస్తే వినదలచుకోలేదు. ఇతరులు చెప్పే విషయాలకు ప్రభావితులమై మార్పులు చేర్పులు చేయదలచుకోలేదు. కేవలం శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞానుసారం, వారిని సంతోషపెట్టుటే లక్ష్యంగ సేవను ప్రారంభించాము. కాని నా సంకల్పం ఇతరులకు తెలియకుండ ఒక లోగోను తయారు చేయాలని భావించాను.

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం లోగో

08-02-2003 : శ్రీ వేంకటేశ్వరునికి సంకల్పించిన మొత్తం 111 కోట్ల జప సమర్పణ మరియు దాని లక్ష్యంను ఎవ్వరికి తెలియకుండ రహస్యంగ ఒక లోగోలో ఇమిడ్చాలనిపించింది. స్వామివారి ప్రేరణతో ఆనందనిలయంపై తిరునామం పెట్టి, ఆ నామం మధ్యలో

బొట్టుపెట్టుటను లోగోగ నిర్ణయించాను. దీనర్థం తిరుమల ఆనందనిలయ వాసునికి 111 కోట్ల జపము సమర్పించి దాని ఫలితముతో ఆయనకు బొట్టుపెట్టుట అనేది ఈ లోగో యొక్క అర్థంగా పెట్టుకున్నాము. రథసప్తమి 08-02-2003 రోజు ఆఫీసులో పూజ చేసి సంకల్పమును విడుదల చేసాము. ఈపూజ చేయు సమయాన స్వయంగ తిరుమల శ్రీవారే నా ముందు కనబడ్డారు. నేను స్వయంగ వారినే పూజించానన్న తృప్తిపొందాను. మొత్తం సంకల్పమును మరియు లోగోను భక్తులకు పంచాను. సం॥ 2002 నుండి 2018 వరకు ప్రతి సం॥ 7 కోట్ల జపసమర్పణ జరుగునని తెలిపాను. సంకల్పం ఇలా ఉంది.

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కోట్ల జప సమర్పణలోని సంకల్పము

1. శ్రీ వేంకటేశ్వరుని నామమును అందరికీ తెలుపుతూ, నిర్మలమైన మనస్సుతో స్మరింప, ధ్యానింప చేయుటకు ప్రయత్నించుట. వారందరినీ శ్రీవారి కరుణాకటాక్షములకు, దివ్యమైన ఆశీస్సులకు, అనుగ్రహానికి పాత్రులుగా చేయుట.

2. భక్తులు తమ కోరికలను తీర్చుకొనుటకు ఒక సాధనముగా ఉపయోగపడుట. శ్రీవారి నామమును స్మరించుట వలన కలిగే ఆనందమును అందరికీ తెలియజేసి కృతార్థులమైనట్లు భావించుట.

3. భక్తులలో శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల భక్తిని పెంపొందించి, ఆయనపై అమితమైన విశ్వాసము, సమర్పణ భావాన్ని కలిగించుటకు మరియు భక్తులకు శ్రీవారి సేవ చేయు భాగ్యమును కల్పించుట.

4. ప్రతిసారీ కనీసం 7 కోట్ల జపమును స్వామివారికి సమర్పించి కనీసం 70 వేలమంది భక్తుల కోరికలను తీర్చుమని శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించే భాగ్యమును పొందుట.

5. 2002 నుండి ప్రతి సంవత్సరము 7 కోట్ల జపమును శ్రీ వేంకటేశ్వర స్వామికి సమర్పించుచూ "శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము" ను శ్రీవారి నామముతో నింపి శ్రీవేంకటేశ్వరుడు మాపై పెట్టిన బాధ్యతను నెరవేర్చినామని సంతోషించుట.

6. శ్రీ వేంకటేశ్వరుని \|/ నామము విలువ అనంతము. దానికి విలువ కట్టుట మాకు ఈ జన్మకు సాధ్యము కాదు. కాని దాని విలువను \|/ కోట్ల జపమునకు సరిపెట్టుమని ప్రార్థించి, అంత జపమును సమర్పించి, ఫలితమాశింపక శ్రీవారి తిరునామములో \|/ బిందువులాగా ఇమిడిపోయి ఆ తిలక ధారణలోని ఆనందమును అనుభవించుట.

7. ఈ కార్యక్రమములో అందరు భక్తులు పాలుపంచుకునేలా ప్రోత్సహించి వారి శక్త్యానుసారం తమ సేవలందించుటకు అవకాశము కల్పించి, నిస్వార్థ సేవతో, ఫలితమాశించకుండా చివరిదాకా సేవచేయుచూ చిట్టచివరకు ఆ శ్రీ వేంకటేశ్వరుని పాదసేవకునిగా మిగిలి అమితానందమును అనుభవించుట.

ఇది, ఆరోజు వ్రాసుకున్న సంకల్పము. దీనిని పూరించుటకు సేవచేయ సిద్ధమైనాము.

నా ఆత్రుతలో భాగంగ రెండు జపపుస్తకములకు ఈ సంకల్పమును జతచేసి అప్పటి టి.టి.డి ఇ.ఓ శ్రీమాన్

అజయ్ కళ్యాం గారికి, మాడాంబకం స్వామివారికి, డా॥ కొండారెడ్డి గారికి మరికొందరు టి.టి.డి అధికారులకు పంపాను. కాని తరువాత రోజులలో శ్రీవేంకటేశ్వరుడు దీని ద్వార ఒక లీల జరిపి నాకు మహాదానందం కలిగించునని ఊహించలేకపోయాను.

ఒక విశ్లేషణ : శ్రీ వేంకటేశ్వరుడు నాకు తన 'సేవావృక్షాన్ని' ప్రసాదించారు. శ్రీవేంకటేశ్వరున్ని పొందడమే లక్ష్యంగ జపసమర్పణతో పాటు ఎన్నోసేవలను ప్రసాదించారు. ప్రతి సేవాలక్ష్యం స్వామివారిని పొందడమే. పూర్వము ఋషిభద్రుడు, ఋషియాదగిరి తపస్సు చేసి యోగ్యత సాధించి వారి ఇష్టదైవాన్ని పొంది భద్రాచలం, యాదగిరిగుట్ట క్షేత్రాలను ఏర్పాటు చేసారు. అదే విధంగ నేను కూడ స్వామి సేవలనే తపస్సు చేసి యోగ్యత సాధించి, శ్రీవేంకటేశ్వరున్ని పొంది చిన్నగుండవెళ్ళి గ్రామంలో 'హరినామ క్షేత్రం' ఏర్పాటుకు కారకున్ని కావలెనని స్వామివారి లక్ష్యం. ఈ లక్ష్య సాధనకే సం॥2000 నుండి నేటి వరకు (అక్టోబర్, 2023) స్వామివారి లీలలు కొనసాగుచున్నవి. ప్రతిలీల స్వామివారి గురించి తపనే లక్ష్యంగ సాగుతుంది.

నా దిశ: స్వామివారి సేవాభాగ్యం లభించింది. శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠంను ఏర్పాటు చేసాను. 16 సం॥ల సేవ లభించింది. ఒక్క తప్పు లేకుండ సేవ చేసి శ్రీ వేంకటేశ్వరున్ని పొందాలనే లక్ష్యం ఏర్పడింది.

భాగవత ఆశీర్వాదము: తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థించుచు ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

8వ భాగము

(ఫిబ్రవరి 2003 - జూన్ 2003)

నమో వేంకటేశాయ రథ సంకల్పం

తేది 17-02-2003 : ఈ రోజు ఉదయం 3.0 గంటలకు మేల్కున్నాను. స్వామివారి సేవ గురించి ఆలోచించాను. నేను ప్రతి సం॥ 7కోట్ల జపములను సమర్పించాలి, అందులో కనీసం 70వేల మంది భక్తులు భాగస్వాములు కావాలి, వారి కోర్కెలను తీర్చుమని స్వామివారిని ప్రార్థించాలి. కాని ఈసారి మొత్తం 70,300 జపపుస్తకములను ప్రింటుచేయించాను.ఒకపుస్తకములో1200నామాలు వ్రాయవచ్చు.కానికొందరుఒకటికంటే ఎక్కువ పుస్తకములు వ్రాస్తున్నారు. కావున జపసంఖ్య 7 కోట్ల కంటే ఎక్కువ అగుచున్నప్పటికి భక్తుల సంఖ్య మాత్రం 70 వేల కంటే తగ్గుచున్నదని గ్రహించాను. శ్రీవేంకటేశ్వరుని దీనంగ ప్రార్థించాను. ఓడిపోతున్నానని దుఃఖిస్తూ దారి చూపమన్నాను. నా కళ్ళ నుండి నీరు పటపట రాలాయి. వెంటనే స్వామి కృపతో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఒక రథం తయారుచేయాలని, ప్రతి జపసమర్పణ సమయము కంటే కనీసం 11 రోజుల ముందు ఈ రథమును హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్ళాలనుకున్నాను. శ్రీవేంకటేశ్వరున్ని స్మరింపచేసి, భక్తులు వారి వారి కోరికలను మనస్సులోనే కోరుకున్న తరువాత, స్వామి మహామంత్రాన్ని ఒక పేపరు పైన వ్రాయించి రథంలో వేయిస్తూ తిరుపతి చేరాలనే ఆలోచన కలిగింది. ఈ విధంగ సులభంగ 70 వేల మంది భక్తుల సంఖ్యను పూరింపవచ్చుననే చక్కని ఆలోచన వచ్చింది. తరువాత ఈ రథం ఏవిధంగ ఉండాలనే విషయం గురించి ఆలోచించాను. స్వామివారి ప్రేరణతో ఈ రథం తిరుపతిలోని 'శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము' యొక్క బ్రాస్ నమూనాను 'నమో వేంకటేశాయ' పేరుతో అత్యంత సుందరంగ భారీస్థాయిలో నిర్మించాలనే భావం కలిగింది.

మరోప్రక్క తిరుమల శ్రీవేంకటేశ్వరుని లీలలను చూడక చాల రోజులు అయ్యింది. స్వామివారిని, ఆయన లీలలను చూడాలని తపించిపోయాను. ఒకసారి మాత్రం స్వామివారి దర్శనార్థం తిరుమల ఆలయంలోనికి వెళ్ళినట్లు మహాద్వారం దాటిన పిదప పక్కకు పోయినటుల కల కన్నాను. కాని స్వామివారిని చూడలేదు. ఎన్నోసార్లు స్వామివారిని కనబడమని వేడుకున్నప్పుడు తప్పక ఈరోజు కనబడగలరనే నమ్మకము కలుగుతుంది కాని కనబడలేదు. అయినప్పటికీ నాసేవకు కావలసిన ప్రేరణను మాత్రం ఎప్పటికప్పుడు కలిగిస్తూనే ఉన్నారు.

చివరికి నేను ఇలా భావించుకున్నాను. స్వామివారు మొత్తం ఈ సృష్టిని నడిపించాలి, ఆయనకు ఎన్నో పనులుంటవి, సమయం దొరికినప్పుడు వారే నన్ను కటాక్షించుదురు కాబట్టి వారిని ఇబ్బంది పెట్టకూడదని భావించి క్షమించమని వేడుకున్నాను. వెంటనే స్వామివారు క్షమించినట్లు అనుభూతి పొందాను.

ఈ జపసమర్పణ ఒక్క సేవతో నేను సంతృప్తి చెందలేదు. దీనితో పాటు ఎన్నో రకాల స్వామివారి సేవలను ప్రారంభించాలనిపించింది. పుణ్యనదుల నీటితో స్వామివారి అభిషేకము, తరువాత కళ్యాణాలు జరిపించాలనే కోరిక కలిగింది. కొన్ని వందల జంటలను భాగస్వాములు చేయాలని, అందరికి స్వామివారి కృపాకటాక్షములు లభించే విధంగ చేయాలనిపించింది. స్వామివారిని ఎన్నో ప్రాంతాలకు తీసుకెళ్ళి అత్యంత వైభవంగ భక్తులచే సేవింపచేయుచు, భక్తులకు స్వామివారి ఆశీర్వాదములు అందించే విధంగ చేయాలనిపించింది. ప్రతి కార్యక్రమము నా ఆధ్వర్యములో జరగాలనిపించింది. ఒకరకంగ నేను టి.టి.డి ఈ.ఒ పాత్ర పోషించాలనిపించింది. ఇంతవరకు ఎవ్వరూ చేయని రీతిలో అత్యంత వైభవంగ స్వామివారి సేవలను నా తనివితీర చేయాలనిపించింది. నా కారణంగ ఎంత మంది భక్తులకు స్వామివారి కృపాకటాక్షాలు లభించునో అది నా సేవక సామర్థ్యానికి నిదర్శనంగ ఎంచుకోవాలనిపించింది. చివరికి అప్పటి నా శక్తి సరిపోదని నాకు మరింత శక్తిని ప్రసాదించి ఈ సేవలను నాచే జరిపించుమని స్వామివారిని వేడుకున్నాను.

ఇక్కడ మరో ముఖ్యమైన విషయమును చెప్పుతున్నాను. స్వామి వారు తన సేవలను ప్రసాదించు సమయాన కేవలం నా కుటుంబ పోషణార్థమే వ్యాపారం చేయుటకు అనుమతించారు. కాని తరువాత రోజులలో నేను ఈ విషయాన్ని పూర్తిగ మరిచి పోయాను. వ్యాపారాభివృద్ధికి ఎంతో ప్రయత్నించాను. దీనితో స్వామివారు నాకు తెలియకుండానే ఫిబ్రవరి 2003 నుండి ఆర్థిక నష్టం కలుగునట్లు చేయసాగారు.

శ్రీవేంకటేశ్వర సేవాసమితిని ఏర్పరచుట

గతంలో అనుకున్నట్లు తేది 28-02-2003 నాడు మా ఆడిటర్ శ్రీమాన్ జనార్ధన్ రావుగారి వద్ద 'శ్రీవేంకటేశ్వర సేవా సమితి' అనే ట్రస్టును వ్రాయించాను. నేను, నా భార్య సురేఖ మరియు మా అమ్మ పుల్లగూర్ల రుక్మమ్మలు సభ్యులుగా ఈ ట్రస్టు ఏర్పడింది. ఈ ట్రస్టు ద్వార శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠంతో పాటు భవిష్యత్ లో మరిన్ని సేవలను దీని క్రింద ఏర్పాటు చేసుకోవచ్చునని మా అడిటర్‌గారు చెప్పారు. దీనిని తేది 09-03-2003 నాడు నెం. 66/2003తో రిజిస్ట్రేషన్ చేయించాము. ఈ ట్రస్టు క్రింద ప్రతి సం॥ము ఇన్‌కం టాక్స్‌ని సమర్పించాలని భావించాను. ఈ రోజు ఒక కల కన్నాను.

కల : ఈ కలలో నేను, నా భార్య కలిసి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుటకు ఒక ఆలయంకు వెళ్ళాము. సమయం దాటిన కారణంగ ఆలయంలోపల ఎవ్వరులేరు. కాని నేను స్వామివారి దర్శనము లేనిదే వెళ్ళనని అనుకున్నాను. స్వామివారిని చూడాలనే తపనచే నేనొక్కడినే తలుపులు తీసుకొని లోనికి ప్రవేశించాను. లోన వెతికాను స్వామివారు కనబడలేదు. పైకి వెళ్ళాను అక్కడ పురాతన భవనం ఒకటి ఉన్నది. దానికి రాయితో కట్టిన మెట్లు ఉన్నవి. అత్యంత ఆత్రుతచే త్వరత్వరగ మెట్లు ఎక్కాను కాని స్వామివారు కనబడలేదు. చివరికి నిరాశతో వెనుతిరిగాను. ఇది కల. ఇది స్వామివారిని చూడాలనే నా తపనను, ఆర్తిని తెలుపుతున్నదని భావించాను.

నేను శ్రీవేంకటేశ్వర స్వామివారికి భక్తుడను సేవకుడను అనే మాట వాస్తవం. కాని కొన్ని సందర్భాలలో పట్టుపట్టేవాన్ని. నామాటే నెగ్గాలనే పట్టుదల అధికంగ ఉండేది. కాని ఈ విషయాన్ని స్వామివారితో నేరుగ చెప్పేవాన్ని కాదు, ధైర్యము చాలక నాలో నేనే మదనపడేవాడిని. శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నా హృదయాంతరంగంలో

ఉన్న కోరికను గ్రహించేవారు. నేను అత్యంత మదనపడిన తరువాత నా మనసులోని కోరికకు అనుగుణంగ అనుగ్రహించేవారు. అప్పుడు నా ఆనందం అంతా ఇంతా కాదు ఆకాశమంత ఉండేది తబ్బిబై పోయెవాడిని. ఈ విధంగ ఎన్నోసార్లు అనుగ్రహించారు. అలాంటిది ఇప్పుడొకటి జరిగింది.

స్వామివారిపై నమ్మకము లేనందుకు దండించుట

తేది 15-11-2002 కార్తిక ఏకాదశి నుండి ఉచిత జపపుస్తకములను భక్తులకు పంచుచు 7 కోట్ల జపమును వ్రాయిస్తున్నాను. దీనిని 16 సం॥ ల వరకు ప్రతి సం॥ము చేయుదునని ఒక సంకల్పము తీసుకొన్నాను. గతంలో ఈ విషయం నలుగురికి తెలియాలనే ఉద్దేశ్యముతో నా సంకల్పమును మరియు రెండు జపపుస్తకములను టి.టి.డి ఇ.ఒ తో పాటు మరికొంత మందికి పంపాను.

ఈ మొదటి ఏడు కోట్ల జప సమర్పణ ఒక ప్రత్యేక పద్ధతిలో చేయాలనిపించింది. ఒకరకంగ స్వామివారి అనుగ్రహము ఈ సేవలో ఏవిధంగ ఉందో చూడాలనిపించింది. అది ఎలా అంటే, ఈ మొదటి ఏడుకోట్ల జపంను ఏడుకొండలవాడికి ఏడు నెలల్లో సమర్పించాలి. మరియు ఈ సమర్పణ తేది స్వయంగ స్వామివారి నుండి నాకు అందాలి. అంటే స్వయంగ స్వామివారే నన్ను ఈ తేదినాడు సమర్పించుమని ఆదేశించాలి అనే భావం నా మనస్సులో బలంగ నిండుకుంది. కాని దీనిని నా స్వామివారికి చెప్పలేదు. నాలో నేనే ఇలా అయితే బాగుండునని అనుకున్నాను. ఒకసారి డా॥ కొండారెడ్డి గారితో మాటల సందర్భంగ చెప్పాను. అంటే 15-11-2002 నుండి 15-06-2003 లోపల ఈ ప్రథమ ఏడుకోట్ల జప సమర్పణ జరుగాలి. అప్పుడే నాకు తృప్తి అని, స్వామివారి అనుగ్రహము ఈ సేవలో నిండుగ ఉన్నదని భావించుదునని అనుకున్నాను. నా వైపునుండి మాత్రం జపపుస్తక వితరణ అత్యంత సంతృప్తికరంగ జరుగుచున్నది. 15-03-2003 వరకు 69,400 జపపుస్తకములను పంచాము. ఇంకా 900 జపపుస్తకములే పంచాల్సి ఉంది. వీటిని పంచగలననే నమ్మకము ఉంది. కాని వ్రాసినవి అప్పటివరకు కేవలం 5,000 మాత్రమే వచ్చాయి. వ్రాసిన జపపుస్తకములను తిరిగి నా వద్దకు చేర్చుట నాచేతిలో లేని విషయము కాబట్టి స్వామివారిని తీవ్రంగ ప్రార్థించాను. నిరాశ చెందాను సహాయము చేయమని వేడుకున్నాను. తిరుమలగిరి ఆలయంలో, మరో దగ్గర ఇలా స్వామివారిని వేడుకున్నాను. వ్రాసిన జపపుస్తకములను పంపుమని ప్రార్థించాను, మరియు జప సమర్పణ సమయాన పూజ ఏవిధంగ చేయాలి, ఎవ్వరిని పిలువాలి, ఏం మాట్లాడాలి ఇలా రకరకాల ప్రశ్నలు వేధించాయి. వీటన్నింటికీ జవాబు కోరుతు ప్రార్థించాను. ముఖ్యంగా ఏడు నెలల్లో 7 కోట్ల జపసమర్పణ చేయగలనా? వ్రాసిన పుస్తకాలను సేకరించగలనా? అనే భయము నన్ను తీవ్రంగా వెంటాడింది. ఒక్కొక్కసారి ఓడిపోతాననే భయముచే వణుకిపోయాను. నా మానసిక స్థితికి తగినట్లు ఈ సందర్భములో శ్రీవేంకటేశ్వరుడు ఒక చక్కని లీలను చూపాడు. ఆ లీల ఈవిధంగ ఉంది.

16-03-2003 : కల : అది ఒక పెద్ద మైదానము. దాని ఒక చివర ఒక పొడుగాటి గోడ ఉంది. దీని ముందు మైదానము వైపు రెండడుగుల ఎత్తుతో 30' × 20' సైజుగల ఒక స్టేజి ఉంది. ఈ స్టేజి మధ్యలో గోడకు రెండు రెక్కలు కలిగిన డోరు ఒకటుంది. ఈ డోరు నుండి బయటకు వెళ్ళిన తరువాత అంటే ఆ గోడ వెనుక భాగమున కూడ పెద్ద స్థలమే (30' × 20') కలదు. ఈ డోరు మూసినచో ఎవ్వరు వెనుకకు పోలేరు. నేను స్టేజిపై తలుపుల మధ్యలో రెండు చేతులతో రెండు తలుపురెక్కలను పట్టుకొని ఉన్నాను. నాముందర దాదాపు వంద అడుగుల దూరమున 300 మంది వరకు జనాలు ఉన్నారు. బహుశా అప్పటికే నేను స్వామి విషయంలో ఏదో పొరపాటు చేసాను. ఆ స్టేజి ముందు ఉన్న జనాలకు నాపై విపరీతమైన కోపముంది. నన్ను కొట్టాలనుకుంటున్నారు. అందులో కొందరు కట్టెతుపాకి పట్టుకొని ఉన్నారు. మరికొందరు నన్ను చూచి రాళ్ళతో, టమాటలతో మరియు తుపాకితో దూరము

స్వామి వారి పై నమ్మకము లేనందుకు కొట్టుట

నుండి కొట్టుచున్నారు. ఆ తుపాకి గుళ్ళు తాకి నేను చనిపోతాననే భయము నాలో లేదు కాని దెబ్బ తగులుననే భయముతో ఈ విధంగ అంటున్నాను. "ఇగో నన్ను కొట్టకండి. నాకు స్వామిపై పూర్తి విశ్వాసము ఉంది. మీరు కొట్టితే బాగుండదు" అని తెలంగాణ యాసలో అనుచు రెండు చేతులలోని తలుపురెక్కలను సగము వరకు, రాళ్ళు నాకు తగులకుండు విధముగ మూస్తున్నాను. రాళ్ళు నాకు తగులుతలేవు. కాని ఈ జనాలకు నాపై ఎంతో కోపముంది. ఎలాగైన నన్ను దండించాలని దృఢనిశ్చయముతో ఉన్నట్లు గ్రహించాను. ఈవిధంగ కొంతసేపైన తరువాత ఒకవ్యక్తి ఆ గుంపులోనుండి నన్ను పట్టుకొనుటకు ప్రక్కగ నాకు కనబడకుండునటుల వస్తున్నాడు. దీనిని గమనించిన నేను భయముచే ఒక అడుగు లోనికి వేసి తలుపులను మూసివేశాను. అప్పుడు ఆ తలుపులు చిన్నగుండవెల్లి గ్రామములోని మాఇంటి తలుపులే అని గ్రహించాను. ఈ తలుపులను బిగించి పైగొళ్ళెమును తలుపులు రాకుండు విధంగ పెట్టాను. కాని ఆ గొళ్ళెము అంత సేఫ్ అనిపించలేదు. వెంటనే భయముతో తలుపుల వెనుక గోడలో ఉన్న కట్టెబేడమును పెట్టాను. (ఇది మా ఇంటికి ఉన్న కట్టె బేడమే) ఈ కట్టె బేడము చాల దృఢమైంది

కాబట్టి వారు ఇక లోనికి రాలేరని గ్రహించాను. అక్కడనే వెనుక బట్టలు పరచి ఉన్న మంచముపై పడుకున్నాను. అమ్మయ్య అనుకుంటు నిట్టూర్చాను. ఇది కల.

నాకు స్వామిపై పూర్తి విశ్వాసము లేదు, నీవు పూర్తి విశ్వాసమును పెట్టాలని సూచించే విధంగ ఈ కల వచ్చింది. స్వామివారికి శతకోటి నమస్కారములను సమర్పించాను. స్వామివారిపై పూర్తి విశ్వాసము లేనందుకు నాకు నేను సిగ్గుపడ్డాను. పూర్తి విశ్వాసం పెట్టుటకు ప్రయత్నించాను.

05-04-2003: ఈ రోజు వరకు కేవలం11,000 జపపుస్తకములే తిరిగి వచ్చాయి. ఐనప్పటికీ గతంలో స్వామివారు చూపిన లీలావిశేషం చేత నేను చింతించలేదు. ఇప్పుడు ఒక రెండు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాను.

భక్తులకు సేవాభాగ్యం కల్పించుట

(1) జప సమర్పణ సమయము వరకు ఎన్ని జపపుస్తకములు తిరిగి వస్తే వాటినే ఆ సం॥పు ఏడుకోట్ల జపముగ సమర్పించాలి. తిరుపతిలో మాత్రం మొత్తం జపానికి, రానివాటికి, వచ్చినవాటికి కలిపి ప్రార్థన చేసి సమర్పించాలి.

(2) వచ్చే 2వ పర్యాయంగ ఏడుకోట్ల జపపుస్తకముల ప్రారంభ సమయంలో భక్తులకు, ముఖ్యంగ సాధకులకు కొన్ని నియమాలను ఏర్పాటు చేసాను.

స్వామిసేవ చేయదలచిన ప్రతి భక్తుడు, నేను ప్రతిజ్ఞ తీసుకొన్నట్లుగ వారిని కూడ వారి శక్త్యానుసారము, ఇష్టమునన్ని సం॥లు ఇష్టమునన్ని జపపుస్తకములను వితరణ చేసి, తిరిగి వాటిని సేకరించి మాకు అప్పగించే విధంగ ప్రతిజ్ఞ తీసుకోమన్నాను. వీలైతే వారిని మాతోపాటు తిరుపతికి రావచ్చని కూడ చెప్పాను. ఇది వారికి స్వామిసేవా భాగ్యమును కల్పించు అవకాశమని చెప్పాను. నేను వారికి వారు కోరినన్ని జపపుస్తకములను వారు కోరినన్ని సం॥ల వరకు ఉచితంగ ఇచ్చుదునని చెప్పాను. ఈ విధంగ నేను ఏవిధంగ స్వామిసేవ చేయుచున్నానో ఆసేవను ఆసక్తిగల ఇతరులకు విస్తరింప చేయుటకు ప్రయత్నించాలని దృఢనిశ్చయము చేసుకున్నాను. ఇలా స్వామివారి కృపాకటాక్షాలు అందరికీ లభించుటకు తీవ్ర ప్రయత్నం చేసాను.

పాద సేవకునిగ స్వీకరించుట

ఈ విధంగ నేను స్వామివారిని చూడాలని, ఆయన సేవ చేయాలని, మరియు అందరికి శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించాలని తపించి పోయాను. బహుశా నా తపనను శ్రీవేంకటేశ్వరుడు గమనించాడు. తగిన ఫలమును నాకివ్వదలచారు. ఈ జీవితంలో స్వామివారు ప్రసాదించిన ఎన్నో ఆణిముత్యాలలో ఇది మహత్తరమైనది. కోటికి ఒక్కరికి లేద రాజమహారాజులకు కూడ ఆ భాగ్యము లభించదు. ఈ ఒక్క అనుగ్రహములతో నేను పొందిన ఈ జన్మ సార్థకమయింది. ఈ సృష్టిలో నాకంటే అదృష్టవంతుడు లేరనే స్థితికి వచ్చాను. దీని ఋణం తీర్చుకొనుటకు మరో జన్మను కేటాయించుకున్నానంటే ఈ భాగ్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు!

ధర్మరక్షణ, దుష్టశిక్షణ కోసం శ్రీవేంకటేశ్వరుడు ఎన్నో అవతారములను ఎత్తాడు. అందులో మోహినీ అవతారం ఒకటి. ఎదుటివారిని సమ్మోహితులను చేసి, స్వామివారు అనుకున్న స్థితికి తీసుకురావడమే దీని ముఖ్యోద్దేశం. 'మోహినీ' అత్యంత ఆకర్షణీయంగ ఉంటుంది. దీని ప్రభావానికి లోనుకాని వారుండరు. పూర్వం ఒక సందర్భంలో పరమశివుడు కూడ ఈ ప్రభావానికి లోనైనాడని అంటారు. ఇప్పుడు నా విషయంలో కూడ తన 'మోహినీ' అవతారాన్ని వాడాడు. ఎందుకు వాడాడు? అనే విషయం నాకు తెలియదు. ఆయన తన మోహినీ రూపమును చూపెట్టాడు. నేను తనివితీరా చూచాను. నావల్ల స్వామివారు అత్యంత ప్రసన్నులైనారు. చివరికి



పాదసేవా భాగ్యాన్ని ప్రసాదించుట

నాకు తన 'పాదసేవా భాగ్యాన్ని' ప్రసాదించారు. దీనిని క్లుప్తంగ చెప్పాలంటే "శ్రీవేంకటేశ్వరుడు ఆకాశం నుండి దిగాడు. నేరుగ మా ఇంటికి వచ్చాడు. ఒక ఆసనంపై ఆసీనుడైనాడు. తన రెండు కాళ్ళను నాముందు పెట్టాడు. పంచెను మోకాళ్ళవరకు పైకెత్తాడు. ఈ పాదాలు నీవి సేవించుకో" అంటే ఏవిధంగ ఉంటుందో ఆవిధంగ చేసాడు. తన్మయత్వముతో మైమరచిపోయాను. ఆ లీల ఈవిధంగ ఉంది:

తేది 25-04-2003 నుండి 11-05-2003 వరకు నేను, నా మిత్రులతో మరియు నా కుటుంబముతో పాటు దక్షిణ భారతదేశ యాత్ర చేశాము. కేరళ, కన్యాకుమారి, సుచింధ్రం, రామేశ్వరం, మధురై, త్రిచ్చీ, శ్రీరంగం, కుంభకోణం, తంజావూర్, నవగ్రహాలు మొదలైన ప్రదేశములు తిరిగాము. నాకు 07-05-2003న ఒక కల వచ్చింది, అందు స్వామివారు తన మోహినీ రూపంను చూపెట్టారు.

07-05-2003 : కల : అది ఒక ఊరు. ఆ ఊరికి ఒక రచ్చబండ ఉంది. ఆ ఊరి ప్రతి నిర్ణయం దాదాపు ఈ రచ్చబండ వద్దనే జరుగుట ఆనవాయితి. రచ్చబండ వద్ద ఎప్పటికి కనీసం పదిమందైన ఆ ఊరి జనాలు ఉంటారు.

ఈరోజు కూడ ఈ రచ్చబండ వద్ద సుమారు ఇరవైమంది గ్రామస్థులు ఏదో మాట్లాడుకుంటున్నారు. ఈ ఇరవై మందిలో నేను ఒకన్ని. అది మా ఊరేనట. ఇంతలో దాదాపు 25 సంll ల వయస్సుగల ఒక అందమైన అమ్మాయి ఆకాశం నుండి క్రిందికి వయ్యారంగ దిగుచు కనబడ్డది. ఆమె మంచి బంగారు రంగు శరీరచ్ఛాయ కలిగి ఉన్నది. ఆమె ఒక దివ్య కన్యలాగ అనిపించింది. ఆమె రంగు అటు పూర్తి బంగారం కాదు ఇటు మంచి తెలుపు కాదు. రెండు మేళమించిన రంగులాగ అత్యంత సుందరంగ ఉన్నది. ఎత్తు దాదాపు 5'–8" వరకు ఉంటుంది. మంచి శరీరసౌష్ఠవము కలిగి ఉంది. పసుపు పచ్చరంగు చీర ధరించి చిలకపచ్చ జాకెట్టుతో ఆకాశము నుండి మెల్లమెల్లగ మా వైపు వస్తుంది. ఆమె ఆకాశము నుండి అద్భుతమైన విన్యాసాలు చేస్తూ మెల్లమెల్లగ దిగుచున్నది. ఒకరకంగ మేమందరము ఆ విన్యాసాలను చూచి ఆనందించాలనే ఉద్దేశ్యముతో ఆవిధంగ మెల్లమెల్లగ దిగుచున్నది. ఇంతలో స్వామివారు మోహినీ రూపము ధరించి వస్తున్నారనే మాట ఆకాశము నుండి ఎవ్వరో చెప్పుచున్నట్లు వినబడింది. అక్కడున్న అందరు కూడ ఆమెను చూచి స్వామివారు మోహినీ రూపము ధరించి వస్తున్నాడు అని పలుకుచూ ఆమె క్రిందికి రాగానే శతకోటి ప్రణామాలను చేస్తున్నారు. ఉక్కిరి బిక్కిరి అవుచున్నారు. వారు ఆమెను వారి దేవతగా కొలుచుచు వారిని రక్షించమని వేడుకుంటున్నారు. ఇక నా పరిస్థితి ఇందుకు భిన్నంగ ఉంది. నా స్వామివారు మోహినీ రూపముతో వస్తున్నారనగానే సావధానున్నైనాను. అత్యంత మౌనంగ ఉన్నాను. నేను మాత్రం ఆమెను నా దేవతగ భావించకుండ, నేను ప్రభువుకు సేవకుడను మాత్రమే, భక్తుడను కాను అనే భావంతో ఉన్నాను. సావధాన స్థితిలో ఉండి స్వామివారి ఆజ్ఞకై వేచి చూస్తున్నాను. ఇంతలో క్రిందికి దిగిన స్వామివారు నడుచుకుంటు నేరుగా ఊరిలోని ఒక సందిలో ఉన్న మా ఇంటికి వెళ్ళారు. ఇంటి ముందు ఉన్న అఱుగుపైన కూర్చున్నారు. తన కాళ్ళు క్రిందికి వ్రేలాడుచుండ అఱుగుపై కూర్చున్నారు. నాతోపాటు ఆ రచ్చబండ వద్ద నున్న ప్రతిఒక్కరు స్వామివారిని అనుసరించి మా ఇంటికి వచ్చారు. స్వామివారు మోహినీ రూపంలో అఱుగుపైన కూర్చున్నారు. నాతోపాటు వీరందరు ఆమెకు ఒక పదైదు అడుగుల దూరములో వాకిట్లో ఉన్నాము. అందరు స్వామివారిని చూస్తున్నారు. అక్కడున్న ప్రతి వ్యక్తి ఈ సదవకాశమును వినియోగించుకొని స్వామివారి అనుగ్రహము పొందుటకు రకరకాలుగ మ్రొక్కుచున్నారు. కాని నేను మాత్రం వారిలాగ మ్రొక్కకుండ మౌనంగ ఉన్నాను. స్వామివారి ఆజ్ఞకోసం తదేక దృష్టితో చూస్తున్నాను. అక్కడున్న వారందరు నన్ను స్వామివారికి మ్రొక్కమని అరుస్తున్నారు. నేను వారి సలహాను పట్టించుకోలేదు. చివరికి స్వామివారి వద్దకు ఒక్కొక్క అడుగు వేయుచు వెళ్ళుచున్నాను. నేను ఎప్పుడైతే స్వామి వద్దకు వెళ్ళుటకు ఒక్క అడుగు వేసానో వీరి అఱుపులు వినబడలేదు, వీరు కనబడలేదు నా మనసంత స్వామి పైననే కేంద్రీకృతమై ఉన్నది. ఇప్పుడు స్వామివారు అఱుగుపై తన రెండు కాళ్ళు వ్రేలాడేలా కూర్చుండి, ఆ రెండు కాళ్ళను పైకి క్రిందికి ఊపుచున్నారు. నేను స్వామివారి వైపు రెండు అడుగులు వేశాను అంతే ఇంతలో స్వామివారు కూడ నాకు కనబడలేదు కాని వారి కాళ్ళు మాత్రమే కనబడ్డవి. ఇంకా రెండడుగులు ముందుకు వెళ్ళాను ఇప్పుడు స్వామివారి మోకాళ్ళ క్రింద నున్న పంచకూడ కనబడలేదు కేవలం స్వామివారి రెండు కాళ్ళు అవి కూడ మోకాళ్ళ నుండి క్రింది భాగం మాత్రమే కనబడ్డవి. బంగారు వన్నెతో ఉన్న ఆ రెండు కాళ్ళను స్వామివారు పైకి క్రిందికి ఊపుచున్నారు. నన్ను తన వద్దకు పిలుస్తున్నట్లు ఊపుచున్నారు. నేను క్రింద, భూమి మీద ఆ కాళ్ళప్రక్కన కూర్చుండి ఆ రెండు పాదాలను సేవకుడిగ నా చేతులతో ఒత్తుచున్నాను. ఒకరకంగ స్వామివారు తన కాళ్ళను ఒత్తుటకు నాకు అవకాశం ఇచ్చారు. అప్పుడు నా మనస్సులోని భావం ఏవిధంగ ఉన్నదంటే! మీరు భక్తులు మ్రొక్కండి మీ కోరికలు తీర్చుకొండి. నేను స్వామి సేవకుడను. స్వామి పాదములు ఒత్తుచు సేవచేయుట నా ధర్మము అనే భావము నా మనస్సులో బలంగ కలిగింది. కల చెదిరింది.

ఈవిధంగ అద్భుతమైన రీతిలో శ్రీవేంకటేశ్వరుడు తన పాద సేవా భాగ్యాన్ని ప్రసాదించాడు. నన్ను ధన్యున్ని

చేసాడు. ఈ భాగ్యానికి నేను మరో జీవితాన్ని అంకితం చేసాను. ఈ పాదసేవా భాగ్యాన్ని ప్రసాదించుటకు తన 'మోహినీ' రూపాన్ని ఎందుకు చూపారంటే బహుశా అంతటి ఆకర్షణీయ మోహిని రూపమును చూచి కూడ నేను భ్రమించక నా సేవక ధర్మాన్ని నిర్వర్తించే స్థితిని కలిగించారని భావించాను.

భగవంతుని రూపంగ మా తండ్రిని దర్శించుట

మేము తమిళనాడులోని తీర్థయాత్రలు చేస్తున్నాము. చాల శివుని ఆలయాలను దర్శించాము. ప్రతి ఆలయములోని శివున్ని నా స్వామి శ్రీవేంకటేశ్వరుని రూపంగ భావించి నమస్కరించాను. నేను శివున్ని

''శివరూపాయ శ్రీవేంకటేశ్వరాయ నమో నమః'' అని ప్రార్థించితేనే నాకు తృప్తి కలుగుతుంది. 07-05-2003 నాడు నాగేశ్వర జ్యోతిర్లింగమును, మరికొన్ని శివుని ఆలయాలను దర్శించాము. ఈరోజు కలలో ఒక విచిత్రమైన దృశ్యమును చూచాను.

08-05-2003 : కల : చిన్నగుండవెల్లి గ్రామములోని మా ఇంటిలో నైరుతిమూల పూజగది ఉంది. దాని ముందు ఒక 6 ఇంచుల ఎత్తుతో సుమారు 6' × 10' సైజుగల గద్దె ఒకటి ఉంటుంది. ఆ గద్దెపై ఒక తలుపుగూడు ఉంటుంది. అందులో మా నాన్నకు సంబంధించిన పేపర్స్ పెట్టుకుంటాడు. మరియు దానిపైన దేవుని ఫోటోలు ఉంటవి. వాటికి మా నాన్న ప్రతిరోజు భోజనానికి ముందు పూజ చేస్తుండేవాడు. ఆయన దాదాపు 5' 1" ఎత్తు కలిగి సన్నగ, కొంచెము చెంపలు లోనికి పోయి నల్లరంగుతోనే ఉండేవాడు. ఈయన 1990 డిసెంబర్‌లో చనిపోయారు. కాని ఈకలలో మా తండ్రిగారు ఇదే ప్రదేశములో దేవుని రూం వైపు కాళ్ళు చేసి మేన్‌డోర్ వైపు చూచుచు ఒక ప్రక్కపైన పడుకున్నాడు. ఆ ఫోజు ఏవిధంగ ఉన్నదంటే ఒక ఫోటోలో శివుడు చిన్నబాలకుడిగా ఉండి ఒక ప్రక్కపై పడుకుంటాడు, మరియు ఒక ప్రత్యేకమైన కోణంలో చూస్తుంటాడు. అదే విధంగ మా తండ్రిగారు పడుకొని చూస్తున్నారు. ఆయన రూపము మాత్రము మా తండ్రి పోలిక. కాని ఎత్తు 6.0 అడుగుల ఆజానుబాహుడు, నిండు చెంపలు కలిగి ఉన్నాడు. విశాలమైన కనుగుడ్లు కలిగి ఉన్నాడు. ఎన్నో రోజుల క్రితము షేవ్‌చేసినట్లు గడ్డము అర ఇంచువరకు పెరిగి ఉన్నది. ఆయన శరీరము దృఢత్వము కలదిగ ఉండి చూచుటకు మంచి ఆజానుబాహునిగ కనబడ్డాడు. నేను మేన్‌డోర్ తీసి లోనికి ప్రవేశించగనే ఆయనను ఆవిధముగ పడుకొని ఉండుట చూచాను. పైగ ఆయన నన్నే తదేకదృష్టితో చూస్తున్నాడు. ఈవిధంగ మా నాన్న పడుకోవటము చూచి, అచ్చంగ శివుని మాదిరిగానే పడుకున్నాడని కలలోనే అనుకున్నాను. ఇంతే కల.

శివుడు మా తండ్రి రూపంగ మా ఇంటిలో దర్శనమిచ్చాడు. నా ప్రభువుకు శతకోటి ప్రణామాలను తెలియచేసాను. కాని ఈ కల అర్థం ఏమిటనేది తెలియదు. చనిపోయిన మా తండ్రిని భగవంతుని స్థానములో చూపెట్టాడు. బహుశా భవిష్యత్‌లో మీ తండ్రిమాటను భగవంతుని ఆజ్ఞగా స్వీకరించుమనే ఉద్దేశ్యము కావచ్చును.

జపసమర్పణ తేదిని తెలిపిన స్వామివారు

ఈరోజు నా జీవితంలో మరపురాని ఆనందమును అనుభవించిన రోజు. నా అంతరంగ భావాలను నా ప్రభు అర్థం చేసుకొని వాటిని తీర్చి నాకు అమితానందమును కలిగించాడు. స్వామివారికి ప్రథమ 7 కోట్ల జపసమర్పణ 7 నెలల్లో జరుగాలని అదికూడ స్వామివారే ఈ జపసమర్పణ తేదిని నాకు తెలుపాలని నా మనస్సులో భావించి ప్రార్థించాను. కాని ఏనాడు నా నోటితో బయటకు చెప్పలేదు. కాని ఈరోజు ఆ శ్రీవేంకటేశ్వరుడు ఈ తేదీని నిర్ణయించి నాకు స్వయంగ తెలియచేసాడు. అది ఇలా జరిగింది.

నేను నా సంకల్పాన్ని జతచేసి రెండు జపపుస్తకములను, టి.టి.డి ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్యాం గారికి గతంలో పంపాను. వారు ఈ జపపుస్తకములను, సంకల్పమును చూచి ఆనందించారట. మరియు ఆ రెండు జపపుస్తకములను వారే స్వయంగ వ్రాసారు. ఒకసారి పని నిమిత్తమని డా॥ కొండారెడ్డిగారు ఈ.ఓ ను కలిసినప్పుడు ఆ పుస్తకములను వారివద్ద చూడడము జరిగింది. మరియు నా గురించి పూర్తిగ ఆయనకు చెప్పారు. వెంటనే తాను రెండు జపపుస్తకములను వ్రాసానని తేది 14-06-2003 నాడు జపసమర్పణ పెట్టుకొమ్మని డా॥ కొండారెడ్డి గారితో ఈ.ఓ గారు చెప్పారట. కొండారెడ్డిగారు నాకు ఈ మాటను 10-05-2003 నాడు చెప్పారు. ఎంతో ఆనందించాను. నేను కోరినట్లే ఇంగ్లీషు క్యాలెండర్ ప్రకారం ఒక్కరోజు తేడా లేకుండ 7 నెలల్లో 7 కొండలవాడికి 7 కోట్ల జపసమర్పణ జరుగుచున్నది. 15-11-2002 నుండి 14-06-2003 వరకు సరిగ్గా 7 నెలలు. అదీకూడ ఆ తేదిని స్వయంగ స్వామివారు నిర్ణయించి నాకు తెలియచేసారు. అప్పుడు నేను పొందిన ఆనందం అంతా ఇంతా కాదు.

ఇక జపసమర్పణకు ఒక స్వామివారిని పిలువాలని భావించాను. అప్పుడు గాంధీనగర్‌లో నాదొక వర్కు జరుగుచున్నది. ఆ వర్కు నుండి వచ్చేదారిలో శ్రీభాష్యకార సిద్ధాంతపీఠం వ్యవస్థాపకులు త్రిదండి శ్రీశ్రీశ్రీ రామచెంద్ర రామానుజ జీయరు స్వామివారిని శిష్యసమేతంగ చూచాను. వారు శ్రీమహాలక్ష్మి యజ్ఞం చేయుటకై భిక్షాటన చేస్తున్నారు. స్వామివారిని అనుసరించి ప్రక్కనే ఉన్న వారి ఆశ్రమమునకు వెళ్ళాను. విషయము చెప్పి ప్రథమ 7 కోట్ల జపసమర్పణకు తిరుపతికి రావలసిందిగా వేడుకున్నాను. స్వామివారు ఒప్పుకున్నారు.

స్వామివారిని పొందుటకు సంకల్పం తీసుకొనుట

స్వామివారు మాకు నాలుగు రకలైన లీలలను చూపెట్టేవారు. అవి

(a) స్వప్నాల రూపంలో : స్వప్నాల రూపంలోని లీలలను విశ్లేషించి సరైన అర్థంను గ్రహించవలసి ఉంటుంది. ఒకరకంగా ఇది నాకు పరీక్షలాంటిది.

(b) హృదయాంతర భావాలు : ఇక హృదయాంతర భావాల రూపంలోని లీలలు స్పష్టంగ అర్థం అవుతాయి.

(c) స్వప్నంతో పాటు భావాలు : ఈ రకమైన లీలలో, ఒక ప్రక్క స్వప్నం జరుగుచుండగ మరోప్రక్క అశరీరవాణి మాటలు వినబడతాయి లేదా హృదయాంతర భావాలు కలుగుతాయి.

(d) ఇక నాలుగవ రకం లీలలు : ఈ లీలలు ప్రత్యేకంగ ఉంటాయి. మనము మెళకువ స్థితిలోనే ఉంటాము కాని మనస్సు స్వామివారి ఆధీనంలో ఉంటుంది. మనము మాత్రమే ప్రత్యేకమైన దృశ్యమును చూస్తుంటాము.

ఇలా నాలుగురకాల లీలలను చూపుతారు. ఇందులో స్వప్నాల రూపంలో చూపిన లీలలను మొదట్లో చాల వాటిని అర్థం చేసుకోలేదు. కాని కాలము గడిచినా కొద్ది, యోగ్యత పెరిగినా కొద్ది వాటి భావాలను అర్థం చేసుకున్నాను. అందులో ఇది ఒకటి. దీని సరైన అర్థంను ఈ అనుభూతి వ్రాస్థున్నప్పుడే గుర్తించాను. ఆ లీల ఈవిదంగ ఉంది.

03-06-2003 : కల : నేను తిరుపతి లాంటి ఒక పట్టణమునకు పోయాను. అక్కడ ఏదో పనిపై పోవలసింది మానుకొని ఇంటివద్దనే ఉన్నాను. సాయంత్రము బయటకు వెళ్ళాను. రకరకాల భవనములు కనబడ్డవి. తరువాత శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శనము చేసుకోవాలనిపించింది. అంటే ఆ పట్టణమును తిరుపతిగ భావించాను. నాకు స్వామి దర్శనము ఇప్పించుటకు డా॥ కొండారెడ్డిగారు లేరట. కావున ఆ సాయంత్రము అదే రోజు నాకు స్వామి దర్శనము చేసుకొనుటకు ఇబ్బందిగ ఉంది. అప్పుడే ఒక తెలిసిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి నీకు శ్రీవారి దర్శనము చేయించెదను రమ్ము అని నన్ను పిలుచుకు పోయాడు.

అది ఒక మైదానము, దాని లోనికి ఒక గేటు గుండా వెళ్ళాము. అందులో శ్రీవారి నామముతో ఇద్దరు నల్లని బ్రాహ్మణులు ఉన్నారు. వారు అక్కడున్న 5, 6 మంది భక్తులకు సంకల్పాలు చేయిస్తున్నారు. నేను కూడ వారి వద్దకు వెళ్ళాను. అందులోని లావుగ ఉన్న ఒక నల్లని బ్రాహ్మణుడు నేను నీకు శ్రీవారి దర్శనము చేయించగలను అని నీరు నా చేతులపై పోసి సంకల్పము చేయించాడు. తరువాత నేను ఆయనకు రూ.100/– దక్షిణగ ఇచ్చాను. అప్పుడు ఆయన ఇది చాలదు అని మరియు ఇది దొడ్డిదారి దర్శనము కావున ఇంకా కావలెనన్నాడు. నేను ఇంకొక రూ.100/– తీసి ఆయనకు ఇచ్చాను. ఆయన సరే నేను నీకు ఆ దేవుని దర్శనము చేయించుదును వేచి ఉండమన్నారు. ఇంతే కల.

దీని అర్థం అప్పుడు నాకు తెలియలేదు. నేడు దీని నిజమైన అర్థం ఇలా భావించాను. శ్రీవేంకటేశ్వరున్ని పొందుటే లక్ష్యంగ నాకు స్వామివారు 111 కోట్ల జపసమర్పణ సేవను ప్రసాదించారు. అందులో మొదటి 7 కోట్ల జపసమర్పణకు సిద్ధమైనాను. కొన్ని రోజుల తరువాత నీవు తప్పక స్వామివారిని పొందగలవని ఈ వైష్ణవ స్వాములు నాచే సంకల్పం చెప్పించారని భావించాను. ఏ ఉద్దేశ్యముతో స్వామివారు నాకీ సేవను ప్రసాదించారో అది తప్పక పూరించగలదని దీని ఉద్దేశమైనట్లు భావించాను. స్వామివారు ఈ లీలను అత్యంత విశ్లేషణాత్మకంగ ప్రసాదించారు.

ప్రథమ 7కోట్ల జపసమర్పణ, 'గోవింద దాసు'గ దాస్యనామం లభించుట

నా స్వామి తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రథమ ఏడుకోట్ల జపసమర్పణ కొరకు ఏర్పాట్లు చక్కగ జరుగుచున్నవి. దీనిని మేము తేది 14-06-2003 శనివారము పౌర్ణమినాడు, శ్రీవేంకటేశ్వర మహామంత్ర యజ్ఞం చేసి, త్రిదండి శ్రీశ్రీశ్రీ శ్రీరామచంద్ర రామానుజ జీయరు స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వామివారికి సమర్పించదలచాము. ఈ.ఒ శ్రీమాన్ అజయ్ కళ్ళాం గారు కూడ వస్తున్నారు. ఈ కార్యక్రమము తరువాత అక్కడే ద్వితీయ పర్యాయంగ ఏడుకోట్ల జపసంకల్పము ప్రారంభించాలని భావించాము. తేది 13-06-2003 సాయంత్రము ప్రథమ 7 కోట్ల జపమును అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు సమర్పించబడును. దీని నిమిత్తమై మాకు టి.టి.డి నుండి తగిన అనుమతి పత్రం కూడ లభించింది.

స్వామివారికి తలపెట్టిన మొత్తం 16 సం॥ల కార్యక్రమములో భాగంగ ప్రథమ 7 కోట్ల జపసమర్పణ కార్యక్రమము ఈవిధంగ జరిగింది.

తేది 13-06-2003 సాయంత్రము సుమారు 6.30 ని॥లకు తిరుమల కొండపై అలిపిరి వద్ద స్వామివారి పాదాలకు ఈ జపమును సమర్పించి పూజ చేసాము. టి.టి.డి వారు ఈ కార్యక్రమము కొరకు చక్కని ఏర్పాట్లు చేసారు. పాదాల మండపమును పూలచే చక్కగ అలంకరించారు. వారి మనుష్యులే ఈ కార్యక్రమములో ప్రధాన పాత్ర పోషించారు. డా॥ కొండారెడ్డి గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. శ్రీవారి పాదాల మంటపము వద్ద, స్వామివారి పాదాలను అభిషేకించి, పూజించాము. శ్రీ వేంకటేశ్వర మహామంత్రముతో అనుసంధానిస్తూ విష్ణు సహస్ర నామ పారాయణం చేసాము. ఆ తరువాత ఇట్టి ప్రథమ 7 కోట్ల జపమును స్వీకరించుమని, జపము వ్రాసిన ప్రతి భక్తున్ని అనుగ్రహించమని ప్రార్థించాము. చివరికి హారతి ఇచ్చిన వెనువెంటనే దాదాపు 30 ని॥లు బ్రహ్మాండమైన వర్షము కురిసింది.

తేది 14-06-2003 : తిరుపతిలోని టి.టి.డి డైరీఫాంలో ఉ.8.0 గం॥ల ప్రాంతమున శ్రీవేంకటేశ్వర మహామంత్ర హోమము, పూజ మొదలైంది. ఈ మొత్తం కార్యక్రమము శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయరు స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగింది. శ్రీమాన్ యతీంద్ర రమణాచార్యులు గారు యజ్ఞం నిర్వహించారు. పూజ

తిరుపతిలో ప్రథమ 7 కోట్ల జప సమర్పణ సందర్భంగా 'గోవిందదాసు'గా దాస్య నామం ఇచ్చుట

కార్యక్రమము, యజ్ఞం చాల చక్కగ, ఎంతో ఆనందంగ జరిగింది. టి.టి.డి వారు మంచి సహకారాన్ని అందించారు. భక్తులచే శ్రీవిష్ణు సహస్రనామ పారాయణము, శ్రీవేంకటేశ్వర మహామంత్రమును అనుసంధానము చేయుచు పఠించుట జరిగింది. మొత్తం యజ్ఞం మరియు పూజ ఎంతో సంతృప్తికరంగ జరిగింది. స్వామివారు నన్ను ఆశీర్వదించుచున్నారన్న విధంగ జరిగింది. తిరుమల శ్రీవారికి గత మూడు రోజుల నుండి జరుగుచున్న అభిధ్యేయక అభిషేకమును చేయించి, అదే దుస్తువులతో ఉ.11.50 ని॥లకు టి.టి.డి ఈ.ఒ శ్రీమాన్ అజయ్ కళ్యాం గారు విచ్చేసారు. వీరు 3 పుస్తకములను వ్రాసి తనతో పాటు తెచ్చారు. తరువాత శ్రీశ్రీశ్రీ జీయరు స్వామివారు కూడ వచ్చారు. జీయరు స్వామివారు పూర్ణాహుతి పళ్ళెమును మా అందరికి తగిలించి యజ్ఞపూర్ణాహుతి కావించారు. తరువాత అన్ని జపపుస్తకములపై ప్రక్షాళన కావించారు. పిదప నేను, ఈ వ్రాసిన జపపుస్తకములను ఈ.ఒ గారికి అందించగ వారు స్వామివారి చేతికి ఇచ్చారు. స్వామివారు వాటిని 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర స్తూపము' లో సమర్పించారు. తరువాత ఈ.ఒ గారు, అక్కడి మరికొందరు అధికారులు, మేము, చివరికి అక్కడున్న ప్రతి భక్తుడు కొన్ని కొన్ని జపపుస్తకములను స్తూపములో సమర్పించారు.

పూజ సందర్భంగ నా కోరిక ప్రకారం ఈ.ఓతో పాటు ప్రతి భక్తుడు అక్కడ ప్రత్యేక ప్రార్థన చేసారు. ఈ జపము వ్రాసిన ప్రతి భక్తుని కోరిక తీరాలని, వారికి శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించాలని ప్రార్థించారు.

తరువాత ప్రక్కనే ఉన్న శ్రీకృష్ణుని ఆలయం ముందు సభ జరిగింది. ఈ సభలో డా॥ కొండారెడ్డిగారు, ఈ.ఓ శ్రీమాన్ అజయ్ కళ్యాం గారు మరియు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచెంద్ర రామానుజ జీయరు స్వామివారు ప్రసంగించారు. అందరు కూడ నన్ను అభినందించారు. శాలువతో సత్కరించారు. 111 కోట్ల జపసమర్పణ ధ్యేయంగ పెట్టుకున్న నన్ను ఈ.ఓ గారు అభినందించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచెంద్ర రామానుజ జీయరు స్వామివారు మాట్లాడుతు, నా పేరును మార్చారు. ఆయన నన్ను ఇకపై సాయిరెడ్డి కాకుండ "గోవింద దాసు" గ నామకరణము చేసి, ఇకపై అందరూ నన్ను 'గోవింద దాసు' గ పిలువవలెనని ఆ సభలో చెప్పారు. భగవంతుని కంటే ఆయన నామమే గొప్పదని దానిని వ్రాయించుచున్న సాయిరెడ్డి అభినందనీయుడన్నారు. దేవస్థానము వారు వారి ప్రసాదమును భక్తులకు పంచిపెట్టారు.

అందరూ మాట్లాడిన పిదప ద్వితీయ పర్యాయంగ 7 కోట్ల జపమును, స్వామివారు, ఈ.ఓ శ్రీ అజయ్ కళ్యాం గారు, మరికొందరు అధికారులు కలిసి ప్రారంభించారు. ఆ తరువాత ప్రతి భక్తునికి ఒక్కొక్క పుస్తకమును అందించాము. ఇక్కడ కూడ శ్రీవేంకటేశ్వరుడు తల లీలను ప్రసాదించారు. స్తూపం ప్రక్కన మొత్తం వ్రాసిన జపంను దాదాపు 6'×5' సైజు గల కుప్పగ పేర్చి పూజించాము. ఈ సందర్భంగ స్వామివారు ఈ మొత్తం కుప్పపై తన రెండు పాదములను పెట్టి ఆకాశములో విరాట్‌రూపునిగ నిలబడ్డారు. ఆయన రెండు నల్లని పాదములు ఆ పాదములపైన తను ధరించిన ధోవతి యొక్క అంచును మాత్రమే చూచాను. ఈ పాదములకు సరిసమానమైన విరాట్‌రూపము ఆకాశములో ఉన్నదన్న భ్రమ కలిగింది. ఈవిధంగ నేను ఎంతో ఆనందముతో ఆయన పాదములను పూజ చేసాను.

ఇంతే కాకుండ పాదాల మండపముపై ఈ జపమును పెట్టి పూజించునప్పుడు సాక్షాత్ తిరుమల మూలమూర్తే నా ముందు ఉన్నారన్న భావన కలిగింది. పరవశించిపోయాను. ఈవిధంగ ప్రథమ ఏడు కోట్ల జపసమర్పణ అత్యంత ఆహ్లాదభరితంగ జరిగింది. మరియు బాహ్య ప్రపంచానికి శ్రీవేంకటేశ్వరుడు నన్ను 'గోవింద దాసు' గ దాస్యనామం ఇచ్చి పరిచయం చేసాడు. ఈ మొత్తం విషయం తెల్లవారి తిరుపతిలో ప్రతి న్యూస్‌పేపర్లలో ప్రచురించబడ్డది.

ఆ తరువాత తేది 15-06-2003 నాడు కొండపైకి వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాను. నా సేవను స్వీకరించమని, తప్పులను క్షమించుమని వేడుకున్నాను. టి.టి.డి అధికారుల సూచన మేర ప్రతి సం॥ము ఈ జపసమర్పణ గోకులాష్టమినాడు సమర్పించ నిర్ణయించబడ్డది. రెండవ జపసమర్పణ దాదాపు 15 నెలల గ్యాపు తరువాత ఉండును కాబట్టి మాకు 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేయుటకు కావలసిన సమయము లభించింది.

తిరిగి హైదరాబాద్‌లో తేది 18-06-2003 శ్రవణనక్షత్రం నుండి ద్వితీయ పర్యాయంగ ఏడుకోట్ల జపానికి సంబంధించిన పుస్తక పంపిణి చేపట్టాము. ఈసారి భక్తులకు వారి వారి శక్త్యానుసారము సంకల్పాలు తీసుకునే విధంగ ప్రోత్సహిస్తున్నాము. స్వామిసేవ జరుగుతుంది.

ఒక విశ్లేషణ : స్వామివారు ఒక ప్రత్యేక పద్ధతిలో అనుగ్రహిస్తున్నారు. స్వామివారు అనుగ్రహించిన ప్రతిది తరువాత రోజులలో జరిగింది మే 2003లో తన పాదసేవ భాగ్యాన్ని ప్రసాదించి జూన్ 14న 'గోవింద దాసు'గ బాహ్య ప్రపంచానికి తెలియ చేసారు. మరియు బహుశా ఈ లీల ఫలితంగ ప్రతి 7 కోట్ల జపమును స్వామివారి పాదాలకు సమర్పించే సమయాన టి.టి.డి ఈ.ఓ గారు మాకు ఈ జపమును స్వామివారి పాదాలకు సమర్పించుటకు వీలుగ ఒక ప్రొసీడింగుతో పాటు, స్వామివారి పాదాలను ఇచ్చుట ఆనవాయితిగ ఏర్పడింది. ఈ స్వామి పాదాలు మీకు ఇవ్వడం జరిగింది. మీరు ఏమి చేసుకుంటారో చేసుకొండనే విధంగ కలలో స్వామి తన పదాలను ఇచ్చిన విధంగ ఇచ్చుట అలవాటైంది. అదేవిధంగ స్వామివారిని పొందుటకు సంకల్పమిచ్చాడు కాబట్టి తప్పక స్వామివారిని పొంది హరినామ క్షేత్రం ఏర్పాటుచేయగలమనే విశ్వాసాన్ని కలిగించాడు.

నా దశ : 'నమోవేంకటేశాయ' రథ సంకల్పం జరిగింది. శ్రీవేంకటేశ్వర సేవాసమితి అనే ట్రస్టును ఏర్పరచాము. స్వామిపై సంపూర్ణ నమ్మకము పెట్టమన్నారు. నాలాగ భక్తులకు సంకల్పాలు ఇచ్చి స్వామిసేవను విస్తరింప చేశాను. నన్ను తన పాదసేవకుడిగ స్వీకరించాడు. స్వామివారిని పొందుటకు సంకల్పం ఇచ్చాడు. గోవింద దాసుగ దాస్యనామము లభించింది.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

9వ భాగము

(జులై 2003 - అక్టోబర్ 2003)

రెండవ పుట్టిన రోజు పండగ

05-07-2003 : ఇంగ్లీషు తేది ప్రకారం ఇది నా రెండవ పుట్టినరోజు పండగ. దీనిని తిరుమల కొండపై స్వామివారి సన్నిధిలో జరుపుకున్నాను. తేది 04-07-2003 శుక్రవారము స్వామివారి అభిషేకసేవను చేసాము. మరియు 05-07-2003 నాడు స్వామివారిని రెండు సార్లు దర్శించుకున్నాము. ఈ సందర్భంగ నా మొదటి పుట్టిన రోజు పండుగకు స్వామివారు నాకిచ్చిన కానుకను ఈ విధంగా పునరాలోచించుకున్నాను.

నేను తేది 05-07-1960 తొలిఏకాదశి రోజు జన్మించాను. కాని నా జన్మతేది తెలియక కొన్ని సం॥లు, ఆసక్తిలేక మరి కొన్ని సం॥లు నా పుట్టిన రోజును ఏనాడు జరుపుకోలేదు. కనీసం దేవునికి దండం కూడ పెట్టలేదు. కాని 05-07-2002 నాడు నా పుట్టిన రోజును జరుపుకోవాలనే బలమైన కోరిక కలిగింది. ఆరోజు నా స్వామివారిని జీవితములో మొదటిసారి అభిషేకించి గులాబీలతో, మల్లెపూలతో అర్చించాను. ఆ తరువాత ప్రభూ! శ్రీవెంకటేశ్వరా! నేను నా మొదటి పుట్టిన రోజు పండుగను జరుపుకుంటున్నాను, నాచే ఈ లోకానికి ఉపయోగపడే ఏదో ఒక పనిని చేయించండి అని వేడుకున్నాను. మరియు నాకొక మంచి బహుమానం ఇవ్వమని పదేపదే ప్రార్థించాను. అంతే! అప్పుడు నాకు స్వామివారు ఎలాంటి బహుమానం ఇవ్వనున్నారో తెలియలేదు. అనంతమైన విలువైనది, నేను తృప్తిచెందే విధంగ బహుకరించారు. ఆ వరుస క్రమము ఈ విధంగ ఉంది.

ఉదయం 9.00 గం॥ల ప్రాంతమున స్వామివారిని తనివితీర పూజించాను. లోకానికి ఉపయోగపడే ఏదేని ఒక మంచి పనిని నాచే చేయించుమన్నాను, మరియు నాకో బహుమానం ఇవ్వమన్నాను. ఉదయం 10.30 గంటలకు ఆఫీసుకు వెళ్ళి స్వామివారికి బొట్టుపెట్టి మ్రొక్కునపుడు "తిరుపతిలో స్వామివారి మహామంత్ర స్తూపమును నేనే కట్టాలనే బలమైన కోరిక కలిగింది. మరియు ఇదేరోజు సాయంత్రం తిరుపతిలో కీ.శే. గవర్రాజు గారికి శ్రీవెంకటేశ్వరుడు దర్శనమిచ్చి "ఈ స్తూపాన్ని నా సాయిరెడ్డి కట్టగలడ" ని చెప్పాడు. తరువాత నాచే తన ప్రథమ దివ్య మహామంత్ర స్తూపమును నిర్మింపచేసి, నా చేతనే ప్రారంభోత్సవము కూడ చేయించారు. స్వయంగా ఆ స్తూపాన్ని స్వామివారు స్వీకరించి నన్నెంతో ఆనందింపచేసారు. ఆ తరువాత శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపింపచేసి, ఏడు నెలల్లో ఏడుకొండల వాడికి ఏడు కోట్ల జప సమర్పణను తేది 14-06-2003 నాడు సమర్పించే విధంగ చేసారు. లోకానికి నన్ను గోవింద దాసుగ పరిచయం చేసాడు. ఈవిధంగా ఇవి అన్నీ కూడ 05-07-2002 నుండి 05-07-2003 వరకు జరిగిపోయాయి.

ఇక నా రెండవ పుట్టిన రోజు పండుగ బహుమానం ఏముంటుందో చూడాలి. ఆయనకు నిస్వార్థసేవ చేయాలని ఉంది. నన్ను ఆయన ఒక సేవకుడిగ, పాదసేవకుడిగ స్వీకరించితే చాలు అనే భావన మాత్రమే నాలో ఉంది.

05-07-2003 కల : ఈరోజు ఉదయం దాదాపు 4.30 ప్రాంతమున ఒక మెరుపులాగ నాకు శ్రీవరాహస్వామి ముఖము, ఆయన తిరునామము కనబడ్డది. తిరుమలలోని ఆలయంలో ఉన్నట్లు దర్శించాను. ఇంతే కల. దీనిని నేను తిరుపతిలో ఉన్నప్పుడు దర్శించాను.

ప్రథమ 7 కోట్ల జపము స్వీకరించుటకు పాదాలను చూపుట

సం॥ 2000 నుండి స్వామివారిని ఆయన లీలలను చూడాలనే కోరిక నాలో బలంగా ఉంది. కొన్ని సార్లు ఆర్తితో ప్రార్థిస్తూ నాకోరిక నెరవేర్చుమంటాను. మరి కొన్నిసార్లు మాత్రం ఎప్పటికీ విసిగించకూడదనే ఉద్దేశ్యంతో, ఆ తపనను నాలోనే పెట్టుకొని బాధపడుతుంటాను. తిరుపతిలో శ్రీవెంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపమును నిర్మించిన తరువాత, ఈ స్తూపమును స్వీకరించుటకు తన దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించారు. దానికి నేనెంతో ఆనందించాను. గత ఇరవై రోజుల క్రితము స్వామివారికి ప్రథమ ఏడు కోట్ల జపసమర్పణ కావించాము. అదేవిధంగ దీనిని కూడ స్వామివారు స్వీకరించాలని అందుకు తన దివ్యపాదాలను చూపెట్టాలనే ఒక బలమైన కోరిక కలిగింది. గత కొన్ని రోజుల నుండి స్వామివారి బంగారు పాదాలను చూడాలనే కోరిక రోజురోజుకు పెరుగుతోంది, కాని నా మనస్సులోని కోరికను స్వామివారికి చెప్పలేకపోయాను. ప్రతిసారి అడిగితే ఏమనుకుంటారో అని ఒకింత భయపడ్డాను. పైగా స్వామివారిని నేను తపస్సు చేసి సాధించుకోలేదు, నా అదృష్టవశాత్తు బజారులో దొరికిన 'రత్నం' లాంటివారు. కాబట్టి విసిగించకూడదనుకున్నాను అందుకని నా కోరికను నా లోపల పెట్టుకుని కుమిలిపోయాను. ఏడుస్తున్నాను కరుణించుమని లోలోన ప్రార్థించాను. ధైర్యము చేసి ఒకసారి ఇలా నాలో నేను అనుకున్నాను. నేను సేవ చేసిన తరువాతనే అనుగ్రహించమని అడుగుతున్నానే తప్ప అంతకు మించి కోరుటలేదు. కాబట్టి నా కోరికలో తప్పు లేదని నాలో నేను అనుకున్నాను. మొత్తం మీద ఆయన పాదాలను చూడాలని ఉవిళ్ళూరాను. ఒక సందర్భములో (2001 సం॥) నాపైన తన నల్లని రెండు పాదములను పెట్టాడు, కాని ఆరోజు నేను వాటిని సరిగా చూడలేదు. తృప్తి చెందలేదు. కాబట్టి నేను తృప్తి చెందే వరకు మీ బంగారు పాదాలను చూపాలని లోలోన వేడుకున్నాను.

శ్రీవెంకటేశ్వరుడు నా ఈ కోరికను నూటికి నూరుపాళ్ళు నెరవేర్చాడు. పరమానందభరితుణ్ణి చేసాడు. మైమరచిపోయాను. ఒక భక్తుడు ఇంతకంటే ఎక్కువ ఆనందస్థితిని పొందలేడనే స్థితిని కల్పించాడు. అది కూడ తొలి ఏకాదశి రోజు. తెలుగు సంవత్సరాది ప్రకారం నా పుట్టిన రోజునాడు ప్రసాదించాడు. ఎంతగా సంతోషపడ్డానంటే మరో జన్మను నా స్వామి సేవకై కేటాయించుకున్నాను. నన్ను పట్టెమంచము మీద పడుకోపెట్టి, హాయిగ ఊపుచు, మధురమైన ఆహ్లాదకరమైన పరిస్థితుల మధ్యన తన బంగారు పాదాలను చూపెట్టాడు. చూడు, ఇంకా చూడు, నీ తనివితీర చూడు, మళ్ళీ మళ్ళీ చూడు అంటూ నేను పడుకున్న పట్టెమంచమును ఊపుచూ చూపెట్టాడు. ఇంతటి భాగ్యాన్ని పొందిన నేను స్వామివారికి ఏమివ్వగలను? ఆ లీల ఈవిధంగ ఉంది.

10-07-2003: ఈరోజు తొలిఏకాదశి. ఉదయం 4.30 నుండి 5.00 మధ్యన వచ్చింది ఈ కల. ఈ కలలో స్వామివారు అద్భుతమును చూపెట్టారు. ప్రథమ జపసమర్పణ సమయము నుండి స్వామివారి పాదాలను చూడాలనే కోరికతో ఉన్నాను. ప్రతిరోజు దీనికై ఆశపడుతున్నాను కాని తెల్లవారి నిరుత్సాహపడేవాణ్ణి. రేపు తప్పక చూపిస్తారనే పూర్తి విశ్వాసముతో జీవిస్తున్నాను. ఇలా కాలం గడుస్తోంది.

హైదరాబాద్‌లోని విద్యానగర్ వి.ఎస్.టి రోడ్డులో, సెల్లారులో శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆఫీసు ఉంది.



మొదటి 7 కోట్ల జపమును స్వీకరించానని
తన పాదములను చూపుట

దాదాపు 1000 అడుగుల వైశాల్యములో చక్కగ ఉంది. ముందు ఒక గది, దాని తరువాత మరో పెద్ద గది, దాని ప్రక్కన నా రూము ఇలా చక్కగా ఉంది. ఈ కలలో శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆఫీసులోనే స్వామివారు ఇదంతా చూపారు.

కల : అది శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం ఆఫీసు. నేను తలుపుతీసి వేచి ఉండు గదిలోనికి వెళ్ళాను. ఈ గదిలోని గోడకు శ్రీవేంకటేశ్వరుని మరియు కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఫోటోలు నిజంగా ఉన్నవి, మరియు కలలో కూడ దర్శించాను. దీని ప్రక్కన మరో పెద్ద గది ఉంది. ఈ గదిలో ఎదురుగా ఉన్న గోడ ముందు, అమ్మవారి మరియు స్వామివారి దాదాపు మూడు అడుగుల ఎత్తు ఉన్న బంగారు విగ్రహములను కలలో దర్శించాను. అవి అత్యంత సుందరంగ ఉండి, ధగ ధగా మెరుస్తున్నాయి. ఆ మెరుపుతో ఆఫీసు మొత్తం బంగారు కాంతితో నిండిపోయింది. ఇలా నేను స్వామివారిని మరియు అమ్మవారిని తనివితీర చాలాసేపు దర్శించాను. ఇంతలో ఈ విగ్రహాల పై ఎత్తులో కట్టెతో చేసి, పైనుండి గొలుసులతో వ్రేలాడుచున్న ఒక టూగుటుయ్యాల దర్శనమిచ్చింది. ఇది స్వామివారి మహిమతో ఏర్పడ్డది. ఇది పైనుండి గొలుసులతో వ్రేలాడుతోంది కాబట్టి ఊయలలాగ ఉంది. ఒక మూడున్నర అడుగుల వెడల్పుతో ఆరడుగుల పొడవు ఉన్న ఒక చక్కని బల్లపైనుండి గొలుసులతో వ్రేలాడుచున్నట్లుంది. ఈ బల్ల విగ్రహాల కంటే కొంత ఎత్తులో విగ్రహాల ముందు ఉంది. ఇంతలో ఒక శక్తి నన్ను ఆవహించింది. అది నన్ను పైకి లేపి ఈ బల్ల లాంటి ఊయలపైన బోర్లా పడుకోబెట్టింది. నేను నా తలను ఆ బల్లకు బయట స్వామి వైపు పెట్టి నా రెండు చేతులతో బల్ల చివరలను గట్టిగా పట్టుకొని క్రిందికి స్వామిని చూస్తున్నాను. ఇంతలో స్వామి, అమ్మవారు మాయమైనట్లు కేవలం స్వామి బంగారు పాదాలు మాత్రమే కనబడ్డవి. ఆయన ఇతర భాగాలు కనబడలేదు. లేదా

నేను ఆయన పాదాలనే కోరాను కాబట్టి, ఆయన పాదాలయందే ఆసక్తి ఉంది కాబట్టి అవి మాత్రమే కనబడ్డవి. ఆయన పాదాలు బంగారు వన్నెతో చకచక మెరుస్తూ కనబడ్డవి. ప్రక్కన అమ్మవారు కూడ ఉన్నారు కాని ఆమెవి కనబడలేదు. కేవలం స్వామివారివి మాత్రమే, రెండు పాదాలు చకచక మెరుస్తూ కనబడ్డవి. ఈ విధంగా స్వామివారి బంగారు పాదములను చూస్తున్నాను. అప్పుడు ఆ శక్తి నేను పడుకున్న ఊయలను మెల్లమెల్లగ ముందుకు వెనుకకు ఊపింది. దీనికి తోడు అక్కడ చల్లని ఆహ్లాదకరమైన పండు వెన్నెలలాంటి పరిస్థితులు కల్పించబడ్డవి.

నేను స్వామివారి పాదాలను హాయిగా చూస్తున్నాను. "చూడు, ఇంకా చూడు, తనివితీరా చూడు మళ్ళీ మళ్ళీ చూడు" అనే భావన నా మనస్సులో కలిగింది. ఆ భావనకు తగినట్లు, ఊయలలో ఊగుచు అత్యంత మధురమైన వాతావరణంలో స్వామివారి బంగారు పాదాలను నా తనివితీర చాలసేపు చూచాను. తరువాత కల చెదిరింది. ఇది నా జన్మను ధన్యము చేసింది. అది కూడ నా పుట్టిన రోజైన తొలి ఏకాదశి రోజు స్వామివారు తన సేవకుడికి, సేవకుడు కోరిన విధంగ కోరికను తీర్చాడు. ఆ స్వామివారికి కోటికోటి ప్రణామాలను సమర్పించాను. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు తన ప్రథమ 7 కోట్ల జపమును స్వీకరించి నన్ను పరమానందభరితుణ్ణి చేసాడు.

ఒక అధమ స్థాయి వ్యక్తినైన నేను తిరుమల శ్రీవేంకటేశ్వరుడు చూపు అనుగ్రహాలను చూచి పరవశించి పోయాను. ఆయన ఋణం తీర్చుకోవాలని, అందులకు ఎంతటి కష్టమైన పని యైనప్పటికి వెరవక చేయాలనే పట్టుదల నాలో తారాస్థాయికి చేరింది.

నమో వెంకటేశాయ రథం

23-08-2003 : తిరుపతిలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర దివ్యమహామంత్ర స్తూపమును 'నమో వేంకటేశాయ' పేరుతో ఒక బ్రాస్ రెప్లికను తయారు చేయాలని భావించాను. ప్రతి జపసమర్పణ కంటే 11 రోజుల ముందు హైదరాబాద్ నుండి తిరుపతి వరకు వీధి వీధి తిరుగుచు, భక్తులచే స్వామివారిని స్మరింపచేయుచు, చిన్న పేపరుపైన స్వామి మహామంత్రమును వ్రాయిస్తూ తిరుపతికి చేరి, జప పుస్తకములతో పాటు ఈమొత్తాన్ని ప్రతి సం॥ 7 కోట్ల జపములో భాగంగా సమర్పించాలని భావించాను. ఈ రథం తయారు చేయుటకు నేను నా సొంత డబ్బును సరిపడా సమకూర్చుకున్నప్పటికీ, భక్తులను భాగస్వాములు చేయాలనే ఉద్దేశ్యముతో, ఆసక్తి ఉన్నవారు చందాలు ఇచ్చుటకని ఒక పాంప్లెట్ తయారుచేసి ఈరోజు నుండి భక్తులకు పంచుట ప్రారంభించాము. ఒక నాలుగైదు నెలల తరువాత రథాన్ని ప్రారంభించాలనుకున్నాము.

ఇంతకు ముందు కీ.శే. గవర్రాజు గారి వద్ద పనిచేసిన శ్రీమాన్ పాండురంగారావు అనే వ్యక్తి ఆయనవద్ద మానేసి, పీఠం నిర్వాహణ పనులు చూచుకొనుటకు నావద్ద చేరాడు. నేను మాత్రం పీఠంతో పాటు వ్యాపారమును కూడ చూచుకుంటున్నాను.

17-09-2003 : ఈమధ్యన స్యాంత్రో జింగ్ అనే ఒక క్రొత్త కారు కొన్నాను. ఆర్.టి.ఏ రిజిస్ట్రేషన్‌లో దీని నెంబరు 7 రావాలని తలంచాను. అందుకు పదివేలు అదనంగ కట్టవలసి వచ్చింది. అందుకు ఇష్టపడక ఈ

డబ్బులు మీ నమో వేంకటేశాయ రథంకు వాడతాను, నాకు 7 వచ్చే విధంగ చూడుమని స్వామిని ప్రార్థించాను. చివరికి 7 వచ్చే విధంగ 1726 నెంబరును ప్రసాదించారు. నేనెంతో సంతోషించాను.

స్వామివారి శిక్షణ

ఇంతవరకు నేను సంతోషించే విధంగ స్వామివారు అనుగ్రహిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరుడు నావాడు అనే ప్రగాఢ విశ్వాసము నాలో ఉంది. ఇప్పటి నుండి నాకు తెలియకుండానే నాలో మార్పుకోసం ప్రయత్నించాడు. ఒక ప్రక్క తన సేవను విస్తరించుకుంటూ, మరో ప్రక్క నాకు అత్యంత ఇష్టమైన వ్యాపారములో, ఆస్తులలో గొడవలు సృష్టించాడు. ఆస్తులపైన వ్యామోహాన్ని ఎన్నో రేట్లు పెంచారు. ఫలితంగా ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకోలేని స్థితి కలిగించారు. ఈ స్థితి నుండి కాపాడుటకు శ్రీవేంకటేశ్వరుణ్ణి రకరకాలుగా నాకు తెలిసిన అన్ని మార్గాలలో ప్రార్థించేవాడిని. తల్లడిల్లిపోయేవాడిని. ప్రతి రోజు ప్రతి క్షణం స్వామివారిని అత్యంత ఆర్తితో స్మరించేవాడిని. స్వామివారు కూడ నా తపనకు తగిన విధంగ స్పందించేవారు. ఎన్నో హితబోధలు చేసారు. నేనున్నాను భయపడకుమనేవారు. మొత్తం మీద స్వామివారితో ఒక ఆట ఆడుకున్నాను. చివరికి స్వామివారు నావారు మాత్రమే కాదు అనే స్థితికి చేరుకున్నాను. నన్ను ఒక ప్రయోగకరమైన మార్గంలో నడుపుచున్నారని స్పష్టంగ గుర్తించాను.

జులై 2000 నుండి రెండున్నర సం॥ల వరకు స్వామివారి లీలలను అనుభవిస్తూ పరమానంద స్థితిని పొందాను. ఆ తరువాత స్వామివారి లీలలను పొందుచున్నప్పటికీ అవి నిరాటంకంగా లేవు. మధ్యమధ్యన ఎక్కువ గ్యాపులు ఉన్నవి. కాబట్టి నాలో కొంత నిరాసక్తత మొదలైంది. నిరాటంకంగా శ్రీవేంకటేశ్వరుని లీలలను అనుభవించాలనే కోరిక కలిగింది. వెంటనే స్వామి వారిని ప్రార్థించాను. పూర్వములాగ నాకు ఆస్తి తగాదాలు సృష్టించైనా సరే మీ లీలలను మధురంగ అనుభవించే భాగ్యాన్ని ప్రసాదించుమని వేడుకున్నాను. కాని ఈ ఆస్తి గొడవలలో నాకు నష్టం రాకుండా చూడమని మరీ మరీ వేడుకున్నాను. స్వామివారి లీలలను తనివితీర అనుభవించాలనుకున్నాను. కాని ఆస్తి నష్టం మాత్రం రాకూడదని తలంచాను.

అనుకున్నట్లే ఇప్పటి నుండి నా జీవితము మరోమలుపు తిరిగింది. ఒక ప్రక్క భక్తిమార్గంలో ఎన్నో లీలలు చూపెట్టి పైమెట్టుకు తీసుకెళ్ళాడు. 'నమో వేంకటేశాయ' రథం, 'శ్రీవేంకటేశం' మాసపత్రిక అనే రెండు మెట్లు ఎక్కించాడు. నన్ను పైతరగతిలో చేర్పించి భగవంతుని గురించి మరిన్ని విషయాలను తెలుసుకొమ్మన్నాడు. నా కోరిక ప్రకారం నాకో మంచి ఇల్లును కూడ ప్రసాదించాడు. మరో ప్రక్క భయంకరమైన ఆస్తి గొడవలను సృష్టించాడు. అందులో ఒక భక్తుడు ఊహించని లీలలను చూపెట్టాడు. కొన్ని సందర్భాలలో ద్వంద్వ అర్థాలను ఉపయోగించి ఒక ప్రక్క నన్ను సంతోషపరుస్తు మరో ప్రక్క తాను ఆశించిన మార్గము లోనికి తీసుకెళ్ళాడు. నీటి నుండి తీసిన చేపపిల్లలా విలవిల కొట్టుకున్నాను. లీలలను చాలించండి ప్రభూ నేను భరించలేనన్నా వినలేదు. ఆస్తిని పణంగా పెట్టి స్వామివారి లీలలను అనుభవించితే మధురంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ఆస్తి సమస్యలను సృష్టించమన్నాను. కాని స్వామివారు మాత్రం నాలో 'నా' అన్నది నశించాలనే దృష్టికోణంలో లీలలను ప్రసాదించారు. చివరికి నా సర్వదాస్తిని హరించివేశాడు. ఫలితంగా స్వామివారిపై కోపమేర్పడ్డది. చివరికి నేనంటే స్వామివారికి ఇష్టం లేదని, నాపై కక్ష కట్టాడని తలచాను. ఆయనపై ద్వేష భావము ఏర్పడింది. నా మనసులో నున్న వ్యధను స్వామివారు అర్థం చేసుకున్నారు. అప్పుడు నా వద్దకు తన యోగమాయను పంపాడు. ఆ మాయ నన్ను బంధించి ఆకాశమార్గాన తీసుకెళ్ళి తిరుమలలో స్వామివారి ముందుంచింది. అప్పుడు స్వామివారు నేనంటే ఆయనకు ఎంతో ఇష్టం అని చెప్పుచు ఆలింగనం చేసుకున్నాడు. ఒక్క క్షణములో నాలో ఉన్న కోపము భస్మమైపోయింది.శ్రీవేంకటేశ్వరుడంటే మరింత ప్రేమ ఏర్పడింది.

మరో సందర్భంలో నేను 'నా' అన్నది నశింపచేసుకుంటే మంచి బహుమానం ఇస్తానన్నాడు. నేను రెండు పర్యాయాలు సాధన చేసినప్పటికి యోగ్యత సాధించలేదన్నాడు. మూడవసారి తీవ్రంగ సాధన చేసాను. 'నా' అన్నది నశించిందని బహుమానం అని అడిగాను. ఇవ్వాలని ఉందా లేదా అని అనుమానించాను. అప్పుడు తిరుపతి నుండి శ్రీశ్రీశ్రీ హయగ్రీవ స్వామివారిని నా వద్దకు గురువుగ పంపారు. వారు నేను 'నా' అన్నది నశింపచేసుకోలేదని స్పష్టంగ నేను అర్థం చేసుకునే విధంగ తెలిపారు. అప్పుడు మీ కృపతోనే అది సాధ్యమవుతుంది లేకుంటే నాతో కాదని చెప్పాను. చివరికి ఇలా ఆయన సూచించిన మార్గంలో పయనిస్తున్నాను. ఇలామొత్తం 2003 నుండి 2008 వరకు 5 సం॥లు నా జీవితంలో మరపురాని రోజులు. ఇందులో కొన్ని లీలలు ఆస్తి తగాదాలకు, కొన్ని శ్రీవేంకటేశం మాసపత్రికకు, కొన్ని 'నమో వేంకటేశాయ రథము'నకు, కొన్ని నా గృహమునకు, మరికొన్ని యోగ్యతకు సంబంధించి ఉన్నవి. మొత్తం ఐదు రకాలుగ లీలలను ప్రసాదించాడు. మొత్తం మీద ఇవి స్వర్ణాక్షరాలతో లిఖించదగిన రోజులు. తనివితీర స్వామి లీలలను అనుభవించి అలసిపోయిన రోజులు. ఇలా తెలియకుండానే అద్భుతమైన శిక్షణను ప్రసాదించాడు. స్వామివారి శిక్షణ మానసికంగా, ఎదురుగా ఉన్న గురువు ఇచ్చిన శిక్షణ కంటే ప్రభావవంతంగా ఉంది.

ఈ మధ్యన నా భార్య ఇష్టపడి డైమండ్ టాప్స్ చేయించుకుంది. ఇష్టంగా నాలుగైదు రోజులు మాత్రమే ధరించింది. వెంటనే ఆస్తి సమస్య పుట్టింది. నిజానికి మేము సంఘంలో గొప్పవారిమనే భావన కలుగచేసే ఎలాంటి వాటినీ ధరించకూడదు. కాని మరచిపోయి విషయవాసనల వలన అలా ప్రవర్తించినప్పుడు స్వామివారు తగిన విధంగ గుర్తు చేస్తుంటారు. వెంటనే వీటిని స్వామివారికి సమర్పిస్తానని నిర్ణయించుకుంది.

ఆస్తి తగాదాలు

నాకు హైదరాబాద్‌కు సమీపములోని మియాపూర్‌లో ఎ.1.34 గుంటల వ్యవసాయభూమి ఉండేది. దీనిని 1996 సం॥లో నాకున్న సంపదలో చాలవరకు వెచ్చించి కొన్నాను. నిజానికి ఈ స్థల యజమాని ఒక మధ్యవర్తికి అమ్మాడు. నేను ఆ మధ్యవర్తి నుండి కొనుగోలు చేసాను. రిజిస్ట్రేషన్ సమయాన మాత్రం భవిష్యత్‌లో ఇబ్బంది రాకూడదని ఇద్దరిచే సంతకాలు పెట్టించుకున్నాను. ఇది కూకట్‌పల్లికి సమీపంలో ఉంది. భవిష్యత్‌లో విలువైనది కాగలదని భావించాను. దీనిని మా కుటుంబ రక్షిత ఆస్తిగా అంటే భవిషత్ సెక్యూరిటీ గురించి కొన్నాను. కొన్నప్పటి నుండి దీనిపై ప్రేమ ఎక్కువుండేది. స్థలము కొన్నానే కాని ఈ స్థలము కొనుటలోనే మోసగించబడ్డాను. ఈ స్థలం రిజిస్ట్రేషన్ సమయములో, నాకు అమ్మిన మధ్యవర్తి ఈ స్థల యజమానిని భయపెట్టి బలవంతంగా తీసుకువచ్చాడట. ఆ యజమాని కూడ ఆయనకు భయపడి నాకు సంతకము చేసాడు. నేను ఇచ్చిన డబ్బులు చాల వరకు ఈ మధ్యవర్తే తీసుకున్నాడు. ఇంటికి పోయిన తరువాత ఆ యజమాని పోలీసులకు దరఖాస్తు చేసి నాపై కేసు వేసాడు. ఇది చూచి మధ్యవర్తి తప్పుకున్నాడు. నన్నే మాట్లాడుకొమ్మన్నాడు. కోర్టులో రెండున్నర సం॥లు సాగింది. చివరికి ఆ యజమాని దీనావస్థను చూచి కోర్టులోనే మరింత ధనము ఇచ్చి ఏ కేసు లేకుండ చేసుకున్నాను. తరువాత భూమిని డెవలప్ చేసాను. బోరు, ఫెన్సింగు వేసాను. రెండు కుటుంబములు నివశించుటకు వీలుగ రూములు కట్టాను. ఆ స్థలములో టేకు చెట్లు వేసాను. కావలసిన పాస్ పుస్తకములను తీసుకున్నాను. కొద్ది కాలములోనే చెట్లు 25 అడుగుల ఎత్తు వరకు బాగ పెరిగాయి. తోట మంచి అందంగా తయారైంది. అప్పుడప్పుడు స్థలము వద్దకు వెళ్ళి చెట్లను, పరిసరాలను చూచేవాడిని. శ్రీవేంకటేశ్వరుని సృష్టిలోని కొంత భాగమును చూచి సంతోషించేవాడిని.

నేను భూమిని కొన్నప్పటి నుండి ఏడు సం॥ల తరువాత ఈ ఆస్తి విలువ గణనీయంగా పెరిగింది. పైగా హైదరాబాద్ చాల పెరిగిపోయింది. ఈ స్థలము వరకు విస్తరించింది. ఇప్పుడు తగాదా మొదలైంది. తేది 16-

09-2003 నాడు అనుకోకుండ ఆ మధ్యవర్తి నాకు ఫోన్ చేసాడు, తను నాకు అమ్మకముందే 1990-1993 మధ్య కాలములో ఈ స్థలములో కొన్ని ప్లాట్లు అమ్మానని, వాటిని తిరిగి తనకు ఇవ్వమని అన్నాడు. దానికి నేను సమాధానంగ నేను కూడ తన వద్దనే కొన్నానని, పైగా రెండు సార్లు ధనమును చెల్లించానని, ఇది నా స్థలమని అన్నాను. నిజానికి ఆ మొత్తం స్థలము ఎనిమిది ఎకరములు. నలుగురు అన్నదమ్ములది. ఈ మధ్యవర్తి అందరిదీ కొనుటకు అగ్రిమెంట్ చేసుకుని జి.పి.ఏ తీసుకున్నాడు. నాకు మూడవ సోదరుని భూమి అమ్మాడు. ఇతర సోదరులు కూడ ఈ మధ్యవర్తితో సరైన సంబంధాలు లేక, మధ్యవర్తి వారికి పూర్తి డబ్బు ఇవ్వనందున వారివారి భూమిని వేరేవారికి అమ్ముకున్నారు. ఈ మధ్యవర్తి ఎక్కడో వేరే స్థలములో ప్లాట్లు చేసి, ఇదే సర్వే నంబరు వేసి అమ్మాడు. ఆ ప్లాట్లు కొన్నవారిని మోసం చేసాడు. తరువాత వారు మోసం తెలుసుకొని ఈయనపై తిరగబడ్డారు, కేసు వేశారు. అప్పుడు ఈయన మళ్ళీ ఈ స్థలము పైకి వస్తున్నాడు. నిజానికి ఆ అమ్మిన ప్లాట్లు కూడ, ఆ లే అవుటును నా స్థలముపై పెట్టినచో (ఓవర్ ఇంపోస్ చేసినచో) అవి నా స్థలములోనికి రావు. ప్రక్కన ఇతర సోదరుల స్థలములోనికి వస్తాయి. పైగా ప్రతి ఒక్క ప్లాటు కూడ ప్లాటు నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయబడింది. ఆ ప్లాటు నంబరు విధంగ చూచినచో ఒక రెండు మూడు తప్ప (దాదాపు 600 గజాలు) మిగిలినవి నా భూమిలోనికి రావు. కాని ఏదోవిధంగ ఆ మధ్యవర్తి బయట పడాలని భావించి, ఒకే సర్వేనెంబరు ఉండడం మూలాన ఆ ప్లాట్లు నా స్థలములో ఉన్నవని చెప్పుచున్నాడు. ప్లాటు నెంబరును లెక్క చేయకుండ కేవలం సర్వేనెంబరును మాత్రమే చూపుచు నా భూమిపైకి వస్తున్నాడు. ఆస్తి విలువ పెరిగింది కాబట్టి లాక్కోవటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇది ఈ ఆస్తి తగాదాకు మూలము, కలహానికి కారణము.

భవిష్యత్ కలహాలను సూచించుట

ఈ మొత్తం విషయమును శ్రీవేంకటేశ్వరుడు నాకు ఏవిధంగా కలలో చూపాడో చూడండి. ఈ కలలోని భావము ఈ ఆస్తి తగాదా మొదటి నుండి చివరి వరకు జరిగే విషయమును తెలియచేసింది.

ఇది నన్ను రక్షించుటకో లేక భవిష్యత్‌లో ఇలా జరుగునని చూపాడో తెలియదు కాని, ఆయన చూపిన ప్రతి లీల అదే విధంగ జరిగింది. నేను అలా జరుగకూడదని భావించినప్పటికి అదేవిధంగ జరిగి తీరింది.

16-09-2003 : కల : ఈ కలలో ఊరిలోని మా తోటబావి కనబడ్డది. అదే బావి అదే పరిసర ప్రాంతాలు. కాని చిత్రమేమిటంటే ఆ బావిలో నీరు లేదు. బొగ్గుబావి. అతికష్టంగ లోనికి దిగే విధంగ ఉన్నది. ఒక తాడు సహాయముతో ముందు నేను ఆ తరువాత నా భార్య లోనికి దిగాము. మాకు తెలిసిన మావారైన మరో ఇద్దరు వ్యక్తులలో ఒకరు లోనికి దిగుచున్నారు. మరొకరు ఆ బావిగడ్డపై ఉన్నారట. ఇంతలోగుర్తు తెలియని వేరే కొందరు వచ్చి లోపల ఉన్న నన్ను రాళ్ళతో కొట్టుచున్నారు. ఆ రాళ్ళు నాకు తగిలే విధంగ వేస్తున్నారు. అది చూచి ఆ రాళ్ళు తాకుతాయనే భయముచే ఆ బావి లోపల అటు ఇటు పరుగెత్తుచున్నాను. ఆ రాళ్ళ నుండి తప్పించుకొంటున్నాను. కొట్టకూడదు, తాకుతాయని అరుస్తున్నాను. కాని వారు వినిపించుకోవడం లేదు. నన్ను మాత్రమే గమనించుచు, లోనుండి మాటల శబ్దమును బట్టి, ఆ శబ్దము వచ్చే దిశగ రాళ్ళను వేస్తున్నారు. దీనిని గమనించిన నేను వారు నన్ను మాత్రమే కొట్టుచుండుట వలన అరవకుమని లోనివారికి చెప్పాను. అంటే కొట్టేవాడికి శబ్దము వినిపించకుండా ప్రయత్నించాను. పైనుండి కొట్టే వారికి తెలియకుండా, వారికి కనుపించకుండా ఆ బావిలోని ఒక దరి నుండి మరో దరికి పోవుచున్నాను. ఈవిధంగ భయముతో పరిగెత్తడం వలన నా శరీరమునకు, బట్టలకు నల్లగా బొగ్గు అంటింది. అరచేతులు బొగ్గుతో నల్లగా మారాయి. తరువాత నెమ్మదిగా చాకచక్యంగా పైనవారు గమనించకుండా పైకి ఎక్కుచున్నాను. ఎక్కటానికి ప్రయత్నించాను. ఇంతలో కల చెదిరింది.

ఒక బొగ్గు బావిలోనికి అతికష్టంగ దిగడము. ఆ తరువాత గడ్డపైన ఉన్నవారు, బావిలోనున్న మమ్ములను రాళ్ళతో కొట్టుట. నేను వారికి తెలియకుండా చాకచక్యంగా తప్పించుకొనుట అన్నది నేను ఆ సమయములో ఉన్నటువంటి పరిస్థితికి అద్దంపట్టే విధంగా ఉంది. అంటే సమస్యలున్న స్థలమును కావలెనని, అతి కష్టంగ కొన్నావు. తరువాత దుండగులు దానిని ఆక్రమించుకొనుటకు ప్రయత్నిస్తారు. నాపై రాళ్ళు వేస్తారు. వాటిని తపించుకొనుటకు అక్కడక్కడ పరుగెత్తుట ఇవన్నీ కూడ తరువాత కాలములో ఈ తగాదాలో చోటు చేసుకొనునని తెలియచేసారు. అంటే వారు పెట్టే బాధలకు తాళలేకపోవుట, భయపడుట, తరువాత ఈ ఆస్తిని రక్షించుకొనుటకు అక్కడక్కడ వెళ్ళుట జరుగునని చెప్పాడు. ఈ విషయమును శ్రీవేంకటేశ్వరుడు ఇంత స్పష్టంగ తెలిపాడు. చివరికి అలాగే జరిగింది. ఇది నా ఆస్తి తగాదా విషయంలో వచ్చిన మొదటి కల.

ఈ కల తెల్లవారి నా స్థలం లోనికి ఆ మధ్యవర్తి, మరి కొంతమందితో వచ్చాడు. వారికి నాకంటే ముందే రిజిస్ట్రేషన్ అయింది కాబట్టి ఇది తమ స్థలమని నన్ను వదులుమని చెప్పారు. భయపెట్టారు. తరువాత రెండురోజులకు ఒక 25 మంది వచ్చి మా వాచ్‌మెన్‌ను మళ్ళీ భయపెట్టారు. నా స్థలములో ఫెన్సింగ్ వేసుకొని, ఇది తమ స్థలమని బోర్డుపెట్టి పోయారు. తరువాత నేను ఆ ఫెన్సింగ్‌ను బోర్డును తీసివేసాను గాని నా భూమికి అపాయము ఉందని భావించి భయపడ్డాను. ఈ ఆస్తి ప్రస్తుతము చాల విలువైంది. ఇది నాకున్న ఒకే మంచి ఆస్తి. దీనిపైన నాకు అమితమైన ప్రేమ ఉంది. పైగా దుర్మార్గుడైన ఈ మధ్యవర్తి కన్ను మళ్ళీ పడింది, ఏమగునో అని భయపడ్డాను. ఒకటి రెండు రోజులకు ఆ మధ్యవర్తి మళ్ళీ పది మందితో రావడము, వారి బోర్డు పెట్టడము నేను దానిని తీసివేయడము, పోలీసుస్టేషన్‌కు వెళ్ళడము ఇలా ఒక నాలుగైదు సార్లు జరిగింది. రోజు రోజుకు ఈ తగాదా ముదురుతున్నది. నాకు భయము పెరుగుతున్నది.

ఈ సమస్యను త్వరగ పరిష్కరించుకోదలచాను. కాబట్టి నేనే ఆ మధ్యవర్తి ఇంటికి వెళ్ళాను. నేను వారి వద్దనే భూమిని కొన్నానని, వారి సంతకము కూడ డాక్యుమెంటుపై ఉన్నదని చెప్పాను, పైగా రెండుసార్లు ధనమును వెచ్చించానని కూడ చెప్పాను. వారి ప్లాట్లు ప్రక్కవారి పొలములో ఉన్నవని, పరిశీలించుకొమ్మని చెప్పాను. వారు ప్రక్కవారి విషయములను నన్ను అడిగి తెలుసుకున్నారు. వారి భూమిలోనికి వెళ్ళుటకు సిద్ధమైనారు. చాల ప్లాట్లు ఉన్నవని నన్ను కూడ కొంత భూమి ఇవ్వమన్నారు. నేను దానికి ఒప్పుకోలేదు. మీరు నన్ను మోసంచేస్తున్నారని మీపైన చీటింగు కేసు పెట్టుదునని ఏదేదో చెప్పాను. చివరికి వారు నావద్దకు రామని మాట ఇచ్చారు.

ఈ మధ్యవర్తి గురించి నాకు బాగ తెలుసు. మంచి మాటకారి. ఎప్పటికీ పదిమందిని వెనకేసుకొని తిరుగుతాడు. పైగా ఇంతకుముందే ఒకసారి చూచాను కాబట్టి వీరికి భయపడిపోయాను. ఇప్పుడు అంటే 2003లో నేను శ్రీవేంకటేశ్వరునికి భక్తుడను. కావున ఈ సమస్యను పరిష్కరించమని స్వామివారిని సహాయము అడిగాను. మరియు నేను నిజమైన భక్తుడను కానని అందుకే నాకు కష్టాలు వస్తున్నాయని అనుకున్నాను. మీ యందు పూర్తి విశ్వాసమున్న భక్తుడు ఎలాంటి కష్టాలకు భయపడడు. కాని నేను భయపడుతున్నాను. నాకు మీపై పూర్తి విశ్వాసము లేదని, మీకు సరైన భక్తుడిని కానని బాధపడ్డాను. చివరికి ఆస్తి పోతుందని భావించి రక్షించమని వేడుకున్నాను. సం॥ 2000 నుండి నేను చాల మారిపోయాను. ఇతరులతో కలిసేవాడిని కాను, ప్రతిక్షణం స్వామి స్మరణలోనే గడిపేవాడిని కాబట్టి మిత్రులతో సహవాసమును తెంచుకున్నాను. ఒంటరి జీవితము, స్వామి స్మరణ తప్ప మరో ప్రపంచము లేదు. తేది 13-10-2003 నాడు ఈ దుండగులు మరోమారు ఆక్రమణ చేసారు. ఆరోజు 25 కి.మీ. దూరంలోని స్థలము వద్దకు పోయి, వారితో గొడవ పడి నీరసించి అలసిపోయి ఆఫీసుకు వచ్చాను. తరువాత అనుకోకుండా స్వామివారితో ఇలా ప్రార్థించాను. "శ్రీవేంకటేశ్వరా నేను ఒంటరివాణ్ణి, నాకు వెనకా ముందు ఎవ్వరు లేరు. కేవలము మిమ్ములనే నమ్ముకున్నాను" రక్షించమని ప్రార్థించాను. "నేను ఒంటరివాణ్ణి, నాకు వెనుకా ముందు

ఎవ్వరు లేర''నే మాట ఆనాటి నా పరిస్థితుల ప్రభావము వలన అప్రయత్నంగా నా నోటి నుండి వచ్చిందే తప్ప నేను కావాలని అనలేదు. ఈవిధంగా వేడుకునే సమయాన నా మనస్సు ఆయనపై పూర్తిగా లగ్నమైంది. కళ్ళ నుండి నీరు జలజల కారింది. నా స్వామి నన్ను తప్పక కరుణించుననే నమ్మకం నూరుపాళ్ళు ఏర్పడింది. మరియు ఈ మధ్యవర్తి చాలమందిని మోసం చేస్తున్నాడని, ఈయనను ఒక నాటకం ఆడించి శిక్షించమని కూడ వేడుకున్నాను.

నా ప్రార్థనను విన్న శ్రీవేంకటేశ్వరుడు ఆ మధ్యవర్తిని మంచి నాటకం ఆడించాడు. మరియు నా ముందూ వెనుక తానున్నానని చెప్పాడు. సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడు నీ ముందూ వెనుక ఉన్నానని చెప్పినప్పుడు ఒక భక్తుడు పొందే ఆనందం వర్ణనాతీతం. ఏకాకిగా ఉన్నా ఎవ్వరినీ లెక్కచేయకుండా బలమైన ఆత్మవిశ్వాసంతో జీవించగలం. మన పగవారు ఎంత హింస పెట్టినా నాకు రక్షణగా భగవంతుడున్నాడనే విశ్వాసముతో, ఆ బాధలు నన్నేమి చేయలేవనే నమ్మకముతో ఉండగలము. ఈరోజు రెండు కలలు కన్నాను. నాకు విరుద్ధంగా నన్ను హింసించడానికి నా శత్రువులు నాట్యమాడుదురని, ఆనందకేళి జరుపుకుంటారని చూపాడు. రెండవది నా వెనకా ముందు ఉన్నానని భయపడకుమని సూచించాడు. ఆ లీలలు ఈ విధంగా ఉన్నవి.

14-10-2003 కల : నేను మా ఇంటిలో టి.వి. ముందు కుర్చీలో కూర్చుండి వార్తలను చూస్తున్నాను. ఆ టి.వి స్క్రీను పైన మా ఊరి మిడుదొడ్డి ఎల్లయ్య (హరిజనుడు) అనే వ్యక్తి ప్రక్కవారు కొట్టే దప్పుల చప్పుడుకు, ఆ చప్పుడు యొక్క ట్యూన్‌తో గంతులు వేస్తూ నాట్యం చేస్తున్నాడు. ఊరిలో పెండ్లి మొదలగు సందర్భాలలో దప్పుల చప్పుడుకు ఎలా ఎగురుదురో అలాగే ఎగురుతున్నాడు. పంచె కట్టుకుని గోచీ పెట్టుకొని ఎగురుతున్నాడు. అంగీ ధరించలేదు. తన కుడి చేతి రెండు వ్రేళ్ళను నోటిలో పెట్టుకొని ఉయ్ ఉయ్ మని విజిలేసుకుంటు పిచ్చిగంతులేస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు తన చేతిలోని ఒక వేలును చూపుచు, ఆ దప్పులు ఇలా కొట్టాలని సంకేతమిస్తూ ఎగురుతున్నాడు. అతని భాషలో అది నాట్యం. ఆ దప్పుల చప్పుడుకు తగినట్లుగానే, ట్యూన్‌కు తగినట్లుగానే ఆడుతున్నాడు. చప్పుడుకు మరింత ఉత్సాహంగ గంతులపై గంతులు వేస్తూ ఆడుతున్నాడు. కల చెదిరింది.

నన్ను భయపెడుతున్న వ్యక్తి ఇదే విధంగ ఉన్నాడు. ఈయన కూడ హరిజనుడే (ఒక్కొక్కప్పుడు ఎస్.సి ఆక్ట్ పెట్టుదునని బెదిరించే వాడు). తన మద్దతుదారులు లేనప్పుడు చెప్పితే కొంత ఒప్పుకునే రకమే కాని తన చుట్టు ఉన్న పరివారము మహా విషపూరితులు. వారు ఎలా చెప్పితే అలా నడుచుకునే వాడు. ఇతరుల మాట విని వారి ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా నాట్యం చేయునని దీనర్థం. మహా నైపుణ్యముతో నాట్యం చేయుచు కేరింతలు వేయుచు ఆనందించుదురని దీనర్థం. ఈ కలను కన్న రోజు ఆ దుండగులను నా పక్షాన నాట్యం ఆడించునని, మరెవ్వరిని మోసం చేయకుండ చూచునని అనుకున్నాను. కాని కాలం గడిచిన కొద్దీ నాకు వ్యతిరేకంగా నన్ను భయభ్రాంతుణ్ణి చేయుటకు ఆడించాడు. ఈ సంఘటన తరువాత శత్రువుకు కూడ హాని కలగాలని భగవంతుడిని ప్రార్థించకూడదని భావించాను.

ముందూ వెనుక ఉన్నానని సూచించుట

ఇక రెండవ కల అత్యంత విలువైంది. ఆస్తి నష్టము అనే నెపమును కల్పించి జీవితం ధన్యం చెందే విధంగా అనుగ్రహించాడు. ఒక భక్తుడు పొందగోరే కల. ఇది నా జీవితంలో అమూల్యమైన ఘటన, జన్మను సార్థకము చేసే సంఘటన. ఎప్పుడూ మరిచిపోనిది. శ్రీవేంకటేశ్వరునికి కొన్ని కోట్ల నమస్కారములు పెట్టినా ఆయన ఋణమును తీర్చుకోలేని సంఘటన. భగవంతుడు భక్తుడికి అభయమిచ్చిన రోజు. నా జీవితము ధన్యతనొందిన రోజు. నేను ఇంతకంటే వేరేదీ ఆశించనిరోజు. నిర్భయంగా జీవితమును గడుపుమని అభియమిచ్చిన రోజు. నన్ను

భాగ్యవంతుణ్ణి చేసిన రోజు. ఈ కల ద్వారా శ్రీవేంకటేశ్వరుడు నాకు అభయమిచ్చాడు. నేను ఒంటరివాణ్ణి, నా వెనుకా ముందు ఎవ్వరు లేరని భావించి బాధపడుచున్న నాకు "నీ వెనుకా ముందు నేనున్నా" నని అభయమిచ్చిన ఘటన. ఈ కలను శ్రీవేంకటేశ్వరుడు స్పష్టంగ అర్థం అయ్యే విధంగా, తాను చెప్పబోయే విషయమును సులభంగ గ్రహించే విధంగా చూపాడు. నా జీవితంలో శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించిన ఎన్నో ఆణిముత్యాలలో ఇది ఒకటి. ఆ లీల ఈ విధంగ ఉంది.

14-10-2003 రెండవ కల : నేను నా భార్య సురేఖ మరియు మరికొంత మంది బంధువులతో కలిసి ఒక దూరపు దేవాలయమునకు పూజ నిమిత్తమై వెళ్ళాము. ఆ దేవాలయము మా ఇంటికి చాల దూరంగ ఉంది. కావున మేము ఉదయము బయలుదేరి సాయంత్రము వరకు ఆ దేవాలయమునకు చేరుకున్నాము. అది చాల విశాలమైన, పురాతనమైన దేవాలయము. ఆ దేవాలయము ఊరి బయట ఉంది. ఈ ఆలయానికి ఒక 40 అడుగుల ఎత్తు గల గాలిగోపురము ఉంది. మేము ఆ గోపురము గుండా లోనికి వెళ్ళాము. అక్కడ భక్తులు పడుకోవటానికి సరైన వసతులు లేవు. మేము ఆ దేవాలయమునకు వెళ్ళేసరికి రాత్రి అయింది. పూజ సమయము దాటిపోయింది. కాబట్టి ఈ రాత్రి అక్కడనే పడుకొని తెల్లవారి లేచి పూజ చేసుకొని తిరిగి ఇంటికి వెళ్ళుదామని నిర్ణయించుకున్నాము. అక్కడ విశ్రమించుటకు వసతులు లేవు కావున మా వారందరు ఒక్కొక్కరు నాకు తెలియకుండానే ప్రక్క ఊరికి పడుకోవడానికి వెళ్ళిపోవుచున్నారు. నేను కూడ వారిలాగానే వెళ్ళిపోవుచున్నాను. ఇంతలో ఒక అదృశ్య వ్యక్తి వచ్చి నాకు చాల మర్యాద చేస్తున్నారు. ఈ వ్యక్తి నాకు కనబడలేదు కాని ఆయన మాటలు మాత్రము స్పష్టంగ వినిపిస్తున్నవి. "మీరు చాల ముఖ్యమైన వారు" అని నన్ను గౌరవిస్తున్నారు. నన్ను బయటకు వెళ్ళవద్దని ప్రార్థిస్తున్నారు. ఆ ఆలయములో ఒక ప్రక్క మంచి అందమైన గది ఉంది. ఆ గది తలుపులకు అందమైన అద్దాలు బిగించబడ్డవి. ఆ గదిలో పరుపు, దానిపై తెల్లని దుప్పటి పరిచి ఉంది. ఆ గదికి క్రింది నుండి మూడున్నర అడుగుల ఎత్తు వరకు పాలపిట్ట రంగు వేయబడి ఉంది. పైన గోడలకు తెల్లని సున్నం వేయబడింది. తలుపులు కూడ పాలపిట్ట రంగుతో ఉన్నవి. వాటికి మూడున్నర అడుగుల ఎత్తుపైన తెల్లని అద్దాలు బిగించబడి ఉన్నవి. ఆ గదిలోని తెల్లటి పరుపుపైన మంచి తెల్లని వస్త్రమును కలిగిన దిండ్లు కూడ ఉన్నవి. ఈ విధంగా ఆ గది మంచి అందంగా, వెనుకటి స్వాములు నివసించే గది మాదిరిగా ఉంది. ఆ గదిని చూచిన ప్రతివారు ఇది మంచి పేరొందిన స్వాములు పడుకునే గది అని అనుకుంటారు. ఇదే విషయమును నాకు నా వెనకనుండి ఎవ్వరో చెప్పారు. లేదా ఆకాశము నుండి మాటలు వినబడ్డవి. "ఇది స్వాములు పడుకునే గది" అని అన్నారు. నన్ను మర్యాద చేస్తున్న ఆ అదృశ్య వ్యక్తి నన్ను ఈ రాత్రికి ఈ గదిలో పడుకోమన్నాడు. నేను మాత్రం ఈ గదిలో పడుకోలేను. ఇది స్వాములవారి గది. నేను యోగ్యుణ్ణి కాను అన్నాను. కాని ఆ వ్యక్తి మాత్రం "మీరు చాల గొప్పవారు ఈ రాత్రి ఈ గదిలోనే పడుకోవాలి" అని బలవంతపెట్టాడు. ఇది చూచి నా భార్య కూడా సరేనని తాను మరియు ఇతర బంధువులు బయట ఊరిలోనికి వెళ్ళిపోయారు. నన్ను ఇక్కడనే పడుకోమన్నారు. నేను ఈ గదిలో పరుపుపై ఒంటరిగ పడుకుని నిద్రపోయాను.

తరువాత కొంతసేపటికి మావారు ఎవరో వచ్చి తెల్లవారింది, పూజా సమయమైంది లేవమని నన్ను లేపారు. నేను లేచేసరికి ఇద్దరు శ్రీ వైష్ణవ స్వాములు నాకు ఇరు వైపుల, నన్ను తాకుచు పడుకొని ఉన్నారు. వారి వయస్సు దాదాపు 25 నుండి 26 వరకు ఉంటుంది. మంచి యువకులు, ఇద్దరు కూడ పంచె కట్టుకున్నారు. జంధ్యం వేసుకున్నారు. తలపై వెనుక భాగమున మాత్రమే వెంట్రుకలు ఉన్నవి. వైష్ణవ స్వాముల మాదిరిగనే శిఖ ముడుచుకున్నారు. ఛామనఛాయతో మంచి శరీర సౌష్ఠవము కలిగి ఉన్నారు. వీరు ఆరడుగుల ఎత్తు ఉన్నారు. మంచిముఖవర్చస్సు కలిగి, ఉబ్బు చెంపలతో ఉన్నారు. వీరిద్దరు ఊర్ధ్వపుండ్రాలను ధరించినప్పటికి కొంత చెదిరి పోయిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. ఇద్దరూ ఒకే ఆకారముతో ఒకరికొకరు ప్రతిబింబములాగ ఉన్నారు. వీరిని చూడగానే వీరు వైష్ణవ



స్వామి వారు నా ముందు వెనక ఉన్నానని చూపుట

స్వాములని స్పష్టంగ చెప్పగలము. ఈ ఇద్దరు స్వాములు కూడ నావైపే ముఖము చేసి నన్ను మధ్యలో వేసుకొని, నన్ను తాకుచున్నారు అనే విధంగ నాకిరుప్రక్కల పడుకున్నారు. ఆ సమయాన నేను ఒక ప్రక్కకు ముఖము చేసి పడుకున్నాను. నా ఒక చేతిని మడుచుకొని, దానిని దిండుగ చేసుకొని దానిపై తలపెట్టి ఒక వైపుకు ముఖముచేసి నిద్రిస్తున్నాను. మావారు తెల్లవారింది పూజ సమయమైంది లేవండి అని లేపేసరికి నేను లేచాను, నాకు ఇరువైపుల ఉన్న వైష్ణవస్వాములను చూచాను. అంటే నా వెనుకాముందు స్వాముల వారే ఉన్నారు. ఆ దృశ్యమును చూచి ఆశ్చర్యపోయాను. ఈ స్వాములు ఎప్పుడు వచ్చి పడుకున్నారు? అని ఆలోచించాను. ఆ తరువాత కలలోనే ఇలా అనుకున్నాను. "శ్రీవేంకటేశ్వరుడు నాకు ముందూ వెనుక ఉన్నాడని" ఇలా తెలియ చేసాడని అనుకున్నాను. నేను

లేచి కూర్చున్నాను. మా బంధువులు, నా భార్య అందరూ కలిసి ఆ ఆలయంలో దూరంగా రావిచెట్టు క్రింద ఉన్న దేవుళ్ళకు కలిసి పూజలు చేస్తున్నారు. ఈ దృశ్యమును చూచాను. ఆ దేవుళ్ళు కూడ నాకు నల్లగ కనబడ్డారు. ఈ కలలో నా స్వామి శ్రీవేంకటేశ్వరుడు నన్ను మరువలేదు. తన హృదయంలో భద్రపరచుకున్నాడని అనుకుంటూ నమస్కరించాను. కల చెదిరింది.

తెల్లవారి ఈ కలను విశ్లేషించాను. గతరోజు నా వెనకాముందు ఎవ్వరు లేరు అని అన్నదానికి నా ముందూ వెనుక నేనున్నానని తెలిపారని భావించాను. చాల ఆనందించాను. నా జీవితం ధన్యమైందని భావించుకున్నాను. శ్రీవేంకటేశ్వరుడు నావైపు ఉన్నాడు కాబట్టి నా సమస్య నావైపు తప్పక అవుతుందని, నా బాధలు తాత్కాలికమని ప్రగాఢ విశ్వాసం ఏర్పడింది. ఆ తరువాత నా శత్రువులకు భయపడలేదు. వారు ఏమి చేసినా నా స్వామి నన్ను రక్షించునని, నా ఆస్తి నాకు తప్పక దక్కుతుందని విశ్వాసంతో ఉండేవాణ్ణి. అంతే కాకుండా నా శత్రువులు కాంప్రమైజింగ్ మాట్లాడుకుందామన్నా నేను స్వామివారిపై గల విశ్వాసముచే, కల ప్రభావముచే వినలేదు. ఎంతో కొంత ఇవ్వండి వెళ్ళిపోతాము అని వారు ఎన్నిసార్లు అడిగినా నేను ఒప్పుకోలేదు. వారితో కాలు దువ్వడానికి సిద్ధపడ్డాను. ఒక రకంగా ఈ కలహము ఇంకా ముదరటానికి కారకుడనయ్యాను.

నా దశ : ప్రథమ ఏడుకోట్ల జపాన్ని స్వామివారు స్వీకరించి నన్ను ఆనందపరచారు. వారి దివ్యపాదాలను తనివి తీరా చూపెట్టారు. నమో వేంకటేశాయ రథం ఏర్పాట్లు జరుగుచున్నవి. స్వామివారి శిక్షణ ప్రారంభమైంది. నా ముందూ వెనుక స్వామివారు ఉన్నారని ధైర్యము ఇచ్చారు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

10వ భాగము

(అక్టోబర్ 2003 - ఫిబ్రవరి 2004)

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు అక్టోబర్ 2003 నుండి నాకు తెలియకుండానే నా మార్గాన్ని మార్చాడు. రానున్న రోజులలో నేను ఏవిధంగ జీవించాలో సూచించుటకు కొన్ని హితబోధలు, జ్ఞాన బోధలు చేసాడు. నాకు ఇంతవరకు గురువు లేడు. శ్రీవేంకటేశ్వరుణ్ణే గురువుగా, స్వామిగా, దైవముగా నమ్మాను. ఇప్పుడు ఒక గురువు తన శిష్యునికి ఏవిధంగా జ్ఞాన బోధ చేస్తాడో, ఆ విధంగా జ్ఞాన బోధ చేశాడు. అందులో మొదటి జ్ఞాన బోధ: "భవిష్యత్ ఎలాగుండునో నీకు తెలియదు, నీవు ప్రతిక్షణము నన్నే స్మరింపుము, నీకు శుభం కలుగుతుంది" ఈమాట సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడే బోధించాడు. స్వామివారి శిక్షణ మానసికంగ ఉంటుంది, వారు ఏమి చెప్పదలచుకున్నా, ఆ స్థితిని ప్రత్యేకంగా అనుభవించేటట్లు చేస్తూ హితబోధ చేస్తాడు. ఇప్పుడు కూడా నా జీవితములో ఎప్పుడూ ఊహించని ఒక భయంకర సంఘటనను సృష్టించి ఆ వాతావరణంలో ఈ జ్ఞాన బోధ చేశాడు. ఎప్పుడూ మరువలేని విధంగా, నా మనస్సులో శాశ్వతంగా ముద్రించుకుపోయే విధంగా బోధించాడు.

సదా స్వామివారిని స్మరిస్తూ జీవించమని చెప్పట

భగవంతుని లీల క్షణక్షణము మారుతుంది. ఒక క్షణంలో మనం సురక్షితంగ ఉండవచ్చు, మరుక్షణంలో మనకు తెలియకుండానే పెద్ద ఆపద సంభవించవచ్చు. ఆ ఆపద మన మంచికై కావచ్చు, కాని ఆ క్షణంలో భయభ్రాంతులకు గురవుతాము. బహుశా భయములో ఆ దేవుణ్ణి సదా స్మరించుట కొరకే ఆ ఆపద కలిగించునేమో. ఏ క్షణం ఏవిధంగా ఉండునో మనకు తెలియదు, కావున మన మొత్తం భారమును ఆయనపై వదిలి కేవలము ఆయనను స్మరిస్తూ జీవించవలెననే సందేశమును ఈ లీల ద్వారా తెలియచేశాడు.

24-10-2003 కల : అది ఒక పెద్ద వెడల్పైన నీటితో నిండిన సరస్సు. కనుచూపు మేర ఆ సరస్సు యొక్క అంచు కనబడలేదు. ఆ సరస్సు దట్టమైన ఎత్తైన చెట్లతో పచ్చని తీగలు కలిగిన చెట్లతో నిండి ఉంది. అలాంటి సరస్సుపై నేను ఒక హెలికాప్టరు లాంటి దానిలో ప్రయాణిస్తున్నాను. అది నీటికి కేవలము ఐదు అడుగుల ఎత్తులో మాత్రమే పోతుంది. అది ఏమాత్రం క్రిందికి గాని, ప్రక్కకు గాని పోయినట్లైతే ఆ చెట్లలో చిక్కుకుని భస్మమైపోవుట ఖాయం. ఈ హెలికాప్టర్ అత్యంత వేగంగా చెట్లను తప్పించుకోవడానికి మలుపులు తిరుగుచూ పోతుంది. ఇది

పోవు మార్గంలో మాత్రమే చెట్లు లేవు. మిగిలిన ఉపరితలమంతా పెద్ద పెద్ద చెట్లతో నిండియున్నది. ఒక రకంగా 'అనకొండ' లాంటి ఇంగ్లీషు సినిమాలో మాదిరి నీరు ప్రవహించు చిన్నమార్గం తప్ప మిగిలిన ప్రాంతమంతా చెట్లతో నిండి ఉంది. ఈ మార్గం పైనుండి ఈ హెలికాప్టర్ ప్రయాణిస్తుంది. పరిస్థితి భయానకంగా ఉంది. ఆ సరస్సు పైనుండి ఎక్కడ చూచినా ఒడ్డు కనబడ లేదు. ఎప్పుడు ఏమవుతుందో తెలియని పరిస్థితి. ఆ హెలికాప్టర్ చాల స్పీడుగా పోతోంది. నీటిని తాకే విధంగా పోతోంది. ఒకసారి కుడివైపుకు, మరోసారి ఎడమవైపుకు, ఒక్కొక్కసారి చక్కగా పోతోంది. ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో చెప్పలేని పరిస్థితి. ఆ హెలికాప్టర్‌లో నేనొక్కడినే ఉన్నాను. ఒక అదృశ్య శక్తి ఆ హెలికాప్టర్ ను నడుపుతోంది. ముందు ఒకింత భయపడ్డాను. వెంటనే కలలో ఆ స్వామిని మనసారా ధ్యానించాను. భయము తగ్గింది. ఈ హెలికాప్టర్ అత్యంత వేగంగా దూసుకుపోతోంది. ఏక్షణంలో ఏమి జరుగునో తెలియదు. అసలు మరుక్షణం బ్రతికి ఉండగలనా అనే విషయం కూడ తెలియదు. కాబట్టి స్వామి స్మరణలో ఎలాంటి అవరోధము కలిగించక సదా శ్రీవేంకటేశ్వరుని మహామంత్రమును ధ్యానిస్తున్నాను. చాల కాలము గడిచింది, ఒడ్డు రాలేదు, హెలికాప్టర్ పోతూ ఉంది. నేను స్వామివారిని స్మరిస్తూ ఉన్నాను. కొంత సమయము తరువాత ఇది అంతా శ్రీవేంకటేశ్వరుని మాయ అని అనుకున్నాను. మరియు ప్రతిక్షణం భయపడుచూ ఉండడము కంటే ఆ శ్రీవేంకటేశ్వరుని పైన పూర్తి విశ్వాసమును పెట్టి, శరణు జొచ్చి స్మరిస్తూ, ధ్యానించుకుంటూ ఉండడమే ఏకైక మార్గం అని, దీనిని మించిన మార్గం మరోటి లేదని కలలోనే భావించాను. ప్రతిక్షణం స్వామివారిని స్మరించుకుంటూ ఆ హెలికాప్టరులో చాలాసేపు ప్రయాణించాను. చివరికి సురక్షితంగా బయటపడ్డాను. "నీవు భయపడ్డావా?" అని ఆ అదృశ్యశక్తి అడిగింది. అందుకు జవాబుగా నేనెందుకు భయపడుతాను "నాకు మహామంత్రం వచ్చు" అని జవాబిచ్చాను. కల చెదిరింది.

"జీవితంలో ఏక్షణం ఏవిధంగా ఉండునో నీకు తెలియదు, నాకు తెలుసు, నీవు కష్టాలను లెక్కచేయక సదా నన్ను స్మరిస్తూ జీవించు నీకు శుభం కలుగుతుంది" అనే హృదయాంతర భావం వెనువెంటనే నా హృదయంలో ఏర్పడ్డది. అంటే మనకు వచ్చే ప్రతి కష్టాన్ని ఆయనకు వదిలి సదా శ్రీవేంకటేశ్వరుని స్మరిస్తూ జీవించమని ఆజ్ఞాపించాడు. ఇది ఈ లీల సారాంశం.

తెల్లవారి ఈ కల గురించి నేను ఇంతవరకే అర్థం చేసుకున్నాను. కాని తరువాత రోజులలో దీని నిజమైన అర్థమును ఈవిధంగా విశ్లేషించుకున్నాను. పైన చెప్పినట్లు ప్రతి క్షణం స్వామివారిని స్మరించాలి. అది కూడా శ్రీవేంకటేశ్వరుణ్ణే స్మరించాలి తప్ప అన్య రూపముల యందు మనస్సు పెట్టరాదు. ఈ సృష్టిలో ప్రతి దేవీ దేవతా రూపాలు శ్రీమన్నారాయణునివే. ఆయనే గత యుగాలలో నారసింహునిగా, శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా అవతరించి ప్రస్తుతము ఈ కలియుగంలో తిరుమల కొండపైన శ్రీవేంకటేశ్వరునిగా అవతరించాడు. ఆయనను మాత్రమే స్మరించుమన్నట్లు ఈ లీల ద్వారా ఆదేశమును పొందాను. ఇతర దేవీ దేవతలను, గత అవతారాలను కేవలం స్వామివారి గొప్పతనాన్ని, ఆయన వైభవాన్ని గుర్తించుటకు మాత్రమే ఉపయోగించాలి తప్ప స్మరణ మాత్రం శ్రీవేంకటేశ్వరుణ్ణే చేయాలని స్వామి ఆజ్ఞగా భావించుకున్నాను. భక్తుడు ఏ విధంగా, ఏ రూపంతో స్మరిస్తే భగవంతుడు ఆ రూపంలోనే అనుగ్రహిస్తాడు కాబట్టి, హరినామ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుడే మూలదైవం కాబట్టి ఇదే భావన సరైందనే భావన ఏర్పడింది. మరో అద్భుతమైన జ్ఞాన బోధ చేశాడు. ఈ కలలో స్వామివారి కృపను పొందుటకు ప్రతిసారి ఆలయమునకు పోవలసిన అవసరము లేదని, మనమున్న స్థలములోనే స్మరిస్తూ ఉంటే సరిపోతుందని సూచించాడు.

సం॥ 2002 నుండి 2010 వరకు శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆఫీసు వి.ఎస్.టి రోడ్డు విద్యానగర్

(నాగమయ్య కుంట) హైదరాబాద్‌లో సెల్లారులో ఉండేది. 2007 మరియు 2009 లో మూసీనది పొంగుట వలన రెండుసార్లు మా ఆఫీసు నీటిలో మునిగిపోయింది. ఫలితంగా స్వామివారి అనుభూతులు వ్రాసిన మొదటి రెండు పుస్తకములు నానిపోయాయి, చాల అనుభూతులు చదవడం కష్టంగా మారిపోయింది. ఈ అనుభూతి కూడా చదవడం కష్టంగా ఉన్న కారణంగా అర్ధం చేసుకున్నంత వరకు ఈ లీలలో దీని భావమును వివరిస్తున్నాను.

స్వామివారి కృపను పొందుటకు ఆలయం అవసరం లేదు

25-10-2003 కల : నేను నా భార్య సురేఖతో కలిసి ఒక శ్రీవేంకటేశ్వరుని ఆలయంలోనికి స్వామివారి దర్శనార్ధం వెళ్ళాము. అది తిరుమల ఆలయం కాకపోయినప్పటికీ నేను తిరుమల శ్రీవారిని దర్శించుటకే వెళ్ళుచున్నాననే భావం, నా మనస్సులో బలంగా ఉంది. దేవస్థానమువారు మాకు ప్రత్యేక దర్శన అవకాశమును కల్పించారు. మరియు ఆ సమయాన ఇతర భక్తులను నిలిపివేశారు. తిరుమల శ్రీవారు ఎప్పుడు కనిపిస్తారా అని ఎదురుచూస్తున్నాను. కాని అక్కడ శ్రీవారు లేరు. ఒక ఏడడుగుల పొడవు 2'-6" వెడల్పు, 3'-0" ఎత్తు ఉన్న ఒక అరుగు ఒక ప్రక్కన ఉన్నది. దాని పైన నేనున్నాను. ఆ అరుగుకు కొద్ది దూరములో ఎదురుగ ఈ అరుగును చూస్తూ మా సురేఖ నిలబడ్డది. ఆ అరుగుకు శ్రీవేంకటేశ్వరుడు చిన్నగా అంటే 2'-6" ఎత్తుతో వెలసి ఉన్నాడు. ఆయనను మా సురేఖ చూస్తున్నది. నాకు మాత్రం కనబడుటలేదు. నేను ఆ అరుగుపై పడుకొని క్రిందికి తలపెట్టి చూశాను. స్వామివారు కొంచెం కనబడ్డారు. ఆభరణాలను అలంకరణను పూజారి తీసివేసాడు. నా మనస్సులో స్వామివారు 6 అడుగుల ఎత్తు ఉండాలి లేరే అని అనుకున్నాను. ఇంతలో ఈ అరుగుకు ఎదురుగా ఒక అత్యంత నల్లని గుండులాంటి రాయి "బలిపీఠం" లాగా కనబడ్డది. (ఇక్కడ కొంత చెదిరిపోయింది) దీనికి వేరే ప్రక్క 6 అడుగుల శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడనే భావన కలిగింది. ఇంతలో నా మనస్సులో స్వామిని పొందటానికి విగ్రహము అవసరము లేదు. గుడికి వెళ్ళడము అవసరము లేదు. భక్తితో స్మరిస్తూ ఉంటే వారి కటాక్షమును పొందగలము అనే బలమైన భావాలు నా హృదయాంతరంగం నుండి వెలువడ్డాయి. ఇది కల.

ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు రెండు హితోపదేశాలు చేశాడు. నీకు ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ వెరవక సదా స్వామివారిని స్మరించమన్నారు. మరోసారి నీవు ఇంట్లోనే ఉంటూ, స్వామిని స్మరిస్తూ ఆయన కృపను పొందవచ్చని చెప్పాడు. శ్రీవేంకటేశ్వరుని ప్రథమ 7 కోట్ల జప సమర్పణ తరువాత స్వామి సేవకై ఎక్కువ పని లేకపోయింది. 2వ జప సమర్పణ వరకు వేచి ఉండాలి. ఇప్పుడు మేము 'నమో వేంకటేశాయ' రథమును తయారుచేయాల్సి ఉన్నప్పటికి, దానిని మొదలు పెట్టనందున విరామం దొరికింది. ఈ విరామ సమయము నాకు రుచించలేదు. ఎప్పటికీ నిరంతరంగా స్వామివారి సేవాభాగ్యం దొరికితే బాగుండుననిపించింది. వెంటనే స్వామివారిని ప్రార్థించాను. మరింత సేవాభాగ్యాన్ని ప్రసాదించుమని దీనాతిదీనంగా ప్రతిరోజూ వేడుకున్నాను. నేను మీ సేవలో తృప్తి చెందలేదని, తృప్తి కలిగే వరకు మీ సేవాభాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాను. విరామ సమయాలు వద్దు ప్రభూ! నేను తట్టుకోలేనంటూ వేడుకున్నాను. ఫలితంగా శ్రీవేంకటేశ్వరుడు నన్ను మరో మెట్టు పైకి ఎక్కించుటకు సిద్ధంగా ఉన్నాడు. స్వామివారు ప్రసాదించిన 'సేవ' అనే వృక్షానికి మరో శాఖ పుట్టుకొస్తుంది.

శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం

దాదాపు తేది 26-10-2003 ప్రాంతమున, సుభాషిణి అనే ఒక భక్తురాలు మా ఆఫీసుకు ఫోన్ చేసి మాట్లాడింది. శ్రీవేంకటేశ్వరుని పైన ఒక మాసపత్రికను ప్రారంభించుదామని, తాను కొన్ని పైసలను పెట్టుకోగలనని చెప్పింది. నాతో కలిసి ఈ పత్రికను స్థాపించాలని ఉన్నదని అన్నది. ఈ విషయం విన్నంతనే 'నమో వేంకటేశాయ'

అను పత్రికను పెట్టినచో బాగుండునని యాదృచ్ఛికంగా, నా ప్రమేయం లేకుండానే నా నోటి నుండి పలికాను. ఇది కేవలం స్వామివారి సేవ గురించి మాత్రమే ఉండాలన్నాను. ఇది స్వామివారి మహిమలను తెలిపే విధంగ ఉండాలని మరియు, దీనిని ఏలాంటి ధనాపేక్షతో చేయరాదని అన్నాను.

తేది 30-10-2003 నాడు ఉదయం శ్రీమతి సుభాషిణి మా ఆఫీసుకు నేరుగా వచ్చింది. ఆమెతో ముఖాముఖీ చర్చ జరిగింది. ఈ పత్రిక ప్రారంభించాలని తనకు అమితమైన కోరిక ఉన్నదన్నది. తన బంధువర్గము వారు ఈ రంగములో ఉన్నందున ఇబ్బంది ఉండదన్నది. ఈ పత్రికకు నాతో సమానంగా డబ్బులు పెట్టగలనన్నది. నన్ను ఆమెతో కలువమన్నది. ఇద్దరము కలిసి ఈ పత్రికను ప్రారంభించుదామన్నది. ఇంతే కాకుండా ఈ పత్రికలో 5-6 భాగాలను పెట్టాలని, స్వామి చరిత్ర, పూజా విధానము, ఏ కష్టానికి ఏవిధంగా సేవించాలి? స్వామివారి వివిధ ప్రాంతాలలో వెలసిన గుడుల చరిత్ర, భక్తుల అనుభవాలు ఇలా ఒక్కొక్క భాగంలో ఒక్కొక్కటి పెట్టాలన్నది. మరియు ముఖచిత్రము అద్భుతంగా ఉండాలనుచూ, మొదటి కవరు పేజీపై శేషతల్పముపై నారాయణుడు ఉన్న విధంగా ఉండాలని అన్నది. అప్పుడు నేను "మనము శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవిస్తున్నాము, పత్రిక పేరు 'నమో వేంకటేశాయ' కావున శ్రీవేంకటేశ్వరుణ్ణి నమస్కారములతో సేవిస్తున్న చేతులను చూపుచు స్వామివారిని చూపాలని, ఇది నా అభిప్రాయమని అన్నాను." మరియు ఇప్పుడు మేము 'నమో వేంకటేశాయ' అను దివ్యరథమును తయారు చేస్తున్నాము కాబట్టి ఒక సంవత్సరం తరువాత చూద్దామనే విధంగా చెప్పాను. ఇంతటితో సంభాషణ ముగిసింది. ఆమె వెళ్ళిపోయింది. ఈ రాత్రి స్వామివారు ఒక అద్భుతమైన లీల చూపెట్టారు. అది ఈవిధంగా ఉంది.

31-10-2003 కల : ఈ కలలో నేను శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించుటకు మంచి పట్టువస్త్రాలు (పంచె, లాల్చీ) ధరించి ఒక గుడికి వెళ్ళుచున్నాను. ఆ గుడి ఒక పెద్ద కొండపైన ఉంది. ఆ కొండ ఒకే రాయితో ఏటవాలుగ నిర్మితమై ఉంది. ఆ కొండ శిఖరాగ్రాన ఈ గుడి నిర్మితమై విద్యుత్ లైట్లతో ధగధగ వెలుగొందుచున్నది. కొండ ప్రారంభం నుండి గుడి వరకు అర కిలోమీటరు కంటే ఎక్కువ దూరమే ఉంటుంది. నేను ఈ గుడిలోని శ్రీవారిని దర్శించుకొను నిమిత్తము ఆ కొండను ఎక్కుచున్నాను. ఆ గుడి, ఈ కొండమొత్తం కూడ టి.టి.డి వారిదని, నేను తిరుమల శ్రీవారిని దర్శించుటకు పైకి వెళ్ళుచున్ననే భావన నా మనస్సులో ఉంది. ఇంతలో దారిలో నా కుడి ప్రక్క 6 అడుగుల ఎత్తుతో శ్రీలక్ష్మీనారాయణుడు శేషతల్పముపై కూర్చున్నవిధంగా కనబడ్డాడు. అది ఎప్పటిదో కట్టెతో చేసిన విగ్రహములాగా ఉంది. దానికి పసుపుపచ్చ, ఎరుపు మొదలైన రంగులతో పెయింటింగు వేసినట్లు ఉంది. ఈ విగ్రహము చాల పాతది, రంగులు అక్కడక్కడ పోవుచున్నవి. శ్రీమన్నారాయణుని చేతిలో శంఖు చక్రములు ఉన్నవి. ఆయన తొడపై లక్ష్మీ అమ్మవారు కూర్చొని ఉన్నారు. వారు 3-4 వరుసలు చుట్టుకొని ఉన్న పాముపై కూర్చున్నారు. వారి తలపై శేషుడు పడగ విప్పి ఉన్నాడు. దీనిని నా కనులార చూచాను. ఇది నేను వెళ్ళేదారి ప్రక్కన ఉంది. దీనిని చూచిన వెంటనే నిన్న 'నమో వేంకటేశాయ' పత్రిక కవరుపేజీపై శేషతల్పముపై కూర్చున్న శ్రీలక్ష్మీనారాయణుడు ఉండవలెనని శ్రీమతి సుభాషిణిగారు సూచించిన విషయం కలలోనే గుర్తుకొచ్చింది. తరువాత నేను పైకి నడిచి వెళ్ళాను. అది పండువెన్నెల ఆహ్లాదకరమైన వాతావరణము, కావున నేను ఈ వాతావరణాన్ని అనుభవిస్తూ మెల్లమెల్లగ పైకి నడుస్తున్నాను. అందరు భక్తులు పంచెలు ధరించి స్వామివారి దర్శన నిమిత్తము పోవుచున్నారు. నా వెనుక ఒక అబ్బాయి దాదాపు 23 సంవత్సరాల వయస్సు, నల్లని శరీరము ఆరడుగుల ఎత్తు కలిగి పంచెతో ఉత్తరీయముతో జంధ్యంతో చాల స్పీడుగా కేవలం గుడినే చూస్తూ వస్తున్నాడు. ఆ నల్లనివాడు పరిసరాలను పట్టించుకోకుండా కేవలం ఆ పైనున్న భగవంతునిపై మాత్రమే పూర్తి ధ్యాస పెట్టి శరీరాన్ని, పరిసరాలను మరచాడు. ఎప్పుడు ఆ గుడిని చేరుతాను, ఎప్పుడు ఆ శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించుకుంటాననే లక్ష్యం మాత్రమే ఆయనలో కనబడ్డది. అందుకు ఆయన నడక వేగంగా, పాదాలను పూర్తిగా నేలకు ఆనించకుండా, కేవలం మునికాళ్ళపై అంటే కాలి వేళ్ళపైననే



నడుస్తున్నాడు. ఈ వ్యక్తి నాకు ప్రత్యేకంగా కనబడ్డాడు. నా సంపూర్ణ దృష్టి ఈయనపై కేంద్రీకరించి చూస్తున్నాను. ఇతర భక్తులు స్వామి దర్శనార్థమై వెళ్ళుచున్నప్పటికీ వారెవ్వరూ నాకు కనబడలేదు. ఊహ మాత్రమే! కాని నేను మరియు ఈ నల్లనివాడు మాత్రము శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థము కొండ ఎక్కుచున్నట్లు స్పష్టంగా కనబడ్డది. ఇంతలో ఒక్కసారి ఆకాశము మెరిసినట్లు కాంతి వచ్చింది. అప్పుడు నా ముందు ఆ కొండపై ఒక లేయరుగ ఉన్న బండ అయిపోయింది. అక్కడ ఒకేసారి లోతు వచ్చి దాదాపు 10 అడుగుల లోతు నుండి మళ్ళీ ఈ బండ మొదలైంది. లేదా ఒడ్డెరవాడు రాయి కొట్టుట వలన పెద్ద గుంత ఏర్పడినట్లు ఉంది. నేను ఈ కాంతిలో ఆ గొయ్యిని చూచి భయముచే అక్కడనే ఆగిపోయాను. ముందుకు వెళ్ళలేదు. కాని నా వెనుక వస్తున్న ఆ నల్లని కుర్రాడు మాత్రము దాన్ని లెక్కచేయకుండ కేవలం స్వామినే చూస్తూ ముందుకెళ్ళాడు. ఆ గుంతలో పడిపోయాడు. కాని ఏమి కానట్లు మళ్ళీ లేచి అదే స్పీడుతో స్వామివారిని చూస్తూ ముందుకు పోయాడు.

ఈ నల్లనివాడు కేవలం శ్రీవేంకటేశ్వరుణ్ణి చేరడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాడు. దారిలో ఎదురుగా ఎలాంటి పరిస్థితులకూ బెదరక స్వామి యందే దృష్టి నిలిపి ముందుకు సాగిపోతున్నాడు. ఇతనిని ఆదర్శంగా తీసుకొమ్మనే ఒక హృదయాంతర భావం నాకు కలలోనే ఏర్పడింది. ఆ దారిని తిరుమల తిరుపతి దేవస్థానము వారు కాపలా కాస్తున్నారు. వీరు టి.టి.డి సెక్యూరిటీవారు ధరించే స్ట్రైబ్లూ షర్ట్స్, తెల్లని పంచెలు ధరించి ఉన్నారు. ఒక పెద్ద నల్లని నీటి పైపుతో ఆ దారినంతా కడుగుతున్నారు. ఆ నీటి స్ప్రే పొగలాగా కనబడ్డది. నేను ఆ ప్రక్కన ఉన్న సెక్యూరిటీతో "ఏమండీ ఇంతమంది భక్తులు వచ్చేదారిన ఈ గొయ్యి ఉన్నది. ఇది అపాయము కదా, భక్తులు చూడక ఇందులో పడిపోతారు, మీరు అక్కడ సెక్యూరిటిగా ఉండాలని" అన్నాను. ఇంతలో ఒకరు వచ్చి అక్కడ నిలబడి భక్తులను ప్రక్కనుండి వెళ్ళండి అని చెప్పుచూ, మేము ఇక్కడ ఉన్నాము, ఇప్పుడే ఒక పని మీద ప్రక్కకు

పోయామని అన్నాడు. పిదప నేను కొండపైకి పోవుచున్నాను. కల చెదిరింది. ఇది నాకు పత్రిక నిమిత్తమై వచ్చిన మొదటి కల.

తెల్లవారి దీనిని విశ్లేషించుకున్నాను. నన్ను శ్రీవేంకటేశ్వరుడు 'నమో వెంకటేశాయ' పత్రికను ప్రారంభించమన్నాడని, ముందూ వెనుక చూడకుండా, దేవునిపైన భారము వేసి ముందుకు సాగిపొమ్మని చెప్పాడని భావించాను. ఒకవేళ క్రింద పడిపోయినప్పటికీ, దెబ్బలు తాకినప్పటికీ వాటిని లెక్కచేయక కేవలం స్వామి యందే దృష్టి నిలిపి ఈ సేవను చేసినట్లైతే, నేను శ్రీవేంకటేశ్వరుని వద్దకు చేరగలననే విషయమును సూచించాడని భావించాను. అంటే శ్రీవారిని పొందవచ్చునని సూచించాడు.

కాని అప్పుడు మేము 'నమో వేంకటేశాయ' రథం తయారీలో నిమగ్నమై ఉన్నాము కాబట్టి దీనిపై దృష్టి పెట్టలేదు. తరువాత చూద్దాం అనే విధంగ వదిలేశాము.

స్వామి కంటే ఆస్తికే విలువ ఇస్తున్నావని చెప్పుట

భూసమస్య : ఆ సమయములో మా దృష్టి మొత్తం మియాపూర్‌లో ఉన్న మా ఆస్తిని రక్షించుకొనుటలోనే ఉన్నది. ఆస్తిపై వ్యామోహం ఎన్నోరెట్లు పెరిగింది. ఏ చిన్న ఆపద సంభవించినా తట్టుకునే స్థితిలో లేము. ప్రతిక్షణం స్వామివారిని స్మరిస్తున్నాము, రక్షించమని వేడుకుంటున్నాము. తేది 08-11-2003 నాడు కొంతమంది వ్యక్తులు నా స్థలములోనికి వచ్చారు. వారికి ముందే ఈ స్థలములో ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయినవని చెప్పుచు కబ్జా చేయ ప్రయత్నించారు. భూమి దగ్గరికి వెళ్ళాము, పోట్లాడాము వారిని రాకుండా చేసినప్పటికీ దీనితో చాల బాధపడ్డాను. ఇది నాకున్న ఒకే ఒక ఆస్తి ఏమౌతుందో అని భయపడ్డాను. విచారంగా ఉంది. ఈరోజు పూర్తిగా దీనావస్థలో గడిచింది. అదే చింతలో పడుకున్నాను. ఒక మంచి కల కన్నాను. ఈ కలలో నా అంతరంగాన్ని స్వామివారు చూపెట్టారు. కాని ఆస్తి వ్యామోహములో ఉండి దీని సరైన భావాన్ని గ్రహించలేక పోయాము.

08-11-2003 కల : నేను మరియు నా భార్య సురేఖ కలిసి శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం తిరుమల వెళ్ళాం. అప్పుడు కొండపైన స్వామివారి బ్రహ్మోత్సవము లాంటి ప్రత్యేక ఉత్సవములు జరుగుచున్నవి. వీధులన్నీ భక్తులతో నిండిపోయాయి. అందరూ స్వామివారికై వేచి చూస్తున్నారు. మేము మాత్రం ఆకలిగా ఉందని ఒక హోటల్‌లోనికి వెళ్ళి పూరీ తింటున్నాము, భక్తుల హడావిడి మేళ తాళాల చప్పుడు విని స్వామి వచ్చారని భావించి బయటకు వచ్చాము. అప్పటికే దేవస్థానమువారు బాజా భజంత్రీలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకొని వెళ్ళారు. రెండు వైపులా పెద్ద పెద్ద కట్టెలను భుజాలపై పెట్టుకొని ఆ కట్టెలపై బల్లలాంటి దానిపై స్వామివారు ఉన్నారు. స్వామివారిని తాళ్ళతో వెనుకనుండి కదలకుండా కట్టారు. నేను హోటల్ నుండి బయటకు రాగానే వారు వెళ్ళిపోయారు. మేము స్వామి ముఖమును చూడలేదు. కాని వెనుక వైపు చూచాము. పూజారులు పూజలు చేసుకుంటు, వేద పఠనం చేయుచు వెళ్ళారు. ఇక్కడ స్వామివారు సాలిడ్‌గ కాకుండా 6 అడుగుల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లాంటి అట్టతో చేసిన ఎంబోజింగ్ లాగా ఉన్నారు. ముందు ప్రక్క మాత్రమే స్వామి రూపం కనబడ్డది వెనుక ప్రక్క డొప్ప పోయినట్లు ఉన్నది. ముందు ప్రక్క రంగులు వేసి అలంకరించారు, వెనక ప్రక్క కేవలం ఒక అట్టలాగ ఉన్నది. ఇది పడకుండా తాళ్ళతో కట్టారు. ఈ ఊరేగింపును జనాలు చూస్తున్నారు. నేను నా భార్య మాత్రం వెనుక నుండి చూచాము. ముందు స్వామివారి ముఖమును చూచే అదృష్టము కలగలేదు. కల చెదిరింది.

ఈ కలలో మా మానసిక స్థితిని స్పష్టంగా తెలియచేశాడు. మేము స్వామివారి కంటే భోజనానికే ఎక్కువ విలువ ఇచ్చాము. స్వామివారి కృపావిశేషం చేత తిరుమలకు తీసుకుపోబడ్డాము, బంధించి ఉన్న స్వామివారిని వెనుక

నుండి దర్శించాము. దీనర్థం మేము స్వామివారు ఆశించిన స్థాయికంటే చాల చిన్న స్థాయిలో ఉన్నాము. స్వామి కంటే ఆస్తికే ఎక్కువ విలువనిచ్చే స్థితిలో ఉన్నామని అర్థం. మా ప్రవర్తనచే స్వామివారు బాధపడ్డారని అర్థం.

కొండలను లోయలుగ, లోయలను కొండలుగ చేయుట

సం॥2000 నుండి ఎన్నో స్వామివారి లీలలను చూస్తున్నాము. ఈ లీలలు ఒక వరుస క్రమములో ప్రసాదించుట వలన ఏదో తెలియంది సాధించుటకు ప్రసాదిస్తున్నారని గ్రహించాము. స్వామివారు ప్రసాదించు ప్రతి లీల ప్రభావము ఒక వారం పది రోజులే గుర్తుండేది. ఆ తరువాత మరిచేవాడిని, మళ్ళీ ఒక క్రొత్త లీల కావాలని దీనంగా ప్రార్థించేవాడిని. స్వామివారు ఒక విషయం కేవలం ఒక్కసారి మాత్రమే చెప్పేవారు. దానిని గుర్తుపెట్టుకొని వ్యవహరించుట నా కర్తవ్యంగా సూచించేవారు. కాని నేను మాత్రం వీటిని పట్టించుకోలేదు. మొదట్లో స్వామివారి చాలా లీలల అర్థమును సహితము గ్రహించలేకపోయాను. స్వామి లీలలను చూడాలనే నా కోరికను తీర్చుటకు మాత్రమే వీటిని ప్రసాదించాడని భావించేవాడిని. అలాంటి ఒక అద్భుతమైన లీల ఇప్పుడు జరిగింది. అప్పుడు దీనిని అర్థం చేసుకోలేదు పైగా దీనిని నా అనుభూతులను వ్రాసే పుస్తకములో కూడ వ్రాయలేదు. నా దైనందిన పుస్తకములో వ్రాసుకున్నాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

స్వామివారు ఈ లీలలో ఒక చక్కని జ్ఞానబోధ చేసారు. మన స్థితిగతులను క్షణంలో మార్పు చేయునని సూచించాడు. క్షణంలో కొండలను లోయలుగా, లోయలను కొండలుగా చేయునని సూచించాడు.

లీల : నేను హిమాలయ పర్వతప్రాంతము లాంటి ప్రదేశములో లేక నేపాల్ లాంటి ప్రదేశములో ఉన్నాను. చక్కని వాతావరణముతో ఆ ప్రదేశం అత్యంత ఆహ్లాదకరంగా ఉంది. ఒకప్రక్క పెద్దపెద్ద కొండలు, మరోప్రక్క అత్యంత లోతైన లోయలు కనబడ్డవి. ఈ కొండలు లోయలు ఒకదానికొకటి ఆనుకుని ఉన్నాయి. అది పండు వెన్నెల రాత్రి, ప్రశాంతమైన వాతావరణంలో ప్రకృతి ఆనందాన్ని అనుభవిస్తూ నిలుచున్నాను. ఇంతలో గడగడమని ఒక పెద్ద శబ్దం వినబడింది. నేను ఆ శబ్దం వచ్చిన దిశలో చూచాను. ఒక అద్భుతమైన, ఆశ్చర్యకరమైన దృశ్యమును చూచాను. నా దృష్టి ఆ అద్భుతాన్ని అలాగే చూస్తూ నిలబడ్డది. అసలు ఏమి జరుగుచున్నదో నమ్మలేదు. అసలు జరిగింది, అక్కడున్న కొండలు గడగడమని శబ్దం చేసుకుంటూ లోయలుగా మారిపోతున్నాయి. మరోప్రక్క అక్కడున్న లోయలు గడగడమని శబ్దం చేసుకుంటూ, పెరుగుతూ పెరుగుతూ కొండలుగా మారిపోవుటను చూచాను. ఈవిధంగా క్షణంలో కొండలు లోయలుగా, లోయలు కొండలుగా మారిపోవుటను చూచాను. ఇంతే కల.

అత్యంత స్పష్టంగా కలను చూపెట్టాడు. ఒకరకంగా ధనవంతులని బీదవారిగా, బీదవారిని ధనవంతులుగా క్షణంలో మార్చగలనని సూచించాడు. అంటే రాబోవు కాలములో నీ ఆర్థిక పరిస్థితి దిగజారిపోవునని అది శ్రీవేంకటేశ్వరుని కృపతోనే జరుగునని సూచనప్రాయంగా తెలిపాడు.

23-11-2003 భూ సమస్య : నన్ను భయపెడుచున్న మధ్యవర్తి మోసం చేయుటలో నేర్పరితనం కలవాడు. మా ప్రక్క భూమివారిపై కోర్టు స్టే తెచ్చాడు. వారి భూమిని కబ్జా చేస్తున్నాడు. ఈ మధ్యవర్తి తప్పక నాపైకి కూడా వచ్చునని తలచాను. భయపడ్డాను, శ్రీవేంకటేశ్వరుని నానా విధాలుగా ప్రార్థించాను. నాలుగు గోడల మధ్యన ఉన్న ఒక పామును కొట్టుచున్నప్పుడు అది ఏవిధంగా వేగంగా పరుగెడుచూ, తప్పించుకొనుటకు ఏదో ఒక రంధ్రం గురించి వెతుకునో, నేను ఆ విధంగా స్వామివారిని ప్రార్థించాను. ఏ కోణంలో ప్రార్థిస్తే స్వామివారు కరుణిస్తారనే దృష్టితో ప్రార్థించాను. చివరికి చక్కని ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ప్రకారం నా ల్యాండ్ భూమి

పేపర్సును స్వామిచెంత పెట్టాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! వీటిని కాపాడండి, సమస్య తీరిన తరువాత నాకు ఇవ్వమన్నాను. దొంగల భయము ఉన్నప్పుడు మన వస్తువులను లాకర్లలో పెట్టినట్లు, నా భూమిని స్వామివద్ద పెట్టాను. రక్షించమన్నాను. దీనితో మనశ్శాంతి లభించింది.

రథం : ఒక ప్రక్క భూ సమస్యను ఎదుర్కొంటున్నాను. మరో ప్రక్క 'నమో వేంకటేశాయ' రథమును అత్యంత సుందరంగా నిర్మించాలనే ఆలోచనతో ఉన్నాను. తిరుపతిలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము మోడల్‌ను నిర్మించాలి. దీనికి క్రింది భాగములో ''కృతేతు నారసింహోభూత్, త్రేతాయాం రఘునందనః, ద్వాపరే వాసుదేవశ్చ, కలౌ వేంకటనాయకః'' అనే శ్లోకానికి తగినట్లు, స్వామివారి ఆయా యుగాలలోని రూపాలను, ఈ రథం క్రింది భాగములో ఏర్పాటు చేయాలని భావించాము. దానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నాను. రథాన్ని ముందు ఇనుప రాడ్స్‌తో వెల్డింగ్ చేయాలి, ఆ తరువాత టేకు చెక్క బిగించుకుంటూ మహామంత్ర స్తూపపు ఆకారానికి తీసుకురావాలి. ఆ తరువాత దీనికి బ్రాస్ తొడుగులను ఫిక్స్ చేయాలి అని నిర్ణయించాము. ఎంతోమందిని విచారించి ఈ నిర్ణయానికి వచ్చాను. అత్యంత సుందరంగా, 25 సంవత్సరాల వరకూ చెక్కుచెదరకుండా ఉండే విధంగా ధృడంగా చేయాలనుకున్నాను. అయితే ఈ రథంలో నాలుగు ప్రక్కలలో నాలుగు శ్రీవారి మూర్తులను అమర్చవలసి ఉంటుంది. వీటికి కళ్ళు తెరచి ఉండాలా లేక మూసి ఉండాలా? అనే అనుమానం కలిగింది. విషయం గురించి తెలుసుకొనుటకు తేది 19-12-2003 నాడు ఎక్స్ ఈవో కే.శే. పి.వి.ఆర్.కె ప్రసాద్ గారిని కలిశాను. నా గురించి, నా సమస్యల గురించి స్వామి ప్రసాదించు అనుభూతుల గురించి చెప్పాను. మరియు స్వామివారి విగ్రహములు ఏవిధంగా పెట్టాలని అడిగాను. నా అనుభూతుల కాపీలను కొన్నింటిని వారికిచ్చాను. వారు తిరుపతిలోని ఉత్సవ విగ్రహముల మాదిరిగా చేయమన్నారు. ఇక నా సమస్యల గురించి ఇలా చెప్పారు. స్వామివారు నాకు తోడుగ ఉన్నారని భావించినట్లైతే, ఆర్థిక సమస్యలపై దృష్టి పెట్టక స్వామి సేవ చేయమన్నారు.

నాలుగు ధృవమూర్తులను దర్శించుట

పటిష్ఠంగా అత్యంత సుందరంగా 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేయాలనే నా సంకల్పానికి బహుశా శ్రీవేంకటేశ్వరుడు ఆనందపడ్డాడు. నా వెతుకులాటకు చక్కని జవాబు ఇచ్చునట్లు ఒక అద్భుతమైన లీలను చూపాడు. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం లాంటిది. జీవితాన్ని ధన్యం చేసేది. ఇంతవరకూ ఏ భక్తుడూ ఇలాంటి అనుభూతిని చూచి ఉండడు. ఈ లీలకు ప్రతిగా నా మరో జన్మను కేటాయించగల స్థాయి కలిగింది. స్వామివారి అభిషేక రూపమంటే నాకెంతో ఇష్టం. స్వామివారిని గులాబీలతో అర్చించుట మరెంతో ఇష్టం. ఈ లీలలో అభిషేక రూపములో స్వామివారు ఒకేసారి నాలుగు రూపములుగా కనబడి నా పూజను స్వీకరించారు. నన్ను మహదానంద భరితుణ్ణి చేశారు. ఒక రకంగా 'నమో వేంకటేశాయ' రథం ఈవిధంగా ఉండాలని సూచించారు. ఈ రథం ప్రతి భక్తుని వద్దకు వెళ్ళినప్పుడు వారు ఆచరించవలసిన విధానాన్ని కూడ సూచించాడు.

21-12-2003 కల : ఈనాటి కలలో నేను, కుటుంబంతో కలిసి తమిళనాడు వైపు ఉన్న ఒక శ్రీవేంకటేశ్వర ఆలయమునకు వెళ్ళాము. ఆలయంలో నాలుగు రాతిస్తంభాలతో ఉన్న ఒక మంటపాన్ని చూచాను. ఆ మంటపములో నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలో లింగమునకు స్వామి (శివుడు) నాలుగు ప్రక్కల ఏవిధంగ ఉంటాడో, ఆ మండపములో ప్రతి ప్రక్క నా స్వామి అర్చామూర్తిగ నిలుచుని ఉన్నాడు. ఆయన అచ్చంగా తిరుమల కొండపై శ్రీవారిని అభిషేకిస్తున్న సమయంలో అడ్డ పంచెతో ఉన్నవిధంగా ఉన్నాడు. ఆరడుగుల ఎత్తు, అత్యంత నల్లగా, మరియు చాల నున్నగా ఉన్నాడు. కొండపైన మూల విరాట్టుకు ఈయనకు తేడా లేదు.

ఆయన అభయహస్తమును, కటి హస్తమును చాల దగ్గరగా చూచాను. ముఖమును, శంఖు చక్రములను, సంపూర్ణ శరీరమును అత్యంత దగ్గరగా స్పష్టంగా చూచాను. ఈయన దృఢకాయుడు మరియు అత్యంత నల్లగా ఉన్నాడు. తెల్లని అడ్డుపంచె కట్టుకున్నాడు. నవ్వుముఖంతో ఆకర్షిస్తున్నాడు. ఈ నాలుగు రూపాలు ఒకేరకంగా ఉన్నవి. తరువాత కుడి ప్రక్కనున్న ఒక స్వామి పాదాలకు పూజ చేశాను. నా ప్రక్కనే అత్యంత విరబూసిన గులాబీల బుట్ట ఒకటుంది. చూచుటకు ఇవి దేవతా పుష్పములుగా ఉన్నాయి. అందులో నుండి తీసిన గులాబీలను స్వామి పాదాలపై నా రెండు చేతులతో సమర్పిస్తూ పూజించాను. నేను కేవలం ఆయన పాదాలకే పూజ చేసాను. మ్రొక్కాను.

మనస్సులో నాలుగు ప్రక్కల నాలుగు స్వామివారలు ఉన్నారని భావన ఉంది. కాని నేను ఒక స్వామివారికి పూజ చేసాను. చివరికి నా తల ఆయన పాదములపై పెట్టాను.

తనివితీర ప్రార్థించాను, ఇలా స్వామివారిని అత్యంత తృప్తిగా పూజించిన తరువాత బయటికి వచ్చాను. ఇక్కడ మరో చిత్రం జరిగింది. సీను మారిపోయింది నేను బయటకు వచ్చింది తిరుమలలోని స్వామివారి ఆనంద నిలయం నుండి, వెండి వాకిలి వరకు బయటకు రాగానే ఒక భక్తుడు పూజ దుస్తులతో ధ్వజస్తంభం చుట్టు ప్రదక్షిణలు చేయుటను చూచాను. తరువాత తృప్తి చెందక మళ్ళీ స్వామివారిని చూడాలనే కోరికతో మళ్ళీ లోనికి వెళ్ళాను. అక్కడి టి.టి.డి వారు ఎప్పటికీ మీరే వెళ్ళితే ఎట్లా అన్నారు. అప్పుడు కొంచెం ఆగాను. ఈ తప్పుకు శిక్ష అనుభవిస్తాను అని అనుకుంటూ, తిరిగి లోనికి వెళ్ళి స్వామి వారిని మళ్ళీ దర్శించుకున్నాను. ఆ రూపము సాక్షాత్ తిరుమలలోని మూల విరాట్టుదే! కల చెదిరింది.

ఈసారి స్వామివారిని తృప్తిగా చాలసేపు చూచాను. ఆయన పవిత్ర పాదాలకు పూజ చేసాను. నా తల ఆనించి నమస్కరించాను. ఇక నాకు కనబడిన నాలుగు స్తంభాలతో ఉన్న మండపము తిరుపతిలో అలిపిరి వద్దనున్న శ్రీవారి పాదాల మండపము.

(మేము ప్రతి సం॥ 7 కోట్ల జపమును, ప్రతి గోకులాష్టమి కంటే ఒక రోజు ముందు ఈ పాదాల మండపముపై పెట్టి పూజిస్తాము. అప్పుడు సాక్షాత్ తిరుమల శ్రీవారు ఇదే రూపంగా వచ్చి మా పూజను స్వీకరిస్తున్నారు. ఈ రూపమును ప్రతిసారీ నేను దర్శిస్తున్నాను.)

ఈ విధంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా 'నమో వేంకటేశాయ' రథంలో నాలుగు ప్రక్కల, నాలుగు మూర్తులుగా విరాజమానుడై ఉండునని తెలిపారు. మరియు ప్రతి భక్తుని ఇంటికి వెళ్ళుదునని సూచించాడు. భక్తులు ఆయన పాదాలను పూజించి, ఆ పాదాలపై వారి తలపెట్టి ప్రార్థించే భాగ్యమును ఆ ఇంటి యజమానులకు లేదా రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తునికీ ప్రసాదించారు. మరియు స్వామివారి అత్యంత సుందరమైన మూర్తులను నాలుగు ప్రక్కలా పెట్టాలని దిశానిర్దేశం చేసారు. ఇది నమో వేంకటేశాయ రథానికై స్వామివారు చూపిన మొదటి మరియు ముఖ్యమైన లీల.

మాస పత్రిక : ఈ నమో వేంకటేశాయ మాస పత్రిక ఎలా ప్రారంభించాలో తెలియక పోయినా, స్వామివారు దారి చూపుతారని భావించాను. మరియు శ్రీమతి సుభాషిణి గారు కూడా తోడు ఉన్నారనే ధైర్యంతో ఢిల్లీలోని ఆర్.ఎన్.ఐ వారికి టైటిల్ కోసం 22-01-2004 నాడు అప్లై చేశాను. ఇందులో నా మొదటి ఆప్షన్ 'నమో వేంకటేశాయ', రెండవది 'శ్రీవేంకటేశం' మూడవది 'శ్రీశ్రీనివాసం'. నాలుగవది 'వేంకటేశం!'. ఎందుకో కాని 'శ్రీవేంకటేశం' అనే పేరును వ్రాయునప్పుడు నా శరీరం పులకరించింది. తెలియని ఆనంద భావాలను పొందాను. తేది 27-04-2004 నాడు నాకు 'నమో వేంకటేశాయ' అనే టైటిల్ మంజూరు అయినట్లు ఢిల్లీ ఆర్.ఎన్.ఐ నుండి ఉత్తరమొచ్చింది. ఈ విషయం శ్రీమతి సుభాషిణి గారికి చెప్పాను. కాని ఆమె ఇప్పుడు ఏ సహాయమూ చేయలేనని, నేను ఈ పత్రికను ప్రారంభించాలనే ఉద్దేశ్యముతో ఆ రోజు తాను వచ్చానని చెప్పింది. అంటే పూర్తిగా జారుకుంది. నేను కూడా ఈ పత్రిక నావల్ల కాదని, విషయజ్ఞానం లేదని, తెలుగు సరిగా రాదని ఊరుకున్నాను. అప్పటినుండి ఒకరకంగా మరచిపోయాము.

సురేఖను నాగుపాము రూపంలో అనుగ్రహించుట

నా భార్య సురేఖకు ఎప్పటికీ కలలో మరియు ఊహలో ఒక నాగుపాము పడగ కనబడుచుండేది. దీనిని చూచి

ఆమె భయపడుచుండేది. ముందునుండి ఆమెకు పామంటే భయము. అందునా ఎప్పటికీ ఊహలో, కలలో ఇదే కనబడుట వలన భయపడుచుండేది. భయపడవద్దని ఎంత చెప్పినా వినేది కాదు. మేము నేపాల్‌లో శ్రీపశుపతినాథ్‌ను దర్శించినప్పటి నుండి ఆమె కలలో మరియు మనస్సులో మామూలు పడగకు బదులుగ ఒక పాము రుంగ చుట్టుకుని దానిపైన పడగ ఎత్తి ఉండుటను చూస్తున్నది.



శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపించిన తరువాత రకరకాల స్వామివారి భక్తులతో పరిచయాలు ఏర్పడ్డవి. కొన్ని రోజుల క్రితం శ్రీమాన్ ఉపేందర్ రావు అనే వ్యక్తితో పరిచయమేర్పడ్డది. ఈయన ఒంటిమీదకి స్వామివారు పూనకము లాగ వచ్చేవారు, అప్పుడు ఈయన మన గురించి మంచి చెడులు భవిష్యవాణి చెప్పేవారు. మా ఆహ్వానం ప్రకారం తేది 23-01-2004 నాడు మా ఆఫీసుకు వచ్చాడు. మా సురేఖను చూచాడు. ఆ విధంగా పాము, లేదా పడగ కలలో కనబడ్డప్పుడు భయపడకూడదని అది సాక్షాత్ ఆదిశేషుడని చెప్పాడు. మరియు నీవు పామును చూచి భయపడకూడదని చెప్పుటకోసమే నీ దగ్గరికి ప్రత్యేకంగా వచ్చానని చెప్పాడు. ఇలా ఇంక ఇతర విషయాలు చెప్పుతున్నప్పుడు మా సురేఖ ఆయన తలకు ఒక ప్రక్క స్వామివారి ముత్యాలతో అలంకరించిన శంఖును చూచిందట. దీనికి పరవశురాలైన సురేఖ కళ్ళవెంబడి ఆనంద బాష్పాలు రాల్చింది. ఆమె ఒక ప్రత్యేక లోకంలో విహరించింది. ఈ శంఖు అక్కడే ఉన్న నాకు గాని, మరో ఇద్దరికి గాని కనబడలేదు. ఆమె ఒక్క దానికే కనబడింది. చివరికి ఆరోజు నుండి ఆమె కలలో పామును చూచి భయపడలేదు. ఈ రాత్రి స్వామివారు ఆమెకు ఒక లీలను ప్రసాదించారు.

24-01-2004 : ఈ రాత్రి సురేఖకు ఒక కల వచ్చింది. ఆమె ఒక నాగుపామును దర్శించింది. ఆ పాము రెండు మూడు చుట్టలు చుట్టుకొని, పడగ పైకి ఎత్తి ఉన్నట్లు కనబడింది. కాని చిత్రమేమిటంటే ఆ పాముకు పడగ లేదట, ఆ స్థానములో శ్రీవేంకటేశ్వరుడు ఉన్నాడట. అంటే పడగ తప్ప మిగతాదంతా పాము పడగ మాత్రము శ్రీవేంకటేశ్వరుడు. చుట్టుకొని ఉన్న పాము పైన పడగ ప్రదేశములో శ్రీవేంకటేశ్వరుడు నిలబడి ఉండుటను చూచింది. దీనిని చూచి ఆమె ఏమాత్రము భయపడలేదు. తెల్లవారి ఎంతో సంతోషంతో నాకు ఈ విషయం చెప్పింది. నేను కూడా స్వామివారు నాకే కాకుండ నా భార్యను కూడ అనుగ్రహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపాను.

నమో వేంకటేశాయ రథము తయారీ ప్రారంభము

తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపచే, ప్రేరణచే తేది 28-01-2004 నాడు 'నమో వేంకటేశాయ' రథము తయారు చేయుటను ప్రారంభించాము. ముందు 7' × 7' సైజుగల ఒక 'సి' ఛానల్‌ను తయారుచేసాము. ఆ తరువాత తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపము యొక్క కొలతలకు అనుగుణంగా ఈ రథాన్ని తయారు చేయదలచాము. అత్యంత ఇష్టంతో, చిన్న తప్పు సహితం జరుగకుండా జాగ్రత్తపడ్డాము. ఇది చాలా పెద్ద పని. చాలా ఖర్చుతో కూడుకున్నది. ముందు స్కెలిటన్‌ను ఇనుముతో చేయాలి. తరువాత కట్టెతో రూపు తీసుకు రావాలి. ఆ తరువాత బ్రాస్ కవరింగు వేసి, ప్రతి ప్రక్క స్వామివారిని నిలపాలి. రథానికి మూడు ప్రక్కల క్రింది భాగంలో భగవంతుడు ఆయా యుగములలో ఉన్న రూపములను చూపెట్టాలి. అంటే నరసింహస్వామిని చూపుచు, ఇది సత్యయుగమని, శ్రీరాముణ్ణి చూపుచూ ఇది త్రేతాయుగమని, శ్రీకృష్ణుణ్ణి చూపుచూ ఇది ద్వాపరయుగమని, మరియు శ్రీవేంకటేశ్వరుణ్ణి చూపుచూ ఇది కలియుగమని చూపించాలనుకున్నాము. ఈ మొత్తమును ఒక లారీలో బిగించి, తిరుపతికి ఊరేగింపుగా భజనలతో తీసుకుపోవాలి. మార్గమధ్యంలో భక్తులచే స్వామివారి నామ జపమును వ్రాయిస్తూ ఈరథంలో వేయించుచూ తిరుపతికి తీసుకెళ్ళాలి అనే ఉద్దేశ్యముతో నిర్మిస్తున్నాము.

10-02-2004 కల : ఈనాటి కలలో నేను ఒక అత్యంత పెద్ద నాగుపామును తయారు చేస్తున్నట్లు కల కన్నాను. అత్యంత పెద్దపాము కాబట్టి ముక్కలు ముక్కలుగా తయారు చేసి అతికిస్తున్నట్లు కనబడ్డది. ఒకసారి పడగ, దాని క్రింది భాగము, నడుము ఇలా తయారుచేసి అతికిస్తూ అత్యంత పెద్దపామును తయారు చేస్తున్నట్లు కనబడ్డది. నేను దీనిని స్వామివారి ఆదిశేషునిగా భావించాను. చిత్రమేమిటంటే ఈ కల ఈరోజు నాకే కాకుండా నా భార్యకు కూడా ఇదే విధంగా కనబడ్డది. ఒకే కలను ఒకే విధంగా ఒకే రోజు ఇద్దరమూ కన్నాము.

డొనేషన్స్ స్వీకరించమని సూచించుట

ఈ రథం చాలా ఖర్చుతో కూడుకున్నది కాబట్టి ఆసక్తి కలవారి నుండి కొంత ఆర్థిక సహాయాన్ని ఆశించాము. గత నాలుగు నెలల నుండి ప్రయత్నించినప్పటికీ చాలా తక్కువ సేకరించాము. ఇచ్చుటకు ఎవ్వరూ ఇష్టపడలేదు. నిజానికి మొత్తం డబ్బును నేనే భరించుటకు సిద్ధపడ్డాను. కాని స్వామివారి గురించి భిక్షమడుగుటలో ఎంతో ఆనందించేవాడిని, మరియు భక్తులను కూడ ఈ సేవలో భాగస్వాములు చేద్దామనే మరో ఆలోచనతో డొనేషన్స్ ను అడిగాను. మొత్తం 4 నెలల్లో అత్యంత అల్పంగా సేకరించగలిగాము. ఈ డొనేషన్స్ సేకరించుటకు నా కారులో

వెళ్ళేవాడిని. ఒక్కొక్కప్పుడు పెట్రోలు పైసలు కూడ వచ్చేవి కావు, పైగా నా సమయం వృధా అవుతుండేది. ప్రతిగా రథం తయారీ వద్ద ఎక్కువ సమయం ఉండేవాణ్ణి కాదు. చివరికి ఈ డొనేషన్లను పూర్తిగా ఆపివేశాను. మొత్తం నా సొంతంగానే తయారుచేయాలని నిర్ణయించుకున్నాను. నా సొంత డబ్బులతో చేయుట స్వామివారికి ఇష్టం అని భావించాను. ఇదే సమయములో మా ఆస్తి గొడవలను లేకుండా చేయమని, ప్రతిగా తన పుస్తెలతాడును సమర్పిస్తానని నా భార్య స్వామివారికి మ్రొక్కింది. ఈ విషయం తెలిసిన నేను "నీవు తిరుపతిలో స్వామి హుండిలో వేయటం కంటే మనము తయారు చేసే రథమునకు ఉపయోగిస్తే బాగుండు"నని అన్నాను. కొంత ఆర్థిక సహాయం లభించేదన్నాను. వెంటనే నేనెవ్వరిని ఇలా చెప్పుటకని అనుకొని ఆరోజు స్వామివారిని ప్రార్థించాను. "ప్రభూ! డొనేషన్స్ అడుగకూడదనే భావం ఏర్పడింది. కనీసం నా భార్య బంగారాన్నైనా వాడుకునే అవకాశం ఇవ్వమని" తేది 24-02-2004 రోజు వేడుకున్నాను. ఆజ్ఞ ఇవ్వమన్నాను. దానికి స్వామివారు ఒక లీల ద్వారా ఈ విధమైన సందేశమిచ్చారు.

25-02-2004 కల : ఈ కలలో నేను మా చిన్నగుండవెల్లి గ్రామములో మా పాత ఇంటిలో ఉన్నాను. సాయంత్రం బాగా వర్షం వచ్చి వెలిసింది. నేను మా తోటబావి వద్దకు పోవుటకు ఇంటినుండి బయలుదేరాను. దారి వెంబడి వరద ఛాయలు కనబడ్డవి. ప్రశాంతమైన వాతావరణము మనస్సుకు ఆహ్లాదాన్ని గొల్పుతోంది. కొంచెము చీకటిగా ఉంది. దారిలో నేనొక్కడినే ఊరు వీధినుండి నడుచుకుంటూ వెళ్ళుచున్నాను. గొల్లవారి వీధి వచ్చింది. అప్పుడు దారికి ఎడమ ప్రక్క ఒక గొల్ల పిల్లవాడు తన దగ్గరున్న అల్యూమినియం గిన్నెను పట్టుకొని కూర్చున్నాడు. తన గిన్నెను క్రింద పెట్టి దానమడుగుచు, మరో ప్రక్క ఆడుకుంటున్నాడు. తన వద్దనున్న రెండు నాణేములను పైకి ఎగిరేస్తూ, తిరిగి పట్టుకొనుచు ఆ దారిలో పొయేవారిని దానమడుగుచున్నాడు. ఆ దారిలో నేనొక్కడినే ఉన్నాను. వీడిని చూడగానే వీడికి డబ్బు అవసరములేదు సంతోషం కోసం అడుక్కుంటున్నాడని అనుకున్నాను. అయినప్పటికీ వాడితో "ఏమిరా ఎందుకు భిక్షమడుగుతున్నా"వన్నాను. అందుకు వాడు "ఊరికే ఆడుకొనుటకు" అని బదులిచ్చాడు. నిజంగా నేను అనుకుంటున్నట్లుగానే వాని జవాబు ఉంది. వాడు తృప్తి చెందుటకు, సంతోషించుటకు మాత్రమే అడుగుచున్నాడు తప్ప అవసరానికి కాదు అని గ్రహించాను. కల చెదిరింది.

దీనర్థం నిజానికి నా వద్ద డబ్బు ఉన్నప్పటికి నేను నా సంతోషం కోసం మాత్రమే డొనేషన్లను అడిగాను. కాని అవసరముండి కాదు. మరోప్రక్క అవసరమైతే డొనేషన్లను అడుక్కొమ్మన్నారు కాని నా భార్య బంగారాన్ని మాత్రం స్వామివారికి సమర్పించమన్నారని భావించాను. (ఈమె ముందే తిరుపతిలో సమర్పిస్తానని భావించింది కాబట్టి)

మొత్తంమీద తరువాత కాలంలో ఎవ్వరినీ డబ్బులు అడగలేదు. నా భార్య బంగారాన్ని స్వామివారికి సమర్పించ నిర్ణయించాము. మొత్తం రథమును నా సొంత డబ్బులతో తయారు చేయ నిర్ణయించాము.

ఒక విశ్లేషణ : (ఎ) స్వామివారు ఒక ప్రత్యేక పద్ధతిలో తన సేవా భాగ్యమును నాకు ప్రసాదిస్తున్నారు. నాకు ప్రసాదించిన ప్రతి దానినీ తిరిగి తన భక్తులకు చేరే విధంగ చేయుట నా ధర్మంగా దిశా నిర్దేశం చేశారు. ఈ లీలలో నేను తిరుమల శ్రీవారిని పొంది పూజించాను. అయన పాదాలను పూజించి వాటిపైన తలపెట్టి ప్రార్థించాను. ఈ భాగ్యాన్ని నమో వేంకటేశాయ రథం ద్వారా భక్తుల ఇంటికి స్వామివారిని తీసుకెళ్ళి, వారికి కూడా ఇలా స్వామివారి పాదాలపై తలపెట్టి పూజించు భాగ్యాన్ని కల్పించుట నా ధర్మంగా నిర్దేశించారు. (బి) పూర్వం జపం వ్రాయించుటలో కూడా ఈ విధంగానే జరిగింది. స్వామిని స్మరించుటలో ఆనందం పొందేవాడిని మరియు నా జటిలమైన సమస్యలు తీరాయి కాబట్టి ఈ భాగ్యాన్ని భక్తులందరూ అనుభవించాలని భావించి జపసమర్పణ కార్యక్రమమును ఎన్నుకున్నాను. (సి) 'నమో వేంకటేశాయ' మాస పత్రికను ప్రారంభించి అత్యంత సమర్థవంతంగా నడిపినచో

స్వామివారిని పొందవచ్చని సూచించారు. ఈ సేవను నేను పొందుచు, పత్రిక చదివిన పాఠకులకు కలిగించుట నా ధర్మంగా సూచించారు. ఇలా స్వామివారు ప్రసాదించిన ప్రతి దానిని తిరిగి వారి భక్తులు అనుభవించునట్లు చేయుటకు నన్ను ప్రేరేపించారు.

నా దశ : సదా స్వామివారిని స్మరించుమని చెప్పారు, స్వామి కృపను ఇంట్లో ఉండే పొందవచ్చునన్నాడు. శ్రీవేంకటేశం మాస పత్రికను ప్రారంభించమన్నాడు, నా మానసికస్థితిని మార్చుకొమ్మన్నాడు. క్షణంలో లోయలను కొండలుగా మార్చుదునన్నారు, తిరుమల ధృవమూర్తులను దర్శించి పూజించాను. సురేఖను అనుగ్రహించారు. నమో వేంకటేశాయ రథం పనులు ప్రారంభించాము.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని

దిశానిర్దేశము

11వ భాగము

(ఫిబ్రవరి 2004 - మార్చి 2004)

దిశానిర్దేశము: సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం రెండు ప్రాకారాల (వెండి వాకిలి) వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతపు 11 వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి 2004 నుండి మార్చి 2004)

తిరుమల శ్రీవేంకటేశ్వరుని కృపా విశేషం చేత 'నమో వేంకటేశాయ' రథం పనులు చక్కగా జరుగుచున్నవి. స్వామివారి లీలలో భాగంగా మా ఇంటినుండి ఆఫీసుకి వెళ్ళే దారి లోని ఎస్.వి.ఎస్ వద్ద నున్న పెట్రోల్ బంకు వారు, సతీష్ నాయక్ గారు మా రథ నిర్మాణ పనులు చేసుకొనుటకు తన రెండు మడిగలను ఉచితంగా ఇచ్చారు. ఈ స్థలం ప్రతిరోజు రథం పనులను చూచుకొనుటకు అత్యంత అనుకూలంగా, మా ఇంటికి, ఆఫీసుకి మధ్యలో ఉన్నది. ఈ రథం తయారులో అడుగడుగునా శ్రీవేంకటేశ్వరుడు తన సహాయాన్ని అందించారు. రథం గురించి స్వామివారు చూపిన కొన్ని లీలలను తెలుపుచున్నాను.



నమో వేంకటేశాయ రథ నిర్మాణములో స్వామివారి లీలలు

సమర్పణ క్రతువు

రథంలో స్వామివారి మహామంత్రమును వ్రాసి వేయుటకు వీలుగా చిన్న చిన్న పేపరు ముక్కలను ఉపయోగించాలనుకున్నాను. ఒకరోజు ఈ పేపరు ముక్కలకు ''సమర్పణ క్రతువు'' అనే పేరు పెట్టాలనే హృదయాంతర భావం కలిగింది. దీని సమర్పణ విధానానికి కూడా చక్కని భావం ఏర్పడ్డది. దాని ప్రకారం రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తునికి ఈ క్రతువు అందించబడుతుంది.

దీనిని పొందిన భక్తుడు, తన కోరికలను మనస్సులోనే కోరుకుని స్వామివారి మహామంత్రమును ఈ క్రతువుపై వ్రాస్తాడు. ఆ తరువాత సమర్పణా భావంతో శరణాగత భావంతో స్వామివారికి మరొక్కసారి నమస్కరించి, మీరు తప్ప మాకు దిక్కెవరూ లేరంటూ ప్రార్థించి రథంలో ఉన్న శంకులలో ఈ క్రతువులను సమర్పణా పూర్వకంగా, శరణాగత పూర్వకంగా సమర్పిస్తారు. వ్రాయలేనివారు ఈ క్రతువును స్పృశించి, శరణాగత భావంతో శంకులలో సమర్పిస్తారు. ఈ విధానాన్ని అనుసరించాలనే భావన కలిగింది. దీనితో పాటు రథంతో తిరిగే మా వారిని 'స్వామి సేవకులుగా' సంబోధిస్తూ వారికి పసుపుపచ్చ రంగు డ్రెస్ కోడ్ పెట్టాలనిపించింది.

తిరుపతిలో నిర్మించిన శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపము మోడల్ ను చక్కగా నిర్మిస్తున్నాము. నాలుగు ప్రక్కలు ఒకే విధంగా ఉండాలి. ప్రతి వైపు స్వామివారు ఉండాలి. అయితే భక్తులు మహామంత్రమును వ్రాసి వేయుటకు వీలుగా ప్రతి వైపు శంకు చక్రములను ఏర్పాటు చేద్దామని స్థపతి శ్రీమాన్ సెల్వకుమార్ గారు సూచించారు. దీనికోసం శంకు చక్రములను వాడవచ్చా? అనే అనుమానం కలిగింది. వెంటనే స్వామివారిని ప్రార్థించి దారి చూపమన్నాను. స్వామివారు ఈ క్రింది చక్కటి కలను ప్రసాదించారు.

ముత్యాలతో అలంకరించిన శంకును చూపుట

29-02-2004 కల : ఈ రాత్రి కలలో నాకు ఒక శంకు కనబడింది. అది ముత్యములతో చక్కగా అలంకరించబడి ఉంది. ఆ ముత్యములు తెల్లగా నిగనిగలాడుతూ మెరుస్తూ ఉన్నవి. ఈ ముత్యములు రెండు వరుసలలో అమర్చబడి కాంతివంతంగా మెరుస్తూ ఉన్నవి. ఈ ముత్యాల హారాలు శంకు యొక్క రెండు చివరలలో క్రిందికి కొంత భాగం జారి వ్రేలాడుచున్నవి. కల చెదిరింది. తెల్లవారి ఈ కల విషయమును మా సురేఖతో చెప్పాను. ఆమె కూడా శ్రీమాన్ ఉపేందర్ రావు గారితో మాట్లాడినప్పుడు ఆయన చెవి ప్రక్కన ముత్యాలతో వ్రేలాడుచున్న శంకును చూచానని చెప్పింది. చివరికి నమో వేంకటేశాయ రథానికి ప్రతివైపు స్వామికి రెండు ప్రక్కల ముత్యములతో అలంకరించిన శంకులను మాత్రమే వాడాలని

నిర్ణయించుకున్నాము. శంకులకు మూతలాగా తయారు చేసి దీనిలో సమర్పణ క్రతువులను వేయుటకు వీలుగ చేయాలని నిర్ణయించుకున్నాము. ఒక రకంగా ఇది పోస్ట్ డబ్బా లాగా ఉంటుంది.

ఇక ఈ రథాన్ని ఏవిధంగా తిరుపతి వరకు త్రిప్పుచు తీసుకువెళ్ళాలి అనే విషయాన్ని ఆలోచిస్తున్నాను. లారీపై బిగించి త్రిప్పాలా లేదా ఒక ట్రాలీ తయారు చేయాలా అనే సందిగ్ధములో ఉన్నాను. ఈరోజు మా అపార్టుమెంటు ముందు ఒక నీటి ట్రాలీ నిలిచి ఉండుటను చూచాను. ఇది నన్ను చాలా ఆకర్షించింది. వెంటనే దీనిని ఆదర్శంగా తీసుకుని తయారు చేయాలనుకున్నాను. ఈరోజు ఈ విధమైన మరో కల కన్నాను.

ట్రాలీని చూపుట

07-03-2004 కల : ఈ రాత్రి కలలో 7' X 7' సైజు ఉన్న ఒక ట్రాలీ ముందు రెండు ఇనుప రాడ్ లు Y ఆకారంగా కలిసి ఉండుటను చూచాను. ఈ విధంగా చేయుమని స్వామి ఆజ్ఞ ఇచ్చారని అనుకున్నాను. ఈ విధంగా చేసినచో ముందువైపు నుండి కూడా భక్తులు సేవించుకోవచ్చును. పూజలు, టెంకాయలు కొట్టుట మొదలగునవి ముందునుండే చేయాలని నిర్ణయించుకున్నాము.

ఈ విధంగా ఈ రథం తయారులో నా స్వామివారు అడుగడుగునా చక్కని దిశా నిర్దేశం చేశారు. ఒక రకంగా నేను నిమిత్తమాత్రుడను. నాకు కేవలం ఆయన సేవా భాగ్యాన్ని కలిగించాడు. అందుకు నా స్వామివారికి కోటి కోటి ప్రణామాలను సమర్పింస్తున్నాను.

భూ సమస్య : మియాపూర్ లో ఉన్న నా ఆస్తి గొడవ ముదిరింది. ఈ దుండగులు నన్ను అడ్డు పెట్టుకుని, నా భూమిపైకి రామని చెప్పుచూ ప్రక్క హిస్సాదారు భూమిని కబ్జా చేశారు. చివరికి ఆ భూమివారికి, ఈ దుండగులకు, నాకు ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం ప్రక్క భూమి వారు కొంత మొత్తానికి ఒప్పుకున్నారు. ఈ డబ్బు



తీసుకుని అన్ని ప్లాట్స్ ను కొని వాటి రిజిస్ట్రేషను క్యాన్సిల్ చేయాలి. నేను వారి దగ్గరే కొన్నాను కాబట్టి, నా భూమిలోకి రామని ఒక అగ్రిమెంట్ వ్రాసి ఇవ్వాలి. ఈ ఒప్పందం ప్రకారం ప్రక్క భూమివారు డబ్బును ఇచ్చారు. వీరు ఆ డబ్బుతో చాలా ప్లాట్స్ కొని క్యాన్సిల్ చేయకుండా వారి పేరు పైన జి.పి.ఏ తీసుకుని తిరిగి వాటిని అమ్మాలని చూస్తున్నారు. వాటితో మళ్ళీ డబ్బు సంపాదించాలని చూస్తున్నారు. పైగా నా భూమిపైకి రామని చెప్పుచు ఒక అగ్రిమెంట్ ఇస్తామన్నవారు, వారి మాట మార్చి, మనస్సు మార్చుకొని నన్ను బెదిరిస్తున్నారు. నేను వారి మాటలకు భయపడుచున్నాను. రోజు రోజుకు భయము పెరుగుతోంది. 17-03-04 నాడు ఒక అగ్రిమెంట్ కాపీని ఇచ్చి దీని ప్రకారం వెళ్ళుదామన్నారు. అది పూర్తిగా వారి పక్షాన ఉన్నది. నేను ఒప్పుకోలేదు. మనస్సులో బాధ కలిగింది. నేను నా భూమిని మోసం చేసి సంపాదించలేదు. పైగా దీనిని మా రక్షిత ఆస్తిగా పెట్టుకున్నాను. నాకున్న ఒక్కటే ఆస్తి. దీనిపైన అత్యంత వ్యామోహం ఉంది. కాబట్టి ఇది పోతుందని చాలా బాధపేసింది. ఈ దుండగులు చాలా దుర్మార్గులు, నేర్పరితనం కలవారు. తప్పక నా ఆస్తిని కబళించగలరని అనిపించింది. దీనిని రక్షించమని స్వామివారిని మరీ మరీ వేడుకున్నాను. స్వామివారు మాత్రం కరుణించుట లేదు. 20-03-2004 నాడు దుండగులతో మళ్ళీ ఒక సమావేశం జరిగింది. నేను ఒంటరినని, ఎలాంటి బలము లేనివాణ్ణని గ్రహించారు. కొంత తర్జన భర్జన తరువాత ''మేము నీకు ఎలాంటి NOC ఇవ్వము. నీవు ఏమి చేసుకుంటావో చేసుకో. అవసరమైతే నీ భూమిని కబ్జా చేస్తాము. అది మా భూమి'' అని ఖరాఖండిగా చెప్పారు. నేను వారితో ''ఇది మీరు అమ్మిన భూమియే కదా. మీపై చీటింగ్ కేసు పెట్టుదునని'' చెప్పినను లాభం లేకపోయింది. చేసేది లేక ఇంటికి తిరిగి వచ్చాను. మనస్సు బాధగా ఉంది. నేను నా స్వామికి ఏ ద్రోహం చేయలేదు. ఎందుకింత బాధ, ఒకవేళ పూర్వజన్మ ఫలితంగా ఈ బాధలు వస్తున్నాయనుకున్నాను. ఆ తప్పులను క్షమించి నన్ను ఈ బాధ నుండి రక్షించమని స్వామివారిని సాయంత్రం 7.30 గంటలకు వేడుకున్నాను. విపరీతమైన బాధ నన్ను దహించి వేస్తున్నది. ఈ బాధను తీర్చి నాకు మనశ్శాంతిని, సంతోషమును ఇవ్వమని వేడుకున్నాను. ఈ బాధతో చాలాసేపు ఏడ్చాను. స్వామికి శరణాగతి చేశాను. ఈరోజు నన్ను రక్షించుదునని అభయమివ్వమని మొండిగా వేడుకున్నాను. నన్ను ఈ బాధ అనే నరకము నుండి రక్షించండి, నాకు సంతోషాన్ని, మనశ్శాంతిని ప్రసాదించుమని మరీ మరీ వేడుకున్నాను. మీరు నన్ను మోసం చేయకూడదని కూడా ప్రార్థించాను. అయితే ''నేను చేస్తున్న సేవకు ప్రతిఫలంగా మీరు ఈ సహాయం చేయకూడదని'' అన్నాను. ఒక సాధారణ భక్తునిగ, సేవకునిగా అడుగుచున్నాను. నేను మోసపోవుచున్నాను, నాకు మీరు తప్ప దిక్కెవరు లేరు, మిమ్మల్ని శరణు వేడుచున్నాను కాబట్టి రక్షించు ప్రభూ! అంటూ ఆయన పాదములపై పడి భోరుమన్నాను. చివరికి మీరు భగవంతులు, ఏమైనా చేయగలరు. నాకు తెల్లవారుకల్లా సంతోషాన్ని, మనశ్శాంతిని ప్రసాదించుమని వేడుకున్నాను. మళ్ళీ ఇలా ప్రార్థించాను. ప్రభూ! నేను అల్పసంతోషిని. ఈ విషయం నాకంటే మీకు బాగా తెలుసు కాబట్టి ఏదో చిన్న చిన్న చాకిలెట్ వంటి పదార్థాలను ఇచ్చి సంతోషపెట్టకూడదు. నాకు మహా సంతోషం కావాలి. ఎంత సంతోషం అంటే మీరు ''సంతోషించావా?'' అని నన్ను అడగాలి. నేను ''సంతోషించాను'' అని చెప్పాలి. అంత వరకు సంతోషాన్ని ప్రసాదించుమని దీనాతి దీనంగా వేడుకున్నాను. ఆ సమయంలో నా హృదయం ద్రవించింది. సంతోషం కావాలి, సంతోషం కావాలి అంటూ మోకరిల్లాను.

నా దృష్టిలో అత్యంత సంతోషం అంటే ఈ భూ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం అని అర్థం. కాని ఆ సమయాన ఈ భావన నా మనస్సులో ఉన్నప్పటికీ నేను కేవలం అత్యంత సంతోషం అని మాత్రమే అన్నాను. నేను ఈ భూ సమస్య తీరితేనే ''సంతోషించాను'' అని అంటాను. లేకుంటే అనను కదా అని అనుకున్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మహా చతురుడు. ద్వంద్వ అర్థాలను ఉపయోగించి నన్ను సంతోషపరచాడు. ఎంతగా సంతోషపరచాడంటే నీవు సంతోషించావా? అని అడిగిన ప్రశ్నకు నేనే నా నోటితో ''నేను సంతోషించాను'' అని

అన్నాను. ఇది ఒక అద్భుతమైన లీల. బహుశా ఇంతవరకు ఏ భక్తుడూ ఇలాంటి అనుగ్రహానికి పాత్రుడు కాలేదు. శ్రీవేంకటేశ్వర సమోదేవో న భూతోఃన భవిష్యతిః అనే మాట నిజం అనిపించింది. ఒక భక్తుని పట్ల భగవంతుని కృప ఇంతగా ఉంటుందా అనిపించింది. ఆ లీల ఈవిధంగా ఉంది.

అమ్మాయి నాట్యం చూపించి సంతోషపరచుట

ఆఫీసులో అత్యంత దీనంగా ప్రార్థించిన తరువాత అదే బాధతో ఇంటికి వెళ్ళాను. ఈ బాధను ఇంట్లో ఎవరికీ తెలుపలేదు. స్వామివారిని స్మరిస్తూ పడుకున్నాను. రాత్రి 1.30 గంటలకు మేల్కొన్నాను. స్వామివారు నాకు ఎలాంటి సందేశం ఇవ్వలేదని బాధపడ్డాను. తిరిగి పడుకున్నాను. అప్పుడు వచ్చిందీ కల. శ్రీవేంకటేశ్వరుడు ప్రసాదించిన ఎన్నో ఆణిముత్యాలలో ఇది ఒకటి.

21-03-04 కల : నేను కోరినట్లు స్వామివారు నన్ను సంతోషపరచారు. ఒక మనిషి జీవితంలో పొందే అతి గొప్ప సంతోషమును, ఆ సంతోషం పొందే సందర్భమును కలుగజేశారు. ఏ విధంగా అనగా, 2004 సంవత్సరం నాటికి నా వయస్సు 43 సంవత్సరాలు. భార్యా పిల్లలున్నవాణ్ణి. నా ఎత్తు 5' 3 ½". నల్లగా ఉంటాను. కాని ఈ కలలో నేను ఒక 25 సంవత్సరాల వయస్సుతో 5' 7" ఎత్తు కలిగి, మంచి మధ్య ఎరుపు రంగు కలిగి ఉన్న మగాణ్ణి. ఈ రూపములో నా యొక్క రంగు, రూపు, ఎత్తు మార్చబడ్డవి. లేదా ఒక 25 సంవత్సరాల వయస్సుతో 5' 7" ఎత్తు కలిగి, మధ్య ఎరుపు కలిగి, మంచి ముఖవర్చస్సు, ఎత్తుకు తగిన లావు కలిగిన ఒక వ్యక్తి లోనికి నా ఆత్మ ప్రవేశపెట్టబడింది. శ్రీవేంకటేశ్వరుని మాయచే నా ఆత్మ ఆ నూతన వ్యక్తి లోనికి పరకాయ ప్రవేశం చేయబడ్డది. నేను ప్యాంటు షర్టు ధరించాను. తల చక్కగా దువ్వుకున్నాను. చూచిన ప్రతివాడు ఈయన బాగున్నాడు అనే విధంగా ఉన్నాను. ఒక్కక్షణం ఈ మొత్తం ఆకారాన్ని నాది నేను చూచుకున్నాను. ఒక ఎదుటి వ్యక్తి ఏవిధంగా చూడగలడో ఆ విధంగా నన్ను నేను చూచుకున్నాను. ఆ తరువాత పరకాయ ప్రవేశం చేసినట్లు నా ప్రాణము ఈ ఆకారము లోనికి చొప్పించబడింది. మరో రకంగా చెప్పాలంటే శ్రీవేంకటేశ్వరుడు నాకు ఒక అందమైన మరు జన్మను ప్రసాదించాడు. ఈ నూతన జన్మలో నా రంగు, రూపు, ఎత్తు ఈ విధంగా ఉన్నవని చూపించాడు. ఇక్కడ మనస్సు నాదే. నేను ఎలా ఉన్నాను, ఏం చేస్తున్నాను, ఎలాంటి అనుభూతి పొందుచున్నాను అనే వాటిని స్వయంగా నేనే అనుభవిస్తున్నాను. కాని రూపం మాత్రం మారింది.

ఆ సమయమున పెండ్లి చేసుకొనుటకు నేను ఒక అందమైన అమ్మాయిని ప్రేమిస్తున్నానట. కాని నేను ఆ అమ్మాయితో ఇంతవరకు మాట్లాడలేదు. ప్రేమను వ్యక్తపరచలేదు. ఆ అమ్మాయి కూడా నన్ను ప్రేమిస్తున్నట్లే ఉంది. ఆమె కూడా నాతో ఎప్పుడూ మాట్లాడలేదు. వారు మాకు తెలిసినవారట. దూరపు బంధువులట. నేను ఆమెతో లేక వారి కుటుంబంతో చెబితే ఏమనుకుంటారో అనే భయముతో ఒకరికొకరమున్నాము. కాని మా ఇద్దరి మధ్యన మౌన ప్రేమ తారాస్థాయికి చేరింది.

ఒకరోజు ఏదో పని నిమిత్తమై ఆ అమ్మాయి నివసిస్తున్న ప్రాంతం గుండా రోడ్డుపై ఎండలో నడుచుకుంటూ పోతున్నాను. ఏదో తెలియని బాధతో అలసిపోయి నీరసించి ఉన్నాను. ఎండలో నడుస్తున్నాను కాబట్టి మరింత అలసిపోయాను. ఎక్కడైనా కొంతసేపు సేద తీర్చుకొనుటకు అనువైన ప్రదేశము కొరకు వెతుకుతున్నాను. ఆ రోడ్డుపై అటు ఇటు చూస్తూ నడుస్తున్నాను. నేను వెళ్ళుచున్న రోడ్డుకు ఎడమప్రక్క మరొక చిన్న రోడ్డు కనబడింది. ఈ చిన్న రోడ్డు దాదాపు 30' అడుగుల వెడల్పు ఉంది. ఇందులో కేవలం 3 ఇండ్లు మాత్రమే ఉన్నవి. మొదటి ఇల్లు ఎవరిదో తెలియదు. రెండవ ఇల్లు పెద్ద నాట్యశాల. ఈ నాట్యశాల ముందు చిన్న అఱుగు ఉంది. మూడవ ఇల్లు

నేను ప్రేమిస్తున్న అమ్మాయిది. ఈ అమ్మాయి ఇల్లు రోడ్డుకు అభిముఖంగా ఉంది. ఈ అమ్మాయి ఇంటికి ఒక పోర్టికో ఉంది. నేను చూస్తున్నప్పుడు ఆ అమ్మాయి ఇంటి ముఖ ద్వారము మూసి ఉంది. వారి ఇంటి ముఖద్వారము ప్రక్కన ఒక కిటికీ కూడా ఉంది. ఈ కిటికీ తలుపులు మాత్రమే తెరచి ఉన్నవి. ఈ అమ్మాయి ఇల్లు రోడ్డుకు అభిముఖంగా ఉండుట వలన, ఈ రోడ్డులో వచ్చిపోయే ప్రతివారిని ఈ అమ్మాయి ఇంటిలోనివారు, వారి ముఖద్వారము మూసి ఉన్నప్పటికీ ప్రక్కన ఉన్న కిటికీ ద్వారా స్పష్టంగా చూడగలరు. కాని బయట రోడ్డుపై ఉన్నవారు ఇంటిలోని వారిని చూడలేరు.

ఈ అమ్మాయి ఇంటి ప్రక్క ఇల్లు పెద్ద నాట్యశాల. లోన దాదాపు 30' X 30' వైశాల్యముతో విశాలమైన హాలు ఉంది. ఈ నాట్యశాలలో అమ్మాయిలు నాట్యం చేస్తుంటారు. ఈ నాట్యశాలకు ఒక కొలాప్సిబుల్ గేట్ బిగించబడి ఉంది. ఈ గేటు మూసి ఉంది. కాని ఇది కొలాప్సిబుల్ గేటు కనుక లోన జరిగే నాట్యమును బయటివారు స్పష్టంగా చూడగలరు. నాట్యశాల ముందు కొలాప్సిబుల్ గేట్ ప్రక్కన ఒక చిన్న అరుగు ఉంది. ఈ అరుగు చాలా చిన్నది. ఒకరు మాత్రమే కూర్చోగలరు. ఈ అరుగు అమ్మాయి ఇంటిముందు ఉంటుంది. అమ్మాయి ఇంటిముందు ఒక పోర్టికో ఉంది. ఆ సమయాన ఈ పోర్టికో నీడ నాట్యశాల ముందు ఉన్న చిన్న అరుగుపై పడుతుంది.

నేద తీర్చుకుందామని అటు ఇటు చూస్తున్న నాకు నీడలో ఉన్న ఈ చిన్న అరుగు కనబడ్డది. బాధలో ఉన్నాను, అలసి నీరసించి ఉన్నాను కావున వెంటనే అప్రయత్నంగా వెళ్ళి ఆ అరుగుపై వచ్చి కూర్చున్నాను. ఆ సమయాన ఈ అమ్మాయి ఇంటి ముఖద్వారం మూసి ఉంది కాబట్టి ఎవ్వరూ చూడలేదనుకున్నాను.

ఒక తెలియని బాధ నన్ను వెంటాడుతోంది. చాలా విచారంగా ఉన్నాను. ఆ బాధను భరించలేక చేతితో తల పట్టుకొని ఆ అరుగుపై కూర్చున్నాను. నా ప్రక్కన ఉన్న నాట్యశాలలో ఒక 15 మంది అందమైన అమ్మాయిలు, వయస్సు 19 నుండి 22 సం॥ల వారు నాట్యము చేస్తున్నారు. నేను అరుగుపై కూర్చుండి ఈ అమ్మాయిల నాట్యము చూచాను. చేతితో నా తలను పట్టుకుని, విచార వదనంతో ఆ అరుగుపై కూర్చుండి చూచాను. ఈ అమ్మాయిల నాట్యము నా బాధను తీర్చలేదు, సంతోషాన్నివ్వలేదు. అందుకని నా చూపును వారినుండి ప్రక్కకు మరల్చి దీనావస్థలో ఉన్నాను.

ఈ అమ్మాయి దీనినంతటినీ తన ఇంటి కిటికీలోంచి చూసింది. నేను రావడము, తలకు చేయిపెట్టి విచారవదనముతో కూర్చుండడము, ఈ అమ్మాయిల నాట్యము చూడడము, అది రుచించక నా ముఖమును ప్రక్కకు త్రిప్పడము ఇదంతా ఆమె తీక్షణంగా చూచింది. నన్ను మరింత దగ్గరగా చూచుటకు వారి కిటికీ దగ్గరకు వచ్చి మరీ మరీ తొంగి చూసింది. ఈ విధంగా ఆ అమ్మాయి వారి కిటికీ రెక్కలను మరింత తెరిచి చూచినప్పుడు అయిన చప్పుడుకు నేను ఆమెను చూచాను. బాధతో ఉన్నాను కాబట్టి ఆమెను చూచీ చూడనట్లే ఉన్నాను. ఆమె వంక ఉన్న చూపును ప్రక్కకు మరల్చాను. నా చూపును నేలపైకి త్రిప్పి తలకు చేయి పెట్టి దీనావస్థలో కూర్చున్నాను. ఆ విధంగా నా చూపు ప్రక్కకు మరల్చటము ఆ అమ్మాయి గమనించింది. నేను బాధలో ఉన్న విషయాన్ని ఆ అమ్మాయి గ్రహించింది. నన్ను ఊరడించడానికి మరింత నా వద్దకు రావటానికి ప్రయత్నించింది. తొంగి తొంగి చూసింది. నేను ఆమెను చూడాలని ఉబలాటపడింది. కిటికీ రెక్కలు చప్పుడు చేసి నా దృష్టిని ఆకర్షించుటకు ప్రయత్నించింది. కాని ఏదో బాధలో ఉన్న నేను ఆమెను పట్టించుకోలేదు. దీని నంతటినీ గమనించిన ఆ అమ్మాయి మరొక్క అడుగు ముందుకు వేసింది. తన ఇంటిలో నుండి బయటకు వచ్చి నా ముందు నుండి మూసి ఉన్న నాట్యశాల గేటును తెరిచి లోనికి వెళ్ళింది. ఈ అమ్మాయి అందంగా ఉంది. వయస్సు 21-22 సంవత్సరాలు. మంచి రంగు, ఎత్తు 5' 2'' ఒంపు సొంపులతో చక్కగా ఉంది. ఈ అమ్మాయి నాట్యశాలలోకి వెళ్ళుచూ నన్ను లోనికి ఆహ్వానించింది. నేను

అప్రయత్నంగా ఆమె వెనుక లోనికి వెళ్ళాను. ఇంతలో హాలులో నాట్యం చేస్తున్న అమ్మాయిలు వారి నాట్యం చాలించి వెళ్ళిపోయారు. ఆ అమ్మాయిలు మాకు ఏకాంతం ఇవ్వటానికి వెళ్ళినట్లు వెళ్ళిపోయారు. నేను ఆ హాలులో ఒక ప్రక్క నిలబడ్డాను. ఈ అమ్మాయి అదే హాలులో నాముందు ఒక 15 అడుగుల దూరంలో నిలబడ్డది. తాను పంజాబీ డ్రస్ వేసుకుంది. చున్నీ వేసుకుంది. చున్నీని ఎలాంటి భంగిమలోనూ జారిపోకుండా గట్టిగా నడుముకు బిగించుకుంది. తరువాత నాట్యం చేయుట ప్రారంభించింది. భరతనాట్యం చేయసాగింది. ఆ నాట్యం మహా అద్భుతంగా ఉంది. నన్ను సంతోషపరచుటే లక్ష్యంగా చేసుకొని నాట్యం చేస్తోంది. అంతకుముందు అదే హాలులో 15 మంది అదే వయసున్న అమ్మాయిల నాట్యం చూచాను. ఏ ఒక్కరి నాట్యం నన్ను సంతోషపరచలేకపోయింది. ఈ అమ్మాయి నాట్యం మాత్రం మహాద్భుతంగా ఉంది. రకరకాల నాట్య భంగిమలను నాకు చూపుతోంది. ఆ అమ్మాయి వేయు ప్రతి అడుగు నన్ను సంతోష పెట్టుటకే అన్నట్లుంది. ఈ నాట్యం మొత్తం లక్ష్యం నన్ను ప్రసన్నుణ్ణి కావించుటకే. మెల్ల మెల్లగా ఈ నాట్యాన్ని చూచి సంతోషపడసాగాను. నాలోనున్న బాధ చెదిరిపోవుట ప్రారంభించింది. ఈ అమ్మాయి అలాగే నాట్యం చేస్తోంది. ప్రతి క్షణం నన్ను గమనిస్తూ, నా ముఖ కవళికలను తెలుసుకొనుచు, నన్ను సంతోషపెట్టే రీతిలో నాట్యం చేస్తోంది. నా జన్మలో అంతటి మహత్తరమైన నాట్యాన్ని నేను చూడలేదు. అది ఒక అప్సరస నాట్యం లాగా ఉంది. ఎవ్వరైనా ఈ నాట్యం చూచి సంతోషపడవలసిందే. అంతటి గొప్ప నాట్యం అది. ఆ అమ్మాయి అలసట అన్నదే లేకుండా తదేక దీక్షతో, ఒకే లక్ష్యంగా, కేవలం నా సంతోషమే తన ముఖ్యోద్దేశంగా నాట్యం చేస్తోంది. ప్రతి భంగిమలో నన్ను తదేక దృష్టితో చూచుచు నాట్యం చేస్తోంది. ఈ విధంగా నాట్యం చేస్తూ చేస్తూ నాపై వాలిపోయింది. నా ఎడమ ప్రక్కన వాలిపోయింది. ఆమె చేయు నాట్యంలో ఒక భంగిమలాగా నా ప్రక్కన వెల్లకిలా వాలిపోతోంది.

ఒక రబ్బరు బొమ్మలాగా వంగిపోతోంది. నేను ఆమె క్రింద పడుతుందని భావించి నా ఎడమ చేతిని ఆమె వీపు క్రింద పెట్టి పట్టుకున్నాను. ఆమె నాపై ఒరిగిపోయి ఒక రకమైన చూపుతో చూచింది. కళ్ళు పెద్దవి చేసి మనస్సు నాపై లగ్నం చేసి నన్నే చూచింది. నాకు విపరీతమైన సంతోషం కలిగింది. నా కాళ్ళ నుండి తల వరకు అణువణువు పులకరించింది. సంతోషభరితుడనైనాను. ఇంతలో ఒక అద్భుతం జరిగింది. నేనంటే తనకు ఇష్టమని సైగల ద్వారా తెలిపింది. దీనితో మరింత సంతోషించాను. నన్ను పెండ్లి చేసుకుంటావా? అని నేనామెను అప్రయత్నంగా అడిగాను. ఆమె సంతోషంగా తన అంగీకారాన్ని తెలిపింది. ఇది నన్ను మరీ సంతోషపరిచింది. ఆ వెంటనే ఆ అమ్మాయి ''నీవు సంతోషించావా?'' అని అడిగింది. దానికి సమాధానంగా ముందూ వెనక ఆలోచించకుండా ''ఓ సంతోషించాను'' అని బదులిచ్చాను. వెంటనే ఆ అమ్మాయి ''పెళ్ళైన తరువాత కలుద్దాం'' అని చెప్పుచూ వెళ్ళిపోయింది. ఎప్పుడైతే ఆ అమ్మాయి ''నీవు సంతోషించావా?'' అని అడిగిందో నాకు శ్రీవేంకటేశ్వరుడు కలలోనే గుర్తుకు వచ్చాడు. నిన్నటి నా ప్రార్థన గుర్తుకు వచ్చింది. నా నోటి నుండి ''నేను సంతోషపడ్డాను'' అనే వరకు నన్ను సంతోషపరచాలి అనే నా కోరిక కలలోనే నాకు గుర్తొచ్చింది. వెంటనే కల చెదిరింది.

తెల్లవారి ఈ కల గుర్తుకు వచ్చి ఆశ్చర్యపోయాను. నేను నా స్వామిని ఆస్తి తగాదాలను తీర్చి సంతోషాన్ని ఇవ్వమని వేడుకున్నాను. కాని ఈ రకమైన ఆనందమును కోరలేదు. నేను మహా ఆనందమును కోరిన మాట వాస్తవమే. నా దృష్టిలో నేను ఎదుర్కొంటున్న భూ సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వతంగా పరిష్కరించి నాకు మహదానందాన్ని తెచ్చిపెట్టమని వేడుకున్నాను. కాని ఆనాటి నా పరిస్థితుల ప్రభావము వలన లేక సరైన భాష తెలియక లేక ఆ సమయాన నా నోటికి సరైన పదము దొరకక ''ప్రభూ తెల్లవారేవరకు నాకు మహా సంతోషాన్నివ్వండి! నేను ఇక చాలు సంతోషించాను'' అనే వరకు ఇవ్వండని వేడుకున్నాను. ఆనాటి నా భావంలో ''ఇక చాలు సంతోషించాను'' అంటే సమస్య పూర్తిగా పరిష్కరించబడ్డదని అర్థం. కాని ఆ సమయాన నా మనస్సుకు ఈ పదమే దొరికింది కాబట్టి మనస్సులో భావం వేరైనా పైకి మాత్రం ఈ విధంగా అన్నాను. కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నా కోరికకు ద్వంద్వార్థాన్ని కల్పించి తిరకాసు పద్ధతిలో నేను కోరినట్లే తీర్చాడు. తెల్లవారి ఈ కలను నా భార్యకు చెప్పాను.

ఈ జన్మలో నేను భార్యా పిల్లలు కలవాణ్ణి కాబట్టి ధర్మబద్ధంగా ఉండుటకని నాకు మరుజన్మను ప్రసాదించి నా కోరికను తీర్చాడు. ఒక వ్యక్తి తాను పూర్తి జీవితకాలంలో పొందే అత్యంత సంతోషం ఒకేసారి వస్తుంది. తాను మనసారా వరించిన యువతి, తనంటే ఇష్టం అని తెలిపి పెండ్లికి అంగీకరించినప్పుడు, ఆ యువతితో మాట్లాడినప్పుడు, స్పృశించినప్పుడు, మరియు మనసు సంతోషపెట్టుటకు ఆ యువతి చేసే ప్రయత్నాలను చూచినప్పుడు. నాకు ఈ నాలుగు సంఘటనలను ఒకేసారి కల్పించి మహదానందభరితుణ్ణి చేశాడు. ''వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి'' అనే నానుడి నిజం అనే విధంగా చేశాడు. భక్తునిపై భగవంతునికి ఇంత ప్రేమ ఉంటుందా? అందుకు నేను స్వామివారికి ఏమివ్వగలను?

ఆనాడు ఈ కల అర్థమును సరైన విధముగా గ్రహించలేదు. శ్రీవేంకటేశ్వరునికి నాపై ప్రేమ ఉంది కాబట్టి ఈవిధంగా చూపాడనుకున్నాను. కాని దీని నిజమైన అర్థం ఈ విధంగా ఉంది. ''ఆస్తిని కాపాడను, కాని నీవు ఈ జీవితములో సంపూర్ణముగా తృప్తి చెందేవరకు సంతోషాన్ని కలిగిస్తా''నన్నాడు. ఇంతటి భాగ్యానికి స్వామివారికి ఏమివ్వగలను?

తెల్లవారి ఈ మధ్యవర్తి నాకు ఫోన్ చేశాడు. నేను అనుకుంటున్నటులనే మా భూమి లోనికి రామని చెప్పుచు అగ్రిమెంట్ వ్రాయించి ఇస్తానన్నాడు. అప్పుడు నా మనస్సు ఎంతో సంతోషించింది. స్వామివారు నా ప్రతి ఒక్క

మాటను వింటున్నాడని, నన్ను గమనిస్తున్నాడని నాకు సహాయ సహకారాలు అందిస్తున్నాడని మురిసిపోయాను.

ఈ మధ్యవర్తి నా భూమిలో ఎలాంటి ప్లాట్లు అమ్మలేదని, అది మొత్తం నా సొంతం అని చెప్పి అగ్రిమెంట్ ఇచ్చాడు. కాని ఈ భూమికి ఉత్తర దక్షిణాన ఉన్న ప్రభుత్వ భూమిని ప్లాట్లు చేసి తిరిగి ఇవే డాక్యుమెంట్లతో అమ్ముకుంటామని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని ఎవరితోనూ చెప్పవద్దన్నారు. నా భూమిలోకి రామని వారిచ్చిన మాటతో సంతోషపడ్డాను. కాని అసలు వివాదం అప్పుడే మొదలౌతుందని, ఇంతవరకు మాటల వరకు ఉన్న కలహము చేష్టల వరకు వచ్చునని మరింత ముదురునని ఊహించలేదు. శ్రీవేంకటేశ్వరుని లీలలను అర్థం చేసుకోలేదు. ఇక ఆస్తి గొడవల విషయంలో శ్రీవేంకటేశ్వరుడు నా భార్య సురేఖను కూడా అనుగ్రహించాడు. అది ఈ విధంగా ఉంది.

స్వామివారి ఆత్రుత

గత కొన్ని రోజుల నుండి ఆస్తి గొడవలు, రాజీ ఒప్పందాలు, షరతులు మొదలగు వాటిపై ఇంట్లో మనశ్శాంతి కరువైంది. భయం భయంగా ఉంది. మేము శ్రీవేంకటేశ్వరుణ్ణి తప్ప మరెవ్వరినీ దీనిని పరిష్కరించమని సహాయ మర్థించలేదు. రక్షించినా నీవే, నిండా ముంచినా నీవే అనే ధోరణిలో ఉన్నాము. గట్టిగా శ్రీవేంకటేశ్వరుణ్ణే ప్రార్థిస్తున్నాము. స్వామివారు కూడా మా ప్రార్థనను వింటున్నాడు. మా కంటే తనకే ఆత్రుత ఎక్కువున్నట్లు అనుభూతి కల్పిస్తున్నాడు. ''నేను మిమ్మల్ని చూడాలని తపించిపోతున్నాను'' అనే విధంగా అనుభూతి కల్పించి ఆనందపరచాడు. మేము ఆ రోజుల్లో దుర్గాబాయి దేశ్ ముఖ్ కాలనీలో, 4వ అంతస్థులోని ఒక అపార్టుమెంటులో ఉండేవారిమి. సురేఖ ప్రతిరోజు ఉదయం 5.45 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ లోనికి మార్నింగ్ వాక్ కు వెళ్ళేది.

లీల : సురేఖ మార్నింగ్ వాక్ కని ఉదయం 5.45 గంటలకు అపార్టుమెంటు క్రిందికి దిగింది. గేటు తీసి బయటకు పోబోతోంది. ఇంతలో మామూలుగా ఉన్న ఆమెను ఒక మాయ ఆవహించినట్లైంది. ఆమె వెంటనే వేరే ప్రపంచములోనికి (ట్రాన్స్) వెళ్ళిపోయింది. తనకు ఏమో జరుగుతోందని భావించి అక్కడే నిలబడ్డది. ఒక శక్తి క్షణంలో ఆమెను తిరుమల కొండపైకి తీసుకుపోయింది. సురేఖ శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థమై నేరుగా మహాద్వారము గుండా లోనికి వెళ్ళుచున్నదట. శ్రీవారిని దర్శించుకోవాలనే ఆత్రుతతో త్వర త్వరగా భక్తుల వరుసలో వెళ్ళుచున్నది. మేము భయంతో ఉన్నాము కాబట్టి, ఆమెకు శ్రీవేంకటేశ్వరుణ్ణి అత్యంత త్వరగా దర్శనము చేసుకోవాలనే కోరిక బలంగా ఉన్నదట. కాని జనరద్దీ ఉండుట వలన ఆమె అనుకున్నంత త్వరగా వెళ్ళలేక పోతోంది. మెల్లమెల్లగా శ్రీవారి బంగారు వాకిలి దాటి మణిమయ మండపం వరకు అంటే గరుడుడు జయవిజయులు ఉన్నటువంటి స్థలము వరకు వెళ్ళింది. ఆ స్థలమునకు రావడానికి ఉన్న రెండు మెట్లు ఎక్కిందట. అంటే బంగారు వాకిలి నుండి మణిమయ మండపము లోకి ప్రవేశించుటకు ఉన్న రెండు మెట్లు ఎక్కిందట. అంతే, అక్కడొక అద్భుతమును చూచిందట. అది చూచి ఆమె నమ్మలేకపోయిందట. అది చూచి ఆమె మహదానందానికి లోనైంది. ఆమె ఆనందానికి హద్దులు లేవు. అదేమిటంటే నిజానికి తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఆనందనిలయం లోపల ఉంటాడు. జయవిజయులను దాటి రాములవారి మేడ మొదలైన ఇంకా రెండు అరలు దాటిన తరువాత శ్రీవేంకటేశ్వరుడు కొలువై ఉంటాడు. కాని ఈ సమయాన మాత్రము స్వామివారు లోనుండి బయటకు వచ్చాడు. ఆయన నేరుగా జయవిజయుల వద్దనే అంటే జేగంటల ప్రక్కన నిలుచున్నాడట. సురేఖకు మరింత అలసట, ఆలస్యము కానీయకుండా స్వామివారు స్వయంగా లోపలి నుండి వచ్చి 'జే' గంటల వద్ద నిలబడి దర్శనమిచ్చారు. అప్పుడు ఆ భక్తవత్సలుడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి తనివితీరా దర్శించి మహదానందానికి లోనైందట. ఆ తరువాత ఈ కలలాంటి భ్రమ చెదిరిపోయింది. మామూలుగా మారిపోయింది. కాని తనకు ఏమో అయ్యిందని భావించి

ఆరోజు మార్నింగ్ వాక్ మానుకొని ఇంటికి తిరిగి వచ్చింది. ఈ విషయమును తెలుసుకున్న నేను నా ప్రభు శ్రీవేంకటేశ్వరునికి పలు ప్రణామాలనర్పించాను. నా భార్యను తరింపచేసినందులకు సంతోషించాను. ఆ తరువాత నాకు తెలిసినంతవరకు ఈ కల యొక్క అర్థమును ఆమెకు వివరించాను. నీవు భయపడకు. ఇది మనలను తరింపచేయుటకు స్వామివారి కృప. మనము ఆయనకై తపించిపోతున్నాము కాబట్టి ఆ తపనను కొంతైనా తగ్గించుటకు స్వామివారే స్వయంగా మనవద్దకు వచ్చారన్నాను. ఇది మనపై ఆయన కృపకు నిదర్శనమన్నాను. మా సమస్య తప్పక అత్యంత త్వరగా తీరుననే నమ్మకము ఏర్పడ్డది.

నా భార్య తన డైమండ్ టాప్స్ ను స్వామివారికి సమర్పించుదునని గతంలో ఈ భూ సమస్య మొదలైనప్పుడు మ్రొక్కింది. ఈ మధ్యన భూ సమస్య తీవ్రమైంది. పూర్తిగా ఈ భూ సమస్యను తీర్చుతే నిలువు దోపిడి ఇచ్చెదనని మళ్ళీ మ్రొక్కుకుంది. ఈ విషయం తెలుసుకున్న నేను ఆమెతో నాకు తెలిసిన కొన్ని హితబోధలు చేశాను. సమస్య తీరిన తరువాత సమర్పించుట మంచి లక్షణం కాదని, సమర్పించ దలచుకుంది ముందే ఆయనకు సమర్పించి నా కోరిక నెరవేర్చుమని ప్రార్థించుట ఉత్తమ లక్షణమని చెప్పాను. అంటే మా భూ సమస్య తీరినంత వరకు వేచి ఉండక వెంటనే ఆయనకు అనుకున్నవి సమర్పించుదామన్నాను. ఆ తరువాత ఆయనిష్టం ''బాల్ ఆయన కోర్టులో ఉంటుంది'' అనే విధంగా చెప్పాను. అంతే కాకుండా మాకు ఒక మంచి ఇంటి స్థలమును ప్రసాదించుమని, ప్రతిగా ఆయనకు రు.1,116/– సమర్పించుట కూడా బాకీ ఉందన్నాను. మొత్తం ఈ మూడు ముడుపులను స్వామివారికి సమర్పించుటకు మా కుటుంబం మొత్తం తిరుపతికి వెళ్ళుటకు సిద్ధపడ్డాము.

తేది 25-03-2004 నాడు నేను, నా భార్య, ఇద్దరు పిల్లలు కలిసి తిరుమల చేరాము. ఈరోజు స్వామివారిని దర్శించుకున్నాము. కష్టాల్లో ఉన్నాము, పైగా చాలారోజుల నుండి స్వామివారిని చూడని దృష్ట్యా, స్వామివారిని చూడగానే నా కళ్ళ నుండి ఆనంద బాష్పాలు రాలుచుండగ స్వామివారిని దర్శించుకున్నాను. పరవశించిపోయాను. దుఃఖం ఉబికి ఉబికి వచ్చింది. మేము మీవారిమని, రక్షించుమని దీనంగా వేడుకున్నాము. నా భార్య యొక్క డైమండ్ టాప్స్ ను మరియు రు. 1,116/– నేనే స్వామి హుండీలో సమర్పించాను. నా భార్య తన మెడలో ఉన్న మంగళసూత్రం, బంగారు గొలుసును స్వామివారి హుండీలో సమర్పించింది. మమ్ములను కాపాడే బాధ్యతను స్వామివారిపై పెట్టాము. ఆయనను మనసారా ధ్యానించాము. ఆయన గుడిలో ఒక పసుపుతాడుకు తాళిని కట్టి నేను నా భార్య మెడలో కట్టాను. ఈ సమర్పణ అత్యంత దీనావస్థలో జరిగింది. మేము సంపూర్ణంగా స్వామివారి మని, శక్తిహీనులమని, మేము తీవ్ర సమస్యలలో ఇరుక్కున్నాము రక్షించండని అత్యంత దీనంగా వేడుకున్నాము. మొత్తం మూడు సమస్యలను విన్నవించాము. 1. నమో వేంకటేశాయ రథం అత్యంత సుందరంగా, త్వరగా తయారు కావాలి 2. మా భూ సమస్య పరిష్కరించాలి 3. మాకు ఒక ఇంటి స్థలమును ప్రసాదించాలి. ఈ మూడు కోరికలను తీర్చుమని వేడుకున్నాము. తిరిగి తేది 26-03-04 శుక్రవారం ఉదయం నిజపాద దర్శనం చేసుకున్నాము. ప్రత్యేక కళ్యాణం చేసి మరోసారి స్వామివారిని దర్శించుకున్నాము.

చివరికి సాయంత్రం హైదరాబాదుకు వచ్చుటకని తిరుపతి రైల్వే స్టేషన్ కు వచ్చాము. నారాయణాద్రి రైలుకై వేచి చూస్తున్నాము. ఇంతలో నా భార్యకు ఒక సందేహం కలిగింది. ''స్వామివారు మేము వేసిన వస్తువులను స్వీకరించారా?'' అని అనుమానంతో అడిగింది. మనము అత్యంత భక్తితో సమర్పించాము, తప్పక స్వీకరించునని నేనన్నాను. ఇంతలో నారాయణాద్రి ట్రెయిన్ వచ్చింది. మేము ఎక్కి కూర్చోగానే కదిలింది. అనుకోకుండా నా దృష్టి రైల్వే స్టేషన్ లో అమర్చిన టి.వి పైకి వెళ్ళింది. అప్పుడు నేను ఒక దృశ్యమును చూచి ఆశ్చర్యపోయాను. అందులో శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపము గురించి వస్తోంది. పైగా నేను చూచినప్పుడు నేనే ఆ స్తూపములో

జపమును సమర్పిస్తున్నాను. వెంటనే అదుగో మన ప్రోగ్రామ్ టి.వి.లో వస్తున్నదని మా వాళ్ళతో చెప్పాను. అందరం ఆ దృశ్యమును చూచాము. అప్పటికే రైలు కదులుచున్నది. కావున స్టేషన్ లో అమర్చిన వివిధ టి.వి లలో కొంత కొంత చూడడం జరిగింది. నా తరువాత నా భార్య వేయడం, ఆ తరువాత భక్తులు వేయడం, దాని చుట్టూ ప్రదక్షిణలు చేయటను చూచాము. ఆ తరువాత ట్రెయిన్ రేణిగుంట జంక్షన్ కూడా దాటింది. ఇంతలో మళ్ళీ నా భార్య అదే సందేహం వెలిబుచ్చింది. ''స్వామివారు మన వస్తువులను స్వీకరిస్తే బాగుండునంది''. తప్పక స్వీకరిస్తారని నేను, స్వీకరిస్తే బాగుండుననే అనుమానముతో ఆమె, ఇలా రెండు మూడు సార్లు అనుకున్నాము. ఇంతలో అనుకోకుండా నా శరీరం బరువెక్కింది. గాఢనిద్ర ముంచుకొచ్చింది. అప్పుడు టైమ్ సాయంత్రం దాదాపు 7.50 – 8.00 అవుతోంది. స్వామివారు ఈ విధంగా అనుగ్రహించారు.

కానుకలను స్వీకరించుట

26-03-04 కల : ఆ నిద్రలో ఒక కల కన్నాను. అందులో నేను స్వామివారి దర్శన నిమిత్తమై స్వామివారి గర్భగుడిలోనికి అందరి భక్తుల మధ్య నుండి వెళ్ళుచున్నాను. స్వామివారిని శుక్రవారము అభిషేకము తరువాత ఉండే నిజపాద దర్శనము లాగా చూచాను. నాకు ఆయన నిజపాద దర్శనం చాలా ఇష్టం కావున ఆయన నాకు ఆ దివ్యరూపమును చూపెట్టాడు. ఇంతలో కల చెదిరింది. తిరిగి మేల్కొన్నాను. శరీరం బరువు తగ్గింది. దీనర్థం ఏమనగా స్వామివారు మా కానుకలను స్వీకరించాడని, మరియు మా కోరికలను తప్పక తీర్చగలడనే విశ్వాసం మాకేర్పడింది.

నా దశ : నమో వేంకటేశాయ రథ నిర్మాణము గురించి చక్కటి సూచనలిచ్చాడు. జీవితంలో నేను తృప్తి చెందేవరకు సంతోషాన్ని కల్పిస్తానన్నాడు. మా సమస్యల గురించి స్వామికే ఆత్రుత ఉందన్నాడు. సురేఖను అనుగ్రహించాడు. మా ముడుపులు స్వీకరించి, కోర్కెలు నెరవేర్చుతాననే నమ్మకాన్ని కలిగించాడు.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము

12వ భాగము

(ఏప్రిల్ 2004 - ఆగస్టు 2004)

ఇంటి స్థలమును చూపుట

ప్రతి జీవికి తల్లితండ్రులు, భార్యాపిల్లలు, బంధువులు నివసించుటకు ఒక ఇల్లును భగవంతుడే ప్రసాదిస్తాడు. ప్రతి మనిషికి ఇల్లు ఎంతో అవసరం. మనిషి ఎక్కువ సమయం గడిపేది ఇంట్లోనే కాబట్టి, అది ఎంత సౌకర్యవంతంగా ఉంటే అంత సుఖపడగలడు. ప్రతి మనిషికి ఇంటిని ప్రసాదించేది భగవంతుడే అయినప్పటికీ నాకు ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రసాదించారు. దాదాపు ఒక ఏడు నెలల ముందు నేను ఇల్లు కట్టుకోబోయే స్థలమును కలలో చూపాడు. కాని అప్పుడు దానిని అర్థం చేసుకునే శక్తి నాలో లేని కారణంగా, అది ఒక అసంబద్ధమైన లీల అని భావించాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

ఈ లీల నవంబర్ / డిసెంబర్–2003 లో చూపాడు. కాని ఈ లీల నిజమా కాదా అనే అనుమానముతో వ్రాయలేదు. ఇప్పటికీ ఇది నిజమా? అనే సందేహం ఉంది, కానీ ఏది జరిగినా నా స్వామివారి ఆజ్ఞ లేనిదే జరగదు అనే విశ్వాసము నన్ను దృఢపరుస్తోంది. అంతేకాకుండా రోజులు గడుస్తున్న కొద్దీ కలలో చూచింది నిజమౌతుందనే నమ్మకం కలుగుతుంది. అందుకే దీనిని 27–04–04 నాడు వ్రాసుకున్నాను.

ఇల్లు గురించి: నేను 1990 నుండి బిల్డర్ గా వ్యాపారము చేస్తున్నప్పటికీ ఇంతవరకు నాకు హైదరాబాద్ లో సొంత ఇల్లు లేదు. మేము మా బంధువుల ఫ్లాట్ లో అద్దెకుంటున్నాము. వారు అమెరికాలో ఉంటారు. వారు ఇండియాకు వచ్చినప్పుడు ఇబ్బంది కలుగుతుంది. పైగా కొన్ని విషయాల దృష్ట్యా నా భార్యకు మేమొక సొంత ఇల్లు కట్టుకోవాలనే కోరిక బలంగా ఏర్పడింది. ఈ విషయమై ఇంట్లో నాపై ఒత్తిడి తెస్తోంది. ఇప్పటికి నా వయస్సు 44 సంవత్సరాలు. ఐనప్పటికీ ఒక ఇల్లు లేదు. కాబట్టి ఒక చక్కటి ఇండిపెండెంట్ ఇల్లును కట్టుకోవాలనే కోరిక పుట్టింది. ఇంటి స్థలము గురించి తీవ్రంగా వెతికాము. కాని ఈ మధ్యన హైదరాబాద్ లో భూమి ధరలు గణనీయంగా పెరిగాయి. మంచి కాలనీలలో భూమిని కొనే స్తోమత లేదు. విద్యానగర్ లోని శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఉన్న ఆఫీసు మా సొంతంది. కాబట్టి ఈ ఆఫీసు ఇలాగనే ఉండి, దీనికి రోజూ వచ్చిపోయే విధంగా మా ఇల్లు ఉంటే బాగుండునని అనుకున్నాను. పైగా ఇంటి స్థలము చక్కని కాలనీలో మంచి ఇరుగు పొరుగు వారు కలదిగా ఉండవలెనని ఆశ. కాని ఎలా తీరుతుంది. ఏమి చేయాలని ఆలోచించాను. ఇది నా ఆర్థిక పరిస్థితికి తగినదై ఉండాలి. ఆఫీసుకు దగ్గరగా ఉండాలి. మంచి కాలనీలో ఉండాలి. పైగా ''నమో వేంకటేశాయ'' రథమును ఆ ఇంటిలో శాశ్వతంగా పెట్టుకునే విధంగా ఉండాలి. ఈ విధమైన ఇల్లును ప్రసాదించమని స్వామివారిని వేడుకున్నాను. కట్టిన ఇల్లు వద్దు, ప్లాట్ ప్రసాదిస్తే తగినట్లు నేను నిర్మించుకుంటానన్నాను. గత రెండు నెలల నుండి తీవ్రంగా ఇంటి స్థలము గురించి వెతికాము. కొన్ని నచ్చక మరికొన్నింటికి నా ఆర్థిక పరిస్థితి సరిపోక ముందుకు

వెళ్ళలేదు. మొత్తం మీద అలసిపోయాను. ఈ రోజు స్వామివారితో ఒక పట్టుపట్టి ఎలాగైనా సాధించుకోవాలనే కసి ఏర్పడ్డది. సాయంత్రం 6.30 నుండి ప్రార్థించుట ప్రారంభించాను. ఒక 45 నిముషాలు స్వామివారితో మొర పెట్టుకున్నాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను అత్యాశ లేదా అసంబద్ధమైన కోరిక కోరుట లేదు. ప్రతి మనిషికి ఇల్లు అవసరం. ఇప్పటికి నా వయస్సు 44 సంవత్సరాలు. నాకింతవరకు ఒక ఇల్లు లేదు. నేను, నా కుటుంబం ఉండుటకు ఒక చక్కని ఇల్లును భిక్ష పెట్టుమని వేడుకున్నాను. మీరు నా ప్రభువు. నేను మీ సేవకుడను. సేవకుడు తన అవసరాలను యజమానినే అడగాలి. కాబట్టి అడుగుచున్నానన్నాను. మొత్తం మీద ఇల్లు కావాలని మొదట రకరకాలుగా ప్రార్థించాను. తరువాత ఒక చిన్నపిల్లవాడు తనకు చాకిలెట్ కావాలని, ఇచ్చేంతవరకు తన తల్లితో ఏ విధమైన మంకుపట్టు పట్టునో అదే విధమైన మంకుపట్టు పట్టాను. మొత్తం 45 నిముషాలు దీనాతి దీనంగా స్వామిని వదలకుండా ప్రార్థించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు భగవంతులు, ఏమైనా చేయగలరు. కాబట్టి నాకు రేపటివరకు ఇల్లును ప్రసాదించమని నా కళ్ళనుండి ధారలుగా కన్నీరు కారుచుండ ప్రార్థించాను. ఆయన పాదాలను గట్టిగా పట్టుకొని మీరు ప్రసాదించేవరకు కదలను అంటూ కూర్చున్నాను. రేపటివరకు నాకు ఇల్లు కావాలని పట్టు పట్టాను. ఎందుకో కాని ఆరోజు నా పట్టుదల ద్విగుణీకృతమైంది. మీరు ప్రసాదించేవరకు ఇక్కడినుండి కదలను అన్నాను. నా పైన ప్రేమంటే ప్రసాదించమన్నాను. వెంటనే ఒక హృదయాంతరంగ భావం స్వామివారి నుండి వచ్చినట్లు ఏర్పడింది. ''నీకోసం స్వామివారు ఈ సృష్టి ధర్మాన్ని విడనాడాలా?'' అనే భావన పదే పదే వచ్చింది. వెంటనే వెనుకకు తగ్గాను. చివరికి మీరు కూడా సృష్టి ధర్మాలను పాటించాలి కాబట్టి రేపటి వరకు ఇల్లును ప్రసాదించలేరు కాబట్టి కనీసం నేను ఎక్కడ ఇల్లు కట్టుకుందునో ఆ స్థలమునైనా చూపెట్టమని ప్రార్థించాను. ఎందుకంటే ఆ స్థలమును చూచి సంతోషపడవచ్చుననే కోరిక, దానిని తొందరగా కొనవచ్చుననే ఆశతో కోరాను. ఈ రాత్రి తప్పక చూపుమని వేడుకుని అలసి ఇంటికి పోయాను.

కల: అనుకున్నట్లే ఈ రాత్రి ఒక కల వచ్చింది. అందులో పట్టణములు, ఇండ్లు, మనుష్యులు ఎవ్వరూ కనబడలేదు. చివరికి రోడ్లు, ప్లాట్లు కూడా కనబడలేదు. నాకు కనబడింది కేవలం ఒక పెద్ద అడవి ప్రాంతములాగా ఉన్నది. అది ఎలాంటి అభివృద్ధి చెందని, నివాస యోగ్యం గాని చెట్లతో నిండి వున్న ప్రదేశం కనబడ్డది. మనము ఎందుకూ పనికిరాని భూమిలో సరుగుడు చెట్లు పెడితే ఒక పద్ధతి ప్రకారం వాటి మొదళ్ళు ఎలా వరుస క్రమంలో ఉంటాయో అలా కనబడ్డాయి. కొన్నిచోట్ల ఈ చెట్లు 30 నుండి 40 అడుగుల ఎత్తు వరకు పెరిగి ఉన్నవి. ఆ స్థలము మేకలు, గొఱ్ఱెలు మేయడానికి అనుకూలంగా ఉంది. ఆ స్థలములో పిల్లబాట కూడా ఉంది. (మనుష్యులు కాలినడక నడిచేబాట) ఆ పిల్ల బాటను, దాని పొడవున పెరిగిన చెట్లను ప్రత్యేకంగా చూచాను. మనము కారులో గాని లేదా బస్సులో కాని చెట్ల మధ్యన ప్రయాణిస్తున్నప్పుడు ఆ చెట్ల మొదళ్ళు పరిగెత్తుచున్నట్లు ఎలా కనిపిస్తాయో ఆ విధంగా కనబడ్డాయి. చివరికి నా దృష్టి ఒక ప్రత్యేకమైన స్థలముపై పడ్డది. తుమ్మచెట్లు కాదు కాని వాటిలాగా ఉన్న పెద్ద పెద్ద చెట్లు అక్కడ ఉన్నవి. అప్పుడే వర్షం వెలిసినట్లు ఆ చెట్ల కొమ్మల నుండి నీటిచుక్కలు ఒక్కొక్కటి క్రింద పడుచున్నవి. ఒక చెట్టు మండ వంగి ఈ భూమిపై వాలిందా అన్నట్లు ఉంది. గాలికి ఈ కొమ్మ పైకి క్రిందికి మెల్లగా ఊగుట వలన దానినుండి నీటిబొట్లు భూమిపైన ఈ స్థలములో పడుటను చూచాను. ఒకరకంగా ఇదే ప్లాటు అని వేలుతో చూపినట్లు ఉంది. కల చెదిరింది.

తెల్లవారాక ఈ కల గురించి విశ్లేషించుకున్నాను. ఇది నేను నివసించబోయే స్థలమా? హైదరాబాద్ లోనే ఉన్నదా? లేదా వేరే జిల్లాలోనిదా? నేను కట్టుకోబోయే ఇల్లు ఇక్కడేనా? అనుకున్నాను. బహుశా నా ముసలితనంలో ఇలాంటి స్థలంలో కట్టుకోవచ్చనుకున్నాను. లేక ఈ కల యాదృచ్ఛికంగా వచ్చిందా తెలియదు. నిన్న స్వామిని ఇబ్బంది పెట్టినందుకు అదే కోణంలో జవాబిచ్చాడనుకున్నాను. అందుకే సందిగ్ధముతో దీనిని వ్రాయలేదు.

తరువాత కొన్ని రోజులకు బోయిన్ పల్లి, సైనిక్ పురి, అల్వాల్, బంజారా హిల్స్ మొదలగు ప్రాంతములలో ఇంటి స్థలముకై వెతుకుచున్నప్పుడు చెట్లు ఎక్కువ ఉన్నవాటిని ప్రత్యేకముగా చూచుట జరిగింది. ఒకరోజు స్వామివారు ఆవహించే శ్రీమాన్ ఉపేందర్ రావు గారు మా ఇంటికి వచ్చినప్పుడు ఆయనకీ విషయం చెప్పాను. అప్పుడు ఆయన స్వామివారు నాకు ఆ స్థలమును చూపిన విషయం వాస్తవమని చెప్పాడు. ఆ స్థలము నాకు కావాలంటే రు.1116/– స్వామివారికి సమర్పించమన్నాడు. ఆయన మాట ప్రకారం తేది 25-03-2004 నాడు తిరుపతిలో సమర్పించాను.

దాదాపు 20-03-04 ప్రాంతమున హబ్సిగూడలో ఒక ప్లాట్ చూచాను, నచ్చింది. మళ్ళీ ఏప్రిల్ 2004 లో ఇదే ప్లాటును నిశితంగా పరీక్షించి చూచాను. అది నార్త్ 350 – 450 తిరిగి ఉండుట వలన అందులో దాదాపు 250 గజాలు వృధా పోతుందని భావించి వద్దనుకున్నాను. కాని స్వామివారు మాత్రం దీనిని తీసుకొమ్మన్నట్లు ఈ విధమైన లీలను చూపారు.

కల: నేను ఒక ఇంటిలో నిలబడ్డాను. ఈ ఇంటి ప్రక్కన వేరే వారివి రెండు ఓపెన్ ప్లాట్స్ ఉన్నవి. ఇవి ఉత్తర దక్షిణ పొడవుతో ఉన్నవి. ప్రక్క ప్లాటుకు వాయువ్యం నుండి 15 అడుగుల వీధి పోటు కల దారి నుండి ఒక జంట వచ్చారు. వారు మంచి తెల్లధోవతి ధరించారు. కొంచెము పొట్టిగా ఉన్నాడు. చక్కని తిరునామం ధరించాడు. ఆయన చేతిలో ఒక పెట్టె పట్టుకున్నాడు. ఆయన ప్రక్కన ఆయనకు తగిన ఎత్తుతో కొంచెం నలుపు (ఆయన కంటె నలుపు) రంగు కలిగి చీర ధరించిన ఆయన భార్య కూడా ఆయన వెనకనే వచ్చింది. ఆయన ఆ ప్లాట్ బయట నిలబడి ''ఈ ప్లాట్ అమ్ముతారా? అని నన్ను అడిగాడు. నేను ఏమో నాకు తెలియదని బదులిచ్చాను. కల చెదిరింది. తెల్లవారి ఏదో పని

నిమిత్తమని హబ్సీగూడ వైపు వెళ్ళాను. అనుకోకుండా మధ్యవర్తి ప్రమేయంచే మళ్ళీ ఈ ప్లాటును చూచాను. ఆ రోజు ఆ ప్లాటుకు సంబంధించిన వ్యక్తులతో మాట్లాడాను. అప్పుడు ఈ ప్లాటు వాయువ్యం 15 అడుగుల వీధిపోటుతో కలదని గ్రహించాను. బేరం కుదరక వెనుదిరిగాను. తరువాత 26-04-04 నాడు నేనడిగిన ధరకు ఈ ప్లాటు వ్యక్తితో మళ్ళీ బేరమాడాను. ఇది 755 గజములు కలదు. అందులో 250 గజములు వంకర తిరిగి ఉంది. చివరికి దీనిని కొనాలనే ఆలోచన కలిగింది.

ఈ విధంగా నేను ఒక ప్లాటును త్వరగా కొనాలని, ఆ తరువాత మంచి ఇల్లును నిర్మించుకోవాలని చూస్తున్నాను. హౌసింగ్ లోన్ కూడా తీసుకోవాలనే యోచనలో ఉన్నాను. స్వామివారు ఈ క్రింది లీలను ప్రసాదించారు.

28-04-04 కల : నేను ఒక హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలోకి ఉద్యోగ రీత్యా వెళ్ళానట. నాకు అప్పుడే నూతనంగా అపాయింట్మెంట్ జరిగింది. ఆ ఆఫీసులో ఒకాయన చూపిన సీటులో కూర్చున్నాను. నాకు అప్పటికే ఈ రంగంలో మంచి అనుభవమున్నదని వారికి తెలుసు. ఇంతలో ఒకాయన ఒక ఫైల్ ను నాకిచ్చారు. దీనిని అర్జెంట్ గా క్లియర్ చేయాలి, చాలా రోజుల నుండి పెండింగ్ లో ఉన్నదని అన్నారు. ఈ ఫైల్ ను తీసుకున్నంతనే ''దానిని ఒక్క క్షణములో క్లియర్ చేస్తాను చూడు, దీని గురించి నాకు బాగా తెలుసు అన్నాను. ఇది నా ఫైల్, చూడండి అని ఆ ఫైల్ ను తిరగేసి ముందు, వెనక, ప్రక్కన చూపెట్టాను''. దానిపై పి.సాయిరెడ్డి, 9848157932 అని నా పేరు, దానిక్రింద అప్పటి నా సెల్ నెంబర్ వ్రాసి ఉన్నది. నేను ఆ కంపెనీలో చేరకముందే హౌసింగ్ లోనుకు అప్లై చేశానట. అది ఎందుకో పెండింగులో ఉంది. ప్రస్తుతం క్లియర్ కాబోతోంది. ఇది కల. అంటే నేను ఇల్లు కట్టుకునే కాలం దగ్గర పడ్డదని అర్థం.

ఒకప్రక్క నేను చూచిన ప్లాట్ ఇంతవరకు కొనలేదు. బేరసారాలు జరుగుచున్నాయి. ప్లాట్ ఇప్పించవలసిందిగా తీవ్రంగా స్వామివారిని స్మరిస్తూ ప్రార్థిస్తున్నాను.

భూ సమస్య : మరోప్రక్క నా భూ సమస్య మరింత ముదిరింది. దుండగులు నన్ను రకరకాలుగా బాధలు పెడుచున్నారు. నా భూమిని వదిలి ప్రభుత్వభూమిలో ప్లాట్లు చేసి అమ్ముకొందుమని ముందు చెప్పారు. కాని అది ప్రభుత్వ భూమి అని ఎవ్వరూ కొనుటకు ముందుకు రాని కారణంగా మళ్ళీ నా సొంత భూమిలోనికి వచ్చుటకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. వారి బోర్డులు, ఫెన్సింగులు పెట్టుచున్నారు. నేను ఈ భూసమస్యతో ఉన్న కారణంగా 01-05-2004 నుండి 25-06-2004 వరకు ఎన్నో స్వామివారి అనుభూతులను పొందినప్పటికీ వాటిని వ్రాయలేదు. ముఖ్యంగా ఈ మధ్యన వచ్చిన చాలా అనుభూతుల అర్థములను కల కన్నప్పుడు గ్రహించలేకపోయాను. కాని కొంత యోగ్యత సిద్ధించిన తరువాత వాటి అర్థమును గ్రహించాను. అవి ఈ విధంగా ఉన్నవి.

మా ఊరిలో ఊరి ప్రక్కన పొల్కంబావి అనే పేరుగల మాదొక బావి ఉన్నది. ఊరిలోనివారు ప్రతిరోజు ప్రొద్దున ఈ బావి వద్దకు వచ్చి స్నానాదులు చేస్తుంటారు. ఇది చిన్నపిల్లలు కూడా దిగేవిధంగా ఉంటుంది. వర్షాకాలములో ఈ బావి నిండుగా నిండి ప్రక్క పొలములోని నీటి మట్టానికి సమానంగా కనిపిస్తుంది.

06-05-04 కల : ఈ కలలో రోడ్డు ప్రక్కన ఉన్న మా పొల్కం బావి, నీటితో నిండి యున్నది. దీని గడ్డిమీద కరెంట్ రూమ్ ఒకటి ఉంది. ఈ రూం ప్రక్కన ఒక పెద్ద రాయి ఉన్నట్లు కనబడ్డది. మా ఊరి పెద్దలు మరియు నేను అక్కడ ఉన్నాము. అందరి సమక్షంలో శివలింగమును ఈ రాయి పైననే స్థాపించాలని చెప్పుచూ అప్రయత్నంగా నా అరచేతితో ఆ రాయిపై కొట్టుచున్నాను. ఇక్కడ ప్రతిష్ఠ చేస్తే రోడ్డుపై పోవు వారు చూస్తారని నా అభిప్రాయంగా ఉన్నది. కల చెదిరింది. దీని అర్థం గ్రహించలేదు.

డబ్బులు వృధా చేయుట

భూ సమస్య : మియాపూర్ భూమిలో ముందే దుండగులు ప్లాట్లు చేసి అమ్మారు. వాటిని తిరిగి తక్కువ మొత్తంలో కొనుచు ఆ భూమి మాదని మమ్మల్ని బెదిరిస్తున్నారు. అయితే నేనే వాటిని తిరిగి కొందామనే ఆలోచన వచ్చింది. దుండగులకు ఆ యజమానులచే ముందే ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఏదో విధంగా కొనాలని భావించాను.

08-05-04 కల : బాబూరావుకు (తెలిసిన వ్యక్తి) తన ప్లాటును ఒకరికి అగ్రిమెంట్ లాంటిది, మరొకరికి ముందే అమ్మినట్లు సేల్ డీడ్ ఒకే వ్యక్తి ఇద్దరికి అమ్మినట్లు తెలిసినప్పటికీ మా అడ్వకేట్ సలహామీద నేను వారివద్ద కొనుటకు ప్రయత్నించాను. ఇంతే కల. పాత తేదీతో అగ్రిమెంట్ చేసుకొని దానిని వ్యాలిడేషన్ చేయించాను. ఇలాంటి ప్లాట్లు కొని నా డబ్బులను వృధాగా ఖర్చు చేశాను.

భూ సమస్య పెద్దదగునని చూపుట, రథయాత్రకు విధి విధానాలను సూచించుట

గతంలో నా భూమిని వదలి ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేసి అమ్ముకొందుమని దుండగులు చెప్పారు. ఒక 45 రోజులు అమ్మటుకు ప్రయత్నించారు. కాని కొనుటకు ఎవ్వరూ ముందుకు రాలేదు. నిరాశతో ఉన్న దుండగులు మళ్ళీ నా భూమిపైకి వచ్చుటకు ప్రయత్నించారు. దీనిని గమనించిన నేను వారిపై కోర్టులో కేసు వేశాను. యథాస్థితి కొనసాగించమని ఆర్డరిచ్చారు. వారు కూడా నాకు తెలియకుండా నాపై చిన్న కోర్టులో కేసు వేశారు. వారికి కూడా 'యథాస్థితి' కొనసాగించమని అదేరోజు ఆర్డర్ వచ్చింది. ఒకరికి ఆర్డర్ వచ్చిన విషయం మరొకరికి తెలియదు. కానీ శ్రీవేంకటేశ్వరుడు మాత్రం భవిష్యత్తులో మరిన్ని పెద్ద సమస్యలు వచ్చునని, ధైర్యంగా ముందుకు సాగమని చెప్పుచు రెండు కలలను చూపాడు. ఒకటి భూ సమస్య గురించి, మరొకటి రథము గురించి.

11-05-04 కల : ఈ కలలో నేను మా సొంత ఊరు చిన్నగుండవెల్లిలో ఉన్నాను. ఉదయం మా తోటబావి వద్దకు కాలినడకన పోయాను. కొంత సమయము బావి వద్ద గడిపి తిరిగి ఇంటికి వచ్చునప్పుడు దగ్గరగా ఉంటుందని భావించి మా పక్కనున్న గొల్ల రాజయ్య భూమిగుండా అడ్డదారిలో వస్తున్నాను. నిజానికి వీరిది కుష్కి పొలము కాని ఈ కలలో అది తరి పొలములాగా కనబడ్డది. మా భూమినుండి వీరి భూమిలోనికి అడుగిడునప్పుడు వారిది తరిపొలము లాగా, అందులో ఆరు ఇంచుల నీరు ఉన్నట్లు కనబడ్డది. వరి వేయుటకు పొలమును సిద్ధం చేశారనుకున్నాను. ఈమధ్యన నేను హైదరాబాదులో ఉంటున్నాను. వీరు ఈ పొలమును ఈమధ్యన తరిపొలము చేశారనుకున్నాను. ఇందులో నీరు కొద్దిగా ఉన్నాయని భావించి, అందులోనికి దిగి నాలుగైదు అడుగులు వేశాను. ఇంతలో పెద్ద నీరు వచ్చింది. ఎడమనుండి కుడివైపుకు పోవుచున్నది. నా మోకాలు కంటె ఎక్కువ లోతు వరకు నీరు వచ్చింది. డేంజర్ గమనించి తిరిగి ఒడ్డుకు వచ్చాను. మొదటి స్థానము వద్దకు వచ్చాను. నా ముందు నుండి చాలా పెద్ద నీటి ప్రవాహం పోవుచున్నది. కొద్ది సమయంలోనే నీటి ప్రవాహం ఇంకా పెరిగింది. ఒక చెరువు గట్టు తెగిపోతే ఏవిధమైన నీటి ప్రవాహం ఉండునో ఆ విధంగా ఉన్నది. నేను ఉన్నచోటే నిలబడి నవ్వుచూ దీనిలో నుండి ఎలా వెళ్ళాలని అనుకుంటున్నాను. ఇంతలో నా వెనకనుండి వచ్చిన ఒక తెల్లని అంబాసిడర్ కారు ఏమీ కాదు అనుచు ఒడ్డును ఆసరాగా చేసుకొని ఆ వరద గుండా ముందుకు సాగిపోతున్నది. ''నీవు భయపడకు ఏమీకాదు. ఈ కారులాగా ముందుకు సాగిపో'' అనే ఒక భావం నా హృదయాంతరంగంలో ఏర్పడ్డది. కల చెదిరింది. ఇది ఈనాటి మొదటి కల.

ఈనాటి రెండవ కల : ఈ కలలో అమ్మవారి భక్తులు ఆమె రథమును షావ తీయుచున్నారు (ఊరేగింపు). ఒక 50-60 మంది భక్తులు ప్రతివారు పసుపురంగు చొక్కా, ప్యాంటుతో పైన సెల్లా కప్పుకుని ఉన్నారు. వీరు

ఒక సంస్థవారని తెలిసే విధంగా ఉన్నాను. వీరు ఎంతో ఉత్సాహముతో కొత్తగా తయారు చేసిన రథమును షావ తీయుచున్నారు. నేను వారి వద్దకు వెళ్ళాను. నేను కూడా శ్రీవేంకటేశ్వరుని దివ్యరథమును ఇంతకన్నా బాగా చేయుచున్నానని వారితో చెప్పాను. వారి రథం ఎలా ఉందా అని లోనికి చూచాను. అమ్మవారు కనబడలేదు. కాని ఆ రథంలో అమ్మవారిని నిలబెట్టుటకు సిద్ధంగా ఉన్న గొడుగు, పాదాల పీటపై ఒక స్ప్రింగును మాత్రమే చూచాను. కల చెదిరింది.

మొదటి కల అర్థం ఏమిటనగా నీకు భవిష్యత్తులో పెద్ద పెద్ద సమస్యలు వచ్చునని, వీటిని చూచి పిరికివాడిగా భయపడకుమని, ధైర్యంగా ముందుకు వెళ్ళమన్నాడు. ఆ సమస్యలు నిన్నేమీ చేయలేవు. నీవు ధైర్యంగా ముందుకు వెళ్ళినచో శుభం జరుగునని సూచించాడు. ఈ కల ప్రకారం మాకు కొద్ది రోజులలో పెద్ద సమస్య రాబోతోందని నేను మరియు నా భార్య అనుకున్నాము.

ఇక రెండవ కల అర్థం : 'నమో వేంకటేశాయ' రథంతో పాటు ఉండు వ్యక్తులు మంచి పసుపురంగు డ్రెస్ వేసుకోవాలని, వారు 'శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్వామి సేవకుడు' అనే ఒక బ్యాడ్జి ధరించి అత్యంత ఉత్సాహంగా ఉండాలనే అభిప్రాయమును కలిగించారు. ఇలా యాత్ర నిర్వహణకు విధి విధానాలు సూచించారు.

భూ సమస్య : అనుకున్నట్లుగనే తేది 16-05-2004 నాడు ఈ దుండగులు నా భూమిని ఆక్రమించుకున్నారు. ఒక 60-70 మంది నా భూమిలోని దాదాపు 30 అడుగుల ఎత్తు పెరిగిన 550 టేకు చెట్లను నరికి వేశారు. అలా నరికిన చెట్లను వారి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించారు. నరికిన టేకుచెట్ల మొదళ్ళలో తిరిగి మొలకెత్తకుండా

ఆసిడ్ పోశారు. ఆరోజు నేను హైదరాబాదులో లేను. విషయము తెలుసుకొని పోలీసులకు ఫోన్ చేశాను. కాని వారు స్పందించలేదు. చివరికి మా ఆఫీసులోని ఒకరి ద్వారా పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇప్పించాను. చెట్లను నరికిన ప్రాంతము వారిదని చూపుచు, దాదాపు ఒక ఎకరం భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. సర్వం బాధాకరంగా ఉంది. మహా భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఆ సమయాన మా వాచ్ మెన్ ను తన రూంలో బంధించి భయపెట్టారు. ఆరోజు పోలీసులు వచ్చి పంచనామా చేశారు. వారిపై కేసు నమోదు చేశారు.

ఈ అనుకోని ఘటన నన్ను కలచివేసింది. తేది 24-11-03 నాడు నా భూమిని స్వామివద్ద భద్రపరచాను. కాని ఆయన కాపాడలేదు. ఈ ఘటన శ్రీవేంకటేశ్వరునిపై విశ్వాసము సన్నగిల్లేలా చేసింది. ఆయన చూపే లీలల పైన అపనమ్మకము కలుగుట ప్రారంభమైంది. ఈ తగాదా ముదురుటకు మీరే కారణము, మీపై ఉన్న విశ్వాసముతో సంప్రదింపులు జరపలేదు. వారు కోరిన దానిలోఎంత కొంత ఇచ్చినచో వెళ్ళిపోవుటకు ఆ దుండగులు ఎన్నోసార్లు సిద్ధమైనారు. కాని నేనే, నాకు ముందు వెనక మీరున్నారని భావించి ఒప్పుకోలేదు. చిన్న విషయం పెద్దదైంది. దీనికంతటికీ కారణం శ్రీవేంకటేశ్వరుడే అని భావించి బాధపడ్డాను.

కాకతీయనగర్‌లో మా ఇల్లు ఉండునని సూచించుట

ఇలా ఆస్తి గొడవల వలన నా మనస్సు బాగా లేదు. భయం భయంగా ఉంది. ఏమవుతుందో ననే భయము మాటి మాటికీ వెంటాడుతోంది. ఈ స్థితిలో స్వామివారు కొన్ని కలలను చూపెట్టారు. అందులో ఒకటి మా ఇంటి గురించి, నేను కట్టుకోబోయే ఇల్లు ఉండే కాలనీ పేరు కూడా చెప్పారు. అందులో పూజలు, హోమాలు జరుగునని సూచించారు. నమో వేంకటేశాయ రథం గురించి, మంచి ఉన్నత వ్యక్తులు దీనిని ఆదరిస్తారని చూపెట్టాడు. ఈ మొత్తం నాలుగు లీలలను క్లుప్తంగా వివరిస్తాను.

ఇంటి గురించి : అసలు స్వామివారు నాకు ఇంటిస్థలమును ఎక్కడ ప్రసాదిస్తారని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. కాకతీయ నగర్ అనే కాలనీలో మా ఇల్లు ఉండునని ఈ లీల ద్వారా చూపారు.

15-05-04 కల : ఒక మంచి కాలనీలో చక్కని ఇల్లు ఉంది. ఆ ఇంటిలో గృహప్రవేశం లేదా మరో శుభకార్యం జరుగుతోంది. ఆ ఇంట్లో పూజారులు, బ్రాహ్మణులు, పండితులు, భజన చేసేవారు చాలామంది ఉన్నారు. ఆ ఇల్లు మాదేనట. ఆ కాలనీపేరు కాకతీయ నగర్ అని కలలోనే తెలిసింది. జీయరు స్వామిలాంటి ఒక యతీంద్రుడు వచ్చాడు. వారికి ఒక ప్రత్యేక రూమ్ లో బ్రాహ్మణులు వంట చేస్తున్నారు. మేము సంపూర్ణంగా ఈ ఇల్లును రెండు రోజుల పూజ నిమిత్తమని ఈ యతీంద్రులకు ఇచ్చేశామట. ఆ పూజారులు వండుకున్న అన్నమును అడిగి తీసుకుని నేను కొంత తిన్నాను. ఇల్లంతా హడావిడిగా ఉంది. కల చెదిరింది.

ఈ కలలో నేను కాకతీయనగర్ అనే పేరు గల కాలనీలో ఇల్లు కట్టుకోబోతున్నానని, ఆ ఇంట్లోకి యతీంద్రులు, బ్రాహ్మణులు వచ్చెదరని, పుణ్యకార్యాలు జరుగునని సూచించారు.

ఉన్నత వ్యక్తులు పరిచయమగుదురని సూచించుట

26-05-04 కల : రథం గురించి : అది ఒక పెద్ద హాలు. పూజా కార్యక్రమము జరుగుచున్నది. నేను పూజా దుస్తులతో ఒక ప్రక్కన కూర్చున్నాను. నా ప్రక్కన శ్రీమతి సోనియా గాంధీ కూర్చున్నారు. ఆమె నాకు మంచి పరిచయమున్న దానిలా మాట్లాడుచున్నది. ఆమె ప్రక్కన నా భార్య సురేఖ కూర్చుంది. ఇంతలో పూజారులు పిలవగా పూజకై అక్కడినుండి లేచి వెళ్ళాను. కల చెదిరింది.

ఈ క్రింది విధంగా మరో కల కన్నాను.

24-06-04 కల : అది ఒక సభ. అందులో నేను ఉన్నాను. మాజీ ప్రధానమంత్రి కీ.శే. అటల్ బిహారీ వాజపాయ్ గారు నాతో సన్నిహితంగా మాట్లాడుచున్నారు. ఆయన ముఖమును చాలా దగ్గరగా చూశాను. ఆయనతో ఏదో విషయం మాట్లాడుచు నేను తిరుమల శ్రీవారికి సంవత్సరానికి 7 కోట్ల జప సమర్పణ విషయం చెప్పాను. ఈసారి మీరు మీ స్వహస్తాలతో జప సమర్పణ చేయండి. తిరుపతికి రండని అన్నాను. ఆయన మౌనం వహించారు. కొంచెం సమయం తరువాత మళ్ళీ అడిగాను. అప్పుడు ఆయన రాను వీలు కాదు అని చెప్పారు. కల చెదిరింది.

బహుశా రాబోవు జప సమర్పణకు పెద్ద వ్యక్తులు రావాలని ప్రయత్నించుదునని చూపారు. ఆ పెద్ద వ్యక్తులతో మంచి సంబంధాలు ఏర్పడగలవని సూచించారు. నేను ఇంతే అర్థం చేసుకున్నాను. దీని తరువాత మరో కల.

కల : ఒక రిమోట్ ఊరికి కుటుంబంతో పాటు నేను వెళ్ళానట. ఉండుటకు వసతి చూస్తున్నామట. ఒక రోడ్డుపై కూర్చున్నాము. మొత్తం మీద మేము ఒక స్వామివారిని చూచుటకు ఒక క్షేత్రానికి వెళ్ళాము. కల చెదిరింది.

బహుశా నమో వేంకటేశాయ రథయాత్రలో మేము రిమోట్ ప్రాంతాలకు వెళ్ళుదుమని, అక్కడ వసతి కొరకు చూచెదమని, ఫుట్ పాత్ ను ఆశ్రయించి ఉండవలసి వచ్చునని, సూచిస్తూ రథయాత్రకు నియమాలను సూచించారు.

నా ఆస్తి విషయములో ఎన్నో గొడవలతో మనస్సు బాగా లేనప్పటికీ నమో వేంకటేశాయ రథం తయారీలో ఏ చిన్న లోపమునూ జరుగనీయలేదు. నేను ఈ రథం నిర్మాణం ఇంచు ఇంచు పరిశీలించేవాడిని. రోజుకు నాలుగుసార్లు పని వద్దకు వెళ్ళేవాడిని. అత్యంత సూక్ష్మ దృష్టితో గమనించేవాడిని. ఈవిధంగా నేను రథం పనిని గమనించు సమయాన దుండగులు నా భూమిపైకి వచ్చారని, తనను తిడుతున్నారని, వారి బోర్డును పెడుతున్నారని చెప్పుచు మా వాచ్ మెన్ నన్ను వెంటనే రమ్మని ఫోన్ చేసేవాడు. కాని 'నమో వేంకటేశాయ' రథం పనులను వదలలేక నా భూమి పోయినా సరే అని భావించి భూమి వద్దకు పోని సందర్భాలు ఎన్నో ఉన్నాయి. స్వామివారు రెండింటిలో దేనికి విలువనిస్తాడు అని పరీక్షించుచున్నట్లుండేది. మొత్తం మీద రథం అత్యంత సుందరంగా అద్భుతంగా తయారవుతోంది. ఈ రథాన్ని తిరుపతిలో ప్రారంభించి, 2వ జపసమర్పణ, అంటే గోకులాష్టమి తేది 07-09-04 కంటే ముందు 11 రోజులైనా తిప్పాలనే ఉద్దేశ్యంతో అత్యంత వేగంగా నిర్మించాము. కాని పనివారు సకాలంలో సహకరించక తీవ్రమైన బాధ కలిగించారు. ప్రతిక్షణం స్వామివారిని ప్రార్థించాను. ఒకప్రక్క ఈ రథం పనులు సకాలంలో చక్కగా జరగాలని, మరోప్రక్క నా భూ సమస్య తీరాలని పదే పదే వేడుకున్నాను. బహుశా నాలోని నిరాశను తీర్చి ఆనందం నింపుటకు స్వామివారు లీలలను చూపుతున్నారని మొదట్లో చాలాసార్లు భావించాను. కాని తరువాతి కాలంలో వీటి సరైన అర్థమును తెలుసుకున్నాను. ఈ లీలలలో రథయాత్ర నిర్వహించుటకు కొన్ని విధి విధానాలను విధించాడు, మరో అద్భుత నియమాన్ని ఈ విధంగా సూచించారు.

20-07-04 కల : ఈనాటి కలలో నేను ఒక అజ్ఞాత భక్తుడిగా స్వామివారి రథమును వీధులలో త్రిప్పినానట. నన్ను నాలుగు వీధుల మధ్యన చూచినవారు గుర్తుపట్టారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే నేదురుమల్లి జనార్దన్ రెడ్డి గారు గుర్తుపట్టారు. వారింటికి తీసుకెళ్ళి మర్యాద చేశారు. ఆ తర్వాత ఒక గుడికి స్వామివారిని దర్శించేందుకు వెళ్ళాము. ఆ గుడిలో భక్తుల క్యూ పెద్దగా ఉంది. ఒక తిరునామం ధరించిన శ్రీవైష్ణవ స్వామి ఆ భక్తుల తలలపై శఠగోపం పెట్టి ఆశీర్వదిస్తున్నాడు. ఆ గుడిలో అండర్ గ్రౌండ్ రూంలో (పాతాళ వినాయకుడి లాగ) శివలింగం

దానిపై నాగేంద్రుని పడగతో ఉన్నదట. నేను అంతకుముందే దర్శించానట. ప్రస్తుతము భక్తులు ఎక్కువగా ఉన్న కారణంగా మళ్ళీ నేను వెళ్ళలేదు. ఆ ఆలయంలోని శ్రీవారిని ఏవిధంగా ఉన్నది ఊహించుకుని నమస్కరించాను. మా రథాన్ని వదిలి వెళ్ళలేదు. కల చెదిరింది.

బహుశా నేను రోడ్లు, కూడళ్ళు, దేవాలయాలు, తెలిసిన ఆహ్వానితుల ఇంటి వద్దకు రథాన్ని తీసుకుని త్రిప్పగలనని స్వామివారు సూచించారు. మరియు ఒక అజ్ఞాత భక్తుడిగా, అహంకారాన్ని విడిచి రథయాత్ర నిర్వహించమన్నారు. గొప్పవారు ఆహ్వానించి మర్యాద ఇచ్చినప్పటికీ పొంగిపోవద్దన్నారు.

అత్యంత కష్టం మీద అవుతుందో కాదో అనే ఆందోళన మధ్య స్వామివారి కృపావిశేషం చేత 'నమో వేంకటేశాయ' రథం పనులు చివరి దశకు చేరాయి. ఈ నమో వేంకటేశాయ రథ నిర్మాణ సమయంలో ''భవిష్యత్తులో ఒక పెద్ద నిర్మాణం చేయాల్సి ఉంది, ఇది ''ట్రైనింగ్ మాత్రమే'' అనే ఒక హృదయాంతరంగ భావం ఎన్నోసార్లు వచ్చింది.

రథయాత్రకు స్వామివారు సూచించిన విధి విధానాలు (1) రథము వద్దకు వచ్చిన భక్తులకు పత్రం, పుష్పం, ఫలం, తోయం సమర్పించి, ప్రదక్షిణ చేసి స్వామివారి పాదములపై తలపెట్టి ప్రార్థించమంటూ చెప్పాలి. ఆ తరువాత సమర్పణ క్రతువును పొంది వారి వారి కోరికలను మనస్సులోనే తీర్చమని ప్రార్థించి, స్వామివారి మహామంత్రం వ్రాసి, సమర్పణ భావంతో, శరణాగత భావంతో రథానికి అమర్చిన శంకులలో 'మీరు తప్ప మాకు దిక్కెవ్వరూ లేరనే' భావంతో సమర్పించాలి. (2) నేను ఒక అజ్ఞాత వ్యక్తిగా, ఎలాంటి ఆర్భాటాలు, అహంకారం లేకుండా యాత్ర నిర్వహించాలి. పెద్దవారు గౌరవించినప్పటికీ పొంగిపోకూడదు. (3) దూరపు ప్రాంతాలు రథయాత్ర



చేయునప్పుడు, వసతికోసం చింతించక, ఫుట్ పాతే మా వసతిగా భావించి యాత్ర నిర్వహించాలి. క్షణము వ్యర్థము చేయరాదు. (4) రథము వెంటనుండే మా వ్యక్తులు పసుపుపచ్చ రంగు డ్రెస్ కోడ్ తో పాటు శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం స్వామి సేవకుడనే బ్యాడ్జీ తప్పక ధరించాలి. ఈ నియమాలను విధించారు. ఇక నేను కూడా ఈ రథాన్ని ఉపయోగించి స్వామివారి సేవ తృప్తిగా చేయాలనుకున్నాను. వీలైనంత ఎక్కువ మంది స్వామివారిని సేవించేలా ఎక్కువ ప్రాంతాలు త్రిప్పాలనుకున్నాను. సాధ్యమైనంత వరకు ఆహ్వానించిన ప్రతి భక్తుని వద్దకు వెళ్ళాలనుకున్నాను. దీనిద్వారా ఎంతోమంది భక్తులకు వారి కాలనీలలో త్రిప్పే బాధ్యత వారిపై పెట్టుచు స్వామి సేవాభాగ్యం లభింపచేయాలనుకున్నాను.

ఈ విధంగా నమో వేంకటేశాయ రథమును తయారు చేసిన తరువాత ఒక డీసీయం లారీని రెంటుకు తీసుకున్నాము. ఆ లారీ వెనకాల ఛేసిస్ పైన ఈ 7 X7 సైజు గల రథమును ఫిక్స్ చేశాము. దీనిముందు 7 X 5 సైజుతో ఒక భజన మండపమును ఏర్పాటు చేశాము. ఈ రథానికి క్రింది భాగంలో మూడు ప్రక్కల స్వామివారి నాలుగు యుగాలలోని వివిధ రూపాలను చూపెట్టాము. ఎప్పటికీ ఒక బ్రాహ్మణుడు ఈ రథం ముందు కూర్చుని, వచ్చిన భక్తులకు పూజలు నిర్వహించే విధంగా చేశాము. టెంకాయలు కొట్టుట, పూజలు నిర్వహించుట రథం ముందు భాగంలో మాత్రమే జరుగును. ఇక భక్తులు స్వామివారిని నాలుగు ప్రక్కల సేవించుకోవచ్చును. వారు స్వయంగా పూజలు, హారతి నిర్వహించుకోవచ్చు. క్రతువుపై మహామంత్రము వ్రాయుటకు పెన్నులను కూడా స్వామి పాదాల వద్ద ఏర్పాటు చేశాము. రథం వద్దకు వచ్చిన ప్రతి భక్తుడు సమర్పణ క్రతువును పొంది, వారి వారి కోరికలను తీర్చుమని, స్వామివారిని స్మరించి, క్రతువుపై మహామంత్రమును వ్రాసి, ప్రత్యేకముగ అమర్చిన శంకులలో శరణాగత భావంతో సమర్పించాలని, వీటిని తిరుపతిలో జప హోమాదులు నిర్వహించి స్వామివారికి సమర్పించెదమని తెలిపే ఒక బోర్డును సహితం రథానికి ఇరుప్రక్కల ఏర్పాటు చేశాము. రథం చుట్టూ లైట్లు, మైకు, ఒక జనరేటర్ మరియు రథం పైన ఒక చక్కని గొడుగు ఏర్పాటు చేశాము. ఈ విధంగా రథం పూర్తిగా సిద్ధం అయింది.

తిరుపతిలో నమో వేంకటేశాయ రథము ప్రారంభోత్సవం

తేది 11-08-04 నాడు తిరుమలలోని ధ్యాన మందిరము ముందు అప్పటి టిటిడి ఈవో శ్రీమాన్ అజయ్ కళ్యాం గారు ఈ రథాన్ని ప్రారంభిస్తారని నిర్ణయం జరిగింది. దాని ప్రకారం తేది 09-08-04 నాడు హైదరాబాద్ లో బయలుదేరి ఒకరోజు ముందు అంటే 10-08-04 ఉదయం రథంతో పాటు మేమందరం తిరుపతి చేరుకున్నాం. కాని తేది 10-08-04 నాటి మధ్యాహ్నం 2 గంటలకు మా రథమును కొండపైకి తీసుకుపోవుటకు తిరుమల సెక్యూరిటీ ఆఫీసర్ గారు నిరాకరించారని తెలిసింది. దీనికి ఈవో గారు కూడా ఏమీ చేయలేనన్నారు. రథ ప్రారంభోత్సవాన్ని ఎస్.వి.డైరీ ఫామ్ లోనే ఏర్పాటు చేసుకోండని చెప్పారు. కాని నాకు ఈ రథం ప్రారంభించిన తరువాత కొండపై స్వామి గుడి చుట్టూ బస్సు రూటులో ఒక ప్రదక్షిణ చేయాలనే కోరిక బలంగా ఉన్నది. ఇది నెరవేరదని చాలా బాధపడ్డాను. దుఃఖమొచ్చింది. చేయునది లేక స్వామివారిని వేడుకున్నాను. దుఃఖముతో కాళ్ళు చేతులు వణికాయి. సర్వము కోల్పోయినట్లు బాధ కలిగింది. గత కొన్ని రోజుల క్రితం రథం సరైన సమయానికి తయారు కాదేమోనని చాలా బాధపడ్డాను. మనోవేదన అనుభవించాను. అందువల్ల నా షుగర్ పెరిగింది. చివరికి రథాన్ని పూర్తి చేసి తిరుపతికి తెచ్చిన తరువాత స్వామి చెంతకు అనుమతి నిరాకరించారు. నా కష్టం వ్యర్థమైందనే బాధ దహించి వేసింది. చేసేది లేక స్వామివారిని వేడుకుంటూ ఉన్నాను. అంతా ఆయన దయ. నేను చేయాల్సింది చేశాను, పిదప నీ దయ ప్రభూ అని అనుకున్నాను. నాకు తెలిసిన టిటిడి అధికారులను సహాయము చేయమని ఆర్తితో

వేడుకున్నాను. ఎవ్వరూ ఏమీ చేయలేమన్నారు. ఈమధ్యన డైరీఫాం డైరెక్టర్ గా డా॥ కొండారెడ్డి గారు రిటైర్ కాగా వారి స్థానములో డా॥ కె.హరనాథ్ రెడ్డి గారు నియమితులైనారు. వీరు కూడా ఈ విషయంలో ఏమీ చేయలేనన్నారు. చివరికి ఒక ఆశతో సాయంత్రం 4 గంటలకు ఈ.వో గారి ఆఫీసుకు వెళ్ళి వారిని కలిశాను. ఈ.వో శ్రీమాన్ అజయ్ కళ్యాం గారు కూడా సెక్యూరిటీ ఆఫీసర్ ఒప్పుకోనందున తను ఏమీ చేయలేనన్నారు. నేను ఈ.వో ఛాంబర్ లో ఆయన ముందు కూర్చున్నాను. ఆయన నా వైపు చూస్తున్నారు. ఈ.వో వెనకాల గోడకు పెద్ద శ్రీవారి ఫొటో ఒకటి ఉంది. నేను ఆ ఫొటో వైపు చూచుచు, అంతరంగాన ఆయనకు నమస్కరించుచు ఈ.వోతో మాట్లాడాను. నేను దాదాపు 9-10 నెలలు రాత్రింబవళ్ళు ఎంతో కష్టపడి ఈ రథాన్ని తయారు చేశామని, దయతో అనుమతించమని అడిగాను. నా కళ్ళలో నీరు సుడులు తిరిగాయి. ఒక్కసారి భోరుమని గట్టిగా అరుస్తూ ఏడవాలనిపించింది. చివరికి నా కళ్ళనుండి వచ్చు నీరును చూచిన ఈ.వో గారు జాలితో చూద్దాం అన్నారు. కొండపైకి ప్రైవేటు హోటల్స్ వారి లారీలు వెళ్ళుచున్నవి. ఇది వెళితే తప్పేంటని అడిగాను. మేము దీనిని సుమారు 9-10 నెలలు కష్టించి చేశాము. పైగా బస్ రూట్ లో కొండపై స్వామిచుట్టూ తిప్పుదుమని మళ్ళీ అడిగాను. అయితే ఈసారి బస్సు రూట్ లో అయితే సరే అన్నట్లు అన్నారు. మరియు ఈ ప్రారంభోత్సవాన్ని అలిపిరి పాదాల మండపము వద్ద చేసుకొమ్మని చెప్పారు.

నా ప్రార్థన ప్రకారం ఈ.వో గారు స్వయంగా పాదాల మండపము వద్దకు వచ్చి ప్రారంభించెదనన్నారు. దీనిని కన్ఫార్మ్ చేయుటకు నా సెల్ నెంబర్ తీసుకున్నారు. చివరికి నేను ఈ.వో గారికి నమస్కరించి అక్కడినుండి వెళ్ళిపోయాను. నేను నా స్వామివారిని అత్యంత ఆతురతతో ప్రార్థించాను. రథం కొండ పైకి అనుమతించనందున సర్వం కోల్పోయిన వాడిగా అనుభూతి చెందాను. శరీరం మొత్తం నిస్సత్తువ ఆవహించింది. నా కష్టం వృధా పోయిందని బాధపడసాగాను. ఇంతలో దాదాపు సాయంత్రం 6 గంటల ప్రాంతమున ఈ.వో గారు స్వయంగా నాకు ఫోన్ చేశారు. కొండపై స్వామి చుట్టూ రథమును త్రిప్పుటకు అంటే రథంతో ప్రదక్షిణ చేయుటకు ఒక అనుమతి, మరియు అలిపిరి పాదాల మండపము వద్ద ప్రారంభోత్సవము చేసుకొనుటకు మరో అనుమతి ఇచ్చారు. వారు స్వయంగా వచ్చి ప్రారంభిస్తామని

అన్నారు. దీనితో నా మనస్సు కుదుటపడ్డది. శాంతి లభించింది. స్వామివారికి శతకోటి నమస్కారములు చేశాను. ఈ విషయం నా భార్య విని ఎంతో సంతోషించింది. ఆమె ఈ రథమును స్వామివారి పాదాలకి సమర్పించుదునని తేది 09-08-04 నాడు, రథం హైదరాబాద్ నుండి బయలుదేరు సమయాన మనస్సులో అనుకున్నదట. ఇప్పుడు ఈ విషయం విని చాలా సంతోషించింది. ఈ విధంగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ఈ రథాన్ని తన పాదాల వరకు మాత్రమే అనుమతించాడు. (ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుండి రథయాత్ర చేసి పాదాల మండపము చేరుట ఆనవాయితీగా మారింది)

తెల్లవారి తేది 11-08-04 నాడు ఉదయం సుమారు 8 గంటల ప్రాంతమున శ్రీవారి పాదాల మండపము వద్దకు ఈ రథమును తీసుకుపోయాము. టిటిడి వారే ఈ రథమును పూలతో చక్కగా అలంకరించారు. నేను నాలుగు మూర్తుల వద్ద కొబ్బరికాయ కొట్టిన తరువాత శిల్పి శ్రీమాన్ సెల్వకుమార్ గారు నాలుగు స్వామివార్ల మూర్తులకు 9.30 గంటల ప్రాంతమున నేత్రాలను తెరచాడు. చివరికి ఈ.వో గారు 11 గంటలకు వచ్చారు. రావటంతోనే ఈ రథమును చూచి ఎక్సలెంట్ అని ఒకే ఒక మాట అన్నారు. తరువాత బ్రాహ్మణులు పూజలు జరుపుచుండగా, ఈ.వో శ్రీమాన్ అజయ్ కళ్యాం గారు నాలుగు ముఖములను ప్రారంభించారు. నాలుగు వైపుల సమర్పణ క్రతువులను వ్రాసి శంకులలో సమర్పించారు. ఈ.వో గారు ఎంతో సంతోషించారు. స్వామి స్మరణకు, ప్రచారానికి ఎంతో బాగుందన్నారు. పెద్ద పెద్ద పీఠాధిపతులు చేయలేని పనిని చేస్తున్నావన్నారు. అక్కడికి వచ్చిన ప్రతి దేవస్థానపు అధికారులు మెచ్చుకున్నారు. వారు దీనిని స్వామివారి బంగారు రథం అని పేరు పెట్టారు. స్వామివారి భక్తి ప్రపంచంలో నూతన ఘట్టం అన్నారు. ఇక ఈ రథం వద్దకు వచ్చి ప్రార్థించిన ప్రతి భక్తుణ్ణి అనుగ్రహించమని స్వామివారిని వేడుకున్నాను. అక్కడ ఈ.వో గారితో దిగిన ఒక ఫొటోతో పాటు మొత్తం విషయం 12-08-04 నాడు వార్తా దినపత్రికలో రాష్ట్రం మొత్తం ప్రచురితమైంది. దీనిని స్వామివారి ప్రచార రథంగా వర్ణించారు.

ప్రారంభోత్సవం తరువాత రథాన్ని కొండపైకి తీసుకెళ్ళాము. కొండపైకి అప్పటికే మాకోసం ఎదురు చూస్తున్న కొన్ని భజన సంఘాల వారితో కలిసి భజన చేసుకుంటూ స్వామి గుడి చుట్టూ రథంతో ప్రదక్షిణ చేశాము. తర్వాత స్వామిని దర్శించుకుని చివరికి సాయంత్రానికి తిరిగి కొండ క్రిందికి వచ్చాము.

ఇది నా జీవితంలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన రోజుగా నాది నేను వర్ణించుకున్నాను. స్వామి సేవలో ఇది ఒక మైలురాయిగా ఊహించుకున్నాను. నా జీవితంలో స్వామి సేవలో అత్యంత తృప్తిని కలిగించింది ఈ రథమే. ఈ జీవితంలో శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా స్వామిసేవలో అలసిపోవాలన్న నా కోరికను తీర్చింది ఈ సేవనే. తిరుమల స్వామివారిని తీసుకొని ప్రతి సంవత్సరం 25 రోజులు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, చెన్నై మొదలగు వివిధ ప్రాంతాలు తిప్పే భాగ్యాన్ని ప్రసాదించింది ఈ సేవనే. ఎంతోమంది భక్తుల ఇంటి, వీధి వద్దకు తీసుకెళ్ళే భాగ్యాన్ని ప్రసాదించింది ఈ సేవనే. ప్రతి సంవత్సరం, రథయాత్ర ప్రారంభించాలన్న ఆలోచన వచ్చినప్పటి నుండి మొదలుకొని 25 రోజులు పూర్తి రథయాత్ర చేసి స్వామివారిని దర్శించుకొని ఆయన ప్రసాదమును తినేంతవరకు ఏదో ఒక రకమైన స్వామివారి గురించిన తపన చెందుతూనే ఉండేవాణ్ణి. ఎంత తపన చెందితే చివరికి అంత ఆనందం కలిగించేవాడు.

నా దశ : హబ్సిగూడ కాకతీయ నగర్ లో నాకు ఒక ఇల్లుని ప్రసాదించుచున్నారని చెప్పారు. భూ సమస్యలను పట్టించుకోవద్దన్నారు. రథయాత్రకు విధి విధానాలు ఏర్పరచారు. నమో వేంకటేశాయ రథ ప్రారంభోత్సవం ఎంతో ఆనందంగా జరిగింది.

భాగవత ఆశీర్వాదము : తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

ఏప్రిల్ – 2025న రెండవ సంపుటమును ప్రచురించగలము.

ఓం నమో వేంకటేశాయ

Pictures of Submitting 7 Crores of Japa From 2002 to 2022 to Lord Sri Venkateshwara at Tirupati

11 11th Time 28-08-2013

12 12th Time 24-07-2014

13 13th Time 06-09-2015

14 14th Time 05-08-2016

15 15th Time 19-08-2017

16 16th Time 03-09-2018

17 17th Time 03-08-2019

18 18th Time 06-09-2020

19 19th Time 30-08-2021

20 20th Time 19-08-2022

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు
సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు.
వైకుంఠము విడిచి,
తిరుమల కొండపై, కలియుగ
మానవుల ఉద్ధరణకై వెలసి ఉన్నాడు.
ఆయన భక్తప్రియుడు, భక్తవత్సలుడు,
భక్తుల ఉద్ధరణే లక్ష్యంగా చేసుకొని
తన లీలలను ప్రసరించుచుండును.

ఈ అనుభూతులను చదివిన ప్రతి భక్తుడు, వయస్సు, లింగభేదం లేకుండా శ్రీ వేంకటేశ్వరుణ్ణి మూడు సార్లు స్మరించి నన్ను ఆశీర్వదించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. సం॥ ఏప్రిల్ 2000 నుంచి 'హరినామ క్షేత్రము' ఏర్పరచు వరకు మేము పొందిన స్వామివారి లీలలను చదువుచు, ప్రస్తుతపు కలియుగములో కూడా ఆయన భక్తవత్సలతను తెలుసుకుంటూ, స్వామివారి కోరిక ప్రకారం మరో తిరుపతిని ఏర్పాటు చేయుటకు, ప్రతి భక్తుడు ఈ సంకల్పము నెరవేరాలనే ప్రార్థనతో పాటు, ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములు కాగలరని, స్వామి కృపను పొందగలరని ఆశిస్తున్నాము.

నమో వేంకటేశాయ

ప్రచురణ

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠము

ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ - 500007
ఫోన్: 040-27175050

Email: srivenkatesham@gmail.com
Website: www Srivenkatesham.org

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశము

తెలంగాణలో మరో తిరుపతిగా
తన **'హరినామ క్షేత్రము'**ను
ఏర్పాటు చేయుటకై తిరుమల
శ్రీవేంకటేశ్వరుని 700 లీలలు.

(ఏప్రిల్ 2000 - ఆగస్టు 2004)
మొదటి సంపుటము

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
గోవింద దాసు
పుల్లగూర్ల సాయిరెడ్డి
93482 12354